శ్రీరామ శ్శరణం మమ

# శ్రీమద్వేంకటేశ్వర

# రామాయణము

## అరణ్య - కిష్కింధ కాండలు

## ద్వితీయ భాగము




కృతికర్త:

భాషాప్రవీణ, కవిహంస, కవిభూషణ, సి. సి. పి. టి.

**వేదుల వేంకటశాస్త్రి**

ఆస్థాన పండితుడు

శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానము, అనకాపల్లి.



ప్రకాశకులు:

సాధన గ్రంథమండలి, తెనాలి.



కాపీరైటు;



వెల : రు. 80.00

శ్రీరామ శ్శరణం మమ

# శ్రీమద్వేంకటేశ్వర రామాయణము

(శ్రీమద్వాల్మీకమునకు మూలానువాదము-వచనము)

## అరణ్య, కిష్కింధ కాండలు

## ద్వితీయ సంపుటము

కృతికర్త:

భాషాప్రవీణ, కవిహంస, కవిభూషణ, సి.సి.పి.టి.

వేదుల వేంకటశాస్త్రి

ఆస్థాన పండితుడు

శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానము, అనకాపల్లి.

ప్రకాశకులు:

సాధన గ్రంథమండలి, తెనాలి.

కాపీరైటు :

వెల : రు. 80-00

సర్వస్వామ్యములు

కృతికర్తవి :

SRI V... ESWARA
... LIBRARY &
...
53352
Date. ...
TIRUP...

యువసంవత్సర

విజయదశమి

ప్రతులకు :

**1. వేదుల వేంకటశాస్త్రి**
టెలిఫోను ఎక్స్ఛేంజి ఆఫీసు వీధి
అనకాపల్లి - 531 001
విశాఖజిల్లా.

**2. సాధన గ్రంథ మండలి, తెనాలి-522 201.**

ముద్రణ :
వాణీ ఆర్టు ప్రింటర్సు
షరాబ్ బజార్, తెనాలి



తిరుమల తిరుపతి దేవస్థానములవారి ద్రవ్య సహాయముతో ఈ గ్రంథము ముద్రింపబడినది. వారికి నా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదములు.

— గ్రంథకర్త

# శ్రీరామ భుజంగ ప్రయాత స్తోత్రమ్

శివం నిత్య మేకం విభుం తారకాఖ్యం
సుఖాకార మాకారశూన్యం సుమాన్యం।
మహేశం కలేశం సురేశం పరేశం
నరేశం నిరీశం మహీశం ప్రపద్యే॥

క్వణద్రత్న మంజీర పాదారవిందం
లసన్మేఖలాచారు పీతాంబరాఢ్యం।
మహారత్న హారోల్లస త్కౌస్తుభాంగం
నదచ్చంచరీ మంజరీ లోలమాలం॥

నిజే మానసే మందిరే సంనిధేహి
ప్రసీద ప్రసీద ప్రభో! రామచంద్ర!।
స సౌమిత్రిణా కైకయీ నందనేన
స్వశక్త్యాను భక్త్యా చ సంసేవ్యమానః॥

నమస్తే నమస్తే సమస్త ప్రపంచ
ప్రభోగ ప్రయోగ ప్రమాణ ప్రవీణ।
మదీయం మనస్త్వత్పద ద్వంద్వసేవాం
విధాతుం ప్రవృత్తం సుచైతన్య సిద్ధ్యై॥

సదా రామరామేతి నామామృతం
తే సదా రామ మానంద నిష్యంద కందం।
పిబంతం నమంతం సుదంతం హసంతం
హానూమంత మంతర్భజే తం నితాంతం॥

— శ్రీ శంకరాచార్య

శ్రీరామ శ్శరణం మమ.

# ప్రశంస

కళాప్రపూర్ణ
— శ్రీ చర్ల గణపతిశాస్త్రి
విశాఖపట్నము.

శ్రీ వేదుల వేంకటశాస్త్రిగారు పండితులు. కవులు. వీరు చాల గ్రంథములు వ్రాసియున్నారు. తెలుఁగులో రామాయణాలు చాల ఉన్నవి. అవి గద్యపద్యములలో ఉండుటచే, అందఱకును, సుబోధకములు గావు. వీరు సరళమైన తెలుగు వచనములో, చక్కఁగా వ్రాసి, ఆంధ్రులకు చాల ఉపకారము చేసిరి. వీరిశైలి మృదుమధురమైనది. మానవు లెట్లు నడచుకోవలెనో, తన ప్రవర్తనద్వారా శ్రీరాముఁడు తానే నడచి; ఆదర్శమైనాఁడు. తండ్రిమాట జవదాటక, అతని సత్యమును గౌరవించి, ఆతని మాటలను సత్యము చేయుటకై అడవుల పాలయి, అనేక కష్టముల ననుభవించెను.

శ్రీ వేంకటశాస్త్రిగారు అనువదించిన భాగములలో అక్కడక్కడ మూల శ్లోకములఁగూడ చూపిరి. "సర్వే వర్ణా యథా పూజాం, ప్రాప్నువంతి సుసత్కృతాః। నచావజ్ఞా ప్రయోక్తవ్యా కామక్రోధవశా దపి" దశరథుఁడు పుత్రకామేష్టి చేయుచు, మంత్రులతో అన్నమాటలివి. దీనికి తెలుఁగులో "వర్ణాశ్రమ ధర్మములకు భంగము కలుగనీయక, యెల్లవారలను వారివారి యభీష్టానుసారముగా గౌరవించవలసినది. కొండఱియెడలఁ గామక్రోధాదులకు అవ

కాశము సంభవించును. వానిని నిగ్రహించి, విసర్జించి పొరపాట్లు జరుగకుండఁ బ్రవర్తించవలెను" అని చక్కఁగా వివరించిరి. అనవసరముగా ఎక్కువగా ఉండరాదు, తక్కువగానూ ఉండరాదు. ఇది చాల మంచి పద్ధతి. "ధిక్ క్షత్రియ బలం బ్రహ్మతేజో బలం బలమ్" బ్రహ్మతేజస్సే నిజమైన బలము. భౌతిక బలము లన్నియును, బ్రహ్మతేజము నుండి పుట్టిన లేశమాత్రములే.

"పితురాజ్ఞాం పురస్కృత్య పౌరకార్యాణి సర్వశః, చకార, రామో ధర్మాత్మా, ప్రియాణిచ, హితానిచ" శ్రీరాముఁడు తండ్రికిఁ బ్రియముగను, హితముగను ఉండి, ఆతని యాజ్ఞ ననుసరించి పౌరకార్యము లెల్ల జరిపించుచుండెను. ఈవిధముగా వాల్మీకి వ్రాసిన శ్లోకముల ఉటంకించుచు వానియందలి ధర్మసూక్ష్మములను వ్రాసి చూపుట వీరి యనువాదమునందలి ప్రత్యేకత.

శ్రీరాముని సత్యమునకు భంగముగాని విధముగా, కొన్నిచోట్ల వీరు మూలమును సమర్థించిరి. "నాశ్రౌషమితి రాజాన ముపాలబ్ధోఽపి వక్ష్యసి" రాముఁడు రథముపైని, వనములకు వెళ్ళుచున్నాఁడు. తండ్రి దశరథుఁడు, ఆతని వెంట నడువలేక నడచుచు, సుమంత్రునితో రథమును వేగముగా తోలకు మనుచున్నాఁడు. అప్పుడు రాముఁడు సుమంత్రునితో, "వేగముగా తోలుము! తోలుము!" అని చెప్పుచు ఇట్లనెను. ఒకవేళ నీవు తిరిగి అయోధ్యకు వెళ్ళినప్పుడు "నేను ఆపమన్నానుగదా, ఎందులకు ఆపలేదు?" అని మా తండ్రిగారు అడిగితే, "నేను వినలేదు" అని తండ్రితో

చెప్పెను. వీరు "నాశ్రౌషం" అన్నదానికి, "అశ్రుతమ్" అనగా వినబడలేదు అని చెప్పినా, చెవులకు వినబడినను నేను పాటించలేదు అనుకొన్నచో, అనృతము లేదని సమర్థించిరి. అదియుంగాక, "నేను వినలేదు" అన్నదానికి చెవులకు వినబడలేదు అనిగాక లక్షణగా "చెప్పినట్లు చేయలేకపోతిని" అనికూడ చెప్పవచ్చును. పైవిధముగా వీరి సమర్థన సరిగానే ఉన్నది.

శ్రీ శాస్త్రిగారు బాల-అయోధ్యకాండలొక సంపుటముగను, అరణ్య-కిష్కింధాకాండలు రెండవ సంపుటముగను ప్రకటించిరి. ఇంతవరకూ ఏమాత్రమును మూలమునకు తక్కువగాకుండ నిపుణశైలిని అనుసరించిరి. మిగిలినకాండలు నిట్లేయుండునని చెప్పగలను.

శ్రీరాముఁడరణ్యమున మునుల ఆశ్రమములను చూచుటకు రాగా, ఆ మునులు రామునితో ఇట్లనుచున్నారు. "తే వయం భవతారక్ష్యా భవ ద్విషయవాసినః, నగరస్థో వనస్థో వా త్వం నో రాజా జనేశ్వరః" దీనికి "ఓ రామచంద్రా! నీవు మహారాజువు. మా సర్వస్వ భారమును, నీ యధీనము. నీవు సర్వలోక శరణ్యుఁడవు. మేము నీచే రక్షింపఁదగినవారము. ఈ ప్రదేశమంతయు, నీ రాజ్యము లోనిదే. కావున నీవు అయోధ్యలోనున్నను, వనములందున్నను మాకు నీవే రాజువు." ఇట్లు వ్రాయుట మూలానుసారముగను, చక్కని వివరణప్రాయముగఁ నున్నది.

ఇంక కిష్కింధలో, నిది సుగ్రీవుని మాట "త్వం వయస్యోఽసి మే హృద్యో, హ్యేకం దుఃఖం సుఖం చ నౌ, సుగ్రీవో రాఘవం వాక్య మిత్యువాచ ప్రహృష్టవత్"

అనగా సుగ్రీవుఁడు పరమానందభరితుఁడై "రామా! ఇప్పటి నుండియు, నీ సుఖదుఃఖములు నాకును, నా సుఖదుఃఖములు నీకును సమానముగా ననుభవింపఁ దగినవి" అన్నాఁడు.

ఇంకొక ముఖ్యమైన పద్యమును చూతము. "నాహం జానామి కేయూరే, నాహం జానామి కుండలే, నూపురేత్వభి జానామి, నిత్యం పాదాభివందనాత్" హనుమంతుఁడు మొదలగువారు తెచ్చిచూపిన సీత భూషణాలను రాముఁడు లక్ష్మణునకు జూపి, ఇవి సీతవో కాదో? చెప్పుమనెను. అప్పుడు లక్ష్మణుఁడు చెప్పిన మాటలివి.

"అన్నా! ఈమూటయందున్న బాహుపురులుగాని, చెవులకు ధరించు కుండలములుగాని ఎవరివో? నాకుఁ దెలియదు. ఈయందెలు మాత్రము మావదినవే యని చెప్పఁ గలను. కారణ మేమందువా? నేనామె మొగము గన్నెత్తి ఎన్నడును తేరిపార చూడలేదు." అని యీవిధమైన మధుర రచనలో శాస్త్రిగా రనువదించిరి. ఇట్లు మచ్చుకి రెండుమూడు చూపితిని. ప్రసిద్ధ శ్లోకములను అందలి ధర్మములను వ్రాయుట చాల మంచిపద్ధతి.

ఈవిధముగా సరళ సుందరరీతిలో వీరి రామాయణాను వాదమంతయును సాగినది. ఇది చాల ప్రశంసింపఁ దగిన విషయము. ఇట్లు వీరు రామాయణ మన్ని కాండలేగాక, ఇంకను చాలకృతులను రచించు శక్తిని, ఉత్సాహమును, ఆయురారోగ్యములను భగవంతుఁడు శ్రీమన్నారాయణుఁడు వీరికి ప్రసాదించుఁగాక!

25-4-95
విశాఖపట్నము

ఇట్లు
చర్ల గణపతిశాస్త్రి.



కృతికర్త పితృపాదులు :

కీ. శే. శ్రీ వేదుల పార్వతీశముగారు



## శ్రీమద్వేంకటేశ్వర రామాయణ
## ప్రథమ సంపుటము - ఆవిష్కరణ సభ

1. శ్రీ వేదుల వేంకటశాస్త్రి, కృతికర్త.
2. శ్రీ యెలమర్తి వరాహనరసింహముగారు, ఆవిష్కర్త.
3. శ్రీ పుప్పల సన్యాసయ్యశెట్టిగారు, సభాధ్యక్షులు.
4. డా. శ్రీ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, ప్రధానవక్త.



డా. శ్రీ జంపన సూర్యనారాయణరాజుగారు

ఎగ్రికల్చర్, అనకాపల్లి.

భార్య : డా॥ శ్రీమతి విజయలక్ష్మిగారు, M.B.B.S.



శ్రీ కన్యకాపరమేశ్వరీదేవి

అనకాపల్లి

# ఉన్నమాట

"అష్టావధాని"
— శ్రీ ఆశావాది ప్రకాశరావు M.A.,
అనంతపూర్.

శ్రీరామకథ సర్వజగదభిరామ కథ. దీనిని తన అమృత లేఖనిచే ప్రాచేతసుతు, తమ దివ్యగళముచే కుశలవులు విశ్వవ్యాప్తము గావించినారు. శ్రోతలెల్లరు పులకిత గాత్రులై ఆనందాశ్రువులు రాల్చువారే. అపర హనుమదంశులే.

ఇటి పవిత్ర గాథను మాతృభాషలో సరళగద్యానువాదముచేసి తనజన్మకొక చరితార్థతను సంతరింపదలచుకొన్నవారు శ్రీవేదుల వేంకటశాస్త్రిగారు.

ఉభయ భాషాశోభితులైన వీరు, ప్రాచీన కావ్యరుచుల నెరిగినవారై, ఆంధ్రీకరణమనుమాట కెడముగా రచన సాగించినారు. రసజ్ఞుల నావర్జించుకొనుపట్టులు వీరికి పట్టువడినవి.

శ్రీమద్రామాయణ మొక సూక్తిరత్న నిలయము. ఆసుభాషితాలను రూపాంతరితముచేసి విపణివీధిలో సొంత ముద్రతో అమ్మకానికి పెట్టలేని చిత్తప్రవృత్తి శ్రీవేదుల వారిది. కావుననే కథన శిల్పం పాటిస్తూనే సందర్భ శుద్ధితో

వాటినుటంకించి అందలి మేల్మిని వివరించి సాహితీమర్మజ్ఞులకు కానుక చేసినారు. దీన గల్గు మహోపకారము సహృదయు లెరుంగకపోరు. చిత్తశుద్ధిగల ప్రభుత్వముగాని, ప్రజలుగాని ఇట్టి దీక్షా దక్షతగల పండితకవికి తగిన గుర్తింపునేగాక, చేయూతను సైతము కలిగించాలి. వారినుండి మరిన్ని గీర్వాణకృతులను అనువాద రూపములో రాబట్టుకోవలసియున్నది.

వృద్ధాప్యమున నున్న ఈ సుధీవిధేయుని, అక్షర దీపాలచే లోకుల తమస్సు నడచు మాతసరస్వతి సదా కాపాడుగాత!

వినయ ప్రణయ ప్రణామములతో

— ఆశావాది ప్రకాశరావు

29—8—95

)o — o(

# మంచలి మాట

వన్ద్యః స వల్మీకభవో మహర్షిః
విశుద్ధయా యః స్వయమేవ వాణ్యా।
సురస్రవంత్యేవ పతిః పశూనాం
భువోఽవతారాయ కృతావలంబః॥

[గంగ స్వర్గమునుండి నేలకు దిగుచు- నడుమ శివుని శిరమును ఆలంబముగా గైకొన్నట్లు- బ్రహ్మలోకము నుండి పుడమికి అవతరించుచు వాగ్దేవి వాల్మీకి మహర్షిని ఆలంబముగా స్వీకరింతనది. ఆ మహర్షికి నమస్కారము.]

శ్రీరాముని దివ్యగాథ చిరంతనమైనది. అది సార్వకాలికము. అది వేదము. పరమాత్మ వేదవేద్యుడు. ఆయన దశరథరాజ నందనుడై అవతరింపగా ఆవేదము రామాయణమై ఆస్వామిని అనుసరించినది.

"రాముడు పుట్టుటకు ముందే రామాయణం ఉన్నది" అని అధ్యాత్మ రామాయణంలో చెప్పబడి ఉన్నది.

"రామాయణాని బహుశః శ్రుతాని బహుభిః ద్విజైః
సీతాం వినా వనం రామో గతః కిం కుత్ర చిద్వద"

— అధ్యాత్మ- అయోధ్య.

"ఎన్నో రామాయణాలు ఎందరో బ్రాహ్మణులు ప్రవచింపగా ఆలకించి ఉన్నాముకదా! సీతను విడి రాముడు ఒక్కడు అడవికి వెళ్ళినట్లు ఎందైన ఉన్నదా?"

తన వనగమనమును అంగీకరింపని పతితో సీత అన్న మాట ఇది.

ఇదెట్లు సాధ్యము? అన్న ప్రశ్నమునకు ఇచట విశద ముగా సమాధానము చెప్పుట సాధ్యముకాదు. అయినను దిఙ్మాత్రముగా—

"ప్రతి కల్పమున బ్రహ్మ లోకసృష్టిని పూర్వము వలెనే సాగించును. అచటచట కొంచెము కొంచెము భేదము లుండునేకాని ప్రధాన విషయములు మారవు.

"సూర్యా చంద్రమసౌ ధాతా యథాపూర్వ మకల్ప యత్"— అని శ్రుతి.

"ఆవిధాత పూర్వమువలెనే సూర్యచంద్రులను కల్పించెను" అన్న ఈమాట వలన సూర్యచంద్రులు పూర్వసృష్టి యందున్నారని తెలియుచున్నది. అంతేకాదు- ఇది ప్రతినిధి వాక్యమై- సూర్యచంద్రులేకాదు- ఎవరెవరు ఈ కల్పమునం దున్నారో- వారందరు పూర్వకల్పములో కూడ ఉన్నారని తెలియజేయుచున్నది.

దీనినిబట్టి ఇప్పుడున్న వాల్మీకి రామాయణమే పూర్వ కల్పమునందును ఉన్నదని ఈ కల్పమున రాముడవతరింపగా- ఆ వెనుకటి కల్పములోని రామాయణము- లోకములయందు ప్రచారములో నున్నదని- దానినే సీత ఆలకించినదని అర్థము. ఒకవేళ ఈ గ్రంథజాతము భూలోకమునందు కానరాకుండ



కీ. శే. పల్లపోతు సత్యనారాయణ (సతీశ్)
కీ. శే. సుధాకుమారి, కీ. శే. రూపేశ్‌కుమార్

పైవారి జ్ఞాపకార్థము
శ్రీ పల్లిపోతు నూకరాజు దంపతులు



కీ. శే. కోలవర్తి కన్నయ్య, శ్రీమతి తిరుపతమ్మల

జ్ఞాపకార్థము

కుమారుడు : కోలపర్తి వరహాలుగారు

భార్య : శ్రీమతి రమణమ్మగారు

కోటి అనగా 24. అ-క-చ-ట-త-ప-య-శ అని వర్ణములు ఎనిమిది. శ వర్గము 8వది కదా! అందుచే శ అనగా 8 అని అర్థము. త-కో-టి అన్నవి వర్గాద్యక్షరములు కదా! అందుచే 1+1+1=3ను సూచించును. శతకోటి=8×3=24 అన్న అర్థమును ప్రాచీనులు ఈవిధముగా సాధించి—

గాయత్రీ మహామంత్రము నందలి అక్షరములు 24. అవే రామాయణమున 24000 శ్లోకములుగా విస్తరించెనని చెప్పినారు.

వేయి శ్లోకములకు ఒకటిగా గాయత్రీ మంత్రాక్షరములు రామాయణమునందు నిక్షిప్తములై యున్నవి. వానిని ఎత్తి గాయత్రీ రామాయణముగా అచ్చువేసి యున్నారు. దానిని గమనించుట సులభమే. స్థూలముగా— 'బాలకాండము-యజుర్వేదము'; 'అయోధ్యకాండము-ఋగ్వేదము'; 'అరణ్యకాండము-సామవేదము'; 'సుందరకాండము-అథర్వణ వేదము'; 'ఉత్తరకాండమే-ఉపనిషత్తులు'— అని గ్రహింపవలెను.

ఇవేవియు నేనై చెప్పిన మాటలు కావు. రామసేతు బంధాది గ్రంథములున్నవి. పరిశీలించుట లేదు. ఒకసారి వానివంక కన్నెత్తి చూచిన 'ఓయి! బాబోయి! మాకేమి తెలియును? అని పండితులు సైతము గుండెలు బాదుకొనవలసినదే!

"వాల్మీకి సూత్రాలు ఉన్నాయి."

'స సీతాధిప కథారాజ లాలిత నవ సుగమ సభాతా!' ఇదొక సూత్రము. అర్థము లేశమైనను తెలియుచున్నదా? లేదుకదా!

కాని ఇందు రామాయణములోని 7 కాండలు, వాని యందు గల సర్గల సంఖ్య తెలుపబడెను. ఎట్లు? అందు రేమో! అయ్యో! ప్రశ్న చిన్నదే! సమాధానము అంత తేలికకాదు.

"నధో రాధా రూప మితి సప్తకాండ వ్యవస్థితిః"

— భారద్వాజ సంహిత.

నధో రాధారూపం=12 92 90. రామాయణములోని 7 కాండములలోని మొత్తము పదములు 'నధోరాధా రూపం' అని లెక్కగట్టి నిర్వచించినారు.

ఇట్లు ఆ ప్రాచీనులు- రామాయణముపై సాగించిన పరిశ్రమము ఇంత-అంత కాదు. అట్లు వారు పరిశ్రమించుటకు రామాయణము యొక్క మహామహిమయే కారణము.

'ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతక నాశనమ్' అన్నారుకదా! ఆపన్నివారణకు రామాయణము. గ్రహ దోషశాంతికి రామాయణము. కాంక్షితార్థ ప్రాప్తికి రామాయణము! అది కల్పవృక్షము! దాని నాశ్రయించి "కోరిక తీరలేదు. ఆపద తొలగలేదు" అనువాడు ఈ కలియందును (నేడును) లేడు. అందుచేతనే-

యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే।
తావద్ రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి॥

"కొండలు-నదులు ఉన్నంతవరకు లోకములయందు రామకథా ప్రచారము సాగును" అన్నారు.

కొండలు నదులు లేకుండ లోకములుండునా? ఉండవు కదా! లోకములున్నంతవరకు రామకథ ఉండునన్నమాట.

దీనినే కొంచెం ఇటు అటు తిరుగవేసి చూద్దాం! "లోకము లున్నవి-రామకథ ఉన్నది— రామకథ ఉన్నది-లోకములున్నవి". ఇందు కార్యమేది? కారణమేది? ఆధారమేది? ఆధేయమేది?

రామగాథకు లోకమాధారమా? లోకమునకు రామగాథ ఆధారమా?

"అయ్యా! "శ్రీరాముని దివ్యగాథపై ఆధారపడి లోకములున్నవి" అన్నది సత్యము!

ఈ వేదులవారు మంచి కవులు-పండితులు. అన్నిటిని మించి వీరి జీవనమునకెల్ల వెలుగైనది- వీరికి గల రామభక్తి! కుటుంబము సాగుటకై ఏదో ఉద్యోగము సాగించుచు-మనస్సును శ్రీ సీతారాముల పాదపీఠమున బద్ధమొనర్చిన వీరి కౌశలము గృహస్థులు కెల్లరకును ఆదర్శ ప్రాయమైనది. (యోగః- కర్మసు కౌశలమ్) పండితులు-కవులు-విశేషించి శ్రీరామ భక్తులు అయిన వేదులవారు ధన్యులు!

రామాయణమును పూర్తిగా సరసమైన తేట తెనుగు వచనమున అనువదించి, తాము తరించుటయేకాక- సంస్కృత భాషా పరిజ్ఞాన దూరమైన నేటి ఆంధ్రలోకమునకు వీరొనరించిన ఉపకృతి అనన్యసామాన్యమైనది.

ఇది అందలి రెండవ భాగము. వాల్మీకి మహర్షి యొక్క కవితా వైభవము-శ్రీరాముని దివ్యగాథా సౌందర్యము— "అయ్యో! మా అనుభవమునకు అందుటలేదే! మేము సంస్కృతభాషను లెస్సగా అభ్యసింపకపోయినారమే"- అనుచు ఎవ్వరును వాపోవనక్కరలేదు.

ఈ వేదుల రామాయణము- శ్రీమద్ వాల్మీకి రామాయణమునకు అద్దము. అది బింబము! ఇది ప్రతిబింబము!

ఈ వేదులను (అరుగులను, మెట్లను) అనుసరింపుడు! శ్రీరామ కథాసుధా తరంగిణియందు అశ్రమము ఓలలాడి తరింపుడు!

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం-వేదైశ్చ సమ్మితమ్।
యః పఠేద్ రామచరితం-సర్వపాపైః ప్రముచ్యతే॥

సాధన గ్రంథ మండలి
తెనాలి

బులుసు సూర్యప్రకాశశాస్త్రి

ం) — ం(

శ్రీరామ శ్శరణం మమ.

# కృతజ్ఞతలు

శ్లో॥ రామఏవ, పరం బ్రహ్మ, రామఏవ, పరంతపః।
రామఏవ, పరం తత్త్వం, శ్రీరామో బ్రహ్మ తారకమ్॥

"రామో విగ్రహవాన్ ధర్మః" అన్నది క్రూర రాక్షసుఁడైన మారీచుఁడు. "తం మన్యే రాఘవం వీరం నారాయణ మనామయమ్" అని శ్రీరామునకు బద్ధశత్రువై, రాక్షసరాజైన రావణాసురుఁడు చివరకు తెలిసికొని యన్న మాట.

విరాధుఁడు, కబంధుఁడు, శబరి మొదలైనవారు శ్రీరామదర్శన స్పర్శనాదులచే మోక్షమును బొందిరి. ఇంక శరభంగ మహర్షి మొదలగు మునిపుంగవులను లెక్కింప దరముగాదు. నాటికి, నేటికి, ఏనాటికిని శ్రీరాముఁడే సర్వ ధర్మములకును ఆదర్శమైన వాఁడనక తప్పదు. ముక్కోటి దేవతలలో, సర్వజగద్రక్షకుఁడు శ్రీరాముఁడే. "శ్రీరామ రక్ష" అన్నది రామునకే రూఢియైనది. శ్రీరామరాజ్యము కావలెనని ఏనాటికిని ప్రజలు కోరుచునే యుందురు. ఎంత మంచి మహారాజు లెంతెంత త్యాగములు చేసి పాలించినను, ఎవరికిని ఇట్టి సార్థకత్వము లేదు.

మనకు 18 మహా పురాణాలు, 18 ఉపపురాణాలు ఇంకా ఇంకా ఎన్నెన్నో కావ్యనాటకాదులు గలవు. వానిలో శ్రీమచ్ఛాస్త్రము, రామాయణ, భగవద్గీత, భాగవతములను

మూడింటికే కలదు. అందు మొదటిది శ్రీమద్రామయణము.

"వేద వేద్యే పరే పుంసి, జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా"

అనిబట్టి శ్రీమద్రామయణము వేదమే. శ్రీరాముఁడు సాక్షాత్తుగాఁ బరమాత్మయే.

ఆ కాలములో వేదము ఏకొందఱికో అర్థమయ్యేది. అందుచే లౌకికమైన, సరళ, సంస్కృతభాషలో వాల్మీకి మహర్షి అందరకు నర్థమగునట్లు వ్రాసినాఁడు. తరువాత కాలము గడచిన కొలదియు, తెలుఁగు పద్యములే అర్థము చేసికొనలేని పరిస్థితి ఏర్పడినది. అందులకే యేమో శ్రీరాముఁడు నాచే యీ కావ్యమును తేటతెనుఁగు భాషలో వచనముగా అనువదింప చేసినాడనిపించుచున్నది. కానిచో ఏపనిని సాధించలేని గుండెపోటు జబ్బుగల వృద్ధుఁడనైన నేనెక్కడ! 24 వేల శ్లోకములు గలిగి 7 కాండలుగా నున్న వాల్మీకి రామాయణమును దెనుగు వచనములో నేను వ్రాయుటెక్కడ! అది యీనాటికిని నాకే ఆశ్చర్యకర మగుచున్నది. దీనిని వ్రాయుటకు శ్రీరామానుగ్రహముతప్ప నాలో ఏమాత్రమును శక్తి లేదు.

వేలకొలది పుటలుగల (వ్రాతలో) ఈ మహాగ్రంథము పూర్తికాగానే దీనిని ఆర్థికస్తోమతలేని నేను ప్రచురించఁగలనా? యన్న సందేహమున్నను శ్రీరామునిపై భారముంచి, సాధన గ్రంథ మండలి వ్యవస్థాపకులైన (తెనాలి) శ్రీబులుసు సూర్యప్రకాశశాస్త్రిగారిని ప్రార్థించఁగా, వారును నాకంటె వయోవృద్ధులై యున్నను, శ్రీరామ రూపములో అభయ

మిచ్చిరి. ఆవెంటనే మొదటి సంపుటము (బాల-అయోధ్యా కాండలు) శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానములవారికి వ్రాత ప్రతిని బంపుకొనఁగా వారును పరిశీలింపజేసి రు. 10 వేలు విరాళముగా నిచ్చిరి. ఆధైర్యముతో గ్రంధ ముద్రణము నారంభింపజేసి నా మిత్రులు, శిష్యులు, వదాన్యులు, భక్తవరేణ్యులు చాలమంది వారివారి ఫొటోల నిచ్చి తగినంత ధన మొసంగిరి. ఆవిధముగా ప్రథమ సంపుటమును శ్రీరాముడే వెలువరింపజేసినాఁడు.

ప్రస్తుతము ఈ ద్వితీయ సంపుటమును గూడ (అరణ్య-కిష్కింధ కాండలు) శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానములవారికి వ్రాతప్రతిని బంపుకొనఁగా, రు 15 వేలు విరాళముగా నిచ్చుటకు ప్రకటించిరి. శ్రీవారికి నాకృతజ్ఞతాభివందనములు.

మొదటి సంపుటమునకు వలెనే ఈ రెండవ సంపుటమునకు గూడ చాలామంది వదాన్యులు విరాళముల నిచ్చిరి. ఇంతవరకును రెండు సంపుటములను, శ్రీరామానుగ్రహముచే ప్రచురించగలిగితిని. శ్రీరామచంద్రమూర్తి ఈ వదాన్యుల కందరకును 'సకల సౌభాగ్యముల నిచ్చి రక్షించుగాక' యని ప్రార్థించుచున్నాను. ఇట్లే మిగిలిన 3 కాండలును ప్రచురించుటకు భక్తులైన వదాన్యులు సహాయపడగలరని దృఢముగా ఆశించుచున్నాను.

మానవ సంస్కృతీ సంప్రదాయములతో గూడిన ధర్మమునకు మూలగ్రంథమైన శ్రీమద్రామాయణము సంస్కృతమునందు వ్రాయబడినది. ఆంగ్ల పరభాషా వ్యామోహ

ములో బడి, స్వమాతృభాషనే నిర్లక్ష్యము చేయుచున్న యీరోజులలో, శ్రీమద్రామాయణ ప్రచారము ఎంతైనా అవసరమని శ్రీరాముడే నాకుశక్తినిచ్చి యీపని చేయించె నని నాప్రగాఢ విశ్వాసము.

నేనీ గ్రంథమును వ్రాయుటకును, ప్రచురించుటకును నాకు సంపూర్ణ సహకారముల నందించి ప్రోత్సహించిన వారందరకును నాకృతజ్ఞతాపూర్వక అభినందనలు. నా బాల్యమునుండి నేటివరకును నారచనలకును, నా జీవితమున కును దగిన ప్రోత్సాహమిచ్చిన కీ. శే. శ్రీ పుప్పల శ్రీరామ మూర్తి, కీ. శే. శ్రీ డా॥ బెండపూడి వేంకటరాజు, కీ. శే. డా॥ జి. వి. ఎల్. నరసింహము, శ్రీ డా॥ భైరవభట్ల వేంకట విశ్వనాథము గార్లకు సర్వదా నా కృతజ్ఞతలు. ఎప్పటి కప్పుడు నాకు ధనసహాయము చేయుచు, జ్యేష్ఠసోదర భావ ముతో నన్ను గౌరవించు శ్రీమతి గొల్లపూడి లలితాంబను శ్రీ రామచంద్రుఁడు సకలశ్రేయోభివృద్ధిగా రక్షించుచుండు గాక!'' యని ప్రార్థించుచున్నాను.

ఈగ్రంథ ప్రథమ, ద్వితీయ సంపుటములను జదివి, శుభాశీఃపూర్వకమైన అభిప్రాయముల నొసంగిన కళా ప్రపూర్ణ శ్రీ చర్ల గణపతిశాస్త్రిగారికి, అష్టావధాని శ్రీ ఆశావాది ప్రకాశరావు M.A. Phd. గారికిని నా హృదయ పూర్వక కృతజ్ఞతాభి వందనములు.

ఇట్లు

25-9-1995 | బుధజన విధేయుఁడు

అనకాపల్లి | కవిహంస, వేదుల వేంకటశాస్త్రి

ఈ ద్వితీయ సంపుటమునకు ఉదారముగా

ఐదు వేల రూపాయలు విరాళముగా

ఇచ్చిన వదాన్యులు-

శ్రీ భైరవభట్ల చిన నరసింగరావు

చి। సౌ॥ శకుంతల దంపతులు

హైదరాబాదు.

వీరికి నా శుభాశీస్సులు.

— గ్రంథకర్త.

శ్రీరామ శ్శరణం మమ

# శ్రీమద్వేంకటేశ్వర రామాయణ ద్వితీయ సంపుటమునకు విరాళములిచ్చిన వదాన్యులు

## మహారాజ పోషకులు

1) శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయస్వామి

2) శ్రీ శ్రీ శ్రీ మత్తిరుపతి-తిరుమల దేవస్థానమువారు తిరుపతి

3) శ్రీ భైరవభట్ల చిననరసింగరావు,
శకుంతలా దంపతులు హైదరాబాద్

4) శ్రీమతి గొల్లపూడి లలితాంబగారు అనకాపల్లి

5) శ్రీ డా॥ భైరవభట్ల వేంకట విశ్వనాథముగారు ,,

6) శ్రీ డా॥ జె. వి. యస్. యన్. రాజు,
డా॥ విజయలక్ష్మి దంపతులు అనకాపల్లి

7) శ్రీ పల్లపోతు నూకరాజు,
రత్నకుమారి దంపతులు అనకాపల్లి

8) శ్రీ కడ్మిసెట్టి సూర్యప్రకాశరావు,
పాపరత్నం దంపతులు అనకాపల్లి

9) శ్రీ కొయ్యా చినసత్యనారాయణరెడ్డి,
కాంతమ్మ దంపతులు అగనంపూడి

10) శ్రీ యెలవర్తి వరాహనరసింహము,
సన్యాసమ్మ దంపతులు లంకెలపాలెం

11) శ్రీ డా॥ కందర్ప ప్రసాదరావు, కీ. శే. అమ్మాజీ దంపతులు (శతమూలా ట్రస్టు స్థాపకులు) చోడవరం
12) శ్రీ పొట్టుముత్తు సత్యానందముగారు B.A. B.L. వకీలు యెలమంచిలి
13) శ్రీ మళ్ళ సాంబశివరావుగారు అనకాపల్లి
14) శ్రీ లంక వేంకటరమణగారు B.A., B.Ed.
Headmaster Z. P. H. School

## రాజపోషకులు

1) శ్రీ కందర్ప రామరమేష్‌గారు B.A. B.L. వకీలు చోడవరము
2) శ్రీ తూలిక వీరభద్రరావుగారు అనకాపల్లి
3) శ్రీ శ్రీధరాల జోగారావుగారు అనకాపల్లి
4) శ్రీ దంతులూరి వేంకట విజయగోపాలరాజుగారు S/o కీ. శే. అప్పలరాజుగారు (రామచంద్రా థియేటర్ ప్రొప్రైటర్ అనకాపల్లి

## పోషకులు

1) శ్రీ వారణాసి శ్రీహరిరావుగారు అనకాపల్లి
2) శ్రీ డా॥ కందర్ప రామకృష్ణారావుగారు చోడవరం
3) శ్రీ కేదారిసెట్టి సోమరాజుగారు కర్నూలుపాలెం
4) శ్రీ డా॥ ప్రగడ నీలమణి, ప్రసాద్‌గారు M.A., P.H.D అనకాపల్లి



శ్రీ యెలమర్తి వరాహ నరసింహంగారు
భార్య : శ్రీమతి సన్యాసమ్మగారు
లంకెలపాలెం



శ్రీ మురమళ్ళ సూర్యారావు దంపతులు

కీర్తిశేషురాలు ముత్యంగారు



కీ. శే. శ్రీ పొట్టుముత్తు సుబ్బారావు దంపతులు

కీర్తిశేషురాలు వరహాలమ్మగారు



శ్రీ కందర్ప ప్రసాదరావుగారు

శతమూలం ట్రస్ట్ ఫౌండర్ (వేణు)

భార్య కీ॥ శే॥ అమ్మాజమ్మగారు (రామలక్ష్మి)

చోడవరం

5) శ్రీమతి దర్శిపూడి జగదంబగారు ,,

6) శ్రీమతి మాదేటి కామేశ్వరమ్మగారు ,,

7) శ్రీ కొడుకుల విశ్వేశ్వరరావుగారు కసింకోట

8) శ్రీ వాసవీ పార్థసారథి గీతామహిళా సమాజమువారు

అనకాపల్లి

9) శ్రీ అత్తివిల్లి వరాహ లక్ష్మీనృసింహ శర్మగారు ,,

10) శ్రీ సరిసా నాగేశ్వరరావుగారు ,,

11) శ్రీ మురమళ్ళ సూర్యారావుగారు ,,

12) శ్రీమతి ఫీల్కాని కామేశ్వరమ్మగారు B A B.Ed.

Head Mistress. యెలమంచిలి

13) శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ సంఘమువారు

అనకాపల్లి

14) శ్రీమతి బొండాడ పరమేశ్వరిగారు ,,

15) శ్రీ శ్రీధరాల మాణిక్యముగారు ,,

16) శ్రీమతి చింతాదుర్గ సుందరమ్మగారు

17) శ్రీ పెంటకోట అప్పలనాయుడుగారి కుమారుడు
శ్రీ శివసూర్యనారాయణగారు

* * *

శ్రీరామ శ్శరణం మమ

# శ్రీ రా మ మ హి మ

శ్రీరామావతారము పరిపూర్ణావతారము. రాముడే పరబ్రహ్మ. ఆ పరబ్రహ్మయే సగుణ మూర్తిగా, ధర్మ సంస్థాపనార్థము అవతరించెను. ఆ నిర్గుణ పరబ్రహ్మను సేవించి, ధ్యానించుట అందరకును సులభం కాదనియు, సగుణోపాసన సులభమనియు శ్రీమద్భగవద్గీతలో చెప్ప బడింది. ప్రాచీనులైన వారెందరో కబీరు, తులసీదాసు మొదలగువారు భక్తిమార్గముననే ముక్తినొందిరి.

"ఇదంశోడశకం నామ్నాం కలికల్మష నాశనం,
నాతః పరతరోపాయః సర్వ వేదేషు దృశ్యతే"

అని బ్రహ్మవాక్కు. "హరేరామ హరేరామ రామరామ హరేహరే। హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే" అని కలిసంతరణోపనిషత్తు దీనిని మహామంత్రముగా జెప్పెను. "ఆత్మాన మరణిం కృత్వా, ప్రణవం చోత్తరారణిం, ధ్యాన నిర్మథనా భ్యాసాత్, పాపం దహతి పండితః" అని కైవ ల్యోపనిషత్తు. ఇచ్చట ప్రణవమే నామం. మథనమే స్మరణ. దీనివలన జ్ఞానము పుట్టి, కర్మల దహింపజేసి ముక్తిని కలుగ జేయును. సప్తకోటి మహా మంత్రములలో రామమంత్రము మహోత్కృష్టమైనది. "ఓమ్" అన్నను, "రామ్" అన్నను ప్రణవమే అగును.

హిందూదేశము ఆసేతు హిమాచల పర్యంతమును ఎన్ని మతముల వారున్నను, ఎన్ని భాషలు మాట్లాడు

వారున్నను, ప్రతి గ్రామమునందును, రామమందిర ముండి తీరును. పెద్దపెద్ద గ్రామములందును. పట్టణములందును పేట కొకటి వీధికొకటిగా చాల ఆలయాలు వెలసియున్నవి.

జపము, వాచ్యము, ఉపాంశువు, మానసికము అని మూడు విధములు. "ఉచ్చైర్జపా దుపాంశుశ్చ, సహస్ర గుణఉచ్యతె, మానసస్తు తతశ్చాపి సహస్ర గుణ ఉచ్యతే" అని జపఫలము (నామస్మరణ) చెప్పబడినది. ఏమంత్రమైనను రామునకే చెందును. (పరమాత్మకే) ఏజపానికైనా, దేశ కాలాది నియమా లున్నాయి. శ్రీరామ మంత్రానికి ఏ నియమం లేదు. కావున "రామనామ్నః పరో మంత్రో నభూతో నభవిష్యతి" అని ఋషివాక్యం. "బ్రహ్మ హత్యాది పాపాని, వీరహత్య శయనిచ। స్వర్ణ స్తేయ సురా పాన, గురుతల్పా యుతానిచ, కోటికోటి సహస్రాణి ఉప పాతకజాన్యపి। సర్వాణ్యపి ప్రణశ్యంతి రామ మంత్రాను కీర్తనాత్" అని రామతాపిన్యుపనిషత్. అసలు రామ నామము పోగొట్ట గలిగినన్ని పాపములు చేయగలవాడే లేడు. "వేదవేద్యే పరేపుంసి, జాతే దశరథాత్మజే, వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా" "రామ రామేతి యేనిత్యం జపన్తి మనుజా భువి, తేషాం మృత్యు భయాదీని, నభవంతి కదాచన" అనియు మహర్షులు చెప్పిరి. శ్రీమద్రామాయణాంతమున "ఇదం పవిత్రం పాపఘ్నం, పుణ్యం వేదైశ్చ సమ్మితం, యఃపఠే ద్రామచరితం సర్వ పాపైః ప్రముచ్యతే" శ్రీమద్రామాయణ పారాయణ వలన వేదపారాయణ ఫలము లభించును. "యత్రైవ వటబీజస్థః

ప్రాకృతశ్చ మహాద్రుమః, తథైవ రామబీజస్థం జగ దేత చ్చరాచరమ్" అని రామరహస్యోపనిషత్తు.

"కర్మాధీనంజ గత్సర్వం విష్ణునా నిర్మితం పురా, తత్కర్మ కేశవాధీనం, రామనామ్నా వినశ్యతి, గో కోటి దానం గ్రహణేషు కాశీ, ప్రయాగ, గంగాతట కల్పవాసః, యజ్ఞాయుతం, మేరు సువర్ణదానం, శ్రీరామ నామ స్మరణే శతాంశః" అనియు, "జ్ఞానానాం పరమం జ్ఞానం, ధ్యానానాం పరమోలయః। యోగానాం పరమో యోగో రామ నామాను కీర్తనమ్" ఋషివాక్యము.

"జపతః సర్వవేదానాం మంత్రాణాం చైవపార్వతి। తస్మాత్కోటిగుణం పుణ్యం రామనామ్నైవ లభ్యతే" అని రామతాపిన్యుపనిషత్. మరియు అందే "శ్రీరామచంద్ర స్మరణేన నిత్యం గాయత్ర్యాః శతసహస్రశః। జప్తాని ఫలాని భవంతి". ఒక్క రామ మంత్రము లక్ష గాయత్రికి సమాన మని చెప్పబడినది.

రామనామము ఎంతటి మహాపాపములనైనను నశింప జేయును అట్లని తెలిసి చేసిన పాపములను మాత్రము నశింప జేయదు. ఆ పాపములను అనుభవించవలసినదే.

ఇట్లు

భక్త విధేయులు

మెలమంచిలి | కీ. శే. శ్రీ పొట్టుముత్తు సుబ్బారావు

1-11-1975 | B.Sc., L.L.B ఎడ్వొకేట్

కీ. శే. భార్య వరహాలమ్మ దంపతులు



శ్రీ కడిమిశెట్టి సూర్యప్రకాశరావుగారు

భార్య : శ్రీమతి పాపరత్నమ్మగారు

అనకాపల్లి



కీ॥ శే॥ కైజర్‌హింద్

డా. శ్రీ గండికోట వరాహ నరసింహముగారు

భార్య : కీ॥ శే॥ నారాయణమ్మగారు

అనకాపల్లి

శ్రీరామ శ్శరణం మమ

# విషయసూచిక

## అరణ్యకాండ


| విషయము | పేజి |
|---|---|
| 1) ప్రశంస | |
| 2) ఉన్నమాట | |
| 3) మండలి మాట | |
| 4) కృతజ్ఞత | |
| 5) వదాన్యులు | |
| 6) రామనామ మహిమ | |
| 1. శ్రీరాముఁడు దండకారణ్య ప్రవేశము | 1 |
| 2. శ్రీరామ-లక్ష్మణులు విరాధుని జంపుట | 4 |
| 3. శ్రీరామునకు లక్ష్మణుఁడు ధైర్యము చెప్పుట | 7 |
| 4. విరాధ వధ | 8 |
| 5. విరాధుని శాపవృత్తాంతము | 11 |
| 6. శ్రీరాముని శరభంగాశ్రమ ప్రవేశము | 13 |
| 7. శరభంగునకు మోక్షప్రాప్తి | 16 |
| 8. మహర్షులకు శ్రీరాముఁడు శరణు నిచ్చుట | 19 |
| 9. శ్రీరాముని సుతీక్ష్ణాశ్రమ ప్రవేశము | 21 |
| 10. శ్రీరాముఁడు మునుల ఆతిథ్యమును స్వీకరించుట | 25 |
| 11. సీతాదేవికి గలిగిన ధర్మసందేహము | 27 |
| 12. ఇంద్రుఁ డొకానొక మునికి తపోభంగము గావించుట | 29 |

13. శ్రీ సీతారామ లక్ష్మణులు
దండకారణ్యాశ్రమముల జేరుట 36
14. పంచాప్సరము-మాండకర్ణి మహర్షి 38
15. శ్రీరాముని మున్యాశ్రమ వాసము 40
16. శ్రీరాముని అగస్త్యాశ్రమ ప్రవేశము 41
17. అగస్త్యుడు వాతాపిని-ఇల్వలుని జంపుట 43
18. శ్రీరాముఁ డగస్త్యాశ్రమ ప్రవేశము 45
19. శ్రీరాముఁడు అగస్త్యాజ్ఞపై పంచవటిం జేరుట 52
20. జటాయువు సీతారామ లక్ష్మణుల దర్శించుట 55
21. సీతారామలక్ష్మణుల పంచవటీ నివాసము 59
22. గోదావరీతీర ప్రకృతి సౌందర్యము 62
23. శ్రీరాముని పర్ణశాలావాసము- శూర్పణఖ రాక 66
24. శూర్పణఖకు ముక్కును- చెవులను గోయుట 68
25. ఖరుడు చెల్లెల నోదార్చి యుద్ధసన్నద్ధు డగుట 72
26. ఖరుని యుద్ధయాత్ర 75
27. శ్రీరాముడు పదునలుగురు రాక్షసులను
సంహారించుట 76
28. ఖరదూషణులు- పదునాలుగు వేల సైన్యముతో
యుద్ధయాత్ర 79
29. ఖరదూషణాదులకు గన్పట్టిన దుశ్శకునములు 81
30. శ్రీరాముఁడు సీతాలక్ష్మణులను దూరముగా బంపి
తా నొక్కడే నిలుచుట 83

31. శ్రీరాము డొక్కడే ఎల్ల రాక్షస సైన్యమును జంపుట 87
32. దూషణ సంహారము 90
33. ఖరుని జనస్థాన రాక్షసుల నెల్లరను సంహారించుట 92
34. త్రిశిరుని సంహారించుట 93
35. శ్రీరామ ఖరాసురుల యుద్ధము 95
36. శ్రీరాముడు ఖరుని దూషించుట 98
37. ఖరుని దుర్భాషలు 100
38. ఖరుని సంహారించుట 102
39. దండకారణ్య ప్రశాంతి 103
40. అకంపనుడు లంకకుబోయి రావణునితో రామునిగూర్చి చెప్పుట 105
41. శ్రీరాముని గూర్చి అకంపనుని వివరణ 107
42. రావణునకు మారీచుడు హితము చెప్పుట 110
43. శూర్పణఖ రావణుని ప్రోత్సహించుట 112
44. శూర్పణఖ చెప్పిన రాజనీతి. రావణుని యుద్ధమునకు బురిగొల్పుట 114
45. రావణుని రెండవమారు- సీతాపహరణ ప్రయత్నము 120
46. న్యగ్రోధ వృక్ష విశేషము 125
47. రావణుడు రెండవమారు మారీచుని సాయము కోరుట 126

| | |
|---|---|
| 48. రావణుడు మారీచుని బలాత్కారముగా నొప్పించుట | 127 |
| 49. మారీచుని అనుభవము | 137 |
| 50. రావణుడు మారీచుని శాసించుట | 140 |
| 51. మారీచుడు చెప్పిన అంతిమ హితము | 142 |
| 52. మారీచుడు తప్పనిసరిగా- రావణు ననుసరించుట | 145 |
| 53. సీత మాయలేడిం గోరుట- రామలక్ష్మణ సంవాదము | 148 |
| 54. శ్రీరాముడు మాయలేడి వెంటబోయి- మారీచుని సంహరించుట | 153 |
| 56. సీతాదేవి భయపడుట- లక్ష్మణుడు ధైర్యము చెప్పుట | 155 |
| 56. సీత దుర్భాషలు- లక్ష్మణ ప్రయాణము | 157 |
| 57. రావణుని శ్రీరామాశ్రమ ప్రవేశము | 159 |
| 58. రావణుడు సీతను బ్రశ్నించుట | 161 |
| 59. సీత రావణునకు దననుగూర్చి చెప్పుట | 163 |
| 60. సీతను గోరుచు రావణుడు పలుకుట | 167 |
| 61. సీత రావణుని నిందించుట | 167 |
| 62. రావణుడు తనను దాను పొగడికొనుట | 170 |
| 63. సీత రావణుని దిరస్కరించుట | 172 |
| 64. రావణుడు నిజరూపముదాల్చి- రాముని నిందించుట | 172 |



శ్రీ కొయ్యా చినసత్యనారాయణరెడ్డిగారు

అగనంపూడి

| | | |
|---|---|---|
| 65. | సీతాపహరణము | 174 |
| 66. | జటాయువు రావణుని అడ్డగించుట | 177 |
| 67. | రావణ- జటాయువుల ఘోరయుద్ధము | 182 |
| 68. | సీత దుఃఖించుచుండగా రావణుడు బలాత్కారముగా గొనిపోవుట | 186 |
| 69. | సీత రావణునకు జెప్పిన హితము | 190 |
| 70. | సీత ఋశ్యమూక పర్వతముపై- నగలమూట బడవైచుట | 193 |
| 71. | రావణు డనేకవిధములుగా- సీతను బ్రలోభపెట్టుట | 196 |
| 72. | సీత రామపరాక్రమముం జెప్పి- రావణుని దెగడుట | 200 |
| 73. | రావణుడు సీతను భయపెట్టుట | 202 |
| 74. | మారీచుని జంపి- వచ్చుచున్న రాముడు- లక్ష్మణుని గలియుట | 204 |
| 75. | లక్ష్మణ సమాధానము- శ్రీరామ విలాపము | 206 |
| 76. | శ్రీరాముడు లక్ష్మణుని నిందించుట- లక్ష్మణుని సమాధానము | 208 |
| 77. | శ్రీరాముడు సీతనుగానక దుఃఖించుట | 211 |
| 78. | విశేషము | 214 |
| 79. | శ్రీరాముని దుఃఖము- లక్ష్మణుని ఓదార్పు | 216 |
| 80. | శ్రీరాముని శోకము కోపముగా మారి- విజృంభించుట | 230 |

81. శ్రీరాముని కోపోపశమనము 232
82. శ్రీరాముడు జటాయువున కుత్తమలోకముల
నొసంగుట 236
83. రామలక్ష్మణులు కబంధునకుఁ జిక్కుట 245
84. కబంధుఁడు శాపవిముక్తుఁడై - రామునకు
హితము చెప్పుట 251
85. కబంధుని చరిత్ర- శాప విముక్తి 253
86 కబంధుఁడు చెప్పిన ఉపాయము 256
87. కబంధుఁడు చెప్పిన పంపాతీర విశేషము 260
88. శ్రీరాముఁడు మతంగాశ్రమమున
శబరికి మోక్ష మొసంగుట 265
89. శ్రీరాముఁడు పంపానదీ తీరమును
లక్ష్మణునితో ప్రవేశించుట 271

## కిష్కింధ కాండ

1. శ్రీరాముడు సీతను దలంచుచు దుఃఖించుట 275
2. హనుమంతుఁడు సుగ్రీవునకు ధైర్యము చెప్పుట 284
3. హనుమద్రామ సమాగమము 286
4. హనుమంతుఁడు శ్రీరాముని ప్రశ్నించుట-
లక్ష్మణుని సమాధానము 290
5. హనుమంతుఁడు రామలక్ష్మణులను
సుగ్రీవ సన్నిధికిఁ గొనిపోవుట 293
6. శ్రీరామ సుగ్రీవ సంభాషణ- అగ్నిసాక్షిగా మైత్రి 295

7. సుగ్రీవ ప్రతిజ్ఞ- శ్రీరాముని సంతోషము 299

8. శ్రీరాముఁడు సుగ్రీవునిచే శాంతినిబొంది
వాలివధకు బ్రతిజ్ఞఁ బూనుట 303

9. సుగ్రీవుని శరణాగతి 306

10. సుగ్రీవుఁడు వాలి పరాక్రమమును-
దనతో వైరమును జెప్పుట 311

11. వాలి పరాక్రమము- దుందుభిని జంపుట 317

12. సుగ్రీవునకు శ్రీరాముఁడు తనశక్తిని జూపుట 323

13. మొదటిసారి వాలి సుగ్రీవుల యుద్ధము 326

14. సప్తజనవనము 329

15. సుగ్రీవుడు వాలిని రెండవమారు
యుద్ధమునకుఁ బిలుచుట 331

16. తార వాలికి జెప్పిన- హితవచనములు 333

17. తార చెప్పిన హితమునందలి ధర్మసూక్ష్మము 337

18. తార చెప్పిన హితమును గాదని-
వాలి యుద్ధమున కేగుట 337

19. వాలి సుగ్రీవుల యుద్ధము- శ్రీరాముఁడు వాలిం
జంపుట 339

20. శ్రీరాముఁడు వాలి నధిక్షేపించుట 341

21. శ్రీరాముని ధర్మనిరూపణ- వాలి యంగీకారము 339

22. వాలి పశ్చాత్తాపముతో- శ్రీరాముని బ్రార్థించుట 354

23. శ్రీరాముఁడు వాలి ననుగ్రహించుట 361

24. వాలి- యిట్లున్న వార్తం దెలిసి

తార అంగదునితో వచ్చుట 363

25. తారా విలాపము 366

26. హనుమంతుఁడు తార నోదార్చుట-

తార సమాధానము 369

27. వాలి తెలివొంది- చెప్పిన మాటలు 372

28. తారా విలాపము 376

29. సుగ్రీవుని సంతాపము 380

30. శ్రీరామ సన్నిధిని తారా విలాపము 383

31. శ్రీరాముఁడు తార నోదార్చుట 386

32. శ్రీరాముఁడు వాలికి నుత్తరక్రియలకై

ప్రోత్సహించుట 387

33. వాలికి నగ్నిసంస్కారము గావించుట 391

34. సుగ్రీవ పట్టాభిషేకము 394

35. ప్రస్రవణ పర్వత గుహావైభవము 398

36. శ్రీరాముని విరహము- లక్ష్మణ ఓదార్పు 400

37. వర్షకాల వైభవము 403

38. శరత్కాలము రాగానే- హనుమంతుఁడు

సుగ్రీవుని ప్రోత్సహించుట 409

39. సుగ్రీవాజ్ఞ 413

40. శరదృతువున శ్రీరాముని పరితాపము 413

41. రామునకు లక్ష్మణుఁడు ధైర్యము చెప్పుట 415

42. శరదృతు వర్ణనము 416
34. శ్రీరాముడు లక్ష్మణుని కోపమును శాంతింపజేసి
కిష్కింధ కంపుట 423
44. భయంకరాకారుఁడై లక్ష్మణుఁడు
కిష్కింధ కేగుట 425
45. హనుమంతుని హితవచనములు 429
46. కిష్కింధాపుర వైభవము 432
47. తార- లక్ష్మణుని శాంతింపఁ జేయుట 435
48. తార చెప్పిన మాటలు 439
49. లక్ష్మణ సుగ్రీవ సమాగమము 440
50. లక్ష్మణునకు తార చెప్పిన సమాధానము 443
51. లక్ష్మణుని సుగ్రీవుడు క్షమాపణ వేడుట 446
52. లక్ష్మణుని శాంతివచనములు 447
53. సుగ్రీవాజ్ఞ 448
54. సుగ్రీవుడు శ్రీరాముని సందర్శించుట 451
55. సుగ్రీవుడు శ్రీరామునకు సమస్త వానర
వీరులను సమర్పించుట 456
56. సీతాన్వేషణకై సుగ్రీవుడు
వానరుల నాయాదిశలకుఁ బంపుట 459
57. దక్షిణ దిక్కునకు అంగద-
హనుమదాదులను బంపుట 465

58. సుగ్రీవుఁడు సుషేణాదులను

బడమరదిక్కునకు బంపుట 469

59. సుగ్రీవుఁడు ఉత్తరదిశగా-

శతవలి మొదలగువారిని బంపుట 474

60. హనుమంతుని విశ్వసించి సుగ్రీవుడు చెప్పగా

శ్రీరాముడతనికి ఉంగరమిచ్చుట 479

61. వానరుల ప్రయాణము- వీరఘోష 481

62. సుగ్రీవుడు శ్రీరామునితో తన భూసంచార

కారణమును దెలుపుట 482

63. హనుమదాదులు తప్ప- వానరులందరును

దిరిగి వచ్చుట 484

64. హనుమదాదులు సీతను వెదకుట 485

65. హనుమదాదులు మరల మరల దక్షిణమున

వింధ్యగిరిని వెదకుట 487

66. హనుమదాదులు ఋక్షబిల ప్రవేశము 489

67. స్వయంప్రభతో- హనుమత్ప్రసంగము 492

68. ఋక్షబిల వృత్తాంతము- స్వయంప్రభ

వానరులకిచ్చిన ఆతిథ్యము 493

69. హనుమంతుడు స్వయంప్రభకు

తమనుగూర్చి చెప్పుట 494

70. అంగదుడు వానరులతో ఆ ఋక్షబిలమునందే

ఉండగోరుట 496

71. తారుని మాటలను విన్న అంగదునకు
హనుమంతుడు నీతిని జెప్పి- భీతిని గలిగించుట 500

72. అంగదుడు వానరులతో ప్రాయోపవేశము 503

73. అంగదాదుల ప్రాయోపవేశము-
సంపాతి వారిని సమీపించుట 506

74. సంపాతి- జటాయువుయొక్క-
మరణమునకు చింతించుట 508

75. అంగదుడు సంపాతికి దననుగూర్చి చెప్పుట 509

76. సంపాతి- తన వంశమును జెప్పి-
సీత లంకలో నున్నట్లు వివరించుట 511

77. సంపాతియొక్క- కుమారుడు సుపార్శ్వుడు
చెప్పిన సీతా వృత్తాంతము 515

78. సంపాతి జటాయువునకు తర్పణము లిచ్చుట 518

79. నిశాకర మహర్షి సంపాతి ననుగ్రహించుట 521

80. సంపాతికి ఱెక్కలు గలుగుట 523

81. అంగదుడు వానరులకు ధైర్యము చెప్పుట 526

82. వానరులు- వారివారి శక్తిని వివరించుట 527

83. జాంబవంతుడు హనుమంతుని శక్తిని జెప్పి
ప్రోత్సహించుట 530

84. హనుమంతుని మహోత్సాహ ప్రదర్శనము 534


* * *

# శ్రీ రామాష్టకమ్

భాషా ప్రవీణ, కవిహంస, కవిభూషణ
వేదుల వేంకటశాస్త్రి.

శ్లో॥ శ్రీమద్భద్రగిరీంద్ర నివాసం
మారుతిసేవిత పాదసరోజమ్
సన్నుత గీతానాద వినోదం
సీతానాథం రామం భజరే! 1

శ్లో॥ సీతారామం జయ శ్రీరామం
జయజయ రామ ఇతి ప్రభురామమ్
చేతస్సౌఖ్యద మాత్మారామం
సీతానాథం రామం భజరే! 2

శ్లో॥ లీలామానుష వేషవినోదం
సీతాహృదయాబ్జాంతర భృఙ్గమ్
ఆదర్శాత్మక భవ్యచరిత్రం
సీతానాథం రామం భజరే! 3

శ్లో॥ గోపన సత్కవి భక్తోద్ధారం
సర్వమతాయత సమ్మత తత్త్వమ్
భక్త కబీరు స్తుత నామానం
సీతానాథం రామం భజరే! 4

శ్లో॥ దశరథతనయం ధర్మోద్ధరణం
కౌసల్యామ్బానన్దకరం; తమ్

సత్యాత్మానం నిత్యమనన్తం
సీతానాథం రామం భజరే! 5

శ్లో॥ ఆనన్దామృత ధారాపాత్రం
భక్తజనేప్సిత నామపవిత్రమ్
సుగ్రీవార్చిత మిత్రచరిత్రం
సీతానాథం రామం భజరే! 6

శ్లో॥ కలుషవిదూరం కమలానాథం
వాలివిభంజక తేజోరాశిమ్
సాధువిభీషణ రక్షోఽభయదం
సీతానాథం రామం భజరే! 7

శ్లో॥ వేదవినోదం వేదాతీతం
వేదాధారం వేదాంతధరమ్
హరిహరరూపం నిత్యాద్వైతం
సీతానాథం రామం భజరే! 8

శ్లో॥ ప్రాతస్సాయ మిదం భక్త్యా
శ్రీమద్రామాష్టకం నరః
యః పఠే త్సర్వపాపేభ్యో
ముక్తో భవతి భోగవాన్॥ 9

# హనుమత్పంచరత్నములు

శ్లో. పీతాఖిల విషయేచ్ఛం
జాతానందాశ్రుపులకమత్యచ్ఛం।
సీతాపతి దూతాద్యం
వాతాత్మజ మద్యభావయే హృద్యం॥ ౧

శ్లో. తరుణారుణ ముఖకమలం
కరుణారసపూర పూరితాపాంగం।
సంజీవనమాశాసే మంజుల
మహిమాన మంజసూనుం॥ ౨

శ్లో. శంబరవైరి శరాతిగమంబుజదళ విపులలోచనోదారం।
కంబుగళమనిలదిష్టం బింబజ్వలితోష్ఠమేక
మవలంబే॥ ౩

శ్లో. దూరీకృతసీతార్తిః ప్రకటీకృతరామవైభవ స్ఫూర్తిః।
దారితదశముఖకీర్తిః పురతోమనుభాతు
హనుమతోమూర్తిః॥ ౪

శ్లో. వానరనికరాధ్యక్షం దానవకుల
నికరకుముద రవికర సదృక్షం।
దీనజనావనదీక్షం పవనతపః
పాకపుంజ మద్రాక్షం॥ ౫

శ్లో. ఏతత్పవనసుతస్య స్తోత్రం
యః పఠతి పంచరత్నాఖ్యం।
చిరమిహ నిఖిలాన్ భోగాన్ భుక్త్వా
శ్రీరామ భక్తమాన్ భవతి॥ ౬

— శ్రీ శంకరాచార్య.



శ్రీ రామ స్మరణం మమ

# అంకితము

శ్రీరామా! భవదీయ ధర్మచరితల్ దేటపెల్లంబుగా
నేనైనన్ బఠియింపఁ జెల్లువడనంటి రీతి నీ యాజ్ఞచే
ధారాళంబుగ వ్రాయఁగల్గితిని భక్త శ్రేణి మెచ్చ! యనన్
ధారం బెంచక యంకితంబు గొనుమా! ప్రార్థింతు రఘూత్తమా!

ఓమ్

శ్రీ మాత్రే నమః

శ్రీరామ శ్శరణం మమ

# శ్రీ మద్వేంకటేశ్వర రామాయణము

## అరణ్యకాండ - ప్రారంభము

## శ్రీరాముడు దండకారణ్య ప్రవేశము

శ్రీరామచంద్రుండు దట్టమై, సామాన్యు లెవ్వరికిని ప్రవేశింపఁదరముగాని, దండకారణ్యమునఁ బ్రవేశించి ప్రయాణమయ్యెను. (ఈ దండకారణ్య చరిత్ర నుత్తర కాండలోఁ జూడవచ్చును.) పరాక్రమశాలి యగుటచే ధైర్యముతోఁ గ్రూరజంతువులకు భయపడక, తపస్సంపన్నులైన మహర్షులు నివసించు, నాశ్రమమునఁ బ్రవేశించి, వారలను, సందర్శించెను. (ఈ కాండమున "ధర్మ సంరక్షణార్థాయ సంభవామి" యన్న భగవత్ప్రతిజ్ఞ యారంభమైనది.) అరణ్యమున, యజ్ఞార్థమై సేకరించికొనిన, దర్భలును, సమిధలును, స్నానము లొనర్చి యారవేసికొనిన నారబట్టలును ముందుగాఁ గనఁబడినవి. ఆశ్రమమంతయును బ్రహ్మతేజో విరాజమానమై, యాకాశమునఁ బ్రకాశించు సూర్యమండలము వలెఁ గాన్పించుచున్నది. అనఁగా రాక్షసులకుఁ దేరి పారఁ జూచుటకు శక్యముగానిదై యున్నది. మందేహులను

రాక్షసులు సూర్యు నుదయాస్తమయములందు బాధించు చుందురు. కాని యీ మున్యాశ్రమమున నేరాక్షసుఁడును నేసమయమందైనను బాధించలేఁడు. మఱియు నయ్యాశ్రమము సకల జీవులకును సుఖావాసమై, పరస్పర విరోధములు లేక యుండును. అయ్యాశ్రమముల ముంగిలి వాకిళ్లు నిత్యపరిశుభ్రములు. లేళ్లు నిర్భయముగా నావాకిళ్ల ముందు గంతులు వేయుచుఁ దిరుగుచుండును. పక్షిజాతులన్నియు నాయావేళలలో మధురముగాఁ గూయుచుండును. అచ్చట యెన్నో యజ్ఞములు జరుగుచునేయుండును. మహాత్ముల తపఃప్రభావమంతయు నచట వెల్లివిరిసియున్నది. ఆ కారణముచే నచట నప్సరసలును దేవతలును స్వేచ్ఛగా సంచరించుచుండిరి. ఎక్కడఁ జూచినను బెద్దపెద్ద యగ్నిగుండములును, యజ్ఞపాత్రలును కృష్ణాజినములును, దర్భలును, సమిధలును, పవిత్ర జలకుండికలును, ఫలములును, దుంపలు నరణ్యమున సమృద్ధిగా లభించు వస్తువులన్నియు నాయాశ్రమమున నుండఁగా శ్రీరాముఁ డానందముతో సందర్శించెను. మఱియు, వేదవేత్తలై, బ్రహ్మవేత్తలైన మహాత్ములతోఁ గలకలలాడుచుండెను. అట్టి యాశ్రమముం జూడఁగానే, రామలక్ష్మణులు తమ ధనుస్సుల నెక్కుడించి, మిక్కిలి యాశ్చర్యముతో నా ప్రదేశమునంతయును జూచుచు నావైపున కేగెను. అట్లు రామాదులా యాశ్రమమునఁ బ్రవేశించినంతనే, మునులందఱు నాతనికి స్వాగతముపలికి, వారివారి

యాశ్రమములకుం గొనిపోయి, యతిథి మర్యాదలఁ గావిం చిరి. ఆ వనవాసులందఱును శ్రీ సీతారామలక్ష్మణులను కన్నులఁబండువగా దర్శించిరి. ఆ మునులందఱును దివ్యజ్ఞాన సంపన్నులగుటచే, శ్రీరాముని బరబ్రహ్మగను, రాక్షస సంహారము చేసి, ధర్మస్థాపనఁ జేయుట కవతరించిన వానిగను, గ్రహించి తమ జీవితములు ధన్యములైనట్లుగా బ్రహ్మానంద భరితులైరి. మఱియు శ్రీరాముఁ డీయరణ్యవాసు లెట్టికష్ట నష్టములను బొందకుండునట్లు రాక్షససంహార మొనర్చి, వేద ధర్మమును బ్రతిష్ఠించుఁగాక! యని మంగళాశాసనములఁ బలికిరి. సీతారామ లక్ష్మణు లయ్యాశ్రమవాసులందఱకును వినయ విధేయతలతో నమస్కారములఁ గావించుచు, వారిచ్చు నాతిథ్యమును స్వీకరించిరి. ఆసమయమున మును లందఱును నిట్లు వలికిరి. ఓ మహారాజా! దాశరథీ! నీవు వర్ణాశ్రమ ధర్మరక్షకుఁడవు. సకల ముని పూజనీయుఁడవు. దేవతా స్వరూపుఁడవై, యర్చింపఁదగిన సర్వశరణ్యుఁడవు. ఏలనన? ధార్మికుఁడైన రాజు సూర్యునివంటివాఁడు. దుష్ట శిక్షణను, శిష్టరక్షణలను, జేయుటచేఁ బూజనీయుఁడవగు దువు. అంతియేగాక సర్వజీవులకును దండ్రివంటివాఁడే మహారాజు.

శ్లో॥ తేవయం భవతారక్ష్యా, భవద్విషయవాసినః
నగరస్థో వనస్థోవా, త్వం నోరాజా జనేశ్వరః.
స. 1, శ్లో-19.

తా॥ ఓ రామచంద్రా! నీవు మహారాజువు. మా సర్వస్వ భారమును నీయధీనము నీవు సర్వలోక శరణ్యుఁడవు. మేము నీచే రక్షింపఁ దగినవారము. ఈ ప్రదేశమంతయును నీరాజ్యములోనిదే. కావున నీవయోధ్య యందున్నను, వనము లందున్నను, మా ప్రభువై, రక్షకుఁడవై యున్నావు.

రాజ్యపాలనాధికారము లేకున్నను, సమర్థుఁడైన రాజునకు దుష్టశిక్షణ, శిష్టరక్షయు ముఖ్యధర్మము.

ఓ శ్రీరామచంద్రా! మేము కోపమును జయించి, తపస్సును జేసికొందుము. దుష్టులను శపించి, నశింపఁజేయగల శక్తియున్నను, శాంతము నవలంబించి, మాతపస్సును రక్షించికొనుచున్నాము. (తపస్సు శాశ్వతము. ఈ శరీరములశాశ్వతములు. వీనికై విలువైన తపస్సును బోగొట్టుకొనరాదు.) ఈవిధముగాఁ జెప్పుచు, నా మునులందఱును, వన్యములైన ఫలమూలా ద్యాహారములనొసంగి, యా సీతారామలక్ష్మణుల నానందింపఁజేసిరి. ఇట్లుండఁగా, మఱికొందఱు మునీశ్వరులు, శరీరదార్ఢ్యము లేనివారైనను, సిద్ధసంకల్పులును, న్యాయప్రవర్తనులును, బాపులైన విరోధులచే ముట్టరానివారును, గ్రామ్యకర్మల నెల్ల విడిచినవారు నగుటచే, శ్రీరాముని బరమాత్మగా గ్రహించి, తత్కాలోచిత స్తోత్రాదులను గావించి, యాతని దృప్తిపఱచిరి.

# శ్రీరామ లక్ష్మణులు - విరాధుని జంపుట.

శ్రీరాముఁ డానాటిరాత్రి యామునాశ్రమమున గడపి మరునాఁడుదయముననే లేచి స్నాన సంధ్యాదులఁ బూర్తిఁజేసికొని అచ్చటి మునుల యనుజ్ఞనుబొంది యం దుండి యడవుల మధ్యనుండి మరలఁ బ్రయాణము సాగించెను. ఆమధ్యలో సమస్త మృగములతో నిండి యెండి పడిపోయిన వృక్షములతోడను, లతలతోడను నిండిన యొకానొక సరోవరమును గాంచిరి. ఆయరణ్యమంతయును సింహ శార్దూలాది మృగములతోడను, వికారముగా ధ్వనించు గుడ్లగూబలు మొదలగు పక్షులతోడను, గీచురాళ్ళ ధ్వనులతోడను నిండియుండెను. అట్టి యరణ్య మధ్యనుండి సీతా రామలక్ష్మణులు ప్రయాణము చేయుచుండిరి. ఆ మార్గమున కడ్డముగా మహాకాయుఁడైన, భయంకరాకారు నొకనిం జూచిరి. వాఁడు లోతైన కండ్లు నెత్తుపల్లములుగల పొట్టయును, బెద్దనోరును గలవాఁడై శరీరమంతటను రక్తమాంసములఁ బూసికొని కండలుదిరిగిన పొడవైన చేతులు గలిగి చూచువారి కసహ్యముగను, భయంకరముగను నుండి పులితోలును గట్టికొని, పెద్దదైన నోరుఁ దెఱచికొని యముని వలె యెదురుగా వచ్చుచుండెను. వాఁడు తన పెద్దశూలముతో నేనుఁగులను, సింహములను బులులను గుదిగాఁగ్రుచ్చి పట్టుకొనియుండెను. అట్టివాఁడు సీతారామలక్ష్మణులం

జూచి, కాలాంతకునివలె దూరమునుండి పరుగుపరుగున వచ్చుచుండెను.

ఆ రాక్షసుఁడు పెద్దగా నరచుచువచ్చి సీతాదేవిని జంకఁబెట్టికొని, రామలక్ష్మణులం జూచి యిట్లనియెను. ఓయీ! మీరు తాపస వేషములను ధరించి ధనుర్బాణములను ధరించి, యాడుదానిని వెంటఁబెట్టికొని, యధర్మ ప్రవర్తకులై, యీ దండకారణ్యములం బ్రవేశించి, యల్పాయుష్కులైన మీరెవరయ్యా? నాపేరు విరాధుఁడు. నేను నిత్యమును ఋషుల మాంసమును దినుచు, నీయరణ్యమున నుందును. ఈమె నాకు భార్యకాఁగలదు. పాపులైన మిమ్ములను సంహరించి మీ రక్తమును ద్రావి, మాంసమును దిని వేయుదును. అనగా విని సీతాదేవి, వానిమాటలను వినుచు, భయంకరాకారమును జూచుచు గడగడ వణకిపోవుచున్నది. అట్టి సీతనుజూచి శ్రీరాముఁడు కంట నీరు పెట్టికొనుచు, లక్ష్మణునిం జూచుచు, నిట్లనుచున్నాఁడు. లక్ష్మణా! ఈ విరాధుని జంకలోఁ జిక్కి భయముతో వడకిపోవుచున్న సీతను జూచితివా? నాయనా! కైకేయి యేమికోరికతో మనల నడవులకుఁ బంపినదో, యది యిప్పుడు సఫలమైనట్లున్నది. సర్వభూతహితుఁడనైన, నేనరణ్యములకుఁ బోయినచో నచ్చట రాక్షసులచే భక్షింపఁబడి, భరతుని రాజ్యము స్థిరపడుటకు నవకాశముండునని దూరాలోచనతో నన్నడవు

లకుఁ బంపినదిసుమా! ఇప్పుడామె యనుకొన్నట్లే జరిగినది. లక్ష్మణా! పితృమరణముచేఁగాని రాజ్యము పోవుటచేఁగాని నా కింతటి దుఃఖము కలుగలేదు.

## శ్రీరామునకు లక్ష్మణుఁడు - ధైర్యము చెప్పుట.

పై విధముగా మాటలాడుచు విలపించుచున్న యన్నను జూచి, లక్ష్మణుఁడు కోపముతో విరాధుని జూచి, తోఁకత్రొక్కిన నాగుపామువలెఁ గన్పడుచు, నిట్లను చున్నాఁడు. రామచంద్రా! ఇంద్రసమానుఁడవై, సర్వ భూత రక్షణకును సమర్థుఁడవై విశేషించి నాతోఁగలిసియున్న వాఁడవై, నీవిట్లు లసమర్థునివలె వాపోవుట తగదుసుమా! నేను గోపముతో నా బాణములను విడిచి వీనిని జంపఁగా, నీ భూమి వీని రక్తమును ద్రావుఁగాక! ఆనాఁడు చిత్రకూటమున భరతునిపైఁ జూపించిన కోపమంతయు, నిప్పుడీ రాక్షసునిపైఁ జూపించి, వీనిని సంహరించి, సీతను విడిపించఁగలను. అన్నయ్యా! మహాక్రోధము గలవాఁడనై, వీని గుండెలకు బాణమును గురిచేసికొట్టఁగా వాఁడు నేలఁబడి గిలగిలఁగొట్టి కొనుచుఁ బ్రాణములను విడుచును. ఇంతమాత్రమునకు నీవు విచారించనేల ? నీతోఁ బనిలేకుండ నేనే వీనిని సునాయాస ముగా సంహరించఁగలను.

# విరాధ వధ

శ్రీమంతుఁడైన లక్ష్మణస్వామి రామునకు ధైర్యము చెప్పి, విరాధుని జూచి, "ఓరీ! రాక్షసాధమా! ఈ వనమున నింత క్రూరత్వముతో స్వేచ్ఛగాఁ దిరుగుచుంటివి. నీవెవ్వఁడవు ?" అని ప్రశ్నించెను. అంత నావిరాధుఁడు గంభీర ధ్వనితో "మీరెవరు? ఈ ఘోరారణ్యములలోఁ దిరుగ నేల? అందును నీ సుందరాంగిని వెంటఁద్రిప్పుకొని యెచ్చటకుఁ బోవుదురు? ముందుగా నాకీ సంగతులం జెప్పుడు!" అనఁగావిని "మేమిక్ష్వాకు వంశీయులము. సుక్షత్రియులము. సదాచార ధర్మప్రవర్తనఁ గలవారము. మేము వనవాసమునకై వచ్చినవారము" అని శ్రీరాముఁడు వానికి సమాధానము చెప్పి, "యో విరాధా! ఇంక నీవీ దండకారణ్యముల నేలఁదిరుగుచున్నావో?" విషయమంతయును జెప్పు" మనెను. "ఓ రాజకుమారులారా! వినుఁడు! నాతండ్రి జయుఁడు. తల్లి శతహ్రద. ఈ లోకమునందు రాక్షసులందఱును నన్ను విరాధుఁడని పిలుచుదురు. నేను బ్రహ్మనుద్దేశించి, మహాతపస్సును గావించితిని. ఆ బ్రహ్మదేవు ననుగ్రహమున నేనెట్టి యాయుధములచేతనైనఁ జంపఁబడను. ఈ శరీరము ఖడ్గములచే నఱుకఁబడదు. మీరీ యువతిని విడిచి పారిపొండు! అట్లుగానిచో, మీ ప్రాణములు మీకు దక్కవు." అనఁగా విని శ్రీరాముఁడు కోపముతో, "ఓరీ! నీచాధమా! నాకంటఁబడి ప్రాణములతోఁ బారిపోలేవు. నిన్నిప్పుడే సంహరించెదను"

అనుచు శ్రీరాముడు ధనువు నెక్కు నెట్టి తీవ్రమైన బాణములను విడిచెను. ఆ బాణములు బంగారు కొనలు గలవి. ఆ బాణము లావిధముగా రక్తమాంసములతో నేలను బడి నేలను బ్రద్దలుచేసినవి. ఆ బాణఘాతముల కోర్వలేక యా విరాధుడు సీతను క్రిందకుదించి, శూలమును ధరించి, రామ లక్ష్మణులపై కురికి పెద్దగా నోరు దెఱచికొని, యరచుచు యమునివలె వచ్చుచుండెను. ఈలోగా రామలక్ష్మణులు ప్రయోగించిన బాణములన్నియును, వానియొక్క పెద్దదైన యావులింతతో నేలఁబడిపోయినవి. వరదానమహిమచే వాఁడు ప్రాణములను హృదయమునం దుగ్గబట్టికొని, శూలమును బైకెత్తి రామలక్ష్మణులను జేరఁబోయెను. అంత శ్రీరా ముఁడు తనధనుర్విద్యా నైపుణ్యముతో నాశూలమును ముక్కలుగాఁగొట్టి నేలబడవైచెను. అప్పుడు వజ్రాయుధ ముచేఁ గొట్టబడిన పర్వతశిఖరము నేలఁబడినంతగా పెద్దధ్వని పుట్టినది. శ్రీరామలక్ష్మణు లావెంటనే నల్లత్రాచుపాముల వంటి ఖడ్గములను బైకిఁదీసి వానినిగొట్టుట కారంభించిరి. కానివాఁ డంతమాత్రమునఁ జావనివాఁడై, యారామలక్ష్మణు లను జేతులతోఁ బైకెత్తి భుజములపై నెక్కించికొని పారి పోవఁదలఁచెను. అంతట శ్రీరాముఁడు వాని ప్రయత్నమును గ్రహించి, "లక్ష్మణా! వీఁడు మనలను గొనిపోదలఁచి నాఁడు. అట్లే కానిమ్ము! మనము వెళ్ళవలసిన మార్గముగూడ నదియేగదా! యనిరాముఁ డనుచుండఁగా, మహాబలశాలు

లైన రామలక్ష్మణులను జిన్నపిల్లలను మోసుకొనిపోవు చున్నట్లు విరాధుఁడు వారిని జెరియొక బుజంబునను గూర్చొనఁ బెట్టి గట్టిగాఁబట్టికొని పోవుచుండెను. వాఁడు పెద్దగా నరచు చుండగా నడ్డముగానున్న పెద్దపెద్దచెట్లతో దట్టముగా నలుము కొనియున్న యా యడవియందుఁ బక్షులును నక్కలును వికారముగాఁ గూయసాగినవి. అంత సీతాదేవి యాదృశ్య మునుజూచి రామలక్ష్మణుల కేమిప్రమాదము వాటిల్లునో? యని, భయముతో, వారిశక్తిసామర్థ్యముల నెఱింగినదైనను నత్యంత స్నేహాతిశయమున గట్టిగా నేడువసాగెను. సత్యము, శౌచము, శీలమునుగల యీరాముఁడు, లక్ష్మణునితోఁగూడ నపహరించఁ బడుచున్నాడు. ఇంకనన్నిచ్చటఁ దోడేళ్ళును బెద్దపులులును దినివేయఁగలవు. ఓరాక్షసశ్రేష్ఠుఁడా! ఈ రామలక్ష్మణులను విడువుము! నన్నుభక్షించుము! నన్ను నీవిక్కడవిడిచితివి. ఎట్లైన నేమృగమైనను, నన్నుదినివేయకఁ దప్పదు. కావున శ్రీరామలక్ష్మణులను విడిచిపెట్టి, నన్నుందిని వేయుము. అనిగోలుగోలున నేడ్చుచున్న సీతాదేవి యవస్థం జూచుచు నారామలక్ష్మణులు తొందరపడి విరాధుని జంప నిశ్చయించిరి. వెంటనే లక్ష్మణస్వామి, యెడమబుజమును శ్రీరాముఁడు కుడిబుజమును ఖడ్గములతో నరికివైచిరి వాఁడు పెద్దధ్వనితో నేలగూలిపోయి గిలగిలఁ గొట్టుకొనుచుండఁగా, వాని శరీరముక్రింద మహావృక్షములు ముక్కలైపడిపోయెను. బండరాళ్ళు చూర్ణమైనవి. ఇంకను ప్రాణములతోఁ బడి యున్నవానిని రామలక్ష్మణులు తమఖడ్గములతో జితుక

బాదిరి. ఇట్లనేకవిధములుగా గొట్టుచున్నను పిడికిలిపోట్లతోఁ బొడిచినను, వాఁడు చావలేదు. ఎంతటివానికైన నభయ మిచ్చెడి, శ్రీరాముఁడు చావకుండ బాధపడుచున్న వానిం జూచి, యిట్లనెను. లక్ష్మణా! వీడు వరప్రభావముచే నెట్లును జావకున్నాఁడు. కావున వీఁడు మఱల లేవకుండ పెద్దగొయ్యిఁ దీసి, యందువీనిని బూడ్చివేయుదము. ఆమాటలువినిన విరాధుఁడిట్లనియెను. ఓకౌసల్యాప్రియకుమారా! నిన్నును సీతాదేవిని లక్ష్మణుని నేనిప్పటికి బాగుగా గ్రహించితిని.

## విరాధుని శాపవృత్తాంతము.

ఓ శ్రీరామచంద్రా! ఇంతకు బూర్వము నన్ను దుంబురుఁడందురు. నేను గుబేరునిని నొకానొక కారణమున శపింపఁబడి, రాక్షసుఁడనైతిని. అప్పుడు నన్ను విరాధుఁడనిరి. అంతట నేనుబశ్చాత్తాపముతోఁ గుబేరుని శరణువేడికొనఁగా "ఓయీ! దశరథ కుమారుఁడైన శ్రీరాముఁడు దండకారణ్యముల సంచరించుచు, నిన్నుసంహరించఁగలఁడు. అప్పుడే నీకు రాక్షసత్వముపోయి స్వర్గము లభించఁగలదు." అనిశాప విముక్తి ననుగ్రహించెను. నే నాకుబేరుని సేవకుఁడను. నేనాతని సన్నిధిని లేకపోవుటచే రంభాసక్తుడనై యున్న నాయందుఁ గోపించి, శపించియు శాపవిముక్తిని బ్రసాదించెను. ఓరామభద్రా! నీయనుగ్రహముచే నేనింతకాలమునకు శాప విముక్తుఁడనైతిని. నీయాజ్ఞయైనచో నాస్వస్థలమునకుఁ

బోయెదను.ఓ రామమూర్తీ! ఇక్కడకు దగ్గరలోనే శరభంగా శ్రమముగలదు. నీవచ్చటకు వెళ్ళుము. అతఁడు నీకు సర్వ శ్రేయములను గలిగించును. ఓరామా! నన్ను గోతిలోఁబడ వైచి పూడ్చిపెట్టుము. రాక్షసులు మరణించినచో, వారిని ఖనన మొనర్చుటయే సనాతనధర్మము. అదియే వారికిస్వర్గ మును లభింపఁజేయును. అని శ్రీరాముని ప్రార్థించుచుఁ ప్రాణములను విడిచెను. అంతరాముఁడు లక్ష్మణుం బిలిచి. నాయనా! ఈయేనుఁగుంబోలు శరీరమునకుఁ ప్రక్కనే పెద్ద గొయ్యిదీసి, యందువీనిని దొర్లించి పడవైచి, మట్టితోఁ బూడ్చివేయుము. అనిచెప్పి శ్రీరాముఁడావిరాధుని కంఠమును దనపాదముతో గట్టిగానణచిపెట్టి యుంచెను. లక్ష్మణుఁడును శ్రీరామాజ్ఞానుసారముగా నారాక్షసుని ప్రక్కనే పెద్దగోతిని ద్రవ్వెను. అందు ఆవిరాధునిశవమును శ్రీరాముఁడు లక్ష్మణునితోఁగలిసి, గోతిలోఁబడవైచి మట్టితోడను, రాళ్ళ తోడను గప్పిచంపివేసెను. ఈసంగతియు విరాధుఁడే రాము నకుఁ జెప్పుటచే నట్లుగావించెను. గోతిలోఁబడవేయునప్పుడు వాఁడు వనమంతయుఁ బ్రతిధ్వనించునట్లుగాఁ బెద్దకేక పెట్టెను. ఈవిధముగా శ్రీరామలక్ష్మణులు విరాధుని సంహరించి తామానందించుటయేగాక, యావనమందలి సమస్తజీవరాశు లును బరమానందమునందునట్లు చేసిరి.

# శ్రీరాముని - శరభంగాశ్రమ ప్రవేశము

శ్రీరాముఁడు విరాధవధానంతరము, సీతాదేవివద్దకు వచ్చి యామెను కౌఁగిలించికొని, యోదార్చెను. అప్పుడు లక్ష్మణుంజూచి తమ్ముఁడా! ఈవనమంతయును గష్టసాధ్యమై భయంకరమై యున్నది. కావున నాలస్యముచేయక మఱి యీయడవిందాటి, శరభంగాశ్రమముం జేరికొందుము అనుచుఁ దొందరగా, దేవతాప్రభావముగలిగి, పరబ్రహ్మ సాక్షాత్కారమును బొందిన శరభంగుని యాశ్రమమును దూరమునుండియే దర్శించిరి. అచ్చట మహదాశ్చర్యకరమై, సూర్యాగ్నులవలె వెలిగిపోవుచున్న కాంతిని దర్శించిరి. మఱి కొంత దగ్గరగా వెళ్ళఁగా, దివ్యమైన రథమునుండిదిగి, నేలను గాళ్ళుదాకకుండఁగానిలిచి, మహర్షి చెంతనున్న దేవేంద్రుని జూచిరి. అతఁడు సర్వాభరణభూషితుఁడై నిర్మలవస్త్రధారియై తనవంటి పెక్కండ్రు దేవతలచే సేవింపఁబడుచుండెను. పచ్చని గుఱ్ఱములు మోయుచున్న దేవేంద్రుని రథము నేలను నిలువక పైననిలచియుండెను. అట్టిరథమును దేవేంద్రునిగూడ శ్రీరాముఁడు చూచెను. ఆతని ప్రక్కభాగముల నందమైన స్త్రీలు ఛత్రచామరములను బంగారు దండములను ధరించి, సేవించుచుండిరి. నేలనుదాకకుండ వారట్లునిలిచి యుండుటచే వారిని దేవతలుగా శ్రీరాముఁడు గ్రహించెను. ఆ దేవేంద్రుని యక్షరాక్షస గంధర్వమహర్షులు మొదలగు వారందఱును స్తోత్రము చేయుచుండిరి.

శ్రీరాముఁడు లక్ష్మణునకు నాశ్రమవైభవములం జెప్పుచు నిట్లనుచున్నాఁడు. లక్ష్మణా! అటుచూచితివా! గొప్ప తేజస్సుతో సూర్యునివలెఁ బ్రకాశించుచు నంతరిక్షముననే యున్న యారథమును జూడుము! మనమింతకుఁ బూర్వము చెప్పఁగావినిన లక్షణములన్నియు గల యీ రథమును రథమునుమోయు గుఱ్ఱములును నేడుప్రత్యక్షమైనవి. అటుచూచితివా! వందలకొలఁదిగా ఖడ్గపాణులైన వారు దేవేంద్రు నావరించి, సేవించుచుండిరి. వీరందఱును మహాపరాక్రమవంతులై, యెఱ్ఱని వస్త్రములను ధరించి యున్నారు. బాగుగాఁజూడుము. ఇక్కడి వీరందఱకును నిర్వదిసంవత్సరముల వయస్సేయుండును. తమ్ముఁడా! నీవును సీతాదేవియు నిచ్చటనే యుండుము! నేనొక్కడనేవెళ్ళి, యామహాపురుషునిగూర్చి, వివరముగాఁ దెలిసికొందును. అనిచెప్పి శ్రీరాముఁడు వినయముతో నాశరభంగాశ్రమముం బ్రవేశించెను. అంత దేవేంద్రుఁడు నావచ్చుచున్న శ్రీరామునిజూచి, మహర్షితో నిట్లనుచున్నాఁడు. మహర్షీ! అదుగో! అటుచూడుము! శ్రీరామచంద్రమూర్తి యిటేవచ్చుచున్నాడు. అతఁడు నన్నుజూచి, మాటలాడకుండఁగనే, తనప్రతిజ్ఞను నెరవేర్చవలయును, తరువాత సరియైన సమయమున, నన్నుజూచునుగాక! నేను స్వల్పకాలములోనే మానవాతీతమైన విజయమును సాధించిన రాముని జూడఁగలను. ఇప్పటికి నేను గనఁబడకుండనే వెళ్ళెదను. అని, శత్రుసంహారకుఁడైన దేవేంద్రుఁడు తనయభిమతమును

విన్నవించి, యాతనింబూజించి, తనరథముపై, స్వర్గమునకుం బోయెను. అనంతర మగ్నిహోత్రము నుపాసించుచున్న శరభంగమహర్షి సన్నిధికి, తమ్మునిదోడను భార్యదోడను వెళ్ళి, యామహర్షిని సందర్శించి, సాష్టాంగ దండప్రణామ పూర్వక పాదాభివందన మాచరించి, వినయముతో నిలిచిరి. తరువాత నామహర్షి చూపించిన స్థలమునఁ రామాదులు గూర్చుండిరి. అప్పుడు మహర్షింజూచి, రాముఁడు దేవేంద్రాగమన విషయమునుగూర్చి ప్రశ్నించఁగా, మహర్షి యానందముతో నంతయు నీవిధముగా వినిపించెను. రామభద్రా! వరములనిచ్చెడు దేవేంద్రుఁడు ఆత్మజ్ఞానులకుఁగాని యితరులకు దుర్లభమైన, బ్రహ్మలోకమునకు, నాతపఃఫలముగాఁ, దీసికొనివెళ్ళుటకుఁ గోరివచ్చినాడు. నేనతనితో, నీవువచ్చుచున్నావనియుఁ జాలదగ్గరలో నున్నావనియును దెలిసికొని, కోరివచ్చుచున్న నీవంటివాని కాతిథ్యమీయకుండ, బ్రహ్మలోకమునకుంబోవుట కిష్టములేక, యాతనిం బంపివేసితిని. నాయనా! రామచంద్రా! ధార్మికుఁడవైన నీతోఁగలిసినపిమ్మట బ్రహ్మలోకమునకు వెడలఁగలను. ఓయీ! రామచంద్రా! నాతపశ్శక్తిచే, బ్రహ్మలోక స్వర్గలోకములను సంపాదించఁగలిగితిని. కాని యాతపస్సునంతను నీకే సమర్పించుచున్నాను.

శ్లో॥ అక్షయా నరశార్దూల! మయా లోకా జితా శ్శుభాః।
బ్రాహ్మ్యాశ్చనాకపృష్ఠ్యాశ్చ, ప్రతిగృహ్ణీష్వమామకాః॥

స. 5, శ్లో॥-30

తా॥ మానవశ్రేష్ఠుఁడవైన, యో శ్రీరామచంద్రా! నా తపఃప్రభావముచే, బ్రహ్మాద్యుత్తమ లోకములనెల్ల జయించితిని. అట్టినాతపస్సుచే లభించిన బ్రహ్మలోకాదుల నెల్ల నీకుధారపోయుచున్నాను. నాకతిథివైననీవు దయతో స్వీకరించుము.

తపఃఫలముగా సంపాదించిన దేదియైనను బ్రహ్మార్పణము గావించుట ముక్తికి సరియైనమార్గము. ఇదియే నిష్కామకర్మ. దీనినే త్యాగమనియు నందురు. (ఈశరభంగ మహర్షి తనసంపాదననంతను బరబ్రహ్మయైన శ్రీరామునకు సమర్పించి మోక్షమునందఁగోరెను.) త్యాగముచేతనే యమృతత్వము లభించునని యుపనిషద్వాణి. సత్కర్మలచే సత్ఫలములును దత్ఫలత్యాగముచే నాత్మజ్ఞానమును జ్ఞానముచే మోక్షమును సిద్ధించునని యుపనిషత్తులు బోధించుచున్నవి. "జ్ఞానాదేవహి కైవల్యమ్" అనియు నుపనిషత్తులు చెప్పుచున్నవి.

## శరభంగునకు - మోక్షప్రాప్తి.

శ్రీరామచంద్రమూర్తి శరభఁగమహర్షిఁ జూచి యిట్లనుచున్నాఁడు. ఓమహర్షి! నేను నీకు నుత్తమలోకముల నెల్ల నొసంగఁగలను.ఇప్పుడు నాకుఁగావలసిన దీయరణ్యమున నివాసయోగ్యమైన స్థలముమాత్రమే. దయచేసి యద్దానిని జెప్పఁగోరెదను. ఇంద్రసమాన బలముగల శ్రీరామునింజూచి యామహర్షి యిట్లనెను. రాఘవేంద్రా! నీశక్తి సామర్థ్య

ములు నాకుఁదెలియును. అయినను వినుము! ఈయరణ్యమున మహాతేజశ్శాలియును, దపస్సంపన్నుఁడును, ధార్మికుఁడునైన సుతీక్ష్ణమహర్షి గలఁడు. అతఁడు నీకుఁదగిన శ్రేయస్సును గలిగించగలడు. కావున నీవాయాశ్రమారణ్యమున రమణీయప్రదేశమున నివసించుచుండుము. ఆప్రదేశమును గూడ నామహర్షియే నీకుఁజూపఁగలఁడు. నీవీగంగానదీప్రవాహమునందు నెదురుగానున్న గట్టుపైనుండి వెడలుము. రామా! నాకోరికను మన్నించి, నీవిచ్చట నొక్కక్షణ ముండుము! నాగుబాము తనపొరను విడిచినట్లుగా, నేనీ శరీరమును, నీసమక్షమున విడువఁగలను. అనిచెప్పుచు నాశరభంగమహర్షి తన నిత్యాగ్నిహోత్రమును రగుల్కొలిపి, నేతితోహోమముచేసి యదిగొప్పగా మండుచుండఁగా, నాజ్వాలలమధ్యను బ్రవేశించెను. అంతనామహర్షి యొక్క రక్తమాంసములతోఁగూడిన శరీరము దగ్ధమై బూడిదయైనది. ఆదృశ్యమును గనులార శ్రీరాముఁడుచూచెను. అట్లే లక్ష్మణుఁడను సీతాదేవియు నాశ్చర్యముతోఁజూచిరి. అట్లందఱును జూచుచుండగనే యామహర్షి యొక్క శరీరముదగ్ధమై దివ్యదేహముతో యువకునిగామారి యంతరిక్షమున గనుపట్టెను. ఆహితాగ్నులై, మహాత్ములైన మహర్షులకు లభించెడు ముప్పది యేండ్లు వయస్సుగల దేవతాస్వరూప మాతనికి లభించినది. అట్లు దివ్యశరీరముతో వెలిగిపోవుచు నాతఁడు

స్వర్గాది లోకములందాటి బ్రహ్మలోకమునకు వెళ్ళెను. అచ్చట బ్రహ్మదేవుఁ డామహర్షికి స్వాగతముపలికి తనసన్నిధికిఁ జేర్చికొనియెను. ఈవిషయ మంతయు నెఱింగిన యాప్రాంతమునందలి మహర్షులందఱును శరభంగు నాశ్రమముం జేరి, యచ్చటనున్న సీతారామలక్ష్మణులను జూచిరి. అచ్చటకు వచ్చిన వైఖానసులును (భగవంతుని గోళ్ళనుండి పుట్టివారు) వాలఖిల్యులును (భగవంతుని రోమములనుండి పుట్టినవారు) సంప్రక్షాళకులును (నిత్యస్నానములు చేయువారు) మరీచికులును (సూర్యచంద్రకిరణములను ద్రాగి జీవించువారు) అశ్మకుట్టులును (రాళ్ళతోఁదమ శరీరములను గొట్టుకొనువారు) పత్రాహారులును (ఆకులనేదిని జీవించువారు) మొదలగు ధార్మికమహర్షి పుంగవు లెందఱో యచటకువచ్చిరి. మఱియు, దంతోలూఖలులును, (పండ్లతో ధాన్యపు పొట్టు నొలచి, యాబియ్యమునే తినువారు) ఉన్మజ్జకులును (దంతములు మాత్రమే మునుగకుండ పైకెత్తి తపములు చేయువారు గాత్రశయ్యులును (తమశరీరమునందే తలనుబెట్టుకొని నిద్రించుమునులు) అశయ్యులును (నిద్రనే మాని తపమాచరించువారు) అభ్రావకాశులును (ఆకాశమును జూచుచు నెండవానలకును జలికిని నోర్చి తపము చేయువారు) వచ్చిరి. ఇంకను నీరు, వాయువు భక్షించుచుఁ దపముచేయువారును, నేలనువిడిచి చెట్లపైనిలిచి తపముచేయువారును, మఱియు దర్భాసనములపైఁ గూర్చుని తపమాచరించువారు ననేక ఉపవాసాది వ్రతదీక్షలతోఁ దపస్సులను జేయువారును వచ్చి,

శ్రీరాముని దర్శించిరి. మహాఋషీశ్వరులందఱును గుంపులు గుంపులుగావచ్చి, శ్రీరాముని దర్శించి, యతఁడొనరించు నమస్కారములం గైకొనియిట్లనుచున్నారు.

## మహర్షులకు - శ్రీరాముఁడు - శరణునిచ్చుట

శ్రీరామచంద్రా! నీవిక్ష్వాకు వంశోద్ధారకుఁడవు. దేవతలకెల్లరకును దేవేంద్రునివలె, మాకు నీవే ప్రభుఁడవై యున్నావు. రామా! నీపరాక్రమము, ధర్మదీక్ష, పితృభక్తి సత్యప్రతిజ్ఞా, పరిపాలనమును, గల నీయశస్సు సర్వులు నెఱింగినదే. ఆకారణముచే నిన్నొకకోరికతో యాచించుటకు వచ్చితిమి.

శ్లో॥ అధర్మస్తు మహాంస్తాత! భవేత్తస్య మహీపతేః।
యోహారేద్బలిషడ్భాగం నచర్క్షతి పుత్రవత్.
స 6, శ్లో॥-11.

తా॥ రామచంద్రా! ఏరాజు ప్రజలనుండి, యారవ వంతు పన్నుగాఁగైకొని (ఋషులనుండియును) ఆయాప్రజలను గన్నబిడ్డలనువలె రక్షించనిచో నాప్రభువునకు నధర్మదోషము కలుగును.

ప్రభువైనవాఁడు ప్రజలనుగన్నబిడ్డలవలె నెప్పటికప్పుడు రక్షించుచుండుట ధర్మము.

ఓశ్రీరామప్రభూ! ఏ ప్రభువు సర్వదా యేమరుపాటులేక సర్వప్రయత్నములచేతను, తన దేశప్రజలను

రక్షించునో, యాతఁడు చిరకాల మీలోకమున సత్కీర్తిని బొంది, తుదకు బ్రహ్మలోకమునఁ బూజింపఁబడును సుమా ! కేవల ఫలమూల పత్రాదులతో జీవితములను గడుపుచుఁ దపస్సులను జేసికొనుచున్న మానుండియును, ప్రభువునకుఁ దపస్సులో నాల్గవభాగము లభించుచునే యుండును. శ్రీరామభద్రా ! వినుము! ఈయరణ్యములో, బ్రహ్మవేత్త లును, తపోదీక్షాపరులును, వానప్రస్థులును, నగు బ్రాహ్మణు లనేకులు గలరు. వారికంతకును నీవు ప్రభువుఁడవై యుండఁగా, దిక్కులేనివారివలె, రాక్షసులచేఁ బీడింపఁబడుచున్నారు. ఓరామా ! ఇటురమ్ము ! చూడుము ! రాక్షసులచేఁ జంపఁ బడిన, బ్రాహ్మణుల శరీరము లివేగుట్టలుగుట్టలుగాఁ బడి యున్నవి. మఱియుఁ బంపానదీ తీరవాసులును, ఈయాశ్రమ సమీపమునఁ బ్రవహించు, మందాకినీనదీ తీరవాసులును, నగు మునిపుంగవు లెందఱో, రాక్షసపీడలకు గురియగు చున్నారు. నిర్దాక్షిణ్యముగా నారాక్షసులుచేయు క్రూర కృత్యములను సహించలేకున్నాము. కావున మేము శరణా గతరక్షకుఁడవైన నిన్ను శరణు వేఁడికొనుచున్నాము. ఆరాక్షసులను సంహరించుటకు నీవే సమర్థుఁడవు. ఓరాజ కుమారా ! ఈలోకమున నీకంటె మమ్మురక్షించువాఁడు వేఱొకఁడులేఁడు. రాక్షసులబారినుండి మమ్ములఁ గాపాడఁగ లందులకు వేడికొనుచున్నాము. అని యీవిధముగా మునులం దఱు నేకగ్రీవముగా శరణార్థులై, ప్రార్థించువారింజూచి, రాముఁడిట్లనుచున్నాఁడు.

ఓమహర్షులారా! నన్ను మీరు ప్రార్థించుటతగదు. మీరాజ్ఞాపించవలెను. నేనుగూడ, రాక్షస సంహారార్థమే యీయడవులందుఁ బ్రవేశించితిని. నిజమునకు నాతండ్రిగారి యాజ్ఞానుసారముగా, వనవాసమునకేవచ్చినను. నాసంకల్పము మాత్రము, మహర్షులను బాధించు రాక్షసులను సంహరించుటయేయని యెఱుంగుడు! అందువలన నావనవాసము సార్థకమై ఫలించఁగలదు. శిష్టులైన మహర్షులకు శత్రువులైన, దుష్టరాక్షసుల నెల్లరను యుద్ధమునఁ జంపఁగలను. అప్పుడు నాపరాక్రమము మీకుం దెలియఁగలదు. అనియీవిధముగా లక్ష్మణసహితుఁడైన శ్రీరాముఁడు, తాపసుల కందఱుకు నభయమిచ్చినవాఁడై వారందఱితోఁగలిసి, శరభంగాశ్రమమును విడిచి, యామునులచే ధర్మాత్ముఁడని పొగడఁబడుచున్నవాఁడగుచు, సుతీక్ష్ణమహర్షిని దర్శింపనేగెను.

## శ్రీరాముని సుతీక్ష్ణాశ్రమ ప్రవేశము

శ్రీరాముఁడు తమ్మునితోడను భార్యతోడను గూడి మహర్షులందఱును వెంటరాగా జాలదూరము ప్రయాణము చేసి, యనేక నదులనుదాటి యొకచో, మహామేఘమువలె నెత్తైన, పర్వతముంజూచెను. తరువాత శ్రీరాముఁ డాపర్వతము నావరించియున్న దట్టమైన యడవినుండి వడచివెళ్ళెను. వివిధములైన పుష్ప ఫల మూలములు గల వృక్షలతాగుల్మములతో నిండిన యావనముం బ్రవేశించి కొంతదూరము

వెళ్ళగా నొకచోట నారబట్టల నారవేసియున్న యాశ్రమముం జూచి యందు మాసిన జడలు ధరించి సుఖాసీనుఁడై యున్న "సుతపుఁ"డను మహర్షిని జూచి విధివిధానముగా నమస్కరించుచు శ్రీరాముఁ డిట్లనుచున్నాఁడు.

శ్లో॥ రామోాహ మస్మి భగవన్ భవంతం ద్రష్టు మాగతః।
త్వం మాభివద! ధర్మజ్ఞ! మహార్షే! సత్యవిక్రమ ॥
స. 7, శ్లో-6.

తా॥ ధర్మజ్ఞుఁడవును, సత్యసంధుఁడవును, భగవంతుఁడవు నగు నో మహర్షీ నన్ను రాముఁడందురు. అట్టి నేను నమస్కరించుచున్నాను. దీవించుము.

మహర్షులకేగాక ధర్మాత్ములైన పెద్దలకు నమస్కరించు నప్పుడు, ముందుగాఁ దనగోత్రనామములను జెప్పికొనుట ధర్మము. (దీనినే ప్రవర యనియందురు. ప్రవరఁజెప్పికొని నమస్కరించుట యిప్పుడును బ్రహ్మక్షత్రియవైశ్యులలో నుపనయన సమయమునఁ జెప్పించి, నమస్కారములఁ జేయించుటగమనార్హము)

శ్రీరాముఁడు తానొక మహాజకుమారుఁడైనను లేక మహారాజే యైనను నహంభావమును విడిచి, బ్రాహ్మణులైన మహర్షులయెడల వినయవిధేయములతో ముందుగాఁ దానే నమస్కరించి, వారియాశీస్సులఁ బొందుచుండువాఁడని రామాయణము నందెల్లయెడలమనకు గోచరించుధర్మము.

సుతీక్ష్ణమహర్షియును, శ్రీరాముఁ డల్లంతదూరమునం దుండఁగనే వచ్చుచున్నట్లు తెలిసికొని, ధ్యానమును విరమించి కొని, యాతఁడు వచ్చినంతనే కౌఁగిలించికొని, యిట్లనియెను, ఓరామభద్రా ! నీకిదే స్వాగతము ! నీవు ధర్మస్వరూపుఁడవు నీవీఆశ్రమమునకు వచ్చుటచే, నింతవరకు నిదియనాథమై నను నిప్పుడు సనాథమైనది. (రక్షకుఁడు గలదియైనది.) ఓరామచంద్రా! నీరాకకై, యెంతో కాలమునుండి నిరీక్షించుచున్నాను. ఈశరీరముతో నిన్నుదర్శించుటకై, మోక్షమునకుఁ బోకయుంటిని. (అనఁగా, సగుణోపాసన సిద్ధినందిన పిదప నిర్గుణోపాసన యప్రయత్నముగా సిద్ధించి, మోక్షము నొసంగునని భావము. ఇట్లే యింతకుఁబూర్వము శరభంగ మహర్షియును శ్రీరామదర్శనానంతరమే శాశ్వతబ్రహ్మలోకమునకు వెళ్ళినాఁడు) ఓ శ్రీరామమూర్తీ ! నీవుపితృవాక్య పరిపాలకుఁడవై, రాజ్యమును విడిచి, చిత్రకూటమునం దున్నట్లును, కొలఁదికాలములోనే, యీప్రాంతములకు రాగలవనియును, దేవేంద్రుఁడు చెప్పగా వింటిని. మఱియు దేవేంద్రుఁడు నన్నుజూచి, నీతపస్సుచే సర్వోత్తమ లోకములను జయించితి వనియుఁబలికెను. శ్రీరామభద్రా ! దేవతల చేతను, ఋషులచేతను, నావరించికొనఁబడియున్న యీయాశ్రమమందు నీవు, సీతమ్మనితోడను భార్యతోడను, యథేచ్ఛగా నివసించుము ! అనగావిని, శ్రీరాముఁ డామహర్షికి ముందుగనే పాదాభివందన మాచరించి, మహోగ్రతపస్స

పన్నుఁడును, సత్యవాదియునగు సుతీక్ష్ణమహర్షి యొక్క ప్రేమం వాక్కులకు నలరి, బ్రహ్మదేవునితోఁ గశ్యపుఁడు మాటలాడి నట్లుగా, నిట్లనుచున్నాఁడు. ఓమహర్షి ! సర్వలోకములను నేనాక్రమించఁగలను. కాని యిప్పుడుమాత్రము మీయాశ్రమమున నివసింప ననుజ్ఞను వేడుచున్నాను. సర్వభూతహితమును గోరునట్టి తాము గుశలురై, యున్నట్లును, దమ దర్శనము గావించమనియును, గౌతమవంశ్యుఁడైన శరభంగ మహర్షి చెప్పఁగా నిట్లువచ్చితిని. ఆమాటలువిని సుతీక్ష్ణ మహర్షి, ఓశ్రీరామచంద్రా ! ఈయాశ్రమము సర్వసౌఖ్యోపేతమైనది. ఇచ్చటనున్న మునీంద్రులతోఁ బాటు నీవును ఫలమూలాదులందినుచు సుఖముగా నుండుము ! మఱియు నోరామా ! వినుము ! ఈవనము నీ కప్పుడప్పుడు రాక్షసులు క్రూరమృగములరూపమున నిర్భయముగావచ్చి మాకు సమాధిభంగమును గలిగించి పోవుచున్నారు. ఇంతకుదప్ప మాకేభయమును లేదు ఇందు నీవే దోషమును లేక సుఖముగా నిశ్చింతగా నివసించవచ్చును. అనిపలికెను. అంత శ్రీరాముఁడు వెంటనే ధనువునెక్కుపెట్టి యిట్లనుచున్నాఁడు. మహాత్మా ! ఈయాశ్రమవాసులను భయపెట్టుచుఁ దపోభంగమును గలిగించు క్రూరజంతువులు వచ్చినచో, వాని నిదే నాబాణములతోఁ జంపి, మీకందఱకును బ్రశాంతి నొసంగఁగలను. కాని యొకే సందేహము. మీయాశ్రమమున జంతుహింసఁగావించి మీకుఁ గష్టమును గలిగించుదునేమో ?

కావున నేనీయాశ్రమమున నట్టిమృగములు సంచరించుచుదగిన కాలమువరకు నుండఁజాలను అనెను. ఇట్లు సంభాషించుకొనుచుండఁగా సూర్యాస్తమయమైనది. వెంటనే మునులతోఁ బాటు శ్రీరాముఁడును లేచి, సాయంసధ్యను బూర్తిగావించికొని, సీతాదేవితోడను, లక్ష్మణునితోడను నారాత్రిసుతీక్ష్ణమహర్షి యొసంగిన పండ్లను దుంపలను, భుజించి సుఖముగా నిద్రించెను.

## శ్రీరాముఁడు మునుల యాతిథ్యములను స్వీకరించుట.

సీతారామలక్ష్మణు లారాత్రి సుఖముగా నిద్రించి, మరునాఁ డుదయముననే మేల్కాంచి, స్నానసంధ్యాదులం దీర్చికొనిరి. తరువాత సూర్యోదయానంతరము సుతీక్ష్ణమహర్షి ని సందర్శించి, శ్రీరాముఁ డిట్లనియెను. మహాత్మా! నీయనుగ్రహముచే నీరాత్రి సుఖముగాఁ గడపితిమి. ఇంకను నిందలిమునిపుంగవులు దమతమ యాతిథ్యములను స్వీకరింపఁ గోరుచున్నారు. మేమీపుణ్యచరిత్రలుగల దండకారణ్యవాసులగు మునుల యాశ్రమముల దర్శింపఁగోరుచున్నాము. మాకొఱకై యీవచ్చిన యగ్నిజ్వాలలవంటి తేజస్వంతులైన మహామునుల యాశ్రమములకుంబోవ ననుజ్ఞనిప్పించఁగోరుచున్నాము. మహర్షిపుంగవా! అన్యాయార్జిత విత్తసంప

న్నుఁడైనవాని యహంకారమువలె, నీసూర్యకిరణములు త్వరగా వేడెక్కుచున్నవి. కావున పెందలకడనే ప్రయాణము చేయవలయును అనిచెప్పుచు నారామలక్ష్మణుల నామహర్షికిఁ బాదాభివందనములఁ గావించిరి. అంతనామహర్షి శ్రీరామలక్ష్మణులను లేవఁదీసి, గట్టిగాఁ గౌఁగిలించికొని యిట్లనియెను. రామా! నీడవలె నిన్నువిడువక సంచరించు నీసీతాదేవితోడను, తమ్ముఁడైన లక్ష్మణునితోడను, సుఖముగాఁ ప్రయాణముచేయుము! మీకు సర్వశుభములును గలుగుఁగాక! నాయనా! ఈ మునీశ్వరులతోఁబోయి, దండకారణ్యము నంతను జూడుము. ఇదిపుష్పఫలమూలసమృద్ధిఁగలిగి, శాంత స్వభావముగల లేళ్ళతోడను గలకలలాడు దిగుడబావులతోడను జెఱువులతోడను జాలఁ ప్రకాశించును. అంతియేగాక చూచుటకానంద దాయకములైన సెలయేళ్ళను, మధురముగాఁ గూయునెమిళ్ళను గలవు. నాయనా! లక్ష్మణా! నీయన్న ననుసరించి వెళ్ళుము! రామచంద్రా! ఈయరణ్యమునగల యాశ్రమముల నన్నిఁటినింజూచి, మఱల నాయాశ్రమమునకు రావలెనుసుమా! అనఁగా విని, సీతారామలక్ష్మణులు మహర్షికిఁ ప్రదక్షిణ నమస్కారములఁ గావించి, మీయాజ్ఞానుసారముగనే చేయుదుమని చెప్పిరి. అంతవరకు నాయాశ్రమమున భద్రపరచిన ధనుర్బాణములను ఖడ్గములను సీతాదేవి తీసికొనివచ్చి శ్రీరామలక్ష్మణుల కొసంగెను. అంత వారుముగ్గురును శోభాయమానములైన రూపసంపన్నులును

బ్రహ్మతేజో విరాజమానులు నగు మహర్షులతో గలిసి వెళ్ళుచు, సీతాదేవి శ్రీరామునితో నిట్లనుచున్నది.

## సీతాదేవికిఁ గలిగిన ధర్మసందేహము

శ్రీరామచంద్రా! ఇంతవరకును నీవనుసరించుచున్న ధర్మమార్గ మితరుల కెవ్వరికి ననుసరించుటకు సాధ్యము గానిది. సమస్తమైన యైహిక వ్యసనములను, విడనాడినంగాని యిట్టినీధర్మముననుసరించుట కష్టము. రామా! ఈలోకములో నత్యంత ముఖ్యములైన మూఁడుధర్మములుగలవు. మొదటిది సత్యము. రెండవది యేకపత్నీవ్రతము. మూఁడవది కారణము లేని కలహమును వీడుట. ఇందు మొదటిది నీయందు స్థిరపడి యున్నది. రెండది పరస్త్రీవ్యామోహము నీయందు వెదకి నను గానరాదు. ఇదినీయందు మానసికముగా నైన లేదు. ఈ రెండుగుణములును లోకమున సర్వవిదితములు. రామా! సత్యధర్మములు నీయందు మూర్తీభవించినవి. వీనిని జితేంద్రి యులు సాధించఁగలరు. నీవుజితేంద్రియులలో నుత్తముఁడవని వేరుగాఁజెప్పనేల? ఇంక మూఁడవది యకారణ వైరమును బూని, యితరులను సంహరించుట. ఇట్టి రౌద్రరూపక వ్యసనము పామరులకు మాత్రమే తగియున్నది. అట్టిది నీకిప్పుడు తటస్థించెను. అదియెట్లందువా? నాభావమును వినుము? దండకారణ్య వాసులైన మునుల నందఱను, రక్షించుటకై, రాక్షససంహారము చేయుదునని ప్రతిజ్ఞను

బూనితివి. కావుననే, నీ తమ్మునితోఁగలిసి యీసుప్రసిద్ధ దండకారణ్యములకు విల్లమ్ములధరించి, ప్రయాణము చేసితివి. ఆకారణముగా నీకున్న కీర్తిప్రతిష్ఠలు నీవిప్పు డవలంబించు నకారణవైరముతో, రాక్షసులనుజంపుట యను దానిచే నశించఁగలవని నాసందేహము. ఈమూలముగా నీవప్రతిష్ఠ పాలగుదువని నేను భయపడుచున్నాను. (ఈసందర్భమున శ్రీరాముఁడు తనసత్యమును నిలుపుకొను టకు, రాక్షససంహారమును జేయనలెను. లోకములో వైరకారణములు రెండేయుండును. మొదటిది కాంతావిష యము. రెండవది కనకము. ప్రస్తుతమునకు రామునివద్ద కనకము (ధనము) లేనేలేదు. తనభార్యయైన సీతయేగలదు. ఈమె నవమానించుట యపహరించుట యనుకారణములుగా రాముఁడు రాక్షసులను జంపి, తనప్రతిజ్ఞను నెరవేర్చికొన వచ్చును. లేదా రామునకుఁ బరకాంతా స్వీకరణార్థమైన యొత్తిడిమూలముగా, రాముఁడు రాక్షసులను సంహరించ వచ్చును. అందేదియైనను సీతాదేవికి భరింపరాని కష్టమే కాఁగలదు. కావున సీతాదేవి ముందుగా శ్రీరాము నెచ్చ రించుచున్నదని మనమూహించికొనవలెను.) కావున శ్రీరామ భద్రా! ఇప్పుడు నీవుదండకారణ్యముల కేగుటమంచిదిగాదు. కారణమువినుము! తమ్మునితోఁగూడ నీవు ధనుర్ధారివై యడవులలో సంచరించుచుండగా, రాక్షసులు గనిపించుదురు. వారినిజూడఁగనే సంహరించకమానవు. అగ్నికి దగ్గరగా

నెందువుల్లలున్నచో దానితేజము భయంకరముగాఁ జేఱుగును. అట్లే క్షత్రియవీరునిచేతిలో నాయుధమున్నచో వానిపరాక్రమ మతిశయించును. ఈసందర్భమున నేనువిన్న యొకకథను జెప్పెదను వినుము.

## ఇంద్రుఁ డొకానొకమునికిఁ దపోభంగము గావించుట.

వీరాగ్రేసరుఁడవైన యోరామమూర్తీ! పూర్వము జంతువులును బక్షులును గలిసి, నివసించుచున్న యొకానొక వనమునందు, నొకానొక మునీశ్వరుఁడు తీవ్రమైన తపస్సు నాచరించుచుండెను. ఆతని తపస్సు నెట్లైన భంగము గావింప నిశ్చయించి, దేవేంద్రుఁ డొకసైనికునివేషముతో ఖడ్గమును ధరించివచ్చెను. అటువచ్చి, సత్యధర్మరతుఁడైన యామహర్షిని సమీపించి, "మహాత్మా! ఈవాడియైన ఖడ్గమును నీవద్ద భద్రముగా నుంచుము! నాపనిని బూర్తిచేసికొని మఱలవచ్చి నాఖడ్గమును గొనిపోవుదును." అని వినయముతోఁ బలికి యాఖడ్గము నాతనికడనుంచి వెడలిపోయెను. ఆమహర్షియును దాచఁబెట్టిన యాకత్తిని జాగరూకుఁడై కాపాడుచుఁ దా నెందుఁబోయినను దానినివీడక చేతఁబట్టికొని పోవుచుండెను. ముఖ్యముగాఁ దనకుఁగావలసిన, దర్భలను ఫలములను దుంపలను దెచ్చికొనుటకుఁ బోవునప్పుడు తనచేతి ఖడ్గము నుపయోగించుచు దానివాడితనమున కాశ్చర్యపడు

చుండెడివాఁడు. క్రమముగా రౌద్రము నవలంబించి, కన్పబడిన జంతువునుగాని, పక్షినిగాని, సంహరించుచుఁ గాలక్రమమున నాతఁడు తపస్సును బోఁగొట్టికొని నరకమునొందెను.

శ్రీరామచంద్రా! ఈవిధముగా శస్త్రసంపర్కమగ్నిసంపర్కమువలె, వినాశహేతు వగుచున్నది. రామచంద్రా! సర్వజ్ఞుఁడవైన నీకుఁదెలియని ధర్మములేదు. అయినను నీయం దత్యంత స్నేహగౌరవములు గలదాననగుటచే నీకు నాయనుమాన నివృత్తికై, విన్నవించికొనుచున్నదానను, అంతియేగాని నీకుందెలియదని నేనుజెప్పుట గాదుసుమా! వీరాగ్రేసరుఁడవైన యోరామా! నీ వీయరణ్యమున రాక్షసుల నకారణ వైరమునుబూని, విల్లంబులను బట్టి సంచరించుచు, నీ కేయపరాధమును జేయని రాక్షసులను సంహరించుట నాకెంతమాత్రము నిష్టములేదు. వీరులైన పరిపాలకులు వనములందుండి తపస్సుచేసికొనువారికిఁ దపోభంగమును గలిగించు, మృగములను, రాక్షసులను, భయపెట్టి పారఁద్రోలుటకే, వారాయుధములను ధరింపవచ్చునని ధర్మశాస్త్రవాణి.

శ్లో॥ క్వచ శస్త్రం క్వచవనం, క్వచ క్షాత్రం తపఃక్వచ ।
వ్యావిద్ధ మిదమస్మాభిః, దేశధర్మస్తు పూజ్యతామ్॥
స. 9, శ్లో॥-27

తా॥ శ్రీరామచంద్రా! ఆయుధములెక్కడ? తపోవనమెక్కడ? క్షత్రియ ధర్మమెక్కడ? తపంబెక్కడ? ఇవి

పరస్పర విరుద్ధములైన ధర్మములు. కావున మన మేదేశము నందుంటిమో, గమనించి యచ్చటి ధర్మమును బాటించ వలెను. (మునివృత్తి నవలంబించి యాయుధములను విడువ వలెను.)

మనమేదేశమునం దెవరితోనుందుమో, యాదేశ మున వారిధర్మమునే యవలంబించుట సామాన్యధర్మము.

ఓశ్రీరామచంద్రా! నీయాయుధముల నిక్కడధరిం చక, యెందైననుంచుము. మన మయోధ్యకు మఱలిపోవు నప్పుడు, వానినిగైకొని ధరించవచ్చును. నీవిచట నొకచో నుండి తపస్సుచేసికొనుచున్నచో, మంచిప్రయోజనమున్నది. నీవురాజ్యమును శాశ్వతముగా విడిచి, యడవులలోఁ దప మాచరించుట నాయత్తలకుఁ దక్కంగల బంధువులకును బరమప్రియమైనది. నీబుద్ధియును నిర్మలమై పవిత్రమైనది కాఁగలదు.

శ్లో॥ ధర్మా దర్థః ప్రభవతి, ధర్మా త్ప్రభవతే సుఖమ్।
ధర్మేణ లభతేసర్వం, ధర్మసార మిదంజగత్॥

తా॥ శ్రీరామచంద్రా! ధర్మమువలన సమృద్ధిగా నర్థము లభించును.ధర్మార్థములలో నొకదానికొకటి విరుద్ధము గాకుండినచో సర్వసుఖములు నిహపరములలో సంప్రాప్తిం చును. ఈవిశ్వమంతయును ధర్మసారమైయుండురు.

"ధర్మోరక్షతిరక్షితః" అనుసూక్తిననుసరించి యెన్ని

కష్టములకైననోర్చి ధర్మమును దప్పనివాఁడు సాధించలేని పనియే లేదు.

నేర్పుగలవా, డాయాసందర్భములలో, నియమపాలకుఁడై శరీరమును గృశింపఁజేసికొనియైనను, ధర్మమును బాటించవలెను. అట్టి ధర్మపాలనవలన, శాశ్వత సుఖకీర్తులు, లభించును, ఓదాశరథీ! నీవుతపోవనమునందేయుండి, నిర్మలాంతఃకరణుఁడవై, ధర్మము నాచరించుము. నీకీముల్లోకములందును దెలియని విషయమే లేదు. నీవు సర్వము నెఱింగినవాడవు. నేను సహజమైన స్త్రీచాపల్యముచేఁ నీకుఁ జెప్పుచున్నానేగాని, శాసించుటగాదుసుమా! నీతమ్ముఁడైన యీలక్ష్మణస్వామితోఁగూడ నాలోచించి, నీయిష్టప్రకారముగాఁ జేయుము. నేనింతవరకును దెలిసినదానివలె నీకుఁ జెప్పినందులకు క్షమించుము.

శ్రీరాముఁడు సీతాదేవియొక్క ధర్మప్రసంగము నంతనువిని, యిట్లనుచున్నాఁడు. ఓజానకీ! నీవునాయందత్యంతానురాగముతో, వంశగౌరవమునకుఁ దగినట్లుగా, మాటలాడితివి. ఓప్రియురాలా? నన్నేమని చెప్పుమందువు? ఆర్తులైనవారిని బాధించు, దుష్టులను శిక్షించుటకే, క్షత్రియులాయుధములను ధరించుదురు. ఈవిషయముగూడ నీవే చెప్పితివిగదా! ఈదండకారణ్యవాసులు, రాక్షసుల క్రూరకృత్యములకు భయపడి, యార్తులై, రక్షించువారు లేక, యిప్పుడీ విధముగా వచ్చిన నన్నుశరణుఁజొచ్చుటయును నీవేచూచి,

వింటివిగదా ! వీరందఱు ధార్మికులును వ్రతనిష్ఠులు నయి యుండఁగా, నట్టివారిని రాక్షసులు హింసించుచుండ, నేమాత్రమును మనశ్శాంతిలేక, బాధలుపడుచున్నారు. వీరందఱు నాయా పర్వదినములలో ననేకవ్రతము లాచరించుచుందురు. అట్టివీరిని నరమాంసభక్షకులైన రాక్షసులుచంపి, తినివేయుచుండిరి. అట్టిరాక్షసుల బారినుండి, మమ్మురక్షించుమని, నన్ను శరణుఁబొందిరి. నేనువారియార్తినివిని, యామహాత్ముల పాదసేవఁగోరి, యిట్లంటిని. ఓమహర్షులారా ! నేనుసు మీసన్నిధికే వచ్చుచుంటిని. మీరే స్వయముగావచ్చి నన్ను శరణువేడుటచే, నేనుసిగ్గుపడుచున్నాను. మీవంటి మహాత్ములసేవయే నాకుఁగావలసినది. ఇప్పుడు నన్నేమిచేయుమందురు ?" ఓసీతా ! నేనీవిధముగా నడిగినంతనే యాబ్రాహ్మణోత్తము లందఱు నేకగ్రీవముగా "ఓరామా ! కామరూపులగు రాక్షసు లీదండకారణ్యములఁ బ్రవేశించి, మమ్ములను జంపి, తిసివేయుచున్నారు. అట్టివారి బారినుండి మమ్మెల్లరను నీవేరక్షించవలయును. మేమాయాపర్వదినములలోఁ జేయు వ్రతహోమాదులను ధ్వంసముచేయుచున్నారు. అట్టిరాక్షసులనుండి మమ్మురక్షించుము. ఇంతటి ఘోరవిపత్తునుండి గాపాడుటకు నీవేమాకుదిక్కు.

శ్లో॥ కామం తపఃప్రభావేన, శక్తా హన్తుం నిశాచరాన్।
చిరార్జితంతు, నేచ్ఛామః, తపః ఖండయితుం వయమ్॥

స. 10, శ్లో॥ 4

తా॥ ఓరామచంద్రా ! ఈ రాక్షసులను మాతపోబలముచే సంహరించఁగలము. కాని చిరకాలమునుండి శ్రమించి, పరలోకమున సుఖప్రాప్తికై, సంపాదించికొనఁబడిన మా తపస్సు నీ నీచులకై వెచ్చించి చంపుట మాధర్మముగాదు.

దుష్టశిక్షణ-శిష్టరక్షణ, యనునవి రాజధర్మములు. కాని బ్రాహ్మణుఁడు తపశ్శక్తిని క్రోధముతో నశింపుజేసికొనక, ఇంద్రియనిగ్రహముగలిగి యుండుటధర్మము.

శ్రీరామభద్రా ! తపస్సునార్జించుట చాలకష్టతరమైనది. అట్టితపస్సును క్షుద్ర రాక్షస సంహారమునకు నుపయోగించుట మాధర్మముగాదు. మాతపస్సులకు విఘ్నము గలిగించుచున్న రాక్షసులను జంపుటకు నీవేయర్హుఁడవు. ఈవనమున మాకునీవేరక్షకుఁడవు గావలెను. అనియామునులు తమయార్తిని వివరించి నన్నుశరణువేడిరి. ఓసీతా ! పైవిధముగా శరణుజొచ్చిన బ్రాహ్మణ మునీంద్రులను త్రికరణశుద్ధిగా రక్షించుదునని ప్రతిజ్ఞఁజేసితిని. అట్లుప్రతిజ్ఞఁజేసి తరువాతఁ గాదనుటచే, నాసత్యవ్రతమునకు భంగము వాటిల్లును.

శ్లో॥ అప్యహం జీవితంజహ్యాం త్వావాసీతే ! సలక్ష్మణమ్ ।
నతు ప్రతిజ్ఞాం న్రశుత్య బ్రాహ్మణేభ్యోవిశేషతః ॥
స. 10, శ్లో॥-19

తా॥ "ఆత్మానం జీవితరక్ష్యే ద్దారైనపి ధనైరపి"

అనుసూక్తి నెఱింగియు, నాప్రాణములనైన విడుచుదును గాని, సత్యప్రతిజ్ఞను విడువలేను. "భ్రాతా ఉన్యాయమూర్తి రాత్మనః" అనుసూక్తినను సరించుటనైనవిడిచి సత్యమును నిలిపికొనుటకై నాతమ్మునిలక్ష్మణునైన విడుచుదును. "అర్థో వాపమఆత్మనః యత్పత్నీ" యను సూక్తిచే నాయర్థాంగివైన నిన్నైనను విడుచుదును. కాని సత్యవ్రతమును విడువను సుమా ! ఓసీతా ! అందును బ్రాహ్మణులవిషయమై చేసిన ప్రతిజ్ఞ విషయమై వేరేచెప్పనక్కర లేదు.

దుష్టశిక్షణ శిష్టరక్షణ, అనునవి యెవరును గోరక పోయినను క్షత్రియుని ముఖ్యధర్మములు. అట్టియెడ బ్రాహ్మణులును మహర్షులు నైనవారు తమ్ము రక్షింపఁ గోరగా విధిగా స్వధర్మమును బాటించుదునని ప్రతిజ్ఞ చేసియు దానిని గాదనుట యధర్మము.

శ్లో॥ సదృశం చానురూపంచ, కులస్య తవచాత్మనః ।
సధర్మచారిణీ మేత్వం, ప్రాణేభ్యోఽపి గరీయసీ ॥

స. 10, శ్లో॥-22

తా॥ ఓప్రియురాలా ! నీవునాప్రాణములకంటెను మిక్కిలిప్రియమైనదానవు. నీజనకుని వంశమునకును, నావంశమునకును, దగినట్లుగా, సహధర్మచారిణివై పతివ్రతవై, నాక్షేమమును, నీమాంగళ్యమును గోరి, హితమును బలికితివి. చాలసంతోషము. (ఇచ్చట సహధర్మచారిణీమ్" అను

టలో భర్త యేధర్మము ననుసరించునో, భార్యగూడ నతనికనుకూలముగనే ధర్మప్రవృత్తిఁగలిగి యుండవలెనని వ్యంగ్యముగాఁ జెప్పుచున్నాఁడు)

ఎవరియం దత్యంతప్రేమానురాగములుగలవో, యట్టి వారికిఁ దాత్కాలికముగాఁ గష్టముగలిగించినను హితమును జెప్పుటకు సందేహించరాదు. ధర్మమును నిర్మొగమాటముగాఁ జెప్పవలెను. (హితము=తాత్కాలికముగాఁగష్టము గలిగించినను మున్ముందు క్షేమకరమైన మాటలనుజెప్పుట) (ప్రియము :- తాత్కాలికముగాఁ జెవికింపుగా నున్నను, మున్ముందు గష్టనష్టములకు గురిచేయుమాటలు.)

శ్రీరాముఁ డీవిధముగా సీతాదేవికి ధర్మసూక్ష్మమును జెప్పి ధనుష్పాణియై తమ్మునితోడను, భార్యతోడను దండకారణ్య ప్రయాణమును సాగించెను.

## శ్రీ సీతారామ లక్ష్మణులు - దండకారణ్యాశ్రమములం జేరుట

శ్రీరాముఁడు దండకారణ్య ప్రయాణమున ముందు రాముఁడును, మధ్యసీతయును, జివర లక్ష్మణుఁడు నుండి నడచిరి. (ఈభావము 11వ. స.లో మొదటిశ్లోకమునఁ జెప్పఁబడినది. "అగ్రతః ప్రయయౌ రామః...జగామహ" ఇచట మొదటిది 'అ'కారము, రెండవది "సుమధ్యమా" యను

పదమునందు 'స' కారము పైనున్న "ఉ"కారము మూడవది "జగామ" అను పదమునందలి, చివరి "మ"కారము. ఈమూడును గలిసి "ఓమ్"అను ప్రణవమై, మహర్షుల నుద్ధరించుటకు రూపముదాల్చి వెళ్ళుచున్నట్లున్నదని కొందఱు పండితులు వ్యాఖ్యానించిరి.)

(మఱియు శ్రీరాముడు పరమాత్మ. సీతప్రకృతి. లక్ష్మణుడు జీవుడు. అనియు జీవుడు పరమాత్మను జేరుటకు ప్రకృతి యడ్డముగా నున్నవిషయము గోచరించుచున్నదనియు మఱికొందఱు పండితులవ్యాఖ్య.)

శ్రీరామలక్ష్మణులు సీతాదేవితోడను మునులతోడను గలిసి, వివిధములైన కొండచరియలను నదులను, వనములను, నాయాస్థలమునందలి ప్రకృతిసిద్ధములైన వృక్షములయొక్కయు, జంతువులయొక్కయు, పక్షుల యొక్కయు, రామణీయకతను జూచుచు ప్రయాణము సాగించిరి. ఈవిధముగా వారు చాలదూరమునడిచి యొకచోట యోజనముమేర విస్తరించియున్న యొకానొక తటాకమును జూచిరి. అందలి జలబిందువులను పక్షులనుజూచి యానందించిరి. ఆనీరత్యంతనిర్మలమై యున్నది. ఆలోపల నుండి, గీతవాయిద్యములయొక్క మధురధ్వని వినబడుచున్నది. కాని వ్యక్తులెవ్వరును బైకి గానరాలేదు. అప్పుడు తమవెంటనున్న మునులలో ధర్మభృతు డనువానింజూచి

యాసరోవర విశేషనుముం దెలియఁజెప్పుమని శ్రీరాముఁడు కోరెను.

## పంచాప్సరము - మాండకర్ణిమహర్షి

అప్పు డాధర్మభృతుఁడు రామలక్ష్మణుల ప్రశ్నకు సమాధానముగా నిట్లనియెను. ఓరామచంద్రా ! నీవడిగినది యొకయద్భుతమైన విషయము. వినుము ! ఈసరస్సునకుఁ "బంచాప్సరము" అని పేరు. మాండకర్ణియనుమహర్షి తన తపఃప్రభావముచే దీనిని నిర్మించికొని నాఁడు. ఈమహర్షి పదివేలసంవత్సరములు నీటియందునిలిచి మహాతపస్సును వాయుభక్షణుఁడై యాచరించెను. ఆతపస్సుచేఁ బీడితులైన యగ్నిహోత్రాది దిక్పాలకులును, దేవతలు, నొకచోఁ గూడి యొకనిర్ణయము గావించిరి. అదియుంజెప్పెదవినుము ! "వీఁడు మనదిక్పాలకులలో నొకరిస్థానము నాశించి, యీతప మాచరించుచున్నాఁడు. కావున వీనికిఁ దపోభంగముఁ గావించ వలెను. అందుల కప్సరసలలో నత్యంత సౌందర్యవతులై, నేర్పరులైన వారినైదుగురను వీనివద్దకుఁ బంపవలయును." అనినిర్ణయించి మెరుపుఁదీగలవంటి యప్సరసల నైదుగుర నెంపికచేసి, వారిని రావించి మాండకర్ణివద్దకుఁ బంపిరి. ఆవిధముగాఁ దనకెదురుగా మన్మథచేష్టలతో మెరిసిపోవుచున్న యప్సరసలను మాండకర్ణిమహర్షి చూచెను. చూచినదే తడవుగా నాతపస్సు చలించిపోయినది. దానితో నాయప్సరస

లును నాతని దపోవిఘ్నముగావించుటకుఁ బాల్పడిరి. అప్పుడా మహర్షి తనతపస్సును వెచ్చించి సర్వాంగసుందరమైన యీతటాకమును, నిందడుగుభాగమున నొకదివ్యభవనమును నిర్మించఁగలిగెను. అప్పటికిఁ దాను వయోవృద్ధుఁడైనను, నూతన యౌవనవంతుఁడుగా మారఁగలిగి,వారితో నిత్యభోగ పరాయణుఁడై యుండెను. వారును నిత్యమునిల్లే, సంగీత వాయిద్యములతో నాతని, నలరించుచుందురు. ఓరామ చంద్రా! ఆయప్సరసల మంజీరాది యాభరణధ్వనులతో మిశ్రమమైన యీసంగీత వాయిద్య ధ్వనులు మన కీసీటి యడుగుభాగమునుండి వినఁబడుచున్నవి. సుమా!" అని బ్రహ్మవేత్తయైన ధర్మభృతుఁడు చెప్పగావిని, శ్రీరామ లక్ష్మణు లాశ్చర్యపడిరి. ఆమాటలను విని యచట నిలువక శ్రీరాముఁడు ప్రయాణముసాగించి, తొందరఁగా, మున్యా శ్రమసమూహములున్న వనభూమికివెడలెను.

శ్లో॥ ఆశ్చర్యమితి తస్యైత ద్వచనం భావితాత్మనః।
రాఘవః ప్రతిజగ్రాహ, సహభ్రాత్రా మహాయశాః॥
స. 11, శ్లో॥-20

తా॥ ధర్మభృతుని వాక్యములను విని రామలక్ష్మణు లాశ్చర్యమును విముఖత్వమును బ్రకటించిరి. కేవలము కాముకుఁడైన యీమహర్షికి నమస్కరించలేదు.

మానవుఁడు తాను సంపాదించిన దెంతటికీర్తివంతమైన తపస్సునుగాని, ధనమునుగాని, పదవినిగాని శారీరకబలమును

గాని, యిహమునఁ బరోపకారమును జేసి, పరమున శాశ్వతా నందమైన పదవిని బొందవలెను. అస్థిరమైన శరీరభోగముల ననుభవించుటకు పైవాని నుపయోగించికొనుట యధర్మము.

## శ్రీరాముని - మున్యాశ్రమవాసము.

శ్రీరాముఁడు దర్భలతోడను, నారబట్టలతోడను, బ్రహ్మతేజో విరాజమానములైన దండకయందలి మహర్షుల యాశ్రమంబులం బ్రవేశించెను. ఆసీతారామలక్ష్మణులు మహర్షులచేఁ బూజింపఁబడినవారై, యొక్కొక్కయాశ్రమంబున కొన్నిదినములచొప్పున నివసింపఁదొడగిరి. అట్లు రెండు పర్యాయములు మహర్షుల యాశ్రమంబుల నుండఁగా నప్పటికిఁ బదిసంవత్సరములైనవి. ఈవిధగానుండి యామధ్యలో వారివారికింగలుగు నుపద్రవములను నివారించుచు, ధనుర్బాణములనుధరించి, సంచరించెను. ఈవిధముగాఁ గొందఱి యాశ్రమములందుఁ బదేసిమాసములును, గొందఱియాశ్రమంబులందు సంవత్సరము చొప్పునను, మఱికొందఱిదగ్గర నాలుగేసి, యైదేసి, యారేసి, మాసములచొప్పునను నివసించిరి. ఒకరియాశ్రమమునఁ బదమూఁడు, మాసములును నింకొకచో, నేడేసి, యెనిమిదేసి, మాసములును గడిపిరి. చివరకుఁ గొందఱి యాశ్రమములందు రెండేసి మూఁడేసి వారముల చొప్పునఁగూడ నివసించుచు, వారివారి యభీష్టానుసారముగాఁ గాలముంగడిపిరి. ఇట్లుపదివత్సరములుగడిపి,

మొదట సుతీక్ష్ణమహర్షికి మాటయిచ్చిన ప్రకారము నటనుండి మఱలి యా సుతీక్ష్ణాశ్రమమును జేరికొనిరి. శ్రీసీతారామలక్ష్మణు లచ్చట నామహర్షిచే నాదరింపఁబడిన వారై, యచటఁ గొంతకాలముండిరి. అట్లుండి యొకనాఁడు శ్రీరాముఁడు మహర్షింజేరి నమస్కరించి, యిట్లనియెను.

## శ్రీరాముని యగస్త్యాశ్రమ ప్రవేశము.

శ్రీరాముఁడు సుతీక్ష్ణమహర్షితో "మహాత్మా! ఈయరణ్యముననే 'అగస్త్యమహర్షి యున్నట్లు వింటిని. కాని యాతని యాశ్రమమున కెట్లు వెళ్ళవలయునో? మాకుఁ దెలియదు. దయచేసి యామార్గముం జెప్పి, యచ్చటకు వెళ్ళుటకు, మాకునను జ్ఞ నిప్పింపఁగోరెదను. మీ యనుగ్రహముచే నామహర్షిని దర్శించి, ధన్యుఁడ నౌదును. ఆమహర్షిని స్వయముగా సేవింపఁ గుతూహలుఁడ నైతిని. అనఁగా ధర్మాత్ముఁడైన శ్రీరాముని మాటలను విన్న మహర్షి యిట్లనియెను. ఓరామభద్రా! నేనును మీ ముఖ్యరను "నగస్త్యాశ్రమమునకు వెళ్ళుఁడ"ని చెప్పఁదలఁచితిని. ఇప్పుడు నీవేకోరితివి. చాలసంతోషమైనది. చెప్పెదను వినుము. ఇక్కడినుండి దక్షిణదిశగా, నాలుగుయోజనముల దూరమున, నగస్త్యభ్రాతయొక్క యాశ్రమముగలదు. అదియును మెట్టభూమియై యనేక పుష్పఫలభరితములైన చెట్లుగలిగి

యాచెట్లయందు మధురముగాఁ గూయుచున్న పక్షులుగల వనములతోఁ నిండి యుండును. అక్కడ ననేక పద్మసరస్సులు వివిధములైన జలపక్షులతోఁ గలకలలాడుచుండును. రామా! నీవాయాశ్రమమునఁనారాత్రి విశ్రమించి, మరునాఁడుదయముననే లేచి, యక్కడనుండి దక్షిణముగానున్న వనమునకుఁ బ్రక్కమార్గమున నొకయోజనదూరము, వెళ్ళినచో, నగస్త్యాశ్రమముగానఁబడును. ఆయాశ్రమమంతయును గడుంగడు రమ్యమైన వృక్షములతోఁ, వానిపై మధురముగాఁ గూయుచుండు పక్షులతోడను, నాహ్లాదకరమై యుండును. అక్కడ నీవు సీతాదేవితోడను దమ్ముఁడైన లక్ష్మణునితోడను సుఖముగానుండఁగలవు ఇంక నీవీరోజుననే ప్రయాణమగుము! అని యామహర్షి శుభాశీఃపూర్వకముగాఁ జెప్పిన మాటలను గ్రహించి, భార్యతోడను, దమ్మునితోడను, నప్పుడే ప్రయాణమయ్యెను. అట్లుపయనించి, త్రోవలో నాయావిశేషముల దర్శించుచుంబోయి, లక్ష్మణునిగాంచి, రాముఁ డిట్లనుచున్నాఁడు. లక్ష్మణా! సుతీక్ష్ణమహర్షి చెప్పిన, యగస్త్యభ్రాతయొక్క (సుదర్శనునియొక్క) యాశ్రమమిదియే యైయుండును. పిప్పలిచెట్లతోడను, బుష్పఫలభరితమైన వనములతోడను, నిండిన దీప్రదేశము. పిప్పలిపండ్లు బాగుగాఫలించి, వగరుసువాసనలతోఁ నిండి యున్నది. మహర్షు లక్కడక్కడ, ప్రోగులుగా గొట్టియుంచిన సమిధలును, బచ్చని వైడూర్యకాంతులనొప్పు దర్భలును గనిపించుచున్నవి. ఈవనమధ్యయందాశ్రమముండవలెను. కావుననే

యగ్నిహోత్రములయొక్క పొగలు పైకెగసి కనిపించు చున్నవి. ఈకొలనులయందు స్నానములుచేసి పువ్వులంగోసి కొని స్వయముగా నచ్చటచ్చట పూవులను బవిత్రస్థలంబు లందుఁ బడవైచినట్లు గనఁబడుచున్నవి. సుతీక్ష్ణమహర్షి చెప్పి నట్లే, యగస్త్యభ్రాతయొక్క యాశ్రమ చిహ్నములు గోచ రించుచున్నవి. చూడుము! లక్ష్మణా! ఈయన యన్నయైన యగస్త్యుఁడు తనతపోబలముచే, "వాతాపి-ఇల్వలుఁడు" నను రాక్షససోదరులంజంపి, యీవనమునంతను, నివాసయోగ్య మైనదిగాఁ జేసెను. ఆ చరిత్రంజెప్పెద నువినుము!

## అగస్త్యుఁడు - వాతాపిని నిల్వలుని జంపుట.

లక్ష్మణా! ఇక్కడనే పూర్వ మొకప్పుడు వాతాపి ఇవ్వలుఁడు నను బ్రాహ్మణహంతకులైన రాక్షస సోదరు లుండెడివారు. వారిలో నిల్వలుఁడు శ్రోత్రియ బ్రాహ్మణ రూపమునుధరించి, దారిగాచి "పితృకార్యమున్నది. మీర తిథిగారండు!" అని యాహ్వానించెడివాఁడు. ఆమాటలకు మోసపోయి వచ్చినవారికిఁ మేకరూపముననున్న, తనసోదరుని జంపి, యామాంసమును భోజనముగాఁ బెట్టెడివాఁడు. ఆబ్రాహ్మణులును దృప్తిగాభుజించి, విశ్రాంతిఁ దీసికొను చుండఁగా నా యివ్వలుఁడు "తమ్ముఁడా! వాతాపీ! ఇటు రమ్ము!" అని గట్టిగా నరచెడివాఁడు. అప్పుడా వాతాపి, మేకరూపముతో నరచుచు నాబ్రాహ్మణులఁ బొట్టలఁ జీల్చి

కొని బయటకు రాగాఁ జనిపోయిన బ్రాహ్మణుల నెప్పటి కప్పుడు వారిద్దరును గోసికొని యామాంసములను దినివేసెడి వారు. ఇట్లా రాక్షసులు చేయుచుండఁగా, నమాయిక బ్రాహ్మణులు వేలకొలఁదిగాఁ జనిపోయిరి. అప్పు డీరాక్షసులను జంపలేక దేవత లీయగస్త్యమహర్షి ని బ్రార్థించిరి. అగస్త్యుడును నొకనా డదేపనిగా నాదారినిబోవుచు నిల్వలునిచేఁ బ్రార్థింపఁబడి, వానియింట నతిథిగావెళ్ళి యాతనిచే, హస్తోదకముంగొని భోజనముచేసి, విశ్రాంతిగాఁ గూర్చొనెను.

ఇల్వలుఁడును నెప్పటిరీతిగా "వాతాపీ! వేగముగా నిటురమ్ము! అనిపిలిచెను. ఆమాటవిని యగస్త్యుడు నవ్వుచు "నాకడుపున మేకరూపముతో జీర్ణించికొనిపోయి, యమలోకమునకుఁ బోయిన నీతమ్ముఁడు మఱల నెట్లురాగలఁడురా ?" యనియెను. అంత నిల్వలుఁడు బ్రాహ్మణరూపమునువిడిచి రాక్షసరూపముతో నగస్త్యుని జంపఁబోయెను. అప్పు డామహర్షి కోపముతోఁ గనులెఱ్ఱఁజేసి చూడఁగా నాచూపులచేతనే వాఁడు భస్మమైపోయెను. ఓలక్ష్మణా! వింటివిగదా! అట్టిబ్రాహ్మణరక్షకుఁడైన యగస్త్య మహర్షి యొక్క తమ్ముఁడైన సుదర్శనమహర్షియొక్క యాశ్రమమే సుమాయిది! అనిచెప్పుచుండునంతలో సూర్యాస్తమయమైనది. అంత, శ్రీరామలక్ష్మణులు సాయంసంధ్యనుబూర్తిఁ జేసికొని, సీతాదేవితో నగస్త్యభ్రాతయొక్క యాశ్రమముం

ప్రవేశించి, మహర్షికిఁ బాదాభివందన మాచరించిరి. ఆమహా మునియు నారాత్రివారికిఁ జక్కని యాతిథ్యమిచ్చి గౌర వించెను. ఆవిధముగా శ్రీసీతారామలక్ష్మణు లారాత్రి సుఖ ముగా నాయాశ్రమమునగడపి, మరునాఁ డుదయముననే లేచి, స్నానసంధ్యాదులను బూర్తిఁగావించికొని, యగస్త్యభ్రాత యైన, యా సుదర్శనమహర్షి ని సందర్శించి, "మహాత్మా! మేము మీాయాతిథ్యమును గ్రహించి చాలసంతోషించితిమి. ఇఁక మీాయన్నగారైన యగస్త్యమహామునిని జూడఁగోరి వెళ్ళు టకు ననుజ్ఞ వేడుచున్నాము. అనఁగావిని యామహర్షి అట్లనే వెళ్ళుఁడని పలికెను.

## శ్రీరాముఁ డగస్త్యాశ్రమ ప్రవేశము.

సీతారామలక్ష్మణు లాయగస్త్యభ్రాత చూపించిన మార్గముననే ప్రయాణమై వెళ్ళిరి. అట్లు వెళ్ళుచుఁ ద్రోవలో ననేకనీవారములను (నెవ్వరిధాన్యపు మొక్కలు) జలకదంబము లను, బనస, దాడిమ మొదలగు ఫలవృక్షములను లతలతో నలుముకొని పుష్పించిన యనేకములైన పూలపొదలను, దర్శించుచుండిరి. మదించిన యేనుఁగుల, మదగండస్థలములను ఝుంకారములు చేయుచున్న తుమ్మెదలను, సీతకుఁ జూపిం చుచు రాముఁడు సుఖముగాఁ బయనించెను. అంత సీతాదేవికి వెనుకనుండివచ్చుచున్న లక్ష్మణునిజూచి, శ్రీరాముఁ డిట్లను చున్నాఁడు. లక్ష్మణా! అటుచూడుము! వృక్షములన్ని

యును దట్టమైన యాకులుగలవై, యున్నవి. లేళ్ళును బక్షులును ప్రశాంతముగా నటునిటు భూమ్యాకాశములం దిరుగుచున్నవి. దీనింబట్టి యగస్త్యాశ్రమము చాలాదగ్గరలో నున్నట్లు మన మూహించికొనవచ్చును. ఈయగస్త్యుఁడే వింధ్యపర్వతమును స్తంభింపఁజేయుటచేఁ దాను లోకమునఁ బ్రసిద్ధి నొందినవాఁడయ్యెను. ఇదిగో! ఇదియే యాతని యాశ్రమము. బడలికగొన్న సాధువులకు శ్రమను బోగొట్టునది యిదియే. ఆశ్రమమంతయు నగ్నిహోత్రములు గలిగి పైకివెడలుచున్న పొగలతో నిండియున్నది. మఱియు నిందలి చెట్లకు నారబట్టలు వరుసగాఁ గట్టఁబడియున్నవి. అడవియందలి క్రూరమృగములుసైతము నిచటఁ బ్రశాంతముగాఁ దిరుగాడుచున్నవి. వివిధపక్షిసంఘముల మధురధ్వనులు వినఁబడుచున్నవి. లక్ష్మణా! ఈవాతావరణమంతయును నా మహర్షియొక్క తపఃప్రభావమేసుమా! అందువలననే రాక్షసులెవ్వరు నీయాశ్రమముంజూచుటకైన శక్తి లేనివారగుచుందురు. అంతియేగాక భయముతో నల్లంతదూరమునుండియే పోవుచుందురు. ఎప్పు డీమహర్షి యిచ్చటఁ బ్రవేశించెనో, యదిమొదలు రాక్షసులు భయపడి యితనితో వైరమును విడిచిపెట్టి తిరుగుచుందురు. అసలీ 'దక్షిణదిశ' 'యగస్త్యదిశ'గా సార్థకనామమునందినది. నిర్మలాత్ములై, వినయవిధేయతలు గలవారికిమాత్రమే సేవింపఁదగిన యాశ్రమముసుమా! వెండియును వినుము! సూర్యగమన మార్గమునే. నిరోధించిన, వింధ్యపర్వత మీాతనియాజ్ఞాను

సారముగాఁ బెరుగక నిలిచిపోయినది. అంతటి మహాశక్తి సంపన్నుఁడైన యగస్త్యుని యాశ్రమ మియ్యది. ఈతఁడు సర్వ మునిజన పూజితుఁడు. సత్పురుషులచే సేవింపఁదగినవాఁడు. లక్ష్మణా! మనమితని సేవించుచు మిగిలిన వనవాసకాల మంతయు నిచ్చటనే గడుపుదము. తమ్ముఁడా! ఈయాశ్రమ మున సమస్తదేవ గంధర్వ యక్షగణంబులును, సిద్ధులును, జారణులు నీయగస్త్యమహర్షిని నిత్యమును సేవించు చుందురు.

శ్లో॥ నాత్రజీవే, న్మృషావాదీ, క్రూరోవా, యదివాశఠః।
నృశంసః కామవృత్తోవా, మునిరేష తథావిధః ॥
స. 11, శ్లో॥-90

తా॥ ఓతమ్ముఁడా! లక్ష్మణా! వినుము! ఈయాశ్ర మమునం దడుగుఁబెట్టిన ప్రతిజీవియు, నసత్యము, గ్రూర త్వము, మాయ, నీచప్రవర్తనము, దుష్కామవాంఛ, (స్త్రీలోలత్వము) మొదలగు దుర్గుణములు లేక పరస్పర స్నేహభావముతో మెలఁగవలసినదేసుమా! ఇట్లుండుటలో నగస్త్యమహర్షియొక్క తపఃప్రభావమే కారణము.

ఎంత క్రూరుఁడైనను దపశ్శక్తిగల మహర్షుల యాశ్రమములందు నప్రయత్నముగా శాంతస్వభావము గలవాఁడగుట సామాన్యధర్మము. (నేటికలికాలమునఁగూడ, లక్షలకొలఁదిగా జనసమూహములు, వివిధప్రవృత్తులుగల

వారు, సత్యసాయిబాబా, రమణమహర్షి, మొదలగువారి యాశ్రమములలో నప్పుడప్పుడు గలియుచుండుటయు, నిశ్శబ్దముగా నిర్మలాంతఃకరణులై, యచటగడపుటయుఁ బ్రత్యక్ష నిదర్శనములుగా మనము చెప్పవచ్చును.)

శ్రీరాముఁడు మరల నిట్లనుచున్నాఁడు. నాయనా! ఇచ్చట దేవ యక్షగణంబుల వారందఱును, వారివారి ధర్మము ననుసరించి, నియమితాహారవిహారములుగలిగి యుందురు. ఇచ్చట నున్న సిద్ధపురుషులు దేహములను విడచునప్పుడు సూర్యునివలెఁ బ్రకాశించు విమానములపై దేవలోకమునకుఁ బోవుచుందురు. ఇక్కడ నున్న దేవతలు, కొందఱికి యక్షత్వమును, గొందఱి కమరత్వమును గొందఱికి వివిధములైనరాజ్యభోగములను నిక్కడనుండియే యను గ్రహించుచుందురు.

శ్లో॥ ఆగతాస్మా శ్రమపదం, సౌమిత్రే! ప్రతిశ గ్రతః।
నివేదయేహ. మాంప్రాప్తం ఋషయే సీతయాసహ॥
స. 11, శ్లో॥-94

తా॥ లక్ష్మణా! ఇటు నాముందునకు రమ్ము! నీవీ యాశ్రమమునఁ బ్రవేశించి, నేనుసీతతోఁ బ్రవేశించి, మహర్షిని దర్శింపఁగోరినట్లుగా విన్నవించుము.

మహర్షుల యాశ్రమములకు స్త్రీలతోఁ గలిసివెళ్ళుట ధర్మముగాదు. కావునముందుగా వారి యనుమతిని బడయ వలయును.

శ్రీరామాజ్ఞను శిరసావహించిన లక్ష్మణస్వామి ముందుగా నగస్త్యాశ్రమ ద్వారముం బ్రవేశించి, యందున్న యగస్త్యమహార్షి యొక్క శిష్యునిజూచి, యిట్లు పలికెను. "ఓమునికుమారా! మేము దశరథపుత్త్రులము. నాయన్న శ్రీరాముఁడు. భార్యయైన సీతాదేవితో నీయడవులకువచ్చి, యగస్త్యమహర్షిని దర్శింపఁగోరుచున్నాఁడు. నేనాతని తమ్ముఁడను నాపేరు లక్ష్మణుఁడందురు. మాయన్న తండ్రి యొక్క యాజ్ఞను శిరసావహించి, యీయడవులం దిరుగుచు వచ్చియుండెను. మేము ముప్పారమును మహార్షులవారిని దర్శింపవచ్చితిమని మీగురుపాదులకుం దెలుపఁ బ్రార్థించుచున్నాను." అనఁగావిని యామునికుమారుఁడు లక్ష్మణు నటనిలిపి, లోనికింబోయి, యగస్త్యమహర్షితోఁ జరిగిన విషయమంతయును విన్నవించెను. అంతయు నెఱింగిన మహర్షి "ఓయీ! శిష్యా! అదృష్టవశాత్తుగాఁ జాలకాలమునకు శ్రీరాముఁడు భార్యతోడను లక్ష్మణునితోడను, నన్ననుగ్రహింప వచ్చినాఁడు. నేను జిరకాలమునుండి యీరామదర్శనమే కోరుచుంటిని. ఇంకను నాలస్యమేల! వేగముగానెళ్ళి వారిని దీసికొనిరమ్ము!" అనిపంపఁగా నాశిష్యుఁడు వినయవిధేయతలతో గురువునకు నమస్కరించి, ద్వారముకడకుఁబోయి, "లక్ష్మణా! సీతారాము లెక్కడనున్నారు? నీవుతొందరగాఁబోయి వారిందోడ్కొని,

మహర్షులవారివద్దకు రమ్ము! ఇదిమహర్షుల యాజ్ఞ" అని చెప్పెను. ఇంతలో సీతారామలక్ష్మణులు, నాద్వారమువద్దకు రాగానే, యాశిష్యుఁడును సగౌరవముగా వారిని లోపలఁ బ్రవేశ పెట్టెను. అట్లు వారులోపలఁ బ్రవేశించి, యందలి బ్రమ్మస్థానము నగ్నిస్థానమును, విష్ణుస్థానము నింద్రస్థానమును సూర్యస్థానమును, జంద్రస్థానమును, భగునిస్థానమును, గుబేర స్థానమును, దర్శించుచు, నాయాస్థానములందలి దేవతా మూర్తులకు నమస్కరించుచు, వెడలుచుండిరి. మఱియు ధాతృస్థానమును, విధాతృస్థానమును, వాయుస్థానమును నాగేంద్రస్థానమును, గాయత్రీస్థానము, నష్టవసువుల స్థానము లను, వరుణస్థానమును, గుమారస్వామి స్థానమును, ధర్మ స్థానమును శ్రీరాముఁడు దర్శించెను. ఇంతలో నగస్త్య మహర్షి శిష్యసంఘపరివృతుఁడై, శ్రీరాముని కెదురుగా వచ్చు చుండ శ్రీరాముఁడు దూరమునుండియే చూచెను. అంత లక్ష్మణుజూచి రాముఁడు"తమ్ముడా! మహర్షులవారిటేవచ్చు చున్నారు. చూడుము! ఇతఁడు తపస్సులకుగని. ఈతని కెదురుగా మనముపోయి నమస్కరించుదము. అదిగో! ఆ తేజస్సుచేత నేయితఁ డగస్త్యుఁడని తెలియుచున్నదిసుమా! అనుచునే ముందుగా నెదురేగి, శ్రీరాముఁ డగస్త్యునకుఁ దానును సీతయు లక్ష్మణుఁడును బాదాభివందనములాచరించిరి. మహర్షియును వచ్చిన యతిథులకు నర్ఘ్యపాద్యములనిచ్చి, యాసనముఁజూపి, కూర్చుండఁజేసి, కుశలప్రశ్నలఁ గావిం చెను. తరువాత వైశ్వదేవ మాచరించి, వానప్రస్థ ధర్మాను

సారముగాఁ గందమూలఫలాదికమగు నాహారమొసఁగి, సంపూర్ణాతిథ్య మొసఁగెను. అంతనామహర్షి ధర్మవేత్త యగుటచేఁ దానుముందుగా నాసనముపైఁ గూర్చొని, తరువాత శ్రీరామలక్ష్మణులను సీతను గూర్చుండఁజేసి యిట్లను చున్నాఁడు.

శ్లో॥ అగ్నింహుత్వాప్రదాయార్ఘ్యం అతిథింప్రతిపూజయేత్।
అన్యథాఖలు కాకుత్థ్సః తపస్వీ సముదాచరన్ ।
దుస్సాక్షీవ పరేలోకే, స్వానిమాంసాని భక్షయేత్॥

స. 12, శ్లో॥-29

తా॥ ఓరామచంద్రా ! గృహస్థుగాని, వానప్రస్థ గాని, రాగా ముందుగా, నిత్యాగ్నిహోత్రముగావించి, యాపైని వచ్చినవారికి నర్ఘ్యపాద్యాదులతో నాతిథ్యమిచ్చి గౌరవించవలెను. అట్లుగానినాఁడెంతటి తపస్వియైనను, కూటసాక్ష్యమును జెప్పినవానివలె నరకమునఁ బడి, తనశరీరమును దానే కోసికొని తినుచు కష్టము ననుభవించును.

నిత్యమైన యగ్నిహోత్ర వైశ్వదేవములను మాని, నైమిత్తికమైన యతిథిపూజాదులఁగావించుట ధర్మముగాదు.

శ్రీరామప్రభూ ! నీవుసర్వలోకేశ్వరుండవు. మహా యశస్సంపన్నుండవు. ఎవరిచేనైన గౌరవింపఁబడి పూజింపఁ దగినవాఁవు. అట్టినీవు నాకతిథిగావచ్చితివి. అనుచు శ్రీరాముని వినుతించి, యగస్త్యుఁడు మఱలనిట్లనియెను. రామభద్రా ! ఇదిగో ! ఈధనుస్సు విష్ణుసంబంధమైనది. బంగారుమయమై,

రత్నము బొదగఁబడినది. దీనిని దేవశిల్పియైన విశ్వకర్మ తయారుచేసినాఁడు. మఱియు, సూర్యతేజస్సుగల యీ బాణముం జూడుము! దీనిని నాకాబ్రహ్మదేవుఁ డొసంగినాఁడు. వెండియు నీయక్షయతూణీరములను (ఎన్నిఁటినితీసినను నిత్యము నెప్పటికప్పుడు నిండుగానుండు నమ్ములపొదులను) నాకు దేవేంద్రుఁడొసంగినాఁడు. ఇందలి బాణము లన్నియు నగ్నిజ్వాలలవంటివి. ఇంకను జూడుము. ఈఖడ్గము వెండియొరలో, బంగారుపిడితో తయారు చేయఁబడియున్నది. మహావిష్ణువుంబోలి, రాక్షస సంహారమును గావింప, వీనినిగైకొని నీవు విడువక ధరించుము! అని శుభాశీఃపూర్వకముగా శ్రీరామున కాధనుస్సు మొదలగువానినొసంగి, మఱల నిట్లనుచున్నాఁడు. రామా! రాక్షససంహారమొనర్చెడు మహావిష్ణునివలె వీనిగైకొని ప్రకాశించఁగలవు.

## శ్రీరాముఁ డగస్త్యునాజ్ఞపైఁ బంచవటిం జేరుట.

ఓ శ్రీరామలక్ష్మణులారా! సీతాదేవితోఁగూడి నన్ను సందర్శించి, నాకుమీరు మహదానందమును జేకూర్చిరి. మీరు మిక్కిలి మార్గాయాసము నందియున్నారు. ఇంక నీయబలయైన సీతాదేవింగూర్చి వేరుగాఁ జెప్పనేల? ఈమె మిక్కిలి సుకుమారి. ఈమే కేవల భర్తృశుశ్రూషారతయై, యింతటి కష్టములతోఁగూడిన వనవాసనమునకు నీతో వచ్చిన పరమసాధ్వీమతల్లి. కావున నీమెను సర్వదా సంతోషపెట్టు

చుండుము. సామాన్యముగా స్త్రీలు స్వభావము ననుసరించి, యనుకూలుఁడైన భర్తను విడువరు. అట్లుగాక తరచుగా బాధించు భర్తను విడిచిపెట్టెదురు. వారికి మెరుపుతీగెల చాంచల్యమును, శస్త్రాస్త్రముల వాడితనమును, గరుత్మంతుఁడు, వాయుదేవుఁడు ననువారి వేగమును, గలిగి యుందురు. ఈసీతాదేవి స్వభావసిద్ధముగనే యేదోషము లును లేనిదై యరుంధతీదేవివలె, శ్లాఘనీయమైన పాతివ్రత్యముగలిగి స్త్రీరత్నముగాఁ బేరొందఁదగియున్నది. శత్రుసంహారకుఁడవైన శ్రీరామమూర్తీ! లక్ష్మణునితోడను, సీతాదేవితోడను, నీవీప్రదేశమున నుండుటచే, దీనికొక గొప్ప యలంకారముగలిగి శోభాయమానమైనది. ఈవిధముగా నగ్నిజ్వాలవలె బ్రహ్మతేజస్సుతోఁ బ్రకాశించు నగస్త్యుని మాటలను విని శ్రీరాముఁడు వినయవిధేయతలతో నిట్లను చున్నాడు.

ఓమహర్షివరేణ్యా! మాయందు నింతటివాత్సల్య మును జూపించిన, మీచే ననుగ్రహింపఁబడి ధన్యులమైతిమి మహాత్మా! సర్వవిధములను వాసయోగ్యమైన ప్రదేశమును మాకుఁ దెలియఁజేయ వేడెదను. ముఖ్యముగా నీసీతాదేవికి నానందమును గలుగఁజేయు ప్రకృతిసౌందర్యముగల ప్రదేశము నాలోచించుము. అట్టిప్రదేశముననే మేము నివ సింతుము. అనఁగావిని యగస్త్యమహర్షియుఁ గొంతఁదడవు కన్నులుమూసికొని ధ్యానించినవాఁడై, ధీరోదాత్తమైన

డైన, యాజటాయువునకు నమస్కరించి, తండ్రిని జూచి నంతగా నానందించి, గౌరవించెను. అప్పుడాపక్షి తనను గూర్చి శ్రీరామునితో నిట్లుచెప్పఁదొడంగెను.

ఓమహాబాహూ! రామమూర్తీ! పూర్వము ప్రజాపతు లనువారెందరుగలరో వారినామధేయములను జెప్పెదను. వినుము! మొదటివాఁడు కర్దముఁడు. ఆతని తరువాత వరుసగా, విక్రీతుఁడు, సంశ్రయుఁడు, శేషుఁడును, గలిసినలుగు రుండిరి. విక్రీతుఁడు మహాబలశాలి. అనేకులఁ గుమారులఁ గన్నవాఁడు. ఆనలుగురు తరువాతను, స్థాణువు మరీచి, యత్రి, శతక్రతువు, (ఇతఁడుమహాబలుఁడు) పులస్త్యుఁడు, నంగిరుఁడు, ప్రచేతనులు, పులహుఁడు, దక్షుఁడు, వివస్వంతుఁడు, ననువారు ప్రజాపతులైరి. అనంత రము, మహాతేజశ్శాలియగు నరిష్టనేమియుఁ గశ్యపుఁడును, ప్రజాపతులైరి. మహాతేజ శ్శాలియై యశస్సంపన్నుఁడైన దక్షప్రజాపతికి, నరువదిమంది కుమార్తెలుగలిగిరి. వారిలో, నదితి దితి, వసువు, కాళిక, తామ్ర, క్రోధన, మనువు, అనల, యను నెనమండ్రు సుందరాంగులను, గశ్యపుఁడు వివాహ మాడెను. ఆకన్యక లాభర్తంగూడి, మాతోసమానులై మహాపరాక్రమవంతులైన పుత్రులను ప్రసాదించుమని వేడికొనిరి. అంత నాతఁడు ముల్లోకములను బాలింపఁగల, నన్నుబోలు కుమారులం గనఁగలరని చెప్పెను. అంత, నాయదితి, దితి, కాళిక, యనువారు కశ్యపునివాగ్దానమును

నమ్మి గౌరవించిరి. మిగిలిన యైదుగురును ననాదరము చూపిరి. శత్రుసంహారకుఁడవైన యోరామా! అదితి యందాదిత్యులును, ముప్పదిమూఁడుకోట్లదేవతలు, నుద్భ వించిరి. అందు నాదిత్యులును వసువులును, రుద్రులును, నశ్వనీదేవతలును, నాయదితియందే జన్మించిరి.

కశ్యపమహర్షి మొత్తముగా నెనమండుగురు కన్యలను జూచి, ప్రేమపూర్వకముగా "నోకన్యలారా! మీారంద ఱును ముల్లోకములం బాలింపఁగల పుత్రులం గనుఁడు!" అనియెను. అందు దితి, యదితి, కాళిందియును భర్త్రాశాస నము ననుసరించిరి. మిగిలినవారు తూష్ణీంభావమును వహించిరి. అదితి పైనఁజెప్పిన విధముగా నాదిత్యాదులం గనియెను. దితి మాత్రము మహాబలులైన దైత్యులం గనినది. ఈవిధముగా భూమియంతయు నాదిత్యులతో నిండినది. ఓదాశరథీ! మనువు హయగ్రీవుని గనియెను. కాళికనరకుఁడు కాలకుఁడు ననువారిని గన్నది. తామ్రయనునామె క్రౌంచపక్షులను, డేగలను, ధృతరాష్ట్రి యను పక్షులను, బకములను, లోక విఖ్యాతిని గలవారినిగాఁ గన్నది. అందుఁ గ్రౌంచి యనునామె గుడ్లగూబలను భాసియను నామె భాసపక్షులను గనియెను. శ్యేని డేగలను, గ్రద్దలను గనెను. ధృతరాష్ట్రి కలహంసలను, రాజహంసలను, హంసలను, జక్రవాకములను గనెను. శుకి యనునామె 'నత'ను బ్రసవించినది. అనతకు వినత పుట్టినది.

క్రోధవశయను కశ్యపునిభార్యకు మృగమంద మృగియు, నామెకు హరి, భద్రమద, శార్దూల, శ్వేత, సురభి, సర్వ లక్షణ సంపన్నయగు సురస, కద్రువ, యనువారు జన్మించిరి. మృగియను దానియందు సమస్తలేళ్ళగుంపులును జన్మించినవి. మృగమంద యనుదానికి నెలుగుబంట్లును, బెద్దపెద్దసవరపు మృగములును, జమరీమృగములును, బుట్టినవి. హరియను దానికి బలిష్ఠములైన సింహములును, వానరములును జన్మించి నవి. తరువాత నిరావతియను నామె భద్రమంద యను కుమార్తెం గనియెను. ఆమె కుమారుఁడే యైరావతుఁ డనఁ బడులోకనాథుఁడైన మహాగజ ముద్భవించినది. ఓమానవేంద్రా! రామా! మాతంగియనుదానికి యేనుగులన్ని యును జన్మించినవి. మఱియు నామెగోలాంగూలములను నాడ మగ పెద్దపులులను, శ్వేత, దిగ్గజములను గనియెను. శ్రీరామభద్రా! సురభి రోహిణిని యశశ్విని యగు గంధర్వినిం గనియెను. అందురోహిణి గోవులను, గంధర్వి గుఱ్ఱములను, సురస నాగులను, కద్రువ పన్నగములను, గనిరి. మనువనువాఁడు కీర్తిమంతులైన మానవులను గనియెను. వీరే బ్రహ్మక్షత్రియ విట్ఛూద్రులుగానైరి. కశ్యపుని భార్యలలో నొకతె పుష్పఫలభరితములైన వివిధవృక్షములను గనియెను. వినత యను నామె రుచికి మనుమరాలు. ఆమె కద్రువ సురసలకుఁ దోఁబుట్టువు. ఆకద్రువ కుమారుఁడే వేయిపడగలతో నీభూమి నంతను మోయఁగల యాదిశేషువు. వినీతకుమారులు గరుఁడుడు నరుణుఁడు ననువారు.అందు నరు

ణుని వలన నేనును నాయన్న సంపాతియును బుట్టితిమి. శ్యేనియందు జన్మించిన నన్ను జటాయువని యందురు. శ్రీరామభద్రా! నీయాజ్ఞయైనచోఁ గ్రూరమృగముల తోడను, రాక్షసులతోడను నిండిన, యీయరణ్యమున, మీసోదరులకును సీతకును నేయాపదలును గలుగకుండ రక్షించఁగలను. ఈవిధముగా నీతండ్రికి మిత్రుఁడనని చెప్పుచు దనవంశక్రమమంతయును జెప్పిన జటాయువును శ్రీరాముఁడు కౌఁగిలించికొని, మహదానందముతోఁ బితృగౌరవముం జూపుచుఁ బూజించెను. అట్లు మహాబలశాలియగు జటాయువుతోడను, లక్ష్మణునితోడను, సీతాదేవితోడను, బంచవటిం బ్రవేశించి, యచ్చటి రాక్షసులనందఱ నగ్నిలోఁబడ బోవు మిడుతలదండుగా శ్రీరాముఁడు భావించెను.

## సీతారామలక్ష్మణుల - పంచవటీ నివాసము.

శ్రీరాముఁడు పంచవటింజేరి యందగస్త్యమహర్షి చెప్పిన నానావిధ జంతుజాలముం జూపుచు లక్ష్మణునితో నిట్లనుచున్నాడు. లక్ష్మణా! మనకు మహర్షులవారు గుర్తుగాఁ జెప్పిన పంచవటిక్షేత్ర మిదియేసుమా! నీవు ఒకమారీ ప్రదేశము నంతను, శ్రద్ధగాఁ బరిశీలించుము. మన మేస్థలమున, నాశ్రమమును నిర్మించికొని సుఖముందుమో, బాగుగాఁ బరిశీలించుము. సీతాదేవియు, మనమిరువురమును, హాయిగా విహరించుటకు నదీప్రవాహము దగ్గరలో నున్న ప్రదేశము

నెంపికఁజేయుము. ఫలపుష్పములును, దుంపలును, దగ్గరలో లభించవలెను. అనగావిని లక్ష్మణుఁడు వినయముతో సీతాదేవి వినుచుండగా, రామునితో నిట్లనుచున్నాఁడు.

శ్లో॥ పరవానస్మి కాకుత్స్థ, త్వయి వర్షశతం స్థితే।
స్వయంతు రుచిరేదేశే, క్రియతా మితిమాం వద ॥
స. 5, శ్లో॥-7

తా॥ ఓయన్నా! రామా! నాయొక్కనిర్ణయము, నీనిర్ణయమువలె, సార్వకాలికమై స్థిరమైనదిగాదు. నాయునికి కేవలము పరతంత్రమైనది. (పారతంత్ర్య మనుదానిని, బరమాత్మావస్థయందేగాక, యవతార విశేషమునందును బాటించవలసినదే యనియిందలి సారాంశము.)

భక్తుడైనవాని కార్యములన్నియును బరమాత్మకు నర్పణఁజేయుచునే నెరవేర్చికొనవలయును. అది భగవదాజ్ఞగనే చేయవలెను. (ఇదేనిష్కామకర్మ.)

లక్ష్మణుని మాటలకుఁ బరమానందభరితుఁడైన శ్రీరాముఁడు, తమ్మునితోఁగలిసి వాసయోగ్యమైన ప్రదేశమును బరిశీలించి, యా తమ్మునితో నిట్లనుచున్నాఁడు. ముందుగాఁ దమ్ముని జేయివట్టుకొని, యాప్రాంతమంతయును దిరిగివచ్చి యిట్లనియెను. లక్ష్మణా! ఈప్రదేశము పూలమొక్కలతోడను ఫలవృక్షములతోడ నందముగా నున్నది. ఇచ్చట నాశ్రమనిర్మాణము గావించికొందము. ఇక్కడకు దగ్గరగా పద్మసరస్సు సుగంధమును వెదఁజల్లుచు నానందింపఁ జేయు

చున్నది. మఱియు నీసమీపముననే పద్మకారండవ సంకీర్ణమై, పూలచెట్లతో నిండిన యొడ్డు గలదై, హంసలతో నిండిన గోదావరి యగస్త్యుఁడు చెప్పినట్లే యున్నది. ఓయీ! లక్ష్మణా! ఇటుచూడుము. మిక్కిలిదగ్గరగను దూరముగను గాక పొడవుగా వ్యాపించిన పర్వతములు గనుపించుచున్నవి అన్నియును రమణీయములై, యీయీసుందర దృశ్యము లతోఁ బ్రకృతియంతయు బ్రకాశించుచున్నది. ఇటు చూడుము! మిక్కిలిదూరమును దగ్గరయును గాక, యీ లేళ్ళన్నియు నందముగా బెదురుచూపులతో గంతులువైచుచుఁ దిరుగుచున్నవి. ఈకొండలన్నియును, రంగురంగుల ధాతువులతో వెలిగిపోవుచున్నవి. కావున నివి, రంగురంగులుగల యలంకారములను ధరించినవివలె నున్నవి. లక్ష్మణా! ఈపుణ్యక్షేత్రమున జటాయువుతోఁగూడి, సుఖముగా నివసించుదము. ఆమాటలు విన్న లక్ష్మణుఁడు నతివేగముగా వాసయోగ్యమైన యొకపర్ణశాలను నిర్మించెను. అప్రాంత మందుఁగల బలమైన కఱ్ఱలతోడను, మట్టితోడను, వెదుళ్ళతోడను, విశాలమైన గదులును, వరండాలును, గలుగునట్లు దానిని నిర్మించెను. తరువాత గోదావరీనదికి వెళ్ళి, యాలక్ష్మణుఁడు పద్మములదెచ్చెను. వానితో నాపర్ణశాలకు శాంతి మొదలైనవి గావించి, సీతారాములతోఁ దానును బ్రవేశించుటకు నేర్పాటు గావించెను. ఆపర్ణశాలను జూచిన సీతాదేవి గొప్పగా నానందించినది. శ్రీరాముఁడును లక్ష్మణ స్వామిని గాఢముగా నాలింగనముగావించి, యిట్లనెను.

లక్ష్మణా ! నీవింతటి మహత్కార్యము గావించితివి. దీనికిఁ బ్రతిగా నీయాలింగనముదప్ప నేమి యీయఁగలను ! తమ్ముఁడా ! నాభావములను బుణికిబుచ్చికొన్నవాఁడవు. కృతజ్ఞుఁడవు. మఱియు సర్వధర్మముల నెఱింగినవాఁడవు. అట్టి నీవు నాప్రక్కనుండుటచే, మనతండ్రి చనిపోయినను బ్రతికి యున్నట్లే నిర్విచారముగా నుంటినిసుమా ! ఈవిధముగాఁ బలుకుచు సీతాదేవింగూడి యాపర్ణశాలయందు సుఖముగాఁ గాలముగడుపుచుండెను. అట్లు సీతారామలక్ష్మణు లాపంచవటీక్షేత్రమునఁ బర్ణశాలయందు, దేవతలు స్వర్గమందున్నట్లుగా నిర్విచారముగాఁ గాలము గడుపుచుండిరి.

## గోదావరీ తీరప్రకృతి సౌందర్యము.

సీతారామలక్ష్మణు లాపంచవటియందుండగా హేమంత ఋతువు ప్రవేశించినది. అట్లుండ నొకానొకరోజునఁ దెల్లవారుజామున శ్రీరాముఁడు సీతాదేవితోఁగూడి, స్నానార్థమై గోదావరీనదికి వెడలెను. పరాక్రమశాలియైన లక్ష్మణుఁడు పాత్రను ధరించి, వారివెంట నేగుచు, నన్నతో నిట్లనియెను. అన్నా ! నీకుఁబ్రియమైన హేమంతము, సంవత్సరమంతకును, నలంకారభూతమై యారంభమైనది. ఈకాలమున మంచుబాగుగాఁబడుచుండుటచే జనులయొక్క శరీరములు బాగుగా బిరుసెక్కి యుండును. భూమియంత యును బంటలతోఁ గలకలలాడుచున్నవి. అగ్నిహోత్ర

మానందదాయకముగా నుండును. ప్రజలు కామోద్రేకము గలిగి యుందురు. గోక్షీరములు సమృద్ధిగా లభించును. రాజులుత్సాహముతో జైత్రయాత్రఁ గావించుదురు. సూర్యుఁడు దక్షిణదిశనుండుటచే నుత్తరదిశ వెలవెలఁబోవుచుఁ దిలకము లేనిదివలె నున్నది. సహజముగనే మంచుతో నిండిన హిమవత్పర్వతమునకు సూర్యుఁడు దూరమగుటచే, మఱింతగా గడ్డగట్టియుండును. మధ్యాహ్నవేళలు సుఖస్పర్శలుగలిగి యుండును. రాత్రివేళలు సుదీర్ఘములై యారుబయట నిద్రించుటకుఁ గష్టముగానుండును. ఈకాలమున సూర్యతాపము ప్రచండముగా నుండదు. మంచుచేఁ గొట్టఁబడుట వలన నడవియందలి చెట్లుయాకులు రాలిపోయి శూన్యములై, మొరడువారి యుండును. చంద్రుఁడు తనసౌభాగ్యము నంతనుసూర్యునకిచ్చి, హిమకిరణములచే నెఱ్ఱబారిన బింబము గలవాఁడై, నిట్టూర్పులచే వెలవెలఁబోవు నద్దమువలె నున్నాఁడు. పశ్చిమమునుండి వచ్చువాయువు సహజశీతలమగుటచే, మంచువలన మఱింతఁ జల్లనై వీచుచున్నది. ఈ యరణ్యము పొగమంచుచేనిండి,యవలును, గోధుములును గలిగియున్నది. వరిచేలు ఖర్జూరపుఁ బుష్పములవలె శిరస్సులు వంచి, పడియున్నవి. సూర్యుఁడు మధ్యాహ్నకాలమునఁ గూడ మంచుచేఁ గొట్టఁబడినవాఁడై, చంద్రునివలెఁ బ్రకాశించుచున్నాఁడు. అడవులయందలి పచ్చికబయళ్ళు మంచు పడుటచే, వానిపై లేతయెండ ప్రసరించుటచే, నందముగాఁ గనుపట్టుచున్నవి. దాహముదీర్చికొనుటకై వచ్చిన యేనుఁగు

నీటిలోఁ దనతొండమునుంచి యాచల్లఁదనమును భరించలేక వెనుకకు మరలించికొనుచున్నది. ఈజలపక్షులుగూడ నీటి చల్లఁదనమును భరించలేక యొడ్డుననే మసలుచున్నవి. వనము లన్నియును బుష్పరహితములై కనుపట్టుచున్నవి. కొండపై నుండి యెండవేడిచే కరిగి, క్రిందుగాజలరూపమునఁ బ్రవహించుచున్నను, ముట్టుకొనుటకు వీలుగాక చల్లనై యున్నది. చెఱువులందలి పద్మములు మంచుచేఁగొట్టఁబడిన దళములుగలవై, తూడులుమాత్రమే మిగిలినవై శోభించుట లేదు. రామచంద్రా! ఇంతటి కష్టతరమైన ఋతువునందుఁ గూడ భరతుఁడు తెల్లవారుజాముననేలేచిస్నానసంధ్యాదులను గావించుచునే నీభక్తుఁడై తపస్సునాచరించుచున్నాడు. వివిధములైన రాజ్యభోగములను విడిచి చల్లనినేలపైఁ బరుండి యాహారనియమములను బాటించుచున్నాఁడు.

రామా! నీయందలి భక్తితాత్పర్యములతోఁ దనసుఖముల నన్నిఁటిని విడిచి, నీరాకకొఱకుఁ దపస్సుచేయుచున్నాఁడు. సరిగా నిదేసమయమున, నయోధ్యలోఁ దోటివారితోఁగలిసి సరయూనదికేగి, స్నానసంధ్యాదుల నొనర్చుచుండునని భావించుచున్నాను. అతఁడు సత్యప్రియభాషి! పొడవైన బాహువులు గలవాఁడు. శత్రుసంహారకుఁడు. అట్టి భరతుఁ డీమంచుతోఁ జలి వడకించుచుండఁగా, స్నానాది నియమముల నెట్లు పాలించుచున్నాఁడోగదా? మఱియు, గురువైన వసిష్ఠుని యాజ్ఞానుసారముగా నియమపాలనఁ

జేయుచుండవచ్చును. లోకములో సామాన్యమానవులు మాతృస్వభావము గలిగియుందురు. కాని భరతుఁడు మాత్ర మట్లుగాక పితృస్వభావమునే గలిగి, వంశమర్యాదను నిలుపుచుండుట విశేషముగదా! మహారాజైన దశరథుని భార్యయైన కైక యింతటి క్రూరస్వభావము గలదియగుట వింతగాఁదోచును. అనఁగా విని శ్రీరాముఁడిట్లనుచున్నాఁడు.

శ్లో॥ న తేఽమ్బా మధ్యమా తాత! గర్హితవ్యా కథంచన।
తామే వేక్ష్వాకునాథస్య, భరతస్య కథాంకురు!॥
స. 16, శ్లో॥ 37

తా॥ నాయనా! లక్ష్మణా! నీరెండవ తల్లియైన కైకనుగూర్చి, నిందించకుము. నీకైనంతవరకును భరతునిగూర్చి, యెంతయైనను జెప్పుము. సంతోషింతును.

ఎట్టిపరిస్థితులందును మాతృదూషణ, ధర్మముగాదు. శక్తివంచనలేక యామెను గౌరవించుటయే పరమధర్మము.

తమ్ముఁడా! నేను వనవాసముచేయుటకు ధృఢనిశ్చయుఁడనైతిని. అయినను భరతునివిషయమై, యప్పుడప్పుడు, బాధపడుచునే యుందును. ఆతఁడువలికిన హృదయపూర్వక మధుర వాక్యము లమృతమువలె నామనస్సు నలరింపఁజేయుచుండును. వాని నెన్నఁటికిని మరువలేను. లక్ష్మణా! అట్టి భరతశత్రుఘ్నులతోడను, నీతోడనుగలిసి, యెప్పుడుందునో

గదా ? ఈవిధముగాఁ బ్రసంగించుచు, నామువ్వురును గోదావరీ స్నానము లాచరించిరి. తరువాత శ్రీరామలక్ష్మణులు పితృదేవతలకును, దేవతలకును దర్పణములఁ గావించి, సూర్యునితోఁగూడ సర్వదేవతలను బూజించిరి అట్లు పార్వతీ నందీశ్వరులతోఁగూడిన, శంకరునివలె, శ్రీరాముఁడు సీతాలక్ష్మణులంగూడి, ప్రకాశించుచుఁ బర్ణశాలలోఁ బ్రవేశించెను.

## శ్రీరాముని బర్ణశాలా నివాసము - శూర్పణఖ రాక.

శ్రీరాముఁడు లక్ష్మణునితోడను, సీతతోడను ప్రాతఃకాల కర్మలనన్నిఁటిని బూర్తిచేసెను. ఆప్రాంత మహర్షులురాగా, వివిధములైన ధార్మికకథలను జెప్పికొనుచుఁ గాలము గడుపుచుండెను. అచ్చట శ్రీరామచంద్రుఁడు, చిత్తానక్షత్రముతోఁగూడిన చంద్రునివలె, సీతాదేవితో నుండెను.

ఇట్లుండ సీతాసమేతుఁడైన శ్రీరాముని సన్నిధికి 'శూర్పణఖ' యను రాక్షసి వచ్చినది. విశాలవక్షుండును, నాజానుబాహుండును, బద్మపత్ర విశాల నేత్రుండును, గజగమనుండును, జడలు ధరించియున్నను మహారాజ తేజోవిరాజమానుండును, మహాశక్తి సంపన్నుఁడును, సుకుమార దేహుండునునైన శ్రీరామునిజూచిన యారాక్షసి, మోహపరవశమైనది. ఆరామునకును రాక్షసికిని యన్నివిషయములందును హస్తి మశకాంతరము గలదు. లావెక్కి ననడుమును,

విశాలమైన ముఖమును, జింపిరిజుట్టును, క్రూరములైన మాటలునుగలిగిన యారాక్షసి, రామునికంటెను రెట్టింపు వయస్సుగలదై యున్నది. అట్టియామె రామునుంజూచి యిట్లనుచున్నది. ఓయీ! జడలు ధరించి, స్త్రీని వెంటఁబెట్టికొని, ధనుర్బాణముల ధరించి, యీరాక్షస సంచారముగల యరణ్యముల కేలవచ్చితివి? ఇంతకును నీవెవరవు! అనఁగావిని, సత్యశాంత స్వభావుఁడైన శ్రీరాముఁ డిట్లనుచున్నాఁడు. నేను సత్యవాదిని. విశేషించి స్త్రీలసమక్షమున నసలే యనృతమును బలుకను. వినుము! ఇంద్రసమాన పరాక్రముఁడైన దశరథుఁడను మహారాజుగలఁడు. అతనికి నేను బెద్దకుమారుఁడను. నన్ను రాముఁడని పిలుచుదురు. ఈతఁడు నాతమ్ముఁడు. లక్ష్మణుఁడు. ఈమె నాభార్య సీతయందురు. మేము మాతండ్రిగారి యాజ్ఞానుసారముగా, నీవనవాసము చేయుచున్నాము. ఈమె జనకమహారాజుయొక్క కుమార్తె. ఇఁక నీవెవరవు? నీచరిత్రయెట్టిది? తెలియఁజేయుము. ఇంతయందగత్తెవైన నీవు సామాన్యురాలవుగావు. ఇక్కడికి నీవేలవచ్చితివి? నిజము దెలియఁజేయుము. అనఁగా, నామెయిట్లనుచున్నది.

రామచంద్రా! వినుము! యథార్థము చెప్పుచున్నాను. నేను'శూర్పణఖ' యను పేరుగలదానను. సర్వభయంకరముగా నీయడవియందు నేకాకినై తిరుగుచుందును. విశ్వతో బ్రహ్మ కుమారుఁడై, మహాపరాక్రమశాలియై,

మూఁడులోకములను జయించిన రావణునకుఁ జెల్లెలను. నా రెండవయన్న కుంభకర్ణుఁడు. అతఁడెల్లకాలమును నిద్రాపరవశుఁడైయుండును. మూడవయన్న ధార్మికచింతనతో రాక్షసగుణములు లేనివాఁడు. అతఁడే విభీషణుడు. మఱియు ననేకయుద్ధముల నారితేరిన ఖరదూషణులనువారుగూడ నాయన్నలే. అట్టివారి నెల్లరను విడిచి, నిన్నుజూడఁగనే పురుషోత్తమునిగా భావించి నిన్ను బెండ్లాడవలెనను కామవాంఛతో నిట్లువచ్చితిని. నేను గొప్పప్రభావముగల కామరూపిణిని. నాబలమును బుంజుకొని, నిర్భయముగా సంచరించఁగలను. నన్ను జేపట్టి సుస్థిరముగా సుఖించుము. ఈమానుషస్త్రీయైన సీతతో నేమిసుఖపడఁగలవు? నీవనుమతించినచో నీలక్ష్మణునితోఁగూడ సీతను భక్షించి నీతో నేయడ్డును లేకుండనుండి, నిన్నుసుఖపెట్టఁగలను. మనమీసుందరారణ్యములలో స్వేచ్ఛగా విహరించుదము. అనఁగా నాశూర్పణఖ మాటలను విని శ్రీరాముఁడు చిరునవ్వునవ్వుచుఁ జక్కని మాటలతో నామెకు సమాధానము చెప్పెను.

## శూర్పణఖకు ముక్కును జెవులను గోయుట.

ఓశూర్పణఖా! నేను భార్యతో నున్నాను. ఈసీతయే నాధర్మపత్ని. నాతమ్ముఁడీతఁడు మంచిశీలసంపదఁగలవాఁడు. ప్రస్తుతమున కిచ్చట భార్యలేనివాఁడై యున్నాఁడు. మహాపరాక్రమశాలి. నీకు సర్వవిధములను, భర్తకాఁగలిగినవాఁడు.

కావున మేరుపర్వతమును సూర్యప్రభవలె సీతనిని వరించి పెండ్లాడుము. అని రాముఁడు చెప్పగావిని లక్ష్మణు నాశ్రయించి, యామె యిట్లనుచున్నది. ఓయీ! సౌందర్యరాశీ! నన్ను వరించుము. మన మీప్రకృతి సౌందర్యమునకుఁ దగినట్లుగా విహరించుదము. అనఁగావిని లక్ష్మణుఁ డిట్లనుచున్నాఁడు. ఓసి! వెఱ్ఱిదానా! నాయన్నయే నాకుఁ ప్రభువు. నేనాతనికి సర్వవిధములను సేవకుఁడను. నన్నుగట్టుకొన్నచో, నీవును దాసివి కావలయును. నీవుదాసివగుట కేలఁగోరెదవు? ఓసి! తామరపూవువంటి శరీరము గలదానా! రాముఁడు సర్వసమృద్ధిగల మహారాజు. నీవాతనినే పెండ్లాడి సర్వసమృద్ధమైన భోగముల ననుభవించుము. మఱల నిట్టినీచత్వమును గోరక సద్గుణములుగల దానవగుము. కావున నీయార్యపుత్రునకు రెండవభార్యవగుము. (ఇచ్చట సిద్ధార్థా ముదితామలవర్ణిని యనునప్పుడు సిద్ధించిన ప్రయోజనము గలది యసియు సిద్ధమైన ముక్తిగలదియనియు ఇంతకు నీదార్భాగ్యమును గోరితెచ్చికొనుటయేయని యసలైన భావము. గోచరించును.) ఓశూర్పణఖా! ఈకురూపియును పాతివ్రత్యము లేనిదియుఁ క్రూరమైన మనస్సు గలదియు వ్రేలాడుకడుపు గలదియు, ముసలిదియు నగు నీసీతను విడిచి మాయన్న నిన్నే వరించును. (పైలక్షణములనన్నియునుగల శూర్పణఖను హేళన జేయుటకే లక్ష్మణుఁ డీవిధముగా బలికెనని గ్రహించవలెను.) శూర్పణఖభావమున సీతను నిందించునటే గోచరించవచ్చును. కాని మాతృస్వరూపిణీ గాఁ బూజించు

సీత నావిధముగాఁ జెప్పుట కేవలము శూర్పణఖను నిందించుటకే యని తెలుసుకొనవలెను.) ఓవరవర్ణినీ! బుద్ధిమంతుఁడైన వాఁడు సౌందర్యరాశివైన నీవంటిది స్వయముగాఁ గోరి వచ్చుచుండఁగా, నీమానవస్త్రీయందనురాగము నెట్లు నిలుపుకొనఁగలడు? అని యిట్లు లక్ష్మణుఁడు మాటలాడుచుండఁగాఁ గామపరవశయైన యారాక్షసి తననేయిట్లు వ్యంగ్యముగా నిందించుచున్నాఁడని తెలిసికొనలేక మరల శ్రీరామసన్నిధిం జేరి యిట్లనుచున్నది. ఓరామా! సీతమ్మఁడు చెప్పినట్లుగా, నీకురూపియు దుర్లక్షణములు గలదియు నగు నీమె నేలవిడువకున్నావు! నేనిప్పుడే దీనినిజంపి తినివేయఁగలను. నీవునాతోఁ గూడియడ్డునాపు లేనివాఁడవై విహరించుదువుగాక! అనుచు నారాక్షసిగుడ్లెఱ్ఱఁజేసి, పెద్దతోకచుక్క రోహిణీ నక్షత్రముపైఁ బడఁబోవునట్లు, భయపడిపోవుచు గడగడవడకుచున్న సీతపైకి రాఁదొడఁగెను. ఆవిధముగా మృత్యువువలె వచ్చుచున్న దానింజూచి, యడ్డగించి, శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియెను.

శ్లో॥ క్రూరై రనార్యై, స్సౌమిత్రే! పరిహాసః కథంచన।
నకార్యం పశ్య, వైదేహీం, కథంచి త్ప్రశ్య జీవతీమ్॥
స. 18, శ్లో॥ 19

తా॥ శాంతస్వభావముగల యోలక్ష్మణా! క్రూరులై, పామరులైన వారితోఁ బరిహాసము నెట్టి సమయములందును

జేయరాదు సుమా ! చూడుము ! ఇప్పుడు మన యదృష్టవశ మున నీ భయంకర స్వరూపిణిం జూచి సీత జీవించియున్నది. లేనిచోఁ జాల ప్రమాదము సంభవించెడిదే సుమా !

దుర్మార్గులును నీచులు నైనవారితో నధిక ప్రసంగము కాని, పరిహాసముగాని, చేయుట యనేకానర్థములకుఁ గారణ మగును. కావున నో లక్ష్మణా! ఈ దుష్టురాలిని కురూపిని జేసి పంపుట శ్రేయము. అనఁగా విని లక్ష్మణుఁడు వెంటనే తనయొరనుండి ఖడ్గముందీసి యాశూర్పణఖయొక్క ముక్కును జెవులను గోసివైచెను. అంతనామె తనభయంకర నిజస్వరూప ముతో ఘోరముగా, రోదనఁజేయుచు, నాయరణ్యములం బడి పారిపోయినది. ఆమె ముఖమునుండి రక్తధారలు ప్రవ హించుచుండఁగా, వర్షకాలమున వర్షించు మేఘము గర్జించి నట్లుగాఁ బెద్దగానేడ్చుచుఁ బోయినది. ఆవిధముగాఁ బోవుచు, రామలక్ష్మణులను వెనుదిరిగి చూచుచుఁ జేతులెత్తి తర్జించి నది. అట్లు పారిపోయి, రాక్షసులమధ్యఁ గొలువుదీర్చియున్న తనయన్నయగు ఖరాసురుని మ్రోల, నాకాశమునుండి పడిన, పిడుగువలె నేలంబడి, యేడ్చినది. అంత నాఖరుఁడు శూర్పణ ఖను లేవదీసి, ప్రశ్నించఁగా, సీతాదేవితోఁ గూడిన రామ లక్ష్మణులు మనజనస్థానమున, నివసించిరనియుఁ, దననుజూచి, యీముక్కును జెవులను గోసి పంపిరనియు, మొఱ్ఱపెట్టినది.

## ఖరుఁడు చెల్లెల నోదార్చి - యుద్ధ సన్నద్ధుఁడగుట.

రక్తధారలు గారుచున్న ముఖముతో నెలుగెత్తి యేడ్చుచున్న శూర్పణఖను లేవఁదీసి ఖరుఁ డామెనోదార్చి, యిట్లనుచున్నాఁడు. ఓచెల్లెలా! భయపడకుము! లెమ్ము! నిన్నీరీతిఁగాఁ గురూపిం జేసిన వాఁడెవడో, వివరముగాఁ జెప్పుము. ఊరక గూర్చొనియున్న నల్లత్రాచును, గోటితో విలాసగాఁ గొట్టిరెచ్చఁగొట్టినట్లుగా, నీకీభంగపాటు నెవఁడు కలుఁగఁజేసెను? చెప్పుము. ఉత్తరక్షణమే తనకు మరణము గలుగునని యెఱుఁగక, కాలపాశమును దానే తనమెడకుఁ జుట్టుకొన్నట్లు గావించినాఁడు. వాఁడు నిన్ను సమీపించి, విషముం ద్రావిన వాఁడైనాఁడు. నీవును బలపరాక్రమములు గలదానవు. కామగమనమును గామరూపమును గలదానవు. అంతటి నీకీదురవస్థను గలిగించిన వాఁడెవఁడు? దేవ గంధర్వాదులలో నెవఁ డీపనిఁజేసినాఁడు? నిర్భయముగాఁ జెప్పుము. నాకత్యంత ప్రియమైన చెల్లెలివి. నీకింతటి యపకారము చేయుటకు దేవేంద్రునకును శక్తి చాలదు. తొందరగాఁ జెప్పుము. ఇప్పుడే నేను నావాడియైనబాణములతో నీళ్ళతోఁగలిసిన, పాలనుగ్రహించిన హంసవలె, వానిప్రాణములను దీయఁగలను. అట్టివాని రక్తము నీభూమి త్రాగఁగలదు. నాబాణములు వానికండరమును ముక్కలుముక్కలుగాఁ జేసి, తినివేయఁగలవు. అట్టివానిని, దేవ గంధర్వ పిశాచ రాక్షసులలో నేనొక్కఁడును రక్షించలేఁడు. ఓచెల్లెలా! నీవు

మెల్లగాఁ దెలిసికొని, నేనడిగినదానికి విపులముగా సమాధానము చెప్పుము! ఆమాటలనువిన్న శూర్పణఖ గంటనీరుగార్చుచునే, యీవిధముగాఁ జెప్పఁదొడగినది.

శ్లో॥ తరుణౌ రూపసంపన్నౌ చీర కృష్ణాజి నాంబరౌ।
పుండరీక విశాలాక్షౌ సుకుమారౌ మహాబలౌ॥
ఫలమూలాశినౌ దాంతౌ, తాపసౌ ధర్మచారిణౌ।
పుత్త్రౌ దశరథస్యైతౌం, భ్రాతరౌ రామలక్ష్మణౌ॥
గంధర్వ రాజప్రతిమౌ పార్థివ వ్యంజనాన్వితౌ।
దేవౌవా మానుషౌవా తౌ నతర్కయితు ముత్సహే॥

స. 19, శ్లో॥-14-16

తా॥ అన్నా! వినుము! వారిరువు రన్నదమ్ములు. అతిలోక సౌందర్య సంపన్నులైన యువకులు. సుకుమారులు, మహాబల పరాక్రమములు గలవారు. నారబట్టలను, లేడి చర్మమును ధరించినవారు, పండ్లను దుంపలను దినుచుందురు. జితేంద్రియులై, ధర్మాచరులై, తపము గావించికొను చున్నారు. వారు దశరథ మహారాజుయొక్క కుమారులు, గంధర్వరాజ కుమారులతోఁ దులఁదూగుచున్నవారు. మహా రాజ లక్షణములతో నున్న వారిద్దరును దేవలోకమునుండి దిగివచ్చిన దేవతలో? మానవులో? చెప్పఁ దరముగాదు. అందుఁ బెద్దవాఁడు రాముఁడు. చిన్నవాఁడు లక్ష్మణుఁడు.

ప్రభు హితమును గోరినవా రెవరైనను, శత్రువు యొక్క శక్తిసామర్థ్యముల, నున్నదియున్నట్లును గన్నది గన్నట్లును జెప్పుటధర్మము.

(ఇచ్చట శూర్పణఖ మహాపరాక్రమ వంతులైన రామలక్ష్మణులను, దశరథకుమారులు నాకీవిధముగా నప కారముచేసిరి." అని యొక్కవాక్యములోఁ జెప్పిన సరిపోయె డిది. అట్లుచెప్పక "తరుణౌ రూపిసంపన్నౌ..." ఇత్యాదిగా వారిని బొగడినది. దీనివలన, రామలక్ష్మణులు మిత్రుల కెంతటి యాకర్షణీయ రూపగుణసంపదఁ గలవారో, శత్రువు లకుఁ గూడ నంతటి యాకర్షణీయులని తెలియుచున్నది. మఱియుఁ గామినులైనవారు, తన కపకారము చేసిన శత్రువు లైనను, వారియొక్క సద్గుణములనే స్మరించుట స్త్రీలకు సహజగుణము. పైగా శ్రీరామలక్ష్మణులను బొగడుటచే, నామె కవ్వారిపై, మోహము గలిగి ప్రవర్తించిన విషయము గూడఁ బరోక్షముగా నన్నకుఁ దెలియఁజేసిన దనవచ్చును. కాని వాఁడు రాక్షసుఁడగుటచేఁ జెల్లెలి మనోభావమును గ్రహించలేక, క్రూరమైన స్వభావమును, దురహంకారమును వెలిబుచ్చినాఁడు.) అన్నా! ఆసోదరులమధ్య సర్వాభరణ భూషితయై యౌవనముతో సౌందర్యరాశియై, సన్నని నడుము గల 'సీత'యనుయువతియు నున్నది. అట్టియామె కారణ ముగా (నేనామెను భ్రమింగఁబోగా) వారుభయులును గలిసి, నన్ను దిక్కులేనిదానినిగాఁజేసి యీయవస్థను నాకుఁ గలి

గించిరి. అన్నా! దుర్మార్గురాలైన యామెయొక్కయు, నారామలక్ష్మణులయొక్కయు, వేడివేడి రక్తమును ద్రావఁ గోరుచున్నాను. ఇట్టి నాకోరికందీర్ప నీవే సమర్థుఁడవు అని శూర్పణఖ తన యన్నయైన ఖరునితోఁజెప్పినది.

## ఖరుని యుద్ధయాత్ర.

శూర్పణఖచెప్పిన మాటలచేఁ గోపోద్రిక్తుఁడైన ఖరుఁడు తనపదునలుగురు రాక్షస వీరసైనికులను, యుద్ధమునకు సిద్ధముగావలెనని యాజ్ఞాపించుచు, వారితో నిట్లనుచున్నాఁడు. వీరులారా! శస్త్రాస్త్రధారులైన యిద్దరు మానవులు, నారబట్టలను కృష్ణాజినములను ధరించి, యొక యువతితోఁగూడ, నీభయంకర దండకారణ్యములం బ్రవేశించిరి. మీరు వారిని ముప్పురను సంహరించి, తీసికొనిరండు! వారిరక్తమును నాచెల్లెలు ప్రీతితోఁ ద్రావగలదు. మీరు వేగముగాఁ బోయి, నాచెల్లెలి కోరికనుదీర్చి, నాకుసంతోషమును గలిగించుఁడు! అనఁగా నామాటలనువిన్న యాపదునలుగురు రాక్షసులును, దమతేమ నాయకులతోఁగలిసి, శూర్పణఖ ముందునడిచి, దారిజూపుచుండఁగా వెడలిరి. ఆరాక్షసులుపోయి, దావాగ్నివలె జాజ్వల్యమానముగాఁ బ్రకాశించుచున్న శ్రీరాముని జూచి, యేమియుం జేయలేమనుకొనిరి.

# శ్రీరాముఁడు పదునలుగురు రాక్షసులను సంహరించుట

ముందుగా శూర్పణఖ యాపదునలుగురు రాక్షసులకును సీతారామలక్ష్మణులను జూపినది. దూరమునుండియే శ్రీరాముఁడు శూర్పణఖతో వచ్చుచున్న రాక్షసులనుజూచి, లక్ష్మణునితో నిట్లనుచున్నాఁడు. లక్ష్మణా! కొంతసేపు సీతను రక్షించుము. నేనిప్పుడే, యీశూర్పణఖతో వచ్చిన రాక్షసులను జంపుదును. అనఁగావిని లక్ష్మణుఁ డట్లేగావించెద ననెను. శ్రీరాముఁడు ధనువునెక్కుపెట్టి, బంగారముతో నలంకరించఁబడిన బాణముందొడిగి యావచ్చిన రాక్షసులతో నిట్లనుచున్నాఁడు. "మేము దశరథ మహారాజ కుమారులము. తండ్రియొక్క యాజ్ఞానుసారముగా నాభార్యయైన యీసీతతోఁగూడి, ప్రవేశింప శక్యముగాని యీదండకారణ్యమునకు వచ్చితిమి. తాపసవృత్తితో నిట్లున్న మమ్మేల హింసించెదరు? పొండు! నేను దండకారణ్యవాసులగు మహర్షులను బాధించు మిమ్ములను సంహరించుటకే యీశస్త్రాస్త్రములను ధరించి, యిచ్చటకు వచ్చితిని. మీప్రాణములను నిలుపుకొనఁ గోరినచో నిచ్చటనుండి వెడలిపొండు! కాదందురా! నిలువుఁడు! ఇప్పుడే మీప్రాణములం దీసివేయుదును." అనఁగావిని బ్రాహ్మణహంతకులైన రాక్షసులు శూలముల ధరించి, యిట్లనిరి. "ఓరీ! మాప్రభువైన ఖరునకుఁ గోపము గలిగించితివి. కావున

మా చేత, నీవే చంపఁబడుదువు. నీవొక్కఁడవు. మేము పదు నలుగురము. మాతో యుద్ధ మెట్లుచేయఁగలవు! ఎట్లు జీవించఁ గలవు? రమ్ము! ఇప్పుడీ మా యాయుధములచే నిన్నుఁ జంపఁగలము." అనిపలుకుచు వారందఱు నొక్కుమ్మడిని దమశూలములను, రామునిపైఁ బ్రయోగించిరి. శ్రీరాముఁడును దనవాడియైన బాణములచే నాశూలములను మధ్యలోనే ముక్కలుగాఁగొట్టి పడవైచెను. తరువాత శ్రీరాముఁడు దేవేంద్రుని వజ్రాయుధమువలె రాళ్ళనుగూడఁ బగులఁగొట్టఁగల పదునాలుగు బాణములను వారిపైఁ బ్రయోగించెను. ఆ బాణము లారాక్షసుల గుండెలనుజీల్చి, వీపులం దూసుకొనిపోయి భూమిని బ్రద్దలు చేసినవి. ఆ రాక్షసు లందఱు నొకే సమయమున మొదలునరికిన చెట్లవలె నేలపైఁ బడి మరణించిరి. ఆ చనిపోయిన వారిం జూచి శూర్పణఖ పెద్దగా కుక్కవలె నరచినది. మఱియు నామె నెత్తిని నోరును మొత్తికొనుచుఁ గరడుగట్టిన రక్తముతోఁ దిన్నగా ఖరుని వద్దకు వచ్చి, నేలఁబడి యేడ్చినది. కొంతసేపటికి లేచి తనతో వచ్చిన మహాబలులైన రాక్షసుల చావునుగూర్చి, విన్నవించికొన్నది.

అంత ఖరుఁడు తననాశమునకే వచ్చిన శూర్పణఖం జూచి, జాలిపడి, క్రోధావిష్టుఁడై, యహంకార మదములతో నిట్లనుచున్నాఁడు. చెల్లెలా! నేనుబంపినవారు సామాన్యులు గారు. శత్రువుల నెందఱినైనఁజంపి, వారి రక్తమాంసములను

బాణముచేసి రాగల మహావీరులు. కావుననే నీవెంటవారిని బంపితిని. వారు నాహితమునేగోరు నాభక్తులు. నామాటలను జవదాటరు. అట్టి మహావీరనాయకులే చనిపోవుట వింతఁగా నున్నది. అట్టియెడ నేలఁబడి, సర్పమువలె నేల యేడ్చెదవు ? వారు చనిపోయిరన్న నమ్మలేకున్నాను. సరియే కానిమ్ము ! నీకు రక్షకుఁడనైన నేనుండఁగా విచారమేల ! అనెను. అంత నామెయు, ఖరుని ధీరవచనములకు విచారము మాని, యిట్లనుచున్నది. అన్నా ! నాయందుఁ బ్రేమతో, నాకష్టమును సహించలేక నీవుపంపిన మహాశూరులు శూలపట్టసాది మహాయుధములుగలిగియు, వారందఱు నొక్క ముహూర్తకాలమున రామబాణముచే హతులైరి. ఆదృశ్యముం జూడలేక, భయపడి యిట్లుపరివెత్తి వచ్చితిని. నాకెందుఁజూచిన నారాముఁడే కనఁబడుచున్నాఁడు. అందులకే భయపడి, నిన్ను శరణువేడ వచ్చితిని. దుఃఖమనెడి మొసళ్ళతోడను, భయమనెడి జలంబులతోడను నిండిన మహాసముద్రమున మునుఁగుచుఁ దేలుచు నిట్లువచ్చితిని. నన్ను రక్షింప నీవే సమర్థుడవు. ఓఖరవీరా ! నాపైనను, నిందలి సమస్త రాక్షసులపైనను నీకు నేమాత్రము గరుణ యున్నను, వెంటనే నీవేవెళ్ళి, యారామలక్ష్మణులను సంహరించుము, అట్లుగానిచో నీకెదురుగా నందఱును జూచుచుండఁగా, నాప్రాణములను విడువఁగలను. నీవెంతటివాఁడవైనను, నిర్లక్ష్యము, జూపక, నీసమస్త సేనా పరివారముతోడను యుద్ధమునకు వెడలుము. అప్పటికిని, శ్రీరాముని జంపలేక

వెనుదిరిగి వచ్చుగు వేమో ? యని నాయనుమానము. ఆరాముని తమ్ముఁడును నంతటి పరాక్రమశాలియేసుమా ! అతఁడే, నాముక్కును చెవులను గోసినవాఁడు. అనియిట్లు చెప్పుచునే యాశూర్పణఖ ప్రేలాడుకడుపును బాదుకొనుచు నేడ్చినది.

## ఖరదూషణులు - పదునాలుఁగువేలమంది సైన్యముతో - యుద్ధయాత్ర

మహావీరాగ్రేసరుఁడైన ఖరుఁడు శూర్పణఖచే నొక వంకఁ బ్రోత్సహింపఁబడియుఁ బరోక్షముగా నవమానింపఁబడి నట్లుగా భావించి, సమస్తరాక్షసులను బిలిపించి, వారిమధ్య నిలిచి, తనపౌరుషమును బ్రకటించుచు నిట్లనెను. ఓ చెల్లెలా ! నీకుఁగలిగించిన యవమానముచే, నాకుబుట్టిన కోపము, పర్వదినమునఁ బొంగిన సముద్రమువలెఁ బొంగుచున్నది. ఆరాముఁడొకమానవుఁడు. పైగావాఁడు చేసిన దుష్కృత్యముచే నాయువుమూడి, నాపరాక్రమమునకుఁ జనిపోఁగలఁడు. ఇంక నీవేడువకుము. నేనిప్పుడే, యారామలక్ష్మణులను సంహరించుదును. ఓరాక్షసీ ! చెల్లెలా ! నేను వారిరువురను నాగొడ్డలినెత్తి సంహరించఁగా, వెడలిన రక్త మాంసములను వేడివేడిగా, నీవుత్రాగి, తినవచ్చును. ఆ మాటలకు మూర్ఖురాలైన శూర్పణ సంతోషించి యన్నను బొగడినది. మొదట నాఖరుని జేతఁగానివానినిగా నిందించియుఁ దరువాతఁ బొగడి

నంతనే, యాఖరదూషణులు సర్వసేనా నాయకుని బిలిచి, యుత్సాహముతో నిట్లనుచున్నారు. ఓయీ ! సేనాపతీ ! అనేక యుద్ధములందు, జయములనంది, యారితేరిన మహా వీరులైన, మన సేనలను బదునాలుగు వేలమందినిం బిలిచి, యుద్ధమునకు సిద్ధము చేయుము. నారథమునుగూడ, ధనుర్బాణములతోడను ఖడ్గాది, బలిష్ఠములైన సర్వాయుధములతోడను నిండుగాంజేసి, నాయెదుటకు రప్పింపుము. మహావీరులైన రాక్షసులకు ముందుననే నారథమును బోనిచ్చెదను. ఆరామలక్ష్మణులను నేనేసంహరించెదను. (ఇచ్చటంపౌల స్త్యానాం మహాత్మనాం, వధార్థం..." అనిచెప్పుటలో నశ్లీలమైన, యపశకునమైన, "రాక్షసులయొక్క సంహారార్థము"అని యర్థము తోచుచున్నది.) ఖరుం డీవిధముగా నాజ్ఞాపించినతోడనే, దూషణుండు నట్లే తనరథమునుగూడ సిద్ధము చేయించుమని యాజ్ఞాపించెను. ఇట్లుఖరదూషణు లాజ్ఞాపించంగా సిద్ధముచేయంబడి యెదురుగా వచ్చియున్న రథములను ఖరుండును, దూషణుండు నధిరోహించిరి. అంత ఖరుండు సర్వసైన్యములనుం బ్రయాణమై నడువుండని యాజ్ఞాపించెను. అంత నాసేనలన్నియును దమతమ యాయుధములను ద్రిప్పికొనుచుం బెద్దగానరచుచు బయలుదేరిరి. అందు కొందఱు ధనుర్బాణములను, గొందఱుగదలు ముసలములు, పరిఘలు, భిండివాలములు మొదలగు నాయుధ ధారులై, నడిచిరి. అట్లు పదునాలుగు వేలమంది వీరులను, ముందు

బరాబరులు వలుకుచు నడచుచుండగా, వారి ననుసరించి దగ్గరలోఁ దనరథమును బోనిచ్చెను. ఆరథమును సారథి వేగముగాఁ బోనిచ్చుచుండ, రథచక్రముల ధ్వని దశదిశలను వ్యాపించినది. అట్లు ఝంఝామారుతముచేఁ దరిమివేయఁ బడు మేఘములవలె సైన్యము లారథవేగమునుమించి, శత్రుసంహారార్థమై వెడలిరి. ఇట్లు భయంకరధ్వనులతో ఖరుని ప్రోత్సాహము ననుసరించి, సర్వసైన్యములును దొందరగా వెళ్ళుచున్నవి. ఖరదూషణాదు లావిధముగా నత్యంతవేగముగలవారై వెడలుచుండఁగా, ననేకములైన యుత్పాతములు గనఁబడినవి.

## ఖరదూషణాదులకుఁ గనుపట్టిన దుశ్శకునములు.

ఖరదూషణాదు లావిధముగా యుద్ధమునకుఁ బయనమైనంతనే యాకాశమునుండి బూడిద రంగుగల మేఘములు రక్తవర్షమును గురిసినవి. రాజమార్గమందుఁగూడ గుఱ్ఱము లేకారణమును లేకుండఁగనే తడఁబడుచుఁ నేలంబడిపోయినవి. సూర్యుని జుట్టును నల్లనై యెఱుపుతోఁగూడిన పరివేషము (గుడిగట్టుట) గన్పడినది. బంగారు రథముపై నున్న ధ్వజము చివరిభాగమున గ్రద్ద వాలినది. ఇంకను క్రూరముగను వికారముగను నక్కలు మొదలైన జంతువులును గాకులు మొదలైన పక్షులు నరచినవి. ఈ విధముగా నారాక్షసుల

కమంగళ సూచకములై యెన్నియో దుశ్శకునములు గను పట్టినవి. ఇంతటి మహాఘోరములైన దుశ్శకునములు గలిగి నను ఖరుఁడు దర్పాహంకారములచే, వెనుకకుఁ బోలేదు. పైఁగా నీయుత్పాతములన్నియుఁ బిరికివారైన దుర్బలులను భయపెట్టునేగాని నావంటి వీరాధివీరు నేమి చేయఁగలవు? నా బాణములచే, నక్షత్రములనుగూడ నేలఁ బడఁగొట్టఁ గలను. మృత్యువునకుఁగూడ మరణమును గల్పింపఁగలను. అట్టినే, నారామలక్ష్మణులను సంహరించిగాని, వెనుకంజ వేయను. ఈదుర్నిమిత్తము లన్నియు, నారామలక్ష్మణులకే వర్తించి, చేటుగలిగించుఁగాక! ఓవీరులారా! ఇంతవరకు నెంతటి మహాయుద్ధములందును బరాజయము నెఱుంగను. ఆవిషయము మీరందఱు నెఱింగినదేనేను వేరుగాఁ జెప్పబని లేదు. దేవేంద్రుఁడే వజ్రాయుధమును ధరించి, యైరావతము నెక్కి వచ్చినను వానిని సంహరించఁగలను. అట్టి నాకీ మానవమాత్రు లొకలెక్కలోనివారుగారు. అని యీవిధ ముగా ఖరుఁడు గర్జించుచుండగా, మూర్ఖత్వముతో సేన లన్నియును మహోత్సాహముతో ముందుగా నడిచినవి.

ఇటియిట్లుండఁగా, మహాత్ములైన మహర్షులును, దేవ గంధర్వ యక్షాది గణంబులును, యుద్ధమును దర్శించుటకై, యాప్రదేశమునకువచ్చిరి. ఆవచ్చిన వారందఱును "లోక ములో గోబ్రాహ్మణులకు హితముగలుగునుగాక! ఈమహా యుద్ధమున శ్రీరాముఁడే జయించునుగాక!! చక్రపాణియైన

మహావిష్ణువు యుద్ధములందు రాక్షసులను సంహరించినట్లు శ్రీరాముఁడు వీరి నందఱను జంపివేయునుగాక !" అని గట్టిగాఁ జెప్పికొనుచుండిరి. దేవతలు మొదలగువారు విమానములపై నిలిచి, రాక్షససైన్యమును జూడఁగా, వారందఱు నాయువుచెల్లిన వారై కనుపట్టిరి. రథముపై ఖరుఁడు పోవుచుండగా నారాక్షసు లందఱును ముందుఁగా వేగముతోఁ బోవసాగిరి. శ్యేనగామి, పృథుగ్రీవుఁడు, యజ్ఞశత్రువు, విహంగముఁడు, దుర్జయుఁడు, గరవీరాక్షుఁడు, కాలకార్ముకుఁడు, మేఘమాలి, మహామాలి. సర్పాస్యుఁడు, రుధిరాశనుఁడు, వరుషుఁడు, నను పండ్రెండుగురు మహావీరులు ఖరుని జుట్టును జేరి నడచిరి. మఱియు, మహాస్థూలాక్షుఁడు, కపాలుఁడు, ప్రమాథి, ప్రశిరుఁడు నను నలుగురును మహావీరులై, దూషణుని వెంటనుండిరి. ఇట్లుగా నారాక్షస సైన్యమంతయును మహాబలమును, యుద్ధాసక్తియును గలిగి, యంగారకాది గ్రహము నొక్కుమ్మడిని జంద్రసూర్యులఁ జేరినట్లుగా, శ్రీరామలక్ష్మణులతో యుద్ధమునకుఁ దొందరఁ బడుచు వేగముగా వెడలిరి.

## శ్రీరాముఁడు, సీతాలక్ష్మణులను దూరముగాఁ బంపి, తానొక్కఁడే నిలుచుట

శ్రీరామలక్ష్మణు లాశ్రమమునందుండఁగాఁ బైనఁ జెప్పఁబడిన మహోత్పాతము లన్నియును వారికిగూడ గోచ

రించినవి. ప్రజాక్షయ కారకములైన యాయుత్పాతములం జూచి, శ్రీరాముఁ డిట్లనుచున్నాడు. లక్ష్మణా ! చూచితివా! ఈమేఘములు గాడిదలవలె నరచుచు రక్తమును గురియు చున్నవి. ఉల్కాపాతము లగుచున్నవి. నా బాణములు పొగలుగ్రక్కుచున్నవి. బంగారు పూతఁగలిగిన మనధనుస్సు లప్రయత్నముగా నెక్కువెట్టఁబడినట్లు గుండ్రనై ప్రకాశించు చున్నవి. తమ్ముఁడా ! ఆకసమునఁ బక్షులును, నేలపైజంతువు లును స్వభావ విరుద్ధమై, వికారముగా నరచుచున్నవి. దీనింజూడఁగా నిప్పుడేదో యొక యుపద్రవము రానున్నది. తుదకు మనప్రాణములే సంశయములోఁ బడవచ్చును. నాకుడిబుజము మాటిమాటికి నదరుచున్నది. ఇప్పుడొక, మహాయుద్ధము, సంభవించవచ్చును. ఈయుద్ధమున మన విజయమును శత్రు నాశనమును దప్పవు.

లక్ష్మణా ! నీముఖకాంతి ప్రసన్నమై, దర్శనీయమై కానవచ్చుచున్నది. యుద్ధమునకుఁ బోవునప్పు డెవనిముఖము గళకాంతులు దప్పియుండునో, వాని కానాఁటితో, నాయువు సరి,యని తెలిసికొనవలెను. ఇదిగో ! అటువినుము ! రాక్షసుల యుద్ధసంబంధములైన, భేరీలు మొదలైనవాయిద్యముల ధ్వనులు వినఁబడుచున్నవి. బుద్ధిమంతుఁడైన శూరుఁడు రాఁబోవు నాపదలఁ దెలిసికొని, ముందుగనే జాగ్రత్తపడ వలెను. నాయనా ! నీవిసీతను దీసికొనిపెళ్లి, చెట్లతోఁ గ్రిక్కిరిసియున్న యాకనబడు కొండగుహలో నీ మెను రక్షించువాఁడవై యుండుము.

ఇంక నామాట కడ్డుమాటఁ జెప్పకుము. నాపాదములు సాక్షిగా, నీవు నేఁజెప్పినట్లు చేయుము. నీవు శూరుఁడవు పరాక్రమవంతుఁడవునై యున్నావు. అయినను, నేనొంటరిగనే నిలిచి, యీదుర్మార్గులైన రాక్షసులను జంప సిద్ధముగనున్నాను. అనఁగా శ్రీరాముని మాటలను శిరసావహించి, ధనుర్బాణములను ధరించి, సీతాదేవిని దోడ్కొని పోయి, కొండగుహలో నుంచి, బయటఁ దాను నిలిచి యుండెను, సీతాలక్ష్మణులు వెడలఁగనే "ఆహా! మంచి యుపాయ మాలోచించితినిగదా!" యని రాముఁడు సంతోషించెను. ఆసమయమునఁ జీకటియందుఁ బొగలేని యగ్నివలెఁ దాను బ్రకాశించుచుండెను. ఆవెంటనే తనధనువు నెక్కువెట్టి, కవచధారియైన శ్రీరాముఁడు గుణటంకారము జేయఁగా, దిక్కులు పిక్కటిల్లు ధ్వనివెడలినది. అంతలో, దేవ గంధర్వ సిద్ధ చారణ యక్షాది దేవతాగణము లందఱును విమానములపై వచ్చి, యీయుద్ధమును దర్శించుటకు నాకాశమున నిలిచియుండిరి. అంతియేగాక బ్రహ్మర్షులును, మహర్షులును బుణ్యాత్ములైన జనంబులునువచ్చి, యిట్లను కొనుచుండిరి. కేవల గోబ్రాహ్మణులకేగాక సర్వలోక హితమును గోరునీతనికి జయము గలుగుఁగాక! శ్రీరాముఁ డీయుద్ధమున నీదండకారణ్య రాక్షసుల నెల్లరను సంహరించునుగాక! ఈవచ్చు రాక్షసులం జూడఁ బదునాలుగువేలమంది. శ్రీరాముఁడు మాత్రమొక్కఁడే వీరితో నెదిరించి, యెట్లు

యుద్ధము చేయఁగలఁడో ? చూచుదము ! ధర్మముయొక్క ప్రభావముగూడ నిట్టిసమయముననే గోచరించఁగలదు.” అని చెప్పికొనుచు, దేవతాగణము లాకాశమున విమానములపై నుండియును, మిగిలినవారు నేలపైనిలిచియుఁ జూచుచుండిరి. ఆసమయమున మహాతేజస్వంతుఁడై నిలిచిన శ్రీరాముని జూచి, సర్వభూతములును, భయపడినవి. పినాకపాణియై, మహారౌద్రాకారమును ధరించిన కాలరుద్రునివలె శ్రీరాముఁడు కనిపించెను.

ఇట్లుండ రాక్షససైన్యముల యాయుధముల యొక్కయు, వాహనముల యొక్కయుఁ, దుముల ధ్వని, భూమ్యాకాశముల నిండి వినవచ్చినది. ఆశబ్దములకుఁ గ్రూరజంతువు లన్నియును, వెనుకముందులు చూడక కకావికలై, పారిపోవుచున్నవి. సముద్రమువలె గంభీరమైన, ఆమహారాక్షస సైన్యమంతయును, నానావిధాయుధములతో, శ్రీరాముఁడున్న చోటునకు వచ్చెను. శ్రీరాముఁ డాసైన్యము నంతను నొకేముహూర్తకాలమున సంహరింపఁదలఁచి, ధనువునువంచి, యెక్కువెట్టి బాణములందొడిగెను. ఆరాముని జూచి, వనదేవతలు పరుగిడి పోయినవి. మఱియు నాస్వరూప మలనాఁడు దక్షయజ్ఞ ధ్వంసియైన వీరభద్రుని దలపించుచుండెను. ఆవచ్చిన, యాయుధములతోఁగూడిన రాక్షసులకాంతి సూర్య కిరణముల మధ్య మేఘముల మెరుపులవలెఁ గనుపించెను.

# శ్రీరాముఁడొక్కఁడే యెల్లరాక్షస సైన్యమును జంపుట.

స్వల్పకాలములోనే ఖరునితోఁగూడిన రాక్షససైన్య మంతయును శ్రీరాము నాశ్రమమును సమీపించెను. అంత నాఖరుఁడు సారథిం బిలిచి, తనరథమును శ్రీరాముని సన్నిధికిఁ దీసికొనిపొమ్మని యాజ్ఞాపించెను. సారథియు నట్లే రథమును బోనిచ్చెను. ఆరథమునకుఁ జుట్టును శ్యేనగామి మొదలగు మంత్రులందఱును నిలిచిరి. ఆమధ్య రథముపై నున్న ఖరుఁడు నక్షత్రముల మధ్యలోనుండు నంగారక గ్రహమువలెఁ బ్రకాశించెను. అట్టివాఁడు శ్రీరామునిపై ననేక బాణములను బ్రయోగించి, బెద్దగా నరచెను తరువాత రాక్షసులందఱును వారివారి యాయుధ విశేషములను శ్రీరామునిపై వర్షముగాఁ గురిపించిరి అంతతోఁబోక, యశ్వదళములను గజసైన్యములును, రామునిపైకి నడిపించిరి. ఇట్లందఱు నొక్కుమ్మడిగా, శ్రీరామునిపై, నాయుధములను బ్రయోగించిరి. ఆసమయమునఁ గొండచుట్టును నావరించి మహావర్షమును గురిసిన మేఘములవలె నారాక్షసులు, గనుపించిరి. ఆమధ్యలోఁ జలించక శ్రీరాముఁడు ధనుర్బాణముల ధరించి నిలిచియుండెను. వారు ప్రయోగించిన, యాయుధముల నన్నిఁటిని, నదులనన్నిఁటిని సముద్రుఁడు తనలోఁ గలుపుకొన్నట్లుగా శ్రీరాముఁడు చలించక తనబాణములచే, వారివారి యాయుధముల నెల్ల మధ్యలోనే పడఁగొట్టుచు

రాముఁడు నిలిచియుండెను. మఱికొన్ని యాయుధములువచ్చి రామునిపైఁబడినను బర్వతమువలెఁ జలించక నిలిచెను. వేలాది రాక్షసులమధ్య గాయములతో నిలిచియున్న రామునింజూచి, యాకాశమునుండి చూచుచున్న దేవతాగణముల వారందఱును మిక్కిలి విచారించిరి. తరువాత శ్రీరాముఁడు ధనువు నెక్కువెట్టి మండలాకారముగాఁజేసి త్రిప్పుచు, వందలు, వేలును బాణములను విడిచెను. ఆబాణములలో నొక్కటియును వ్యర్థముగాక, లక్ష్యముదప్పక నివారించుటకు వీలుగానివియు, సహింపరానివియు, యమదండములై రాక్షసుల ప్రాణములనే హరించినవి. మఱియు నాబాణము లన్నియు నవలీలఁగా రాక్షస శరీరములను భేదించి, రక్తసిక్తములై దూసుకొనిపోయి యాకాశమునఁ బ్రకాశించినవి. లెక్కింపఁదరముగాని యాబాణము లన్నియును శ్రీరాముఁడు విడిచినదే తడవుగా వెడలుచు మహోగ్రములై, రాక్షసులను జంపఁదొడఁగును. అట్టి బాణపరంపరలచేఁ దెగిపడిన రాక్షసుల బాహువులను, దొడలను, రథాశ్వగజాదులును, సాలంకారులై యుద్ధభూమియందుఁ బొరలుచున్నవి. సైనికులతోఁ గూడిన గజాశ్వములను సారథి రథికులతోఁ గూడిన రథములను నెండియుఁ బదునాలుగువేల సంఖ్యగల కాల్బలమును, శ్రీరామబాణములచే ముక్కలుముక్కలుగాఁ గొట్టబడినవి. వారు చనిపోవుచు హాహాకారములను గట్టిగాఁ గావించిరి. ఆరాక్షస బలమంతయు నెండిపోయిన వనమును గాల్చివేసి

నశ్లైనది. అక్కడికిని, మిగిలినకొందఱు రాక్షస వీరులు, రాముని కెదురుగా వెళ్ళి ఖడ్గములు మొదలగు నాయుధముల నాతనిపైవిసిరినారు. వాని నన్నిటిని శ్రీరాముఁడు తనబాణములతో మధ్యలోనే ముక్కలగునట్లుగాఁ బడఁగొట్టెను. పైగా వారిపైఁ దనవాడియైనబాణములఁ బ్రయోగించఁగా నందఱు నక్కడికక్కడనే మరణించిరి. చావగామిగిలిన పిరికివారైన రాక్షసు లందఱును బారిపోయి, ఖరుని శరణుసొచ్చిరి. అట్టివారి నందఱును, దనవెంట నిడికొని, ధైర్యముచెప్పుచు, దూషణుఁడు, మహాగ్నివలెఁ గోపించి మండిపడుచు, శ్రీరాముని సమీపించెను. అతనివెంటనున్న వారు ధైర్యమునుబొంది, శిలలను వృక్షములను ధరించి, నిలిచిరి. వారందఱు నొక్కమారుగా రామునిపై, శిలావర్షమును, వృక్షవర్షమును గురిపించిరి. ఆరాక్షసులతో యుద్ధము ఘోరముగా జరిగినది. ఆరాక్షసులు శిలా వృక్షములతోడనే గాక, ప్రాసముద్గర గదా పరిఘాద్యాయుధములతోడను యుద్ధముచేసిరి. అప్పుడు శ్రీరాముఁడు భయంకరమైన, గాంధర్వాస్త్రమును బ్రయోగించెను. అదివేలకొలఁదిగా బాణములుగలిగి, దశదిశల నున్న రాక్షసులను ముంచివైచినది. ఆరాక్షసు లెవ్వరును, శ్రీరాముఁడు ధనువును జేబట్టి బాణములఁ దీయుటయు సంధించుటయుఁ బ్రయోగించుటయు నెప్పుడెట్లు చేయుచున్నాఁడో తెలిసికొనలేకపోయిరి.

(అట్లు రాముని బాణప్రయోగము కంటిచూపున కందరా నంత వేగముగా జరిగినదనిభావము) ఆసమయమున నాకాశ మంతయును బాణములతోఁ గప్పఁబడి సూర్యకాంతికడ్డమై యంధకారమేర్పడి. శ్రీరాముఁడే బాణములను గ్రక్కు చున్న ట్లైనది. బాణము లన్నియు నొకేకాలమున వెడలు టయు, నొకేనిమిషమున శత్రువులపైఁ బడుటయు, నందఱు నొకేమారు చనిపోవుటయును జరిగి, యుద్ధభూమి యంత యును క్షణములోఁ బీనుగుల పెంటయైనది. సమస్తాభరణము లతో నిండిన యాసైనికులయొక్క, చేతులును, గాళ్ళును, శిరస్సులును, మొండెములు నల్లే గుజ్జులు నేనుఁగులును, నేలంబడి, ముక్కలు ముక్కలుగా నయి కొట్టుకొనుచున్నవి. మఱియు ఖడ్గములు మొదలగు నాయుధములన్నియును, వారి వారి చేతులతోసహా, ముక్కలు ముక్కలై, ధగధగ మెఱసి నవి. గుండపిండియైన, శిలలును, ముక్కలు ముక్కలైన చెట్లును గలిగి, యాయుద్ధభూమి యంతయు నసహ్యాకర మైనది.

## దూషణ సంహారము

దూషణుఁడు తనతోవచ్చిన, వీరులందఱును మరణిం చుటగమనించి, తనమూలబలమైన, యనేకయుద్ధముల నారి తేరిన రాక్షసుల నందఱను ముంగునకు రప్పించెను. వారు ధనుర్బాణ గదా ముసలా ద్యాయుధముల నన్నిఁటి నొక్కమా రుగా రామునిపైఁ బ్రయోగించిరి. ప్రాణాంతకములైన శిలా

వృక్ష వర్షములను గురిపించిరి. శ్రీరాముఁడు వానినన్నిఁటిని తనవద్దకుఁ జేరకుండఁగనే మధ్యలోనే తనబాణములోఁ బడఁగొట్టెను అయినను దప్పివచ్చిన కొన్నియాయుధముల దెబ్బలకోర్చి, కొంతవడిఁ గన్నులుమూసి, తీవ్రమైన కోపముతో నాదూషణ సహితులైన రాక్షసుల నెల్లరను సంహరింపఁదలఁచి, తీవ్రమైన బాణవర్షమును గురిపించెను. దూషణుని సారథి నొక్క బాణముతోఁ జంపి, యారథాశ్వముల నాల్గింటిని నాలుగు బాణములతోఁగొట్టి చంపెను. మఱియు క్షురాస్త్రమును బ్రయోగించి, యాసేనాపతియొక్క ధనువును విరుగఁగొట్టెను. తరువాత నర్ధచంద్ర బాణముతో నాతని సారథి శిరంబును దెగనరికెను. అప్పుడారథముపైనున్న సేనాపతి యొక్క గుండెలపై మూఁడు బాణములతోఁ గొట్టెను. ఇంక వాఁడు చేయునది లేక రథమునుండి క్రిందికురికి, పెద్దదైన, పరిఘాయుధమును బట్టి రామునిపైకివచ్చెను. ఆవిధముగా, పరిఘాధారియై, సేనాధ్యక్షుఁడైన దూషణుఁడు, మీఁదికి వచ్చుచుండఁగాఁజూచి, శ్రీరాముఁడు వానిరెండుబాహువులను బాణములతో నరికివైచెను. అట్లు పరిఘతోఁగూడిన బాహువులు తెగిపడఁగనే దూషణుఁ డింద్రధ్వజముల నేలఁబడి పోయెను. ఆదూషణుంజూచి. సర్వదేవతా గణంబులును, మహర్షులును, శ్రీరాముని గొప్పగా వినుతించిరి ఆసమయమునసే మహాకపాలుఁడు, స్థూలాక్షుఁడు, ననుసేనానాయకులు మువ్వురును మృత్యుపాశముచేఁ గుదిగట్టిలాఁగఁబడిన వారుం

ళుఁబోలె, రామునిపై కురియుచు వచ్చిరి. వారు వరుసఁగా, శూల, పట్టస, పరశ్వధాయుధములను ధరించిరి. రాముఁడు వారింజూచి, సంప్రాప్తమైన యతిథులనువలెఁ దీవ్రమైన బాణములతో నాకర్షించి, సంహరించెను. తరువాత దూషణునితోసహా మైదువేలమంది మూలబలమును నైదువేల బాణముల నొక్కసారిగాఁ బ్రయోగించి, సంహరించెను.

## ఖరుని జనస్థాన రాక్షసుల నెల్లరను సంహరించుట

అనంతరము, దూషణాది రాక్షసబలమంతయును శ్రీరాముచే సంహరింపఁబడుటను జూచిన ఖరుఁడు తన సేనా నాయకులఁబిలిచి యిట్లనియెను. ఓయీ! చూచితిరిగదా! దూషణుఁడు తనమైద్దువేలమంది మూలబలముతోడను సంహరింపఁబడినాడు. అట్టియామానవుని మీారందఱును బోయి, సంహరించి, రండు! అనిచెప్పుచునే తాను దశరథమును రాముని కెదురుగా నడిపించెను. శ్యేనగామి మొదలగు పండ్రెండుగురు సేనానాయకులును, గదాపరిఘాదుల ధరించినవారై, ఖరుని జుట్టువారుకొని ముందు వెనుకల నుండి నడచిరి. అంతయుం జూచుచున్న శ్రీరాముఁడు బంగారము, వజ్రమును బొదిగిన కొనలుగలిగి, యగ్నిజ్వాలలంబోలిన బాణములందీసి. ప్రయోగించి, యావచ్చు రాక్షసుల వంద అను సంహరించెను. ఆసమయమున వందమందికి వంద

బాణములను, వేయిమందికి వేయిబాణముల నొకేసారి ప్రయోగించుచు, నందఱను జంపివేసెను. ఆరాక్షసుల యన యవము లన్నియును దెగిపడి యుద్ధభూమి రక్తముతో నిండఁగా, దర్భలతోడను, సమిధలతోడను నేయితోడను, నిండిన యజ్ఞవాటికవలెఁ బ్రకాశించినది. ఈవిధముగాఁ బదు నాలుగువేలమంది రాక్షసులను, స్వల్పకాలములో నేలపై నిలిచియున్న శ్రీరాముఁ డొక్కఁడే సంహరించెను ఇంక నా జనస్థానమున వీరసైనికుఁ డొక్కఁడును మిగలలేదు. అది చూచిన ఖరుడు, వజ్రధారియైన యింద్రుని డీకొన్నట్లు శ్రీరామునిపై యుద్ధమునకుం దరలెను. అట్లు శ్రీరాముని పైకి నొంటరిగాఁ బోవుచున్న ఖరునిజూచి, త్రిశిరుఁడును వచ్చెను.

## త్రిశిరుని - సంహరించుట.

శ్రీరామునిపైకిఁ దానొంటరిగాఁ బోవుచున్న ఖరుని జూచి, త్రిశిరుఁడనువాఁడు వచ్చి యిట్లనుచున్నాఁడు. ఓవీరాగ్రణీ! నేనుండఁగా నీవేలవెళ్ళెదవు? నన్ను బంపుము! ఆరాముని సంహరించి, నిన్ను సంతోషపెట్టఁగలను. ఈరాక్ష సుల నందఱను జంపి కులానికే హానిచేసిన వధార్హుఁడైన యీరాముని నేను జంపఁగలను. ఇదే నాయాయుధములు సాక్షిగాఁ బ్రతిజ్ఞ చేయుచున్నాను. యుద్ధమున రాముని దప్పక చంపఁగలను. నీవు సాక్షీభూతుఁడవై కొంచెము సేపు

మాత్రము చూచుచుందుము. రామసంహారమైనంతనే సంతోషముగా, జనస్థానమునకుఁ బోఁగలవు. లేక నేనేచని పోయినచో అప్పుడే నీవు స్వయముగా యుద్ధము చేయ వచ్చును. అంతవరకును నిరీక్షించుము. అని యాయువు మాడిన త్రిశిరుఁడు వలికిన మాటల కలరి, ఖరుఁ డాతని కనుజ్ఞ నొసంగి, యుద్ధమునకుఁ బంపెను.

త్రిశిరుఁ డావిధముగాఁ రథముపై యుద్ధమునకు రామునిసమీపించెను. త్రిశిరుఁ డారామునిపైఁ బాణవర్షముం గురిపించుచు, నీటందడిసిన భేరీధ్వనివలె, నరచెను. ఆసమయమున శ్రీరాముఁడు ధనుష్టంకారమును గావించుచుఁ దేజోవంతములైన బాణములను బైకిఁదీసెను. ఆ రామ త్రిశిరుల యుద్ధము, మహాభయంకరమై సింహగజముల పోరాటమువలెఁ దోఁచెను. త్రిశిరుఁడు శ్రీరాముని నొసలునందు, మూఁడు బాణములనేసి కొట్టఁగా, శ్రీరాముఁడు మహాక్రోధావిష్టుఁడై, యిట్లనుచున్నాఁడు, ఆహా! మహాశూరుఁడవు. మహాపరాక్రమశాలివియు నగు నీవేసిన బాణములు నానొసటఁ బుష్పములవలెఁ దాకినవిసుమా! ఇఁక నాబాణములను రుచిఁజూడు మని, శ్రీరాముఁడు పదునాలుగు బాణములతో వానివక్షస్థలముం గురిచేసి కొట్టెను. వెంటనే మఱినాలుగు బాణములతో, వానిరథమును మోయు గుఱ్ఱములంగొట్టి చంపివైచెను. మఱియు నెనిమిది బాణములతో సారథినిగొట్టి చంపెను. ఒకే బాణముతో వానిధ్వజమును బడఁగొట్టెను.

అంత నా త్రిశిరుండు రథమునుండి దిగిపోయి, తనమీఁదికి వచ్చుచుండఁగా, వానిగుండెలపై మూఁడు బాణములఁ బ్రయోగించెను. ఆదెబ్బతో వాఁడట్లే మూర్ఛిల్లెను. ఆవెంటనే మూఁడు బాణములఁ బ్రయోగించి, వానిమూఁడు శిరస్సులను దెగఁగొట్టెను. వాఁడా వెంటనే మరణించగా మిగిలినవారు పారిపోయిరి. ఆపారిపోవుచున్న రాక్షసుల నందరను వెనుకకుఁబిలిచి, ధైర్యముచెప్పి, రాహువుచంద్రుని సమీపించినట్లుగా నాఖరుఁడు శ్రీరామునివద్దకు రథమును బోనిచ్చెను.

## శ్రీరామ - ఖరాసురుల యుద్ధము.

అసహాయశూరుఁడైన శ్రీరామునిచేతిలో దూషణ త్రిశిరాది రాక్షసులందఱును సంహరింపఁబడుట చే, ఖరునకును గుండెలలో భయమేర్పడినది. అయినను ధైర్యము నవలంబించి, నముచి, దేవేంద్రు నెదుర్కొనినరీతిగా, ఖరుఁడు, శ్రీరాము నెదుర్కొనెను. మఱియు నల్లత్రాచులవంటి విషములఁగ్రక్కుచున్న, వాడియైన, బాణములను, రాముని పైఁ బ్రయోగించెను. ఇంకను ఖరుఁడు రథముపైనుండి, వివిధములైన బాణప్రయోగ నైపుణ్యములను జూపుచు, శ్రీరామునిపై ననేకబాణములను బ్రయోగించెను. శ్రీరాముఁడును దనధనువునుండి దశదిశలును వెలిఁగిపోవునట్లు బాణములను లెక్కలేనన్ని ప్రయోగించెను. ఆబాణ

ములన్నియు నాకాశమున మెరపుఁదీగలవలెఁ బ్రకాశించినవి. ఆఖరుఁడును రాముఁడును విడిచిన బాణములన్నియు, నాకాశమును గప్పివైచినవి. అట్లుఖరుఁడు తీవ్రమైన బాణములతోఁ గొరడాఁబట్టి యేనుగును గొట్టినట్లుగా రాముని గొట్టనారంభించెను. రథముపై, ధనుర్ధారియై నిలిచిన ఖరుఁడు పాశహస్తుఁడైన యమునివలెఁ గన్పట్టెను. వెండియు నాతఁడు రామునిజూచి, తన సర్వసైన్యమును జంపుటచే నాతఁడలసియున్నట్లు భావించెను. మహాపరాక్రమ శాలియై యత్యంత వేగోద్రేకములతోనున్న యాఖరునిజూచి, సింహము క్షుద్ర మృగమును జూచినట్లు నిర్లక్ష్యముగాఁ జూచెను. ఆఖరుఁడు సూర్యసమాన కాంతితో వెలుఁగుచున్న రథముపైనుండి, యగ్నిజ్వాలలోఁ బడుటకుఁ బ్రదుర్కొచున్న మిడుతవలె, రాముని సమీపించెను. అంతనాతఁడు తనహస్తలాఘవమును బ్రదర్శించుచు, రామునిపై, బాణములను విడిచి, యారాముని ధనువును మధ్యకు ముక్కలగునట్లు చేసెను. వెంటనే వజ్రాయుధములవంటి, యేడుబాణములఁ బ్రయోగించి, శ్రీరాముని గవచముపైఁ గొట్టఁగా, నదిసూర్యకాంతిని విరజిమ్ముచు, నేలపైఁబడిపోయెను. కవచము లేనివాఁడైనను, శ్రీరాముఁడు ప్రకాశించుచుండఁగా, నాతనిపై, వేలకొలఁది బాణములతోఁ గొట్టెను. ఆవిధముగాఁ గొట్టువడిన శరీరముగల్గవాఁడై పొగలు లేని యగ్నివలెఁ బ్రకాశించెను. శ్రీరాముఁ డావెంటనే వేఱొక ధనుస్సును బట్టికొని, గంభీరముగా సింహగర్జనఁ

గావించెను. అది వైష్ణవ ధనుస్సు అగస్త్యమహర్షిచే నీయఁబడినది. అట్టిదానిఁబట్టి రాముఁడు ఖరునివైపు పరుగెత్తెను. ముందుగా నాఖరునియొక్క ధ్వజమును నేలఁగూల్చెను. ఖరుఁడును నవమానభారముతోఁ గోపించి,తీవ్రమైన బాణములతో రామునిఁగొట్టెను. ఆబాణఘాతములచే రక్తముతో నిండిన శరీరముగలవాఁడైనను, లక్ష్యముసేయక తీవ్రముగాఁ గోపించి, ధనువున కారుబాణములను దొడిగి, ఖరునిపైఁ బ్రయోగించెను. అందొక బాణము శిరస్సునందును, రెండు బాణములు రెండుబాహువులయందును, మూఁడుబాణములర్ధచంద్రాకారములై, గుండెలయందును దగిలి యాఖరుని భయకంపితుని గావించినవి. పిమ్మట శ్రీరాముఁడు, పదమూఁడు బాణములను బైకిఁదీసెను. వానిలో నొకబాణముచే, వానిరథముయొక్క కాడిని, నాలుగుబాణములచే, రథమునఁ గట్టఁబడిన గుఱ్ఱములను, నారవ బాణముతో సారథిని, మూఁడవబాణముతో రథముయొక్క నొగలను, (తొట్టె) పండ్రెడవ బాణముతో వానిచేతనున్న ధనువును, బదమూఁడవ బాణముతో నారాక్షసుని శరీరమును గురిచేసి, తీవ్రముగాఁ గొట్టెను. అంతనాఖరుఁడు నన్నియును బోగాఁజేయునది లేక నేలపైకురికి గదనుబట్టికొని, రామునివైపు రాఁదొడఁగెను. ఆసమయమున శ్రీరాముఁడు చూపిన బలపరాక్రమములకు నాకాశమున విమానములపైనుండి యంత

యును బరికించుచున్న దేవతాగణంబులు చేతులజోడించి శిరంబులువంచి, యాతనికి భక్తిపూర్వక నమస్కారములఁ గావించిరి.

## శ్రీరాముఁడు ఖరుని దూషించుట

గదాపాణియై, నేలనిలిచిన ఖరునిజూచి, శ్రీరాముఁ డిట్లనుచున్నాఁడు. ఓరీ! నీచాధమా!, చతురంగబలసమేతుఁడవై, గర్వించి, యెన్నియోదుష్కర్మలఁ జేసితివి. సర్వజీవకోటిని జంపుచు, దుఃఖంపఁజేయుచుఁ బాపకార్యములను జేయు, నీవంటివాఁడు ముల్లోకములకును బ్రభువైయున్నను నశించకతప్పదు.

శ్లో॥ కర్మ లోకవిరుద్ధంతు, కుర్వాణం క్షణదాచర!
తీక్ష్ణం సర్వజనోహన్తి, సర్పం దుష్టమివాగతమ్.
స. 29 శ్లో॥-4

తా॥ ఓరీ! రాక్షసా! లోకపీడన కార్యాచరణుఁడై యెల్లనవాని నెల్లవారును భీకరమగు దుష్టసర్పమును జంపినట్లుగా జంపఁ బూనెదరు.

ఎంతటిమహోన్నత పదవియం దున్నవాఁడైనను సజ్జన హంతకుఁడై, జనులఁబీడించువానికి దుర్మరణము దప్పదు.

ఎవఁడైనను, లోభముచేఁగాని, కామముచేఁగాని, దుర్మార్గముగా గర్వించి, ప్రవర్తించినను, గొంతకాలము

నకైనఁ బశ్చాత్తాపము నందినచోఁ, గొంతవరకైన బాగు పడును. లేనిచో వడగళ్ళనుదిన్న నల్లికెళ్ళపాము వలె దుర్మర ణము నొందుట తప్పదు. ఓరీ! రాక్షసా! దండకారణ్య వాసులైన, మహామునుల నెందఱినో, చంపి, తినివేసితివి. లోకగర్హితులైనవారు వేళ్ళతోఁ బెలగించఁబడిన వృక్షముల వలెఁ, జిరకాలము సుఖించక సమూలముగా, సమస్తైశ్వర్య ములతోడను నశించుదురు.

శ్లో॥ అవశ్యం లభతే జంతుః, ఫలం పాపస్య కర్మణః,
ఘోరం పర్యాగతే కాలే, ద్రుమాః పుష్పమివా ర్తవమ్.
స. 29 శ్లో॥-8

తా॥ ఆయాఋతువులలో నాయావృక్షములు పుష్పిం చును. అట్లే చేసిన దుష్కర్మములకుఁ దగినసమయము రాఁగానే దగినఫలమనుభవించక తప్పదు.

క్రూరకర్మలు తాత్కాలిక సుఖమునిచ్చినను గాలాం తరమున నవి దుఃఖములనే యొసంగును. కావున శాశ్వత సుఖముల నిచ్చుచుఁ దాత్కాలికముగాఁ గష్టములఁ గలిగించి నను సుకృతముబొనర్చుటధర్మము.

ఓరీ! రాక్షసాధమా! విషాహారమును దిన్నఫలము వెంటనే కలుగునట్లు, మహాఘోర పాపములఁజేసిన వారును, దత్ఫలమును ద్వరలోనే యనుభవించుదురు. ఓరీ! ఇంకను వినుము! మహాపాపులను లోకులను బీడించుటలో నాసక్తి

గలవారను, నగు దుర్మార్గులను సంహరించుటకే, నాతండ్రి దశరథుని యనుజ్ఞను దీసికొని, నేనీ యడవులకు వచ్చితిని సుమా! నేనిప్పుడు ప్రయోగించు వాడియైన బాణములు, పుట్టనుండి వెలువడు నాగులువలె, నీగుండెలంజీల్చి బయటకు రాఁగలవు ఇంతవరకును నిర్దాక్షిణ్యముగా, నేమునిగణంబును జంపితివో, నీవిప్పుడే, వారింజేరఁగలవు. నీవు చంపఁగా స్వర్గస్థులైన వారందఱును, నేఁడువిమానములపై నాకాశము నందునిలిచి నీసర్వసైన్యసమేతమైన నీయమలోకప్రయాణముం జూచి, యానందించుదురుగాక! ఓయధమాధమ రాక్షసుఁడా! ఇప్పుడు నీశక్తినంతను నాపైఁ జూపించుము. నీశిరస్సు ఇప్పుడే తాటిచెట్టునుండి పండి నేలంబడిన తాటిపండువలెఁ బడి పోవును. అని ఈవిధముగా, మాటలాడుచున్న శ్రీరాముని జూచి, మహాకోపముతో, నాఖరుఁడిట్లనుచున్నాఁడు.

## ఖరుని దుర్భాషలు.

ఓదశరథవీరకుమారా! దుర్బలులైన రాక్షసులను యుద్ధములోఁ జంపినంతమాత్రముననే, నిన్నునీవిట్లు పొగడి కొనుచున్నావు. బలపరాక్రమములు గలవారెవ్వరును దమ్ము! దాము పొగడికొనరు. ఓరామా! సామాన్య రాజాధములుమాత్రమే నీవలె, నాత్మస్తుతిని బరనిందలను జేయుదురు. యుద్ధసమయములో, మృత్యువు సమీపించి నప్పుడు నిశ్లేనీవలెఁ బొగడికొనువీరుఁడుండఁడు. నీమాటల

లోనే నీ తేలికదనము వ్యక్తమగుచున్నది. నీయెదుటఁ బర్వతమువలె, గదనుధరించియున్న నన్నుఁజూచితివా! చూచినచో నిట్లుప్రసంగించవు. నీప్రాణములను హరించుట కీగద చాలును. మూఁడులోకములకును బాశహస్తుఁడైన యముని వలె, నిలిచియున్న నన్నుజూడుము. ఆత్మశ్లాఘియైన నీకీవిషయమై యెంతయైనఁ జెప్పవలసియున్నను, మాటలతోఁ గాలయాపనఁజేసినచో, సూర్యాస్తమయమయి,మనయుద్ధమున కంతరాయము గలుగును. (సూర్యోదయముతోనారంభించి, సూర్యాస్తమయముతో యుద్ధమును జాలించుట యానాటి ధర్మము. ఇదియీనాఁడు పాటించకపోవుట కేవల మధర్మము) అధర్మపరులైన రాక్షసులుగూడ చాలమంది (పౌరుషముగల వారు. దీనినిబాటించెడివారనుట విశేషము.) నీవు సంహరించిన పదునాలుగు వేలమంది రాక్షసులకును, నిన్నుసంహరించి, వారికాత్మశాంతిని గలుగఁజేయుదును. అనిచెప్పుచునే ఖరుఁడు తనచేతనున్న పిడుగువంటిగదను, రామునిపై విసరెను. ఆగదయును దనకడ్డమైన చెట్లను, రాళ్ళను గొట్టివేయుచు, శ్రీరామసన్నిధికి వచ్చుచున్నది, మృత్యుపాశము వలెఁ దనపైకి రానున్నయాగదను, శ్రీరాముఁడు తనవాడియైన బాణములతో ముక్కలుగాఁ గొట్టివైచెను. ఆగదయు, మంత్రబలముచే, నేలఁబడిన సర్పమువలె, బడినది. దానినావిధముగాఁ బడఁగొట్టి, ప్రగల్భములు వలుకుచున్న ఖరునితో నిట్లనుచున్నాఁడు.

# ఖరుని సంహరించుట.

ఓరీ! రాక్షసాధమా! నీబలమంతయును దెలిసిపోయి నదిగదా! నీప్రగల్భములతోఁ జనిపోయిన రాక్షసులకు నాత్మ శాంతిని గలిగించుదు నంటివి. ఆమాటయు నబద్ధమైనది. ఇదిగో! ఇప్పుడే నీశరీరముపడిపోగా, నీరక్తము నీభూమి తృప్తిగాఁ ద్రావఁగలదు. దుర్లభమైన స్త్రీని గాగిలించికొని నట్లుగా నీవిప్పుడే యీభూమిని రెండుబాహువులతోడను, గాఁగిలించికొనఁగలవు. నీవునేలంబడి దీర్ఘనిద్రలో నుండగా, నీదండకారణ్య వాసు లందఱును నిర్భయముగా సంచరించఁ గలరు. ఈవనమున సర్వజీవులును హాయిగావిహరించఁగలవు. ఇందలి రాక్షస భార్యలందఱును గోలుగోలున నేడ్చుచు నెటకేని పారిపోవుదురు. నీ భార్యల కందఱకును గామ పురుషార్థము లేకపోగా దుఃఖ మనఁగా నిట్లుండునని తెలిసి కొందురు. ఓరీ! క్రూరుడా! నీచుఁడా! క్షుద్రబుద్ధిఁగలవాఁడా! నిత్యకృత్యముగా బ్రాహ్మణ హత్యా మహాపాపమును జేసిన వాఁడా! ఇంక మునులందఱును నిర్భయులై, యజ్ఞములందు హోమకార్యములను జరిపించికొందురు. అని యీవిధముగాఁ బలుకుచున్న రామునిపై దీవ్రమైనకోపముతో, నిటునటుఁ జూచి, యొక పెద్దమద్దిచెట్టును బెరికి, పెద్దగానరచుచు, "నీవిఁకఁ జచ్చితివిరా!" యని, దానినివిసిరెను. ఆవచ్చుచున్న మద్ది చెట్టును జూచి, శ్రీరాముఁడు తనబాణములతో, ముక్కలు ముక్కలుగాఁ జేసి, నేలంబడఁగొట్టెను. ఆతరువాత శ్రీరా

మఱియును గోపముతోఁ జెమటలు గ్రక్కుచు, నాఖరునిపై, వేయిబాణములను బ్రయోగించెను. ఆ బాణపుదెబ్బలకు ఖరుని శరీరమంతటినుండియును బ్రస్రవణపర్వతమునుండి గారుచున్న నీటిధారలవలె, రక్తధారలు గారినవి. అట్లురక్త ధారలతో దుర్వ్యాసనల గ్రక్కుచు వివశుఁడై, యారాక్షసుఁడు రాముని బట్టికొనుటకు వచ్చుచుండఁగా, నాదుర్వ్యాసనను భరించలేక యసహ్యించికొనుచు నొక్కయడుగు వెనుకకుఁ దగ్గెను. తరువాత వానినిసంహరించవలెనని, యగ్నిజ్వాలల వలె మండిపోవుచు, దేవేంద్రునిచే నొసంగఁబడిన, దివ్యాస్త్రమునుదీసి, ధనుస్సునం దొడిగి, వానిపైఁ బ్రయోగించెను. శ్వేతారణ్యమున రుద్రునిమూఁడవనేత్రముచే దహింపఁబడు చున్నయమునివలె, వాఁడా బాణాగ్నిచేమాడి, నేలబడి చనిపోయెను.

## దండకారణ్య ప్రశాంతి.

శ్రీరామునిసన్నిధి కాసమయమున రాజర్షులును, బ్రహ్మర్షులును సమస్తదేవతాగణములును వచ్చి "ఓరామా! ఇందులకే దండకారణ్యవాసులైన మునులందఱును నిన్ను గూర్చి ప్రశంసించిరిసుమా! మహర్షులందఱు నాలోచించియే, యీరాక్షస వధార్థమై, నిన్నిట్లుపంచవటికి రప్పించిరి. ఓదాశరథీ! మాకుఁ గావలసిన కార్యము సంపూర్ణముగా ఫలించినది. ఈయరణ్యమున, మహర్షు లందఱును, నిర్భయముగాఁ

దమతమ ధర్మములను నెరవేర్చికొందురు. ఇట్లు శ్రీరాముని వినుతించుచుండఁగా, నాకాశమునుండి దేవదుందుభులు మ్రోగినవి. దేవతలు శ్రీరామునిపైఁ బుష్పవృష్టిని గురిపించిరి. ఆహా! ఈ శ్రీరాముని బలపరాక్రమములు ధైర్యము, సమయానుకూల భయంకరత్వము మొదలగువానినేమని యెంతఁగా వర్ణించఁగలము? ఆనాఁడు మహావిష్ణువు రాక్షస సంహారమునఁ జూపిన లక్షణములన్నియు నీనాఁడు శ్రీరామునియందుఁ జూడఁగలిగితిమి. అని మహర్షులును దేవతలును వారిలోవారు, చెప్పికొనుచు, శ్రీరాముని యనుజ్ఞవడసి స్వర్గమునకుం బోయిరి.

అనంతరము లక్ష్మణస్వామి, సీతాదేవిని వెంటఁబెట్టికొని, కొండగుహనుండి, శ్రీరామసన్నిధికి వచ్చెను. శ్రీరాముఁడును విజయమును సాధించి, మహర్షులచేఁ బూజింపఁబడి, పర్ణశాలం బ్రవేశించెను. ఇంతకుఁ బూర్వమీయరణ్య సంచారమునందే శ్రీరాముఁడు మహర్షులకిచ్చిన వాగ్దానము విషయమై, ధర్మశంకతోఁ బ్రశ్నించిన సీతాదేవి తన పరోక్షమునఁ దానే కారణముగా (శూర్పణఖ సీతను మ్రింగఁబోయిన కారణముగా) నసహాయ శూరుఁడై పదునాలుగు వేలమంది రాక్షసులను ఖరదూషణ త్రిశిరాదులను నర్ధాదికముహూర్త కాలములో సంహరించుటయు సమస్త మహర్షులును, దేవతలును నానందముతో రాముని బూజించుటయును దెలిసికొనిన సీతాదేవి యానంద పరవశయై

శ్రీరాముని గాఢముగా నాలింగన మొనరించి శ్రీరాముని కదియే కానుకగా నొసంగెను. (ఇచ్చట సీతాదేవి, పరాశక్తి స్వరూపిణి యగుటచే, శ్రీరాము నంతవరకును బాధించుచున్న శారీరకమైన గాయములు నాయాసమును దొలఁగిపోయి స్వస్థుఁడగునట్లుగా నాలింగనమొనరించి, తనశక్తి నొసంగినది. మఱియు, శ్రీరాముఁడు పరాత్పరుఁడగుటచేఁ దనవిశ్వరూపమును జూపించి, పదునాలుగువేల రామరూపములతో ముహూర్తకాలముగూడ మించకుండునట్లుగా రాక్షసులను సంహరించినట్లు భావించవలెను. ఈకార్యము నింత స్వల్పకాలములో నెరవేర్చుట మానవులకేగాక, దేవతలకు నసాధ్యమైనదని చెప్పవచ్చును.) ఆయుద్ధభూమిలో నంతమందిరాక్షసులు పడియుండుటను గమనించి, శ్రీరాముఁడే మాత్రము నలసిపోకుండుటను గూడఁ దెలిసి, సీత పరమానందభరితురాలైనది. దానితో మఱల నామె శ్రీరాముని గాఁగిలించికొనినది.

## అకంపనుఁడు లంకకుఁబోయి రావణునితో రామునిగూర్చి చెప్పుట

శ్రీరాముఁడు తానొనర్చిన మహాత్కార్యమునకు సాక్ష్యాధారముగా మిగిల్చెనేమో! యన్నట్లుగా "అకంపనుఁడను వానిని జంపక విడిచిపెట్టెను. అట్టివాఁడు జనస్థానము

నుండి వేగముగా లంకకుఁబోయి, రావణుంజూచి, యిట్లను చున్నాఁడు. (సీతాపహరణాది రావణవధాంతము వరకును జరిగినచరిత్రకు బీజప్రాయుఁడే యీయకంపనుఁ డనిచెప్ప వచ్చును.)

మహారాజా! జనస్థానమున నీవుస్థిరముగానుంచిన, ఖర దూషణ త్రిశిరాదులైన పదునాలుగువేల మందిరాక్షసుల, నసహాయశూరుఁడైన శ్రీరాముఁడొక్కఁడే సంహరించెను. అనఁగావిన్న రావణుఁడు క్రోధమూర్ఛితుఁడై, యెఱ్ఱని గన్నుల నటునిటుద్రిప్పుచు, తనచూపులతోడనే సర్వమును దహించుచున్నవానివలె, నకంపనునితో నిట్లనుచున్నాఁడు. ఓరీ! అకంపనా! నాసుందర జనస్థానమును నాశముచేసినవాఁ డీములోకంబులకునేగినను జచ్చినవాఁడే యగును. నాకప కారముచేసి, యింద్రాది, దిక్పాలకులుగాని, తుదకు మహా విష్ణువైనను, బ్రతుకలేరు. యమునకుఁగూడ నేను యముఁడను, మృత్యుదేవతకు మృత్యువును గలిగించఁగలను. నేను గోపించినచో, సూర్యచంద్రులనైనఁ గాల్చివేయఁగలను. వాయు వేగమునైన నరికట్టఁగలను. అనిపలుకుచు మహాకోపముతో నున్న రావణునిజూచి, యకంపనుఁడు చేతులుజోడించికొని, ముందుగా నభయమును గోరగా, వానికభయమిచ్చి, జరిగిన దానిని వివరముగాఁ జెప్పుమని, యాజ్ఞచేసెను. అప్పు డా యకంపనుఁ డిట్లనుచున్నాఁడు.

## శ్రీరాముని గూర్చి - యకంపనుని - వివరణ

మహారాజా! వినుము! దశరథుని కుమారుండైన శ్రీరాముం డనువాఁడుకలఁడు. సింహామువంటి శరీరావయవములు గల వాఁడు. అతఁ డాబోతు మూపువంటి యెత్తైన మూపులు గలవాఁడు. మఱియు, మహావీరుఁడై, శోభాయమానమైన విఖ్యాతిని గడించినవాఁడు. సాటిలేని బలపరాక్రమముతో ధనుర్బాణములను ధరించి, జనస్థానమునఁగల వీరుల నందఱ నతిస్వల్పకాలములో సంహరించినాఁడు. అని యీవిధముగాఁ జెప్పిన యకంపనుని మాటలువిని నల్లత్రాఁచువలె, బుసలు గొట్టుచు రావణుఁ డిట్లనుచున్నాఁడు. ఓయీ! అకంపనా! ఆరాముఁడు దేవేంద్రాది సమస్తదేవతలంగూడి జనస్థానము నకు వచ్చినాఁడా! చెప్పుము! (అట్లుగానిచో, మానవుఁడైన రాముఁ డొంటరిగా నింతపనిని జేయలేఁడని రావణుని భావము.) అనఁగావిని యకంపనుఁ డిట్లనుచున్నాఁడు. ఓరాక్షసప్రభువరేణ్యా! వినుము! రాముఁడు ధానుష్కులం దెల్ల శ్రేష్ఠుఁడు. యుద్ధమున దేవేంద్రునివలె దివ్యాస్త్రముల నెల్ల నెఱింగి ప్రయోగింప సమర్థుఁడు. అతనికి సర్వవిధము లను దీటైన శక్తిసంపన్నుఁడు లక్ష్మణుఁడను తమ్ముఁడు గలఁడు. రాముఁడు భేరీవలె గంభీరధ్వని గలవాఁడు. చంద్రునివంటి యాకర్షణీయమైన ముఖముగలవాఁడు. సుక్షత్రియుఁడై, శ్రీమంతుఁడైన శ్రీరామునకు, నగ్నికి వాయువుతోడైనట్లుగా, లక్ష్మణుఁడు సహాయుఁడుకాఁగా,

జనస్థానమునందున్న రాక్షసుల నందఱను సంహరించెను. అంతియేగాని దేవేంద్రాదు లెవ్వరును వారికి సహాయులుగా లేరు. ఇదినిశ్చయము. శ్రీరాముఁడు బంగారుకొనలును ఱెక్కలును గలిగి యైదుముఖములుగల సర్పములవంటి బాణములను బ్రయోగించఁగా, నవి నాగరాజులై రాక్షసుల నెల్లరను జంపినవి. మహారాజా ! రాక్షస సైన్యమెక్కడెక్కడ నెంతెంతమంది యున్నారో, యక్కడక్కడ నంతంతమంది, రాములను జూచితిని. ఈవిధముగా జనస్థానమంతయును నాశమైనది. ఆమాటలువిన్న రావణుఁడు క్రోధోద్రేకముతో లేచి, నేనిప్పుడే జనస్థానమునకుం బోయి, యారామ లక్ష్మణులంజంపి వచ్చెదననెను. అంత నకంపనుఁ డాతనిని, వారించి, మహారాజా ! రామునియొక్క బలపౌరుషములున్నది యున్నట్లుగాఁ జెప్పెదనువినుము. అనియిట్లు చెప్పఁదొడఁగెను. రాజేంద్రా ! శ్రీరాముఁడు బలపరాక్రమములం దసాధ్యుఁడు. మహావేగముగల ప్రవాహమునైన నాపి వేయఁగలఁడు. ఆశ్రీమంతుఁడు గ్రహనక్షత్రములతోఁగూడిన యాకాశమునైన నశింపఁజేయఁగలడు. అంతియేగాక సముద్రమున మునిగిపోయిన భూమినైనను దనబాణములతోఁ బైకిఁ దేల్పఁగలఁడు. మఱియు వినుము. శ్రీరాముఁడు తనబాణములతో సముద్రపుఁ జెలియలికట్టనైన భేదించి, యానీటిని భూమిపైఁ బ్రవహింపఁ జేయఁగలఁడు. జలవాయువేగములను గూడఁ దనబాణములతో నాపివేయఁగలఁడు. అంతయేందులకు ? ఒక్కమాటలోఁ జెప్పవలెనన్న నీవిశ్వమంతయు

నాశముగావించి, మఱల సర్వజీవులతోఁడను సృష్టించఁగలఁడు. పాపులకు స్వర్గము సాధ్యముగానట్లు శ్రీరాముఁడు నీకు జయింప నసాధ్యుఁడు. సమస్త దేవతాసురగణంబు లేకమై నను, రాముని వధించుట సాధ్యముగానిపని. అయిన నాత నిని జయించు నుపాయమును జెప్పెద నాలింపుము! అతని భార్య 'సీత' యనునామె వెంటనున్నది. ఆమె సర్వావయవ సౌష్టవముగలదై నవరత్నములను బొదిగిన బంగారు నగలతో నలంకరించుకొన్నదై, స్త్రీలకెల్లఁ దలమానికమై, ప్రకాశించు చుండును. దేవ గంధర్వాప్సరాదులం దెవ్వరు నామెకు సాటిరారు. అట్టియెడ మానవులలో నంతటి యందగత్తె లేద నుట యనవసరము. అని యకంపనుఁడు చెప్పఁగా విని రావ ణుఁడు కొంతసే పాలోచించి, యిట్లనియెను. ఓయీ! అకం పనా! నీమాట నాకర్థమైనది. మంచియుపాయమునే చెప్పి తివి. నేనిప్పుడే రథముపైఁబోయి, యాసీత నపహరించి, లంకకుఁ దీసికొనివచ్చెదను. అనిపలికి వెంటనే గాడిదలఁ బూన్చిన రథమునెక్కి, సూర్యసమాన తేజస్సుతోఁ బ్రయాణ మయ్యెను. ఆరథ మాకాశగమనమున, మేఘముల చాటునఁ జంద్రునివలెఁ బ్రకాశించినది. ఆవిధముగా నారావణుఁడు మారీచాశ్రమముం బ్రవేశించెను. మారీచునిచే నొసంగఁ బడిన మాంసాది భక్ష్యభోజ్యముల నారఁగించి, పూజింపఁ బడెను, అంత సుఖోపవిష్టుఁడైన రావణుని జూచి, మారీచుఁ డీవిధముగాఁ గుశలప్రశ్నలఁ గావించెను. మహారాజా! నీకెల్లవిధములను గుశలమేగదా? నీవింత వేగముగా నొంట

రిపై యిచ్చటకు వచ్చుటలో నేదేనియొక యుపద్రవము సంభవించినట్లు భావించుచున్నాను. నావుఁడు రావణుఁడు మారీచునితో నిట్లనుచున్నాఁడు.

## రావణునకు మారీచుఁడు హితము చెప్పుట

నాయనా ! మారీచా ! జనస్థాన మంతయును, రాక్షస విరహితముగా, శ్రీరామునిచేఁ జేయఁబడినది. నాతనిభార్య నపహరించుటకు నీసాయముగోరి వచ్చితిని. అనఁగా, మారీచుఁడిట్లనియెను. ఓరాక్షసప్రభూ ? నీకుమిత్రునివలె నటించుచు, శత్రువై, సీత నపహరించు మని యెవఁడు చెప్పి నాఁడు ? నాకుఁ దెలియఁజెప్పుము. ఈరాక్షస వంశమున కెవఁడీవిధముగా నీకుఁ జెప్పినాఁడు? పైగా నీయైశ్వర్యాదు లనుజూచి సహించనివాఁ డెవఁడో మాటలను జెప్పినాఁడు ? సీతనపహరించు మన్న యుపాయము చెప్పినవాఁ డెవఁడో ? నాకుఁజెప్పుము. రాక్షస లోకమునకే నాశము గలిగించుట కీయుపాయము చెప్పియుండును. మఱియు, నాగరాజుయొక్క కోఱలనుబట్టి, పెరుకుమని నీకువాఁడెవఁడో, యుపాయము చెప్పినాఁడు. అట్టివాఁడు నీకుశత్రువేగాని మిత్రుఁడుగాఁడని యెఱుంగుము. సుఖముగా నిద్రించు నీతలపై గొడ్డలితోఁ గొట్టినట్లుగా నీదుష్టమార్గము నుపదేశించినాఁడు. పవిత్ర వంశ మనెడి తొండమును, ప్రతాపమనెడి మదంబును, బాహువులనెడి దంతములును గల, శ్రీరాముఁడనెడు మదపు

యేనుగుపై నీవు యుద్ధమున నెదురుగా నిలువలేవు. (ఏయేనుగు యొక్క మదపువాసన దగిలినంతనే, మిగిలిన మదగజములు పారిపోవునో, అట్టియేనుఁగునే "మదగంధహస్తి" యందురు.) యుద్ధమునఁ గోపముతోఁ దోకనుబైకెత్తి యాడించునదియు, యుద్ధవిశారదులైన రాక్షసులనెడి లేళ్ళను, జంపునదియు, బాణములనెడు వాడియైన గోళ్ళుగలదియుఁ, బదునైనఖడ్గములనెడు, కోఱలుగలదియునగు, శ్రీరామ సింహము నెవఁడు దరిఁజేరఁగలఁడు ? ఓరావణా ! ఇంకనువినుము ! ధనువనెడి మొసలియు, భుజవేగమనెడి కంపముగలదియు, బాణపరంపర లనెడు కెరటములు గలదియు, మహాయుద్ధమే జలప్రవాహముగాఁ గలదియు, నగు శ్రీరామ మహాసముద్రమునఁగల, పాతాళముయొక్క బిలాముఖంబున నీవుపడుట కుద్యమించుట మంచిదిగాదు. ఓరాక్షసేంద్రా ! నేనిట్లను చున్నందులకు నన్ననుగ్రహించుము. లంక కుపద్రవము దెచ్చిపెట్టక శాంతచిత్తుఁడ వగుము. లంకలో నీయందత్యంతానురాగములతో నున్న భార్యలతో రమించుచు విహరించుము. శ్రీరాముఁడు దన భార్యతో సుఖముండుఁగాక.! అని మారీచుఁడు చెప్పిన హితవాక్యములను విని, రావణుఁడు మఱలిపోయి, లంకలోఁ దనభవనమున సుఖముగాఁ బ్రవేశించెను.

# శూర్పణఖ రావణుని ప్రోత్సహించుచు - నుపాయము చెప్పుట

జనస్థానమునఁగల సమస్తరాక్షసవీరులు జనిపోవుటయు, శ్రీరాముని బరాక్రమమును గండ్లారఁజూచిన, శూర్పణఖ గోలుగోలున నేడ్చుచు. లంకకుంబోయి, రావణుని కొలువుకూటమునఁ బ్రవేశించి దొర్లిదొర్లి యేడువనారంభించినది. ధగద్ధగాయమానముగా వెలుగుచున్న సింహాసనముపై, రావణుఁడు గూర్చొనియుండెను. ఆరావణుఁడు దేవగంధర్వాదులకుఁగాని మహర్షులకుఁగాని యజేయుఁడై నోరుఁదెరచియున్న యమునివలె నుండెను. ఆతని భుజములు దేవగంధర్వాదులతో యుద్ధము లనేకపర్యాయములు చేయుటచేఁ గాయములన్నియు గాయలుగాచియున్నవి. ఐరావతము యొక్క దంతముల దెబ్బలచే నాతని వక్షస్థలము ప్రకాశించుచున్నది, అట్టి రావణుఁడు సింహాసనమున వీరాసనమువైచికొనియుండెను. ఇరువది భుజములతోడను విశాల వక్షస్థలముతోడను గూర్చొని సమస్త ఛత్రచామరాది రాజలాంఛనములతో నొప్పియున్న యారావణుని శూర్పణఖ చూచినది. మఱియు నాతనిశరీరమంతయును, విష్ణుచక్రఘాతములును, ననేక శస్త్రాస్త్రఘాతములను నలంకారములుగాఁ గలిగియుండెను. అట్టివాఁడు సముద్రముల నన్నింటిని గలచివేయుటకుఁ గూడ శక్తిగలవాఁడు. మహాపర్వతములను గూడఁ జలింపఁ జేయఁగలవాఁడు. ధర్మాచరణమునువిడిచి, పరస్త్రీ

లోలుఁడైనవాఁడు. ముఖ్యముగా, బ్రాహ్మణులైన మహ
ర్షుల యజ్ఞములను నెన్నింటినో, ధ్వంసముచేసినవాఁడు, నాగ
లోక భోగవతీపురముం బ్రవేశించి, వాసుకిని జయించి, తక్ష
కుని భార్య నపహరించినాఁడు. కైలాసమునఁ గుబేరుని
జయించి యాతనిపుష్పకవిమానమును బలాత్కారముగాఁ
దీసికొన్న వాఁడు. మఱియు నాతనిఁజైత్రరథమును ఉద్యాన
వనమును భగ్నముచేసియు, దేవలోకమునందలి, నగరములను
ధ్వంసము చేసినవాఁడు. పెద్దకొండవలెనిలిచి, సూర్య
చంద్రాదులనుగూడ నుదయసాయంకాలము నడ్డగింపఁగల
బాహువులుగలవాఁడు. పదివేలసంవత్సరములు మహాతప
స్సునుజేసి, బ్రహ్మదేవు నుద్దేశించి, తనపదిశిరములను
హోమముచేసినవాఁడై దేవ దానవ గంధర్వ పిశాచ పత
గోరగములలోనెవరిచేతను జావులేకుండఁగా, (మానవు
లనువిడిచి) వరమును బడసినవాఁడు. యాగములయొక్క పరి
సమాప్తి కాలములందు, వానిని భగ్నముగావించెడివాఁడు.
బ్రాహ్మణహంతకుఁడు. సర్వలోకభయంకరుఁడు. అట్టివాఁడు
పౌలస్త్యవంశమున జన్మించి, శత్రుహంతకుఁడై, యధర్మ
ప్రవర్తకుఁడై, యానాఁడుసమస్త మంత్రిపరివారముతోఁ గొలు
వుండఁగా, శూర్పణఖ చూచి, భయముతో గడగడవడం
కుచు, ముక్కును జెవులును లేని విరూపముతో నిట్లనుచున్నది.

## శూర్పణఖ - రావణునకు - జెప్పినరాజనీతి
## (శ్రీరామునితో - యుద్ధమునకుఁ బురిగొల్పుట)

లోకకంటకుఁడై నిశ్చింతగా, మంత్రులమధ్యనున్న తనయన్నయగు రావణునిజూచి, శూర్పణఖ తనదుఃఖము కోపముగా మార్పుఁజెంద నిట్లనుచున్నది. అన్నా! రావణా! నీవు కామోపభోగ ప్రమత్తుఁడవై, నిరంకుశముగా సంచరించుచున్నావు సమీపించిన ఘోరాపదను తెలిసికొనలేకున్నావు. (అరిషడ్వర్గములలోఁ గామము బలీయమైనది. అట్టి దానివలన ఫల మనుభవించిన దగుటచే ముందుగా రావణుని కామగుణమునుగూర్చి నిందించుచున్నది.) పామర కామ్య భోగములం దాసక్తిగల వానినిగాని లుబ్ధునిగాని, ప్రజలు శ్మశానాగ్నిని జూచినట్లుగా, భయపడుదురు. ఏరాజు సమయమువచ్చినప్పు డప్రమత్తుఁడై, రాజకార్యమును నిర్వహింపఁడో, వానికార్యములేగాక వంశముగూడ నశించకతప్పదు

శ్లో॥ అయుక్తచారం దుర్దర్శ మస్వాధీనం నరాధిపమ్ ।
వర్జయన్తి నరా దూరా, న్నదీపంక మివ ద్విపాః ॥

స. 33, శ్లో॥-5

తా॥ ఓరావణా! ప్రభువైనవాఁడు గూఢచారులను నియమించకొనవలెను. ప్రజలకు నాయా సమయములందు దర్శనమిచ్చుచు, వారియోగక్షేమములను విచారించవలెను. చెప్పుడుమాటలకుఁ జెవినొగ్గక, స్వయముగా విమర్శించుచుండవలెను. ప్రభు వావిధముగాలేనిచో, నదియందలి బుర

దశ జూచి. యేనుఁగులు దూరముగాఁ దొలఁగిపోవునట్లు, ప్రజ లారాజునువిడిచి పోవుదురు.

ప్రభునైనవాఁ డప్రమత్తుఁడై, స్వయముగా నాలోచించి, ప్రజాశ్రేయస్సును గమనించి, కార్యములను నిర్వహించవలెను. (ఆత్మబుద్ధి స్సుఖంచైవ అనిసూక్తి)

శ్లో॥ యే నరక్షంతి విషయ మస్వాధీనా నరాధిపాః ।
తే, న వృధ్యా ప్రకాశ న్తే గిరయ స్సాగరే యధా ॥
స. 33 శ్లో॥-6

తా॥ ఇంద్రియనిగ్రహములేక, పరస్త్రీలోలురై, ప్రజలను జక్కఁగాఁ బరిపాలించని రాజు నెంతటివారైనను, సముద్రమున మునిఁగిన మహాపర్వతములవలెఁ బ్రకాశించరు.

స్త్రీలోలుఁడైన రాజు తార్ప్యుఁగాండ్రైన వారికి లోఁబడి నశించుట తప్పదు.

అన్నా! సర్వదేవతాగణములతోడను నీవుబలవద్విరోధివై యున్నావు. చారులద్వారా యెప్పటికప్పుడు వారలను వారిచేష్టలను దెలిసికొని ప్రతీకారము చేయవలెను. అట్లైననే నీవురాజ్యమును నిలుపుకొనఁగలవు. నీవుభోగచాపల్యముతో బాలునివలె బుద్ధిహీనుఁడవైనచోఁ దెలిసికొనవలసిన విషయములను దెలిసికొనుటకుఁ బ్రయత్నించక, రాజువై, ప్రజల నెట్లు పరిపాలించఁగలవు?

శ్లో॥ యేషాం చారశ్చ కోశశ్చ, నయశ్చ జయతాంవర ।
అస్వాధీనా నరేంద్రాణాం ప్రాకృతై స్తైర్జనస్తే స్సమాః ॥
స. 33 శ్లో॥-9

తా॥ ఓయీ! రావణా! నీవుజయశీలుఁడవు. ప్రభువన్న వానికెల్లఁ జారులును, ధనరాశులును, నీతిశాస్త్ర నిపుణులైన మంత్రులును, సమృద్ధిగానుండియు వశముగాకయున్నచో నట్టిప్రభువు ప్రాకృతజనునితో సమానుఁ డగుచున్నాఁడు.

ప్రభువు నేర్పరులైన గూఢచారులను, సమృద్ధిగా ధనరాశులను మేధావులైన మంత్రులను గలిగియుండియు వారిని సమయాసమయములలోఁ జక్కగా నుపయోగించి కొనవలెను. ఎప్పుడును వారిని నిర్లక్ష్యము చేయుట రాజ ధర్మముగాదు.

శ్లో॥ యస్మా త్పశ్యంతి దూరస్థాం, త్సర్వానర్థా న్నరాధిపః।
చారేణ తస్మా దుద్యంతే, రాజానో దీర్ఘచక్షుషః ॥
స. 33 శ్లో॥-10

తా॥ అన్నా! ఓరాక్షసరాజా! ప్రభువైనవాఁడు తగిన గూఢచారులను నియమించి, యెక్కడెక్కడేమేమి జరుగు చున్నదియుఁ దెలిసికొనుచుండవలెను. అట్టిరాజులే 'దీర్ఘ చక్షువు' లనఁబడుదురు. (దూరములో జరుగుచున్న వానిని దెలిసికొనువారు) "రాజానశ్చారచక్షుషః" అనినీతి.)

రాజైనవాఁడు తగినంతమంది గూఢచారులద్వారా సర్వమును దెలిసికొనుచు, నప్రమత్తుఁడై యుండుటధర్మము.

ఓయన్నా ! మనజన్థాన రాక్షసహీయ లందఱును జని పోవుట నీకు దెలియను. కావున నీకుసరియైన గూఢచారులను, దెలివైన మంత్రులును, లేరని తెలియుచున్నది. పరమ మూర్ఖు లెందఱున్న నేమిప్రయోజనము ? ఆజనస్థానవాసు లైన రాక్షసులందఱును ఖరదూషణాదులతోఁగూడ, నొకే యొక రాముఁ డనువానిచేఁ జంపఁబడిరిసుమా ! ఆరాముఁడు దండకారణ్య వాసులైన మునీశ్వరుల కందఱకును ముందుగానే యభయమిచ్చి, తన ప్రతిజ్ఞను నెరవేర్చి కొనినాఁడు. నీరాజ్య మున, బుట్టిన మహాఘోరకృత్యము నెఱుంగనివాఁడవై, లుబ్ధుఁడవైతివి. మఱియుఁ బ్రమత్తుఁడవైయున్నట్లు తెలియు చున్నది.

శ్లో॥ తీక్ష్ణ మల్పప్రదాతారం ప్రసుప్తం గర్వితం శఠమే ।
వ్యసనే సర్వభూతాని నాభిధావంతి పార్థివమ్॥

స. 13, శ్లో॥ 15

తా॥ ఓయీ ! రాక్షసమహారాజా ! వినుము ! క్రూరుఁడై, కష్టమునకుఁ దగిన ప్రతిఫలము నీయనివాఁడై, మదముతో గర్వించినవాఁడై, మోసగాఁడైన, నెంతటి రాజు నకైన నాపత్సమయములలో నెవ్వరును సాయపడరు.

ఎంతగా ధనమున్నను, శారీరకబల మెంతయున్నను, ప్రజల నాయా సమయములలో నాదరించుచు వారివలనఁదా నుపకారములఁ బొందుట ధర్మము. అట్లుగానిచో వ్యసన

పరుడైనరాజును మంచితరుణములో సాయపడక యాపదల పాలు సేయుదురు.

శ్లో॥ అతిమానిన మగ్రాహ్యం, మాత్మసంభావితం పరమ్।
క్రోధినం వ్యసనే హన్తి, స్వజనోఽపి మహీపతిమ్॥
స. 33 శ్లో॥-16

తా॥ దురహంకారముతో సజ్జనదూషకుఁడై, తనను దాను బొగడుకొనుచు, కారణములేని క్రోధముగల రాజును దన బంధు మిత్రులైనవారే సమయమునుజూచి, సంహరించుదురు.

ఆత్మశ్లాఘ పరనింద, నిష్కారణదురహంకారక్రోధములు నెంతటిప్రభువునైన నశింపఁజేయును.

శ్లో॥ నానుతిష్ఠతి కార్యాణి భయేషు నబిభేతిచ।
క్షిప్రం రాజ్యా చ్చ్యుతో దీన స్తృణై స్తుల్యో భవిష్యతి॥
స. 33, శ్లో॥-17

తా॥ ఓరాజా! ఏప్రభువు, సకాలములో నాయా కార్యములను జేయుచు, నాపదలను భయముతోఁ దొలఁగించుకొనుటకు యత్నింపఁడో, అట్టివాఁడు రాజ్యభ్రష్టుఁడై, గడ్డిపరకలకంటెను విలువలేని వాఁడగును.

తనకెంతటి శక్తిసామర్థ్యములున్నను నాపదలువచ్చి నప్పుడు, ముఖ్యముగాఁ బ్రభువైనవాఁడు హానిని తొలఁగించి

కొనుటకుఁ బెద్దగా యత్నించుటధర్మము.

శ్లో॥ శుష్కైః కాష్ఠై ర్భవేత్కార్యం లోష్టైరపిచ పాంశుభిః।
నతు స్థానాత్పరిభ్రష్టైః, కార్యం స్యా ద్వసుధాధిపైః ॥
స. 33 శ్లో॥-18

తా॥ ఎండుకట్టెలు, మన్ను దుమ్ము, ననువానితోఁ బ్రయోజన మొకప్పుడు కలుగునుకాని రాజ్యభ్రష్టులైన సోమరిపోతులతో నెవరికిని బ్రయోజన ముండదు.

దైవవశాత్తుగాఁగలిగిన యధికారమును, లేక రాజ్య పదవిని, నిలఁబెట్టికొనుటకు నప్రమత్తుఁడై, ప్రజలను మెప్పించుట రాజు ధర్మము.

ప్రభువు తన దుష్కృత్యములచే రాజ్యభ్రష్టుఁడైనచో వాఁడెంతటివాఁడైనను వ్యర్థమగువాఁడే సుమా! అట్లుగాక కన్నులుమూసికొని నిద్రించుచున్నవాఁడే యైనను జార చక్షువులతో (గూఢచారులనెడుకండ్లతో) నంతయును దెలిసికొనుచు, మెలకువఁగలవాఁడే యగును. అట్టివాఁడు ప్రజారంజకుఁ డగుచున్నాఁడు. ఓరావణా! ఈగుణము లెవ్వి యును, నీయందుఁ గానరావు. కావుననే జనస్థానమున జరిగిన రాక్షస వధనుగూర్చి యేమియును దెలియక యిట్లు కులుకు చున్నావు. పరుల నవమానించువాఁడును, భోగపరాయణుఁ డును, దేశకాలతత్త్వముల ననుసరించనివాఁడును, బుద్ధి

హీనుఁడై, గుణదోషముల నెఱుంగనివాఁడును, నగు రాజు స్వల్పకాలములో నేరాజ్యమును బోగొట్టుకొని, నశించక తప్పదుసుమా! ఈవిధముగా రావణునకు శూర్పణఖ నీతులను జెప్పుట మూలముగా నిందించుచుండఁగా, నాతఁడును దనబుద్ధివిశేషముచేఁ జక్కఁగానాలోచించికొని, తనకున్న ధనము బలము, పరాక్రమము, ననువాని యాధిక్యతను బురస్కరించికొని, చాలసే పాలోచించెను.

## రావణుని రెండవమారు - సీతాపహరణ ప్రయత్నము.

శూర్పణఖచెప్పి పురిఁగొల్పిన మాటలన్నియును విన్న రావణుఁడు గొప్పకోపము నొందెను. మఱియుఁ దనను, మంత్రులమధ్య, నిష్టమువచ్చినట్లుగాఁ దెగనాడుచున్న శూర్పణఖనుజూచి తీవ్రకోప పరవశుఁడై, యిట్లనుచున్నాఁడు ఓసీ! చెల్లెలా! దుఃఖించకుము! రాముఁడనఁగా నెవఁడు? ఆతనిబల మెంత? ఆతని రూపమును బరాక్రమమును నెట్టివి? భయంకరమైన దండకారణ్యముల, కాతఁ డేల ప్రవేశించెను. ఈమొదలైన విషయములను జెప్పుము. వెండియు, ఖరదూషణాదు లెట్లుచంపఁబడిరి? ఆరాముని ముఖ్యమైన యాయుధమేది? అని ప్రశ్నించఁగా శూర్పణఖ యిట్లుచెప్పుచున్నది. అన్నా! రావణా! నేనుగని వినిన విషయములనే చెప్పుదును?

శ్రద్ధగా వినుము! శ్రీరాముఁ డాజానుబాహుఁడు. చెవుల పర్యంతమును విశాలములై వ్యాపించిన కన్నులుగలవాఁడు. నారబట్టలను లేడిచర్మమును ధరించినవాఁడు. మన్మథునితో సమానమైన రూపముగలవాఁడు, అయోధ్యాధిపతియైన దశరథమహారాజునకుఁ బెద్ద కుమారుఁడు, బంగారు పట్ట బంధముగలదై, యింద్రధనువు వంటి, బలిష్ఠమై, పొడవైన ధనుస్సుఁగలవాఁడు, అట్టి ధనువు నెక్కుపెట్టి మహావిషమును గ్రక్కు సర్పములవంటి బాణములను విడచును.

తనధనస్సును లాగుటయు, బాణములను దీయుచు వానిని సంధించుటయు, విడుచుటయు, నెప్పు డేవిధముగాఁ జేయునో, చూచుటకుఁ గానరానంత మహావేగమును గలిగి యుండును. అట్లు వేలకొలఁది బాణములను విడుచునప్పు డా ధనువుయొక్క గుండ్రనైన యాకారము మాత్రమే మనకు గోచరించును. అట్లు దేవేంద్రుఁ డాకసమునుండి రాళ్లవానను గురిపించునట్లు శ్రీరాముఁడు బాణవర్షమును గురిపించి, గురి దప్పక శత్రుసంహారమును జేయును. కేవలము నేలపై నిలిచిన శ్రీరాముఁ డొక్కఁడే, పదునాలుగు వేలమంది రాక్షసులను ఖరదూషణాదుల నర్ధాధిక ముహూర్తములో (ఒక గడియన్నర కాలములో) సంహరించి దండకారణ్య వాసులగు మునీశ్వరుల కిచ్చిన యభయ వాగ్దానమును నెరవేర్చి వారందఱిచేఁ బూజింపఁడి యుండెను.

శ్లో॥ ఏకా కథంచి న్ముక్తాహం పరిభూయ మహాత్మనా ।
స్త్రీవధం శంకమానేన రామేణ విదితాత్మనా. ॥

స. 34, శ్లో॥-4

తా॥ ఓరావణా! ధర్మాత్ముఁడును, మహాత్ముఁడునైన, శ్రీరాముడు, నాముక్కును జెవులనుగోసి, విడిచిపెట్టెనేగాని చంపలేదు. స్త్రీలను జంపుట ధర్మముగాదని నన్ను విడిచి యుండును.

ఎంతటి క్రూర పాపాత్మురాలినైనను దగినరీతిగా నవమానించి, విడువవలెనుగాని స్త్రీని జంపుటధర్మముగాదు. (శ్రీరాముఁడానాఁడు తాటకినిగూడ, ముక్కును జెవులను, దెగనరికి విడిచెనుకాని, యంత్రమాత్రమున నామె వెనుక కుంఁబోక హుంకరించునది. తండ్రిచే నీయఁబడి విశ్వామిత్రు నాజ్ఞను దండ్రియాజ్ఞఁగా భావించిన శ్రీరాముఁ డామెను సంహారించక దప్పఁలేదు. ఇచ్చట పితురాజ్ఞ గుర్వాజ్ఞను బాలి చుట ప్రథమ ధర్మసూత్రము.) అట్లే; అయోముఖియను రాక్షసినిగూడ ముక్కును జెవులనుగోసి విడిచినట్లుమున్ముందీ కాండలోనే మనము చదువఁగలము.

రావణా! ఇప్పుడు శ్రీరామునిగూర్చి చెప్పిన గుణ గణంబుల కేమాత్రమునుదీసిపోని, లక్ష్మణుఁ డను పేరుగల వాఁడాతని సోదరుఁడుగలఁడు. ఎంతటి మహావీరులకైన నాత, డొక్కఁడు చాలును. అతఁడు శ్రీరామునకుఁ గుడిబుజమైఁ బహిఃప్రాణమై యుండును. ఆ శ్రీరామునకు విశాలాక్షియుఁ

బూర్ణిమనాటి చంద్రబింబము వంటి ముఖము గలదియు నగు సీతయను భార్యగలదు. ఆమె నిత్యమును భర్తను విడువక యాతనిహితమునే గోరునది. చక్కని తుమ్మెదఱెక్కల వంటి కేశములును, బొడవై యందమైన ముక్కును, సుందర సుకుమారములైన తొడలును, గలదై, యావనమంతకును దేవతాస్వరూపమువలెను, రెండవ మహాలక్ష్మివలెను బ్రకాశించుచుండును. మఱియు నామె, మెఱుగువెట్టిన పదారువన్నె మేలిమిబంగారు చాయతో, నెఱ్ఱనై, పైకినుబ్బిన గోళ్ళతో సన్ననినడుముగలిగి ప్రకాశించుచున్నది. అన్నా! నేనింతవరకును, దేవ గంధర్వ యక్ష కిన్నర స్త్రీలలోఁగూడ నింతటి సర్వాంగసౌష్టవముగల స్త్రీమూర్తిని జూచియెఱుఁగను, ఆమె యెవనిని బ్రేమలో నానందముగాఁ గౌగిలించికొనునో. యాతఁడు దేవేంద్రునింబోలి సర్వసౌభాగ్య భాగ్యములను ననుభవించి, చిరంజీవియై యుండు ననుటకు సందేహము లేదు. అట్టిసీతను నీకు భార్యగాఁ జేయసంకల్పించి, ప్రయత్నించఁగాఁ, గ్రూరుఁడైన లక్ష్మణుఁ డీనాముక్కును జెవులను గోయఁగా నిట్లువిరూపినైతిని. అన్నా! నీవామెను జూచినంతనే, మన్మథబాణములతోఁ గొట్టఁబడి, యామెముఖారవిందమునుండి, నీదృష్టిని, మరల్పఁజాలవుసుమా! నిజముగా నీవామెను భార్యఁగాఁ జేసికొనఁదలఁచినచో, నిప్పుడే ముందుగాఁ గుడికాలును నేలమోపి, యారామలక్ష్మణులను సంహరించుటకుఁ బొమ్ము! ఓయీ! త్రిలోకవిజేతవైన

రాక్షసరాజా! ఆశ్రమవాసియై, వీరుఁడైన రాముని వధించి, చనిపోయిన రాక్షసుల కందఱకును బరలోకమునఁ దృప్తిని గలిగించుము. రామలక్ష్మణులు చనిపోవుటచే, నాసీతాదేవి, నిన్నే వరించును. ఓయీ! మహావీరా! నామాటలయందు విశ్వాసమున్నచో నన్ననుమానించక, వెంటనే యాపనికి నుపాయమాలోచించి, తగినప్రయత్నము చేయుము. ముందుగా నీబలమును శత్రుబలమును సరిఁజూచికొని, సర్వసౌభాగ్యవతియు, సర్వాంగసుందరియు నగు సీత నపహరించుము. అన్నా! శ్రీరాముని పరాక్రమాదులను నీకుమొదటనే చెప్పితిని. వింటివిగదా! కావున నేదేని మాయోపాయమునన్నైన శ్రీరామలక్ష్మణులనుజంపి, సీతను స్వాధీనము చేసికొనుము. అని శూర్పణఖ రావణునకు జెప్పెను.

శూర్పణఖచెప్పిన హితప్రియ వాక్యములనెల్ల వినినవాఁడై సీతాపహరణ దుర్బుద్ధిఁగల యారావణుఁడు మంత్రులతో నాలోచించి, యొకనిశ్చయమునకువచ్చి, వారిని బంపివైచి, యంతఃపురముం బ్రవేశించెను. సీతాపహరణమునెట్లుచేయవలయునా! యని, పరిపరివిధముల నాలోచించి, యొకనిశ్చయమునకువచ్చిన వాఁడై, యశ్వశాలకుంబోయెను. అచ్చట రహస్యముగా సూతుని లేవఁదీసి, రథమును సిద్ధము చేయుమని యాజ్ఞాపించెను. (ఇచ్చట రహస్యముగా ననుటలో, రావణుఁడంతవాఁ డొకమానవస్త్రీని మాయఁజేసి యపహరించినాఁడని యపయశస్సు గలుగుననియుఁ బెద్ద

లసహ్యించుకొందు రనియు నట్లు మంత్రులతో సామాన్య విషయముల నాలోచించి, పంపివేసి, తానొంటరిగా నెవరికిం దెలియకుండఁ బ్రయాణ మయ్యెనని చెప్పవలెను.) సారథి యును క్షణములో రథమును, బంగారు నాభరణములతో వేగగమనములైన గాడిదలను బూన్చి, సిద్ధముచేసెను. రావణుఁడు ఛత్రచామరాది రాజలాంఛనములతోఁ బదిశిరస్సులు గలవాఁడై యారథముపైఁ బర్వతరాజువలెఁ బ్రకాశించెను. మెఱపుదీగలతో నొప్పు మహామేఘమువలె, సమస్తాభరణములతోడను, నిరువదిచేతులతోడను గామగమనమైన యా రథము నెక్కియుండెను. ఆవిధముగాఁ బయనమై సముద్రముం దాటి యుత్తరతీరముం జేరెను. అచ్చట నీటితో నిండిన సరస్సులను, యజ్ఞవేదికలను జూచెను. మఱియు విమానములపై విహరించుచున్న గంధర్వులను, నప్సరసలను జూచెను. మఱియు నక్కడక్కడ నేనుంగులును గుఱ్ఱములును విచ్చలవిడిగాఁ దిరుగుచున్న పురంబులఁగాంచెను. ఆప్రాంతమంతయును మిట్టపల్లములులేక, చదునై, మెల్లగావీచుచల్లని గాలులతో హాయిగా నుండెను. వెండియు నాప్రాంతమున నూరుయోజనములు వ్యాపించి, పొడవైన కొమ్మలుగల, మునులకాశ్రయమైన న్యగ్రోధ వృక్షముంజూచెను. (మఱ్ఱి చెట్టు)

## న్యగ్రోధవృక్ష విశేషము

పూర్వము గరుత్మంతుఁడు పెద్దయేనుఁగును, నట్లే

పెద్దదైన తాబేలును దనకాళ్ళనిరికించికొని, యెగిరిపోవుచు, నీన్యగ్రోధవృక్షముయొక్క పెద్దకొమ్మపై వ్రాలి తినఁబోయెను. మొత్తమూమూఁడింటి భారమును భరించలేక యాకొమ్మ విరిగిపోవుటకు సిద్ధమైనది. ఆకొమ్మక్రింద సూర్యకిరణములనే త్రాగుచు నియమముగలవారును, నిత్యాగ్నిహోత్రము యొక్క పొగనుమాత్రమే ద్రావి తపస్సు చేయువారును, అయోనిజులు నగు వైఖానసులును, వాలఖిల్యులును, మాఘులునను మహర్షులు దపంబులు చేసికొనుచుండిరి. కావున నామహర్షులకాపదఁ గలుగకుండుఁగాక! యని, గరుత్మంతుఁ డాకొమ్మనువిడిచి, మఱియొకచోటికిఁబోయి, యాగజకచ్ఛపము లను దినివేసెను. ఆతరువాత నాతఁడు స్వర్గమునకేగి, యినుముతోడను, వజ్రములతోడను, గట్టఁబడియున్న, యింద్ర భవనమును భేదించి, యందలి, యమృతమును దెచ్చి కొనెను. అట్టి మహర్షులతోనిండి, గరుత్మంతుని గుర్తుగల కొమ్మనుగలిగి, "సుభద్ర" మను పేరుఁగల యామఱ్ఱిచెట్టును రావణుఁడుచూచెను. అట్టిమహావృక్షమును దాటివెళ్ళివెళ్ళి యొకానొకదివ్యమైన యాశ్రమమును జూచెను.

## రావణుఁడు రెండవసారి మారీచుని సాయమును గోరుట

ఆయాశ్రమ మందొకచోట మారీచుఁడున్న పర్ణశాలను జూచెను. అందునల్లని లేడిచర్మమును ధరించినవాఁడును.

జడలుగలిగి, నారబట్టలఁగట్టినవాఁడును, నాహారనియమముతోఁ దపస్సుచేసికొనుచున్నవాఁడును నగు మారీచుని జూచెను. ఆమారీచుఁడును రావణునిజూచి, యాతని కిష్టములై యమానుషములైన, మాంసాహారాదులతో నాతిథ్యమిచ్చి, పూజించెను. తరువాత మారీచుఁడిట్లనెను. మహారాజా! లంకలోనందఱును క్షేమమేగదా! ఏకారణముచే, నింతత్వరగా రెండవమారు దయచేసితివి! అనఁగా విని రావణుఁ డిట్లనుచున్నాఁడు.

## మారీచుని రావణుఁడు తనకు సాయపడుమని బలాత్కారముగా నొప్పించుట

ఓయీ! మారీచా! వినుము! నిజముగా, నేనార్తుఁడనై, నీవద్దకువచ్చితిని. ఇఁక నాకునీవే పరమగతివి. జనస్థానమున ఖరదూషణాది రాక్షసులును, శూర్పణఖయు నివసించి యున్నట్లు నీకుఁ దెలిసినదేగదా? వారందఱు నీదండకారణ్యముననున్న మునులను, నాయాజ్ఞానుసారముగా, బాధించుచు, బలదర్పములతో నివసించి యుండుటయును నీకుఁదెలియును గదా! అట్టి మనవారందఱు, నొకేయొకఁడైన రామునిచేఁ జంపఁబడిరి. ఖర దూషణ త్రిశిరులును, రామునిచేఁ జంపఁబడిరి. ఆకారణముగా, దండకారణ్య వాసులందఱును నిర్భయులై, సంచరించుచున్నారు. ఆక్షత్రియాధముఁడైన రాముఁడు తండ్రిచేఁ దరిమివేయఁబడి, భార్యతోఁగూడ

దండకకు వచ్చి, మనవారినందఱను సంహరించెను. ఆతఁడు దుశ్శీలుఁడు. కఠినాత్ముఁడు. క్రూరుఁడు. మఱియుఁ బరమ మూర్ఖుఁడు. లోభివాఁడు. ఇంద్రియనిగ్రహము లేనివాఁడు. అధర్మవర్తనుఁడు. ప్రాణిహింసాసక్తుఁడు. అంతియేగాక కారణము లేకుండఁగనే, నాచెల్లెలు శూర్పణఖయొక్క ముక్కును జెవులనుగోసి, సర్వరాక్షసులను జంపినాఁడు. అట్టి వానియొక్క దేవతాస్త్రీలనుగూడ మించిన సౌందర్యముగల భార్య నపహరింప వచ్చితిని. నీసహాయ సంపత్తు లున్నచో, దేవత లందఱును, నారామునకు సహాయులై వచ్చినను, జయించి, సీత నపహరించఁ గలను. ఈ తరుణమున నాకు సహాయపడుటకు నీవొక్కఁడవే సమర్థుఁడవు. పరాక్రమము నందుఁగాని, గర్వమునందుఁగాని, యుద్ధ నైపుణ్యము నందుఁ గాని, నీకునీవేసాటి. అందువలననే, నిన్నాశ్రయింప వచ్చి తిని. నాకు నీవు చేయఁదగిన సహాయమెట్టిదో, యదియును జెప్పెద నాలించుము! నీవు వెండిపాడలును, రత్నాలు పొదఁగ బడిన బంగారుచర్మమును గలిగిన లేడివై, శ్రీరాముని యాశ్రమ ప్రాంతమున సీతాదేవికి దగ్గరగా, విలాసఁగా సంచరించవలెను. అట్టి యపూర్వమైన బంగారులేడిని బట్టి తెమ్మని, యామె రామలక్ష్మణులను ప్రోత్సహించును. వారును నిన్ను బట్టుటకై, యాశ్రమమును వీడి వెడలుదురు. ఆసమయమున నొంటరిగానున్న సీతను, నేను సునాయాస ముగా, నపహరించఁగలను. తరువాత నారాముఁడు భార్యా

వియోగముచే, తపించిపోయి కృశించియుండఁగా, యుద్ధమునం దట్టివానిని, సులభముగాఁ జంపవచ్చును. ఓయీ! నాకు నీవు బహిఃప్రాణమువంటి మంత్రివర్యుఁడవు. నా ప్రణాళికను వింటివిగదా ? అట్లునాకు నీవు సాయపడవలెను.

రావణుఁ డీవిధముగాఁ జెప్పుచుండఁగా మారీచుని నోరెండిపోయినది. భయముచే శరీరము వణకినది. నాలుకతోఁ బెదవులను దడిఁజేసికొనుచు, ఱెప్పవాల్చక యట్లే చెట్టివానివలెఁ జూచుచు, మృతప్రాయుఁడై యామారీచుఁడు కొంతవడికి, రావణునితో నిట్లనుచున్నాఁడు. ఇంతకుఁ బూర్వము దండకారణ్యమున, శ్రీరాముని బలపరాక్రమము నెఱింగినవాఁడగుటచే మిక్కిలి, భయగ్రస్తుఁడై, లోలోన దుఃఖించుచుఁ దనకును, రావణునకును హితమును గలిగించు, మాటలీవిధముగా, వినయముతోఁ బలుకుచున్నాఁడు.

శ్లో॥ సులభాః పురుషా రాజన్, సతతం ప్రియవాదినః ।
అప్రియస్యతు పథ్యస్య వక్తా శ్రోతాచ దుర్లభః ॥
స. 37, శ్లో॥-2

తా॥ రాజా! లోకమున ఆపత్కాలమందుగూడ ప్రభువుతో తియ్యగా మాటలాడుదురు. అట్లుగాక నిర్మొగమాటముగా వినుటకుఁ గటువుగానున్ననుఁ దరువాతఁ గ్రమముగా మేలును జేకూర్చు హితమగుమాటలఁ జెప్పువారే

దుర్లభులు. అట్టివారు లభించినను, వారి హితవచనములను వినువారంతకంటెను దుర్లభులుసుమా !

నిజమైన మిత్రుఁడుగాని, మంత్రిగాని, హితమునే చెప్పుటధర్మము. (హితము=తాత్కాలికముగా కష్టముగా నున్నను, మున్ముందు క్షేమకరమగు మాట. ప్రియము= తాత్కాలికముగా నుత్సాహము గలిగించినను, మున్ముందుఁ గష్టనష్టముల పాలొనరించుమాట) అట్టిహితమునేవిని, యథాప్రకారముగా నాచరించుట బుద్ధిమంతుని ధర్మము.

రావణా ! నీవుసరియైన గూఢచారులద్వారా నిజమైన సంగతులను దెలిసికొనలేవు. పైఁగా జపలుఁడ వైతివి. శ్రీరాముఁడు మహాపరాక్రమశాలి. ఇంద్ర వరుణులును నత నికి సాటిరారు. ఈభూమిపై రాక్షసులు సుఖముగా నుండ వలెనన్నచో నీవాతనితో వైరమును విడువుము. లేనిచో రాక్షసజాతియే నశించును. జనకుని గూతురైన సీత నీవినాశ మున కేర్పడలేదుగదా ? ఆమె కారణముగా, ముందు, నాకాపద లేకుండుఁగాక ! స్వేచ్ఛాచారివై మర్యాదా విర హితుఁడవగు నీవు ప్రభుఁడవగుటచే, నీతోఁబాటు సర్వ రాక్షసులతోఁ బ్రకాశించు లంకా పట్టణమంతయును, నశిం చును. కామవశుఁడైన నీవంటిరాజు, దుష్ప్రవర్తనఁ గల వాఁడై దుర్మంత్రులంగూడి, తాను నశించుటయేగాక, తన రాజ్యమును గూడ నాశము చేసికొనును. ఆరామునియొక్క

తండ్రి కుమారుని బుద్ధిపూర్వకముగా విడువలేదు. రాముఁ డెప్పుడును హద్దుమీరి సంచరించఁడు. లుబ్ధుఁడుగాఁడు. దుశ్శీలుఁడసలే కాఁడు సుమా! అతఁడు సమస్త స్త్రీస్వరూపములను మాతృభక్తితో నారాధించును. ధర్మమును దప్పి లేశమాత్రమైనఁ బ్రవర్తించఁడు. సమస్త జీవహితమునే కోరెడువాఁడు. నిత్యసౌమ్య స్వభావుఁడు. కైకేయిచే వంచింపఁబడిన తండ్రియొక్క సత్యవాక్యమును నిలుపుటకే వనవాసము చేయుచున్నాఁడు. సవతితల్లియైనను నామెను గౌరవించి, దశరథుఁడిచ్చిన మాటబోటుగాకుండుటకే, యీవనవాసమును జేయుచున్నాఁడు. రాముఁడు క్రూరుఁడు గాఁడు. పండితుఁడు. కేవలపండితుఁడేగాక, యింద్రియని గ్రహముతో ధర్మాచరణమును దప్పనివాఁడు. అసత్య మాడుటగాని, దుర్భాషలమాటలాడుటగాని యెఱుఁగడు. శ్రీరాముఁడు స్వరూపధారియైన ధర్మమే యని గ్రహించుము. పైఁగా, సత్యపరాక్రముఁడు. దేవతల కందఱకును దేవేంద్రుఁడెట్లో, యట్లే యీలోకమునంతను బరిపాలించఁ గల మహాతేజశ్శాలి. ఇఁక సీతాదేవియందువా? ఆమె మహా పతివ్రత. ఆమెను శ్రీరాముఁడు తనశక్తిసామర్థ్యములచే రక్షించికొనుచున్నాఁడు. సూర్యుని విడువని మహాతేజస్సు వలె, రాముని విడువని యామెను, నీవపహరించుట సాధ్యము గాదుసుమా! బాణములనెడి జ్వాలలుగలదియు ఖడ్గములు మొదలగు నాయుధములనెడి కట్టెలచే, మండునదియు, యుద్ధ

మునఁ దాకరానిదియు నగు రామాగ్నిని నీవు ప్రవేశించి, నశించకుందువుగాక! వెండియు వినుము! ఎక్కువెట్టిన ధను వనెడి, పెద్దనోరుగలిగి, బాణముల నెడి యగ్ని జ్వాలలుగలిగి, ధనుర్ధారియై, మహావీరుఁడైన రాముని వద్దకుఁ జేరకుము.

మహారాజా! రావణా! నీవు యమునివంటి రాముని జేతిలో సీతతోఁబాటు నీరాజ్యమునుగూడ నాశము చేసికొనకుము. అట్టి శ్రీరామసన్నిధినున్న సీతాదేవి నపహరించి, నీవుజీవించలేవు. పురుషశ్రేష్ఠుఁడును, సింహమువంటి విశాల వక్షస్థలమును, సన్నని నడుమును, గలవాఁడు నగు రామున కామె ప్రాణముకంటెనధికురాలు. ఆమెయును శ్రీరాము నేక్షణమైనను విడువకుండును. అట్టిసీతను మండుచున్న యగ్నినుండి యందలి జ్వాలను బయటకుఁ దీయఁ బ్రయత్నించి నట్లు నీవపహరించుటకు యత్నించకుము. ఓయీ! రాక్షస రాజా! నీవింతటి వినాశహేతువైన, వ్యర్థప్రయత్నము నేల చేయుచున్నావు! యుద్ధమున నిన్ను శ్రీరాముఁడు చూచుటయే తడవుగా నీజీవితమున కంతము గలిగినట్లు నిశ్చయించి కొనుము. పురుషుఁడై పుట్టుటయును, రాజ్యసుఖముల ననుభవించుటయు నన్నవి చాలదుర్లభములు. అట్టివానిని నశింపఁ జేసికొనకుము. మహారాజా! నాహితమును విని, మఱలి లంకకుఁబోయి విభీషణాది ధర్మాత్ములైన మంత్రులతో, బాగుగా నాలోచించి, నీబలమును, శ్రీరాముని బలమును బాగుగా పరిచూచికొని, యేదిహితమో? నిశ్చ

యించికొని, యామార్గము ననుసరించుము. ఓరాక్షసరాజా! నీవు శ్రీరామునితో వైరమునువహించుట బుద్ధిమంతుని లక్షణముగాదు. నీవు తొందరమాని, నామాటలయందలి నిజానిజములను బాగుగా నాలోచించికొనుము.

ఓయీ! రావణా! ఇంకనువినుము! నేనొకప్పుడు వేయియేనుఁగుల బలముతో నీభూమినంతను బర్యటించితిని. నల్లని మేఘమువలె మెరసిపోవు బంగారు కుండలములతో లోకభయంకరుఁడనై, కిరీటధారినై పరిఘయను నాయుధమును బట్టికొని, యీదండకారణ్యమున ఋషిమాంసములఁ దినుచు జీవించుచుంటిని. ఇట్లుండ విశ్వామిత్రుఁడు నాకు భయపడి, దశరథ మహారాజును దర్శించి, యిట్లనియెను.

ఓమహారాజా! మారీచుఁడు నాయజ్ఞమును ధ్వంసము చేయుచున్నాఁడు. కావున నీకుమారుఁడైన శ్రీరాముని నాతోఁబంపించి నాయజ్ఞము నిర్విఘ్నముగాఁ బూర్తియగునట్లు చేయుము." అనికోరఁగా నామహారాజామహామునితో నిట్లనెను. "ఓవిశ్వామిత్రా! నాకుమారుఁడు యుద్ధములందంతఁగా నారితేరినవాఁడుగాఁడు. పదునారు సంవత్సరములు మాత్రమే వయస్సు గలవాఁడు. కావున నీకార్యమునునెరవేర్ప నేనే, నాచతురంగబలముతో రాఁగలను." అనఁగా, నామునీంద్రుఁ డిట్లనియెను. "మహారాజా! ఆరాక్షసుని జయింప శ్రీరామునకుఁదప్ప వేరొకనికి సాధ్యముగాదు. అది దేవతలకే శక్యముగాదన్నచో, నీమాటవేరేచెప్పనేల?

నీపరాక్రమము సర్వలోకవిదితమే. అయినను నీవిచ్చటనే యుండుము. శ్రీరాముఁడు బాలుఁడయ్యును, మహాతేజస్సంపన్నుఁడు. అతనినే నాతోఁబంపుము. నీకుసర్వశుభములును గలుగుగాక!" అని దశరథునొప్పించి, శ్రీరామునకుఁదోడుగా, లక్ష్మణునిగూడఁ దనతోఁబంపఁగా నాసోదరులం గైకొని, తనయాశ్రమమును జేరికొనియెను.

అప్పుడు విశ్వామిత్రుఁడు యజ్ఞదీక్షలో నుండఁగా శ్రీరామలక్ష్మణులు ధనుర్బాణముల ధరించి, యజ్ఞరక్షణార్థమై దీక్షఁబూనిరి. శ్రీమంతుఁడైన శ్రీరామున కానాటికి మీసకట్టుగూడరాలేదు. ఏకవస్త్రధారియై, కవచమైన లేకుండఁగా, పద్మదళవిశాలనేత్రుఁడై గిరజాలుగల నల్లనిజుట్టుతో (జునపాలు) బంగారముపై రత్నాలుపొదిగిన గొలుసును మెడలోవేసికొని, దండకారణ్యమునంతను ప్రకాశింపఁజేయుచు, నప్పుడే యుదయించుచున్న బాలచంద్రునివలె నుండెను. తరువాత నేను నాబలముచే గర్వించినవాఁడనై, యావిశ్వామిత్రాశ్రమమునకు వచ్చితిని. నే నాశ్రీరాముని చూపునఁ బడినదేతడవుగా, నిశ్చలుఁడై, ధనుస్సు నెక్కుపెట్టెను. నేనాతనినిజూచి, యీబాలుఁడు నన్నేమిచేయఁగలఁడు ? అనుధైర్యముతో, విశ్వామిత్రుని యజ్ఞవేదికను ప్రవేశించితిని. అంత నాశ్రీరాముఁడు నాపై, దివ్యాస్త్రమును బ్రయోగించగా, నాదెబ్బతో నేను యోజనదూరమునందున్న యీసముద్రములో నెగిరివచ్చి పడితిని. శ్రీరా

ముఁడు నన్నుఁ జంపుట కిష్టపడలేదు. కాని యాతని బాణ వేగముతో నెగిరిపోయి యిట్లుపడితిని. అట్లుపడి చాలసేపటికిఁ దెలివిదెచ్చికొని, పైకిలేచి, లంకలోఁ బ్రవేశించితిని. అప్ప టికి రాముఁడు బాలుఁడు. అట్టివాఁడు నన్నువిడిచి నేనావిధ ముగాఁ బీడింపబడఁగా, నాకు సహాయులైన, సుబాహుఁడు మొదలగు రాక్షసుల నందఱ నక్కడికక్కడే, సంహారించి నాఁడు. వింటివిగదా ! ఓరావణా ! నేను నిన్ను నివారించు చున్నను, నీవు శ్రీరామునితో విరోధించినచో, స్వల్ప కాలములోనే, మహాపదల నందఁగలవు. అట్లు నీవాక్కఁడవే యాపదల నొందుటగాక, మహాభోగములతో, నిత్యానందము ననుభవించు, రాక్షసుల నందఱను సమూలముగా నశింపఁ జేసినవాఁడ వగుదువు. ఈసీతాదేవిపై మోహము కారణ ముగా, నెత్తైనమేడలతోడను, నందమైన యుద్యానవనముల తోడను గూడిన, లంకాపట్టణమునే నశింపఁజేసికొన్నవాఁడ వగుదువుసుమా !

శ్లో॥ అకుర్వంతోఽపి పాపాని, శుచయః పాపసంశ్రయాత్ ।
పరపాపై ర్వినశ్యన్తి, మత్స్యా నాగ హ్రదేయథా ॥
స. 38 శ్లో॥-26

తా॥ ఏపాపము నెఱుంగని పరిశుద్ధాత్ములుగూడ పాపుల సాంగత్యమువలన, సర్పమున్న మడుగులో, నివ సించు, చేపలవలె, నాసర్పమునకై వచ్చిన బలవంతులైన వారు, మడుగునందలి చేపలను దినివేయుదురు. అట్లె పరుల

పాపముల వలన నాతని నాశ్రయించిన సత్పురుషులుగూడ నశించుదురు.

దుస్సాంగత్యమువలన సజ్జనులకైనను హానితప్పదు. ఒకదుష్టునిచెంత నున్నవారందఱును దుష్టులే యనుట ధర్మముగాదు. అయినను దుష్టసాంగత్యమును విడుచుట సత్పురుషుల ముఖ్యధర్మము.

రావణా ! వినుము ! నీవుచేసిన పాపము కారణముగా, దివ్యోపభోగముల ననుభవించు, రాక్షసులందఱును జని పోవుదురు. చావగామిగిలిన వృద్ధులును, స్త్రీలును, బిల్లలను దమను దాము రక్షించికొనలేక, దిక్కులేనివారై, యటునిటు పారిపోవుచుండఁగా, నీవేమియుం జేయలేక, చూచుచుందువు. లంకాపురమంతయును రామబాణాగ్నిచే దగ్ధమగుచుండఁగా నీవు శక్తిహీనుఁడవై యూరక చూచుచుండవలసివచ్చును. లేదా, వారితోఁబాటు నీవును జావవలసివచ్చును. నీకు వేల కొలఁది భార్యలుండగా, మఱలనొక పరస్త్రీ నపహరించవలె ననెడి బుద్ధియేల ? అంతకంటె మించిన మహాపాప మింకొకటి లేదుసుమా ! ఓరాక్షసరాజా ! హాయిగా నీకున్న భార్యలతో భోగించుము ! నీవంశమును, మానావమానములను, రాజ్యాభివృద్ధుల నన్నింటికంటెను బ్రియమైన, నీజీవితమును రక్షించికొనుము. నీభార్యలతోడను, మిత్రవర్గముతోడను సుఖముగా చిరకాల మనుభవించఁగోరినచో నిట్టిదుర్భావ

మును విడువుము. శ్రీరాముని విషయమై, నీచముగాఁ బ్రవర్తించకుము. నీహితమునుగోరెడు మిత్రుఁడ నగుటచే నేనిట్లు నీకుఁ జెప్పుచున్నాను.సీతాదేవి మహాపతివ్రత. ఆమె యందు దుష్టబుద్ధిని విడువుము. అట్లుగాదందువా, నీవు బంధుమిత్రపరివారసహితముగా, రామ బాణములకు గురియై నశించఁగలవు. నా మాటలను నిర్లక్ష్యము చేయకుము.

## మారీచు ననుభవము

ఓరాక్షసరాజా! రావణా! ఆనాఁడు శ్రీరాముని బాల్యమునఁజేసిన పనికి నేననుభవించిన దంతయును వింటివి గదా! మఱియు వినుము! ఎదురుగాఁ బ్రశ్నించకుము! నేనావిధముగా శ్రీరామునిచేఁ గొట్టఁబడి, యీయరణ్యమున లేడిరూపముల ధరించిన యిద్దరు రాక్షసులతో, నేను నొక లేడి యాకారమును ధరించి, తిరుగుచుంటిని. నాది పెద్ద శరీరము. ఎఱ్ఱని నాలుక వాడికోఱలును గలశరీరము. అట్లు మహాబలుఁడనై, మాంసభక్షకుఁడనై, తిరుగుచుంటిని. రావణా! మహామునులయొక్క యజ్ఞములయందలి యగ్నిహోత్రములఁ బాడుసేయుచు, దొరికిన మునినెల్లఁ జంపి తినుచుంటిని. అట్లుండఁగాఁ గొన్నాళ్ళకు సీతారామలక్ష్మణులాముని్యాశ్రమములం బ్రవేశించి సంచరించుటఁ గాంచితిని. రాముఁడు తాపసవేషములో, నియమితాహారుఁడై, సాత్వి

కతఁ గలవాఁడని భావించి, మునుపటి వైరమును దలఁచికొని, యాతనిం జెనకుటకు పొడవై, వాడియైన కొమ్ములతో వెళ్ళితిని. అంతనా శ్రీరాముఁడు, గరుత్మంతునివలెను, వాయువువలెను, వేగముగల మూఁడుబాణములను విడిచెను. నేను రామబాణములయొక్క శక్తి నెఱింగిన వాఁడనగుటచే, వెనుదిరిగి, తప్పుకొని, పారిపోయితిని. కాని నాతోనున్న యిద్దరు రాక్షసులును, రామబాణముచేఁ జనిపోయిరి. (రామబాణములు వెన్నిచ్చి పారిపోవువారిజోలికి వెళ్ళవు.) రావణా! ఈ యరణ్యమునఁ బ్రతివృక్షమును నారబట్టలను లేడిచర్మములను ధరించిన, రామునివలెనే నాకుఁదోచెను. నేనను వానిని పాశహస్తుఁడైన యమునిగా భావించి భయపడితిని. ఆభయమానాటినుండియును నేటివరకును నీయరణ్యమునఁ బ్రతివస్తువును రామరూపముగనే దోపింపఁజేయుచున్నది. ఇంతయేల? ఈయడవియంతయును నాకు రామమయముగనే గన్పట్టుచున్నది. స్వప్నమునందుఁగూడ రాముని దలఁచి, త్రుళ్ళిపడుచుందును. ఇంతయేల? రత్నము రథము మొదలైన, రకారముగల పదములను విన్నంతనే, రాముఁడు స్మరణకువచ్చి భయపడుచుందును. అట్టి రామునితో నీకు యుద్ధము కలుగుట నావినాశనానికే మూలమగును.

బలిచక్రవర్తినిగాని, నముచినిగాని, శ్రీరాముఁడు చంపఁగలఁడు. ఓయీ! రావణా! నీవు శ్రీరామునిపైఁ బగఁబట్టినచో నెదురుగాఁబోయి, యుద్ధము చేయుము. లేదా?

సహనశీలివై, వెనుకకుంబోయి సుఖించుము. అంతియేగాని నాయెదుట శ్రీరాముని ప్రసక్తియే విడువుము.

శ్లో॥ బహవ స్సాధవో లోకే యుక్తా ధర్మ మనుష్ఠితాః ।
పరేషా మపరాధేన, వినష్టా స్సపరిచ్ఛదాః ॥
స. 40, శ్లో॥-20

తా॥ రావణా! లోకములో ధర్మనిష్ఠఁగలిగిన సాధు పుంగవు లెందఱో దుష్టుల సాంగత్య దోషముచే, సమూలముగా నశించిరిసుమా !

సజ్జనుఁడైనవాఁడు దుష్టసహవాసమును మాని సజ్జన సాంగత్యము నవలంబించుట ధర్మము.

ఓయీ ! రాక్షసరాజా ! నేనుగూడ నీసాంగత్య దోషమువలన నశించిపోకతప్పదు. కావున నేను జెప్పఁదగినంత హితమును జెప్పితిని. ఆపైని నీవే యాలోచించికొనుము. నేనుమాత్రము నిన్ననుసరించినచో నశింపక తప్పదు. కావున నన్ను విడిచిపెట్టుము. (ధర్మాత్ములైనవారికే దుష్టులతో సాంగత్యము కీడుఁగలిగించుచుండఁగా నావంటి రాక్షసుని విషయమై వేరఁజెప్పనేల ?) మహాతేజోబల సంపన్నుఁడైన రాముఁడు రాక్షసులపాలిఁటి యముఁడై సంహరించఁగలఁడు. శూర్పణఖ కారణముగా ఖరాదిరాక్షసులందఱును జనిపోయిరి. ఇందు రామునిదోష మేమాత్రమును లేదుసుమా ! నీవు బంధుమిత్ర హితమునుగోరి నేనుజెప్పినట్లు

చేయుదువా, కొంతకాలమేగాక, కలకాలమును, సుఖించు దువు. లేదు కాదు, అనియందువా? నీవు నీవంశముతోఁ బాటు సమస్తపరివారముతోడను నశించకతప్పదు.

## రావణుఁడు - మారీచుని - శాసించుట

మారీచుఁడు చెప్పినహితవాక్యములను రావణుఁడు పెడచెవినిబెట్టి, రోగముగలవాఁ డపథ్యపదార్థముల నేగోరి నట్లుగా, మూర్ఖుఁడై, పరుషవాక్కులతో నిట్లనుచున్నాఁడు. ఓయీ! మారీచా! నీవింతవరకును నాయంతర మెఱుంగక, నీయిష్టమువచ్చినట్లు సామాన్యుని బెదరించినట్లు ప్రేలినావు. పాపశీలుఁడును మానవమాత్రుఁడు నైన శ్రీరాముని, నాయెదుట నంతేఁగాఁ బొగడుట దగునా? నిజమునకు యుద్ధమున నాకెదురుగా ఆరాముఁడు నిలువలేడు. రాజ్యమును భోగములను విడిచి, వనవాసమును జేయు బుద్ధిహీనుని, పౌరుషవంతునిగా నీవు పొగడుట హాస్యాస్పదము. ఏమైనను, రామునకుఁ బ్రాణప్రియురాలైన సీతను, నీసహాయముతో నపహరించవలసినదే. ఇది నానిశ్చయము. ఈదృఢనిశ్చయమును బ్రహ్మాది దేవతలుగూడ మార్చలేరు. ఈఘనకార్యమునఁగల, గుణదోషములను విమర్శించి, చెప్పుమని నిన్ను గోరలేదు. అట్టియెడ నీవింతవరకును, నాకంటెను సర్వజ్ఞుని వలెఁ జర్చించుట వ్యర్థము. పండితుఁడై, బుద్ధిమంతుఁడైన మంత్రి తనను రాజు ప్రశ్నించినప్పుడు, తగిన ప్రియవాక్య

ములఁ బలికి, సంతోషింపఁజేసి, తాను దగిన యుపకారమును బొందవలెను. ప్రతికూలవాక్యమును జెప్పునప్పుడు, మృదువై శుభప్రదమైన, హితమును జేకూర్చునదిగా నుండవలెను. ఓయీ! నీవెంతటి హితమును జెప్పువాఁడవైన, నయ్యది తిరస్కారపూర్వకమైనచో, దానినారాజు లక్ష్యముచేయఁడు. సరికదా యామంత్రిపై సద్భావములేక యుండును. రాజైన వాఁ డింద్ర యమ వరుణాగ్ని సోమాంశముల నైదింటనుగలిగి యుండును. అట్టిరాజు, పరాక్రమము చల్లదనము ప్రసన్నత, దండము, దపించుట, యను నైదుగుణములును గలిగి యుండునుసుమా! కావున సర్వకాలసర్వావస్థల యందును రాజులు పూజనీయులై యుందురు. నీవీధర్మ మెఱింగియు నీయిచ్చవచ్చినట్లు నన్నుదెగడితివి. మఱియు నీవద్దకుఁ గోరి వచ్చితినిగదా, యని చులకనగా మాటలాడితివి. పరాక్రమ శాలివైన ఓమారీచా! నిన్నింతకాలమున కీమాత్రముసహాయ మును గోరివచ్చితిని. నాకోరికను గాదనకుము! అట్టి సహాయ మునుగూర్చి చెప్పెదను వినుము! వెనుక నేనుజెప్పినట్లుగా నీవుబంగారులేడివై, రాముని యాశ్రమ ప్రాంతములం దిరు గుచు, సీత నాకర్షించుము. ఆసీతయు నిన్ను నిజమైన లేడినిగా నమ్మి, "ఈ లేడిని బట్టితీసికొనిరమ్మ"ని రాముని గోరును. అట్లురాముఁడు నీవెంటఁబడఁగాఁ జాలదూర మాతనిం గొని పోయి, యచ్చట శ్రీరాముని కంఠస్వరముతో "హా! లక్ష్మణా! హా! సీతా" యని బిగ్గరగా నరచుము. ఆ

యరవునువిని, సీతాదేవిచేఁ బంపఁబడినవాఁడై, లక్ష్మణుఁడు పర్ణశాలనువిడిచి, వెళ్ళును. ఆసమయమున నొంటరిగానున్న సీతను నేను సులభముగా నపహరించికొని పోవుదును. నీమేలునకు బదులుగా, నాయర్ధరాజ్యమును బహూకరించెదను. నీకు శుభమగుఁగాక! ఇంక నీవు బయలుదేరుము! నీవెనకనే, యీరథముపై నేనును రాఁగలను. ఈవిధముగా యుద్ధములేకుండఁగనే సీత నపహరించి, నీతోఁగలిసి, లంకకుఁ బోవుదును. మఱియు నోమారీచా! శ్రద్ధగావినుము! నేను జెప్పినచొప్పునఁ జేసితివా, నాయర్ధరాజ్యము ననుభవించఁ గలవు. కాదందువా? నిన్నిప్పుడే యిక్కడనే, దలనరికి సంహరించుదును. రాజును వ్యతిరేకించి, యెవఁడును, సుఖించ లేఁడు. నామాటవింటివా, నీకు బ్రదుకున్నది. అట్లుగానిచో, నీచావు దప్పదుసుమా!

## మారీచుఁడు చెప్పిన - యంతిమ - హితము

రావణుని బరుషవాక్కులువిన్న మారీచుఁడు, తన కెట్లైనను చావుదప్పదని నిశ్చయించికొని రావణునితోఁ గఠినముగాఁ జివరిసారి ప్రయత్నముగా నిట్లనుచున్నాఁడు. ఓరావణా! నీకీయుపాయమును జెప్పిన పాపాత్ముఁడెవఁడు? దీని వలన నీపుత్ర మిత్ర మంత్రి పరివార సహితముగా, సమస్త రాక్షస నాశము నుద్దేశించి, నీకు మిత్రునివలె నటించిన యాతఁడు నీశత్రువుసుమా! వాఁడు నీయౌన్నత్యమును

జూచి, సహించలేక యిట్లుచెప్పియుండును. దుర్బలులైన నీశత్రువులు ప్రత్యక్షముగా నిన్నేమియుంజేయలేక యీావిధమైన యుపాయముచెప్పి, నీకంటెబలవంతునిచే నిన్నుజంపింప యత్నించియుందురు. స్వయంకృతాపరాధునిగా నిన్నుమలచి, నీనాశమును గోరు నాత్మద్రోహుఁడెవఁడు ? రాజా ! నీవు తప్పుడుమార్గమున నున్నప్పుడు, నీమేలునుగోరి, నిన్ను సరియైన మార్గమున నడిపించుటకుఁ, బ్రయత్నము చేయవలసిన నీమంత్రులు, నిన్నీ యుపమార్గమునకుఁ బ్రోత్సహించుటచే, వారు సర్వవిధములచేతను, వధ్యులైయున్నారు. ఓరావణా ! ఇంతవరకు నపజయ మెఱుంగని జయశీలుఁడవు. తమప్రభువు గుణవంతుఁడైనచో, నాతని మంత్రులు ధర్మార్థకామములను బొంది సుఖించుదురు. ఓయీా ! రాక్షసరాజమార్తాండా ! నీకు జయముగాని కీర్తిగాని లభించుటకు నీకు ధర్మమే శరణ్యము. కావున నట్టిధర్మమును సర్వకాల సర్వావస్థలయందును రక్షించికొనుచుండవలెను. "ధర్మోరక్షతిరక్షితః" అనుసూక్తి, నీవెఱుంగనిదిగాదు. మహారాజా ! క్రూరత్వము నవలంబించి, యేరాజును రాజ్యమును బాలించి, సుఖించలేఁడు. దుర్మార్గములైన, యుపాయములను జెప్పెమంత్రులు, రథమును గుఱ్ఱములను నడిపింపఁ జేతఁగాని సారథివంటివారు. అట్టిసారథిచే నారథము పల్లమును మెరకను బాటించక రథికుని, రథమును, ధ్వంసముచేయును. అట్లే దుష్టమంత్రులు మొదలైనవారి సాంగత్యముచే, రాజెంతటి తెలివైనవాఁడై

నను నశించుటను జాలమందిని జూచుచున్నాముగదా! రావణా! ప్రభువు క్రూరుఁడైనచో, నక్కలచేఁ గాపాడఁబడు మేకలమందవలెఁ బ్రజలు నశించుదురు. నీవుదుర్బుద్ధితోఁ గాఠిన్యమును వహించినచోఁ దప్పక నీవారందఱును నశించుదురు. ఇప్పుడు శ్రీరాముని చేతిలో నేను జనిపోవుట తప్పదు. అట్లైనను విచారించను. కానినీదుర్బుద్ధిచే, నీవొక్కఁడవేగాక, సర్వరాక్షసజాతికిని నాశము గూర్చినవాఁడ వగుటతప్పదుగదా, యని విచారించుచున్నాను. ఆరాముఁడు ముందుగా నన్ను జంపుటయుఁ దరువాత నిన్నును నీవంశమును, నాశముచేయుటయును దప్పదు. నాకంటె శక్తివంతుఁడును, ధర్మాత్ముఁడు నైన, శ్రీరాముచేతిలోఁ జనిపోవుట, నాకీర్తిప్రతిష్ఠలకు లోపములేదు. ఇంతయేల? ఆశ్రీరాముని చూచినంతనే చనిపోయితి ననియెఱుంగుము. తరువాత నీవు సీతనుహరించి, సమస్త బంధుపరివారముగా, నీవును జనిపోవుట జరిగితీరును. నీవు సీత నపహరించి, లంకలో నుంచితివా, నీవుగాని, నేనుగాని లంకయందలి సమస్తరాక్షసులుగాని, చనిపోవుటతప్పదు.

శ్లో॥ నివార్యమాణస్తు, మయా హితైషిణా
నమృష్యసే వాక్య మిదం, నిశాచర!
పరేతకల్పాహి గతాయుషో నరాః
హితం నగృష్ణంతి సుహృద్భి రీరితమ్॥

స. 42 శ్లో॥-20

తా॥ ఓనిశాచరరాజా! నీహితమునుగోరి నేను నీదు షక్ళత్యమును మాన్పింపఁ బ్రయత్నించు నాహితవాక్యములను వినకున్నావు. ఇది లోకసహజమే. ఎట్లనఁగా? చావు దగ్గరఁబడినవారు, హితవాక్యములను వినిపించికోరు.

సుఖముగా జీవించఁగోరువాఁడు నిర్మార్గమాటముగా, హితమునుగోరి చెప్పెడు మిత్రవాక్యముల ననుసరించుట ధర్మము.

## మారీచుడు - తప్పనిసరిగా - రావణుని ననుసరించుట

ఎన్నివిధములుగాఁ బ్రయత్నించినను, మారీచుని హితవాక్యములను వినిపించుకొనని, రావణుని జూచి, "ఇంక, నీవుచెప్పినట్లే చేసెదను. శ్రీరామాశ్రమమునకుఁ బోవుదము. పద! ఆరాముఁడు నన్నుజూడఁగనే, ధనుస్సు నెక్కువెట్టి పట్టుకొని, ఖడ్గమును ధరించినఁ జాలునునేను జచ్చితిననియే గ్రహించుము! నీదుర్మార్గముచే మృత్యుముఖమునఁ బ్రవేశించుచున్నాను. నీకు శుభమగుఁగాక!" అని మారీచుఁడన్న మాటలకు, రావణుఁడు సంతోషమును బట్టలేక, యాతనిని గౌఁగిలించికొని యిట్లనుచున్నాఁడు. నాయనా! మారీచా! నీవు నాకు సహాయుఁడవుకాగా, నేనుసాధించరాని పనియేది

యును లేదు. నీకు జయమగుఁగాక! ఇంతవరకును, నీజాతి స్వభావమునకే, విరుద్ధముగా, మాట్లాడితివి. ఇప్పుడు నిజమైన మారీచుఁడ వనిపించికొంటివి. పిశాచముఖములుగల, గాడిదలను బూన్చిన, యీరథమును, నాతో నిప్పుడెక్కుము. నీవు సీతకుఁ బ్రలోభము గలిగించి, నీయిష్టమువచ్చినట్లు దూరముగాఁ బొమ్ము. ఒంటరిగానున్న సీతను నేనవలీలగా, నపహరించఁగలను. అని యీవిధముగా మాట్లాడికొనుచు, నారావణ మారీచులు రథముపైఁ దిన్నగాఁబోయి, శ్రీరాముని బర్ణశాలాప్రాంతమున నాగిరి. అంత వారిరువురును రథమునుండిదిగి, యందు రావణుఁడు మారీచునిచేయిపట్టికొని, యిట్లనియెను. మారీచా! ఇదిగో! చూచితివా! అదే రామాశ్రమము. ఆసమీపముననే యరఁటితోఁటయున్నది. ఇంక మన మనుకొనినపనికి నారంభించుము! అనఁగా నావెంటనే మారీచుఁడు బంగారు లేడిరూపమును ధరించి, యాప్రాంతమునఁ దిరుఁగాడఁజొచ్చెను. మణులతో నిర్మించబడిన కొమ్ములను, నలుపును దెలుపును గలిగిన ముఖకాంతిఁ గలవాఁడయ్యెను. ఇంద్రనీలమణులవంటి చెవులును, గొంచెముగా, బైకెత్తఁబడిన ముఖముతోఁ, బెదవు లింద్రనీలమణులవలెఁ దళతళలాడుచుండఁగాఁ గడుపు చంద్రునివలెను వజ్రమువలెను దెల్లనికాంతిఁగలదై ప్రకాశించెను. ప్రక్కభాగము లిప్పపూవువన్నెఁగలిగి, మిగిలిన శరీరమంతయును, దామరపూవునందుఁగల పుప్పొడియొక్క రంగుగలిగి, యుండెను.

వైడూర్యములంతో సమానమైన డెక్కలును, సన్నని కాళ్ళ పిక్కలును, దాని తోంక ఇంద్రధనుస్సువలె పైకెత్తబడియు నుండెను. అట్లున్న యాబంగారు లేడి మెరసిపోవుచున్నది. ఈ విధముగా మారీచుండు క్షణకాలములో ధగధగ జిగజిగ మెరసిపోవుచున్న లేడిరూపము దాల్చెను. ఆమృగ మావిధముగా నావనమునంతను ప్రకాశింపం జేయుచు, శ్రీరామాశ్రమ సమీపమును జేరికొనియెను. ఆ ప్రాంతమునం బచ్చిక బయలునందుం బచ్చిక మేయుచున్నట్లు నటించుచు సీతాదేవిని మోసగింపం బ్రవర్తించెను. విచిత్రమై, యపూర్వమైన దేహకాంతితోం జూడముచ్చటగానుండి, చెట్లచిగుళ్ళను గొఱకుచుండెను. మఱియు నందంగల యరంటితోంటను జేరియుం గర్ణికారవృక్షములచెంత నిలిచియు, నాసీతాదేవి తనను జూచుట కనుకూలమైన రీతి, నిటునటు దిరుంగుచుండెను. తామరపూవువంటి రంగుగల వెనుకభాగముగలదై గంతులువేయుచు నందుండి లేళ్ళగుంపులలోం బ్రవేశించుచు మఱలవచ్చుచు, సీతాదేవియొక్క కంటంబడవలెనని, యాసక్తితో సంచరించెను. మఱియు మండలాకారములైన చిత్రవిచిత్ర గతులుగలదై లేళ్ళగుంపులకు సమీపించంగా నాలేళ్ళు వాసనచేం బసిగట్టి పారిపోవుచున్నవి. ఆరాక్షసుండు లేళ్ళగుంపులం జేరి వానిం దినివేయువాండే, అయినను దన మాయ వెల్లడి గాకుండుటకై, యట్లుచేయలేదు. ఆ సమయమున లేడిచూపులవంటి చూపులుగల సీతాదేవి పూవులను

గోసికొనుటకై యాశ్రమమునుండి బయటకు వచ్చినది. ఆమె యశోక కర్ణికారాది పుష్పములం గోసికొనుచు, నాప్రాంత మున దిరిగినది. అరణ్యవాసమునకు నోర్వలేని సుకుమారి యైన సీత, ముత్యాలపాడలు మొదలగువానితోఁ బ్రకా శించు నాబంగారు లేడి నాప్రాంతముల నుండఁగాఁ జూచినది. మఱియు నింతవరకు నెన్నఁడును గనివిని యెఱుంగని, సౌందర్యరాశియైన, యాలేడిని గనులు పెద్దవిగాఁజేసికొని, యాశ్చర్యపడుచుఁ దేరిపారఁజూచినది. ఆలేడిగూడ నామెను బ్రలోభ పెట్టుటకై, చిత్రవిచిత్ర గతులతో, సంచరించినది. నానారత్నమయమైన యిట్టిలేడిని, జూచి, సీతాదేవి మిగుల నాశ్చర్యము నందినది.

## సీత మాయలేడిం గోరుట - రామలక్ష్మణ సంవాదము

పూవులను గోసికొనుచున్న సీతాదేవి, యాయపూర్వ మైన బంగారులేడిం జూడఁగనే, పర్ణశాలవద్ద నిలిచియున్న రామలక్ష్మణులను బిలిచి యాలేడిని జూపించినది. లక్ష్మణుఁడా మాయలేడింజూచి, శంకించి, యిట్లనియెను. అన్నా ! చూచి తివా ! ఇదిలేడిగాదు. మారీచుఁడను రాక్షసుఁడే యీరూప ముతో వచ్చియుండును. కామరూపియగు నీపాపాత్ముఁడు లేడివేషధారియై యీయడవియందు వేటకైవచ్చిన రాజుల నెందఱినో, సంహరించినట్లు వినియున్నాను. ఓపురుష

పుంగవా! వాఁడే యిప్పుడీ లేడిరూపమును ధరించి యుండునుసుమా! బ్రహ్మదేవుని సృష్టిలోనే రత్నఖచిత మైన బంగారు లేడి యున్నట్లులేదు. ఇది కేవలము, మాయా మృగమేగాని వేఱొకటిగాదని నాకుఁదోఁచుచున్నది. అనఁగా లక్ష్మణుని మాటలువిని, యాలేడియొక్క మాయాసౌంద ర్యమునకు మోసపోయిన సీతాదేవి యిట్లనియెను. ఆర్య పుత్రా! శ్రీరామచంద్రా! ఈలేడి నామనస్సు నత్యంత మాకర్షించుచున్నది. దీనితోనే, నాడుకొనుచుఁ గాలక్షేపము చేయఁగలను. కావున దీనింబట్టి దీసికొనిరమ్ము! ఈ యా శ్రమ సమీపారణ్యములో, లేళ్ళును జమరీమృగములును, సృమరములును గుంపులుగుంపులుగాఁ జాలసారులు దిరుగు చుండును. విచిత్రములైన యెలుఁగుబంట్లును, వానరములును మొదలైనవెన్నియో, యిందుఁగలవు. అవియన్నియు నేవిషయమందును దీనికి సాటియైన యందముగలవిగావు. ఇది ముఖ్యముగాఁ దనరత్నకాంతులతో సీవనమునంతను బ్రకాశింపఁ జేయుచున్నది. ఆహా! ఆరూపమేమి! ఆశోభ యేమి? ఆస్వరసంపదయేమి? విచిత్రమైన దేహముగల, యీలేడి, నామనస్సు నాకర్షించుచున్నది. దీనిని బ్రతికి యుండఁగనే దీసికొనివచ్చితివా, చాలసంతోషమును గలిగిం చినవాఁడ వగుదువు. ఇదిమనతో సీయరణ్యావాస కాలము నంతను గడిపి, తరువాత నయోధ్యకును, మనతోవచ్చి యచ్చటి నాయత్తలు మొదలగువారి కందఱకు నాశ్చర్యము

గలిగించఁగలదు. రాఘవేంద్రా! దీనిని జీవముతోనున్న దానినిగాఁ బట్టశక్యముగానిచోఁ జంపియైనఁ దీసికొనిరమ్ము! దీని సుందరమైన చర్మము మన కాస్తరణగా నుపయోగించఁ గలదు. సీతాదేవి యిట్లుపలుకుచుండఁగా, నాలేడి శ్రీరామునిగూడ నాకర్షించినది. సీతాదేవి కోరికతోఁబాటు దన కును నాసక్తికరమైనదిగా, నాలేడి యుండుటచే, శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనుచున్నాఁడు. తమ్ముఁడా! చూచితివా! ఇట్టిమృగమునింతవరకును నెన్నఁడునుజూచియెఱుఁగనుసుమా! దీనికి సాటియైనలేడి, నందనవనముననఁగాని, చైత్రరథవనమునఁ గాని, లభించదు. ఇఁక సామాన్యములైన యుద్యానవనముల మాట చెప్పనేల? ఈలేడియొక్క శరీరమే యపూర్వకాంతి శోభితము. ఇది యావులించునప్పుడు నోటిలోపల భాగము నుండి, యెఱ్ఱనికాంతి, యగ్నిజ్వాలవలెఁ బ్రకాశించుచు నాలుక, మేఘమునుండివచ్చు మెఱుపుఁదీగెవలె నున్నది. పొట్ట శంఖమువలెను, ముత్యమువలెను దెల్లనై యున్నది. ఇంతటి యీలేడి, యెంతటివారినైన, నాకర్షించకుండునా! నానారత్నమయ శరీరముగల, యీబంగారులేడి యెవరినైన నాకర్షించకుండునా? వినోదముగా వేటకైవచ్చెడి రాజులంద ును, మాంసముకొఱకును, లక్ష్యశుద్ధికొఱకును లేళ్ళను వేటాడి చంపుదురుగదా! మఱియు మహారాజులు వేటాడుచు నేనుఁగుల కుంభస్థలములలోనున్న శ్రేష్ఠములైన ముత్యము లను, బంగారము వర్ణముగల, వివిధ ధాతువిశేషములను,

సంపాదించుచుందురు. ఓయీ! లక్ష్మణా! మానవులు దురాశతో సంపాదించిన ధనమంతయును, శుక్రాచార్యుని కోశాగారమునఁ జేరును. ధర్మయుక్తముగా సంపాదించిన దంతయును, బ్రహ్మయొక్క ధనాగారమునకుఁ జేరును, (అన్యాయార్జిత ధనము దుష్టమార్గమున దుష్టులపాలై, పాపమును గలిగించును. ధర్మముగా సంపాదించినది లోకోప కారమునే చేయుచుండెడు ప్రభువునుగాని సత్పాత్రులైన బ్రాహ్మణాదులనుగాని చేరి, పుణ్యఫలము నొసంగును.) లక్ష్మణా! ఈలేడిచర్మముయొక్క శ్రేష్ఠత్వమును గమనించి, సీతాదేవితోఁగూడ నద్దానిపైఁ గూర్చొని, యానందించఁ గలను. నల్లని చారలుగల లేడిగాని, తెల్లనిమచ్చలుగల లేడి గాని, మృదుత్వమున నీబంగారులేడికి సాటిరావు. ఆకాశ మున మృగశీర్షా నామకమైన, నక్షత్ర రూపక మృగమును భూమిపై నీబంగారులేడియు, నివిరెండే శ్రేష్ఠములైనవిగా, నాకుఁ దోఁచుచున్నది. తమ్ముఁడా! ఒకప్పుడు నీవూహించి నట్లే యిది రాక్షస మాయామృగమైనచో, దీనిని సంహ రించుటయు నాకర్తవ్యమేగదా! ఈమృగరూపధారియైన మారీచుఁ డింతకుఁ బూర్వ మెందఱినో, రాజులను, మునులను జంపి తినియున్నాఁడు. పూర్వ మీ యరణ్యమున వాతాపి యను రాక్షసుఁడు మేకరూపమునుదాల్చి తన మాంసము నిల్వలుఁడను సోదరుఁడు వండిపెట్టఁగా బ్రాహ్మణులు తినెడి వారు. తరువాత నిల్వలుడు వాతాపీ! ఇటురమ్ము! అని

పిలువగా, వాఁడు మే, మే, యని యరచుచు, బ్రాహ్మణ గర్భములను జీల్చికొని బయటకు వచ్చెడివాఁడు. తరువాతఁ జనిపోయిన బ్రాహ్మణుని వారుభయులును, దినుచుండెడి వారు. చాలకాలమిట్లు జరుగుచుండ, నగస్త్యమహర్షి యొకప్పుడు వారింటికి నాహ్వానింపఁబడి వాతాపిని జీర్ణముచేసికొని, యిల్వలుని శపించి, చంపివేసి, వారిపీడను వదల్చివేసెను. లక్ష్మణా! నేను ధర్మనిష్ఠుఁడనై యింద్రియ నిగ్రహముగల, నాచేత నీమారీచుఁడు వాతాపివలెనే చనిపోవును. ఇక్కడ నీవు సర్వసన్నద్ధుఁడవై, సీతను రక్షించుచుండుము. మనము ముఖ్యముగా నీమెను రక్షించికొనవలసిన యవసరమెంతేనిగలదు. నేనే వెళ్ళి, యీలేడిని స్వయముగా సంహరించెదను. లేదా, ప్రాణములతో నుండఁగా దీనినిబట్టికొని రాఁగలను. నాయనా! నేను వచ్చువరకును నీవిచ్చటనే యుండుము! మనకీలేడియొక్క చర్మమే ముఖ్యమైనది. కావున దీనిని జంపుట తప్పదు. దీని నాకే బాణముతోఁ జంపుదును. అంతవరకు నప్రమత్తుఁడవై, యీయాశ్రమమున సీతను రక్షించుచుండుముఁ లక్ష్మణా! దీనిం జంపి, యీచర్మమును బట్టికొని త్వరలోనే రాఁగలను. మహాబలశాలియు, బుద్ధిమంతుఁడు నగు జటాయువు నీకుఁ దోడై యుండఁగాఁ, బ్రతిక్షణము నన్నివైపులనుండియును, గీడును శంకించుచు, జాగరూకుఁడవై, సీతను గాపాడుచుండుము.

# శ్రీరాముఁడు - మాయలేడివెంటఁ బోయి మారీచుని జంపుట

శ్రీరాముఁడు సీతారక్షణార్థమై లక్ష్మణుని నియోగించి, బంగారు పిడిగల ఖడ్గమును నడుమున బిగించెను. మఱియును మూఁడు వంకరలు దిరిగిన ధనుస్సును, రెండమ్ముల పొదులను ధరించి, లేడిని బట్టుటకు బయలుదేరెను. ఆ లేడియు రాముని మోసగించి, చెంగుచెంగున గంతులు వైచుచుఁ గనఁబడియుఁ గనఁబడకుండను, బోయిపోయి, దూరమునఁ గానుపించెను. శ్రీరాముఁడు తొందరగా నాలేడి వద్దకుఁ బోయెను. అదియును దగ్గరఁబడినట్లు కనిపించుచు, మఱల దూరముగాఁ బరువెత్తిపోవుచుఁ బట్టుపడినట్లుగా నాశఁజూపుచు, మఱల భయముతో వేగముగాఁ బరువెత్తి, దూరముగాఁ బోవుచుండెను. శరత్కాలమున మేఘముల చాటున నొకప్పుడు గనుపించుచు, నావెంటనే మేఘముల చాటునకుఁ బోవు చంద్రునివలె నాలేడిగూడఁ గనులకుఁ గానుపించుచు నప్పుడే మాయమగుచుండెను. ఈవిధముగా, నామాయలేడి, శ్రీరాముని, యాశ్రమమునుండి చాలదూరముగాఁ దీసికొనిపోయినది. అటుపోయి పచ్చనిగడ్డితో మెత్తగానున్న నేలపైఁ జెట్టునీడను గూర్చొని శ్రీరాముఁడు విశ్రాంతిఁ దీసికొనుచుండెను. తరువాత నామాయలేడి వన్యమృగములతోఁ గలిసి, శ్రీరాముని గంటఁబడినది.

శ్రీరాముఁడును నాశఁబడి, పట్టుకొనఁబోగా, మరలఁ బరు వెత్తి మాయమైనది. మఱికొంతసేపటికి దూరముగానున్న చెట్లమధ్యఁ గనిపించినది. ఇంక రాముఁడద్దానిం బట్టికొను ప్రయత్నమును మానివేసి, విసుగెత్తి, దానిం జంపుటకు సిద్ధ పడెను. వెంటనే సూర్యకాంతితో వెలుగొందుచు, మహా సర్పమువంటి, బ్రహ్మనిర్మితమైన బాణమునుదీసి, ధనువు నెక్కువెట్టి సంధించి, గురిచూచి, బలముగా విడిచిపెట్టెను. వెంటనే యాబాణ యామాయలేడియైన మారీచుని గుండె లను జీల్చివైచి, పైకి దూసికొనిపోయినది. అంతట వాఁడు తాడుచెట్టంత యెత్తున కెగిరి, భూమిపైఁబడి, కొనయూపిరితో మాయనువీడి నిజరూపమును ధరించి, రావణుఁడు చెప్పిన ట్లుగా, శ్రీరాముని కంఠస్వరము ననుకరించుచు, "హా! లక్ష్మణా! హా! సీతా!" యని గట్టిగానరచెను. అట్లరచుచునే వాఁడు చనిపోయెను. అప్పుడు శ్రీరాముఁడు వానివద్దకు నెళ్ళి బంగారు బాహుపురులు మొదలైన యాభరణముల తోడను బాడవైన తోడలతోడనుఁ జచ్చిపడియున్న రాక్షసుని జూచెను. మఱియు వాఁడు చనిపోవుచుఁ బెట్టిన కేకను దలఁచి, యామాటలను, లక్ష్మణుఁడును, సీతయును విని యుందురని, యనుమానముతో నటనుండి వేగముగాఁ దన యాశ్రమమునకు బయలుదేరెను. ఆతఁడట్లు వచ్చుచుఁ ద్రోవలో "లక్ష్మణుఁడు చెప్పినట్లె యైనది. ఈరాక్షసుని మాటలువిని సీతయెంతఁగా భయపడినదోగదా?" యని

తలఁచెను. లక్ష్మణునిగూడ నెట్లు బాధపడియుండునో ? యనియు భావించెను. అప్పుడు శ్రీరాముని శరీరము గగుర్పడిచినది. క్రమముగా శ్రీరామునకు భయమధికమై, యింతవరకు నారాక్షసుఁడు చేసిన దుష్టచేష్టలను, జీవరఁబలికిన మాటలను, దలంచుచు, వచ్చుచుండెను. త్రోవలో నిజమైన లేడినొకదానినిజంపి, దానిమాంసమును బట్టికొని, యాశ్రమమునకు వచ్చుచుండెను.

## సీతాదేవి భయపడుట - లక్ష్మణుఁడు - ధైర్యము - చెప్పుట

మారీచుని అరపును సీతవినెను. ఆధ్వని వినఁబడిన తోడనే, సీతాదేవి లక్ష్మణుంబిలిచి, "నాయనా ! నీవిప్పుడే, శ్రీరామునివద్దకు వేగముగాఁ బొమ్ము !" అనిపలికినది. మఱియు ఆతఁడు పరమార్తుఁడై, నన్నుగూర్చియు, నిన్నుద్దేశించియుఁ బలికినమాటలు స్పష్టముగా వింటివిగదా ! అట్టి యాపదలోనున్న నీయన్నవద్దకు వేగముగా వెళ్ళుము !" అనఁగా విని, లక్ష్మణుఁ డన్నియు నెఱింగినవాఁ డగుటచే, నాశ్రమమునువీడి వెళ్ళుటకిష్టపడలేదు. అంతసీతాదేవి కోపముతో నిట్లనుచున్నది.

లక్ష్మణా ! నీవు నిజమైన భ్రాతృభక్తిని నటించు శత్రువుగాఁ దోఁచుచున్నది. లేనిచో నింతటి మహావిపత్తు నంగుఁగూడఁ జలించక, యిచ్చటనే యుండుటకుఁ గారణము

లేదు. ఓయీ! నీయన్న చనిపోయినచో, నన్ను జెఱఁబట్టు టకు నాశించియున్నావేమో? శ్రీరామున కాపద రావ లయుననియే కోరుచున్నావేమో? నిజమైన సోదరప్రేమ నీలోఁ గనరాకున్నది. కావుననే యిట్టికష్టకాలములోఁగూడ నిశ్చింతగా నున్నావు. నీవు లేకున్న, నేనొంటరిగా నెటు పోయెదనో, యని యనుమానించుదువేమో? ఎవనిసేవ ప్రధానముగానెంచి, యిచటకు వచ్చితిమో. యాతఁడే, యాపదలోఁ బడిపోయినప్పుడు, నీకింక నాతోఁబనియేము న్నది? అనుచు సీతాదేవి యేడ్చుచు, అడులేడివలెఁ గంపించి పోవుచుండ, లక్ష్మణుఁ డంతయునువిని, యిట్లనుచున్నాఁడు. అమ్మా! నీభర్త శ్రీరాముఁడు, దేవ గంధర్వ యక్ష రాక్షసులలో నెవ్వరికిని జయింపనలవిగాని వీరుఁడు. నీవింతఁగా భయపడ నవసరములేదు. తల్లీ! నీవేమన్నను నాయన్నయొక్క యాజ్ఞానుసారముగా, నిన్నొంటరిదానిం జేసి, నేనువెడలఁజాలను. రాముని బలముముందు, దేవేంద్రాది సర్వదేవతలేగాదు, పరమేశ్వరుఁడే కలసివచ్చినను, నిలువలేరనుట సత్యము. కావున నీవు కొంత శాంతించుము! భయమును దొలఁగించి కొనుము. శ్రీరాముఁ డాలేడిని సంహరించి, వేగముగావచ్చి, నిన్ను సంతోషపెట్టగలఁడు. నీవు విన్న యాకంఠస్వరము నిజమునకురామునిది గాదు సుమా! అది మాయతో ననుసరించినది మాత్రమే. అదియు నారాక్షస మాయయే యని గ్రహించుము. నేను

మాత్రము రామాజ్ఞను మీరువాఁడనుగాను. ఈజనస్థాన మునఁగల ఖరాది రాక్షసులను సంహరించుటచే, వారు మన యందు బద్ధవిరోధులై, యున్నారు. ఓసీతామతల్లీ ? ఈ రాక్షసులు సర్వదా జీవహింసాపరులై యనేకవిధములుగా మాటలాడుదురు. అంతమాత్రమున నీవు విచారించకుము. శ్రీరాముని విషయమై, యేమాత్రము జింతించకుము. అని పలికెను.

## సీతా దుర్భాషలు - లక్ష్మణ ప్రయాణము

లక్ష్మణుఁడు యథార్థమెఱింగి, పలికిన మాటల నపార్థము చేసికొన్న సీతాదేవి కనులెఱ్ఱఁజేసి కోపముతో నిట్లను చున్నది. ఓరీ! దుశ్శీలా! నిర్దయుఁడా! ఈ శ్రీరాముని భరింపరాని కష్టము, నీకు సంతోష దాయకమైనట్లున్నది. నీయాంతర్య మంతయును నాకర్థమైపోయినది. రాముని విపత్తును జెవులార వినియును నీవింత నిశ్చింతగాఁ బలుకుచున్నావు. నీవంటి మాయాప్రేమను నటించువారిల్లే యుందు రనుట నాశ్చర్యములేదు. నీవు మహాక్రూరుఁడవు. కావుననే, యాతనివెంటనే యుండి, సమయముకొఱకు వేచి యుంటివి. ఇప్పుడిట్టి కీడును దలపోయుచున్నావు. నన్నుబొందుటకే, యాభరతుఁడును, నీవు నేకమై, రహస్యాలోచనలఁ జేసియుందురు. అది మీయిరువురకును లభ్యముగానిదని, యెఱుంగుము. నల్లకలువలవంటి శరీరచ్ఛాయఁగలిగి,

పద్మదళ విశాలనేత్రుఁడైన, శ్రీరాముని గామించిన నేన న్యుని గన్నెత్తియైనఁ జూడను. రాముఁడు లేని జీవితము నొక్కక్షణమైన గడపను. నీసమక్షముననే యీప్రాణము లను విడిచెదను. అని యింకను నేమేమో పరుషవాక్కులను బలుకుచున్న, సీతాదేవింజూచి, లక్ష్మణుఁడు వినయవిధేయ తలుట్టిపడ, జితేంద్రియుఁడై, యామెకు నమస్కరించు నిట్లనుచున్నాఁడు.

అమ్మా! నీకు నేను సమాధానము చెప్పలేను. ఒక్క మాటలో నీవు నాకు దేవతా మాతృమూర్తివి. అని మాత్రము చెప్పగలను. ఎంతటి హానినైనను, మిక్కిలిగా ననుచితవాక్కులతో నొప్పించుట స్త్రీసహజగుణము. ఇందా శ్చర్యములేదు, లోకములో నిట్టిసంఘటనలను జూచుచునే యున్నాము. స్త్రీలు వినయాది ధర్మములను విడచుచుఁ, జంచలమనస్కలై, కఠిన హృదయలై, మిక్కిలి బహిఃప్రాణ ములవంటి సన్నిహితులఁగూడ, విడఁదీయఁగలరు. అమ్మా! నా రెండు చెవులందును శూలముల గ్రుచ్చినట్లుగాఁ బలికిన నీమాటలను వినలేనమ్మా! నేను సత్యమును, ధర్మమును బలుకుచుండఁగా, నీవాడినకఠినపు మాటలను, నీవనచారులగు దేవతలందఱువిందురుగాక! న్యాయముగాఁ బలుకుచున్న నన్ను బరుషములాడుచున్నావు. నాయన్న యాజ్ఞను నేను బాటించియుండఁగా, నన్ని ట్లనుమానించుచుంటివి. ఛీ స్త్రీ స్వభావమే సహజదుష్టము. నీపాపము ననుభవించుదువుగాక!

ఇంకక్షణమైన నిలువక నీమాటలనుబట్టి నేను రామునివద్దకుఁ బోవుదును. అమ్మా! నిన్నీవనదేవతలే యన్నివిధాలుగను రక్షించుచుందురుగాక! ఓవైదేహీ! ఇప్పుడు నాకెన్నో, దుశ్శకునములు గనఁబడుచున్నవి. నేను దిరిగివచ్చి, నీవు రామునితోఁ గలిసియుండుటను జూడఁగలనో, లేదో? అని లక్ష్మణస్వామి యన్నమాటలనువిన్న, సీతాదేవి యేడ్చుచుఁ దీవ్రముగా నిట్లనుచున్నది. లక్ష్మణా! శ్రీరాముఁడే లేనిచో, నేనీగోదావరిలో మునిగిపోయెదను. లేదా, యురినైనఁబోసి కొందును. మఱియేవిధముగానైన నేను మరణించుటతప్పదు సుమా! నేనితరు నెంతవానికైన, నాయెడమపాదముతోనైనఁ దాకుట కిష్టపడను. అనుచుఁ దనచేతులతోఁ గడుపును బాదుకొనుచు నేడ్చినది. అట్టిసీతను లక్ష్మణుఁ డోదార్చుచుండఁగా, మఱల నాతఁ డీమూలముగాఁ గాలయాపనఁ జేయుచున్నాఁడని, యాతనిమాటలనువినక, తానును మాటలాడుట మానినది. అదియెఱింగిన లక్ష్మణుఁడు వెంటనే సీతాదేవికి నమస్కరించి, యటనుండి బయలుదేరి, మాటిమాటికిని, గనిపించినంతవరకును వెనుదిరిగి చూచుచుఁ, దన యన్న వెళ్ళినదారికి వెడలెను.

## రావణుని - శ్రీరామాశ్రమ ప్రవేశము

లక్ష్మణస్వామి తనకిష్టములేకున్నను, మాతృమూర్తి వంటి వదినగారి దుర్భాషలను సహించలేక, యతివేగముగా

నన్నుజేరి, కలసివచ్చుటకై, యాశ్రమమును విడిచి, వెళ్ళెను. ఆసమయమునకై, వేచి, పొంచియున్న రావణుఁడు యతివేషధారియై, రామాశ్రమముంబ్రవేశించెను. అతఁడప్పుడు సన్నని కాషాయవస్త్రమును గట్టి, శిఖను ముడివైచి, గొడుగుపావలను దొడిగికొని, త్రిదండియై, కమండలమును జేతఁబూని, యొంటరిగానున్న సీతాదేవికొఱకు నయ్యాశ్రమముం బ్రవేశించెను. అందు సీతాదేవి చంద్రసూర్యులు లేని సంధ్యాదేవివలెఁ బ్రకాశించుచున్నది. చంద్రుఁడు సన్నిధిలేని సమయమునఁ గ్రూరమైనయంగారకగ్రహము రోహిణిని జూచినట్లు, క్రూరుఁడైన రావణుఁడు సీతను జూచెను. ఆరావణునిజూచిన యావనమునఁగల చెట్లుచూచి చలించక నిలిచినవి. వాయువుగూడ వీచలేదు. గుడ్లెఱ్ఱఁజేసి చూచుచున్న రావణునకు భయపడి గోదావరియును మెల్లగా ప్రవహింపఁ జొచ్చినది. అట్టిరావణుఁడు నిదేసమయమని యొంటరిగానున్న, సీతాదేవి సన్నిధిని బ్రవేశించెను. మఱియుఁ దృణచ్ఛన్నకూపన్యాయముగా (పొలాలలో నేలబారు నూతులనిండా గడ్డిబలిసి యుండును. అటిలోతు లేనిదని యడుగువేయఁగా మునిగి పోదుము.) బైకి సౌమ్యభావముతో నారావణుఁడు సీతాదేవిని మోసగించుటకు వచ్చెను. ఆసమయమువ శ్రీరాముని స్మరించుచుఁ గంటనీరుగార్చికొనుచుఁ సీతబర్ణశాలయందు విచారముతో నున్నది. దురుబుద్ధిగల యారాక్షసుఁడు పచ్చని పట్టుచీరను ధరించి,

విశాలాక్షియైయున్న యాసీతను సమీపించి "సోఽహమ్" "అహంబ్రహ్మాస్మి",యను మాటలతో, నేకాంతమున నున్నయామెతో నిట్లనియెను. పద్మమునువిడిచి, నేలపైనున్న లక్ష్మీదేవివలె, స్త్రీలలో కెల్ల శ్రేష్ఠురాలయి సౌందర్యవతి యైన సీతను బొగడుచు నాతఁడిట్లనియెను.

## రావణుఁడు - సీతను - బ్రశ్నించుట

బంగారు తంతువులుగలిగిన పట్టుపుట్టమును ధరించి, బంగారు వర్ణముతో మెరసిపోవుచున్న యోలలనా! నీవెవ రవు! నీకన్నులును, జేతులును, బాదములును, బద్మములవలెఁ బ్రకాశించుచుండుటచే, నీవుతామరతూఁడువలె సుకుమారివై గనఁబడుచున్నావు. హ్రీ శ్రీ కీర్తి లక్ష్ములలో నీవెవరవు! కాంతిస్వరూపముదాల్చిన లక్ష్మివా? అప్సరసవా? స్వేచ్ఛగా విహరించు రతీదేవివా? నీవెవరైయుందువో? నాకుఁ జెప్పఁగోరెదను. నీపలువరుస హెచ్చుతగ్గులులేక మల్లెమొగ్గలవలె, బ్రకాశించుచున్నవి. నీనేత్రములు విశాల ములు. కంటిపాపలు సన్ననైయున్నను గనుగొనలుమాత్ర మెఱ్ఱగావెలుగుచున్నవి. నీపిరుదు భాగములు విశాలములు. నీతొడ లేనుఁగు తొండములం బోలినవి. నీ స్తనములు వట్రు వలై, పొడవై, యొకదానితోనొకటి యొరసి, బిగిసి యున్నవి. మఱియు నయ్యవి, మణిహారముచే నలంకరింపఁ

బడి, మిక్కిలి యాకర్షణీయములై యున్నవి. అందమైన దంతములమధ్య నుండి వెలుఁగు చిరునగవుతో, సుందర నేత్రములతో నొప్పుచున్న యోవిలాసినీ! నదీప్రవాహము తీరముల నాకర్షించినట్లుగా, నీవునామనోబుద్ధుల, నాకర్షించుచున్నావు. ఓసుందరీ! దేవతలలోఁగాని గంధర్వయక్షకిన్నరాదులలోఁగాని నీవంటి స్త్రీల నీభూమండలమునఁజూచి యెఱుంగను. లోకప్రశస్తమైన నీరూపమును, నీసౌకుమార్యమును, నీయౌవనమును, నీయరణ్యమునే, యలంకరించుచున్నది. నావంటివాని మనస్సును గూడఁ గకావికలు చేయుచున్నది. ఓకాంతా! ఈమాయామయ ఘోరరాక్షస సంచారముగల యరణ్యమున నివసింపఁదగవు. సర్వసంపదలతో నిండిన మేడలుగల మహానగరములందును, మనోహరములైన యుద్యాన వనములందును, విహరింపఁ దగియున్నావు. అట్టినీవిట్టి యరణ్యముల నుండుట దగదు. వెలఁగట్టరాని వస్త్ర మాల్యాభరణములతో, నీసౌందర్యమునకు దగినభర్తను బొంది సుఖింపఁదగియున్నావు. ఇంతకును రుద్ర మరుత వసు దేవతాస్త్రీలలో నీవెవతెవు? నాకుఁ జెప్పుము. నాదృష్టికి దేవతాస్త్రీవలెఁ బ్రకాశించుచున్నావు. దేవ గంధర్వ కిన్నరాది స్త్రీలెవ్వరు నీక్రూర రాక్షస సంచారముగల యడవియందు నివసించలేరు. నీవిక్కడ కెట్లువచ్చితివి? కోతులును, సింహములును, నెలుఁగుబంటులును, బెద్దపులులును, నివసించు నీభయంకరారణ్యమున నిర్భయముగా

నెట్లుంటివి? నిజమును జెప్పుము. నీవెవ్వరిదానవు? ఎక్కడ నుండి వచ్చితివి? ఇక్కడకు వచ్చుటకుఁ గారణమేమి? అని ప్రశాంతవచనములతో జాలిగా మాటలాడుచున్న యారావణునిజూచి, సీతాదేవి, యీతఁడు నిజమైన యతియైయుండునని భ్రాంతిపడి, యాతిథ్యము నొసంగఁదలఁచి, యిట్లనుచున్నది. ఓబ్రాహ్మణ యతీశ్వరా! ఇదిగో! ఈబ్రుస్యాసనమునఁ గూర్చుండుఁడు! ఈనా యర్ఘ్యపాద్యములను స్వీకరించుఁడు! ఇదిగో! ఈవన్యమూల ఫలంబులను భుజించుఁడు! అని యీవిధముగా నాతిథ్యము నొసంగుచున్న యాజానకిని జూచుచుఁ, దనకుఁ బ్రాణాంతకమైన యామెనపహరించవలె ననెడుబుద్ధిఁ గలవాఁడై, వానినెట్లో స్వీకరించెను. సీతాదేవియు నిట్టిసమయమున రామలక్ష్మణులున్న నెంతబాగుండెడిదో! యని, యాయరణ్యమున నటునిటు చూచుచుండెను.

## సీత - రావణునకుఁ -దననుగూర్చి - చెప్పుట

సీతాదేవి యావచ్చినవాఁడు తన నపహరింప, వచ్చినాఁడని, తెలిసికొనలేక, రావణుఁ డడిఁగిన ప్రశ్నలకు, సమాధానముగా నిట్లుచెప్పఁదొడఁగినది. మఱియు సమాధానము చెప్పనిచో, నీయతి శపించునేమో, అతిథిగా వచ్చినవాఁడు. కావున నీతనికి సగౌరవము చెప్పనిచో, నన్నుశపించఁగలఁడు. అనియు నాలోచించి, యిట్లనియెను. ఓబ్రాహ్మణయతీశ్వరా!

నేను జనకమహారాజుయొక్క కుమార్తెను. శ్రీరామచంద్రుని భార్యను. నేనత్తవారింటనుండ పండ్రెండుసంవత్సరములు కాపురముచేసి, సమస్తభోగభాగ్యముల ననుభవించినదానను. పదమూఁడవ సంవత్సరమున, మామామ, దశరథ మహారాజు మంత్రులతో నాలోచించి, నాభర్తకుఁ బట్టాభిషేకముచేయ నిశ్చయించెను. సర్వసన్నాహములును జరిగినవి. అప్పుడు మాసవతి యత్త కైక, మహారాజును రెండువరములను గోరి నది. సత్యసంధుఁడైన దశరథుఁ డిచ్చుటకువాగ్దానము చేసెను. అప్పుడామె యొకవరముతోఁ దనకుమారుఁడైన భరతునకుఁ బట్టముగట్టుటయు, రెండవవరముతో శ్రీరాముఁడు పదు నాలుగు సంవత్సరము లరణ్యవాసము చేయవలెననియుఁ గోరినది. అంతటితోఁబోక, నావరములను దీర్చువరకును నిద్రాహారాదులను మానియుందు ననియన్నది. మఱియు, నామాటగాదని శ్రీరామునకుఁ బట్టాభిషేకము చేసినచో నుత్తరక్షణముననే, బలవన్మరణము నేదో యొకవిధముగా నొందఁగలననియుఁ బలికినది. మహారాజు సత్యసంధుఁడగుటచేఁ గాదనలేక,యట్లని, యక్రమమార్గమునఁ బ్రాణప్రియుఁడైన కుమారుని విడువలేక, యామె నెన్నియో విధములఁ బ్రార్థించెను. కాని యామె తనపట్టును విడువలేదు. అప్పటికి నాభర్త యిరువదియైదేండ్లవాఁడు. నాకుఁ బదునెనిమిది యేండ్లవయస్సు. అప్పటికే నాభర్త సత్యసంధుఁడుగను, సద్గుణసంపన్నుఁడుగను, ధర్మాత్ముఁడుగను, శౌచముగల

వాఁడుగను గొప్పగాఁ జేసెంౌదెను. అతఁడాజానుబాహుఁడు. విశాలాక్షుఁడు. మహాపరాక్రమశాలి. సర్వజీవులను రక్షించు వాఁడు. దశరథుఁడు కామార్తుఁడై, కైకమాటను గాదనలేక, నాభర్త శ్రీరామునకుఁ బట్టాభిషేకమును జేయలేదు. ఆ సమయమున శ్రీరాముఁడు కైకగృహమునకుఁబోగా నామె యిట్లన్నది. "రామా! నిష్కంటకమైన యీరాజ్యము నంతను భరతునకొసంగుటకును, నిన్ను బదునాలుగేండ్లు వనములనుండఁ బంపుటకును, నీతండ్రి నాకు వరముల నిచ్చెను. కావున నీతండ్రియొక్క సత్యమును నిలుపుటకై యిప్పుడే నీ వరణ్యములకుఁ బోవలెను. అనఁగా విని "అమ్మా! అట్లేచేయుదును." అని దృఢనిశ్చయముతోఁ బలికి, యడవులకుఁ బ్రయాణమయ్యెను. ఓ బ్రాహ్మణ స్వామీ! వినుము!

శ్లో॥ దద్యా న్నప్రతిగృహ్ణీయా త్సత్యం బ్రూయా న్నచా।
ఏత ద్బ్రాహ్మణ! రామస్య, ధృవం వ్రత మనుత్తను
మమ్॥

స. 47, శ్లో॥-17

తా॥ ఓ బ్రాహ్మణా! నాభర్తయైన శ్రీరాముఁడు దానొకరి కిచ్చుటయేగాని, యెవరినుండియు నేవస్తువును దీసి కొనఁడు. ఎట్టిపరిస్థితియందైన, నాడినమాటఁ దప్పఁడు. అసత్యమును హాస్యమునకైన పలుకఁడు. ఇవి శ్రీరామునకుఁ బ్రాణసమానములైన దీక్షలుసుమా!

ఎట్టిధర్మమునకైనను, సత్యమును బలుకుట, పరద్రవ్యమున కాశించక (తీసికొనక) యుండుట యనునవి మూలాధారములు. ఈరెండింటిని విడువకున్నచో నన్నిధర్మములు నప్రయత్నముగనే సిద్ధించును.

ఓయీ! బ్రాహ్మణా! శ్రీరామునితమ్ముఁడే లక్ష్మణుఁడు. యుద్ధములందు శత్రుసంహారమును జేయువాఁడు. అట్టిపరాక్రమశాలియును, ద్వైమాతురుఁడును. (లక్ష్మణుని గౌసల్యయు, సుమిత్రయును సమానప్రేమతోఁ బెంచిరి. కావున వారిద్దరును దల్లులుగాఁ గలవాఁడు) నైన లక్ష్మణుఁడు శ్రీరామునకుఁ గుడిభుజము వంటివాఁడు అట్టివాఁడు నావలెనే తనయన్న ననుసరించి, యీయరణ్యములకు వచ్చినాఁడు. అట్లు ధర్మస్వరూపుఁడై, జితేంద్రియుఁడై, జడలు ధరించి, మునివేషమున, మాతో నడవులం బ్రవేశించినాఁడు. కైకకారణముగా మేము ముప్పురము, రాజ్యభోగములను విడచి, శక్తిసామర్థ్యములతో, నీగంభీర భయంకరారణ్యములలో నిర్భయముగాఁ బ్రవేశించితిమి. ఓయతీశ్వరా! ముహూర్తకాలము విశ్రాంతిఁ గైకొనుము. ఈలోగా నాభర్త, లేడిని, యుడుము, నడవిపందిని వేటాడి, రుచికరములైన మాంసములనుదెచ్చి, నిన్నింకను దృప్తిపరచఁగలఁడు. ఓబ్రాహ్మణశ్రేష్ఠుఁడా! ఇంతకును నీపేరేమి? నీకులగోత్రము లెవ్వి? నిజము చెప్పుము. నీవీభయంకరారణ్యముల నేకాకివై, యేలచరించుచున్నావు? అనిప్రశ్నించిన సీతభయకం

పితు రాలగునట్లుగా, రావణుఁ డిట్లు సమాధానమును జెప్పు చున్నాఁడు.

## సీతనుగోరుచు - రావణుఁడుపలుకుట

ఓసీతా! దేవా సుర పన్నగాది సమస్త లోకముల వారు నెవనిపేరువిన్న, గడగడలాడిపోవుదురో, అట్టి రావణుఁ డను పేరుగల రాక్షస రాజునునేనే. బంగారువన్నె దేహము గలిగి, పట్టువస్త్రమును ధరించిన నిన్నుజూచి నేను, నాభార్య లలో నెవతెయందును మక్కువలేనివాఁడ నయితిని. ఆయా లోకములలోఁగల సర్వోత్తమ స్త్రీలనందఱను దీసికొనివచ్చి తిని. అట్టివారందఱిలోఁ బట్టపురాణివై నన్నానందింపఁ జేయుము. నారాజధాని లంకాపురము. అదియొక విశాల పర్వతముపై నిర్మింపఁబడినది. ఓసీతా! అక్కడ నీవు నాతోఁ గలిసి, విహరించునప్పు డీయరణ్యవాస క్లేశమును మరచిపోఁ గలవు. నీవు నాపట్టపురాణివై యుండఁగా, నాయైదువేల మంది, దాసీజనంబును, దివ్యవస్త్రాభరణాదులను ధరించి, నీయడుగులకు మడుగులొత్తఁగలరుసుమా! అనియెను.

## సీత - రావణుని - నిందించుట

సీతాదేవి రావణుని మాటలును విని వానిని దృణీక రించుచు నిట్లనుచున్నది. సర్వసద్గుణ సంపన్నుఁడును మఱ్ఱి చెట్టువలెఁ బలువుర కాశ్రయమిచ్చి, రక్షించువాఁడును,

సత్యప్రతిజ్ఞుఁడు, నాజానుబాహుండును, నగు శ్రీరాముని నేననుసరించి, యుండవలసినదానను. మఱియు మహాపర్వతము వలె నెంతటి యుపద్రవమునకైనఁ జలించని వాఁడును, దేవేంద్రునితో సమానుఁడును, మహాసముద్రమువలె నెవ్వనికిని క్షోభింపఁజేయుటకు శక్యముగానివాఁడు నగు శ్రీరామసన్నిధియే నాకుఁబెన్నిధి. నేనాతనివిడిచి యుండను. వెండియు వినుము! విశాలమైన వక్షస్థలము గలవాఁడును, సింహము వంటి పరాక్రమముతో, ఠీవిగా నడచువాఁడును, మానవశ్రేష్ఠుండును (ఈరెండువిశేషణములతోడను, ఆనాఁడు నృసింహావతారము ధరించినవాఁ డితఁడేసుమా! యని వ్యంగ్యముగాఁ జెప్పుచున్నది.) నగు శ్రీరామభద్రుని నేను విడువజాలను. ఇంకను నాలింపుము! పౌర్ణమినాఁటి చంద్రబింబమువంటి ముఖముగలవాఁడును, జితేంద్రియుఁడు, నంతటను వ్యాపించిన కీర్తిప్రతిష్ఠలు గలవాఁడును, మహాత్ముఁడు నైన శ్రీరాముని నంటిపెట్టుకొని యుందును. నీవా రామునిముందు నక్కవంటివాఁడవు. సింహమువంటి రామునిసొత్తును నీవుగోరుచున్నావు. సూర్యునినుండి కిరణకాంతిని విడఁదీయుటకుఁ దరముగానివిధముగా, శ్రీరాముని సన్నిధినుండి నన్ను బయటకుఁ దీయలేవుసుమా! (నాశరీరమును నీవు బలాత్కారముగాఁ గొనిపోయినను, నాయాత్మ మాత్రము రామసన్నిధినే యుండునుసుమా! అని భావము.) అంతటి శ్రీరామభద్రునకు భార్యనైన నన్నుఁగోరినచో,

నీస్వప్నములో బంగారుచెట్లను జూడఁగలవు. (చావు దగ్గరఁ బడ్డవానికి బంగారుచెట్లుస్వప్నములోఁ గనుపించునని శాస్త్రము.) నీవు రామునితో, వైరమును గోరుట సింహము యొక్కయు, విషనాగుయొక్కయుఁ గోరలను బట్టఁ బ్రయత్నించుటయేసుమా! వెండియును మందర పర్వతమును జేతితోఁ బెకలించి, నెత్తినఁ బెట్టికొనుట. దాహము తీరుటకై కాలకూటవిషమును ద్రాగఁబూనుటయేసుమా! శ్రీరాముని ప్రియురాలైన ధర్మపత్నిని గోరుట సూదులతోఁ గన్నులను బొడిచికొనుటయే యగును. లేవాచుఅకత్తితో నాలుకను గోసికొనుటయేసుమా! ఓరీ! నీచాధమా! శ్రీరామపత్నినైన నన్నపహరించఁగోరుట, మెడకు బండరాయిఁ గట్టికొని సముద్రమునీది దాటఁగోరుటవంటిది. మఱియు సూర్య చంద్రులను బట్టికొనఁ బోవుటవంటిదే యగును. అంతియేగాదు. మండుచున్న కాలాగ్నిని వస్త్రమున మూటఁగట్టి బుజమున వైచుకొనుటవంటిది. ఇంకను వాడికొనలుగలిగి యెఱ్ఱగాఁ గాఁగిన యినుపకోలలపై నడచుట వంటిది. ఇంకనువినుము! సింహమునకును, నక్కకును, సముద్రమునకును, జిన్ననీటిగుంటకును, నమృతమునకును గుండనుగడుగఁగా వెడలిన నీటికి నెంతయంతరమో? శ్రీరామునకును నీకు నంతయంతరము గలదని గ్రహించుము. అదియేగాదు. బంగారమునకును, సీసమునకును మంచిగంధపు ముద్దకును, గోఁతిలోని నీటిబురదకును, వనమందు మదించిన

యేనుఁగునకును, బెంపుడుపిల్లికి, నెంతయంతరమో, శ్రీరా మునకును నీకు నంతయంతరముగలదు. ఓరీ! రావణా! ఇంకను వినుము! గరుత్మంతునకును, గాకికిని, హంసకును, నీటికాకికిని, గలయంతరమే, శ్రీరామునకును, నీకును గలదు సుమా! దేవేంద్రప్రభావసంపన్నుఁడైన శ్రీరాముఁడు ధను ర్బాణములను ధరించి, యుండఁగా, వజ్రపుఁదునకను బియ్యపుగింజగా భావించి, చీమ మ్రింగినట్లు, మరణము నొందఁగలవు. అని యీవిధముగా నిర్మలమైన మనస్సుగల సీతాదేవి రావణుని దిట్టిపోసినదయ్యు నొంటరిగా నుండుటచే, భయకంపితురాలై, పెద్దగాలికిఁ గదలిపోవుచున్న యరఁటి చెట్టువలె నుండెను. ఆసీతాదేవీభయమును గ్రహించిన రావ ణుఁడు మృత్యుదేవతవలెఁ దనకులగోత్రనామములం జెప్పి మఱింతఁగా భయపెట్టఁదలఁచెను.

## రావణుఁడు - తనను దాను - బొగడికొనుట

తనను నిర్భాగమాటముగా నిందించిన సీతాదేవిని జూచి, రావణుఁడు కనుబొమలుముడిచికొని కోపోద్రేకముతో నిట్లుపలుక నారంభించెను. ఓసుందరాంగీ! నేను కుబేరుని తమ్ముఁడను. నాపేరు రావణుఁడందురు. నేను బదితలలు నిరువదిచేతులును గల బలశాలిని. దేవ గంధర్వ పిశాచ పత గోరగాదులు నాపేరు విన్నంతనే భయభ్రాంతులై, పారి పోయి, యెక్కడివా రక్కడఁ గుక్కినపేలువలె దాగుందురు.

ఒకప్పుడు కుబేరునితో యుద్ధముచేసి, జయించఁగా నాతఁడు భయపడి, పారిపోయి, కైలాసము నాశ్రయించినాఁడు. కామగమనమై, సర్వోత్కృష్టమైన యాతని పుష్పక విమానమును, నేను దీసికొంటిని. అట్టివిమానముపై, నేను విహరించుచుందును. ఓజానకీ! నేను దీవ్రముగాఁ గోపించినచో, దేవేంద్రునితోఁగూడ దేవత లందఱును బారిపోవుదురు. నేనున్నచోట, గాలి గట్టిగా వీచుటకును, సూర్యచంద్రులు తీవ్రతను జూపించుటకును భయపడుదురు. వాయు నాకనుకూలముగాఁ బ్రవర్తించి, నా మెప్పును బడయుటకు యత్నింతురు. నేనెక్కడెక్కడఁ దిరుగుచుందునో, యక్కడక్కడఁ గల వృక్షము లాకులనైనఁ గదల్పక నిశ్చలములై యుండును. నదులు దమవేగములను గట్టిపెట్టి, మెల్లఁగాఁ బ్రవహించును. నాలంకాపురము, సముద్రతీరమునఁగల త్రికూటపర్వతముపై యింద్రుని యమరావతీ పురమువలె, సర్వభోగభాగ్యములతో, శత్రుభయంకరులైన రాక్షసులతో నిండి యుండును. ఓసీ! పిరికిదానా! పూర్వ మూర్వసి, పురూరవుని బాదములతోఁదన్ని, యాతరువాతఁ బశ్చాత్తాపముతో, బాధపడినట్లుగా, నీవును నన్నిప్పుడు దిరస్కరించి, తరువాత బాధపడఁగలవు. కావున నిన్నుగోరి, నీసన్నిధికివచ్చిన, నన్ను దిరస్కరించకుము. నాతోరమ్ము! అమానవుఁడైన రాముఁడు నాకాలిగోటికిని బోలఁడు. అనఁగా విని యాసీతాదేవి యానిర్జనారణ్యమునఁ గన్నులెఱ్ఱఁజేసి, తీవ్రకోపముతో, రావణుని గఠోరముగా నిందింపఁదొడఁగినది.

## సీత - రావణుని - తిరస్కరించుట

ఓరీ! రావణా! సర్వభూత నమస్కారములను గైకొనుచు, నుత్తరదిశకు నధిపతియైన కుబేరునకుఁ దమ్ముఁడనని చెప్పికొనుచునే యిట్లు పరస్త్రీలను గోరుచున్నావు. ఇంద్రియ నిగ్రహములేక దుర్బుద్ధులుగల, నీవలన నీతోఁబాటు రాక్షసకులమే నశించిపోవును. ఒకప్పుడింద్రుని భార్యయైన శచీదేవి నపహరించినను, జీవించఁగలవేమో? కాని, శ్రీరాముని భార్యనైన నన్నపహరించి, జీవించుట దుర్లభము సుమా!

## రావణుఁడు - నిజరూపముదాల్చి - రాముని నిందించుట

సీతాదేవియొక్క మాటలను విన్న రావణుఁడు, తనప్రతాపమును జూపించుచు, నొకచేతితో రెండవచేతిని గట్టిగాచరచి, (చప్పటఁగొట్టి) సన్యాసి మాయవేషమును విడిచి, నిజరూపమును జూపించెను. (ఇచ్చట రావణుఁడు తనకున్న మాయాశక్తిగాని, శారీరకశక్తిగాని రామునకు లేవని చెప్పుటకే, తన పదితలలతోడను, యిరువది చేతులతోడను, సీతకుఁ గనుపించి, రాముని కొకేశిరస్సును రెండేచేతులును గలిగియుండఁగా, నాతనికంటెఁ బదిరెట్లు బలవంతుఁడ నని ప్రత్యక్షముగాఁ జూపినాఁడని గ్రహించవలెను.) తరువాత సీతాదేవిఁజూచి, హెచ్చిన కోప తీవ్రతతో నిట్లనియెను.

ఓసీతా! నీవమాయకురాలవై, నాబల పరాక్రమములను మాటలతో, నెంతఁజెప్పినను, నిర్లక్ష్యముగా వినియుంటివి. ఓసీతా! ఈభుజములతో భూమినంతను బెల్లగించి, పైకెత్తి, మోయఁగలను. సముద్రము నంతను త్రాగివేయఁగలను. తుదకు మృత్యుదేవతనైనను సంహరించఁగలను. వాడియైన నాబాణములతో సూర్యగమనము నాపగలను. ఈభూమి నంతను ముక్కలుముక్కలుగాఁ జేయఁగలను. ఏరూపము నైనను ధరించఁగలను. ("కన్యా వరయతే రూపమ్" అను మాట ననుసరించి, నీవెంతటి సుందర రూపమును గోరుదువో, యంత సుందరాకారుఁడ నగుదునని భావము) నీకోరిక లన్నింటిని దీర్చఁగల భర్తనగుదును. నన్నుజూడుము! వరించుము! రావణుఁడిట్లు మాటలాడుచుండఁగనే యాతని కన్నులెఱ్ఱబడినవి. సూర్యకిరణములవలె నగ్నికణములవలెను, ధగధగలాడినవి. ఈవిధముగా సౌమ్యమైన సన్యాసివేష మునువిడిచి, భయంకరమైన రాక్షస రూపముతో మాట్లాడినాఁడు. నల్లని కాలమేఘమువంటి శరీరమును, నెఱ్ఱనిగ్రుడ్లును నిగనిగలాడు బంగారు కుండలములును, గల, తననిజరూపమును సీతకుఁ జూపినాఁడు. అంతియేగాక ధనుర్బాణములఁ గూడధరించియుండెను. ఎఱ్ఱని వస్త్రమునుగట్టికొని సూర్యప్రభవలెఁ బ్రకాశించుచున్న సీతతో మఱల నిట్లను చున్నాఁడు. ఓజానకీ! ముల్లోకములందును, పేరుప్రతిష్టలను సంపాదించికొన్న నన్ను నీవు మనసార నీభర్తగా నంగీకరిం

చుము. శాశ్వతముగా నన్ను విడువకుండుము! నీవు మెచ్చుకోఁదగిన ప్రియుఁడను నేనేసుమా! నేనెన్నఁడును నీకిష్టముగాని పనిని జేయను. మానవమాత్రుఁడైన, రాముని యందు నీమనస్సును మఱలించికొనుము! రాముని గొప్పఁదన మేమున్నది! రాజ్యభ్రష్టుఁడు. ఏపనియును సాధించి, సుఖించ లేనివాఁడు. పరిమితమైన మానవుల యాయుర్దాయము గల వాఁడు. అట్టివానిని జేపట్టి నీవేమిసుఖించఁగలవు! ఓవైదేహీ! అన్నియుం దెలిసిన దానివలె నహంకారముతో మాటలాడు చున్నావు. బుద్ధిలేనివాఁడై, యాడుదాని మాటనుబట్టి యీ భయంకరారణ్యములలో నివసించుచున్న యారాముఁ డేపాటిగుణవంతుడు? అని యీవిధముగా మాటలాడుచు, నారావణుఁడు, ఆకాశముననున్న రోహిణికి, బుధుఁడు దగ్గరఁబడినట్లుగా, సీతాదేవి సమీపమునకుఁజేరి యామెను బట్టుకొనియెను. అప్పుడాతఁడు సీతాదేవి కేశముల నెడమ చేఁబట్టి, కుడిచేతులతో నామెయొక్క తొడలను బట్టికొని యెను. ఆసమయమున మృత్యువువలె భయంకరుఁడైన రావణునిజూచి, సీతమాత్రమేగాక యావనదేవత లందఱును గడగడవడకుచు భయపడిరి. మఱియు నావనదేవతలు నిలువక పారిపోయిరి.

## సీతాపహరణము

ఆవెంటనే బంగారు చక్రములుగలిగి, గాడిదలచే మోయఁబడి వికారముగా ధ్వనిచేయుచున్న మాయారథ

మచ్చటికిరాగా, నారావణుఁ డాస్పృహాలేనియామె నారథ ముపైనుంచి, లంకకుఁబోన సమకట్టెను. (రావణునకుగల, నల కూబర, వేదవతి మొదలగువారి శాపములచే, సీతను బలాత్కరించి, భోగించలేక, యామెనుబట్టి రథముపైఁ దీసి కొనిపోయి లంకలోఁ దన వైభవమును జూపించి మోహపెట్టి యంగీకరింపఁజేయఁ దలఁచెను. స్కాందపురాణమున రావ ణునకుఁగల ఛాయాగ్రాహిత్వ శక్తిచేఁ [నీడనుబట్టిలాగఁగల శక్తి] సీతయొక్క నీడనుబట్టి లాగుకొనిపోయి, రథముపైఁ బడవైచెనని చెప్పబడినది. ఇందులకుఁ గారణము వానికిఁగలి గిన, శాపములఁగూర్చిన భయమే యనియుఁ జెప్పఁబడినది.) తరువాత రావణుఁడు పెద్దగాఁ గఠినమైన మాటలతో నర చుచు, సీతకు భయమును గలిగించెను. ఆ సమయమున శ్రీరామలక్ష్మణులు తనసన్నిధినిలేక దూరముగా నుండిరి. ఆసీతాదేవి "రామా! రామా! లక్ష్మణా!" అని పెద్దగాఁ బిలుచుచు నేడ్చుచున్నది. నాగేంద్రుని భార్యవలె నా రథముపైఁబడి, యటునిటు దొర్లుచు, నేడ్చుచున్న సీతతో రావణుఁడు వెడలిపోయెను సీతాదేవియుఁబిచ్చిదానవలెఁగలవర పాటుతో, 'అయ్యో! లక్ష్మణా! నీయన్న హృదయానుసార ముగాఁ బ్రవర్తించువాఁడవు రాక్షసునిచేఁ గొనిపోఁబడు చున్న నన్నుజూడలేదా? ఓరామచంద్రా! ధర్మసంరక్షణా ర్థమై, రాజ్యమునేగాక, జీవితమునుగూడ లక్ష్యముచేయని, నీవీయధర్మముగాఁ బ్రవర్తించు, రావణుని జూడవైతివిగదా?

శత్రుసంహారకుఁడవైన యోరామా ! నీవు దుష్టుల నెంత వారినైన శాసించుదువు. అట్టి నీవీపాపాత్ము నేలవిడిచితివి ? ఎవనికైనను బాపఫలము వెంటనే యనుభవమునకు రాక కాలము గడిచినకొలఁదియును బెరిగిపెరిగి, యొక్కమారుగా ననుభవింపఁజేయు నందురు. విత్తనములు జల్లఁగనే పంట పండదు. కొంత కాలవ్యవధి గావలయునుగదా ! అట్లే పాపమును గాలము గడచినంతనే నశింపఁజేయును. ఓయీ ! రావణా ! నీవు కండకావరముచే, బుద్ధినశించి యిట్టి నీచపుఁ బని కొడిగట్టితివి. ఇంకఁ ద్వరలోనే, నీవు శ్రీరాముని జేతిలో ఘోరముగాఁ జనిపోఁగలవు. అయ్యో ? ఎంత ఘోరము ? శ్రీరాముని ధర్మపత్నినైన, నన్నే వీడిట్లుగొనిపోవు చున్నాఁడు. దీనితోఁ గైకయు, నామెకిష్టులైన వారును సంతోషింతురుగాక ! బాగుగాఁ బుష్పించిన, యోకర్ణికార వృక్షములారా ! వినుడు ! ఈరావణుఁడు నన్నపహరించికొని పోవుచున్నాఁడని, శ్రీరామునకుఁ జెప్పుఁడు. ఓమాల్యవంతమా ! ప్రస్రవణపర్వతమా ! ఈదుర్మార్గునిగూర్చిన వార్తను శ్రీరామునకుం జెప్పుడు ! హంసాది సారస పక్షులతోనిండి ప్రవహించు నోగోదావరీ నదీమతల్లీ ! నాదురవస్థను జూచితివిగదా ? శ్రీరామునకుం జెప్పుము ! నీకిదే నానమస్కారము. ఈమహావనమందలి వనదేవతలారా ! మీరుపోయి నాకష్టపాటునుగూర్చి శ్రీరామునకుం దెలియఁ జేయుడు. ఇందలి సమస్తజంతువర్గములారా ! మిమ్ములను

శరణు వేడికొనుచున్నాను. మీరు నాదుఃఖవార్తనైన శ్రీరామునకుఁ జెప్పుడు." అని యీవిధముగా మైమరచి మహాదుఃఖముతో విలపించుచున్న సీతాదేవి యీవనమందుఁ దిరుగాడు జటాయువును జూచి, ఓయీ! ధర్మాత్మా! నాదురవస్థను జూడుము! ఓజటాయువా! వీఁడు మహాబలవంతుఁడు, క్రూరుడు. ఆయుధములను ధరించియున్నాఁడు. ఇట్టివీనిని, నీవడ్డుకొనలేవు. కావున నీవు వేగముగాఁబోయి, శ్రీరామలక్ష్మణులతో, నాదుర్వార్తను జెప్పి, వేగముగాఁ బంపుము" అని మొఱ్ఱవెట్టికొన్నది.

## జటాయువు - రావణుం - నడ్డగించుట

సీతాదేవియొక్క యేడ్పును జటాయువు విన్నవాఁడై, పరుగుపరుగున నెగురుచువచ్చి, సీతనుజూచెను. కొండంత దేహముతోఁ బొడవైన తుండముతో శుభకరమైన వాక్యముల నీవిధముగాఁ బలికెను. ఓయీ! రావణా! నేను సనాతన ధర్మపరాయణుఁడను.సత్యమే నాజీవితము. మహాబలశాలిని. విశేషించి యీపక్షుల కన్నిఁటికి రాజును. (జటాయువు మొదట తనగుణములను జెప్పి, వ్యంగ్యముగా నిట్టిగుణములకు వ్యతిరేకివైన నీవు నశించఁగలవుసుమా! యని హెచ్చరించుచున్నాఁడు.) ఓరీరావణా! ఈలోకమంతకును శ్రీరాముఁడే ప్రభువు. ఇంద్ర వరుణులతో సమానమైన బలపరా

క్రమములు గలవాఁడు. నిత్యమును లోకహితముఁనే కోరెడి వాఁడు. దశరథచక్రవర్తికిఁ బెద్దకొడుకుసుమా! అట్టి మహాత్ముని ధర్మపత్నియే యీసీతాదేవి. ఈమెను దొంగతనముగా నపహరించుట నీకు శ్రేయస్సుగాదుసుమా! నీవును మహాబలశాలివే. అయినను ధర్మమును రక్షించవలసిన రాజు పదవియందుండిన, నీవే యధర్మముగాఁ బరదారాపహరణఁ గావించినచో, నిఁక, నీభార్యలకును, ప్రజలకును రక్షణ యెట్లుండును? ఎవఁడైనను ధార్మికుఁడైన మహారాజుయొక్క భార్యను రక్షించుట పరమధర్మము. కావునఁ బరస్త్రీలఁ జెరఁబట్టు దుర్బుద్ధిని విడువుము. ఇంతకంటె, నీచాతినీచమైన దింకొకటిలేదు. పండితుఁడైనవాఁడు తనకేది కష్టమును గలిగించునో? ఆకార్యమును బరులకొనర్చి కష్టమును గలిగించరాదు. (సర్వజీవులును తనవంటివే యనుభావనతో నెవరికి నపకారము చేయరాదు.)

శ్లో॥ నివర్తయ మతిం నీచాం పరదారాభిమర్శనమ్ ।
నత త్సమాచరే ద్ధీరో, యత్పరోఽస్య విగర్హయేత్ ॥
స. 50, శ్లో॥-7

తా॥ ఓరీ! నీచుఁడా! పరస్త్రీలను జెఱఁట్టుట చాల నీచము. నీవీభావమును విడువుము. పండితులైనవా రేవగించికొందురు. నీభార్యనెట్లు కాపాడుకొందువో? పరభార్యలను గూడ నట్లేకాపాడుట యుత్తమవీరుని లక్షణముసుమా! ఇట్లు చేసినచో సమూలముగా నశించుదువు.

పరదారాపహరణమున తానేగాక తనవంశమే నశించును.

శ్లో॥ ధర్మమర్థంచ కామంచ శిష్టా శాస్త్రేష్వ నాగతమ్।
వ్యవస్యంతి నరాజానో ధర్మః పౌలస్త్యనందన! ॥
స. 50 శ్లో॥-8

తా॥ ఓయీ! పులస్త్యబ్రహ్మయొక్క కుమారుఁడవు. ధర్మార్థ కామములఁగూర్చి శాస్త్రములు చెప్పినదాని నెఱింగినవాఁడవు. అట్టిశాస్త్రమర్యాదను విడచుటకు, ధార్మికులైన ప్రభువులెవ్వరు నిష్టపడరు.

ధర్మార్థకామములలో నొకదాని కొకటి విరోధము గాకుండగా, శాస్త్రము ననుసరించి, ప్రవర్తించుట ధర్మము. అందును బరస్త్రీలను మాతృభావముతోఁ జూచి, రక్షించుట పరమధర్మము.

ఓయీ! రావణా! వినుము! ధర్మార్థకామములను సరియైనమార్గములలోఁ దా నవలంబించుచుఁ బ్రజల కాదర్శమైన వాఁడే నిజమైన ప్రభువు అట్లుగానిచోఁ బ్రజలందఱును భ్రష్టులగుదురు. ఓరీ! పాపాత్మా! నీకీయైశ్వర్యమెట్లువచ్చినది? (పాపునకింతటిసంపద యుండబోదనియుఁ గర్మవశాత్తుగాఁ గలిగినను బతనమునకే హేతువగు ననియు దీనిభావము.) పుట్టుకతోవచ్చిన దుర్గుణము పుడకలతోఁ గానిపోదని చెప్పుదురు. కావున నీనాశనము, తప్పదు.

శ్లో॥ కామం స్వభావో యోయస్య నశక్యం పరిమార్జితుమ్।
నహి దుష్టాత్మనా మార్య మావసత్యాలయే చిరమ్॥
స. 50, శ్లో॥-11.

తా॥ సహజమైన నీచత్వము సద్బోధల నెంతఁగాఁ జేసినను దాత్కాలికముగాఁ దొలఁగిపోయినట్లు గనిపించునే గాని, శాశ్వతముగా నశించదు.

నీచస్వభావము గలవాఁ డవసరమునుబట్టి తాత్కాలికముగా మంచివాఁ డనిపించికొన్నను సమయము వచ్చినప్పుడు పుట్టుకతో వచ్చిన గుణమును విడువలేఁడు. తన సహజ దుర్గుణముల నెవఁడైన నెఱిఁగి, వానిని మరల్చుకొనఁ బ్రయత్నించుటయే మానవధర్మము.

మహాబలుఁడగు శ్రీరాముఁడు నీకుగాని, నీరాజ్యము నకుఁగాని యెట్టి యపకారమును జేయలేదుగదా ? అట్టియెడ ధర్మాత్ముఁడైన రామున కేల కీడుచేయఁ దలపెట్టితివి ? ఖర దూషణాదులను జంపినాఁడని యందువేమో ? అదియును శూర్పణఖ చేసిన దోషముచే వారు తనపైకిరాగా నాత్మ సంరక్షణకే వారందఱను జంపినాఁడని యెఱుంగుము. తానుగా వెళ్ళి వారలను జంపలేదు సుమా ! ఇప్పుడు చెప్పుము. శ్రీరాముని ధర్మగుణమును దెలిసికొనుము. ఇప్పుడైనను గన్నులుదెఱచి ధర్మముదెలిసి వెంటనే సీతను విడువుము. శ్రీరాముఁ డన్నచో నగ్నితో సమానమైన తన చూపుల తోడనే యింద్రవజ్రాయుధము వృత్రాసురుని సంహరించి

నట్లు నిన్ను జంపఁగలఁడు. కాల సర్పమును వస్త్రముతో మూటగట్టి బుజమున వేసికొన్నావు. జాగ్రత్త! ఓరీ దురాశా పరుఁడా! తనకుఁ దగని భారమును నెత్తినఁ బెట్టికొన్నను, మితిమీరి జీర్ణముగాని యాహారమును దిన్నను, సౌఖ్యము లేదు. సరిగదా ప్రాణాంతకముగాక తప్పదు. ధర్మహీనమై యపకీర్తికరమై శరీర నాశనమునకుఁ గారణమైనట్టి పని నెవ్వఁడును జేయఁడుసుమీ! ఓ రావణా! నేను బుట్టి యిరువది వేల సంవత్సరములైనవి. (కావుననే దశరథునకు సమవయస్కుఁడైన మిత్రుఁడు) నా తాత తండ్రులనుండియును వచ్చుచున్న గ్రద్దల రాజ్యము నింతవరకును ధర్మమార్గమునఁ బాలించుచున్నాను. నేను వృద్ధుఁడను. నీవు యువకుఁడవు. పైగా ధనుర్బాణాదులైన యాయుధములను గవచమును ధరించియున్నావు. అయినను నీ ప్రాణములతో నీ సీతాదేవిని దీసికొనిపోఁజాలవు. వేదవేత్త వినుచుండఁగా న్యాయశాస్త్ర విరుద్ధముగా, ధర్మముల ననుమాన ప్రమాణములచే, వేదములకు విరుద్ధార్థమును జెప్పలేని, ప్రతివాదివలె, నాకంటఁబడి సీతను బలాత్కారముగా నపహరించలేవు. ఓరీ! దుర్మార్గుఁడా! ఆగుము! నాతో యుద్ధము చేయుము! ఇంతకుఁ బూర్వమే, యిచ్చట ఖరుఁడు నేలఁగూలినట్లుగా నీవు నిచ్చటనే చావఁగలవు. ఇంతవరకు నధర్మపరులైన, దైత్యదానవుల ననేకులను సంహరించిన, ధర్మాత్ముఁడును, మహావీరుఁడు నగు శ్రీరాముఁడు నిన్ను స్వల్పకాలములోనే సంహరించఁ

గలఁడు. ఆరామలక్ష్మణులు చాలదూరమునం దున్నారు. కావుననే యొంటరిగానున్న సీతను దొంగతనముగా, వేగిర పడి గొనిపోవుచున్నావు. పద్మపత్రాయతాక్షియు, సుకుమారియునైన యీసీతను, నాబొందిలోఁ బ్రాణములుండగా నీవుతీసికొనిపోఁజాలవు. ఇప్పుడు నాప్రాణముల నొడ్డియైన నామిత్రుని గోడలైన యీమెను రక్షించి, శ్రీరామునకుఁ బ్రియమును గావింతును. ఆగుమాగుము! ఎందుఁబోయెదవు? నీవు నాతో నొక్కముహూర్తకాలము యుద్ధము చేయుము. నాప్రాణము లున్నంతవరకును, నిన్నుగదలనీయను. ఈరథమునుండి నీశిరస్సులు తెగి తాటిపండ్లవలె నేలఁబడునట్లు చేయుదును.

## రావణ జటాయువుల - ఘోరయుద్ధము

ఈవిధముగా రావణునకు హితమును జెప్పుచున్న జటాయువుం జూచినంతనే వానినేత్రము లన్నియును గోపఘూర్ణితములై, నిప్పులు గ్రక్కుచున్నవి. అట్లు రావణుఁడు జటాయువుమీఁదికి యుద్ధమునకు సిద్ధపడెను. ఆసమయమున నాకాశమునపై, నిటునటుగొట్టఁబడుచున్న రెండుకాలమేఘములవలె, నారావణ జటాయువుల యుద్ధము జరిగినది. మఱియు మాల్యవంత పర్వతములు ఱెక్కలతో నాకాశముపైకెగిరి, యుద్ధము చేయుచున్నట్లు గనఁబడినది. రావణుఁడు వాడియైన బాణములఁ బ్రయోగించెను. జటాయు

వా బాణపుదెబ్బలను సహించుచు, నెగిరివచ్చి తెక్కల తోడను గోళ్ళతోడను దొండపు ముక్కుపుటములతోడను వానిని బొడిచి,పొడిచి, శరీరమంతయును దూట్లుపడి, రక్తము ప్రవహించునట్లు చేసెను. అంత నారావణుఁడు మృత్యుదేవతలవంటి పది బాణములతో జటాయువును గొట్టెను అదిచూచి, సీత భయభ్రాంతయై యేడ్చినది. జటాయు వా బాణపుదెబ్బలను లెక్కచేయక యుద్ధముచేయుచునే యుండెను. అట్లు జటాయు వారావణుని మణిమయమై బలిష్ఠమైన విల్లును ముక్కలుగాఁ జేసివైచెను. రావణుఁడంతట మఱియొక విల్లునుధరించి, యొడలుతెలియని కోపముతో, వందలును వేలును బాణములను, వర్షముగాఁ గురిపించెను. ఆబాణములన్నియును జటాయువునకుఁ జుట్టును జేరి గ్రుచ్చికొనఁగాఁ దాను దనగూటిలోఁ జేరియున్నట్లు దోచెను. అంత నాతఁ డా బాణములనన్నిఁటిని దనఱెక్కలతో జళిపించి, విదల్చికొనివచ్చి, రావణుని ధనస్సునుమఱల ముక్కలుగాఁజేసెను. అగ్నిహోత్రమువలెఁ బ్రకాశించుచున్న యాజటాయువు, రావణుని కవచమునుగూడ ముక్కలుముక్కలుగాఁ జేసెను. వెండియు రథసారథిని దన తుండముతోఁగొట్టి చంపివైచెను అంతటోక యారథమును గూడ నింతింతలుగా ముక్కలగునట్లుచేసెను. దానితో రావణుఁ డింకఁజేయునదిలేక, సీతాదేవింబట్టికొని నేలపైకి దిగి నిలచెను. ఆసమయమున సర్వభూతములును పక్షిరాజును

విసుతించినవి. అంతటితో బాగుగానలసియున్న జటాయువును జూచి, రావణుఁడు సీతనుబట్టికొని, యాకాశమార్గమున పోవుచుండెను. అట్టియారావణుని జూచి, జటాయువు పైకెగిరి, యిట్లనుచున్నాఁడు.

ఓరీ! రావణా! వజ్రాయుధములవంటి శ్రీరాముని బాణము లెప్పటికైన నిన్ను జంపకమానవు. ఈపని నీకొక్కడకేగాక నీవంశమునకును, నీరాక్షసజాతికిని నాశము గలిగించునుసుమా! దాహమును దీర్చికొనుటకై, విషమును ద్రాగినట్లుగా, సీతామహాసాధ్వి నపహరించుచున్నావు. నీవంటి మూర్ఖులు దుష్కర్మలయొక్క ఫలము నెఱుంగనివారై స్వల్పకాలములోనే సర్వనాశమును బొందుదురు. ఓరీ! రాక్షసాధమా! ఇప్పుడు యమపాశమును మెడకుఁ జుట్టికొంటివి. ఇంక నీవెటుపోయినను దప్పించికొనఁజాలవు. వేటగాఁడు గాలముల్లున కెఱను గ్రుచ్చి, నీటిలో వేయఁగా, నాయెఱతోఁబాటు గాలపుముల్లునకుఁ దగుల్కొని, యాచేపవిడిపించికొనలేక నశించునట్లు, నీవును, నశించఁచలవు. ఓరీ! నీచాతినీచుఁడా! శ్రీరామలక్ష్మణు లెంతటి వారికైన నెదిరింపరాని, యసాధ్య పరాక్రమవంతులు. అట్టి వారు లేనిసమయమున వారియాశ్రమమును జేరి, నీవుచేసిన నీచకార్యమును వారుక్షమించరుసుమా! నేనును మహావీరుఁ డనే, యందువేమో? నీవీరత్వ మేపాటిదో, నీవిప్పుడొనర్చిన దొంగచాటు నీచపుఁబనిచేఁ దెలిపోయి, భీరుత్వముగాఁ

బరిణమించినది. ఇప్పటికైన క్షణకాలమునిలిచి, నాతో యుద్ధముచేయుము. నీవాఁడగు ఖరునకుఁ బట్టినగతియే నీకును బట్టఁగలదు. వినాశకాలము సమీపించినవాఁడు, దానికను కూలమైన, దుష్కార్యమునే చేయును. పాపానుబంధమైన ధర్మవిరుద్ధకార్యమును బుద్ధిమంతుఁ డెవఁడు నాచరింపఁడు. సాక్షాద్భగవంతుఁడైన బ్రహ్మదేవుఁడుగూడ నిట్టియకృత్యమును జేసి జీవింపలేఁడు. అని యీవిధముగాఁ బలుకుచు, రావణుని వెంటఁబడినను, వాఁడాగక, ముందునకుఁ బోవుచుండెను.

అంత నాజటాయువు నారావణుని వీపును గట్టిగాఁ జరచెను. మఱియు, మావటివాఁ డేనుఁగుపైనెక్కి దానికుంభస్థలమును శూలముతో గట్టిగాఁబొడిచినట్లు జటాయువు తన గోళ్ళతో వాని వీపును జీల్చుచు, ముక్కుతో నెత్తిపైబొడువ నారంభించెను. అట్లువానిగుండెలను జీల్చుచు, జుట్టును బీకివైచుచు, బాధించెను. ఆబాధలకోర్వలేని రావణుఁడు పండ్లు పటపటఁగొరుకుచుఁ దీవ్రమైన కోపముతో నొక్కమారు గిఱ్ఱున వెనుకకుం దిరిగెను. వాఁడా సీత నెడమచేతితోఁ గట్టిగాఁబట్టికొనియే, కుడిచేతులతో నాజటాయువును జరచుచుండెను. బలశాలియైనయాజటాయువువానిచుట్టునుఎగురుచుఁ దిరిగితిరిగి తనవాడియైన తుండముతో రావణుని యెడమ ప్రక్కనున్న పదిచేతులను ద్రుంచివైచి, నేలంబడఁజేసెను.

విరిగిపోయిన యాచేతులస్థానమున వర్షధారలకుఁ బుట్టనుండి పైకివచ్చు సర్పములవలె మఱలఁ గ్రొత్తచేతులు మొలచినవి. రావణుఁడు కోపముతో సీతాదేవి నొకచోటదింపి, పిడికిలి పోట్లతోడను, గాలితాపులతోడను నాజటాయువును బీడింపఁ జొచ్చెను. ఇట్లు ముహూర్తకాల మాయుభయులకును ఘోరయుద్ధము జరిగినది. జటాయువు శ్రీరామార్థమై, ప్రాణములకుఁ దెగించి, యుద్ధము చేయుచుండెను. ఆసమయమున, రావణుఁ డొరనుండి ఖడ్గమునుదీసి, జళిపించుచు, జటాయువుయొక్క ఱెక్కలను, గాళ్ళను, నరికివైచెను. అప్పుడాజటాయువు గుడుగుడుప్రాణములతోఁ జావకుండగా, నేలపైఁ బడిపోయినది. అట్టి జటాయువునుజూచి, సీతాదేవి తొందరగావెళ్ళి, యాత్మబంధువు నందువలె గాఢముగా విలపించినది, నల్లని పెద్దమేఘమువలె నున్నవాఁడును, తెల్లని వక్షస్థలముగలవాఁడునై, పడియున్న జటాయువు నారావణుఁడు, శాంతించిన దావాగ్నినివలెఁ జూచెను. సీతాదేవి యాజటాయువును గౌఁగిలించికొని, గట్టిగా నేడ్చినది.

## సీత దుఃఖించుచుండఁగా - రావణుఁడు బలాత్కారముగాఁ గొనిపోవుట

మహాక్రూరుఁడైన రావణునిచే నరుకఁబడి నేలంబడియున్న జటాయువుయొక్క దురవస్థంజూచి సీతాదేవి పరిపరి విధముల విచారించినది, అయ్యో ! ఈ నాయొక్క దురవస్థ

శ్రీరామునకుం దెలియదుగదా ! అయినను నీ ఱెక్కలను, బఖలును బరువెత్తికొనిపోయి శ్రీరామునకుం జెప్పవచ్చును. ఈ మహాబలశాలి పక్షిరాజు నిస్సహాయుఁడై పడియున్నాఁడు. ఓ రామా ! లక్ష్మణా ! నన్ను గాపాడ వేగముగా రండు అని యాసాధ్వీమణి సీత దగ్గరలో నున్న వారిని బిలిచినట్లుగాఁ దన రక్షణను గోరి యేడ్చినది. ఆ విధముగాఁ బెదిరిపోయిన యాభరణములను బూలమాలలునుగల సీత నటనుండి బలాత్కారముగా రావణుఁడు బట్టికొని యాకాశమార్గమునం బోయెను. యమునివంటి సిద్ధయుఁడగు నారావణుఁడు లత వలెఁ జుట్టుకొనిపోవుచు రామా ! రామా ! లక్ష్మణా ! యని యేడ్చుచున్న సీతను దన నాశనమును దానే కోరుచున్న వాడై తీసికొనిపోవుచుండెను. ఆమె "విడువుము! విడువుము" అని పలుసార్లు వేడుకొనుచున్నను వినిపించుకొనక జుట్టుపట్టి కొని తీసికొనిపోవుచుండెను.

ప్రకృతి యంతయును జీకట్లు గ్రమ్మియుండెను. వాయువు గట్టిగా వీచుటకు భయపడెను. సూర్యుఁడును దన కాంతిని దిగమింగికొనెను. శ్రీమంతుఁడైన బ్రహ్మదేవుఁడు దివ్యదృష్టితో నంతయును జూచి జరుగవలసిన కార్యమారంభ మైనదని (రావణ సంహారమునకు మూలమైన, సీతాపహరణ కార్యము జరుగుచున్నదని) దెలిసికొనెను. దండకారణ్య వాసులైన మహర్షు లందఱును సీతాదేవి బాధను జూడలేక విచారించిరి. వేఱొక విధముగా నీ రావణ సంహారమున కిది

నాంది యగునుగదా! యని సంతోషించిరి. నీలమేఘము వంటి రావణుఁడు పట్టిన సీతాదేవి రత్నాభరణాదులతో మెరపుఁదీగవలెఁ బ్రకాశించినది. పచ్చని పట్టువస్త్రపుఁబైట కొంగు గాలికిపైకెగురుచుండఁగా, మండుచున్న యగ్నిజ్వాల వలెఁ గనుపడినది, మఱియు నామె నలిగిపోయిన పద్మమువలె గోచరించినది. చంద్రవంకవంటి నుదురును, దుమ్మెదఱెక్కలం బోలి నల్లనైన జుట్టును, మల్లెమొగ్గలవలెఁ దెల్లనై నిగనిగ లాడు దంతకాంతులుగల సీతాదేవియొక్క ముఖము, నల్లని మేఘములను జీల్చికొని యుదయించు, చంద్రబింబమువలెఁ బ్రకాశించినది. రాముని ప్రక్కనుండఁగాఁ గళకళలాడు సీతాదేవి ముఖమిప్పుడు పగటివేళనుండు చంద్రబింబమువలె వెలవెలఁబోవుచున్నది. సీతయొక్క బంగారువర్ణమునందు రావణుని నల్లనివర్ణము కాంతిహీనమైనది. (ఇంద్రనీలమణి బంగారముతోఁ బ్రకాశించదు. వెండితోఁ బొదిగిననే ప్రకాశించును.) రావణుని యావేగమునకు, సీతాదేవి ధరించిన పుష్పములు త్రోవపొడుగునను రాలిపోవుచున్నవి. నిర్మల నక్షత్రపంక్తి మేరువుపర్వతమును జుట్టువచ్చినట్లుగా వేగముతోఁ బోవుచున్న రావణుని జుట్టువారుకొని, సీతతలలోని తెల్లనిపువ్వులు తిరిగి నేలపైఁ బడిపోవుచున్నవి. ఆసమయమున సీతాదేవియొక్క యెడమపాదమునందలి యందె రత్న కాంతులతో ధగధగమెఱయుచు, నేలపైఁబడెను. మఱియు నామె యాకాశమున మహోల్కా సన్నిభమై ప్రకాశించి

నది. ఆమెధరించిన యాభరణములు, పుణ్యములు క్షీణించి పోఁగా, నాకాశమునుండి రాలిపడుచున్న నక్షత్రములవలె నేలఁబడుచున్నవి. మఱియు ముత్యాలహారము తెగిపోయి, నేలఁబడుచు, నాకాశమునుండి దిగివచ్చుచున్న గంగానదీ ప్రవాహమువలె గోచరించినది. ఆరాక్షస వేగమునఁబుట్టిన గాలిచే నేలనున్న వృక్షములు చలించిపోఁగా, వానికొమ్మలు గదిలి యల్లాడుచు, "ఓసీతా! భయపడకు" మని సంజ్ఞలు చేసినట్లయ్యెను. తామర చెఱువులన్నియును, బద్మముల యొక్క కాంతిని బోగొట్టికొని, చలించుచున్న జలచరములు గలవై, తమస్నేహితురాలి దుఃఖమును సహించలేక బాధ పడుచున్నట్లుగాఁ గనుపించినవి. వనమునందలి సింహాది మృగములన్నియును, బక్షులును రావణునిపైఁ గోపించి, యాతఁడు పోవుచున్న మార్గమున నాతని నీడనుబట్టి పరుగు లిడినవి. పర్వతములు తమపైనుండి పడుచున్న జలపాతముల ధ్వనులరూపమున, రావణుని దిట్టుచున్నవా? యన్నట్లు విని పించినవి. ఆసమయమున సర్వభూతములు, నింక లోకమున ధర్మమెక్కడున్నది? సత్యమేమయినది? దయాదాక్షిణ్యము లసలే నశించినవి." యని వాపోయినవి. లేడిపిల్లలుగూడ, సీతాదేవినే చూచుచుఁ గంటనీరువెట్టికొని, యాక్రోశించి నవి. జుట్టుముడి విడిపోఁగా, ముంగురులు చెదరిపోవుచుండఁగా, నుదుటనున్న తిలకము దుడిచికొనిపోఁగా, దుఃఖించుచున్న సీతనుబట్టి తనవినాశమును దానే కోరుచున్నవాఁడై, రావ

ణుఁడు తొందరఁగాఁ బోవుచుండెను. ఎప్పుడును నందమైన పలువరుసతోఁ జిఱునవ్వులు నవ్వెడు సీతాదేవి, రావణునిచే నపహరించఁబడి వెలవెలఁబోవుచున్న ముఖముగలదై యేడ్చుచుండెను.

## సీత - రావణునకుఁ - జెప్పిన హితవు

అట్లు రావణుఁడు తొందరగా సీతను గొనిపోవుచుండెను. సీతాదేవి భయకంపితయై దుఃఖించుచుండెను. రాముఁడు దగ్గరగానున్నట్లే భావించుచున్న యామె, "రామా! నాకుఁ గలిగిన యాపదను జూడుము. ఇదిగో! ఈ లేళ్ళును బక్షులును, నాదుఃఖవార్తను నీకుఁజెప్పుటకే, పరుగెత్తుచున్నవి. నన్నురక్షించుటకై, యద్ధుపడిన జటాయువును నీదుర్మార్గుఁడు నేలంబడఁగొట్టినాఁడు. ఓరామా! లక్ష్మణా! నన్ను వేగముగావచ్చి, రక్షించుఁడు!" అనిగట్టిగానరచుచుండెను. త్రోవలోఁ జేతికందిన చెట్లకొమ్మలను, లతలను, బట్టికొని, రక్షించండి! రక్షించండి!" యని యేడ్చుచున్న సీతను బలాత్కారముగా రావణుఁడు గొనిపోవుచుండెను. చావుసమీపించిన రావణుఁ డట్లుపోవుచుండఁగా జగత్తంతయు నంధకారబంధురమైనట్లున్నది. అప్పుడు సీత రావణునిచే నపహరించఁబడుచు, నేడ్చుచు నిట్లనుచున్నది.

రామలక్ష్మణులింటలేని సమయమునుజూచి, దొంగచాటునవచ్చి, నన్నపహరించుచున్నావు. ఈపాడుబుద్ధికి,

నీకుసిగ్గులేదా ? నా ర్తయైన శ్రీరామునకు భయపడి, లేడి రూప రాక్షసుని బంపి రామలక్ష్మణులను దూరముగాఁ గొని పోయి, నన్నపహరించుచున్నావు. జటాయువును ముసలివానిని బడఁగొట్టితివి. ఆహా ! నీపరాక్రమ మెంతదొడ్డది? నీపేరును గొప్పగాఁజెప్పికొని, యాడుదాని నపహరించిన నీకుసిగ్గులేదా? నేనేపరాక్రమశాలినని లోకమునందు నీవెట్లుచెప్పినకొనఁ గలవు? ఈనీచపుఁబనికి, లోకులెంతగా నసహ్యించుకొందురో యూహించితివా? ఛీ ! ఛీ ! నీవుచెప్పిన ప్రగల్భములన్నియు గర్వపోతుమాటలేనా? నీవీపనిచేయుటచే, నీమాటలన్నియు నసత్యములని తేలిపోయినది. నీమాటలే నిజమైనచో, నీవంటి వానికిది యెంతటి యధర్మమో? యెంతటిక్రూరమైనదో ? గ్రహించితివా? నీవంశమునకును మాయనిమచ్చగా నీపనిని జేయుచున్నావు. శ్రీరాముని గంటఁబడి, యుద్ధము చేయ లేక చేతఁగానివాఁడవై, దొంగతనముగా, నన్ను గొనిపోవు చుంటివి. పౌరుషమున్నచోఁ గొంతసేపు, శ్రీరాముఁడు వచ్చువరకు నాగుము. నీబీరము బయటఁబడును. రామలక్ష్మణుల కంటఁబడితివా, నీసర్వసైన్యములతోడను గొన్నిక్షణములలోనే నశించఁగలవు. ఇంతవరకు నెన్నఁడును వారి యొక్క బాణములవాడిని, నీవుచవిచూడలేదు. అడవిలోఁ బుట్టిన దావానలమున మిడుతవడినట్లు గాఁగలవు. కావున నోరావణా ! నన్నువిడిచి, నీప్రాణములను గాపాడుకొని, మంచితనమును నిలుపుకొనుము. రాముని శరణువేడుము.

ఓరీ! అధమాధమా! ఏకోరికతో నన్నింత తొందరఁగాఁ గొనిపోవుచున్నావో, నీకాకోరిక యెంతమాత్రమును సిద్ధించదు. భగవత్స్వరూపుఁడైన నాభర్త శ్రీరామునివిడిచి యీ ప్రాణములతో జీవించి యుండఁజాలనని గ్రహించుము. మృత్యువు సమీపించినవాఁ డన్నియును వ్యతిరేకములనే చేయుచుండును. కావున నీవిప్పుడు నీకుసర్వశ్రేయస్సులను గలిగించు నుపాయమును, దెలిసికొనలేకున్నావు. లోకములోఁ జావుసమీపించినవాఁడు హితవాక్యమును బాటించఁడు. నీకంఠమునఁ గాలపాశము చుట్టుకొన్నట్లుగా నాకుఁ గనుపించుచున్నది. నిజముగా నీవు భయపడవలసిన సమయమిది. నను మొండిగా నీపనిని చేసితివి. మేలిమిబంగారు పుష్పములతో నొప్పు బంగారు వృక్షములను స్వప్నములో చూడగలవు. (బంగారుచెట్లు స్వప్నములోఁ గనుపించినచో నట్టివానికి చావుదప్పదని శాస్త్రము.) రావణా! నీవు మరణించి, వైతరణీనదిని, నసిపత్రవనమును బ్రవేశించఁగలవు. బంగారు పూలుగలిగి వైడూర్యములే యాకులుగాగలిగి, యినుపముండ్లు దట్టముగా, గలిగిన, యమలోకమండలి శాల్మలీవృక్షమును గట్టిగాఁ గాఁగిలించికొనఁగలవు. ఇఁక నైన నామాటవినుము! లెమ్ము! పరాక్రమశాలియై, ధార్మికుఁడైన శ్రీరాముని గష్టపెట్టి యెంతోకాలము జీవించలేవు. విడదీయరాని కాలపాశముచేఁ గట్టుపడితివి. ఇంక నీవెక్కడికిఁ బోయిన నెవని శరణువేడిననుఁ జావుతప్పదు. దండకారణ్యమున

రాముఁడొంటరిగా నిముసంబులలోఁ బదునాలుగువేలమంది గల రాక్షస సైన్యముతో ఖరాదులను సంహరించెనుసుమా! అట్టిరాముఁడు, తనభార్యనే యపహరించిన నిన్ను విడుచునా? అని యీవిధముగా, రావణునితో నయమును భయమును గలుగునట్లు జెప్పి, రామలక్ష్మణులను దలఁచికొనుచు విలపించినది. ఆమె భయకోపములతోఁ గంపించిపోవుచున్నది. అయినను పాపాత్ముఁడైన రావణుఁ డామెమాటలను లక్ష్యముచేయక; తొందరగా నామెను గొనిపోవుచుండెను.

## సీత - ఋశ్యమూక పర్వతముపై - నగల మూటను బడవైచుట

ఈవిధముగా నపహరించికొని పోవుచున్న సీత తనకే వంకను, రక్షణలేసిదై, యొకానొక పర్వతమున గుమిగూడి యున్న, యైదుగురు వానరులంజూచెను. అంతనామె బంగారుటంచులతో మెరయుచున్న తనపైటకొంగునఁ గొంత ముక్క నుజింపి, తనయాభరణముల నన్నిఁటిని, దీసిముడివైచి, యద్దాని నావానరుల సన్నిధింబడునట్లుగాఁ బడవైచెను. ఆమెయు, నాభరణముల నావానరులు శ్రీరామునకుఁ జూపఁ గలరని యాశించినది. రావణుఁడు మాత్ర మెంత వేగముగాఁ బోయిన నంతమేలని తొఁదరఁగాఁబోవుచు, సీతాదేవి చేసిన

పనిని జూడనేలేదు. ఆవానరులుమాత్రము అప్పవాల్చక, గట్టిగానేడ్చుచు రామలక్ష్మణులం బిలుచుచున్న యాసీతా దేవి నట్లేచూచుచుండఁగా, రావణుఁడు చాలదూరము పోయినాఁడు. అట్లువాఁడు సీతాదేవింబట్టికొని పంపానదిని, సముద్రమును, దాటి, లంకలోఁ బ్రవేశించెను. తీవ్రమైన కోఱలుగలిగి మహావిషమును గ్రక్కుచున్న నాగుపాము నోటిలోఁ బెట్టికొన్నట్లుగా సీతనుబట్టికొని, లంకలోఁబ్రవే శించెను.

సీతను బట్టికొనిపోయి, తనమృత్యువును దానే కోరి కొన్న విధముగా, వర్తించెను. రావణుఁ డావిధముగా నడవు లను గొండలను, నదులను, సముద్రమును, నతివేగముగా దాటుచున్నప్పు డాకాశమునుండి, సిద్ధిచారణాది దేవతా గణములుచూచి "రావణునకు వినాశకాల మారంభమైన" దని సంతోషించిరి. ఆలంకలో ననేకప్రాకారములతోనున్న తనకోటలో రావణుఁడు ప్రవేశించెను. అచ్చట స్వయంప్రభ వలెనున్న సీతను మాయామయమైన మయుని భవనమునఁ బ్రవేశపెట్టెను. అప్పుడు పిశాచాకారులై, భయంకరులైన, రాక్షసస్త్రీలను బిలిచి, యీసీతను బురుషులుగాని, స్త్రీలు గాని, చూడకుండఁ గావలియుండుఁడు! అని యాజ్ఞాపించెను. ఈమె ముత్యములు మొదలైన మణులతో నిండిన యాభరణ ములనుగాని, బంగారు జరీబట్టలనుగాని, యింక నేమేమి కోరునో. వానినన్నిఁటిని నాయాజ్ఞానుసారముగా, సమర్పిం

చుఁడు! ఈమె తెలిసిగాని, తెలియకగాని, యప్రియ వాక్యము లేమనిపలికినను, నీమెజీవితాశను విడిచినట్లే యని గ్రహించి వర్తించుఁడు." అనిరావణుఁ డాజ్ఞాపించి, యటనుండి వచ్చి, తనయెనమండుగురు మంత్రులను బిలిచి, సీతను లోఁబరుచుకొను నుపాయమును గూర్చి, రహస్యముగా నాలోచించెను. రావణుఁడు, తనకుఁగల వరప్రభావముల చేతను, బలపరాక్రమముల చేతను, గర్వించినవాఁడై, తనను దానే పొగడికొనుచు నిట్లనుచున్నాఁడు. ఓయీ! మీరు సమస్తాయుధములను, ధరించి, జనస్థానమున ఖరుఁడు నివసించు, ప్రదేశమునకుఁబొండు! ఆనిర్జన ప్రదేశమున నిర్భయులై సంచరించుఁడు. అదిఖరదూషణాది సమస్తరాక్షసులను శ్రీరాముఁడు సంహరించినస్థలము. ఆకారణముగా నాతనితో నాకుబద్ధవైర మేర్పడినది. ఆతనిని యుద్ధమునందె ట్లైనను, సంహరించవలెను. అంతవరకును, నాకునిద్రాహారము లందుఁ బ్రీతియుండదు. అతనిని సంహరించి, పేదవానికిఁ బెన్నిధిలభించినంతఁగా, నానందించుదును. కావున నేను జెప్పినట్లు గూఢచారులై, శ్రీరాముఁడేయే వేళలలో నేయే విధముగాఁ బ్రవర్తించుచున్నాఁడో, యావార్తలను నాకెప్పటికప్పుడు, చెప్పుచుండవలెను. మీరప్రమత్తులై, రాముని సంహరించుటకుఁ దగినవిషయములను సేకరించి, నాకుఁజెప్పుచుండవలెను ఈవిషయములో మీశక్తిసామర్థ్యముల బాగుగాఁ దెలిసినవాఁడ నగుటచే, మిమ్ముల నీఘన

కార్యమునకుఁ బంపుచున్నాను. అనఁగావిని, యా యెన మంమగురు రాక్షసమంత్రులును, రావణునకు జయమువలికి, నమస్కరించి, యెవరికిని గానరాకుండ, గూఢచారులై, జన స్థానమును బ్రవేశించిరి. అంత నారావణుఁడు సీతాసన్నిధికేగి యజ్ఞానవశంబునఁ దనమృత్యువును తానెఱుంగక, యేదియో ఘనకార్యమును జేసినట్లు సంతోషించుచు నామెను బ్రలోభ పెట్టి దనవశము గావించికొనుటకుఁ బ్రయత్నించుచుండెను.

## రావణుఁ డనేకవిధములుగా - సీతను బ్రలోభపెట్టుట

దండకారణ్యములకుఁ దనగూఢచారులను బంపించిన రావణుఁడు తాను జేయవలసినపని, పూర్తియైనట్లు సంతోషించెను. తరువాతఁ గామపరవశుఁడై, సీతాదేవిని స్మరించుచు నామెసన్నిధి కతివేగముగా వెళ్ళెను. ఆయంతః పురమున రాక్షసస్త్రీలమధ్య దుఃఖించుచున్న సీతాదేవిని జూచెను. ఆమె లేళ్ళగుంపునుండి విడివడి యొంటరిగాఁ గుక్కలచే భయపెట్టఁబడుచున్న లేడివలె ముఖము దించు కొని దుఃఖించుచుండెను. దేవేంద్రుని యంతఃపురమువంటి వైభవముగల తన యంతఃపురమును జూచి సీత దుఃఖమును విడిచియుండునని భావించెనేగాని, యామెమాత్ర మద్దానిని గన్నెత్తిచూచుటకైన నిష్టపడక విచారించుచునే యుండెను. అచ్చటఁ బొట్టివియు బొడవైనవియు నగు మేడలు, నా మేడల

యందు వివిధరకముల పెంపుడు పక్షులును గలిగి రాక్షస సేవకా స్త్రీలతోఁ గ్రిక్కిరిసియుండి, దంతము బంగారము, వెండి యనువానిపైఁ బొదఁగఁబడిన వజ్ర వైడూర్యాదుల తోడను నిర్మించఁబడి చూడముచ్చటగానున్న స్తంభములు గలిగి దుందుభులు మొదలగు వాయిద్యములచే మ్రోగు చదియగు మేడ పైభాగమునకు రావణుఁడు సీతందోడ్కొని పోయెను. అక్కడ సీతాదేవికిఁ దనభవనకాంతి వైభవము నంతయు యొక్కటియును విడువక చూపించెను. మఱియుఁ దన యంతఃపుర సౌధము నానుకొని రతనాల మెట్లు గల దిగుడుబావులును గొలకులను వానియందలి పద్మముల ననేక పుష్పఫల వృక్షజాతులునుగల యుద్యానవనమును జూపించెను. మహాదుఃఖముతో నున్న యా సీతాదేవికి నంతను జూపుచు నిట్లనియెను.

ఓ సీతా! నాయొక్క భోగభాగ్యములతో నలరారు నంతఃపుర వైభవమును జూచితివిగదా ? ఇఁక నా బలమును గూర్చి చెప్పెదను వినుము. పదికోట్లమంది రాక్షస వీరులును, నిరువది కోట్లమంది సామాన్య పదాదిదళమును నా యధీనమునఁ గలరు. నాయొక్కని రక్షణార్థమై వేయిమంది యువకులైన రాక్షసవీరులు నిత్యమును సర్వసన్నద్ధులై యుందురు. ఓ విశాలాక్షీ ! నాకుఁగల యీ రాజ్యాధికార మంతయును నీ యధీనము గావించుచున్నాను. అంతయేల ? ఈ నా ప్రాణములే నీ యధీనములై యున్నవి. నీవు నా ప్రాణాధిక

ప్రియురాలవు. వేలకొలఁదిగానున్న నా భార్యలఁదఱిలో నీకే సర్వాధికారముల నొసంగుచున్నాను. నీవే నాకుఁ బట్టపురాణి వగుము. ఇంతగా నీ కొఱకు నా సర్వస్వమును ద్యాగముసేయుచుఁ దపించిపోవుచున్న నన్ననుగ్రహించి నాకు భార్యవై యుండుము. ఈ లంక యంతయును నూరు యోజనముల వైశాల్యము గలది. దీనిని రాత్రింబగళ్ళు నేమఱపాటులేక లక్షలకొలఁదిగా రాక్షసవీరులు రక్షించు చున్నారు. దీనిని దేవేంద్రాది దేవతలుగాని, రాక్షసులుగాని స్వాధీనము గావించుకొనలేరు. నాతో సరియైన పరా క్రమముగలవాఁడు, దేవ గంధర్వ యక్ష పక్షి నాగాదులలో నేనొక్కఁడును లేఁడుసుమా! శ్రీరాముఁడు రాజ్య భ్రష్టుఁడు. అల్పాయుష్కుఁడైన మానవుఁడు. వాని బల పరాక్రమములు నంతమాత్రములే. అట్టివానితో నీవేమి సౌఖ్య మనుభవించఁగలవు? ఓసి! పిరికిదానా! నన్నాశ్ర యించుము. ఈవిధముగా క్షణక్షణమును గాలముగడచిన కొలఁదియును, యౌవనము క్షీణించుచునే యుండును. ఉన్న యౌవనము వ్యర్థమైపోయినచో, నాపయి నెన్నిభోగము లున్నను, లేశమాత్రమైన ననుభవించలేవుసుమా! బాగుగా నాలోచించికొని, నన్నంగీకరించి, సుఖించుము. ఇంతవరకును నీవనుభవించిన వనవాసక్లేశముచేఁ బూర్వజన్మలలోఁ జేసి కొన్న దుష్కర్మము నశించినది. ఇంక మిగిలిన సుకృతమును, నన్ను జేరి హాయిగా ననుభవించుము. నాతోఁగూడి యిచ్చట

నున్న సమస్తభోగ భాగ్యములను స్వేచ్ఛగా ననుభవించుము. నేను గుబేరుని జయించి, తెచ్చిన, పుష్పకవిమానముగలదు. దానియందు సమస్తలోకములందునుగల శ్రేష్ఠములైన వస్తువులన్నియునుగలవు. అందు లేని భోగ్యవస్తు వెందును లేదు. అట్టి పుష్పకవిమానమును నాతోఁగూడి స్వేచ్ఛగా ననుభవించుము. పద్మమువలెఁ బ్రకాశించు నీముఖమిప్పుడు శోకముచేఁ గాంతిహీనమై యున్నది. ఇట్లు కాలమును వ్యర్థము చేయకుము. అనిరావణుఁడు సీతాదేవిని బ్రలోభపెట్టుచుఁ దన బలపరాక్రములఁ జెప్పి, సీతకు రామునియందు వైముఖ్యమును గలుగఁజేయ యత్నించుచుండెను. అన్నియును విన్న సీతాదేవి, రావణుని గన్నెత్తిచూచుటకైన నిష్టపడక, తన పైటకొంగుతో ముఖమును గప్పికొని యేడువనారంభించెను. ఏదిక్కును లేనిదై, శ్రీరామునే ధ్యానించుచున్న సీతాదేవితో, మఱల రావణుఁ డిట్లనుచున్నాఁడు. ఓసీతా! నామాటవినుము! మొదటి భర్తనువిడిచి, భోగలాలసత్వముచే, మఱియొక భర్తను గైకొనుట ధర్మవిరుద్ధమని, సిగ్గును భయమును విడువుము. దైవవశాత్తుగాఁ గలిగిన, మనయిాకలయికయార్ష సమ్మతమే యగును, అధర్మము గాదుసుమా! ఓవైదేహీ! నిగనిగలాడుచుఁ గాంతివంతములైన, నీపాదములపై, నాశిరస్సునుమోపి, నమస్కరించుచున్నాను. సర్వాత్మనా, నీకు వశపడిపోయితిని. నీకు దాసుఁడను. నన్ను గ్రహించి, స్వీకరించుము. నేను నాబల పౌరుషాదుల నన్నిఁ

టినివిడిచి, కామముచేఁ దపించి, కృశించి, నీపాదములపైఁ బడుచున్నాను, ఇంతవరకు నీరావణుఁ డేస్త్రీకిని, దలవంచి, పాదాభివందనము చేయలేదుసుమా! అని యారావణుఁడు సీతాదేవిని బ్రార్థించుచు, నీమెతప్పక నాప్రార్థన నంగీకరించి, నాకుభార్య కాఁగలదని యాశించెను.

## సీత - రామ పరాక్రమముంజెప్పి - రావణుని దెగడుట

సీతాదేవిని, రావణుఁడు తనసర్వస్వము నర్పించుదునని ప్రార్థించి, తనను భర్తఁగా వరించుమనికోరెను. ఆమాటలను విని, సీతవిపరీతమైన కోపము, నొకవంక భయమును గలదగుచు, నొకగడ్డిపోచనుదీసి, మధ్యఁబడవైచి, యిట్లనుచున్నది. ఓయీ! ధర్మమునకు సేతువువలె, దశరథమహారాజు మర్యాదను స్థాపించినవాఁడు. అతఁడు సుస్థిరమైన బుద్ధితో, సత్యవ్రతము నవలంబించినవాఁడు. అట్టిసుప్రసిద్ధుని కుమారుఁడే శ్రీరాముఁడు. అతఁడు విశాలాక్షుఁడు. ధర్మాత్ముఁడని ముల్లోకములందు బేరుపొందినవాఁడు. ఆజానుబాహుఁడు. అతఁడేనాకుభర్తయై యున్నాఁడు. లక్ష్మణ సహితుఁడై నీప్రాణములను హరించఁగలఁడు. గొప్పబలము గలవాఁడును, మహాతేజశ్శాలియు నైన యారాముఁడు తమ్ముఁడైన లక్ష్మణునితోఁగూడి, నీప్రాణములను, హరించఁగలఁడు ఆశ్రీరాముఁడు చూచుచుండఁగనే, నీవు నన్నపహరింప

యత్నించినచో, నప్పుడే, ఖరునివలె నీవును జనిపోయెడి వాఁడవే. ఇంతవరకును నీకున్న కోట్లకొలఁది రాక్షససైన్యమునుగూర్చి పొగడికొంటివి. వారందఱును శ్రీరాముని ముందు గడ్డిపరకలవలె నశించవలసినవారే. ఆతఁడు విల్లు నెక్కుపెట్టి, బంగారుకొనలుగల బాణములను విడిచినచో, నీశరీరమంతయును నింతింతలు ముక్కలై, నేలంబడిపోవును. రావణా ! నీవు సురాసురులకు నవధ్యుఁడవు గావచ్చును. రామ బాణములను మాత్రము దప్పించికొని బ్రదుకలేవు. పశువు యూపస్తంభమునకుఁ గట్టఁబడి ప్రాణములతో బయటకు రాఁగలదా ? మహాపరాక్రమశాలియైన శ్రీరాముఁడు తన బాణములతోఁ జంద్రునైనఁ బడఁగొట్టఁగలఁడు. తనచూపుల తోడనే సముద్రమునైన నింకింపఁజేయఁగలఁడు. ఏమైనను ఈసీత నిచ్చట విడిచిపెట్టఁడు. నీవుచేసిన దొంగపనికి ఫలముగా, నీయైశ్వర్యమును నీబలమును, నీయింద్రియపటుత్వమును, తుదకు నీప్రాణములను నశింపఁజేయుటయేగాక, యీలంకాపట్టణమంతయును వైధవ్యము నొందఁజేయును సుమా ! ఏమాత్రమును సమ్మతించని నన్ను, బలాత్కారముగాఁ గొనివచ్చిన, పాపమువలన నీవు సుఖింపఁజాలవు. నాభర్త దైవబల సంపన్నుఁడు. మహాతేజోవంతుఁడు. కావుననే క్రూరరాక్షసులతో నిండిన దండకారణ్యమును బ్రవేశింపఁగలిగినాఁడు. అట్టివాఁడు యుద్ధమున నీపై బాణవర్ష

మును, గురిపించుచుండఁగా, నీబలమును, నీగర్వమును, నీ వీరత్వమును, నీమిడిసిపాటుతనమును, బూర్తిగా, నశించిపోఁ గలవు. కాలము సమీపించఁగాఁ జచ్చుటకు సిద్ధమైన, నీబోటివారిట్టి దుష్కార్యము నాచరించుదురు. పవిత్రమైన యజ్ఞశాలంగల వేదికయందలి, బ్రాహ్మణ మంత్రపూతమైన, యాగ హావిర్భాండమును, జండాలుఁడు తాఁకలేఁడు. అట్లే ధర్మనిష్ఠుఁడైన శ్రీరాముని ధర్మపత్నినై పతివ్రతనైన నన్ను, పాపరాక్షసుఁడవైన నీవుదాఁకుటకుఁ దగవు. పద్మవనముతో నిండిన మానససరస్సునందలి యాడుహంస గడ్డితో నిండి, బురదతోఁ గంపుకొట్టు నీటియందు విహరించునా ? కన్నెత్తి చూచుటకైన నిష్టపడదు. ఈనాశరీరము వశముదప్పి, మనస్సు లేనిదై యుండఁగా, బంధించినను దినివేసినను, దీనిరక్షణతోఁ గాని, జీవితముతోఁగాని, నాకుఁ బ్రమేయములేదు. కాని, యీసీత పాతివ్రత్యమును గోల్పోయినదన్న యపప్రథ యీభూమిపై నిలువదుసుమా ! అని యాసీతాదేవి క్రోధోద్రేకముతో, రావణునకు హితముచెప్పుట మూలముగా, నాతనిదెగనాడి యూరుకొనినది.

## రావణుఁడు - సీతను - భయపెట్టుట

రావణుఁడు సీతయొక్క కఠినాతికఠినమైన వాక్కులను విని దురహంకారముతో నిట్లనుచున్నాఁడు. ఓసీతా ! నామాటవినుము ! బాగుగా నాలోచించికొనుము. నన్ను

నీవశముచేసికొనుము ! కాదు, కూడదు అందువా నావంట వాళ్ళు నిన్ను ముక్కలుముక్కలుగాఁ దరిగి, నాకు నుదయము ననే ఫలహారముగాఁ జేసిపెట్టుదురు. ఒకసంవత్సరకాలము గడువునిచ్చుచున్నాను. అనిచెప్పి యచ్చట కాపలా గాయుచున్న రాక్షసస్త్రీలను బిలిచి యిట్లనియెను. "రక్తమాంసములే యాహారముగాఁగల యోరాక్షసస్త్రీలలారా ! మీమీ వికారచేష్టలచే నీమెయొక్క గర్వమునడఁచి, యీమె నాకు వశపడునట్లు చేయుఁడు." అని రావణుఁడు తొలఁగిపోగానే, యారాక్షసస్త్రీలందఱును సీతను జుట్టువారుకొని, కూర్చుండిరి. రావణుఁడును మఱలఁ దిరిగివచ్చి, నేల బీటలువారునట్లుగా, నడుగులువైచి, గద్దించుచు, వారలతోనిట్లనెను. ఈసీతను మీరుగొనిపోయి, యశోకవన మధ్యమున నుంచి, మీమీ శక్తికొలఁదియు, నచ్చఁజెప్పి, నాకు వశపడునట్లు చేయుఁడు. అడవియందలి యాడయేనుఁగునువలె, తర్జనభర్జనలతో, నయమును, భయమును గలిగించి, నాకు ననుకూలవతిగాఁ జేయుఁడు. ఈయశోకవన మెల్లఋతువులందును, సర్వపుష్ప ఫల భరితమై, సుందరమైన వస్తుసముదాయముతో నెంతటివారికైనను మనశ్శాంతిని గలిగించఁగలదు. అనఁగా విని, యా క్రూరరాక్షసస్త్రీలు సీత నశోకవనమునకుం దీసికొనిపోయిరి. అచ్చట సీతాదేవి పెద్దపులులమధ్య లేడిపిల్లవలె, భయపడుచునుండెను. మఱియు మహాదుఃఖభారముతో నామె యచ్చటఁ గట్టువడియుండెను. అచ్చట నట్టిదురవస్థలోఁ

గూడ శ్రీరామునే స్మరించుచు ధ్యానించుచు శారీరకముగా, త్రాళ్ళచేఁగట్టబడిన లేడివలె దుఃఖించినది. శ్రీరామ పరవశయై యున్నది.

## మారీచుని జంపి - వచ్చుచున్న శ్రీరాముఁడు లక్ష్మణుని గలయుట

లంకలో సీతాదేవి యావిధముగా బాధపడుచుండఁగా దండకారణ్యమున శ్రీరాముఁడు మారీచునిజంపి, వేగముగాఁ దన యాశ్రమమునకు మఱలివచ్చుచుండెను. అతఁడట్లు సీతాదేవిని జూచుకోరికతో వచ్చుచుండఁగా వెనుకనుండి యొక నక్క వికారముగా నఱచినది. దానియఱపుచే, సీతాదేవికేదో, యొక యాపదగలిగి, యుండుననని, విచారముతో మఱింత వేగముగా, వచ్చుచుండెను. ఏమైనను సీతాదేవి రాక్షసులచేఁ దినివేయబడకుండ బ్రతికియున్నఁ జాలునని భావించెను. మఱియు లక్ష్మణుఁడు మాయలేడియొక్క కేకవిని సీతనువిడిచి, వచ్చునేమో, యనియు ననుమానించెను. లేదా, సీతయే లక్ష్మణుని బలాత్కారముగా నావద్దకుఁ బంపియుండవచ్చు ననియుఁ దలఁపోసెను. సీత నొంటరిదానింజేసి యామె రాక్షసులకుఁ జిక్కునట్లుచేయుటకే, మారీచుఁడట్లు వికారముగా, నాకంఠస్వరము ననుకరించి, యఱచియుండుననియు, విచారించెను. శ్రీరాముఁ డిట్లు పరిపరివిధముల నశుభమును శంకించుచు, వేగముగా వచ్చుచుండెను.

లేళ్ళును బక్షులును శ్రీరామునకుఁ బ్రదక్షిణముగాఁ బరుగు లిడుచు, భయంకర ధ్వనులఁ గావించినవి. అట్లు దుశ్శకున ములఁ జూచుచు, రాముఁడు, శంకాకులిత మనస్సుతో వచ్చు చుండఁగా, లక్ష్మణస్వామి దీనముగా నెదురువచ్చుచుండెను. అప్పటికే దుఃఖితుఁడై వచ్చుచున్న శ్రీరాముని లక్ష్మణుఁడు దీఃవదనుఁడై యెదు రేగి కలిసికొనియెను. రాక్షస సంచార యోగ్యమైన యరణ్యమున సీత నొంటరిగా విడిచి వచ్చి నందులకు, శ్రీరాముఁడు లక్ష్మణునిపైఁ గోపించి, యిట్లను చున్నాఁడు. అయ్యో! లక్ష్మణా! ఎంతపని జేసితివి? ఆడు దాని నొంటరిగావిడిచి వచ్చితివే! మనమిప్పుడు వెళ్ళునప్పటి కామె క్షేమముగానుండఁగలదా? ఇప్పటి యీదుశ్శకున ములవలన, నామె యీపాటి కపహరించఁబడియుండును. లేదా, రాక్షసులచేఁ దినివేయఁబడియైన నుండవలయును. పురుషశ్రేష్ఠుఁడవైన యోతమ్ముఁడా! జానకి సురక్షితురాలై యుండునందువా? ఇప్పటి మృగపక్షిగణంబుల యొక్కయు, నక్కలయొక్కయు, నఱపులంబట్టి యేదోయశుభకార్యము జరిగినట్లు తోచుచున్నది. నామనస్సు కలతపడుచున్నది. నాయెడమ కన్నదరుచున్నది. ఆమాయలేడి రాక్షసుఁడు తనమాయచే నన్ను బ్రలోభపెట్టి, చాలదూరము దీసికొని పోగా, జివరకు దానిని సంహరించితిని. అదియును, రాక్షస రూపముతోఁ జనిపోవుచు, నావిధముగా నఱచినది. ఇప్పుడు నామనస్సు దీనత్వముతో, సంతోషమును గోల్పోయినది.

తమ్ముఁడా! ఈపాటికి సీత చనిపోయియుండును. లేదా యెవనిచేనైన, నపహరించఁబడి, యెక్కడికో ప్రయాణము చేయుచుండవలెను.

## లక్ష్మణుని సమాధానము - శ్రీరాముని విలాపము

లక్ష్మణా! నీముఖవర్చస్సునుబట్టి చూడగా, నీవుజానకిని విడచివచ్చుటకు నేదోయొక ప్రబలమైన కారణముండును. దానిని నాకుఁదెలియఁజేయుము. అని శ్రీరాముఁడడిగెను. మఱియుఁ దమ్ముఁడా! నన్ను విడువఁజాలక, కష్టభూయిష్టమైన యీయరణ్యములకు వచ్చిన సీత యిప్పుడెక్కడనున్నది? రాజ్యభ్రష్టుడనై, యడవులకుఁ బోవుచున్నను నన్నామె విడువలేదు. నాయనా! నాకామె బయటనుండు ప్రాణమై, దేవతాకన్య వంటి యాసీత, యిప్పుడేమైనదియోగదా! నేనాబంగారు వన్నెగల సీతనువీడి, క్షణమైన జీవించలేను. ఆమె లేకుండఁగా, మిగిలిన సంవత్సరము లీయడవిలో నెట్లుజీవించఁగలను? నేను జీవించనిచో, నాసత్యప్రతిజ్ఞను నెరవేర్చికొనుటయెట్లు! సీతకొఱకై, నేను మరణించినచోఁ గైకయొక్క కోరిక పూర్తిగా నెరవేరును. నేను మరణించఁగా, నాతల్లి కౌసల్య పుత్రుని, గోల్పోయి, రాజ్యములేక, కైకనుసేవించఁగలదా? (కౌసల్యయును మరణించునని భావము.) లక్ష్మణా! మన మాశ్రమమునకు

వెళ్ళునరికి, సీత సజీవముగాఁ గనిపించినచో సంతోషమే. లేనిచో, నాజీవితమునే విడుచుదును. తమ్ముఁడా! నీ వాద మరపుగా నున్నప్పుడు, రాక్షసు లామెను జంపి తినివేసిరా! లేక జీవించియుండఁగనే నీవిట్లువచ్చితివా? ఆమె లేతవయసు గల సుకుమారి దుఃఖానుభవమును సహించుటకుఁ గాఠిన్యములేని మనస్సుగలది. ఆమె నన్ను గానక యెంతఁగా వాపోవుచున్నదోగదా? ఆమారీచుఁడు చచ్చుచుఁగూడ, దుర్బుద్ధినివీడక, "హాలక్ష్మణా! సీతా!" యని నాకంఠస్వరముతో గట్టిగా నఱచుటచే, నీవును మోసపోయినట్లున్నది. ఆమెయును మోసపోయినది. నీవిప్పుడు సీత నొంటరిఁజేసి, విడిచి వచ్చుటచే, రాక్షసులకు మంచియవకాశము చిక్కియుండును. ఖరాదులను సంహరించితినినన్న కోపముచే, రాక్షసులు సీతనుజంపి, తినియుందురు. శత్రుసంహారకుఁడవైన యోతమ్ముఁడా! నేనన్నివిధములుగను దుఃఖసముద్రమున మునిఁగి తేలుచుంటిని. ఇఁక నేనేమిచేయుదును? విధివ్రాత యిట్టిదేయేమో? అని యీవిధముగాఁ జింతించుచునే రాముఁడు పంచవటిఁగల పర్ణశాలకుఁ జేరికొనియెను. ఆయాశ్రమ మంతయును శూన్యమై యుండుటను జూచి, శ్రీరామమూర్తి, దుఃఖమూర్తియై, లక్ష్మణుని, నిందించుచు, నాకలియు, దప్పికయు, బడలికయు, ననువానిచే నోరెండిపోగా, నిట్టూర్పులు నిగుడించుచు, ముఖకాంతులు క్షీణించి, వెలవెలఁబోగా, మిక్కిలి విలపించెను. మఱియు నయ్యాశ్రమ

ప్రాంతములందు, సీతతో విహరించిన ప్రదేశములను జూచుచు, వెనుకటి యనుభవములను దలంచికొనుచు, గగు ర్పాటుగలిగిన శరీరముగలవాడై, దుఃఖించుచు, సంచరించెను.

## శ్రీరాముడు లక్ష్మణుని నిందించుట - లక్ష్మణుని సమాధానము

శ్రీరాముఁ డయ్యాశ్రమమున సీతాదేవినిగానక, లక్ష్మణస్వామింజూచి, దుఃఖించుచు నిట్లని ప్రశ్నించెను. తమ్ముఁడా! నీయందున్న గాఢమైన విశ్వాసముతో, సీతాదేవినివిడిచి, వెళ్ళితిని. అట్టియెడ నామెనొంటరిగావిడిచి, నావద్ద కేలవచ్చితివి? నిన్ను జూడగనే, యప్పుడే సీత కేదో, మూడువాటిల్లినదని శంకించితిని. నాయెడమ బుజము నెడమ కన్నును, హృదయమును స్పందించినవి. (అదిరినవి) అని యీవిధముగా శ్రీరాముఁడు లక్ష్మణుని చేష్టకు బాధ పడుచు నిందించెను. అంతకుఁ బూర్వమే సీతాదేవి తనను గర్ణకఠోరముగా నిందించినది. ఈనిందల నోర్మితో భరించుచు, లక్ష్మణుఁ డోర్మితో, వినయముచూపుచు, నిట్లను చున్నాఁడు.

అన్నా! శ్రీరామచంద్రా! నాయంతటనేను సీతను విడిచి రాలేదుసుమా! ఆమెయే, నన్ననరాని మాటలచే నామనస్సును గాయపరచుటచే, గత్యంతరములేక, యెంత

వరకుఁ జెప్పవలయునో, యంతవరకును జెప్పియుఁ బ్రయోజనము లేక, యిటువచ్చితిని. "హా! సీతా! హా! లక్ష్మణా! రక్షించుము! రక్షించుము!" అనియన్న మాటలు సీతాదేవి వినఁగానే, యామెకు నేనెంతఁగా ధైర్యము చెప్పినను, నమ్మక, నన్ను బదింబది తొందరఁజేసినది. అన్నా! ఆమె భయముతో నేడ్చుచు నన్ను నీకడకుఁ బొమ్మని తొందర చేయుచుండఁగా, నీసంగతి నెఱింగిననేను, నీయందలి గాఢ విశ్వాసముతో నామెమాటలను లక్ష్యముచేయలేదు. మఱియు నిటంటిని. అమ్మా! మాయన్నను భయపెట్టఁగల వాఁడెవ్వఁడు నేలోకమునను లేడుసుమా! నీవు విచారించకుము! నీవువిన్నది కేవలము మాయాధ్వనిగాని, నిజముగా మాయన్నగారి కంఠధ్వనిగాదు. రాముఁడు దేవతలకే రక్షణ నీయఁగల పరాక్రమవంతుఁడు. అట్టివాఁడు, "పాహి, త్రాహి!" యని యఱచుట నమ్మరానిది. సామాన్యస్త్రీవలె నీవు రాక్షస మాయలను నమ్మరాదు. దుఃఖించకుము. రాముని జయించఁగలవాఁ డింతవరకును బుట్టలేదుసుమా! ఇఁకమీఁద నెందును బుట్టఁబోవఁడు. దేవేంద్రాది సమస్త దేవతలు నేకమైవచ్చినను రాముని జయించలేరు." ఓరామచంద్రా! నేనింతఁగాఁ జెప్పిన, నామె కంటనీరువెట్టుచుఁ గర్ణ కఠోరమైన మాటలతో నిట్లనియెను. "ఓయీ! లక్ష్మణా! నీయన్న చనిపోయినచో, నన్ను నీవు పొందవచ్చునని

భావించుచున్నావేమో ? అదినీకు దుర్లభముసుమా ! మఱియు, సమయమునకై, వేచియుండి, నీయన్నను జంపుటకు భరతునిచేఁ బంపఁబడిన దూతవలెఁ గపటనాటక మాడుచున్నావు. అట్లుగానిచో నాపదలో నఱచినను, నాతనివద్దకుఁ బోక యెట్లూరుకొందువు?" అనియీవిధముగా నిందించుటచేఁ, బెదవులు తడఁబడుచుండఁగా, మారుమాటాడలేక, తొందరగా నీకడకు వచ్చితిని. అనఁగావిని 'లక్ష్మణా ! ఏమైనను సీతను విడిచివచ్చుట మంచిపనిగాదుకదా ! నాసామర్థ్యము నెఱిఁగినవాఁడవయ్యు నాఁడుదాని యాక్రోశమునకు లొంగిపోయి, వచ్చితివి. ఇంతకును నాశాసనమునువిడచి, యాఁడుదానిమాటలకు భయపడి వచ్చుటలోఁ జాల పొరపాటు చేసితివి. లేడిరూపములోనున్న రాక్షసునిచే, దూరముగాఁ గొనిపోఁబడినవాఁడనైనను, వానిని సంహరించి వచ్చుచున్నాను. నేను నాధనుస్సు నెక్కువెట్టి విలాసఁగా బాణము విడిచితిని. అంతలో వానిమాయబయటఁబడి, చక్కని బాహుపురులు మొదలైన యాభరణములుగల యారాక్షసుఁడు నా బాణముచేఁ జనిపోవుచు నాకంఠస్వరము ననుకరించుచుఁ జాలదూరము వినిపించునట్లుగా, గట్టిగా నఱచినాఁడు. ఆమాయకేకనువిని, సీత నొంటరిగావిడిచి వచ్చి, చాలపొరపాటు చేసితివి. అనిపలుకుచుఁ దమ్మునితోఁ గలిసి వచ్చుచున్న శ్రీరాముని కెడమకన్ను, క్రిందిభాగ మదరినది. కాలుజారినది. శరీరము కంపించినది.

## శ్రీరాముఁడు సీతను గానక - దుఃఖించుట

శ్రీరాముఁడు తనకుఁగలిగిన దుర్నిమిత్తములఁ దలఁచుచు, "సీతయున్నదా? లేదా?" యను సందేహముతో మఱింత వేగముగా నడిచి యాశ్రమముం బ్రవేశించెను. కాని యందామె కానరాలేదు. అతఁ డాతురతతో నాయాశ్రమ ప్రాంత ప్రదేశముల నెల్ల వెదకిచూచెను. హేమంతమున శిథిలమైన పద్మమువలెనున్న యాశ్రమమును జూచెను. అందలి పూలచెట్లపైనున్న తుమ్మెదలు హీనస్వరముతో రోదఁజేయుచున్నవి. అందు సంచరించు లేళ్ళును బక్షులును గాంతిహీనములై కనుపించెను. మొత్తముపై నాయాశ్రమ ప్రాంత మంతయును వనదేవతావిరహితమై యుండెను. ఆశ్రమమందలి లేడిచర్మమును దర్భాసనమును జెల్లాచెదరై యుండెను. పిరికితనముగల సీత నేరాక్షసుఁడైన బలాత్కారముగా నపహరించెనా? లేక యీయడవిలో నెక్కడికైన వెళ్ళి, దారితప్పినదా? ఫలపుష్పాదులను దెచ్చుట కెటకైన వెళ్ళినదేమో? అనితనలోఁదాను బ్రశ్నించికొనుచు, శ్రీరాముఁడాయాప్రదేశములం దిరిఁగితిరిఁగి, సీతాదేవినిగానలేక, శోకముతో నెఱ్ఱనై విశాలములైన నేత్రములుగలవాఁడై, పిచ్చివానివలె నటునిటు చూచుచుఁ దిరుఁగుచుండెను. ప్రతి వృక్షమును, కొండను, నదిని, సీతజాడను దెలియఁజేయుమని కోరుచు శోకసాగరమగ్నుఁడై, విలపించుచుండెను. ఓకదంబమా! నీపూవులపై మక్కువఁగల సీతనుజూచితివా!

ఓమారేడువృక్షమా ? నీఫలములవంటి స్తనములుగల నాసీత నీకుఁగనఁబడలేదా? ఓయర్జునవృక్షమా ! నీయం దత్యంత ప్రీతిఁగల జానకి యెందున్నదో, చెప్పఁగలవా? పోనిమ్ము ! ఈకకుభవృక్షము తనవంటితొడలుగల సీతను దప్పక చూచి యుండును. అందఱికిని శోకములను బోగొట్టు నోయశోకమా ! నాప్రియురాలిని జూపించి, నాశోకమును బోగొట్టి, నీపేరును సార్థకము చేసికొనుము. ఓతాళమా నీపండ్లవలె బిగిసిన స్తనములతో నిగనిగలాడు శరీరముగల నాప్రియురాలి వార్తనుజెప్పి, పుణ్యమునుగట్టికొనుము. ఓకర్ణికార వృక్షమా ! నీపూవులన్నచోఁ జెవిఁగోసికొను సీతను జూచితివా? అని యీవిధముగా మహాత్ముఁడైన శ్రీరాముఁడింకను నాప్రాంతములఁగల నీప పనసాది వృక్షముల నన్నిఁటినిజేరి, వేరువేరుగా నడుగఁజొచ్చెను. మఱియు, "నోలేడీ ! లేడికన్నులవంటి కన్నులుగల సీత యాడలేళ్ళతోఁగలిసి, యెటనైన నున్నదేమో? చెప్పఁగలవా? ఓగజరాజా ! నీతొండమువంటి తొడలుగలిగిన జానకిని జూచితివా? ఓశార్దూలమా ! నీవు నిర్భయముగా నాప్రియురాలింగూర్చి తెలియఁజేయుము. ఓప్రియురాలా ! నీగూర్చి బాధపడుచున్న నన్ను జేరక యెచ్చటదాగుంటివి? ఇట్టి దుఃఖసమయమున నాతో పరిహాసమాడుచున్నావా? ఆగుమాగుము ! ఇంతకాఠిన్యమునువహించి, నన్ను బాధపెట్టకుము ! నీవెందు దాగినను, నీవుధరించిన పచ్చనిపట్టుచీర నిన్ను బయటపెట్టఁ

గలదు. నాపై నీకేమాత్రము సుహృద్భావమున్నను, నీవు పరువెత్తకుండ నాగుము! సుందర మందహాసముతో నల రారు, నిన్నెన్నఁడును నేను బాధించలేదుగదా! కావున నన్నిట్లు బాధించుట నీకుఁదగదుసుమా! అయ్యో! నిజముగా నీవుజీవించియే యున్నచో నన్నుజూడకుండ నుండలేవు. నేను లేని సమయమును గనిపెట్టి రాక్షసులు నిన్నుజంపి, ముక్క లుగాఁజేసి, తినియుందురు. అందమైన నీపలువరుసయుఁ, బెద వులును, సోగదీరిన ముక్కును, జెవులును, గలిగి, చంద్ర బింబమువంటి నాసీతయొక్కముఖము, రాహువుచే మ్రింగఁ బడినట్లున్నది. సంపెంగపూ వన్నెఁగలదియు, నవరత్నఖచిత బంగారుహారములతో నిండిన మెడఁగలదియు, మిక్కిలి సౌకుమార్యముగలదియు నగు నాసీత, యీక్రూరరాక్షసు లచేఁ దినివేయఁబడుచు, నెంతగా విలవిలఁదన్నుకొని విల పించినదోగదా? ఆమె భుజములు చిగురుటాకులవలెఁ గోమల ములై, కంకణ కేయూరాదులచే నలంకరింపఁబడినవై రాక్షసు లచేఁ దినివేయఁబడియుండును. బాధువర్గ మెంతగానున్నను, నేనులేని సమయములో, బాటసారుల సమూహముచే విడిచి పెట్టఁబడినదివలె నాకు నూరమైపోయినది. అయ్యో! లక్ష్మణా! నీకైనను సీతగానరాలేదా? ఓప్రియురాలా! ఎక్క డకుఁ బోయితివి? అని యీవిధముగా శ్రీరాముఁడు సీతా దేవినిగూర్చి పరిపరివిధంబుల విలపించుచు, నొకవనమునుండి మఱియొకవనమునకుఁ బరువులెత్తుచు, నొకచో సీతగనిపించి

నట్లు భ్రమపడుచుం బోవుచుండెను. సమాన సౌందర్యము గల లతాదులనుజూచి, సీతయేయని భ్రమించుచుఁ, బిచ్చివానివలెఁ దిరుఁగుచుండెను. ఆవిధముగా వనములు, నదులు గొండలు గొండచరియలు మొదలైనస్థలములందెల్లఁ దిరిఁగి తిరిఁగి, సీతను వెదకుచుండెను. అట్లు మఱలమఱల వెళ్ళిన చోటులకే వెళ్ళుచు వెదకుచుండెను.

## విశేషము

"రామఏవ పరంబ్రహ్మ రామఏవపరంతపః......" ఇత్యాది వాక్యములవలన, శ్రీరాముఁడు సాక్షాత్పరబ్రహ్మయే మానవావతారమును ధర్మసంరక్షణకై ధరించినట్లు తెలియుచున్నది. అట్టివాఁ డొకస్త్రీమూర్తికై, మోహాపరవశుఁడై, విచారించనేల? తానే యీసృష్టినంతను గావించి పోషించి, లయముచేసి, మఱలసృష్టించఁగలఁడు. అట్టి నిర్వికార నిరంజనుఁడై, సాక్షీభూతుఁడైనఁ పరబ్రహ్మ, సామాన్యమానవునివలె, విలపించుటలో నౌచిత్యమేమున్నది? ఇంతటి యధైర్యముతోఁ బిచ్చివానివలెఁ దిరిఁగిన శ్రీరాముఁడు ధీరోదాత్తనాయకుఁ డెట్లగును? వాల్మీకిమహర్షికీప్రశ్నలు స్ఫురించలేదా? లేక యామహాకవిగూడ రాముని సామాన్యమానవునిగనే, యూహించినాఁడా? అనెడు ప్రశ్నలకు సమాధానము లేకపోలేదు. భాగవతమున శ్రీశుకుఁడును, స్కాందపురాణమున, 'సుమాసంహిత' యందును. మహే

శ్వరతీర్థుల వ్యాఖ్యానమునందు, నీవిషయమై, విపులముగా జర్చించిరి. పైవానికిఁ జక్కని సమాధానములుగూడ నీయఁబడినవి. శ్రీమహావిష్ణువును దేవతలు ప్రార్థించఁగా, మాయామయుఁడైన మానవునిగా జన్మించి, రావణుని జంపఁగలనని యాదిలోనే చెప్పుటచే, నీజగన్నాటకమున, మానవపాత్ర ధరించిన, భగవంతుఁడు కేవలము మానవునిగనే తనపాత్రను బోషించికొనవలయును. అప్పుడే యుత్తమనటుఁడు గాఁగలఁడు. మఱియు, రామో విగ్రహవాన్ ధర్మః" యనుమాట ననుసరించి, వేదోక్తముగా వివాహమాడిన ధర్మపత్నిని ప్రేమించి, రక్షించికొనుప్రయత్నము చేయుటలో మానవుఁడు చూపించవలసిన ధర్మమిట్టిదియే యని చూపుటకే, యట్లు నటించియుండునని వాన మూహించవచ్చును. వెండియు శ్రీరాముఁ డన్నిఁట, నాదర్శపురుషుఁడై "ఓమానవులారా! స్త్రీవ్యామోహ మెంతటివానినైనను, బుద్ధిచాంచల్యము గలవానినిగాఁ జేయుననుట కిదేమీకు నేనాచరించి, చెప్పుచుంటిని." అని పరోక్షముగా స్త్రీవ్యామోహమును విడువుఁడని చెప్పుటకును, దానంతటి శోకమోహములను దెచ్చిపెట్టుకొని, యనుభవించినట్లు నటించియుండును. గ్రంథవిస్తరభీతిచే నింతటితో నీవిషమునుగూర్చి ముగించుచున్నాను.

## శ్రీరాముని దుఃఖము - లక్ష్మణు నోదార్పు

శ్రీరాముఁడు సీతకొఱకై వెదకివెదకి విసిగివేసారి రెండుచేతులును బైకెత్తి బిగ్గరగా నఱచుచు నిట్లను చున్నాఁడు. లక్ష్మణా! నాసీతయేది? ఎవ్వరైన నపహరించి కొనిపోయిరా? ఏరాక్షసులైనను జంపి తినివేసిరా? ఓసీతా! ఏచెట్టుచాటుననైన నుండి, నాతోఁ బరియాచకము లాడు చున్నావా? ఇక్కడికిది చాలును. నన్ను జేరికొనుము. ఓసీతా! నీతో నిర్భయముగా నాడుకొను లేడిపిల్లలు కంటఁ దడివెట్టికొని, విచారించుచున్నట్లున్నవి. ఓతమ్ముఁడా! సీత దగ్గరలేకుండ, నేనుజీవించలేనయ్యా! ఈసీతాశోకముతో మరణించిన, నన్ను నాతండ్రి చూడఁగలఁడు. నేను గాముకుఁ డనై, స్వర్గమందున్న నాతండ్రివద్దకుఁబోగా, నాయన నన్ను జూచి, "పదునాలుగేండ్లరణ్యవాసము చేయుదునని ప్రతిజ్ఞా భంగముగావించి, యీస్వర్గమున కేలవచ్చితి"వని, నన్ను నిందించునుసుమా! ఓప్రేయసీ! నీయందుఁ బరవశుఁడనై, దీనుఁడనైన నన్నుసత్యవాదిని, దుష్టుని విడిచిన కీర్తివలె, యెచ్చటకుఁ బోయితివి? ఇంక నీవుదగ్గరలేక నాప్రాణములు నిలువవు. అని శ్రీరాముఁ డెంతగనో విలపించి సీతను గనలేక పోయెను. ఒకపెద్దగోతిలోఁగల బురదలోఁబడిన యేనుఁగు వలె విలవిల విలపించుచున్న శ్రీరామునిజూచి, లక్ష్మణ స్వామియు నాతని బాధను సహించలేక, యిట్లనుచున్నాఁడు.

మహాపరాక్రమశాలివగు నోయన్నా! శ్రీరామ

చంద్రా! దుఃఖమునువిడిచి, నాతోఁగలిసి, సీతను వెదకుము ఈవనమంతయు ననేకగుహాలతోడను, లతాగృహములతోడను శోభిల్లుచున్నది. సీతాదేవికి వనసంచారమన్నఁ బ్రీతియగుటచే నామె యీ యడవిలో నెందైనను దిరుగుచుండవచ్చును. లేక కలువలును,బద్మములునుగల యేకొలనులోనైన వినోదమునకై దిగియుండవచ్చును, అదియుంగానిచోఁ జేపలతోడను, దెల్లని గడ్డితోడను నిండిన యే నదికైనను వెళ్ళి స్నానమాడుచుండవచ్చును. లేదా మనలను హాస్యమాడఁదలచి యే లతాగుల్మము నందైనను దాగియుండవచ్చును. అని లక్ష్మణుఁడు ధైర్యము చెప్పఁగా దైన్యమును వీడి, శ్రీరాముఁడు మఱల సీతనువెదకుటకై, యారంభించెను. అట్లు పర్వతసానువులను, గుహాలను, నడవులనుం దిఱిఁగిదిఱిఁగియు, సీతాదేవిని జూడలేకపోయిరి. నెంఱియును లక్ష్మణుఁడు శ్రీరామునిజూచి, యన్నా! రమ్ము! తొందరగా నీవనమంతయును వెదకుదము. నీవు దుఃఖశోకములను విడువుము. అనఁగాఁ దమ్మునింగూడి యింకను వెదకుచు, శ్రీరాముఁడు తిఱుగనారంభించెను. వారా ప్రాంతారణ్యములనెల్ల నేమాత్రమును విడువక వెదకిరి. కాని సీతకానరాలేదు. అప్పుడు శ్రీరాముఁడు, తమ్ముఁడా! నీవుచెప్పినట్లంతయును వెదకితిమిగదా! ఫలితము శూన్యమైనది. అనఁగా లక్ష్మణుఁడును గొప్పగా దుఃఖించుచు, శ్రీరాము

నితో నిట్లనియెను. మహాపరాక్రమశాలివైన యోయన్నా! ఆనాఁడు బలిచక్రవర్తిని బంధించి, ముల్లోకముల నాక్రమించిన త్రివిక్రమునివలె, సీతను నీవుపొందఁగలవు. నాపుడు శ్రీరాముఁ డిట్లనెను. తమ్ముఁడా! మన మీవనమందే మాత్రమును, విడువకుండ వెదకితిమి. నాబహిఃప్రాణమైన ప్రియురాలిని జూడలేక పోతిని. అహా! ఏమి నాదౌర్భాగ్యము? అనుచు స్పృహతప్పి కూర్చుండెను. ఆవిధముగాఁ గృశించి, చేష్టలుదక్కి, దైన్యముతో నొకచోట, నిట్టూర్పులు నిగుడించుచు, "హా! ప్రియా!" యని యఱచుచు, విలపించెను. అట్టితఱిణమునం దన్నకునెదురుగా దోసిలియొగ్గి నిలిచి ధర్మజ్ఞుఁడైన యాతని ననేకవిధముల శాంతింపఁజేయుచు నోదార్చెను. కాని రాముఁడాతని యోదార్పుమాటలను లక్ష్యముచేయక గట్టిగా రోదించెను.

కమలలోచనుఁడు నాజానుబాహుండు, నైన, శ్రీరాముఁడు సీతనుగానలేక పోయినను, యెదురుగాఁ జూచినట్లే భావించుచు, నిట్లనుచున్నాఁడు. ఓసీతా! నీకుఁ బువ్వులన్న, మిక్కిలియాసక్తిగలదు. కావున నిండుగాఁ బుష్పించిన యేయశోకవృక్షపుఁ గొమ్మలచాటుననైన దాగుంటివా! లేదా, యరఁటిబోందలవలెనున్న, నీతొడల నరఁటిచెట్ల చాటుననుంచి, కానరాకుంటివా? నీవుకర్ణికార వనమునకుం బోయి, పరిహాసార్థమై, దాగుంటివేమో? నా దుఃఖమును జూచియైన నీపరిహాసమును, విడువుము. ఓజానకీ! పరిహాసము

నకుఁగూడ హద్దున్నదిసుమా ! ఇంతఁగా విలపించు నాతో నింకను బరిహాసమేల? నీవు పరిహాసప్రియురాలవని నాకుఁ దెలియును. అయినను, వనవాసమున, మునివృత్తి నవలంబించి, యుండగా, నింతటి సుదీర్ఘ పరిహాసము మంచిదిగాదు. ఈపర్ణశాల శూన్యమై, కళాహీనమై, యున్నది. వేగముగా నిటురమ్ము ! ఓలక్ష్మణా ! ఇంతఁగా విలపించుచున్న, నన్ను గమనించియైన, సహించలేక, యీపాటికి బయటఁబడియుండ వలసినది. కాని యట్లు కాలేదు. ఆమె నేరాక్షసుఁడైన నపహరించియుండును. లేదా, తినివేసియుండును. ఈలేళ్ళగుంపులు కండ్లనుండి నీరుఁగార్చుచు, సీత దినివేయఁబడినదని చెప్పుచున్నట్లు తోఁచుచున్నది. అయ్యో ! ఓప్రియురాలా ? నిజముగా నిదిట్లేయైనచోఁ, గైకమ్మ తనకోరికను దీర్చికొన్నదైనట్లే. నేను సీతతో నడవులకువచ్చి, నియమితకాలము పూర్తి కాఁగానే, మఱలసీత లేకుండ నొక్కఁడనే, నాయంతఃపురమున కెట్లుపోఁగలను? ప్రజలందఱును నన్ను నిర్వీర్యునిగను, దయాహీనునిగను, బిరికివానిగను, జెప్పికొందురు. వనవాసానంతరము జనకమహారాజువచ్చి, తన ముద్దులకుమార్తెను గూర్చి ప్రశ్నించినచో, నేనేమొగము పెట్టికొని, యేమని సమాధానము చెప్పఁగలను? ఈదుర్వార్తవిన్న జనకమహారాజు మూర్ఛనందఁగలఁడు. ఇంతయేల? సీతాదేవి లేకుండ నేనయోధ్యలోనే యడుఁగుపెట్టను. సీతాదేవిలేనిచో, నాకు స్వర్గమైనను బాధాకరముగనే యుండును. లక్ష్మణా ! నీవు

సన్నిచ్చటనే విడిచి, యయోధ్యకునేగుము. నాజీవితము నిచ్చటనే చాలించెదను. నీవువెళ్ళి, భరతుని గట్టిగాఁ గాఁగిలించికొని, "నాయనా! నీవే యీరాజ్యమునంతను బరిపాలించుము. ఇది రామాజ్ఞయని చెప్పుము. మనతల్లులైన వారికి ముప్పురకును నానమస్కారములుగాఁ దెలియఁ జేయుము. వారి యోగక్షేమములను నీవే, జాగ్రత్తగాఁ జూచుచుండుము. మఱియు నాతల్లి కౌసల్యకు సీతాపహరణ వృత్తాంతము నంతయును జెప్పుము. ఈవిధముగాఁ బలుకుచున్న శ్రీరామునిజూచి, యంతవరకును ధైర్యముగా నున్న లక్ష్మణుఁడుగూడ భయవిహ్వలుఁడయ్యెను.

అట్లు మహారాజకుమారుఁడైన శ్రీరామభద్రుఁడు ప్రియురాలి నెడఁబాసి, దుఃఖ మోహములచేఁ బీడించఁబడుచుఁ దమ్మునితోఁగలసి, యంతకంతకు, నధికముగా దుఃఖించుచుండెను. అంతవరకును ధైర్యముతోనున్న లక్ష్మణుఁడుగూడ శోకపరవశుఁడయ్యెను. అప్పుడు శ్రీరాముఁ డిట్లనియెను. లక్ష్మణా! నావంటి దురదృష్టవంతుఁ డీభూమిపై లేఁడనియే, తలఁచెదను. చూడుము! రాజ్యభ్రష్టత్వము, బంధువియోగము, పితృమరణము, వనవాసక్లేశము, నివిచాల వన్నట్లుగా నన్నిఁటికిని మించిన, ప్రాణసమానమైన భార్యావియోగముగూడఁగలిగి, నన్ను వేధించుచున్నది. ఇన్నికష్టములు పగవానికైనఁ గలుగకుండునుగాక! నాయనా! లక్ష్మణా! పూర్వజన్మములో నేనుజేసిన దుష్కృతము

లన్నియు, నొకవానివెంట నొకటిగా ఫలించి, యనుభవింపఁ జేయుచున్నవి. తమ్ముఁడా! ఈవనవాసమున వెనుకటిదుఃఖము లన్నియును మరచి, సీతతోడను నీతోడను సుఖముంటిని. కాని యిప్పు డీ సీతావియోగము, కట్టెలమోపులోని కఱ్ఱల యందు నిగూఢముగానున్న యగ్ని యొక్క మూరుగాఁ బెల్లుబికినట్లు, నన్ను గాల్చివేయుచున్నది. మఱియు వినుము! ఎవఁడో, రాక్షసుఁడు భయంకరాకారముతోఁ బిరికిగుణము గలదియైన యీసీతను, మఱింతఁగా, భయపెట్టి, యాకాశ మార్గమునఁ గొనిపోవుచుండఁగా, నామె యెంతఁగా, నేడ్చెనో? నాప్రియురాలిస్తనములు గుండ్రనై, మంచిబిగువు గలిగి, రక్తచందనమును బూసికొనుటకుందగినవి. అవి యీనాఁడు రాక్షసునిచేఁ దినివేయుటకు, ముక్కలుగాఁ జేయఁబడి యుండును. నాసీతయొక్క ముఖమునుండి, యవ్యక్తములైన మధురవాక్కులు వెలువడుచుండెడివి. అందముగాఁ గొంచెము వంకరలుదిరిగిన, నల్లని జుట్టుగల, యామె ముఖ మీనాఁడు రాహుగ్రస్తమైన చంద్రబింబము వలెఁ బ్రకాశములేక యుండునేమోగదా? పరమనాధ్వియైన నాప్రియురాలి కంఠము, విలువైన రత్నాలహారములతోఁ బ్రకాశించెడిది. అట్టి దీనాఁడు రక్తమును ద్రాగురాక్షసుల చేతిలో, రక్తసిక్తమై కొరికివేయఁబడి యుండును. దృఢమైన శీలముగల యామె, నాతోఁగూడ నొకబండరాతిపలుకపైఁ గూర్చొని, నిన్నుగూర్చి యెంతగనో, మెచ్చికొనుచు,

మాటలాడెడిది. నదీమతల్లియైన గోదావరి కేగుటయన్న నామె కేంతయో ప్రీతిపాత్రమైనది. అయినను, నేను వెంట లేకుండ నామె యొంటరిగా నెప్పుడును వెళ్ళలేదు. కావున నీమె యచ్చటనుండదని తలఁచెదను. ఒకవేళ తనముఖమున కును, నేత్రములకును సాటివచ్చు పద్మములను జూచుటయం దెక్కువమక్కువతో, నదికిఁబోయి యుండవచ్చు ననుటకును, వీలులేదు. ఈపుష్పఫలభరితమై, పక్షిసంఘములతో నిండిన, వృక్షములను జూడ నాసక్తిఁగలదైనను, నేను సన్నిధిని లేనిదే, యొంటరిగా నెక్కడికిని బోవదుగదా! అంతటి భయ స్వభావముగల సీత యొంటరిగా నెటుపోయినదని చెప్పఁగలను? మఱియు శ్రీరాముఁ డిట్లనుచున్నాఁడు. ఓసూర్యుడా! నీవు కర్మలన్నిఁటికిని సాక్షివి. నీకుఁ దెలియని దేదియును జరు గదు. నాప్రియురాలేమైనదో, సత్యమును జెప్పుము. ఓవాయు దేవా! నీవు ప్రసరించరాని స్థలమేలేదు. కావున నాభార్య యపహరించఁబడి యెందుంచఁబడినది? లేదా, యెచ్చట చంపి వేయఁబడినది? లేక యేత్రోవను బ్రయాణము చేయు చున్నది? నిజముచెప్పుము. అని యీవిధముగాఁ దెలివిదప్పి యేమేమో, వలుకుచు, శోకమూర్తియైన యన్నను జూచి, లక్ష్మణస్వామియును గొప్పగా విచారించుచున్నవాఁడైనను, గొంతవరకును దెలివిఁదెచ్చికొని, ధైర్యము నవలంబించి, యాలోచనాపరుఁడై, శ్రీరామునితో నిట్లనుచున్నాఁడు. అన్నా! దుఃఖమునువిడిచి, ధైర్యము నవలంబించుము

ఉత్సాహముతో నాశవదలక సీతను వెదకుదము. ఉత్సాహవంతునకు సాధ్యముగానిపని యేదియును లేదు. అని లక్ష్మణస్వామి తనయన్నకు ధైర్యము గలిగించుచు మాటలాడు చున్నను, రాముఁడు మాత్రము దైన్యమునుబొంది, మఱల మఱల నంతకంత కధికముగా విలపించసాగెను.

మఱియు శ్రీరాముఁడు దీనమనస్కుఁడై లక్ష్మణునితో నిట్లనియెను. తమ్ముఁడా! నా ప్రియురాలు పద్మములను దెచ్చుటకై వెళ్ళినదేమో? నీవు గోదావరికి వెళ్ళి చూచి రమ్ము! అనఁగా లక్ష్మణుఁ డట్లే వెళ్ళివచ్చి సీత కానరా లేదని చెప్పినాఁడు. అంత రాముఁడు తానే వెళ్ళి గోదావరీ తీరమంతయును వెదుక నారంభించెను. అచ్చటి యా గోదావరిగాని, లేళ్లు మొదలైన మృగములుగాని, వృక్షములుగాని మఱేవియు నెంతగా నడిగినను రావణుని యందలి భయముచే నన్నట్లుగా సమాధాన మీయలేదు. ఆ సమయమున శ్రీరాముఁడు లక్ష్మణా! మన మయోధ్యకుఁ బోయినప్పుడు కౌసల్య మొదలగువారు సీతనుగూర్చి ప్రశ్నించినచో నేమని చెప్పఁగలము? ఆ సీత దగ్గరనుండఁగా నీ వనవాస క్లేశము లేవియును నన్ను బాధించలేదు. సరిగదా యయోధ్యలో నున్నప్పటికంటె నెక్కుడు సుఖమునే గలిగించినవి. ఇప్పుడా సీత కానరాకపోవుటచే రాజ్యమును గోల్పోవుట, పితృ వియోగము మొదలగు కష్టము లన్నియు నొక్కమారుగా నన్ను జుట్టుముట్టినవి. లక్ష్మణా! బంధువులను విడిచి వనముల

నిడుములఁ బడుటయేగాక భార్యనుగూడఁ గోల్పోయినవాఁడ నగుటవే నాకీ రాత్రులన్నియును బెద్దవియై, తెలివిగానున్నను గడచినట్లులేదు. ఇంకను మందాకినీ నదీతీరమును బ్రస్రవణ పర్వతప్రాంతమును వెదుకవలసియున్నది. అందు నెందైన సీత గానిపించునేమో? లక్ష్మణా! చూచితివా? ఈ మృగములు మాటిమాటికిని నన్నుజూచుచున్నవి. చూచుటయేగాక తమ మెడలు పైకెత్తికొని దక్షిణదిశగాఁ బరుగెత్తుచున్నవి. వానిచేష్టలనుబట్టి చూడఁగా, నాతోనేమేమో, చెప్పఁదలఁచినట్లు గనుపించుచున్నదిసుమా! అని చెప్పుచుఁ గన్నీరుఁ గార్చుచుఁ బురుషోత్తముఁడైన రాముడు "సీతయేమైనది?" యని యామృగములను బ్రశ్నించెను. అట్లురాముఁ డడిగినంతనే యాలేళ్ళు మరల దక్షిణదిశగా, మెడలుపైకెత్తి పరువెత్తినవి. ఆవిధముగా, రావణుఁడు సీతను గొనిపోయిన మార్గమునఁ బోవుచు, కొంతదూరమేగి, మఱల శ్రీరాముని వైపు వెనుదిరిగి చూడసాగినవి. అంతయును జూచుచున్న లక్ష్మణుఁ డిట్లనెను. అన్నా! సీతనుగూర్చి నీవుప్రశ్నించగనే, యీమృగము లన్నియునులేచి, దక్షిణదిక్కుగాఁ బరుగు వెట్టుటంబట్టి, మనల నాదిశగా వెదకుమని చెప్పినట్లైనది. కావున మన మామార్గమునఁ బోవుదము. సీత గనఁబడక పోయినను నా మెజాడనైనను దెలిసికొనెడి యుపాయము మనకుగోచరింపఁగలదు. రాముఁ డామాటలను గౌరవించి, దక్షిణదిశగా వెదకుటకు బయలుదేరెను. వారట్లుపోగాపోగాఁ

గొంతదూరమున, నలిగి పడిపోయిన పుష్పములు గనుపించి నవి. వానింజూచి, తమ్ముఁడా! ఈపుష్పములు సీత యలంకరించికొన్న వేసుమా! నేనామెకుఁ బ్రీతికరములని యీపుష్పములను దేగా, సీతవీనిని జక్కఁగా నలంకరించి కొన్నది. ఈపూవులు నేలంబడి యెండిపోయి బూడిదలో, గలిసిపోకుండఁ సూర్యభగవానుఁడు నాకుఁజూపించుటకే వీనిని గాపాడియుండును.” అనిచెప్పుచు, శ్రీరాముఁడు, సెలయేళ్ళతో నిండిన ప్రస్రవణ పర్వతమును సంబోధించుచు నిట్లనుచున్నాఁడు. ఓపర్వతమా! ఈసుందర వనప్రదేశమున సర్వాంగసౌన్దర్యవతియగు నాప్రియురాలును జూచితివా? అట్లైన నాకు వేగముగాఁ జెప్పుము.” అని మఱియు, సింహ మొకానొక క్షుద్రమృగమును జూచినట్లు నిర్లక్ష్యముగాఁ జూచుచుఁ గోపముతో శ్రీరాముడిట్లనియెను. ఓపర్వతమా! బంగారువన్నెగల నాజానకిని జూపుము! లేదా? నీకున్న సానుసముదాయముతోఁగూడ నిన్నునా బాణములచే నాశముచేసెదను. అనఁగా, నాపర్వతగుహాలు ప్రతిధ్వనించి, రాముఁడన్నమాటలనే, మఱల నాపర్వతము పలికినట్లు ప్రతిధ్వనించెను. అంతియేగాని, యాపర్వతము మాత్రము, రావణునకుభయపడి, సీతావృత్తాంతమును జెప్పలేదు. అంత నారాముఁడు “ఓపర్వతరాజమా! నాబాణాగ్నికిఁ గాలిపోయి, బూడిదగా మారిపోఁగలవు. జాగ్రత్త! వెంటనే

నాకు సమాధానము చెప్పుము. సీతయెక్కడనున్నటి?" అని గద్దించెను. వెండియుఁ బూజ్యురాలైన సీతనుజూపనిచో, నీనదినైన నింకింపఁజేయుదును, అని శ్రీరాముఁడు మహా క్రోధావిష్టుఁడై, తనచూపులతోడనే తగులఁబెట్టుచున్నట్లు గానుపించుచు, నాదారినే ముందునకుఁబోయి, రాక్షసుని యడుఁగుల, నటునిటుదడబాటుతో నున్న సీతాదేవియొక్క పాదముల గుర్తులను. జూచెను. ఇంకనుబోయి చూడఁగా, విరిగినరథమును, ధనువును విరజిమ్మఁబడిన బాణములతోడి యమ్ములపాదులును గానుపించినవి. వానింజూచిన రాముఁడు లక్ష్మణునితో నిట్లనియెను. "తమ్ముఁడా! సీతాదేవియొక్క యాభరణములకు సంబంధించిన బంగారుబిందువులను, వివిధములైన పూలమాలలను, జూచితివిగదా! ఈప్రదేశమునఁ జెదరియున్న యీధనుస్సును బాణములును, రథపుముక్కలను జూడుము! ఇచ్చటనే యెవరో రాక్షసులు సీతకొఱకై పోట్లాడి, యామెను ముక్కలుగాఁజేసికొని తినివేసియుందురు. ఈధనువును జూడుము! ముత్యములతో నలంకరింపఁబడిన బంగారపువిల్లుసుమా! ఇదివిరిగి పడిపోయినది. ఇదియెవనిదై యుండునో? మఱియు, నూరుయూచలుగల యీగొడుగును జూడుము, దీనిదండము విరిగి ముక్కలుముక్కలుగాఁ బడియున్నది. ఇది యెవనిదైయుండునో? ఈగాడిదలు తమ గుండెలపై, బంగారు కవచములుండగా, నేలంబడి చచ్చినవి. ఇవి భయంకరాకారములు గలిగియున్నవి. జ్వాలలతో

మండుచున్న యగ్నివలెఁ గాంతివంతమై, యుద్ధము గుర్తుగల ధ్వజముతో ముక్కలుగానయియున్న, యీయుద్ధరథ మెవ్వనిదైయుండునోగదా? రథచక్రములకున్న యాకులవలె, బలిష్ఠములైన బాణములు చెదరిపోయి పడియున్నవి. ఇవియు నెవనివైయుండునో? తమ్ముఁడా! ఇటువచ్చి చూడుము! కళ్ళెపుత్రాడులనొకచేతను, గొరడాకఱ్ఱ నొకచేతను బట్టియున్న సారథియును జచ్చిపడియున్నాఁడు, ఇంకను నటు చూడుము. పొడవైన తలపాగాలను, మణిమయమైన కుండలాలను ధరించి, చేతులనున్న చామరము లట్లేయుండఁగాఁ యుండఁగాఁ బడియున్న వీరిద్దరు నెవరివారైయుందురో? ఈగుర్తులన్నియును రాక్షసులవేయని, నీకుఁ దెలియుట లేదా? కావున మనకు నీరాక్షసులతో వైరము నూరురెట్లధికమై నట్లింకను గనుపట్టుచున్నది. సౌమ్యస్వభావముగల, తమ్ముఁడా! కఠినాత్ములై, కామరూపులైన రాక్షసులు, దీనురాలైన నాప్రేయసి, నపహరించి, యుందురు. అట్టిదురవస్థలోనున్న సీతను, ధర్మముగూడఁ గాపాడలేక పోయినది. ("ధర్మోరక్షతి రక్షితః" అన్నసూక్తి యిచ్చటవ్యర్థమై యుండును.)

శ్లో॥ భక్షితాయాంహి వైదేహ్యాం, హృతాయా మపి లక్ష్మణ!
కేహి లోకేఽప్రియంకర్తుం, శక్తాస్సౌమ్య! మహేశ్వరాః?
స. 64, శ్లో॥-53

శ్లో॥ కర్తారమపి లోకానాం, శూరం కరుణ వేదినమ్।
అజ్ఞానా దవమన్యేరన్, సర్వభూతాని లక్ష్మణ !॥
స. 64, శ్లో॥-54

తా॥ ఓలక్ష్మణా ! సీత నపహరించినను, భక్షించినను నీలోకమున, నింతకంటెఁ గష్టముగలిగించు వారెవ్వరుందురు? జగత్తుయొక్క సృష్టి స్థితి లయ కారకుఁడై, శూరుఁడై, దయాస్వరూపుఁడైనవానినిఁ గూడఁగొందఱు నీచజీవులవ మానించుచుందురుసుమా !

మహాత్ముల కపకారముచేయుచున్నామని, సంతోషించుట ధర్మముగాదు. అది తమకే వినాశహేతువని తెలిసికొనుటయే ముఖ్యధర్మము. (పైశ్లోకములు శ్రీరాముఁడు స్వయముగాఁ దాను బరమాత్మననియుఁ బరమాత్మ ధర్మస్వరూపుఁడనియు, నట్టివాని కెవ్వరు నపకారము చేయఁజాలరనియుఁ జెప్పినట్లైనది. సీతాపహరణము రామున కపకారముగాదు. ధర్మబాహ్యులకు, నాశనహేతువని, దీని భావము.)

ఓయీ ! తమ్ముఁడా ! లోకక్షేమమును గోరువాఁడనై యింద్రియనిగ్రహముతోఁ, గరుణాంతరంగుఁడనైన నన్నుఁజూచి దేవతలుగూడ నిర్వీర్యునిగాఁ దలఁచెదరు. నాకున్న సుగుణసంపత్తిఁగూడ దోషముగనే పరిణమించినది. అట్టి యప్రతిష్ఠ రాకుండ, నేనిప్పుడే, రాక్షసులకు ననుకూలమైన

జీవరాశితోఁబాటు రాక్షసులనెల్లరను, నాశము చేయుదును. సూర్యుఁడుదయించి, వెన్నెల మొదలగు సుఖప్రదములైన కాంతుల నపహరించినట్లుగా, నా తేజముగూడ, సర్వవస్తు గుణములను మట్టుపెట్టి ప్రకాశించెను. ఓయీ! ఇంక యక్ష గంధర్వ పిచాచ రాక్షస కిన్నర మనుష్య గణములలో నేయొక్కఁడును సుఖించకుండునుగాక! లక్ష్మణా! నాశస్త్రాస్త్రములతో, నాకాశము, నిరాకాశమై, నిండిపోవుటను జూచుదువుగాక! ముల్లోకసంచారుల కవకాశమే లేకుండఁ జేయుదును. గ్రహములు చలించవు. అగ్నియును వాయువును, నశించఁగా, సూర్యకాంతి మఱుఁగునఁ బడునట్లును, సముద్రములింకిపోవునట్లును, కొండలు పిండియగునట్లును, చెట్లును లతలును, మాడిపోవునట్లును, ముల్లోకములందును గల మహా నగరములు నశించిపోవునట్లును, గాలధర్మము ననుసరించి, వినాశముగలిగించుదును. ఇప్పట్టున సర్వదేవతలును జూచుచుండఁగనే నాసీతావృత్తాంతమును జెప్పి, నాకామెను సమర్పించనిచో, నిప్పుడే వారు నాపరాక్రమమును జూచుదురుగాక! ఓలక్ష్మణా! ఇప్పుడు నాధనుస్సునుండి విడిచిన బాణములచే నాకాశము గప్పఁబడువడును. ఆకారణముగా, నేప్రాణియును, బైకెగురజాలదు. ఈమృగములును, బక్షులును నశించకతప్పదు. జగత్తంతయును దలక్రిందులగును. స్వభావ విరుద్ధముగా, దారుణమైన మార్పుగలుగును. సీతాదేవి కారణముగా, లోకమంతయును బిశాచ రాక్షసులు లేని

దగునుఁ అంతియేగాక దేవదానవ గణముల వారందఱను, నా బాణములచే నశించి పోవుదురు. సీత యెచ్చటనైన నున్నను లేక చనిపోయినను, దేవత లామెస్వరూపమును దీసికొనివచ్చి నాకు జూపవలెను. అట్లుగానిచో నీ చరాచరాత్మకమైన లోకములనే నాశము గావించుదును. అని యీ విధముగాఁ గోపోద్రేకముతోఁ గన్ను లెఱ్ఱఁబడఁ బలుకుచు ధనువును దీసి యెక్కుపెట్టి జిగజిగ మెరయుచు మహాశక్తివంతములైన బాణములను దీసెను. మఱియు శత్రుసంహారకుఁడైన శ్రీరాముఁ డా బాణములను ధనుస్సున సంధించి యిట్లను చున్నాఁడు. తమ్ముఁడా! లోకములోఁ బ్రభుత్వము మృత్యువు కాలము దైవము నేవిధముగా నడ్డుకొనరాని వాఁడనగుదును. మహాసాధ్వియగు సీతను యథారీతిగా నా కప్పగించక పోయినచో నీ సమస్త విశ్వమును నాశము గావించుదును. అని పలికెను.

## శ్రీరాముని శోకము - కోపముగా మారి - విజృంభించుట

శ్రీరామభద్రుఁడు సీతాపహరణ బాధచేఁ దపించి పోయెను. దానితో సమస్తలోక నాశమునకును సిద్ధపడి ధనువు నెక్కువెట్టి బాణములను దొడిగెను. ఇంతకుఁ బూర్వ మెన్నఁడును గని, విని యెఱుఁగనట్టి క్రోధోద్రేకముతో శ్రీరాముఁడు ప్రళయకాల రుద్రునివలెఁ గనఁబడెను. అట్టి

స్థితిలో లక్ష్మణస్వామి యన్న కెదురుగా నిలిచి దోసిలియొగ్గి నమస్కరించుచు నిట్లనియెను. అన్నయ్యా! శాంతించుము! ఇంతవరకును మృదుల స్వభావము గలవాఁడవై యింద్రియముల నారింటిని నిగ్రహించినవాఁడవై యిప్పు డొక్కమారుగా నీ విశ్వము నంతను నాశము చేయఁదలఁచుట దగదు సుమా! శ్రీరామమూర్తీ! చంద్రునియందు నాహ్లాదకరమైన కాంతియును, సూర్యునియందుగల తపన కాంతియును భూమికిఁగల సహన గుణమును ప్రధానములై యున్నవి. నీ యందీ నాలుగు గుణములును గలిగియుండుటతోఁ బాటు చలనము లేని కీర్తియును గలిగియుండుటతోఁ బాటు చలనము లేని కీర్తియును గలిగియున్నది. అన్నా! ఎవఁడో యొక నీచుఁడు చేసిన ఘోరకృత్యమునకు విశ్వమునంతను నశింపఁ జేయుట మంచిదిగాదు. ఇక్కడ నీ విఱిగి పడియున్న రథము మొదలైన వెవనివో? తెలిసికొనుటకుఁ బ్రయత్నించుట మంచిది. ఇది నా యభిప్రాయము. రామచంద్రా! ఈ ప్రదేశమంతయును గాడిదలయొక్క డెక్కల గుర్తులతోడను రక్తపు మరకలతోడను నిండియున్నది. వీనిని జూడఁగా నీ ప్రాంతమున ఘోరయుద్ధము జరిగినట్లు తోచుచున్నది. ఓ రాజవరేణ్యా! ఇక్కడ నొకే వ్యక్తి మరియొక వ్యక్తితో ద్వంద్వయుద్ధము చేసినట్లు గనఁబడుచున్నది. అటు చూడుము! ఈ ప్రదేశమున పెద్దగా సైన్యము లేవియును మసలినట్లు గానరాదు. కావున నో శ్రీరామచంద్రా! ఒకే యొక్క

వ్యక్తి కారణముగా లోకములను నశింపఁ జేయుట తగదు. ధర్మాత్ముఁడైన ప్రభువు నేరమునకుఁ దగినంత శిక్షను మాత్రమే విధించుట న్యాయము. రాఘవేంద్రా! నీవు సర్వలోక రక్షకుఁడవు. నీ భార్యను జంపుట కెవ్వఁడును సమ్మతించఁడు. ఓ కౌసల్యానందవర్ధనా! ఈ నదులును సముద్రములును, పర్వతములును దేవ దానవ గంధర్వాదులును నీకు నపకారము సేయలేదు. రామా! నీ భార్య నపహరించిన వానిని గూర్చి యిందలి కొందఱు మహర్షుల సహాయముతో నదులను, బద్మసరస్సులను గొండగుహలను సముద్రములను వెదకుము. అంతటితోఁబోక దేవగంధర్వాది లోకములను గూడ గాలించుదముఁ అప్పటికిని నీ భార్యను గూర్చిన వృత్తాంతము నెఱిఁగియు నెవ్వరును జెప్పకపోయినచో నప్పుడే వారలను శిక్షించుట ధర్మమగును. కావునఁ బ్రస్తుతము నకు నీవు శాంతించఁ బ్రార్థించుచున్నాను. సచ్ఛీలము, సామోపాయము ననువానిచే శక్తివంచన లేకుండ వెదకి యంతకును బ్రయత్నము నిష్ఫలమైనచో నప్పుడే నీ తీవ్రమైన బాణ ప్రభావమును జూపించవచ్చును.

## శ్రీరాముని కోపోపశమనము

శ్రీరాముఁడు శోకమోహ పరవశుఁడై క్షణకాలము స్పృహఁదప్పియుండఁగా లక్ష్మణస్వామి వెంటనేలేచి, యాతిని నుపశమింపఁ జేయుచుఁ బాదములంబట్టి యిట్టులనియెను.

అన్నా ! మన తండ్రి చేసిన తపస్సు, సత్కర్మలు ననువాని ఫలితముగా, దేవతల కధికముగా నమృతము ప్రాప్తించినట్లు, నీవాయనకుఁ బ్రాప్తించితివి. భరతుఁడు చెప్పినమాటలనుబట్టి నీకల్యాణగుణములనే స్మరించుచు, నీవియోగమును భరింపఁ జాలక మనతండ్రి స్వర్గస్థుఁడయ్యెను. అంతటి మహోన్నత ధైర్యశాలివి నీవే యిట్లు శోకమోహములకు వశుఁడవైనచో సామాన్యునిగతి యేమిగావలెను? అన్నా ! దుఃఖభారమును సహించలేక, నీ తేజో బలంబులఁజూపించి విజృంభించినచో, నీలోకంబుల నెల్లఁగాపాడఁగలవాఁ డెవ్వఁడున్నాఁడు ? రామ చంద్రా ! ధనసంపద ప్రాప్తించుట యన్నది దైవికము, ధర్మ సంపాదన మన్నదిమాత్రము కేవల మానవాధీనము సుమా ! పూర్వము నహుషకుమారుఁడైన యయాతి, తనధార్మి కత్వముచే స్వర్గమును సంపాదించియు, నాత్మశ్లాఘయను పాప కారణముగా వెంటనే తిరిగి, యీ మానవ లోకమునకే పంపఁబడినాఁడు. ('యయాతి' ధర్మపరాయణుఁడైన కారణ ముగా స్వర్గమునుబొందెను. అచ్చట దేవేంద్రుఁ డా యయా తినిజూచి 'ఓయీ ! నీరాజ్యమునఁ బరమధార్మికపరాయణుఁ డెవ్వఁడని యడిగెను. అప్పుడు యయాతి సత్యము చెప్పఁతలఁచి "నేనే" యని తననుదాను బొగడికొనుట కారణముగా నాతనిపుణ్యము లన్నియును నశించినవి. ఆ వెంటనే దేవేం ద్రుఁ డాతనిని మఱల భూలోకమునకుఁ బంపివైచెనని పురాణ

గాథగలదు. దీనిమూలముగా, నాత్మశ్లాఘ, పుణ్యములు నశించుటకును, బరనింద పాపములు సంక్రమించుటకును ముఖ్య కారణములని తెలియుచున్నది") వెండియును వినుము ! మన తాతలనాఁటి నుండియును బురోహితుఁడై, బ్రహ్మర్షియైన, వసిష్ఠుని నూరుగురు కుమారులు నొకేనిమిషమున, విశ్వామిత్రశాపముచే, మరణించినట్లు విందుముగదా! ఇంతయేల? విశ్వమునకెల్లఁ దల్లియు, మహావిష్ణుని భార్యయు, లోకపూజ్యురాలు నగు, భూదేవికిఁ గూడ నొకప్పుడు చలనమున్నది. సత్యప్రతిజ్ఞుఁడవైన యోరామచంద్రా ! సర్వకర్మసాక్షులును, గాలపరిమాణముం దెలియఁజేయుచు జగముల నడిపించువారు నగు, సూర్యచంద్రులకుఁ గూడ, రాహుకేతువుల బాధతప్పుటలేదు. ఓపురుషోత్తమా ! మాంధాత మొదలైన మహారాజులును, వేదములును, బరమాత్మయొక్క యాజ్ఞానుసారముగాఁ బ్రవర్తించ వలసిన వారలైరి. ఓధార్మికాగ్రేసరా ! ఇంద్రాది దేవతలకుఁగూడ, మంచిచెడ్డలవలనఁ గలుగు సుఖదుఃఖములు దప్పుటలేదు. ఓరామచంద్రా ! సీతాదేవి యపహరించఁబడినను, నొకవేళఁ జనిపోవుటయే తటస్థించినను, నల్పజ్ఞునివలె శోకించుట తగదు సుమా ! రామభద్రా ! నీవంటి నిత్యానిత్యవివేక జ్ఞానులైన వారు, లోకముయొక్క యథార్థ స్వరూపము నెఱింగి యెంతటి మహత్కష్టము గలిగినను, జలించక ధీరులై యుందురు. ఓధర్మస్వరూపా ! సుస్థిరమైన బుద్ధిగలిగి, నీవంటి

ప్రాజ్ఞులైనవారు, బాగుగా నాలోచించి, రాఁబోవు శుభాశుభములఁ దెలిసికొని, నిశ్చలాంతరంగులై యుందురు.

శ్లో॥ అదృష్ట గుణదోషాణా మధృతానాంతు కర్మణామ్ ।
నాంతరేణ క్రియాం తేషాం ఫలమిష్టం ప్రవర్తతే ॥
స. 66, శ్లో॥-16

తా॥ పూర్వజన్మలలో మనఃము చేసిన, సుకృతములుగాని, దుష్కృతములుగాని, యిట్టివని యీజన్మలో నిశ్చయించి చెప్పలేము. కాని వానియొక్క ఫలానుభవమునుబట్టి, యాకర్మలయొక్క గుణాగుణములను జెప్పఁగలము. ఏజన్మలోఁ జేసిన దుష్కర్మయైన, ననుభవించుటచే నది నశించును.

ఈజన్మలోఁ గలుగు కష్టసుఖములకుఁ గారణ మెవఁడైన నేదియైనఁ గావచ్చును. కాని ప్రధానకారణము పూర్వజన్మలలో జీవుఁడు చేసిన దుష్కృతమో సుకృతమో యగును ఏవిధమైనదైనను గర్మలు నశించినఁగాని మోక్షము లేదు. ఆ కర్మల ననుభవించినఁగాని నశించవు. కావున జ్ఞానియైనవాఁడు తనకుఁగలిగిన సుఖములకుఁ బొంగిపోక దుఃఖములకుఁ గ్రుంగిపోక, కర్మనాశమున కానందించును. అజ్ఞానియైనవాఁడు సుఖదుఃఖములకు బాహ్యకారణములను దెలిసికొని, మఱింతగాఁ గర్మలఁబెంచి కొనును. మానవుఁడు తనకుఁ గలుగు ద్వంద్వముల కతీతుఁడై, చలించకుండుటయే పరమ ధర్మము.

రామచంద్రా! ఇప్పుడు నేను జెప్పిన ధర్మసూక్ష్మముల నెల్ల నీవే నాకు బోధించితివి. అయినను నీవిట్లుండఁగా నీకు బోధింపఁగలిగినవాఁడు, దేవగురువైన బృహస్పతియే సమర్థుఁడు. ఓ ప్రాజ్ఞశిఖామణీ! నీబుద్ధి విశేషము, దేవతలకుఁ గూడ నసాధ్యమైనది. అయినను నీకుఁగలిగిన భరింపరాని శోకముచే నదికొంత మందగించియుండును. కావున నట్టి నీయొక్క బుద్ధినే, నేను నిమిత్తమాత్రుఁడనై మేల్కొల్పుచున్నాను. ఇక్ష్వాకు కులతిలకా! దేవలోకమున దేవగంధర్వులును, మానవలోకమున గోబ్రాహ్మణులును సాత్వికు లనఁబడుదురు. నీపరాక్రమము సర్వలోక నాశమును గలిగించఁగల దనుట నిర్వివాదము. అట్టియెడ నీశత్రువెవ్వఁడో? నిశ్చయించి కొని, వానిని సర్వనాశముగావించుట యుత్తమ మార్గము. కావున నీ వట్లు గావించుము.

## శ్రీరాముఁడు - జటాయువున - కుత్తమ లోకముల నొసంగుట

శ్లో॥ పూర్వజో ప్యుక్తమార్గస్తు లక్ష్మణేన సుభాషితమ్।
సారగ్రహీ మహాసారం ప్రతిజగ్రాహ రాఘవః.॥

స. 67, శ్లో॥-1

తా॥ శ్రీరాముఁడు తాను బెద్దవాఁడైనను సారమును గ్రాహించు స్వభావముగలవాఁడగుటచే, దనకంటె నన్ని విధములుగను జిన్నవాఁడైన లక్ష్మణుఁడు చెప్పిన, ధర్మ సూక్ష్మములను గ్రహించి శాంతించెను.

"బాలాదపి సుభాషితమ్" అను న్యాయము నను సరించి, బుద్ధిమంతు లెవరేమి హితము చెప్పినను శ్రద్ధతోఁ బాటించుట ధర్మము.

మహాపరాక్రమశాలియైన శ్రీరాముఁడు తనకోపము నుపసంహరించికొని, ధనువునెక్కు-డించి పట్టికొని, లక్ష్మణు నతో నిట్లనుచున్నాఁడు. తమ్ముఁడా! ఇప్పుడు మనమేమి చేయుదము? ఎక్కడకు వెళ్ళుదము? ఏయుపాయముతో సీతను వెదుక నారంభించుదము? అనఁగావిని, లక్ష్మణుఁడిట్లని యెను. రామా! ఈజనస్థానమంతయును రాక్షసులతో నిండి యున్నది. కావున నీదండకారణ్యముననే సీతను వెదకుదము. ఈకొండలన్నియును సామాన్యులకు సంచరించ వీలుగాక, బండరాళ్ళ మధ్యనుండి ప్రవహించు, సెలయేళ్ళతో నిండి నవి. అనేకవిధములైన మృగములతో నీగుహాలు నిండి యున్నవి. ఇందలి కిన్నర గంధర్వాదులు విహరించు స్థలము లను మనము వెదకుదము. నీవుధీరుఁడవై, నాతోఁగలిసి, మహా వాయువునకుఁ జలించనిపర్వతమువలె, చలించని ధైర్యముతోఁ గార్యమును సాధించుము. అనఁగా నాలక్ష్మణుని మాటల నంగీకరించి, శ్రీరాముఁడు తనధనువున నర్ధచంద్ర బాణముం దొడిగి, కోపముతో నావనమెల్లఁ, దిరుఁగాడుచు సీతాదేవిని వెదుకనారంభించెను. అట్లుదిరుఁగుచుండ నొకచోఁ బర్వత శిఖరమువలెనున్న శరీరముగలవాఁడును, దనస్వామిసేవలోనే, శరీరమును విడువసిద్ధముగా నున్నవాఁడును, నెత్తురుతో నిండిన

నేలపై బొరలుచున్నవాఁడునగు, జటాయువు నారామలక్ష్మ ణులు దూరమునుండి చూచిరి. అంత శ్రీరాముఁడు లక్ష్మ ణునిజూచి, "తమ్ముఁడా! వీఁడెవఁడో, రాక్షసుఁడై యుండ వచ్చును. వీఁడే నాసీతను దినివేసినట్లున్నది. వీఁడు గ్రద్ద రూపముతో సీతనుదిని యిచ్చట నారక్తమును బూసికొని పడియుండెనేమో? కావున నాయొక్క వాడియైన బాణ ముతో వీనినిసంహరించుదును. అనిచెప్పుచు, భూమినంతను గడగడలాడించుచు, భయంకరాకారముతోఁ దీవ్రమైన బాణముఁదీసి, కొంచెము ముఁదునకు వెళ్ళెను. ఆగ్రద్దయును నోటినుండి రక్తమునునురుగులను గ్రక్కుచు, దీనమైన మాట లతో నిట్లనియెను. ఓచిరంజీవీ! రామచంద్రా! ఈమహావన మంతయును నొకానొక దివ్యౌషధికొఱకై వెదకుచున్న ట్లుగా, నేసీతకై వెదకుచుంటివో? యామెను నాప్రాణములతో సహా, రావణాసురుఁ డపహరించి కొనిపోయినాఁడు. నీవును లక్ష్మణుఁడునులేని సమయమున, సీతను రావణుఁ డపహరించి కొనిపోవుచుండుటఁ జూచితిని. నేనా సమయమున, సీతాదేవి యొక్క మొఱ్ఱవిని, యామెను విడిపించుటకై, యా రావణు నితో ఘోరముగాఁ బోరాడి వానిరథసారథులను, గాడిదలను జంపి, పడగొట్టితిని. ఆతనితో యుద్ధముచేసిచేసి, యలసి యుండఁగా వాఁడు ఖడ్గమునుగైకొని, నారెక్కలను దెగ నరికి, శరీరమంతను, గాయపరచెను. అంత నేనిచ్చటఁ బడి పోయితిని. వాఁ డాసీతను గొనిపోయెను. అసలే కొన

యూపిరితోనున్న నన్ను నీ బాణముతోఁ జంపకుము. అనగాఁ శ్రీరాముఁ డామాటలను వినుచు, రెఁడింతలు దుఃఖముగల వాఁడై, కంఠమునుండి నీరుగార్చుచు, వెంటనే ధనుస్సుయొక్క యెక్కునుడించి, దగ్గరకుఁబోయి, యాజటాయువును గట్టిగాఁ గౌఁగిలించికొని, లక్ష్మణునితోఁగూడ దుఃఖభారమున మూర్ఛిల్లెను. జటాయువు మిగుల నాయాసముతో నిట్టూర్పు లను విడచుచుండఁగాఁ జూచి, రాముఁడు లక్ష్మణునితో నిట్లనియెను. తమ్ముఁడా! రాజ్యనాశము, వనవాసము, పితృమరణము,సీతావియోగము నను నీదుఃఖాగ్ను లగ్నినైన నశింపఁజేయును. (శ్రీరాముఁడొకప్పుడు "నచాస్య మహతీం లక్ష్మీం, రాజ్యనాశో ఒపకర్షతి,.....వనవాసో మహోదయః" అని, చెప్పినాఁడు. అనఁగా, రాజ్యము లేకపోవుట, వనవాసమును దనకు సంతోషదాయకములే యను యర్థము. ఆరాముఁడే యిప్పు డవ్వానినే దుఃఖదాయకములనుగాఁ జెప్పుట సీతావియోగమునకును, జటాయుమరణమునకును, ప్రాధాన్యమిచ్చి దుఃఖించుచు, మొత్తముగా నన్నిఁటిని, జెప్పెనని మనమూహించవచ్చును.) లక్ష్మణా! నేనిప్పుడు జలపూర్ణసాగరమున మునిగినను, నాతాపము చల్లారునట్లు లేదు. పైగాఁజల్లని యాసముద్రముగూడ నావేడికి నింకి పోవచ్చును. నావంటి దౌర్భాగ్యుఁ డీప్రపంచమునందే యుండఁడుసుమా! నాదురదృష్టము కారణముగా నాతండ్రికిఁ బ్రాణమిత్రుఁడై, నాకుఁ బితృసమానుఁడైన యాగ్రద్దల

రాజుగూడ నేలంబడి మరణించుటకు సిద్ధముగానున్నాఁడు. అని యిట్లు విలపించుచున్న రామునితో లక్ష్మణుఁడును సమానదుఃఖము నందెను. అప్పుడు శ్రీరాముఁడు జటాయువును దండ్రిగా భావించికొనుచు, నాతనిశరీరమును స్పృశించెను. ఱెక్కలుదెగి రక్తసిక్తమైన శరీరముతోఁ బడియున్న జటాయువును గాగిలించికొని "ఓయీ! సీతయెక్కడనున్నది?" యని ప్రశ్నించెను. మఱియు లక్ష్మణునకు జటాయువుం జూపుచు, "తమ్ముఁడా! నాకొఱకై, యీపక్షిరాజు, రావణునితో యుద్ధముచేసి, యాతని ఖడ్గముచేఁ గొట్టఁబడి, నేలంగుమిలిపోయినాఁడు. మరణమునకు సిద్ధముగానున్న యితఁ డేమియును జెప్పలేకపోవుచున్నాఁడు." అనిపలికెను. మఱియు, ఓ జటాయువా! నీకేమాత్రము శక్తియున్నను, నీవు చేసిన యుద్ధమును గూర్చి వివరించుము. రావణుఁడు సీతనేకారణముగా నపహరించినాఁడు? వానికి నే నేమి ద్రోహముచేసితిని? ఓపక్షిరాజా! ఆసమయమున జంద్రబింబమువంటి ముఖముగల సీత యెట్లున్నది? మఱియు నేమని విలపించినది? రావణుని బలమెట్టిది? వాని యాకారమెట్టిది? వాని కర్మయెంతటిది? వాని నివాసమెయ్యది? దయచేసి నాకుఁజెప్పుము. అప్పు డామాటలువిన్న జటాయువు శ్రీరాముని దివ్యమంగళవిగ్రహమును జూచుచు, నాతని దీనత్వమునకు విచారించుచు, శక్తిలేకపోయినను, సన్నని కంఠస్వర

ముతో, నిట్లనియెను. రామా ! నేను ఱెక్కలు దెగి పడిపోయి యుండఁగా, రావణాసురుఁడు సీతాదేవినిగైకొని, దక్షిణ దిశగాఁ బోయినాఁడు. రామా! మరణబాధఁ బడుచున్నాను. నాకన్నులు మూతఁబడుచున్నవి. మాటరాకున్నది. వట్టి వేళ్ళు వ్రేలాడుచున్న బంగారుచెట్లు కనఁబడుచున్నవి. రామా ! రావణుఁడు సీతను గొనిపోయిన ముహూర్తమును బట్టి చూడగా, నామె తనభర్తను స్వల్పకాలములోనే మఱల గలియఁగలదని, తెలియుచున్నది. రావణుఁడు సీతనుగొని పోయినది "వింద" మనెడి ముహూర్తము. ఇది చాలదోషము లతో నిండినది. అందువలన నోడ్డుననున్న చేపను దుడ్డు గఱ్ఱోఁ గొట్టిన నేమగునో, యట్లేరావణుఁడు చావగలఁడు. ఇంక నీవువిచారించకుము. అని మాటలాడుచున్న జటాయువు నకుఁ బ్రాణములు వోవుచుండఁగా, నోటినుండి రక్తమాంస ములువెడలినవి. "ఆరావణుఁడు విశ్రవసుని పుత్త్రుఁడు, కుబే రునిదమ్ముఁడు" అనిచెప్పుచునే కన్నుమూసి, మిన్నకుండెను. అంత రాముఁ డాతనికి నమస్కరించుచు, నింకను, జెప్పుమని కోరుచుండఁగనే యాతఁడు మరణించెను. ఆవిధముగాఁ బడిపోయిన పక్షిరాజుయొక్క శరీరమును జూచి, రాముఁడు లక్ష్మణునితో నిట్లనుచున్నాఁడు. తమ్ముఁడా! పితృసమానుఁ డైన యీపక్షిరాజు, రాక్షసావాసమైన యీదండకారణ్య మునఁ జాలకాలముగడిపి, చివరకు నానిమిత్తముగాఁ దనజీవిత

మునే త్యాగము చేసినాఁడు. కాలమెవ్వనికిని దాటరానిది సుమా! (ఏ కాలమున నేదిజరుగవలయునో, యది యా కాలమున జరిగితీరును. కాలము నడ్డగించువాఁ డెవ్వఁడును లేఁడు. కాలమే దైవమని భావము.) నాయనా! చూచితివిగదా! సీతను రక్షింపఁబోయి, యీతఁడు దుష్టరావణునిచేఁ జంపివేయఁబడినాఁడు. తనయొక్క పక్షిరాజ్యమును విడిచి, నాకొఱకై, ప్రాణత్యాగ మొనర్చినాఁడు. వింటివా? ధార్మికులును, శూరులును బరోపకార పారీణులు నగు వారొక్క మానవులందేగాక, పశుపక్ష్యాదులయందును, నుందురు సుమా! ఈసీతాపహరణ దుఃఖము, నాయొక్కనినేగాక, యీగ్రద్దలరాజును గూడ బాధించి, చంపినది. ఈతని మరణ దుఃఖముకంటె సీతాపహరణ దుఃఖము నన్నెక్కుడుగా బాధించలేదు. శ్రీమంతుఁడై, మహారాజైన నాతండ్రి దశరథుని మరణదుఃఖముతో సమానమై, యాతని మిత్రుఁడైన, యీతని మరణమువలన నేను మిక్కిలి దుఃఖించుచున్నాను. ఓయీ! నీవువెళ్ళి యెండుకట్టెలనుగొట్టి, తీసికొనిరమ్ము! ఈతనికి, నాతండ్రికింబోలె, నగ్నిసంస్కారమును జేయుదును. యథావిధిగా, వేదమంత్రములతో నితనిశరీరమున కగ్నిసంస్కార మొనరించుదును. అనఁగా లక్ష్మణుఁడును సమానదుఃఖముగలవాఁడై, తక్షణమే యెండుకట్టెలను దెచ్చి, చితినిచేర్చెను. అప్పుడా కఱ్ఱలనుమథించి, యగ్నిని బుట్టించి, దానితో జటాయువుయొక్క శరీరమును దహనము

గావించెను అట్లుదహనమగుచున్న జటాయువుని జూచి, శ్రీరాముఁడిట్లనుచున్నాఁడు. ఉత్తమోత్తమవంశమున జన్మించిన యోపక్షిరాజా! మహాయజ్ఞములను గావించిన, యాహితాగ్నికిని, బంచాగ్నిమధ్యముననిలిచి మహాతపస్సును జేసినవానికిని, సర్వసంగపరిత్యాగులై జ్ఞానులైన సన్యాసులకును, నైహికభోగభ్యాములనువిడిచి, నైష్ఠికుల నఁబడువారికిని. నెట్టియుత్తమలోకములుగలుగునో, నీకును నట్టియుత్తమలోకములు, గలుగుగాక! ఇదినాయాజ్ఞ. నీకుఁ బునర్జన్మలేదు. మఱలనీజననమరణములులేని హాయిగా సుఖము ననుభవించుము! ఇందలివిశేషము "(గచ్ఛ! లోకాననుత్తమాన్...." అనియాజ్ఞాపించుట కొకఁ- పరమాత్మకుఁ దక్క- మానవమాత్రున కధికారములేదు. ఇచ్చట రాముఁడే పరమాత్మయని వాల్మీకి నిగూఢముగాఁ జెప్పెను.) ఇట్టియెడ సామాన్యమానవుఁడు నీమాటలనేపలుకవచ్చును. కాని యాజ్ఞాపించలేఁడుగదా! నృసింహపురాణమున "మత్కృతే నిధనంయస్మాత్, త్వయాప్రాప్తం ద్విజోత్తమ! తస్మాన్మమప్రసాదేన విష్ణులోక మవాప్స్యసి" అనియుఁ జెప్పఁబడినది. ఈజగన్నాటకరంగమున మానవపాత్రను ధరించిన, పరమాత్మ, దుష్టసంహారము, శిష్టరక్షణము ననువానితోఁబాటు, వర్ణాశ్రమాదులయందలి ధర్మములను నిలుపుటకై, తాను నిజమైన మానవత్వము నాచరణరూపమునఁ జూపి, యాదర్శమైయుండుట యిందలివిశేషము. అందువలననే, శ్రీరాముని

(పరమాత్మ తత్త్వమంతర్భూతమై యుండునట్లు మహర్షియైన వాల్మీకి రామాయణ మహాకావ్యమును జగత్కల్యాణమును గోరి రచించెను.)

అని యీవిధముగాఁబలికి శ్రీరాముఁడు జటాయువున కు నుత్తమలోకములఁ బ్రసాదించి, తరువాత లక్ష్మణునితో గోదావరీనదికి వెళ్ళుచు, నొకసింహమునుజంపి, దానిమాంస ముతో, జటాయువు నుద్దేశించి, దర్భలపై నామాంసపిండ ములనుంచి, యథావిధిగా, శ్రాద్ధకర్మ నాచరించెను. మానవు లకుఁ దమకుమారు లాచరించినట్లుగా, జటాయువునకు శ్రీరాముఁ డుత్తరక్రియల నాచరించెను.

శ్లో॥ తతో గోదావరీంగత్వా, నదీం నరవరాత్మజౌ ।
ఉదకం చక్రతు స్తస్మై గృధ్రరాజాయ తావుభౌ॥

స. 68, శ్లో॥-35

తా॥ శ్రీరామలక్ష్మణు లుభయులును, నదీతీరమున జటాయువునకుఁ బిండప్రదానము చేసి, యానదిలో వారు స్నానములు చేసి, తర్పణములను విడిచిరి.

జటాయువు పక్షియైనను, సకలధర్మముల నెఱింగిన యుత్తమజాతి మానవునికైను జ్ఞానాధిక్యతఁ గలదగుటచేఁ, బరమాత్మయైన శ్రీరాముని సన్నిధిని బ్రాణత్యాగమొనర్చిన దగుటచేతను, వేదోక్తమైన యుత్తరక్రియల నందుట ధర్మమే. మానవులలోఁ గూడనంతటి సుగుణసంపత్తిగలిగి,

త్యాగశీలుఁ డేకులమువాఁడైనను వేదోక్తకర్మకర్హుఁడేయని, శ్రీరాముఁడు ధర్మము సీమూలముగాఁ దెలియఁజేసినాఁ డనవలెను.

ఆగృధ్రరాజు, సామాన్యులకు లభ్యముగాని, వేదోక్తకర్మల నందుకొని, మహర్షులకు సాటివచ్చు నాతఁడు సాక్షాత్తుగా శ్రీరామునిచే సంస్కారాదులను బొంది, జన్మ రాహిత్యమును బడసెను. ఆరామలక్ష్మణులు, విష్ణువు నింద్రుఁడునుంబలె నాజటాయువునకుఁ బ్రేతసంస్కార తర్ప ణాదుల నొసంగిరి. తరువాత నాతనిమాటలయందు, విశ్వాస ముంచి, సీతాదేవిని వెదుకుటకై, ముందుపశ్చిమదిశగానున్న యరణ్యముల కేగిరి.

## శ్రీరామలక్ష్మణులు కబంధునకుఁ జిక్కుట

రామలక్ష్మణు లాయరణ్యమునఁ గొంతదూరమరిగి, యచటనుండి, ధనుర్బాణములను ధరించి, దక్షిణదిశగాఁ బోయిరి. ధీరులైన యాసోదరు లిద్దరును, పెద్దపెద్దవెదురు మొదలైనపొదలతోడను, మహావృక్షములతోడను గిక్కిరిసి, యడుగుపెట్ట శక్యముగాని, యామహారణ్యమును వేగముగా దాటివెళ్ళిరి. ఆపైని సింహశార్దూలాది క్రూరమృగములతో నిండిన యరణ్యమును, మూఁడుక్రోసులదూరము దాటివెళ్ళి, క్రౌంచారణ్యమును బ్రవేశించిరి. ఆయడవి, యనేకవర్ణములు గల మహామేఘసముదాయమువలె, ఫలపుష్పభరితమై, వివి

ధములైన పక్షిసముదాయములతోఁగూడి, నానావిధములైన క్రూరమృగ సర్పములతో నిండియున్నది. వారావనమంతయును దిరుఁగుచు, నక్కడక్కడ విశ్రాంతిఁ గైకొనుచు, సీతాదేవిని, వెదుకనారంభించిరి. తరువాత శ్రీరామలక్ష్మణులాక్రౌంచారణ్యమునుదాటి, మూఁడుక్రోసులునడచి, మహాభయంకరమైన యొకానొక యరణ్యమును బ్రవేశించిరి. అందువారు, పాతాళమువలె నంతుపట్టని యొకగుహను జూచిరి. ఆగుహాకు దగ్గరగా, నొకానొక మహాకాయముగల రక్కసిని జూచిరి. ఆమె యెంతటి బలముగలవారికైనను భీకరమై యున్నది. అసహ్యమైన రూపముగలది. చింతనిప్పుల వలెనున్న కన్నులును, వ్రేలాడుపొట్టయును, వాడియైన, కోరలును, మోటై బరువెక్కిన చర్మమునుగలిగి, పొడవై యున్నది. అదితలవిరియఁ బోసికొని, భయంకర మృగముల నవలీలఁగాఁబట్టి తినుచుండఁగా, రామలక్ష్మణు లాజుగుప్సాకరమైన స్త్రీమూర్తిని జూచిరి. ఆరాక్షసియు నన్నగారికి ముందుండి నడచుచున్న లక్ష్మణునిజూచి, "ఓయీ! అందగాఁడా! రమ్ము! మనమిచట రమించుదము." అనుచు నాతని జేయివట్టినది. మఱియు నాతని గాఁగిలించికొని, మన మీసుందరారణ్యములో జీవితమంతయును సుఖించుదము. ఓప్రియుఁడా! రమ్ము! అనియెను. మఱియు, నామె, "నాపేరుఁఅయోముఖి. నీయదృష్టవశమున నేనును, నాయదృష్టవశమున నీవును బరస్పరముం గలిసికొంటిమి." అనఁగా

విని, లక్ష్మణస్వామి, యామెనుండి విడివడి, కోపముతో ఖడ్గమునుదీసి, యామెయొక్క ముక్కును జెవులను స్తనములను గోసివైచెను. దానితో నారాక్షసి, యేడ్చుచు, వచ్చిన దారినే పరువెత్తి వెళ్ళిపోయెను. తరువాత నాసోదరులిరువురును, దమవీరత్వముంజూపుచు, నాయరణ్యమున సీతనువెదకుచుండిరి. అట్లుదిరుఁగుచుఁ గొన్ని దుశ్శకునములనుగూడఁ గనిరి. అంత లక్ష్మణుఁడు శ్రీరామునిజూచి, అన్నా! నాయెడమ బుజమదురుచున్నది. నామనస్సుగూడ దీనముగానున్నది. మఱియు ననేక దుశ్శకునములను గనుచున్నాను. కావున నోరామభద్రా! నీవు సర్వసన్నద్ధుఁడవై యుండుము. నేనుజెప్పెడి హితము నాచరించుము. ఈదుశ్శకునములు మనకేదో యుపద్రవమునకు దారితీయఁగలవు. అయిన నీమహాభయంకరమగు 'వంజుళకమ'ను పక్షియొక్క యరపునుబట్టి, మనకు విజయము దప్పదని తెలియుచున్నది.'' అని చెప్పుచు, నామహారణ్యమున నాసోదరులిరువురును దిరుఁగుచుండఁగా, నాయరణ్యమధ్యమునుండి, ఝంఝామారుతమువంటి పెద్దశబ్దము వినఁబడినది. వారాశబ్ద మెందుండివచ్చుచున్నదా? యని తెలిసికొనఁగోరి, యటునిటు దిరుఁగుచుండఁగా, నొకచోట మహాకాయుఁడై, పెద్దకడుపుగల రాక్షసుని జూచిరి. వానికిఁదలయు మొండెమును లేక పొట్టయందే పెద్దనోరుగలిగియుండెను. అట్టి రాక్షసునికడకు నారామలక్ష్మణులు వెడలిరి. వానిశరీరమందంతటను దట్టమై

మోఁపైన రోమములున్నవి. అతఁడొక పర్వతమువలెను, మహామేఘమువలె నుండి, పెద్దగా నరచుచుండెను. వాని వక్షస్థలమందలి నుదురుభాగమున, విశాలమై, యగ్నిజ్వాలలం గ్రక్కుచున్నట్లు, నేత్రముగలదు. మఱియు నాకడుపు నందే, పెద్దపెద్దకోఱలుగల గుహావంటిపెద్ద నోరుగలదు. దానినుండి, పైకివెడలు నాలుకతోఁ బెదవులను జప్పరించుచు నాకుచునుండెను. ఇంతకు నీతని భుజములు, యోజనదూరము వరకును వ్యాపించియుండఁగా, నామధ్యలోఁగల భయంకర మృగములనుబట్టి, దగ్గరకుఁ దీసికొని తినివేయుచుండును. మఱల నాభుజములను జూచికొనియుండును. వాఁడు తన చేతులను బైకిని గ్రిందికి నాడించుచుఁ దగిలిన మృగములను గాని పక్షులనుగాని పట్టికొని తినివేయుచుండును. అట్టివాఁడు శ్రీరామలక్ష్మణులు వచ్చుచున్న దారికడ్డముగాఁ బడి యుండెను. ఆసోదరులు వానిని క్రోశమాత్రదూరమునుండి చూచిరి. అప్పటికే యారాక్షసుని చేతులకుఁ జిక్కి ముందునకు లాగఁబడుచుండిరి. ఆవిధముగా నారాక్షసున కనతి దూరములో నున్న రామలక్ష్మణులు, ధనుర్బాణములను ఖడ్గములను ధరించి యుండిరి. మహాశూరుఁడైన రాముఁడు మాత్రము చలించలేదు. చిన్నవాఁడగుటచే లక్ష్మణుఁడు కొంచెము భయపడెను. అప్పుడు లక్ష్మణుఁ డన్ననుజూచి "రామా! నేను వీనికివశుఁడనై పోయితిని. నన్ను వీని కప్పగించి, నీవైనను బ్రతికి బయటపడుము. నీవు స్వల్పకాలము

లోనే, సీతాదేవిని బొందఁగలవని నమ్ముచున్నాను. అన్నా! నీవు సీతాదేవితోఁగూడి, యయోధ్యకేగి, రాజ్యపాలనఁ జేయుచుండఁగా నప్పుడప్పుడు నన్నుస్మరించుచుండుము. ఆమాటలువిని శ్రీరాముఁడు తమ్ముఁడా! భయపడకుము. నీవంటి వీరు లీమాత్రమున కింతగా, బాధపడరు. అనఁగా, నామధ్యలో నారాక్షసుఁడు శ్రీరామలక్ష్మణులనుజూచి యిట్లుప్రశ్నించెను. "ఓవీరులారా! ఈఘోరారణ్యమున, విల్లంబులను, ఖడ్గములను ధరించి, తిరుగాడుచున్న మీరెవరు? మీకిక్కడ నేమి పనియున్నది? నేనిప్పు డాకలితో నున్న సమయమున మీరునాకు లభించిరి. మీరెంతటి మహావీరులై మఱెంతటి యాయుధములను ధరించినవారై నను నాచేఁజిక్కి విడిపించికొనఁజాలరు, అని యాదుర్మార్గుడైన రాక్షసుఁడు వలుకఁగావిని, శ్రీరాముఁడును గొంతధైర్యము సడలి నోరెండిపోగా, లక్ష్మణునితో నిట్లనుచున్నాఁడు. తమ్ముఁడా! మనకు విపత్తులు పరంపరలుగా వచ్చుచున్నవి. తుదకిప్రాణవినాశకరమైన విపత్తు సంభవించినది. నాయనా! కాల మెంతటి ప్రభావముగలదో చూచితివా? ఒకదానిని మించి మఱియొకటిగాఁ గష్టములే మనకుఁ గలుగుచుండుట, కాలమహిమయేసుమా! ఈకాలమునకు, లేక కాలస్వరూపుఁడైన భగవంతునకు, సర్వజీవులందును, దనబలమును జూపుటలో, నెదురులేని శక్తియున్నదిసుమా! మన మెన్నికష్ట

ముల ననుభవించుచున్నామో ? యుద్ధరంగమున మహాపరాక్రమవంతులును, మహాశూరులును, శస్త్రాస్త్రవిద్యలం దారితేరినవారును, నిసుకతోఁ గట్టబడినగట్లు నదీప్రవాహమునకుఁ బడిపోయినట్లు, చనిపోవుచుందురు. అనిపలుకుచున్న శ్రీరాముఁడు చివరకొక నిశ్చయమునకువచ్చి, ధైర్యస్థైర్యములు గలవాఁడయ్యెను.

శ్లో॥ ఏవ ముక్తస్తు కుపితః, ఖడ్గ ముద్ధృత్య లక్ష్మణః ।
కర్ణనాసే స్తనౌచాస్యాః, విచకర్తా రిసూదనః ॥
స. 69, శ్లో॥-17

(అయోముఖిని దరిమివేసిన సందర్భములోనిది)

తా॥ అయోముఖి, లక్ష్మణుని వలచి, చేయివట్టి రమ్మని కోరగాఁ గోపించిన లక్ష్మణుఁడు ఖడ్గమునుదీసి, యామెయొక్క ముక్కును జెవులను స్తనములను గోసి, వేయఁగా, నామె గోలుగోలున నేడ్చుచుఁ బోయినది.

కామినులైనస్త్రీలు చంపఁదగినంత ఘోరనేరములు చేసినను, వారిని జంపరాదు. కురూపిణులను జేసి విడుచుట ధర్మము.

(ఆనాఁడు శ్రీరాముని జంపుటకువచ్చిన తాటకినిగూడ, ముందుగాఁదన బాణములతో ముక్కును జెవులను గోసివైచెను. అంతకునాగక, యారాక్షసి మీఁదికిరాగా, సర్వులను నాశము

చేయు స్త్రీని జంపుటలో, దోషములేదని విశ్వామిత్రుఁడు చెప్పినందున, దానిం జంపెను. అదియును దండ్రియాజ్ఞగా భావించి, విశ్వామిత్రునిమాటను బాటించి చేసెను. అట్లే శూర్పణఖనుగూడ, లక్ష్మణునిచే, ముక్కును జెవులను గోయించి, పంపివైచెను. కావున రామలక్ష్మణులు చేసినది ధర్మమేయనవలెను )

## కబంధుఁడు శాపవిముక్తుఁడై - రామునకు హితముచెప్పుట

ఆ రాక్షసుఁడు తన బాహుపాశముల చేబద్ధులై యున్న రామలక్ష్మణులతో నిట్లనుచున్నాఁడు. ఓ క్షత్రియ బాలకులారా! నాయాకలిఁ దీర్చుటకు,మిమ్ముల, నాదైవమే యిట్లు పంపినాఁడు. నేనాకలితో బాధపడుచుండఁగా, మీరేమో మాటలాడికొనుచు నిలిచితిరేల? మీప్రాణములపై నాశ విడువుఁడు. అనిపలుకఁగా, నామాటలువిన్న లక్ష్మణుఁడు రామునిజూచి, 'అన్నా! ఈసమయమునఁ బరాక్రమమును జూపుటయే మంచిది. ఈరాక్షసుఁడు మనల నిప్పుడే మ్రింగఁ గలడు. కావున వీనికాధారభూతములైన వీనిబాహువులను, దెగనరికి బయటఁబడుదము. ఈభయంకర రాక్షసుఁడు లోకమందఱితోఁ బాటు మనలనుగూడఁ జంపి తినఁగోరుచున్నాఁడు. వీనికిఁ బ్రతీకారము చేయలేనివారిని, యాగమునకుం దెచ్చి, విడిచిన, పశువునువలె విడువరాదు. అనఁగా

నామాటలను వినుచున్న యారాక్షసుఁడు పెద్దగానోరు దెఱచి, వారిని మ్రింగఁదలఁచెను. ఆసమయమున దేశకాలజ్ఞులైన రామలక్ష్మణులు వానిబాహువులను జెరియొకదానింబట్టి ఖడ్గములతో నరికివైచిరి. అందు శ్రీరాముఁడు, కుడిబుజమును, లక్ష్మణుఁ డెడమబుజమును నరికిరి. వాఁడాబుజములు పడిపోగా భూమ్యాకాశములు దద్దరిల్లునట్లుగా, నరచుచు నేలంగూలిపోయెను. వాఁడట్లు నేలంబడి, విలవిలఁదన్నికొనుచు, రామలక్ష్మణులంజూచి, యిట్లడుగుచున్నాఁడు. "రాజకుమారులవలెనున్న మీరెవరు? ఈయరణ్యములకేలవచ్చిరి?' అనఁగా, లక్ష్మణుఁడు శ్రీరామునిగూర్చి ప్రశంసించుచు నిట్లనియెను. ఇతఁ డిక్ష్వాకువంశీయుఁడైన శ్రీరాముఁడు. నేనీతనితమ్ముఁడను. నన్నులక్ష్మణుఁడందురు. దేవతాప్రభావముగల యీతఁడు తనభార్యతోడను, నాతోడనుగలిసి, దండకారణ్యములందు నివసించియుండఁగా నీతని భార్య యపహరింపఁబడినది. ఆమెను వెదకుచు నీయరణ్యములందుఁ దిరుగుచుంటిమి. ఇఁక నీవెవ్వఁడవు? ఈయడవిలోఁ దలయును బిక్కలును లేక యీమొండెముతో నేలఁబడి యుంటివి ? నోరును పొట్టయును భుజములును మాత్రమే గలిగి యేలనిట్టివికృతాకారమును ధరించియుంటివి? అనఁగా నాతఁడు పూర్వము తనకింద్రుఁడు చెప్పినమాటలను జ్ఞప్తికిఁ దెచ్చికొని యిట్లనుచున్నాఁడు. ఓపురుషోత్తములారా! మీకిదే స్వాగతము. నాభాగ్యవశమున నింతకాలమున

కిప్పుడు మిమ్ములను జూడఁగలిగితిని. అంతమాత్రమే గాక నా బాహువులుగూడ నదృష్టవశమున మీచే నరుకఁబడినవి. నాచరిత్ర నున్నదియున్నట్లుగాఁ దెలిపెదను వినుఁడు.

## కబంధునిచరిత్ర - శాపవిముక్తి

మహాబల పరాక్రమ సంపన్నుఁడవైన యో శ్రీరామ చంద్రా! నా పేరు కబంధుఁడు. ఒకప్పుడు ముల్లోకములవారికి నాశ్చర్యముగలిగించు మహాబలముగలిగి, యుండెడివాఁడను. అట్టి మహత్తర తేజోవిరాజమానమైన రూపమును మరుగు పరచి, భయంకర రాక్షసాకారముతో, నక్కడక్కడనుండు, మహర్షులను భయపెట్టుచుఁ దిరుగుచుంటిని. అట్లుండఁగా, నొకనాఁడు స్థూలశిరుఁడను పేరుగలమహర్షి, దర్భలను, సమిధలను, ఫలమూలాదులను సేకరించికొనుటకై, యడవిలోఁ దిరుగుచుండఁగా, నేనాతనిని భయపెట్టితిని. అంత నామహర్షి, 'క్రూరమై, నింద్యమైన, యీరూపమే నీకుస్థిర మగునుగాక!" యని శపించెను. తీవ్రకోపముతో నున్నయా మహర్షియొక్క పాదములపైఁబడి, నాశాపాంతము నను గ్రహించుమని ప్రార్థించితిని. అప్పుడాత డిట్లనియెను. ఓరీ! నీచుఁడా! ఈనిర్జనారణ్యమునకు శ్రీరాముఁడువచ్చి నీ బాహువులను దెగఁగొట్టును. దానితో నీకుశాపవిముక్తి గలిగి, యథారీతిగా, నీ తేజోవంతమైన దేహమును బొందఁ గలవు." అనికరుణించెను. శ్రీరామభద్రా! ఇఁకను వినుము!

నేను దనువంశీయుఁడైన శ్రీ'యనువాని పుత్త్రుఁడను' రాక్షస రూపముతోనున్న నేనొకప్పు డింద్రుని కోపమునకుగురినై, యిట్టివికృతరూపము నందితిని. నేను మహోగ్ర తపస్సుచే బ్రహ్మను మెప్పించితిని. ఆబ్రహ్మనన్ను 'దీర్ఘాయుష్మంతుఁడవు' గమ్మనివరమిచ్చెను. దానితో నాగర్వముమిన్నుముట్టినది. ఇంక నన్నింద్రుఁడేమి చేయఁగలఁడని యహంకరించి, యాతనిపై, యుద్ధమునకుఁ బోయితిని. ఆతఁడును దనవజ్రాయుధమును బ్రయోగించఁగా, నది నన్ను జంపలేకపోయినది. కాని, నాతొడలను శిరస్సును, బొట్టలోనికిఁ బోవునట్లుగా నణఁచి వైచినది. అప్పుడు నేను దీనుఁడనై, 'యో దేవేంద్రా! ఈ రూపముతోనున్న నాకాహార మెట్లులభించును? ఆహారము లేక నేనెట్లుసుఖించఁగలను?' అనిప్రార్థించితిని. నాప్రార్థనకుఁ గరుణించిన దేవేంద్రుఁడు, యోజనదూరము వ్యాపించఁగల చేతులను, బొట్టపైననే, పెద్దకోఱలతోఁగూడిన నోరును గలుగునట్లు ప్రసాదించెను. ఆనాఁటినుండియును, నేనెక్కడకును దిరుగలేకపోయినను, ఈచేతులనుజాచి, సింహవ్యాఘ్రాది మృగములంబట్టి, దగ్గరకుఁ దీసికొని, తినుచుందును. మఱియు నింద్రుఁడు నన్నుజూచి, జాలిపడి, "ఓరీ! రామలక్ష్మణులెప్పుడు నీబాహువులను నరికివేయుదురో, యప్పుడే నీవు దివ్యదేహముతో స్వర్గమును బొందఁగలవు. అనియుఁ బలికెను. ఓరామా! ఈవనమందు నాచేతికిఁ జిక్కిన జీవులనెల్లఁ బట్టఁగోరియుంటిని. ఎప్పటికైన రామలక్ష్మణులు నాకుఁజిక్క

కుందురా? యను నాసతోఁ గాలముగడుపుచుంటిని. నీవా 'స్థూలశిర' మహర్షి చెప్పిన రాముఁడవే. లేకన్నొకఁడు నా బాహువులను, దెగఁగొట్టలేఁడు. ఓ శ్రీరామచంద్ర ప్రభూ! నీకిదే నానమస్కారము. మీరుభయులును, నాశరీరమున కగ్నిసంస్కారము చేయుఁడు. నేను దివ్య రూపమునంది మీ ప్రయత్నములు సఫలమగునట్టి యుపాయ మును జెప్పి, మీకుపకరించి, మీఋణము దీర్చికొందును. అనిపలికెను. శ్రీరాముఁ డాకబంధుని చరిత్రవిని, లక్ష్మణుఁడు వినుచుండఁగా నిట్లనియెను. ఓయీ! కబంధా! వినుము! నేనునాతమ్మునితోఁ బర్ణశాలలో లేనిసమయమును గనిపెట్టి, రావణుఁడు నాభార్య నపహరించికొనిపోయినాఁడు. ఆమాయారాక్షసుని పేరుమాత్రమువింటిని. కాని వాని రూపమెట్టిదో, బలమెంతటిదో, నివాసమేదో, వివరము మాకుఁ దెలియదు. చూడలేదు. వినలేదు. మేమామెను వెదకుచు నీయరణ్యములలో దుఃఖపీడితులమై తిరుగు చుంటిమి. మేము పరుల కుపకారమునే జేయుదుముకాని, యపకారమును మనస్సునందైనఁ దలపోయము. ఏదిక్కును దోఁచక తిరుగుచున్న మాకు, నీశక్తివంచనలేకుండ నుప కారముచేయుము. ఓయీ! నీవుకోరినట్లుగా నిచ్చటనే గొయ్యితీసి యెండుకట్టెలనుదెచ్చి, యాగోతిలో నిన్నుంచి, నీశరీరమునకు దహనసంస్కారమును జేయఁగలము. నీకుఁ దెలిసినంతవరకును నాభార్యయైన సీత నెవఁడపహరించెనో చె?

యెందుంచెనో? దయతోఁజెప్పుము. ఆసంగతియే మాకా
నందము గలిగించఁగలదు. తరువాత నీవు స్వర్గమునకుఁ బోవ
చ్చును. అనఁగావిని కబంధుఁడిట్లనెను. రామచంద్రా! ఈశరీర
ముతో నీవనమందెక్కడ నేదియున్నను, నాచేతులతో,
గ్రహించి, తినుచు, నెప్పటికైన నీవునాకుఁ జిక్కకపోదువా?
యని కొండంత యాశతో నుంటిని. కావున నిప్పుడీబుద్ధి
యీశరీరమును జోషించికొనుటయందే హెచ్చుగాఁ బ్రవ
ర్తించుచున్నది. అందుచే నాయీశరీరముండగా నేవిష
యమునైనను జెప్పలేను. ముందుగా నాయీశరీరమును
గాల్చివేయుము. తరువాత నాదివ్యదేహముతో నీకు హిత
మును గలగించు నుపాయవాక్యములను జెప్పఁగలను. నాక
ప్పుడే దివ్యజ్ఞానముకలుగును. మహర్షి యొక్క శాపప్రభావ
ముచే, నాకున్న దివ్యజ్ఞానము నశించినది. కావున సూర్యా
స్తమయమగు లోపల యీనాశరీరమును గాల్చివేయుము.
నేనప్పుడు నీవెవనితోఁ జెలిమిచేయవలెనో, చెప్పుదును,
అతఁడునీకు సర్వవిధములను, సహాయపడఁగలఁడు. అతనికీ
ముల్లోకములందును, దెలియనిదియుండదు. అనికబంధుఁడు
పలికెను.

## కార్య సాఫల్యమునకుఁ - గబంధుఁడు చెప్పిన యుపాయము

కబంధుని మాటలనువిన్న రామలక్ష్మణు లాతని
దేహము నాప్రాంతమునఁ బల్లముగానున్న ప్రదేశమునఁ

బడవైచి, కట్టెలం దెచ్చి, నిప్పునంటించిరి. లక్ష్మణుం డాకట్టెల మధ్య ఆకబంధశరీరము గాలిపోవునట్లు రగుల్కొలిపెను. అట్లుగా నాశరీరము మెల్లమెల్లఁగా, దహింపఁబడెను. దహనముపూర్తికాగానే యాయగ్నిజ్వాలల మధ్యనుండి, యాతఁడు ప్రజ్వలించుచున్న దివ్యదేహముతో దివ్యమాల్య వస్త్రాభరణ భూషితుఁడై, బయటకువచ్చెను. అంతట నాకాశమునుండి, హంసలచే మోయఁబడుచున్న దివ్యవిమానమురాగా, దానిపై నాకబంధుఁడుగూర్చొని యంతరిక్షమున నిలిచి, శ్రీరామునితో నిట్లనియెను. రామా. నీవు సీతనుబొందఁగల యుపాయమును జెప్పుచున్నాను! వినుము ! లోకములో సంధి, విగ్రహ, యాన, సన, ద్వైధీభావ, సమాశ్రయములని, యారువిధములైన యుపాయములున్నవి. వానినెఱింగిన రాజులు తమకార్యములను సునాయాసముగా, నెరవేర్చికొందురు. రామా । ఎంతటివానికైనను దుర్దశ ప్రాప్తించినప్పుడు కష్టముల ననుభవింపక తప్పదు. అట్టి కష్టకాలములో నుత్తమమిత్రుని సంపాదించి కొన్నచోఁ గొంతమనస్తాపము శాంతించును. ప్రస్తుతము, నీతమ్మునితోఁగూడి నీవుపడరాని కష్టములఁబడుచుంటివి. ఇప్పుడు నీకుభార్యాపహరణ రూపకమైన క్లేశముగలిగినది. ఓయీ ! రాఘవా! ఇట్టిదుర్దశలో నీతోసమానుడైన మిత్రునిద్వారా, నీకార్యము నెరవేరఁగలదని, నాకుఁదోఁచు

చున్నది. అదియును, వినుము ! సుగ్రీవుఁ డనువాఁడు తన యన్నచేఁ దరుమఁబడి, తనభార్యను గలియలేక దుఃఖించుచున్నాఁడు. ఇంద్రపుత్త్రుఁడైన వాలి యను వాఁడాతనియన్నగారు. ఆసుగ్రీవుఁడు ఋశ్యమూక పర్వతముపైఁ దన సహచరులైన నలుగురు వానరులతో నివసించియున్నాఁడు. ఆకొండ పంపానదీ తీరమునఁగలదు. ఆసుగ్రీవుఁడు మహావీరుఁడు. అంతులేని ప్రభావముగలవాఁడు. సత్యసంధుఁడు. వినయవిధేయతలు గలవాఁడు. మఱియు, ధైర్యస్థైర్యములు గలిగిన మహామేధావి. సర్వసమర్థుఁడు. తేజోవంతుఁడు. రాజ్యము కారణముగా వాలి తనతమ్ముని దరిమివేసెను. అట్టి సుగ్రీవుఁడు నీకుమిత్రుఁడై, సీతాన్వేషణాది కార్యములందు, సహాయుఁడుగాఁగలఁడు. ఇంక నీవు శోకమును విడువుము.

శ్లో॥ భవితవ్యంహి యచ్చాపి, నతచ్ఛక్య మిహాన్యథా ।
కర్తు మిక్ష్వాకుశార్దూల !, కాలోహి దురతిక్రమః ॥

స. 72, శ్లో॥-16

తా॥ ఓయిక్ష్వాకుకులతిలకా ! ఏదియెట్లు జరుగవలసియున్నదో, యదియట్లే జరిగితీరును. దానిందప్పింప నెవనికిని సాధ్యముగాదు. కాలప్రభావమునకు వ్యతిరేకముగా నెవ్వఁడును సాధించలేఁడుసుమా !

శుభాశుభ ఫలప్రాప్తికిఁ గాలమే కారణము. ఇందు మానవునిపాత్ర నిమిత్తమాత్రము. కావున, ధీశాలి సుఖ

దుఃఖప్రాప్తియందుఁ బొందుటగాని కృంగుటగాని ధర్మము గాదు. ఇందులకు నిమిత్తమాత్ర కారకులైనవారిని బొగడుటగాని, దెగడుటగాని ధర్మముగాదు.

కావున నో శ్రీరామచంద్రా! నీవిక్కడనుండి, మహాబలుఁడగు సుగ్రీవునివద్దకు వెళ్ళి, పరస్పరోపకారముల నొనర్చికొనుట కగ్నిసాక్షిగా మైత్రిని బాటించుము. అతఁడు కామరూపుఁడు. నీకు సర్వదా, కృతజ్ఞుఁడై యుండును. ముందుగా నీసహాయమును గోరును. అంతమాత్రమున నప్రయోజకుఁడు గాఁడుసుమా! మీసోదరు లుభయులు నాతనికార్యమును నెరవేర్పఁగలరు. ఒకప్పుడు దైవవశమున నాతనికార్యము నెరవేరకపోయినను మీకార్యమునకు భంగము రానీయక నెరవేర్పఁగలఁడు. ఆసుగ్రీవుఁడు ఋక్షరజసుని పుత్త్రుఁడు. వాలికిని, నీతనికి నొకేతల్లియగుటచే. సోదరులైరి. ఆసుగ్రీవుఁడు వాలివలన భయముతోఁ బంపానదీతీరమునఁ దిరుగుచున్నాఁడు. రామభద్రా! నీవుతొందరగావెళ్ళి నీవు సుగ్రీవునితో నగ్నిసాక్షిగా మైత్రినిగావించికొనుము. అతఁడీ లోకమునఁగల స్థానములన్నియు, నందును ముఖ్యముగా రాక్షసులుండు నివాసములన్నియును, బాగుగా నెఱింగినవాఁడు. అతఁడెఱుంగని ప్రదేశమేలేదు. శత్రుసంహారకుఁడవైన రామా! తనవేయి కిరణములతోడను సూర్యుఁ డెంతవరకుఁ బ్రకాశించినో, అంతవరకు నామధ్యనున్న నదులను గొండలను, గుహలను, దనవానరులతోఁగలిసి వెదకినవాఁడై,

నీభార్యయున్న ప్రదేశముం దెలిసికొని, నీకుఁ జెప్పఁగలఁడు. నీకొఱకై, పరితపించుచు, శోకసాగరమగ్నయైయున్న సీతను, లంకలో నారావణుఁ డెందుదాచియుంచినదియును; దెలిసికొనఁగలఁడు. ఆమెను మేరుపర్వతముపైఁగాని, పాతాళమునఁగాని, యెచ్చట రహస్యముగా నుంచినను, అడ్డమువచ్చిన రాక్షసులనెల్లరను వధించి, యాపరమసాధ్వీమతల్లియైన సీతను నీకుఁ దెచ్చి సమర్పించఁగలఁడు.

## కబంధుఁడు చెప్పిన - పంపాతీర విశేషము

శ్రీరామునితో నాకబంధుఁడు వెండియు, నిట్లనుచున్నాఁడు. ఓరాముఁడా! ఇక్కడకుఁ బడమర దిక్కుగానున్న వనమంతయును, బుష్పఫలభరితమై, చూడముచ్చటగానుండును. ఈమార్గముననే నీవు ప్రయాణమగుము. రామచంద్రా! నేరేడు, మారేడు, మామిడి మొదలగు ఫలవృక్షము లెన్నోగలవు. మఱియు నాగ తిలకాది పూలచెట్లునుగలవు. మీరుభయులును మీకుఁ గావలసిన ఫలపుష్పాదుల ననుభవించుచు, సుఖముగాఁ బ్రయాణము సేయుఁడు. ఆవనమునుదాటి వెళ్ళఁగనే, నందనవనమువలె నందమై, సర్వఋతువులందును, సర్వవృక్షములును బుష్పించి ఫలించి, తేనెసోనలఁ గార్చు వనమున్నది. అది యుత్తరకురుదేశములవలె, సర్వసమృద్ధమై యలరారుచుండును. అందలి చెట్లన్నియును ఫలముల భారములచే వంగినకొమ్మలుగలిగి

యుండును. అందు లక్ష్మణుఁడు, క్రిందినుండియే, నీకుఁగావలిసిన ఫలరాజములను దెచ్చి యీయఁగలఁడు, రామా! మీరలా వనములను బర్వతములను జిన్నచిన్న సెలయేళ్ళను దాటి పోవుచుండఁగా, పంపానది మీకుఁగనఁబడును. దానియందు రాతిబండలుగాని, పాచిపట్టిన రాళ్ళుగాని లేవు. బురదలు, మిట్టపల్లములును లేక చదునుగా నుండును. నాచులేక మెత్తని యిసుకయుండుటచే, దిగుటకు ననుకూలముగా నుండును. మఱియుఁ దామరలతోడను, గలువలతోడను, ప్రకాశించుచుండును. అందు హంసచక్రవాకాది పక్షులు వినసొంపుగాఁ గూయుచు నీదులాడుచుండును అట్టిపక్షులు తమను వేటాడుటయన్నది. యెఱుఁగవు. కావున మిమ్ములనుజూచి, నిర్భయముగా నందువిహరించుచుండును. అట్టివానిలో వెన్నముద్దలవంటి పక్షులను సులభముగాఁబట్టికొని, తినవచ్చును. మఱియు రొయ్యలు మొదలగు రుచికరంబులైన మత్స్యవిశేషములను, లక్ష్మణుఁడు తనబాణములనేసి పట్టుకొనివచ్చి బాగుగా పచనముచేసి, నీకాహారముగా నీయఁగలఁడు. మెండియు నీతమ్ముఁడు తామరాకుదొన్నెలతో నదియందలి యమృతోపమాన జలంబులనుదెచ్చి, నీదాహమును, దాపమును దీర్చఁగలఁడు. రామచంద్రా! యాప్రాంత పర్వత గుహాలలో నివసించుచు, నందమై, బలిసియున్న యడవి పందులు పెద్దగానరచుచు, నీటిని ద్రావుటకై, పంపానదికి వచ్చుచుండుటను జూడఁగలవు. నీవు సాయంకాల సమయ

మునఁ బంపాతీరంబునఁ దిరుగుచుఁ బూలగుత్తులతో నిండిన చెట్లను, జల్లని నదీజలంబును, నాజలములపైనుండి మెల్లగా వీచు గాలులను, ననుభవించుచు, నీమనస్తాపమును బోఁగొట్టి కొనఁగలవు. ఓ శ్రీరామచంద్రా! నేను జెప్పిన యాపుష్ప ఫలాదుల ననుభవించువాఁడే, యచ్చట లేఁడుసుమా! అవి యును నిత్యనూతనములై, యట్లేయుండును గాని, పండిపోయి గాని క్రుళ్ళిపోయిగాని, రాలి మట్టిలోఁ గలిసిపోక చెట్లపైనే యుండును. ఆవనమున మతంగాశ్రమమును, నాతనిశిష్యులు నుందురు. వారు తమగురువులకుఁ గావలసిన దర్భను, సమిధ లును, మొదలైనసామగ్రిని దెచ్చుచుందురు. అట్టివా రలసి పోగా, వారిశరీరములనుండి నేలపైఁబడిన చెమటబిందువులు గుమగుమలాడు పూలసముదాయముగా మార్పుచెంది యుండును. అట్లగుటకు వారి తపశ్శ్రభావమే కారణము. ఆపుష్పములకు నాశము లేదు. ఓ శ్రీరామచంద్రా! ఆగురు శిష్యులు నేఁడు కాలవశమున శరీరములను విడిచినను, వారిసేవకురాలైన శబరి యను భక్తురాలుమాత్ర మిప్పటికి నచ్చటనేయున్నది. ఆమె ధర్మాత్మురాలు. సర్వలోకముల చేఁ బూజింపఁబడు నీవామెవద్దకు వెళ్ళఁగనే, నిన్నుదర్శించి, స్వర్గమును బొందఁగలదు. ఆతరువాత నీవాపంపానదికిఁ బశ్చిమముగా, రహస్యమైన యాశ్రమమును జూడఁగలవు. ఆవనమందును ఋశ్యమూక పర్వతమునందును, మదించిన యేనుఁగు లనేకములున్నవి. మతంగమునియొక్క తపశ్శక్తి చే,

నాయాశ్రమము లోపలిభాగమున నేయొక్క యేనుఁగును గానరాదు. అట్టినందనవనమువంటి, వనమునందు నానావిధ పక్షిసముదాయములును నిర్భయముగా విహరించుచుండఁ జూచిన, నీవును మనశ్శాంతిని బొందఁగలవు.

ఆ పంపా తీరముననే ఋశ్యమూక పర్వతమున్నది. అచ్చటి యేనుఁగుగుంపు, లా కొండయందును నదియందును స్వేచ్ఛగా విహరించుచుండును. అప్పుడు పెద్దధ్వని యేర్పడును. మఱియు నా యేనుఁగు లాపర్వతమునకుఁ గాపుఁ గాయుచుండుటచే. దానినెక్కుట చాలకష్టమగును. పూర్వము బ్రహ్మదేవుడీప్రదేశమును గూర్చి "ఇదియొక దివ్యక్షేత్ర మగు"నని యనుగ్రహించెను. ఆపర్వతమున నిద్రించినప్పుడు వచ్చిన స్వప్నమునం దైశ్వర్యానుభూతి కలుగునో, అయ్యది తెలివివచ్చిన పిదపఁగూడఁ దప్పక యనుభవమునకు రాఁగలదు. కాని యొకవిశేషమును వినుము! పాపాత్ముఁడును, దురాచారుఁడు నీపర్వతము నెక్కుటకే శక్తిలేనివాఁడగును. అట్టివాఁ డెవఁడైన గర్వపడి, దీని నెక్కుటకుఁ బ్రయత్నించినచో, వాఁడచట నిద్రించుచుండఁగా, రాక్షసులు వానిని జంపి తినివేయుదురు. మతంగాశ్రమమందలి యేనుఁగులధ్వని యీకొండపైకి వినఁబడుచుండును. మదించిన యేనుఁగులచట పరస్పరమును యుద్ధములు గావించి, రక్తసిక్తమైన శరీరములతో వచ్చి, చల్లనినీరుగల యాపంపానదిని జేరి సేదఁ దీర్చికొని పోవుచుండును. రామా! నీవచ్చట పెద్దపులులను

ఎలుఁగుబంటులను, నింకననేక మృగములను జూచుచు, నీదుఃఖమును శాంతింపఁజేసికొనఁగలవు. వెండియు వినుము! ఆపర్వతమున నొకపెద్దగుహాయున్నది. దానిద్వారము బండరాయితోఁ గప్పఁబడియుండును. దానిని బ్రవేశించుట, యంతసులభముగాదు. దీనికిఁ దూర్పుద్వారమునఁ జల్లని నీరుగల యొకమడుగుగలదు. దానికిఁ జుట్టునుగల యొడ్డయందు, ఫలపుష్పభరితములైన వృక్షములుగలవు. వాని మధ్యను దిరుగాడులేళ్ళును నందముగాఁ గనఁబడును. ఆగుహాయందే సుగ్రీవుఁడు తన, నలుగురువానరముఖ్యులతోఁ గలిసి నివసించియున్నాఁడు. అతఁడాపర్వత శిఖరమునందును, భూమియందును, దరచుగాఁదిరుఁగుచుండును. అని యీవిధముగాఁజెప్పుచున్నకబంధుఁడు విమానముపై దివ్యమాల్య వస్త్రాభరణాదులతో నలంకరింపఁబడి యాకాశమునందు సూర్యునివలెఁ బ్రకాశించుచు నిలిచెను. అట్టియాతనిం జూచి, రామలక్ష్మణులు, "నీవింకఁబోయిరమ్ము!" అని యాజ్ఞాపించిరి. ఆతఁడును "మీకుఁ గార్యసిద్ధియగుఁగాక! ఓరామా! నేనుజెప్పినట్లు నీకు సుగ్రీవునితో స్నేహము చేయుట ముఖ్యము. సుమా!" యని మఱలఁజెప్పి స్వర్గమునకు వెడలెను.

# శ్రీరాముఁడు మతంగాశ్రమమున - శబరికి మోక్ష మొసంగుట

శ్రీరామలక్ష్మణులు కబంధుని విశ్వసించి పంపానదిని జేరికొనుట కటనుండి బయలుదేరి, త్రోవలో నాతఁడు చెప్పినట్లుగా, నున్న సుందరవనములను జూచుచు సుగ్రీవు నెంతతొందరలోఁ గలియగలమా! యన్న యాత్రముతోఁ బయనించిరి. వారట్లు పోయిపోయి, రాత్రికాఁగానే యొక ప్రశాంతమైన కొండచరియపైఁ బరుండి యుదయముననే లేచి, పంపాతీరమును జేరికొనిరి. వారా నదీపశ్చిమతీరమున మతంగాశ్రమము నందున్న శబరిని జూచిరి. మఱియు నాప్రాంతములందున్న ఫల పుష్ప సమృద్ధములైన వృక్షములను జూచుచు, నానందించిరి. ఆశబరియును శ్రీరామలక్ష్మణులనుజూచి, హృదయానందమును బట్టలేక యాహ్వానించి, యథావిధిగా, నర్ఘ్యపాద్యాదుల నొసంగి, వారికిఁ బాదాభివందనముగావించెను. అప్పుడు శ్రీరాముఁడు శబరిని జూచి, యిట్లనియెను. ఓశబరీ! నీతపస్సు నిర్విఘ్నముగా సాగుచున్నదా? నీమనస్సు నానందింపఁజేయు నియమముల కాంతకము లేవియును లేవుగదా? నీవుచేసిన గురుశుశ్రూష సఫలమైనదిగదా? అని కుశలప్రశ్నలఁ గావించు శ్రీరామునితోఁ, వృద్ధురాలైన యాశబరి, యిట్లనుచున్నది. ఓ శ్రీరామచంద్రా! ఇన్నాళ్ళకు నీదర్శనభాగ్యము లభించు

టచే, నేనుజేసిన పూజలును, దపస్సును సంపూర్ణముగా ఫలించినవి. అంతయేల? నాజన్మమే సఫలమై, తరించినది. స్వర్గానందము సంప్రాప్తించినది. కేవలము పరమాత్మనైన నిన్నుదర్శించి, పూజించుటచే, నాకుమోక్షము సునాయాసముగా లభించినట్లే. రాఘవేంద్రా! నీకరుణాకటాక్షమున, నన్నియును, సంపూర్ణముగాఫలించి, పవిత్రురాలనైతిని. ఇంక నీయనుగ్రహమున నుత్తమోత్తమములైన లోకముల, నందఁగలఁను. బ్రహ్మతేజోవిరాజమానులైన, మాగురువులు, నీవు చిత్రకూట పర్వతమును జేరుసరికే, మోక్షము నంది యుండిరి. వారుఁ శ్రీరాముఁడీప్రాంతములకు రాఁగలఁడనియు, లక్ష్మణసహితుఁడైన రామదర్శనముచే, నీకుమోక్షప్రాప్తి యగు"ననియును నాతోఁజెప్పిరి. శ్రీరామచంద్రా! ఈపంపాతీరారణ్యములందున్న మధురాతిమధుర ఫలమూలములను సంగ్రహించి, యెప్పటికప్పుడు నీరాకంగోరి, దాచి యుంచితిని. అట్లే యీరోజునఁగూడఁ దెచ్చి యుంచితిని. (ఇచ్చట పద్మపురాణమున "స్వయమాస్వాద్య మాధుర్యం, పరీక్ష్య పరిభక్ష్యచ ..." అని చెప్పఁబడినది. దీనికిఁ గొందఱు విపరీతవ్యాఖ్యానము చేసి "శబరి, రామున కెంగిలిపండ్ల నొసఁగినట్లు చెప్పుదురు. అదిసరిగాదు. ప్రతి వృక్షముననుగల పండ్లలో నొకదానిని రుచిఁజూచి, యందే చెట్టుపళ్ళు మధురమైనవో, వానినే తెచ్చి యుంచి, రామునకు సమర్పించినదని చెప్పుకొనుట యుక్తముగానుండును.

మఱియు, మహర్షులను సేవించుటలో మెప్పునందినశబరి, శ్రీరాముఁడు రాఁగానే విధివిధానముగా నర్ఘ్యపాద్యాదుల నొసంగి, యెంతటిపారవశ్య ములోనైనఁ బరమాత్ముఁడైన రామునకు నెంగిలిపండ్లను సమర్పించిన దనుటచే, నామె యంతవరకును, మహర్షులసేవచేసి, పొందిన యుత్తమ సంస్కార మేమైనట్లు ! భక్తిపారవశ్యమైనను, శ్రీరాముని సందర్శించినప్పుడు కలుగవచ్చును. కాని ఫలములను, దుంపలను బరీక్షించి తెచ్చినది ముందుగానేగదా ? ఈవిషయము వాల్మీకమునను స్పష్టముగాఁగలదు. జాతియేదైనను ఋషి సంస్కారము బాగుగా నలవరచుకొన్న శబరి మూఢభక్తితోఁ బ్రవర్తించిన దనుట సమంజసముగాదనితోఁచును. ఇందు శ్రీరాముఁడు జాతినిబట్టిగాక, యామెయొక్క యుత్తమ భక్తిభావమునకే ప్రాధాన్యమిచ్చినాఁడని, రామునియొక్క సర్వజీవకరుణామయత్వమును దెలిసికొనుట ముఖ్యము.)

శ్రీరాముఁడు శబరిచెప్పిన మాటలనువిని, ధర్మమునెఱింగి, యాచరణలోఁ జూపఁగలవాఁడగుటచే నీశబరి నీచజాతిదైనను, నిష్కామకర్మమునాచరించి, గురుశుశ్రూషచేసి, జ్ఞానమును సంపాదించికొనినదగుటచేఁ బవిత్రురాలైనదని భావించి, యిట్లనుచున్నాఁడు. ఓశబరీ ! మీగురువైన మతంగమహర్షి యొక్క ప్రభావమును, గబంధుఁడు చెప్పఁగా, విని యున్నాము. అతనిమహిమను జూపుటకు వీలయినచో, నాకొకింతఁజూపుము. అని శ్రీరాముఁ డనినంతనే తడవు

సేయక, రామలక్ష్మణుల కావనమంతయును జూపెను. రామా ! పెద్దపెద్ద మేఘములవలెఁ గన్పడుచున్న వృక్షపంక్తులను, నందమైన పక్షులను, లేళ్ళను, జూడుము. ఓదివ్యతేజః ప్రభావా! రామా ! పరమాత్మనుసందర్శించిన మాగురువులు, మంత్రద్రష్టలగువారి మంత్రములచేఁ, బవిత్రమైన గంగానదీ పుణ్యజలంబుల నిటకు రప్పించిరి. ఇదిగో ! చూడుము ! ఈ పశ్చిమమున నైఋతిప్రదేశమునఁ గల్పింపఁ బడిన దేవాలయమున్నది. మాగురువులు వార్ధక్యముచే నశక్తులయ్యు, నిచ్చటనే వడకుచున్న యాచేతులతో నేను దెచ్చిన పుష్పములంబట్టి పూజలను గావించెడివారు. శ్రీరామచంద్రా ! వారితపఃప్రభావముచే యావేదులు దిక్కులన్నిఁటను, దివ్యతేజస్సులను వెదఁజల్లుచున్నవి. వారుపవాసముచే శుష్కించి యెటుపోవుటకును శక్తి లేక, సప్తసాగరములను స్మరించినంతమాత్రమునఁ దమసన్నిధికి వచ్చునట్లు చేసెడివారు. వానియందు స్నానాది నిత్యక్రియల నాచరించి, యాతడిసిన నారబట్టల నీచెట్లకు నారవేయఁగా, నవియిప్పటికిని దడియారక యున్నవిసుమా ! మఱియు, వారి పవిత్రహస్తములతో, దేవతారాధనఁగావించిన, పద్మములు గలువలు మొదలైన పుష్పములివిగో ! చూడుము ! ఇప్పటికిని గసుగదంక వసివాడక యట్లేయున్నవి. ఓరామా ! నీకీవన మునంగల మాగురువుల మహిమావిశేషములను, గొన్నింటిని జూపఁగలిగితిని. నీవిదివరకు వినియుందువు. ఇప్పుడు

గన్నులారఁ జూచితివిగదా! రామచంద్రా! ఇంక నీవను మతించినచో, నీనాకళేబరమును విడిచిపెట్టుటకుఁ గోరికొను చున్నాను. నేనే మునిపుంగవుల సేవలఁ జేసి, తత్ఫలితముగా నీదర్శనభాగ్యము నందితినో, యామునీశ్వరులున్న స్థానము నకే పోవలెనని తొందరపడుచుంటిని. అని యీవిధముగా ధర్మయుక్తమైన గురుభక్తిని బ్రదర్శించిన, శబరివాక్యములను విని, "ఓశబరీ! నీవుచేసిన యీపూజలకుఁ జాలనానందించి తిని. నీవు కోరినరీతిగా, సుఖముగా నీగురువులను జేరికొని, యానందించుము." అనిన రామునిమాటలకు సంతసించి, జటావల్కల ధారిణియైన యాశబరి, చితిని బేర్చికొని, స్వయముగా నిప్పునంటించి, యాయగ్నిజ్వాలలోఁ దానునొక జ్వాలామూర్తియై, యందు బ్రవేశించి, తేజశ్శరీరముతో స్వర్గమునకుఁ బోయినది. ఆమె వెళ్ళునప్పుడు దివ్యవస్త్ర మాల్యాభరణములతో విమానముపైనుండఁగాఁ జూచువారి కెంతయో సంతోషమును వింతయును గలిగించెను. ఆమె తనగురువులు తేజశ్శరీరములతో నెక్కడఁ బ్రకాశించు చున్నారో, యక్కడకే తానును శ్రీరామాజ్ఞచే, మిరుమిట్లు గొలుపు మెరపుఁదీగవలెఁ బ్రవేశించినది.

# శ్రీరాముఁడు పంపానదీ తీరమును లక్ష్మణునితోఁ బ్రవేశించుట

శ్రీరాముఁడు లక్ష్మణునితోఁగూడి మహాతేజశ్శాలి యైన శబరి దివ్యలోకములకుఁ బోవుటను జూచుచు, నిట్లను చున్నాఁడు. తమ్ముఁడా ! చూచితివిగదా ! సమస్త నదీనదంబులును, సప్తసముద్రములు నిచటకు వచ్చెడివట, పక్షులన్నియును నేవేటగాండ్రవలనను భయములేక, యీావన్యఫలముల నారగించుచు మధురముగా నేటికిని గూయుచు, సుఖముగాఁ దిరుగుచున్నవి. లేళ్ళు పెద్దపులులతోఁగూడి పరస్పరవిరోధ భయంబులనువీడి ప్రేమతో సంచరించుచున్నవి. ఇదంతయును, నామహామునీంద్రుల తపఃప్రభావమేసుమా !

శ్లో॥ సప్తానాంచ సముద్రాణా మేషుతీర్థేషు లక్ష్మణ ! ।
ఉపస్పృష్టంచ విధివ త్పితరశ్చాపి తర్పితాః ॥

స. 75 శ్లో॥-4

తా॥ లక్ష్మణా ! సప్తసముద్రతీర్థములందును, స్నానములు చేసి, పితృదేవతా తర్పణములఁగావించితిమి

దేశ కాల పాత్రలలో నేయొక్కటియైన, నేసమయ మందైనను, బ్రాప్తించినచో, వ్యర్థముగాఁ బోనీయక, తగిన రీతిగా, దాన జప పితృతర్పణాది సత్కార్యములను జేసి, సుకృతమును సంపాదించికొనుట మానవధర్మము.

లక్ష్మణా! ఇంతవరకును, మనకుఁగలిగిన యశుభము లెల్ల నొక్కటొక్కటిగా నశించి, శుభారంభమైనట్లు, నామనస్సునకుఁ దృప్తిగలుగుచున్నది.

శ్లో॥ హృదయేహి, నరవ్యాఘ్ర! శుభ మావిర్భవిష్యతి।
తదాగచ్ఛ! గమిష్యావః, పంపాం తాం ప్రియదర్శనాం॥
స. 75, శ్లో॥-6

తా॥ తమ్ముఁడా! హృదయము నిర్మలమైనప్పుడే శుభారంభమైనట్లు గ్రహించవలెను. ఇచ్చట, నీమతంగాశ్రమమున, మనకన్నివిధములుగను, హృదయానందము లభించినది. ఇంకను నానందాభివృద్ధిని గలిగించెడు పంపానదికిఁ బోవుదము.

మహాత్ములగువారికి, రాబోవు శుభాశుభములను, వారిహృదయమే తెలియఁజేయును. (ఇదేభావమును దన యభిజ్ఞానశాకుంతల నాటకమునఁ, గాళిదాసు "సతాంహి సందేహపదేషు వస్తుషు ప్రమాణమంతఃకరణ ప్రవృత్తయః" అనిచెప్పినాఁడు. కావున మానవుఁడెప్పుడును సత్యసంధుఁడై యంతఃకరణ శుద్ధిని గలిగియుండుట ముఖ్యధర్మము.

లక్ష్మణా! వాలికి భయపడి, సూర్యపుత్రుఁడగు సుగ్రీవుఁడు ఋశ్యమూక పర్వతముపైఁ దనసహచరులతో నివసించియున్నాఁడని వింటిమిగదా! ఆపర్వతము పంపానదీ తీరముననేగలదు. కావున, నామనస్సు సుగ్రీవుని దర్శించుటకు వేగిరపడుచున్నది. సీతనువెదకి తెలియఁజేయుట కాతఁడే సమర్థుఁడు. అనఁగావిని, లక్ష్మణుఁడును, 'నామనస్సుగూడ

నట్లే వేగిరపడుచున్నది అనెను. వారుభయులు నట్లునిశ్చ యించికొని, మతంగాశ్రమమునుండి పంపానదీ తీరమునకు వెడలిరి. అచ్చట పంపానది నిర్మలాంతఃకరణులైన మహర్షు లచే, సేవింపఁబడుచున్నదై, వివిధములైన, వృక్ష లతా గుల్మములతో నిండినదై, త్రాగుటకు నమృతమువలె నుండు నీరుగలదై, పరిమళించు, పద్మములతోడను, వివిధవర్ణములు గల కలువలతోడను, నిండియున్నది. శ్రీరాము డచ్చట 'మతంగతీర్థము' అను పేరుగల రేవునందుదిగి స్నానము చేసెను. ఆపంపాతీరమునఁ దిలకవృక్షములును, నిండుగాఁ బూచిన మామిడిచెట్లను, వానిపైనున్న ఝంకారములతోఁ ధ్వనించు నెమిళ్ళలను, దానిమ్మ, చంద్ర, మద్దిఁ గన్నేరు, జాజి, సురపొన్న, మల్లె, మందార, యశోకములను పేరులు గల వృక్షములునుగలవు. అవియన్నియును, బాగుగా పుష్పించి యుండగా, నానది పూలతో నలంకరించికొనఁ బడిన పుణ్య స్త్రీవలెఁ గనుపట్టినది. అట్లే మధురముగాఁ గూయుచున్న పక్షులతోనిండిన పంపానది నారామలక్ష్మణులు చూచిరి. అందలినీరు వివిధములైన పుష్పములచేఁ బరిమళించుచుఁ జల్లనై, త్రాగుటకెంతో సుఖకరమై, యానందమును గలి గించుచున్నది, ఆనదీతీరమునందును, నదియందును గల ప్రకృతిరామణీయకత నంతను దిలకించుచున్న శ్రీరాముఁడు కామోద్రేకము గలవాఁడయ్యెను. అందలి రేవు లన్నియును స్ఫటికపునీటివలె నిర్మలజలంబులుగలిగి, యిసుకతిప్పలతోఁ

గలగలలాడుచుండెను. మఱియుఁ గొన్నిచోట్ల నెత్తునుండి పల్లములకు వడిగాఁ బ్రవహించుచుండెను. ఆప్రకృతి నంతను జూచుచున్న శ్రీరాముని యానందమునకు మేరలేకుండెను. ఆసమయమున లక్ష్మణునితో శ్రీరాముఁడిట్లనుచున్నాఁడు. తమ్ముఁడా! చూచితివా! ఈపంపాతీరమునఁగల ఋశ్యమూకపర్వతము నానావిధములైన గైరికాది ధాతువుల తోడను పుష్పఫలభరితములైన వృక్షములతోడను గన్పట్టుచున్నది. ఈకొండపైననే ఋక్షరజసుని కుమారుఁడైన సుగ్రీవుఁడు, నివసించియున్నాఁడు. తమ్ముఁడా! నీవును సుగ్రీవుని సన్నిధికిరమ్ము అనిచెప్పుచు శ్రీరాముఁడు మఱలనిట్లను చున్నాఁడు. నాయనా! రాజ్యభ్రష్టుఁడనై, దీనుఁడనైన నేను, సీతాదేవి దగ్గరలేకుండ నెట్లుజీవించఁగలను? అనుచుఁ దనయవయవములు స్వాధీనము దప్పియుండఁగా, మన్మథ తాపము గలవాఁడగుచు నాబంపానదియొక్క యొడ్డునఁ జేరియుండెను. ఆతీరమున శ్రీరాముఁడు లక్ష్మణునితోఁ జాలదూరమునడిచి, యనేకవిధములైన వనరామణీయకములను దర్శించుచు, నొకచో విశ్రాంతినొందెను.

ఇది

శ్రీమద్వేంకటేశ్వర రామాయణ

గద్యకావ్యమందలి

అరణ్యకాండ

సంపూర్ణము.

శ్రీమద్వేంకటేశ్వర రామాయణము

# కిష్కింధకాండ

ఓమ్

శ్రీ మాత్రే నమః

శ్రీరామ శ్శరణం మమ

# శ్రీ మద్వేంకటేశ్వర రామాయణము

## కిష్కింధకాండ - ప్రారంభము

## శ్రీరాముఁడు సీతాదేవిని - దలంచుచు దుఃఖించుట

శ్రీరామచంద్రమూర్తి యాపంపానది యొక్క యొడ్డుఁజేరి, యందలిపద్మములను గలువలను జేపలను జూచుచు, లక్ష్మణునితోఁగూడి, యింద్రియవ్యాకులపాటు గలిగి, విలపించెను. ఆదృశ్యములను జూచినకొలఁదియు, నొకవంకనానందమును వేఱొకవంకఁ గామపరవశత్వము నొందుచుండెను. ఆసమయమునఁ దనయింద్రియములు గంపించుచుండఁగా, శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లని యెను. లక్ష్మణా! చూచితివా! ఈపంపానదియందు వైడూర్యకాంతులతో నిర్మలమైననీరు గన్పట్టుచున్నది. ఈప్రాంతారణ్యమంతయును గన్నులపండువుగాఁ గనవచ్చుచున్నది. ఇందలిచెట్లు పర్వతశిఖరములవలె మిక్కిలిపొడవై యున్నవి. భరతునియెడఁబాటుతోఁబాటు, సీతాపహరణమును, నీవసంతశోభయును, నన్నుమిక్కిలి బాధించుచున్నవి.

బహువిధ పుష్పపరీమళములతోడను, జల్లని నీటితోడ, నీపంపాసరస్సు, శోకార్తుఁడనై యున్న నన్ను గూడ నానందింపఁజేయుచున్నది. పద్మములతోడను వానిచుట్టును, నల్లనై, పచ్చనైన నాచుతోడను, గప్పఁబడిన యీనదీతీరము నందలి చెట్లచే, నత్యంతమనోహరమైయున్నది. ఈచెట్లు పుష్పఫలభారములచే చివరికొమ్మలు క్రిందికివంగిపోయి యున్నవి వీనినుండివచ్చు. చల్లనై, కమ్మనైన వాయువు, ముక్కుపుటములకు విందుచేయుచున్నది. అంతటితోఁబోక శరీరమంతకును హాయిని గలిగించుచున్నది. లక్ష్మణా! అటు చూడుము! కొండచరియయందలి పూలచెట్లన్నియును దమ పూవులరాశులతో నేలనునింపివేసినవి. మఱియుఁ బడబోవు నట్టియు, బడుచునెగురుచున్నట్టియు, బడిపోయినట్టియుఁ బూలతో నీకొండచరియ లాడుకొనుచున్నట్లున్నవి మదించిన కోయిలలపాటల కీచెట్లకొమ్మలు గాలి కిటునటులాడుచు నాట్యమాడునట్లున్నవి. ఇట్టియపూర్వదృశ్యములు మన మనోవేదనను, నపూర్వమైనసువాసనలతో నిండిన చల్లని గాలులు మనశరీరతాపమును బోఁగొట్టుచున్నవి. ఈవింతఁ జూచితివా! ఇందలిపక్షుల కూతల కనుకూలముగాఁ దుమ్మెదలు రొదఁజేయుచున్నవిగదా? తమ్ముఁడా! ఇందలి విశేషమేనమ్మఁగా, నందఱకును బరమాహ్లాదకరమైన యీప్రకృతి రామణీయకమంతయును సీతావిరహముచే బాధపడుచున్న నన్నుమాత్రము మఱింతఁగా బాధించుచున్నది. నానావిధము

తైన గానములఁగావించు నీపక్షులన్నియును నాకుఁదాపమునే గలిగించుచున్నవి. ఈవసంతఋతువు చిగుళ్ళనెడియగ్నిజ్వాలలతో నన్ను గాల్చివేయుచున్నది. పద్మదళములంబోలు నేత్రములును, నందమైన తుమ్మెదరెక్కలవంటికురులును, మృదుమధుర సంభాషణములునుగల సీతాదేవి, యిప్పుడు నాసన్నిధిని లేకపోవుటచే, నామె లక్షణములన్నిఁటిని జ్ఞప్తికిఁ దెచ్చుచున్న యీవసంతఋతువు నాకుఁజాల బాధాకరముగ నేయున్నది.

ఈ సమయమున నీవసంతశోభలఁజూచి సీతనా సన్నిధినుండి, యెంతఁగానానందించెడిదో? అట్టిది యిప్పుడు నన్ను విపరీతముగా బాధించుచున్నది. ఇంతకుఁ బూర్వ మీఋతువునందలిశోభలే నాసీతతోనుండగా రతి శ్రమను బోగొట్టెడివి. నాయనా! ఈనెమిళ్ళనుజూడుము! ఇవియొకప్పుడు పురివిప్పికొని, నాట్యముచేయుచుండఁగా, నాడజాతినెమిళ్ళు మగనెమిళ్ళకొఱకై. మన్మథతాపముతో వెంటనంటి, పోయెడివిగదా! ఇప్పుడీనెమిళ్ళంజూచినకొలఁదియును వెనుకటియనుభవములు జ్ఞప్తికివచ్చి, నాకుమన్మథతాప మధిక మగుచున్నది. చూడుము! ఈనెమలియొక్క భార్య నేరాక్షసుఁడును, నపహరించలేదు. కావుననే యీజంట మనోహరముగా విహరింపఁగలుగుచున్నది. తమ్ముఁడా! ఈఋతువునం దీమనోహరవనంబున, నేనెంతమాత్రమును సహించరాని బాధ నందుచున్నానుసుమా! ఈప్రాంతజీవ రాశి నంతనుజూడుము! ఒక్కమానవులలోనేగాక తిర్య

క్కులలోఁగూడ వసంతఋతుప్రభావముచే, నెంతగామన్మథ చేష్టలలో మునిఁగియుండునో, నీకర్థముగాఁగలదు. నిజముగా, నీసమయమున నిచ్చట సీతయేయున్నచో నీపక్షులనుజూచి, యామెయును, నన్నాశ్లేషయనుసరించెడిదిగదా ! ఆమె సన్నిధిలేని యీవసంతపుష్పాదిశోభలతో నాకేమిప్రయోజనమున్నది ? కావుననే యీపువ్వులు తుమ్మెదలతోఁగూడి, క్రిందికిరాలిపోవుచున్నవి. చూచితివా! ఈపక్షిజాతిస్త్రీపురుషులన్నియును మనోహరముగాఁ గూయుచు, నొకదానితో నొకటి సరసములాడుచున్నట్లున్నది. ఆకూతలను వినినంతనే నాసీతజ్ఞాపకమునకువచ్చి, మన్మథతాప మధికమగుచున్నది. ఇక్కడనీఋతువునందు సీతకై నేనెంతఁగావిలపించుచున్నానో యక్కడెక్కడనో యాసీతయును విరహబాధపడుచుండవచ్చును. ఆమెయున్నచోట నీవసంతశోభనింతగానున్నను, నామెనపహరించిన, రాక్షస క్రూరసంభాషణాదులచే నెంతఁగాబాధపడుచున్నదోగదా ! సంపూర్ణయౌవనవతియు, మధురభాషిణియు నగు సీత నిశ్చయముగా నీవసంతఋతుశోభలచే నాయందలి మోహముతో మన్మథవికారమును భరించలేక ప్రాణములను విడిచినదేమో ? బ్రతికియుండి మాత్రము, రాక్షసులకుఁ జేజిక్కిన యామె యేమియానందమనుభవించఁగలదు ? నేనామెకొఱకెంతటి గాఢానురాగము చూపుచున్నానో యామెగూడ నాయందంతటిప్రగాఢమైన యనురాగముతో నుండఁగలదని భావించుచున్నాను. అందఱి

కను జల్లనైపోయునిచ్చు, నీపిల్లగాలులు, నాకుమాత్రము నిప్పుకణములపైవచ్చుగాలివలె వేడిగాసోఁకుచున్నది, అట్లే యీపక్షులధ్వనులన్నియు నొంటరిగానున్న నన్ను బాధించుచున్నవి. గమనించితివా? కాముకుల కందఱకును మన్మథ వికారమును గలిగించు నీయశోకమును, ఇది తనయందలి పూలతో గాలికి నిటునటు గదలుచుఁ దన వ్రేలితో నన్ను భయపెట్టుచున్న దానివలెనున్నది. దీనిపే రశోకము. అయినను నాపట్లశోకమునే గలిగించుచున్నది. లక్ష్మణా! పూల గుత్తులతోఁగూడిన యీమామిడిగున్నలనుజూడుము! దేహమంతను జందనములతోనలందికొనియున్న కాముకులం బోలెఁ జూపట్టుటలేదా? మఱియు నీపంపాసరస్సు నందలి పద్మములును గలువలును, సౌగంధికములు నాప్రాంతమందాడుతేళ్ళనుగలిగి పిల్లలతో మనోహరముగా నుండుటయేగాక, యిందలిచెట్లు ఆయాపుష్పాదులతో చల్లని గాలికి నటునిటులూఁగుచున్నవి.

ఆహా! ఎంతయందము? ఓలక్ష్మణా? గమనించితివా? ఈమన్మథుని క్రూరత్వము? కల్యాణరూపిణియేగాక సమస్త కల్యాణప్రదయై, మధుర భాషిణియగు సీతనుబోఁగొట్టికొని చెప్పనలవిగాని దురవస్థలో బాధపడుచున్నను, నామెనే స్మరించికొనుచు, మాటిమాటికిని దుఃఖపడునట్లు చేయుచున్నాఁడు ఈపద్మదళములనుజూడఁగా పద్మదళాయతనేత్రయగు సీతాదేవిని మరువలేకున్నాను. ఈపద్మముల మధ్యనున్న

కింజల్కములనుండి పైకెగసి చెట్లయందలి పూలవాసనలను గైకొనినన్ను దాకుచున్న యీపరీ మళవాయువు సీతాదేవియొక్క నిటూర్పువలెనున్నది. తమ్ముఁడా! ఈకొండచరియయందు మోదుగచెట్లు నిండుగాపూచి, యాకులు లేకుండనుండుటచే నగ్నిజ్వాలలుగలవివలెఁగన్పట్టుచున్నవి. ఈసురభిళవాయువొక కొండనుండి వేరొకకొండకును,నొకపూలచెట్టునుండి యింకొక పూలచెట్టునకునుదిరుగుచుఁ దృప్తిలేనిదానివలె వీచుచున్నది. ఈతుమ్మెదనుజూడుము! "ఇదిచాలనందమైనది. ఇదిరసవంతమైనది. ఇది బాగుగా వికసించినది." యనియెంచికొనుచు నొకదానినుండి వేఱొకదానిపైవ్రాలుచుఁ దిరుఁగుచున్నది. ఇక్కడ నీచెట్లుపరస్పరమును బట్టుదలతో నొకదానినిమించి యొకటిగాబూలతో నిండియున్నది.

లక్ష్మణా! ఆవైపుచూడుము! చెట్లకొమ్మలు గాలికి నటునిటులాడుచుఁదుమ్మెదలరొదలనెడిమాటలతో నేనెక్కువ పూచితిని నేనేయెక్కువపూచితిని వాదులాడుచున్నట్లున్నవి గదా! ఈకారండవపక్షి జలంబులనుండి,ప్రియురాలితో విహరించుట,చూచుచుండఁగా నాకుమదనతాపమధికమగుచున్నది. నిజముగా నాసీతాదేవియే యిచ్చట నాప్రక్కనున్నచో నింద్రపదవినిగాని, యయోధ్యారాజ్యాధిపత్యమునుగాని, స్మరించువాఁడనుగాను సుమా! ఇచ్చటనున్న పద్మములును లేళ్ళును మొదలైన సుందరస్వరూపములన్నియును, నా సీతాదేవినిదలఁపించుచున్నవి. ధర్మజ్ఞుఁడును, సత్యసంధుఁడునగు

జనక మహారాజువచ్చి, పదిమందిలోను "మాసీతయేది !" యని ప్రశ్నించినచో నేనేమనిచెప్పఁగలను ! రాజ్యభ్రష్టుఁడనైన నన్నువీడక యీ యడవులలో వాతోనిడుమలఁబడుటకై వెనుదీయక వచ్చినది. అట్టిదివ్యమంగళస్వరూపిణియైన సీతా ముఖపద్మమును జూడక నేనెట్లు జీవించఁగలను ! లక్ష్మణా! తరచుగాఁజిఱునవ్వులతో నన్నలరించునా సీతనెప్పుడుచూడఁ గలుగుదునోగదా ! అడవులలోఁదానెంతగాఁ గష్టములననుభ వించుచున్నను,నన్నానందింపఁ జేయుటకై,మృదుమధురముగా మాటలాడుచు, నాకుమన్మథతాపమును దీర్చు నాసీత నెప్పుడుచూడఁగలనో ! నాతల్లికౌసల్య తనముద్దులకోడలై పరమసాధ్వియైన సీతనుగూర్చిప్రశ్నించినచో, నేనేమనిచెప్పఁ గలను ? లక్ష్మణా ! ఇంకనీవయోధ్యకుంబోయి, భరతునితో సుఖముగానుండుము. సీతావిరహముతో నేనిచ్చటనే ప్రాణములను విడువఁగలను. అనియీవిధముగాఁ బరవశుఁడై విలపించుచున్న శ్రీరామునిజూచి, లక్ష్మణుఁ డిట్లనియెను.

అన్నా ! శ్రీరామచంద్రా ! నీవుపురుషోత్తముఁడవు. దుఃఖించుట నీస్వభావముగాదు. కాలవశాత్తుగావచ్చిన దుఃఖమును ధీరుఁడవై యడఁచికొనుము. మహాత్ములైన నీవంటివారిబుద్ధి యేమాత్రమును గలుషితముగాక నిర్మలమై యుండును.

శ్లో॥ స్మృత్వా వియోగజం దుఃఖం, త్యజస్నేహం ప్రియేజనే।
అతిస్నేహపరిష్వంగా, ద్వర్తిరార్ద్రాపి దహ్యతే॥
స.1,శ్లో॥-116

తా॥ అన్నా! రామచంద్రా! అతిస్నేహముచే, నెప్పుడైన వియోగము సంభవించినప్పుడు, సహించరాని దుఃఖముగలుగుట సహజము. నూనెతోఁ బూర్తిగానానిన వత్తి నేతితోఁ దడిసిపోయినను, నగ్నిస్పర్శచే మండకమానదు గదా!

"అతిస్నేహః పాపశంకీ" యన్న సూక్తి ననుసరించి, యెవరియందును నతిగాస్నేహమును గలిగియుండుట దుఃఖమునకు హేతువగును.

ఓ రామభద్రా! ఆ రావణుఁడు పాతాళమున కేగినను, నంతరించెను, నగమ్యమైన మఱియెచ్చటి కేగినను, వాఁడు చనపోవుటతప్పదు. వానిజాడమాత్రము మనకుఁ దెలియవలయును. అంతియేచాలును. వాఁడు సీతను నీకునప్పగించుటయో, లేక వాఁడుచచ్చుటయో, జరిగితీరవలసినదే ఆ రావణుఁడు దేవతామాతయైనయదితి గర్భమున సీతతోఁగూడ దాగియున్నను వానికిఁజావుతప్పదు. పూజ్యపాదుఁడవైన, యో రామభద్రా! మంగళములనిచ్చు ధైర్యమును విడువకుము. దీనత్వమును విడువుము. శ్రీరామచంద్రా! నీ ప్రభావమును నీబుద్ధినిశిత్వమును నీవు దెలిసికొనలేకున్నావు. ఇప్పు

డిక నీమన్మథతాపమును దూరముగాఁ బారఁద్రోలుము. అనఁగా రాముడు లక్ష్మణవాక్యములచే ధైర్యమవలంబించెను.

సాటిలేనిపరాక్రమశాలియు, బుద్ధిశాలియు నగు శ్రీరాముఁడు ప్రకృతిరామణీయకముతో విరాజిల్లు నాపంపానదిని, వనములనుదాటి, ముందునకునడచెను. ఆవిధముగాఁ బోయిపోయి సీతనుగానక దుఃఖించుచుండెను. లక్ష్మణుఁడు మదపుటేనుఁగువలె ఠీవిగానడచుచు, శ్రీరామునకు ధైర్యలక్ష్మిప్రభావమును జెప్పుచు నన్నగారిదుఃఖమును శాంతింపఁజేయుచుండెను. ఇక్కడనీసోదరులిట్లుండఁగా, నక్కడఋశ్యమూకపర్వతముపైనున్న సుగ్రీవుఁడు తనయనుచరులతోఁగూడి, పంపానదీతీరమున సంచరించుచున్న ధనుర్ధారులైన రామలక్ష్మణులనుజూచి, భయపడిపోవుచుండెను. సహజముగా సుగ్రీవుఁడు మహాబలశాలియే. అయినను, దృఢకాయులై, ధనుర్ధరులై, రాజఠీవితోఁ దిరుగాడుచున్న రామలక్ష్మణులనుజూచి, మిక్కిలిభయముతో దుఃఖించెను. అతనిమంత్రులును సహచరులు నైనవారుకూడ మహాబలవంతులును బుద్ధిమంతులు నైనను, రామలక్ష్మణులంజూడఁగనే "వీరు వాలిచేఁబంపఁబడిన వీరులై యుందుర"ని యనుమానించిరి. అంతనావానరులును నెవ్వరికిని గన్నెత్తిచూడశక్యముగాని మతంగాశ్రమమునుబ్రవేశించి, నిర్భయులై యుండిరి.

## హనుమంతుఁడు సుగ్రీవునకు ధైర్యము చెప్పుట

మిక్కిలి పొడవై, బలిష్ఠములైన యాయుధములను ధరించి, మహాపరాక్రమశాలురై కనఁబడుచున్న, రామ లక్ష్మణులనుజూచి, భయముతో వడకిపోవుచు, సుగ్రీవుఁ డొకచోనుండక, యిటునటుపరుగులిడుచుండెను. మఱియు నిచటనే యుండుదమా! లేకమఱెచ్చటకైనఁ బారిపోవు దమా? యన్నయాలోచనలోఁబడెను. తనమంత్రులతో భయహేతువునుజెప్పి యాలోచించెను. ఓయీ! ఈమహా వీరులిద్దరును వాలిపంపఁగా వచ్చినవారేయైనను జడలను, నారబట్టలను ధరించుట, కేవలమును నిన్ను నమ్మించుటకే యని భావించుచున్నాను. అనఁగావిని, యాసుగ్రీవమంత్రు లారామలక్ష్మణులంజూచి, భయభ్రాంతులై, కొండశిఖరము నెక్కఁబోయిరి. మఱియువారుకొండశిఖరముపైనున్న చెట్లను గదలించుచు, దమబలమును బ్రదర్శించిరి. వెండియు నాకొండపైనున్న పెద్దపులులుమొదలగు మృగములను భయ పెట్టుచుఁ దరుముచుండిరి. చివరకందఱు నాపర్వతశిఖరముపై, సుగ్రీవునిగలిసి యొకచోఁగూర్చుండిరి. ఆసమయమున మాటనేర్పుగలవాఁడును, బండితుఁడైన హనుమంతుఁడు, సుగ్రీవుఁడుభయకంపితుఁడై యుండఁగాఁజూచి యిట్లనియెను. మాకునాయకుఁడవైయున్న యోసుగ్రీవా! నీవేయిట్లు భయ

పడుట తగదుసుమా ! ఇదిఋశ్యమూకపర్వతము. దీనిపై మనమున్నంతకాలమును, వాలికిమనము భయపడుటతగదు. ఓవానరరాజా ! నీవుభయపడుటకుఁ గారణభూతుఁడైనవాలిని, నీవుచూడనేలేదుగదా ! కావుననెంతమాత్రమును భయపడ నవసరములేదు. సుగ్రీవా ! చంచలబుద్ధితో నీవటునిటుఁబరు వెత్తుటచేఁ గపిత్వమువెల్లడియగుచున్నది. ఓసుగ్రీవా ? నీవుమంచిబుద్ధిఁగలవాఁడవై, యితరుల మనోభావమును, జక్కఁగానెఱింగి, తగినట్లుప్రవర్తించుట మంచిది. చంచల బుద్ధిఁగలవాఁడు తననునాశ్రయించినవారిని బరిపాలించలేఁడు. అనఁగావిని, సుగ్రీవుఁడును, హనుమంతునితోనిట్లనుచుండెను. ఈకనఁబడుచున్నవారు సామాన్యులుగారు. ఆజానుబాహులు. విశాలములైననేత్రములుగలవారు. మఱియు ధనుర్బాణము లకు ఖడ్గములను ధరించినవారు. ఇట్టిమహావీరులనుజూచినచో నెవరికిభయముగలుగకుండును ? లోకములోఁ బ్రభువు లనేకులతో స్నేహములుచేయుచుందురు. కావున వాలిమనకు గనపడనంతమాత్రమున నీవచ్చినవారినినమ్మరాదు. మన కొఱకు రహస్యముగా సంచరించు శత్రువుల, నొకకంటఁగని పెట్టుచుండవలెను అట్లుగానిచో, వారుమొదటమనలను బాగుగానమ్మించి, సమయముచిక్కినప్పుడు ద్రోహముచేయు దురు. కార్యసాధనలో వాలిమిక్కిలితెలివైనవాఁడు అనేక మైన యుపాయములనుబన్ని, శత్రుసంహారముచేయఁగల వాఁడు. కావున బుద్ధిమంతులమై, తగినరూపమును ధరించి,

యావచ్చినవారియభిప్రాయములను గ్రహించవలయును. కావున నోయాంజనేయా! అట్టికార్యమునకు నీవేతగిన వాఁడవు. నీవుసామాన్య ప్రాకృతమనుష్యరూపమునుధరించి, యావచ్చినయువవీరులవద్దకుఁబోయి, వారితోఁబ్రసంగించి, వారిమనోభావములెట్టివో గ్రహించిరమ్ము! ఓయీ! వారికిమనపై దుర్భావములేనిచో, వారినిబొగడి, మనకువశ బడునట్లు చేయుము. మనయొక్క-మంచితనమును గొప్పఁదన మును జెప్పి, మనపైసద్భావముగలుగునట్లు చేయుము. అంతియేగాక ధనుస్సులు మొదలగునాయుధములుగలవారై, వారలీప్రాంతములందుఁ దిఱుగుచుండుటకుఁ దగినకారణ మునుగూడఁ దెలిసికొనుము. హనుమంతా! నిజముగా వారు సౌమ్యులైనచో, వారితోనెట్లుసంభాషించవలయునో? నీకు నేను వేరుగాఁజెప్పఁబనిలేదు. నీవును నెదుటివారిమాటలను జేష్టలనుబట్టి వారిహృదయమెట్టిదో, తెలిసికొనఁగల పండితుఁ డవు. ఆమాటలనువిన్న హనుమంతుఁడు సుగ్రీవునాజ్ఞను, శిరసావహించి, యావెంటనే శ్రీరామలక్ష్మణులున్నచోటికి వెడలెను.

## హనుమద్రామ సమాగమము

హనుమంతుఁడు రామలక్ష్మణులసన్నిధికి భిక్షుక వేషముతో వెళ్ళెను. తనకోతిరూపము దెలియకుండుటకై యాంజనేయుఁ డావిధముగావెళ్ళి, వారినిసందర్శించెను.

శ్రీరామలక్ష్మణులను జూడఁగనే హనుమంతుఁడు వినయ విధేయతలతోఁ జేతులుజోడించి, నమస్కరించెను. తరువాత మృదుమధురవాక్కులతో, వారినిట్లుప్రశ్నించెను. అయ్యా! మీరురాజర్షులు. దేవతాసమాన తేజోవంతులుగాఁ గనఁబడు చున్నారు. ఏదైన నొకవ్రతదీక్ష నవలంబించిన తాపసులుగాఁ దోఁచుచున్నారు. దివ్యమంగళవిగ్రహులై, మహాపరాక్రము లైన మీరేప్రదేశముల కెందుండివచ్చిరి? ఈపంపాతీరప్రదే శములను బరిశీలించుచు, లేళ్ళు మొదలైనమృగములకు భయముగలిగించు, నేలసంచరించుచున్నారు? మీరీపవిత్ర తీర్థమైన పంపానదికిఁ, మఱింతశోభనుగూర్చుచు బంగారు వన్నెగల నారబట్టలనుగట్టి, మహాధైర్యశాలురై, మాటిమాటి కిని, నిట్టూర్పులువిడచుచు, మార్గాయాసము నందినవారివలెఁ గన్పట్టుచున్నారు. మీరేనుఁగుతొండములవంటి బాహువులు గలవారై సింహావలోకనంబులచే, నిచ్చటిమృగాదులను భయ పెట్టుచున్నారు. ఇంద్రధనువువంటి ధనుస్సులుఁగలిగి, రూప వంతులును, శ్రీమంతులునయి, శత్రుసంహారకులై బలిష్ఠ మైనవృషభములవలె ఠీవిగానడచుచున్నారు. అట్టిపురుష శ్రేష్ఠులైన మీరెవరైయుందురో, తెలిసికొనవచ్చునా? మీశరీరకాంతులచే, నీఋశ్యమూక పర్వతమంతయును వెలిఁగిపోవుచున్నది. రాజ్యాధిపత్యార్హులై, దేవతాసమాన మైన పరాక్రమములుగల మీరుజటాధారులై, యిచ్చటకేల వచ్చిరి? మిమ్ములనుజూడఁగాఁ జంద్రసూర్యులు స్వేచ్ఛగా

దిరుగుటకై, యీభూమికి దిగివచ్చినట్లున్నది. మానవ మూర్తులనుధరించిన దేవతలవలె, విశాలవక్షస్కులై, మహోత్సాహముతో, విరాజిల్లుచుఁ గన్పట్టుచున్నారు. మీ శాఖాబాహువులు కండలుదిరిగి, యడ్డగడియలవలె, బలిష్ఠములై, సమస్తాభరణములను ధరించుటకుఁ దగినవైయుండఁగా, మీ రేలయలంకరించి కొనలేదు? మీయుభయులలో నేయొక్కరైనను జతుస్సముద్రముద్రితమై వింధ్యాదిసమస్త పర్వతములతోఁగూడిన యీ భూమినంతను బాలింపసమర్థులని తెలియుచున్నది. యీబంగారుపూతఁగల ధనుస్సులు వజ్రాయుధముతో సాటివచ్చుచున్నవి. మీయమ్ములపొదుల యందు నిండుగానున్న, బాణములు బుసలుకొట్టుసర్పముల వలెఁ బ్రాణాంతకములై గనఁబడుచున్నవి. మఱియు బంగారు పిడులతో మీ మొలలందు వ్రేలాడుఖడ్గములు మహానాగుల వలె గోచరించుచున్నవి.

ఆర్యులారా! నేనింతఁగా నడుగుచున్నను, మీరు మౌనమునువహించి రేల? ఇచ్చట నీకొండపై సుగ్రీవుఁడను పేరుతో, ధర్మాత్ముఁడై, పేరుపొందిన వానరరాజుగలఁడు. అతఁడు మహావీరుఁడే. అయినను దనకంటెబలవంతుఁడైన యన్నగారిచేఁ దరిమివేయఁబడి, యీఋశ్యమూకపర్వతమును జేరికొనియెను. అట్టియాతని యనుచరులలో నేనొకఁడను. నాపేరు హనుమంతుఁ డందురు. మాప్రభువు మీతో మైత్రి నాకాంక్షించి, పంపఁగా, వచ్చితిని. నాకుఁ గామ

రూపమును గామగమనమునుగలవు. అనిహనుమంతుఁడు మాటలాడుటయేగాని యాతని కారామలక్ష్మణు లేమని యును సమాధానముచెప్ప లేదు.

శ్రీరాముఁడు హనుమంతునిమాటలువిని కొంతసేపటికి, లక్ష్మణునిబిలిచి, యిట్లనియెను. లక్ష్మణా ! వింటివిగదా? ఈతఁడు సుగ్రీవునిమంత్రి. మనమాసుగ్రీవునికొఱకై, వెళ్ళుచుండఁగా, నాతఁడే తనమంత్రిని బంపినాఁడు. ఈహనుమంతుఁడు హృదయాకర్షణీయమైన వాగ్ధోరణిగలవాఁడు. మూఁడు వేదములను, నధ్యయనముచేసి, యందలిసారమును గ్రహించినవాఁడు. కావుననే యింతటిమృదుమధుర భాష యాతనికివచ్చినది. ఈతఁడెంతగామాటలాడినను, నామాటలలో నపశబ్దమొక్కటియును మనము వినలేదు. అందువలన నీతఁడుకష్టపడి వ్యాకరణమంతయును జదివనట్లున్నది. ఈతని లలాటమును గనుబొమలును నేత్రములును మొదలైన ముఖలక్షణములందుగాని, మిగిలిన యవయవ విన్యాసములందుగాని, దోషముగానఁబడదు. మఱియు నీతనిమాటలలో నధికప్రసంగముగాని, యక్షరములయస్పష్టతగాని, ధ్వనిలోఁ గాఠిన్యముగాని నసుగుడుగాని, తొందరపాటుగాని, లేకున్నవి. హృదయమున సంకల్పించిన భావమే, కంఠగతమై, యదియేసుస్పష్టమైనయక్షర, పదరూపముదాల్చి వినఁబడినవి. (అనఁగాదీనినే త్రికరణశుద్ధియైన మాటలందురు.) నాయనా!

లక్ష్మణా ! చక్కనిసంస్కారము గలవారిట్లే మంగళకరమైన మాటలనుబలుకుదురు. లక్ష్మణా ! ఇట్టిసత్యమధురవాక్కులు గలవాని, నెంతటిక్రూరుఁడైనను దలనరకుటకుఁ గత్తినెత్తిన వాఁడైనను, శాంతించి, గౌరవించునుసుమా ! ఓలక్ష్మణా ! ఇట్టిసర్వసమర్థుఁడైన దూతలేనిచో, నెంతటిప్రభువునకైనఁ గార్యసిద్ధిగాదు. ఇట్టిసర్వసద్గుణ సంపన్నుఁడును గార్యసాధకుఁడు, నగుదూత, యేప్రభువునకుండునో, యాతఁడా దూతను విశ్వసించి, యెంతటికార్యమునైన సాధించఁగలఁడు. నామాటలలో సందేహించఁబనిలేదు. అనఁగావిని, లక్ష్మణుఁడు హనుమంతునితో నిట్లనుచున్నాఁడు. ఓయీ ! హనుమంతుఁడా ! ఇప్పుడు నీవుచెప్పిన, పరాక్రమాదిగుణగణములుగల సుగ్రీవునిగూర్చి యింతకుముందే మేముదెలిసికొంటిమి. మేమును నాతనికొఱకే వెదకికొనుచు నిచ్చటకుఁ జేరికొంటిమి. మీప్రభువుగోరినట్లుగా, నాతనితో మేము సఖ్యముచేసికొనఁగలము. అనఁగావిని లక్ష్మణవాక్యముల కానందించి, హనుమంతుఁడు తనప్రభునైన సుగ్రీవునకు విజయము తప్పదని, నిశ్చయించికొన్నవాఁడై, యాసుగ్రీవునితో రామునకుమైత్రినిగూర్పఁదలఁచెను.

## శ్రీరాముని - హనుమంతుఁడు ప్రశ్నించుట లక్ష్మణుని సమాధానము

శ్రీరామునకుఁగూడ సుగ్రీవసహాయ మవసరమై యున్నట్లు గ్రహించినహనుమంతుఁడు శ్రీరాము నిట్లు

ప్రశ్నించుచున్నాఁడు. రామా! ఈక్రూరభయంకరారణ్యములలో నేలఁదిరుఁగుచుండిరి? అసలు మీరీయరణ్యముల కేల వచ్చిరి? అనియడుగఁగా, శ్రీరాముఁడు లక్ష్మణునిజూచి, నాయనా! యీతనిప్రశ్నకుఁ దగినసమాధానముచెప్పి, మనపైవిశ్వాసమును గలిగించుము. అనఁగావిని లక్ష్మణుఁ డిట్లనుచున్నాఁడు.

ఆంజనేయా! వినుము! దశరథుఁడను పేరుగల మహారాజును వినియుందువు. అతఁడు చాతుర్వర్ణ్యముల వారిని వారివారి, వర్ణాశ్రమధర్మానుసారముగాఁ బ్రవర్తించు నట్లుగా నయోధ్యారాజ్యమును బరిపాలించిన ధర్మమూర్తి. అతనికెవరిపైనను ద్వేషములేదు. లోకమలన్నిఁటియందును బ్రహ్మదేవున కెట్టిసమభావమున్నదో, యాతనికిని నట్లే ప్రజలందు సమానభావముగలిగి యుండెడిది. మఱియు వేదోక్తముగా, దక్షిణలిచ్చి, యగ్నిష్టోమాది యాగముల నేకములఁగావించినవాఁడు, అట్టిమహారాజనేకవేల సంవత్సరములు రాజ్యపాలనఁజేసిన మహాత్ముఁడు. అదిగో! అట్టిమహారాజుయొక్క జ్యేష్ఠపుత్రుఁడే యీశ్రీరాముఁడు. ఈతఁడును దనరామనామమును సార్థకముగావించికొనుచు, సర్వభూతదయాపరుఁడై, తండ్రియాజ్ఞను జవదాటక ప్రవర్తించెడివాఁడు. ఆమహారాజుయొక్క నలుగురుకుమారులలో జ్యేష్ఠుఁడై, సర్వసద్గుణసంపన్నుఁడై, యీతఁడు రాజలక్షణలక్షితుండై యుండెడివాఁడు. అట్టియీరాముఁడు పితురాజ్ఞ

పరిపాలకుఁడై, రాజ్యమునువిడిచి, నన్నును, దనభార్యయైన సీతనుగూడ వెంటఁబెట్టికొని, దండకారణ్యములలోఁ బ్రవే శించెను. సంధ్యాకాలమున సూర్యునితోఁబాటు సూర్య తేజస్సుగూడ నాతనివెంటవెళ్ళినట్లుగా, నీశ్రీరాముని సీతా దేవి విడువక వెంటనంటివచ్చినది. నేనీతనికిఁదమ్ముఁడను. నా పేరు లక్ష్మణుఁడందురు. మాయన్న శ్రీరాముఁడు గోరఁతయుపకారమునైనను గొండంతఁగాఁదలఁచెడి కృతజ్ఞతఁ గలవాఁడు. సర్వవేదశాస్త్రాదులందు నఖండమైన పాండి త్యముగలవాఁడు. సుఖములను బొందుటకే యర్హుఁడు. సర్వభూతదయాపరుఁడు. సర్వులచేతను బూజనీయుఁడు. అట్టి యీతఁడు రాజ్యమునువిడిచి, యడవులకుఁబోవుచుండఁగా, నాతనినిసేవించు మహాభాగ్యమును బడయుటకిదేమంచి సమయమని, నేనీతనిని వెంబడించితిని. మేమిరువురమును, నాశ్రమమున లేనిసమయమును గనిపెట్టి యెవఁడో, రాక్షసు డొకఁడు సీతాదేవి నపహరించెను. ఆతనిజాడందెలియుటకై వెదకుచు నిచ్చటకువచ్చితిమి. మాకుఁద్రోవలో దనువంశీ యుఁడై, శ్రీయనుదానవునిపుత్త్రుఁడై, శాపవశమున రాక్ష సుఁడై, మాచేఁజంపఁబడెను. అంతనాతనికి శాపవిముక్తిగలిగి నది. వాఁడుతనదివ్యదేహముతో స్వర్గమునకుఁబోవుచు, మాకథవిని, మమ్ములనుజూచి, "మీరు సుగ్రీవునితో సఖ్యముగావించికొని, మీకార్యమును సాధించికొనుఁడు" అనిచెప్పి. వెడలిపోయెను. ఓహనుమంతా! నీవుకోరిన

మాసమాచారమునంతను వింటివిగదా ! ఇప్పుడు మీసుగ్రీవుని శరణమందవచ్చితిమి. ఈశ్రీరాముఁడు తనకుఁగల సర్వస్వమును దానములఁజేసి, యఖండమైన ధర్మమూర్తిగా కీర్తినిగడించి, సర్వలోకములను బాలింప సమర్థుఁడని పేరు వొందినవాఁడు. అట్టివాఁడీనాఁడుభార్యావిరహమును సహింపలేక, సుగ్రీవునిసాయమును గోరివచ్చినవాఁడు. శరణన్నవారిని దప్పకరక్షించు దశరథపుత్త్రుఁడై, శరణాగతరక్షకుఁడన్న బిరుదువహించిన యీరాముఁడిప్పుడు సుగ్రీవుని శరణుగోరుచున్నాఁడు. ఈతఁడుసర్వలోక శరణ్యుఁడు. ఈతనిరక్షణలో ప్రజలందరును జీవించెడివారు. అట్టిశ్రీరాముఁడు సుగ్రీవానుగ్రహమును గోరుచున్నాఁడు. ఈతఁడు నిగ్రహానుగ్రహ సమర్థుఁడు. ఆకారణముగా, రాజశ్రేష్ఠులందఱును,బూజ్యులై సుఖించెడివారు. అట్టి సర్వలోకములకు నార్తిహరుఁడైన యీశ్రీరాముఁ డార్తుఁడై, నేఁడుసుగ్రీవు నాశ్రయింప వచ్చినవాఁడు. అనిలక్ష్మణుఁడు గంటఁదడిపెట్టికొని యథార్థమును జెప్పఁగావిని హనుమంతుఁడు తనవాక్చాతుర్యముతో నిట్లనెను.

## హనుమంతుఁడు - రామలక్ష్మణులను సుగ్రీవ - సన్నిధికిఁ - గొనిపోవుట

ఓలక్ష్మణస్వామీ ! జితేంద్రియులును బుద్ధిసంపన్నులును, మహాపరాక్రమవంతులునునగు, మీవంటివారి సహా

యము మా సుగ్రీవుని కెంతయైనఁగలదు. దైవవశమున నట్టి మహాత్ములు మీరాతనికి లభించిరి. మా సుగ్రీవుఁడును దన యన్నయైన వాలిచే రాజ్యమునుండి వెడలఁగొట్టఁబడినాఁడు. మఱియు నావాలితనభార్యనుగూడ నపహరించఁగా, మా సుగ్రీవుఁడొంటరియై, యీయడవుల నిడుమలఁ బడు చున్నాఁడు. ఆసూర్యపుత్త్రుఁడైన సుగ్రీవుఁడు మమ్ముల నుపయోగించి, నీభార్యసీతను వెదకి తెలిసికొనుటలో సఫలుఁడై, శ్రీరామునకు సహాయముచేయఁగలఁడు అని హనుమంతుఁడు మధురమైన మాటలతో, రామలక్ష్మణుల నానందింపఁజేసి. "శ్రీరామభద్రా! సుగ్రీవునిసన్నిధికిఁ బోవుదమా?" అనిపలికెను. అట్లుపలికిన హనుమంతుని గౌరవించి లక్ష్మణుఁడు శ్రీరామునితో నిట్లనియెను. అన్నా! దృఢమైన పరాక్రమముగలిగి వాయుపుత్త్రుఁడైన యీతని సత్యవాక్యములను వింటివిగదా! ఆసుగ్రీవునకును నీవలన మహోపకారము గావలసియున్నది. కావున నీవును గృతార్థుఁడ వగుదువు. ఈయాంజనేయుఁడు ప్రశాంతమైన ముఖవర్చస్సు గలవాఁడై, హృదయము నుండి బుట్టిన యానందముతో సత్యము వలుకుచున్నాఁడు. ఇంతటి పరిశుద్ధాత్మగల మహావీరుఁ డసత్యములను బలుకఁడు. అనఁగా విని శ్రీరాముఁడు తనయంగీకారమును దెలిపెను. అప్పుడా హనుమంతుఁడు భిక్షుకవేషమునువిడిచి వానరరూపమును దాల్చి, తనభుజములపైఁ జెరియొకప్రక్కను, రామలక్ష్మణు

లను గూర్చుండబెట్టికొని, సుగ్రీవుఁడున్న చోటికిఁ బ్రయాణ మయ్యెను, తానువచ్చినపనిని నెరవేర్చికొనిన హనుమంతుఁ డానందముతో రామలక్ష్మణులను సుగ్రీవుసన్నిధికిఁ దీసికొని వెళ్ళెను.

## శ్రీరామ - సుగ్రీవ - సంభాషణ - అగ్ని సాక్షిగా మైత్రిఁగావించుట

హనుమంతుఁడు ఋశ్యమూక పర్వతమునుదాటి సుగ్రీవుఁడున్న మలయపర్వతశిఖరమునకుంబోయి, యాత నికి, రామలక్ష్మణులనుజూపి, యిట్లనియెను. సుగ్రీవా! సత్యపరాక్రముఁడును, మహాపండితుఁడు నగు నితఁడే శ్రీరా ముఁడు. ఈతనికన్నివిధములుగను సరితూగు నితఁడులక్ష్మ ణుఁడు. రామునితమ్ముఁడు. వీరిరువురును నిన్నుజూడఁగోరి నాతోవచ్చిరి. వీరిక్ష్వాకువంశీయులు. దశరథమహారాజ కుమారులు. శ్రీరాముఁడు తండ్రియాజ్ఞనుబాలించి యడవు లకురాగా నీతనిభార్యయైనసీతను, రావణుఁడుదొంగతనముగా నపహరించెను. కావున శ్రీరాముఁడు నిన్నుశరణమంద, వచ్చినవాఁడు. ఈతనితండ్రి, యశ్వమేధాది యజ్ఞములను, బ్రాహ్మణులకు వేలకొలఁదిగోవులను దక్షిణలుగానిచ్చి, యాచరించిన రాజర్షి. జితేంద్రియుఁడు. సత్యవాది. ఈభూమినంతను ధర్మముదప్పక పాలించెను. అట్టిదశరథుని బెద్దకొడుకు శ్రీరాముఁడు. ఈసోదరులిరువురును నీతోసఖ్యమును

గోరుచున్నారు. వీరన్ని విధములచేతను నీకుఁబూజనీయులు. కావునవీరిని గౌరవించుము. అనిసుగ్రీవునితో హనుమంతుఁడు వలికెను. సుగ్రీవుఁడును హనుమంతునిమూలముగా నంతవర కునుగల భయమునువిడిచెను.

శ్లో॥ సకృత్వా, మానుషం రూపం, సుగ్రీవః ప్లవగాధిపః।
దర్శనీయతమో భూత్వా, ప్రీత్యా ప్రోవాచ రాఘవమ్॥
స. 5 శ్లో॥-9

తా॥ వానరరాజైనసుగ్రీవుఁడు మనుష్యరూపధారియై, యత్యంత మనోహరాకారముతో, దివ్యమంగళవిగ్రహు డైన శ్రీరామునిజూచి యుప్పొంగుచు నిట్లనుచున్నాఁడు.

శ్రేష్ఠుఁడైనమానవునితోఁ దానుసమానుఁడు గావలె నన్న యాతని యాకారమునుధరించి ప్రసంగించుటధర్మము, తొలుత హనుమంతుడును నిట్లేమానవభిక్షుకరూపముతో, శ్రీరాముని దర్శించి మాటలాడెను.

శ్రీరామమూర్తీ! నీవుధర్మమును దప్పనివాఁడవు. పరాక్రమవంతుఁడవు.సర్వభూతదయాళుఁడవు. ఈహనుమంతుని మూలమున నీకల్యాణగుణములనెల్ల వింటిని. ఓమహారాజా! సామాన్య వానరజాతికిఁజెందిన నాతోనీవు సఖ్యమునుగోరుట లోనే, నీసౌజన్యము వెల్లడియైనది, నీమూలముగా, నాకార్యముగూడ నెరవేరునని యానందించుచుంటిని. ఓరామా! నాతోస్నేహమును గోరినవాఁడవైనచో, ఇదిగో!

ఈనాచేతినిజాపుచున్నాను. హృదయపూర్వక మైత్రిభావముతో నేనందించుచేతిని గ్రహించుము. అనఁగావిని వెంటనే శ్రీరాముఁడు తనచేతితో సుగ్రీవునిచేయిఁ బట్టికొని తన ప్రగాఢస్నేహభావమును వెల్లడించెను. అంతంబోకసుగ్రీవుని గట్టిగాఁగౌఁగిలించికొని తనయానందమును విశదీకరించెను. తరువాత హనుమంతుఁడారామసుగ్రీవులమధ్య నెండుకట్టెలనుబెట్టి యగ్నిని రగుల్కొలిపెను. వారాయగ్నిదేవుని బుష్పాదులతో నాహ్వానించి పూజించి, హోమములుచేసిరి. తరువాత వారుభయులును చేయిఁజేయింగలిపి, మున్మారు ప్రదక్షిణలఁగావించిరి. ఆవిధముగా వారగ్నిసాక్షిగా మైత్రినిగావించికొనిరి. అట్లువారుభయులును జాలసేపు పరమానందపరవశులై, యొకరి నొకరు చూచికొనుచుఁ నెంతకును దృష్టినందకుండిరి. అంతఁగొంతసేపటికి సుగ్రీవుఁడు "శ్రీరామభద్రా! మన మిరువురమును ప్రాణమిత్రులమైతిమి. ఈపైని గలుగుసుఖదుఃఖములను మన మిరువురమును సమానముగాననుభవించఁగలము." అనియెను.

శ్లో॥ త్వంవయస్యోఽసి మేహృద్యో హ్యేకందుఃఖం సుఖంచనౌ।
సుగ్రీవో రాఘవంవాక్య మిత్యువాచ, ప్రహృష్టవత్ ॥
స. 5, శ్లో॥-18

తా॥ సుగ్రీవుఁడు పరమానందభరితుఁడై 'రామా! ఇప్పటినుండియును, నీసుఖదుఃఖములునాకును, నాసుఖదుఃఖములునీకును, సమానముగా ననుభవింపఁదగును.' అని పలికెను.

అగ్నిసాక్షిగా వివాహమాడినదంపతులుగాని, మైత్రి గావించికొన్న యాప్తమిత్రులుగాని, కష్టసుఖములలో నొకరి నొకరువిడువక సహాయమొనరించికొనుట యుత్తమ ధర్మము.

తరువాత సుగ్రీవుఁడు బాగుగా పలవలతో విస్తరించిన మామిడికొమ్మనువిరిచి తెచ్చి, యందొకవంక శ్రీరాముని గూర్చుండఁజేసి, తానొకవంకఁగూర్చుండెను. అట్లే హనుమంతుఁడును, నొకచెట్టుకొమ్మను దెచ్చి, లక్ష్మణుని గూర్చుండఁజేసెను. అట్లుగూర్చున్న శ్రీరాముని జూచుచు నానందబాష్పములు రాలఁగా, సుగ్రీవుఁడిట్లనియెను. రామభద్రా! వినుము! నాయన్నయైన వాలినాభార్య నపహరించి, నన్ను రాజ్యమునుండి దరిమివేసి, చంపఁబోగా, రహస్యముగా నీకొండను, వనమును నాశ్రయించి, జీవించుచుంటిని. నాయన్నవాలి యిక్కడఁగూడ నన్నుండనీయక యేయుపాయమున నన్నుజంపునో? యని భయభ్రాంతుఁడనై యున్నాను. ఓ శ్రీరామప్రభూ! వాలివలన నాకుభయము లేనట్లుగా, నీవేమిచేసినను సంతోషించుదును. ఆర్తుఁడనై నీ యభయమును వేడుకొనుచున్నాను. ఆమాటలువిన్న

శ్రీరాముఁడు చిఱునవ్వుతో నీవిధముగాఁ జెప్పఁదొడఁగెను. సుగ్రీవా ! భయపడకుము ! నిజమైనమిత్రుఁడు, తనమిత్రున కుపకారముచేయుటయేధర్మము. కావున నేను నీయన్న, వాలిని సంహరించి, నీభార్యతోఁబాటుగా నాతనిరాజ్యమును గూడ నీకప్పగించఁగలను. నాబాణములు సూర్యకిరణముల వంటి కాంతిఁగలవై, తిరుగులేనివేగముతో శత్రుసంహార మును జేయును. అవి యింద్రుని వజ్రాయుధమువంటివి. ఆబాణప్రభావమునుగూడ నీవుస్వల్పకాలములోనే చూడఁ గలవు. అట్లు తనహితమునుగోరి పలికెడిమాటలనువిన్న సుగ్రీవుఁడు సంతృప్తితో నిట్లనియెను. ఓవీరాగ్రేసరా ! రాఘవేంద్రా ! నీయనుగ్రహముచే నాప్రియురాలిని, రాజ్య మును, దప్పక పొందఁగలను. కావుననీవుచెప్పినట్లుగా నాశత్రు వైనవాలినిజంపుము. అనియెను. ఇక్కడ శ్రీరామసుగ్రీవుల మైత్రి స్థిరపడినంతనే లంకలోనున్న, సీతకునెడమ కన్నదరినది. అట్లేపురుషులైన రాక్షసవీరులకును నెడమకన్నులదరినవి.

## సుగ్రీవప్రతిజ్ఞ - శ్రీరాముని సంతోషము

శ్రీరామచంద్రా ! నాకుమంత్రియై, నిన్నునావద్దకుఁ దీసికొనివచ్చిన యీహనుమంతుఁడు నిన్నుగూర్చి యంత యును, నాకుఁజెప్పినాఁడు నీవు తమ్ముఁడైన లక్ష్మణునితోఁ గూడి వనవాసము చేయుచుండఁగా, మీరుభయులును లేని సమయమున, రావణుఁడు నీభార్యయైన సీత నపహరించగా,

వాసినష్టుఁగొనిన జటాయువు మరణించుటయు, నేడ్చుచున్న సీత నాకాశమార్గమున రావణుఁడు గొనిపోవుటయు, మొదలైన సంగతుల నెల్లఁ జెప్పినాఁడు. నీవు భార్యావిరహదుఃఖమును స్వల్పకాలములోనే పొగొట్టికొనఁగలవు, సోమకరాక్షసునిచే నపహరింపఁబడిన వేదము నానాఁడు మత్స్యమూర్తియైన మహావిష్ణువు మఱలఁదీసికొనివచ్చినట్లు సీతాదేవియెందున్నది యును వెదకఁజేసి, యామెను దెచ్చి నీకు సమర్పించఁగలను. శత్రుసంహారకుఁడవైన యోరామా! ఆరావణుఁడు సీతను పాతాళమున దాచినను, నంతరిక్షమున దాచినను, నామెం గనిపెట్టి తెచ్చి నీకుసమర్పించఁగలను. నావాక్యమునందలి సత్యమును విశ్వసించుము. ఓమహాబాహూ! రాఘవా! నీభార్యయై పతివ్రతామతల్లియైన సీతను హరించి, యింద్ర సహితులైన దేవదానవులం దెవ్వరును జీర్ణించికొనలేరు సుమా! అదివిషముగలిసిన పిండివంటయేయగును. మఱియు నోరామా! వినుము! నీప్రియురాలిని నీకు నేఁదీసికొనివచ్చి సమర్పించికొందును. అనుమానమును విడిచి, దుఃఖమునందక, సుఖముగానుండుము. నామాటలలో నేమాత్రము నసత్యము లేదని గ్రహించుము. రామచంద్రా! వెండియు వినుము! మాటిమాటికిని రామా! లక్ష్మణా! యనుచు, నాక్రోశించు చుండఁగా సీతను రావణుఁ డపహరించికొనిపోవుట మేము చూచితిమి. ఆమె తనయాభరణములనుదీసి, తనపైఁట కొంగునుజింపి, దానిలోమూటఁగట్టి యీకొండపైఁ బడవైచి

నది. ఆమూట నచ్ఛిద్రపరచితిమి. దాని నిప్పుడే నీకుఁ జూపించెదను. వానిగుర్తులను గమనించుము. అనిచెప్పుచునే సుగ్రీవుఁడు తనగుహాభ్యంతరమును బ్రవేశించి, యానగల మూటను దెచ్చి, శ్రీరామునిముందుంచెను. శ్రీరాముఁడా యుత్తరీయముతోఁగూడిన యాభరణములఁ జూడఁగనే, కన్నీరు ముఖమును గప్పివేయఁగా, మంచుచేఁగప్పఁబడిన, చంద్రబింబమువలె నాతని ముఖము ప్రకాశించినది. సీతాదేవియందలి రాగాతిశయముచే, "హా! ప్రియురాలా!" యనుచు, నేలకొరిగెను. కొంతవడికి లేచినవాఁడై, యాయాభరణములను దనగుండెలకద్దుకొనుచు, గొప్పకోపముతోఁ బుట్టకన్నమునుండి బుసకొట్టుచున్న సర్పమువలె, వేడినిట్టూర్పులను విడుచుచుఁ గంటికినిమంటికి నేకధారగాఁ గన్నీరుగార్చుచు, నేడ్చెను. ఆసమయమున దగ్గరగానున్న లక్ష్మణునిజూచి, యిట్లనియెను. ఓయీ! లక్ష్మణా! చూచితివా! సీతయపహరింపఁబడుచునే, తనశరీరమునుండి, పైకిఁ దీసి, నేలఁబడవైచిన యీయుత్తరీయము నిండఁగట్టఁబడిన యాభరణములను జూడుము. ఈమూట క్రిందనున్న పచ్చిక బయలుపైఁ బడవేసియుండును. కావుననే యీమూట విడిపోక యిందలి యాభరణములు చెడిపోకుండఁగాఁ బ్రకాశించుచున్నవి. అనఁగా విని లక్ష్మణుఁడా యాభరణములను జూచుచు, నిట్లనుచున్నాఁడు.

శ్లో॥ నాహంజానామి కేయూరే నాహంజానామి కుండలే ।
నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్ ॥
స. 6 శ్లో॥

తా॥ అన్నా ! ఈమూటయందున్న బాహుపురులుగాని, చెవులకుధరించు కుండలాలుగాని, యెవరివోనాకుఁ దెలియదు. కాని, యీయందెలుమాత్రము మావదినవే యని చెప్పగలను. కారణమేమందువా ? నేనామెముఖమును గన్నెత్తి తేరిపారనెన్నఁడును జూడలేదు. నిత్యమును దెల్లవారఁగనే లేచి, నీపాదములతోఁబాటు నామెపాదములకుశిరసానమస్కరించునప్పు డామెపాదములనున్న యందెలనుజూచెడివాఁడను. కావుననే వానినిగుర్తుపట్టఁగలిగితిని. (ఇచ్చట ఈమాటలచే లక్ష్మణుఁడు తొలుతఁ దల్లిచెప్పినట్లు "మాంవిద్ధిజనకాత్మజామ్" అన్నమాటల నక్షరములాపాటించె నని తెలియుచున్నది.)

పెద్దన్నగారు తండ్రికిని, నాతనిభార్య తల్లికిని సమానులని మిగిలినసోదరులుభావించుటధర్మము.

లక్ష్మణునిమాటలువిని శ్రీరాముఁడు సుగ్రీవునిజూచి, యోసుగ్రీవా ! ఈమె యేదిశగానపహరించికొని పోబడినది? నీవామెనెక్కడఁజూచితివి ? ఆరావణుఁ డెట్లుపోయినాఁడు ? నాకుఁజెప్పుము. ప్రాణప్రియతమయైన నాసీత, నెక్కడ రావణుఁడుంచినాఁడు ? ఆదుర్మార్గుఁడు కారణముగా, సమస్త

రాక్షసగణంబులను నశింపఁజేయుదును. నాకు దుఃఖమును క్రోధమును గలిగించిన యారాక్షసునకుఁ జావుదగ్గరఁబడి నది. చెప్పుము! సుగ్రీవా! ఇప్పుడే వానిని, యమలోకము నకుఁ బంపుదును.

## శ్రీరాముఁడు సుగ్రీవునిచే శాంతినిబొంది వాలివధకుఁ బ్రతిజ్ఞఁజేయుట

శ్రీరాముఁడు భరింపరాని యార్తిఁగలవాఁడై సీతా వృత్తాంతము నడుగుచు దుఃఖించుచుండెను. సుగ్రీవుఁడును, సమానదుఃఖముతోఁ గండ్లవెంబడి నీరుగార్చుచున్నవాఁడై, బొంగురుపోయిన కంఠధ్వనితో నిట్లనియెను. శ్రీరామ చంద్రా! ఆరావణుని నివాసముమాత్ర మెఱుంగుదును. వానికులగోత్రములుగాని, బలపరాక్రమములఁగూర్చిగాని, నాకంతగాఁ దెలియదు. అయినను, వాఁడుసీత నెక్కడదాచి యుంచినను వెదకివెదకి యామెను నీకప్పగించఁగలను. నన్ను నమ్ముము! దుఃఖమునువిడుపుము! సీతాన్వేషణకై తగిన ప్రయత్నమును జేయుదును. నేను నాసమస్త సైన్యపరివార సహితము నీతోవచ్చి, యారావణుని సంహరించి, సీతను నీకప్పగించి, నీకానందమును గలిగించఁగలను. ఇంకదైన్య మునువిడిచి ధైర్యము నవలంబించుము. నీసహజమైన ధీరత్వ మును విడువకుము. నీవంటివాఁడీవిధముగా విలపించుట దగదుసుమా! నాకునుభార్యతో నెడబాటుకలిగినది. కాని

దుఃఖమునందుచునే ధైర్యమును మాత్రము విడువలేదు. నీవు మహాత్ముఁడవు. సర్వజ్ఞుఁడవు. నీవిట్టిదైన్యమును బొంద రాదు. ధైర్యముతోఁ గన్నీటినాపుకొనవలెను. సర్వశక్తి సామర్థ్యములును, మర్యాదయునుగల, నీవంటివాఁడు కష్టము లెన్నివచ్చినను జివరకుఁ బ్రాణాపాయమే కలిగినను ధైర్యము విడువఁడు. ఎవఁడు మూర్ఖుఁడై, యేమాత్రమును సహింపలేనివాఁడైయుండునో, యట్టివానిజీవిత భారమును సహింపలేక సముద్రమున నటునిటుగొట్టుకొనిపోవు నౌకవలె, శాంతిలేకయుండును. ఓరామచంద్రా! నీయెదుట దోసిలి యొగ్గి, వేడుకొనుచున్నాను. పౌరుషము నాశ్రయించి, శోకమువిడిచి, ధైర్యము నవలంబింపుము.

శ్లో॥ లోకే సాభిప్రపన్నస్య జీవితేనాపి సంశయః।
తేజశ్చక్షీయతే తేషాం, ధైర్యమాశ్రయ కేవలమ్॥
నశోకంత్యజ, రాజేంద్ర! నత్వం శోచితుమర్హసి.

స. 7, శ్లో॥ 13.

తా॥ సుక్షత్రియుఁడవైన శ్రీరామభద్రా! శోకము నకులొంగిపోయినవాఁడు, జీవించుటయేకష్టము. ఒకప్పుడు జీవించినను, వానితేజోబలములు క్షీణించిపోవును. కావున నన్నియుందెలిసి నీవు. ప్రాకృతునివలె శోకింపఁదగదు. ధైర్య మవలంబింపుము!

మానవుఁ డెట్టిపరిస్థితియందును ధైర్యమొక్కటి యున్నచో సర్వకార్యములను సాధింపగలఁడు.

రామచంద్రా ! నేనుసామాన్యవానరుఁడనే యైనను, నీతో మైత్రిప్రభావముచే నింతవరకును దుఃఖసమభాగినై చెప్పఁగలిగితిని. అంతియేగాని, నీకుం దెలియదని, ధర్మబోధ చేయుటగాదు. నాకునీవు పూజనీయుఁడవైన ప్రాణమిత్రుఁడవు. నీదుఃఖమును సహించలేను. అని సుగ్రీవుఁడు వినయమధురవాక్యములతో నోదార్చఁగా శ్రీరాముఁ డావెంటనే తనయుత్తరీయముతో ముఖమును దుడిచికొని, యాప్తమిత్రుఁడని ఋజువుచేసికొన్న యాసుగ్రీవుని గాఢముగాఁ గౌఁగిలించికొని, యిట్లనుచున్నాఁడు. ప్రియమిత్రమా ! సుగ్రీవా ! నీయమృతవాక్కులచే, నేనిప్పటికి నాయథాస్థితికి రాఁగలిగితిని. ఇట్టి సమయములో నీవంటియుత్తమమిత్రుఁడు లభించుట దుర్లభము. ఇంక రావణుఁడెక్కడనున్నాఁడో ? సీత నెక్కడదాచినాఁడో ? నీవుతెలిసికొనుటకుఁ బ్రయత్నము చేయుటతప్పదు. అంతియేగాదు. నీకు నేనుజేయవలసిన కార్యమువిషయమై నన్నేమిచేయుమందువో, తెలియఁజేయుము. వర్షకాలములో భూములన్నియును బంటకుసిద్ధముగా నున్నట్లు నాయందు నీకార్యమును ఫలింపఁజేయు శక్తిసామర్థ్యములు సిద్ధముగానున్నవి. నావలన నీకు సమస్తకార్యములును ఫలించుట నిశ్చయము. అనుమానించక చెప్పుము. నేనువాలిని జంపుమనన్నమాట సత్యమని భావించుము. ఈనిమిషమువరకును, నేనేవిషయమందు నసత్య

మాడియెఱుఁగను. అయినను మఱలనిప్పుడు 'వాలినిసంహ
రించుదు'' నని శపథము చేయుచున్నాను. అనఁగా నాసుగ్రీ
వుఁడు శ్రీరాముఁడు మాటలతోనేగాక ప్రతిజ్ఞాపూర్వక
ముగాఁ జెప్పినందులకుఁ బరమానందభరితుఁడయ్యెను.
ఇట్లు శ్రీరామసుగ్రీవులు రహస్యముగా నొక్కచోటఁ జేరి,
పరస్పరకష్టసుఖములఁ జర్చించికొనిరి. ఆసంభాషణలచే నెవ
రికివారే తమతమకష్టములు పోయిసుఖారంభములైనట్లు
సంతోషించిరి.

## సుగ్రీవుని శరణాగతి

శ్రీరామవాక్యములనువిన్న సుగ్రీవుఁడు సంతృప్తిఁ
గలవాఁడై రామలక్ష్మణులతో నిట్లనుచున్నాఁడు. రామా!
నీవంటిమహాత్ముఁడు నాకుమిత్రుఁడై యుండఁగా, సమస్త
దేవతానుగ్రహమును బొందినవాఁడనైతిని. నీవు సర్వసద్గుణ
సంపన్నుండవై, ధార్మికప్రభుఁడవై, నాతోమైత్రి నంగీక
రించుటచే, నీనాస్వల్పమైన రాజ్యమే యననేల స్వర్గరాజ్య
మునే సంపాదించఁగలను. అగ్నిసాక్షిగా, నాకుమిత్రుఁడ
వౌటచే, నీవలన సమస్తబంధుమిత్రాదులకును బూజనీయుఁడ
నగుదును. నేనునునీకుఁదగిన మిత్రుఁడనని క్రమముగాఁ
దెలిసికొనఁగలవు. నాకు నేనుబొగడికొనుట సమ్మతముగాదు.
ఆత్మజ్ఞానసంపన్నులై, మహాత్ములైన నీవంటివారల కెవరిపై
ననుగ్రహముగలిగినను, ధీరులకు ధైర్యమువలె సుస్థిరమైన

యోగక్షేమములను గలిగించును. నిజమైన మిత్రులు బంగారము, వెండి, రత్నాభరణాదులు, దివ్యవస్త్రసముదాయములు, మొదలైనవాటినన్నిటిని, నభేదభావముతోఁ జూచికొందురు. ధనవంతుఁడైనను, దరిద్రుఁడైనను, సుఖియైనను, దుఃఖముతోనున్నను, సుగుణాత్ముఁడైనను, దుర్గుణవంతుఁడైనను, మిత్రునిమించినగతి యింకొకటిలేదు. ధర్మాత్ముఁడు మిత్రునివిషయమై, ధనప్రాణములనైనను ద్యాగముచేయుటకు వెనుదీయఁడు. అట్టియుత్తమమిత్రుఁడవు నీవులభించుట నాభాగ్యము. అనిసుగుణాత్ముఁడైన లక్ష్మణస్వామి వినుచుండఁగా సుగ్రీవుఁడుమాటలాడుటకు సంతసించి శ్రీరాముఁడుఁ సుగ్రీవా! నీవుపలికినదంతయును ధర్మసమ్మతమును సత్యముచునై యున్నది. అనఁగావిని సుగ్రీవుడును వనమందు బాగుగాపుష్పించి, చిగిర్చిన యాకులతోనిండిన యొక వృక్షముయొక్క బలిష్ఠమైనకొమ్మను విరిచితెచ్చిదానిపై శ్రీరామునిగూర్చుండఁజేసి, తానును నొకప్రక్కగాఁ గూర్చుండెను. అంతహనుమంతుఁడు వేరొకచెట్టుకొమ్మను విరిచితెచ్చి దానిపై లక్ష్మణుని గూర్చుండఁజేసి, వినయవిధేయతలుట్టిపడున ట్లాసమయమునఁ బ్రవర్తించెను. (మానవుఁడెండటినో మోసగించి, యెన్నోయక్రమాలుచేసి, ధనమునుసంపాదించి, దానితోసకలభోగముల ననుభవించుచున్నానని మొదటగర్వించినను, జేసినపాపఫలానుభవము నీజన్మలోనే యనుభవించునప్పుడు పశ్చాత్తాపముపడవలసి

వచ్చును. కావున నెన్నికష్టము లనుభవించుచున్నను, ధర్మాత్ముడైన యుత్తమమిత్రుని సంపాదించికొన్నవాని యానందము శాశ్వతమైనదనియు, మున్ముందు సర్వసౌఖ్య ప్రదమనియు నెఱింగి యందులకై యత్నించుట సర్వశ్రేయ మని యీ శ్రీ మత్సుగ్రీవులమైత్రి సంభాషణలవలన మనకుఁ దెలియుచున్నది.

ప్రశాంతమై, గంభీరమైన సముద్రమువలె, నాకొండపైఁగూర్చున్న శ్రీరామునిజూచి, నిండుమనంబుతో నానందించుచున్న సుగ్రీవుఁడు తనయానందమును వ్యక్తము చేయుచున్నవాఁడై, మధురముగా శ్రీరామునితో నిట్లను చున్నాఁడు. రామా! నేను నాయన్నకు భయపడి, యీ ఋశ్యమూకమున నివసించుచున్నాను. నిర్దోషినైన నాయందు నాయన్న యకారణవైరమును బూనెను. కావున నేమియుందోఁచక యిట్లుదుఃఖపడుచున్నాను. నీవుసర్వలోక శరణ్యుఁడవు. నాకు వాలివలన భయములేకుండఁ గాపాడుము. అంత రాముఁడామాటలకుఁ జిఱునవ్వునవ్వుచుఁ దేలికగా నిట్లనెను. సుగ్రీవా! నిజమైన మానవుఁడు మిత్రునకుప కారముచేసి యానందించుట సహజలక్షణము. అపకార మొనర్చుట శత్రువుయొక్క లక్షణము. కావున నిప్పుడే యావాలిని సంహరించి, నిన్నానందింపఁజేయఁగలను. నా బాణములు గొప్పవేగముగలవియేగాక, మిక్కిలిబలిష్ఠము లైనవి. అవిశరవణమునఁబుట్టి, బంగారముతో నలంకరింపఁ

బడినవై, కంకపక్షులఱెక్కలనుగట్టఁగా, దేవేంద్రుని వజ్రా
యుధముతో సమానములై యున్నవి. మఱియుఁ దీవ్రముగాఁ
గోపించిన సర్పములవలెఁ బైకిఁదీసినంతనే వేగముగాఁబోయి,
శత్రుసంహారమును జేయఁగలవు. కావున నింకనీయన్నయనెడి
శత్రువుపెద్దకొండవలె నేలంగూలుట నీవుచూడఁగలవు.
అంత సుగ్రీవుడు శ్రీరామునిమాటలనువిని పరమానంద
భరితుఁడయ్యెను. మఱియు నిట్లనుచున్నాఁడు. శ్రీరామ
భద్రా! దుఃఖభాజనులకెల్లరకును గతివైనవాఁడవై, విశే
షించి నాకుమిత్రుఁడవగుటచే, నాకష్టములన్ని నీతో మొఱ
వెట్టికొంటిని. దిక్కులేని నాభయమును బోఁగొట్టి, నన్నను
గ్రహించుము. అగ్నిసాక్షిగా మనమిరువురము మిత్రులమై
తిమి. నీవునాకుఁబ్రాణాధికుఁడవు. ఇందుసందేహము లేదు.
సత్యముగాఁ బ్రమాణము చేయుచున్నాను. కావుననే
నాహృదయావేదనను నీతోఁజెప్పుకొనుచున్నాను. అని
చెప్పుచు నాపుకొనలేని దుఃఖముతో గట్టిగానేడ్చుచుఁ దరు
వాత మాటలాడలేకపోయెను. అయినను శ్రీరామసన్నిధి
నున్నవాఁడగుటచే, వెంటనేశాంతించి, పొంగిపొరలుచున్న
కన్నీటిని దుడిచికొనుచు, మంగళకరములైన నేత్రములను
విప్పి, మఱల నిట్లనుచున్నాఁడు.

రామచంద్రా! వాలినన్నుబడఁదిట్టుచు, రాజ్యము
నుండి వెడలఁగొట్టుటయేగాక, నాప్రాణప్రియయైన భార్య
నపహరించినాఁడు. నామిత్రులైనవారిని గారాగృహమున

బంధించినాఁడు. ఇప్పటికిని నన్నుజంపుటకే, ప్రయత్నించు చున్నాఁడు. అందులకు బలిష్ఠులైన వానరులను నాపైకిఁ బంపఁగా, నేనువారినందఱను సంహరించితిని. అట్లే నీవును, వాలిచేఁ బంపఁబడినవాఁడవేమోనని, భయపడినీసన్నిధికి స్వయముగా రాలేకపోయితిని. ఇప్పుడీహనుమదాదులు సహాయులై యుండుట చేతనే, యింతటిమహాదుఃఖమునుగూడ దిగమ్రింగికొని, జీవించియున్నాను. వీరునాయందు గాఢాను రాగులై, నేనెందుఁబోయినను, నాతోవచ్చుచు, నాతోనివ సించుచుండిరి. సుప్రసిద్ధపరాక్రముఁడు నాయన్నయైనవాలి నాకు శత్రువగుటచే, వానియొక్క మరణానంతరమే, నాదుఃఖముతీరుటకాఁగలదు. నాసుఖముతోఁగూడిన జీవితము, వానిమరణానంతరమేగడచును. సుఖదుఃఖములం దెవనికైన, నుత్తమమిత్రుఁడేగతియగును. కావున నాకష్టములను నీతోఁజెప్పికొనుచున్నాను. అనఁగా విని శ్రీరాముఁడు, "మిత్రమా! నీకునువాలికిని గలవైరకారణమేమి? ఉన్నది యున్నట్లుగా వివరించుము. అప్పుడుశత్రువుయొక్క బలాబలముల నెఱింగి, వానినిసరియైనయుపాయముతో సంహరించఁగలను, వాలి నిన్నవమానించినట్లు తెలిసికొన్నంతనే, నాహృదయముచలించి, వర్షకాలమందలి జలప్రవాహమువలె, నాకోపముపొంగి, పొరలుచున్నది. నీవుస్వస్థచిత్తుఁడవై జరిగిన విషయముం జెప్పుము. నాబాణమును విడిచితినా? శత్రువు చచ్చినట్లే భావించుము. శ్రీరాముఁడీమాటలను జెప్పు

చుండఁగాఁ దననలుగురుమంత్రులతోడనుగూడిన సుగ్రీవుఁడు చాలసంతోషించెను. అతఁడాతరువాతఁ బ్రశాంతచిత్తుఁడై, తనయన్నతోఁగలిగిన వైరకారణమును సవివరముగానిట్లని చెప్పెను.

## సుగ్రీవుఁడు - వాలియొక్క పరాక్రమమును దనతోవైరమును దెలుపుట

శ్రీరామచంద్రా! వినుము! మొదటమాతండ్రిగారినివాలియునేనును జాలగౌరవముతోఁ బూజించెడివారము. తండ్రిగారియనంతరము, వాలి పెద్దవాఁడగుటచే మంత్రులందఱుఁగలిసి, వాలికిఁ గిష్కింధారాజ్య పట్టాభిషేకమును గావించిరి. నేనాతనికి సన్నిహితుఁడనై, వినయవిధేయతలతో నుండెడివాఁడను. ఇట్లుండఁగా, దుందుభికుమారుఁడైన మాయావి యనువానితో, నొకానొకస్త్రీసంబంధమైన విరోధము తటస్థించినది. ఆమాయావి యొకనాఁ డర్ధరాత్రమున నందఱునుగాఢనిద్రాపరవశులై యుండఁగా, వాఁడు కిష్కింధకువచ్చి, గర్జించుచు, వాలినియుద్ధమునకుఁ బిలిచెను. అంతవాలియు వానిగర్వగర్జనమువిని, సహించలేక నిద్రనుండి లేచి, యుద్ధమునకు వెడలెను. ఆసమయమున నంతఃపురస్త్రీలును నేనును నాతనిని నివారింపఁబ్రయత్నించి, విఫలులమైతిమి. తుదకు నేనును, నాతనివెంట యుద్ధమునకుఁ బోయితిని. మమ్ములనుజూచి యామాయావి భయపడిపారిపోయెను.

వానిని వెంటఁదరుముచు వాలితోఁబాటు నేనును బరివారమును వెళ్ళితిమి. ఆసమయమునఁ జంద్రోదయమైనకారణముగా, శత్రువుపోవుచున్న మార్గము స్పష్టముగాఁ గనఁబడుచుండెను. ఇంకమేము వానినిబట్టుకొనఁబోవు సమయమున, వాఁడాసమీపమున గడ్డిమొదలైనవానితోఁగప్పబడి, చీకటిగానున్న యొకబిలమును బ్రవేశించెను. అప్పుడువాలి కోపముతో మండిపడుచు, నన్నుజూచి తమ్ముఁడా! నేనీబిలముం జొచ్చి యామాయావిని సంహరించి, త్వరలో నేరాఁగలను. అంతవరకును నీవీబిలద్వారమున జాగరూకుఁడవై, యుండుము. అనిచెప్పి యాతఁడులోనఁ బ్రవేశించెను. నీతోఁ బాటు నేనుబిలమును బ్రవేశించుదు"నని యెంతవేడికొన్నను సమ్మతించక యాతనిపాదములుసాక్షిగా నాచేఁబ్రమాణము చేయించెను. అట్లుతానొక్కఁడే యాబిలమును బ్రవేశించెను. ఆవిధముగా వెళ్ళినవాలి వానితోనొకసంవత్సరము పోరాడెను. అంతవరకును నేనాబిలద్వారముననే నిలిచియుంటిని. ఎప్పటికిని నాయన్నరాకపోవుటచే "అతిస్నేహః పాపశంకి" యన్నన్యాయముచే. వాలిచనిపోయియుడుననియు నారాక్షసుఁడు త్వరగాబయటకువచ్చి నన్నునుజంపఁగలఁడనియు, ననుమానముగలిగినది. తరువాతఁజాలకాలమున కాబిలమునుండి, బయటకు రక్తము బ్రవహించినది. దానితో నేనుమఱింతగా దుఃఖించితిని.

అంతటితోఁబోక యాబిలమునుండి రాక్షసులయొక్క పెద్దధ్వనియును, నాయన్నయొక్క దీనస్వరమును విన

వచ్చెను. అంతనాయనుమానమును దృఢముచేసికొని, దుఃఖము తోడను, భయముతోడను, నొక పెద్దరాతిపలకను నాబిలమున కడ్డముగా నైచి మూసివేసితిని, తరువాతమంత్రులతోఁ గూడ నాయన్నకు జలతర్పణాదులఁ గావించి, కిష్కింధకుఁ జేరికొంటిని. నేనెంతఁగావలదని చెప్పుచున్నను, మంత్రులందఱు నేకగ్రీవముగా నన్ను రాజ్యపట్టాభిషిక్తుని గావించిరి. శ్రీరామచంద్రా! నేనుధర్మయుక్తముగా, రాజ్యపాలనఁ గావించుచుండఁగాఁ గొంతకాలమునకు వాలియామాయావిని సంహరించి, బిలమున కడ్డముగానున్న రాతిబండనొకేయొకతాపుతోఁ బడఁగొట్టి తిన్నగాఁ గిష్కింధకువచ్చెను. రాజునై యున్న నాయందుఁ గోపముతోఁ బండ్లుపటపటఁగొరుకుచు, నామంత్రులనందఱను గారాగారమున బంధించెను. ఆసమయమున నాతఁడునన్నాడిన దుర్భాషలను మఱల నేనుజెప్పలేను. రాఘవేంద్రా! నేనాతనితోఁ బోరాడశక్తిఁగలవాఁడనయ్యును. "జ్యేష్ఠభ్రాతాపితృసమానః" యన్న న్యాయము ననుసరించి, మాఱుమాటాడలేదు పైగాసగౌరవముగా సింహాసనముదిగి నమస్కరించితిని. అట్టినన్నాశీర్వదించుటఁగూడ నాతఁడు మానెను. అయినను నేనుగిరీటమునుదీసి యాతని పాదంబులం బెట్టితిని. మఱియు సాష్టాంగ దండప్రణామములఁగావించితిని. అప్పటికిని వాలిశాంతించలేదు. అయినను నేనాతనిని సంతోషింపఁజేయుటకుఁ జాలప్రయత్నించితిని. అత్యంతప్రియవాక్యముల నేన్నోపలికితిని.

శ్రీరామచంద్రమూర్తీ! వినుము! క్రోధపరవశుండై యున్న నాయన్నతో మఱలనిట్లంటిని. ఓయన్నా! నాయదృష్టవశమున నీవుశత్రువునుజంపి. వచ్చి, నాకుదర్శన మిచ్చితివి. అనాథుడనైన నాకునీవేనాథుండవు ఇదిగోఇదే! అందమైనశ్వేతఛత్రము నీకుంబట్టెదను. అంతియేగాక యీ వింజామరములతో వీచెద. ఓమహారాజా! నేనాబిలద్వారమున నొకసంవత్సరముపైగా వేచియుంటిని. కానినీవురాలేదు. సరిగదా, యాబిలద్వారమునుండి, రాక్షసులహర్షధ్వానములు వినంబడినవి. అప్పుడు రక్తముబయటకుం బ్రవహించినది. ఆయట్టహాసమంతయును జూచి నేనాబిలద్వారమును గప్పి పైచి, దుఃఖశోకములతో నిండినహృదయము గలవాండనై, నేనుదిరిగి, గిష్కింధలోం బ్రవేశించితిని. విచారగ్రస్తుండనైన నన్నుజూచి, పౌరులును, మంత్రులును బలవంతముగా నేనెంతవలదన్నను నాకుం బట్టాభిషేకము గావించిరి. ఈనీ సింహాసనముపైం గూర్చున్ననన్ను క్షమించుము. నీవులేక పోవుటచే నీరాజ్య మన్యాక్రాంతముగాకుండంగాం బాలించితిని. నాకెంతమాత్రమును దురుద్దేశ్యములేదు. అన్నా! ఈరాజ్యమంతయును నీయది. నీవీసింహాసనముపైనుండి, యీ వజ్రకిరీటమునుధరించి, యథారీతిగా, రాజ్యమును బాలించుము. నీకుసర్వదా విధేయుండనై యుందును. మంత్రులతోడను, బురజనులతోడనుగూడిన యీరాజ్యము నింతవరకును భద్రపరచితిని. ఇంక నిదియంతయును నీయధీనమై

యున్నది. నాయునది. నాలించి దీనినిబరిగ్రహించుము. వ్యర్థముగా నాయందుఁ గోపించక యెప్పటియట్ల ప్రేమను జూపుము. ఇదిగో! నాశిరస్సున దోసిలియొగ్గి, నన్ను క్షమింపఁగలందులకుఁ బ్రార్థించుచున్నాను. శ్రీరామచంద్రా! ఇందసత్యముగాని యతిశయోక్తిగాని లేదు. నేనాతఁడు మాయన్నను శాంతింపఁజేయ నెంతేఁగాఁ బ్రార్థించినను, జెవిఁబెట్టఁడయ్యెను.

రామా! నాయన్న వాలి యంతమాత్రముచ నూరుకొనక నన్ననరాని కర్ణకఠోరమైన మాటలతోఁ దిట్టిపోసినాఁడు. మఱియును మంత్రులనుఁ బ్రజలను సమావేశపరచి, యందఱిమధ్యను మిక్కిలియసహ్యకరమైన మాటల నిష్టము వచ్చినట్లు ప్రేలుచు నిట్లనియెను. "సఖ్యులారా! వినుఁడు! ఆనాటిరాత్రి నన్నుమాయావియుద్ధమునకుఁ బిలుచుచు, నీపురంబున గర్జించుటయును, నేనాతనిని దరుముకొనిపోవుటయును, మీకుఁ దెలిసినదేగదా! అప్పు డీనాతమ్ముఁడు నావెంటఁబడివచ్చినాఁడు. ఆరాక్షసుఁ డట్లు పరుగుపరుగునఁ బోయి, యొకానొకబిలమును బ్రవేశించినాఁడు. అప్పు డీక్రూరుఁడైన నాతమ్ముని బిలద్వారమున నిలిపి, నేనారాక్షసుని వెంట బిలములోఁ బ్రవేశించితిని. నేనాబిలమునుండివచ్చులోపల వీఁడుబిలమునకు వడ్డముగా నొకరాతిబండను వైచి, పురంబునకువచ్చి, పట్టాభిషిక్తుఁడైనాఁడు. నేనామహాబిలమంతయును దిరిగితిరిగి తుదకుశత్రువును బట్టికొనుటకు

సంవత్సరకాలమైనది. అంతనాతనిని, బంధుమిత్రపరివార ముగా సంహరించి, రక్తమును ప్రవహింపఁజేసి తిరిగిబిల ద్వారమునుజేరి, చాలసారులీ దుర్మార్గుని, 'సుగ్రీవా!' యని పిలిచిపిలిచి, యడ్డముగానున్న రాతిబండను ముక్కలుముక్క లుగాఁదన్ని పడఁగొట్టి, బయటఁబడితిని. అందుండి నేరుగా పురంబునుప్రవేశించుసరికి, సోదరభావమును విడిచి, నాసింహా సన మాక్రమించికొనియున్న యీదుష్టుఁడు నాకంటఁ బడెను." అనిచెప్పుచునే యోరామా! ఆవాలినన్నుగట్టు గుద్దులతోఁ బయటకుగెంటివేసెను. అంతటితోఁబోక వాఁడు నన్నుజిత్తుగాఁదన్ని నాభార్య నన్నుజేరకుండ నపహరించెను. తరువాత నన్నెట్లైనఁ జంపివేయవలెనని, యత్నించఁగా, నేనాతనికిఁ జిక్కకుండ, నాలుగు సముద్రములకునుమధ్యనున్న యీభూమినంతను నాయాకొండలను, నడవులను దిరిఁగితిని. చివరకు వాలియడుగుపెట్టరాని యీకొండ నాశ్రయించితిని. కారణాంతరముచే నాతఁడీపర్వతమున నడుగుపెట్టలేఁడు. శ్రీరామచంద్రా! వాలితోనాకుఁగలిగిన వైరకారణమును జెప్పికొంటిని. ఇందు నాదోషమేమున్నది? నీవేచెప్పుము. అయినను నాకిట్టిమహాదుఃఖము ప్రాప్తించినది. కావున భయ ముతో నార్తుఁడనైన నన్నురక్షించుటకు నీవు వాలిని సంహ రించవలెను. అనఁగానంతయును జిఱునవ్వుతోవినుచున్న శ్రీరాముఁ డిట్లనియెను. మిత్రమా! నాబాణములు సూర్య కిరణములవలె నమోఘములైనవి. అవివాలి నవలీలగాఁజంపఁ

గలవు. నీభార్య నపహరించిన యాపాపాత్ముఁడు నాకంటఁ బడనంతవరకే జీవించును. నాకంటఁబడినా, వాఁడుచనిపోయి నట్లే తెలిసికొనుము. నావలెనే నీవును భార్యాదుఃఖసముద్రమున మునిఁగియుంటి వని తెలిసికొంటిని. కావున నిన్నుదప్పక సంతోషపెట్టఁగలను. శ్రీరాముని మాటలనువిన్న సుగ్రీవుఁడు, మిక్కిలిసంతోషముతో నిట్లనుచున్నాఁడు.

## వాలియొక్క పరాక్రమము
## దుందుభిని జంపుట

శ్రీరామునిమాటల కుప్పొంగిన సుగ్రీవుఁడు ననేక విధముల నారామునిబూజించి యిట్లనెను. ఓ శ్రీరామచంద్రా! నీవుకోపించినచోఁ బ్రళయకాలసూర్యునివలెఁ బ్రజ్వరిల్లు చున్నట్టియుఁ దీక్ష్ణములై, మర్మస్థానములను భేదించునట్టియు నీబాణములు లోకములనే దహింపఁజేయఁగలవు. రాఘవా! ముందుగా వాలితేజోబలములఁ దెలిసికొని నాయందను గ్రహముతో వాలినిజంపుట నీకుసులభమగును. కావున నాతనిశక్తి సామర్థ్యములను వినుము.

శ్రీరామచంద్రా! వాలి బ్రాహ్మముహూర్తమున లేచి సూర్యోదయము గాకపూర్వమే, నొకదానివెంటనొకటిగా నాలుగుసముద్రములనుమునిఁగి సంధ్యావందనముచేయుచుండును. పర్వతశిఖరములగూడఁ బెరికి వానిని పైకెగుర

వేసి పట్టుకొనుచుండును. ఈయశవృలలో బలిసినవృక్ష రాజము లెన్నియో వాలిచే సమూలముగాఁ బెకలింపఁబడుచుండును. మఱియు వినుము! మహిషుఁడనువాఁడు సహజముగనే మహా బలశాలియై, పైగాతపమాచరించి, వరములను బొందినవాఁడై సముద్రుని జేరి, యుద్ధమున కాహ్వానించెను. అంతనాతఁడును, ఓమహిషా! నీతో నేను యుద్ధమును జేయలేను. నీకుసమాన బలుఁడును బరమేశ్వరునకు మామగారునైన హిమ వంతుఁడు నీతో యుద్ధము చేయగలఁడు. అక్కడకుఁబొమ్మని చెప్పెను. ఆవెంటనే మహిషరూపుఁడైన దుందుభి, హిమ వంతునిజేరి, యందలి పెద్దపెద్దయేనుఁగులవంటి రాతిబండలను దనకొమ్ములతో నూడఁబెరికి విసిరివేయుచుండెను. అదిచూచి హిమవంతుఁడు తెల్లనియాకారముతోవచ్చి, శాంత మూర్తియై తనశిఖరముననిలిచి, యామహిషునితోనిట్లని యెను. ధర్మమెఱింగిన యోదుందుభీ! మహర్షులకాశ్రయ మైన, యీనాస్వరూపమును బీడించుటతగదు. అనఁగావిని దుందుభి "ఓయీ! హిమవంతా! నాతోయుద్ధమునకు సమర్థుఁడవైనచో, రమ్ము! లేదా, నాకుసాటివచ్చువీరుఁ డెవ్వఁడైననున్నచోఁజెప్పుము." అనఁగావిని యాహిమవంతుఁడు దుందుభియొక్క గర్వమున కసహ్యించికొని కోపించినవాఁడై యిట్లనియెను.

ఓయీ! వినుము! మహాపండితుఁడును, దేవేంద్రుని వంటి బలముగలవాఁడును శ్రీమంతుఁడును, నగు వాలి

యగుచున్నాఁడు. అతఁడు కిష్కింధారాజ్యము నేలుచున్నాడు. సముద్రునికి వానరుఁడు నీతో యుద్ధమొనర్చుటకు దీర్ఘము గలఁడు. కావున నీవచ్చటికిఁబొమ్ము ! అతఁడు నీతో ద్వంద్వ యుద్ధమును జేయఁగలఁడు. అతఁడును నీవలెనే యుద్ధ కాంక్షతో మదించియున్నాఁడు. ఆమాటలను విన్న దుందుభి మహిషరూపమును (దున్నపోతుయొక్కరూపము) బొంది వేగముగాఁ గిష్కింధాపురంబునకువచ్చెను. వాఁడాసమయ మునవర్షకాలముల నీటితో నిండిన మహామేఘమువలె గన్పట్టెను. అట్టివాఁడా కిష్కింధాపురద్వారమునసిలిచి తనడెక్కలతో భూమినిద్రవ్వుచుఁ గంపింపఁజేయుచున్నవాఁడై కొమ్ములతోఁ జెట్లను బెకలించుచుఁ దనపేరునకుఁ దగినట్లుగా దుందుభివలె గంభీరముగా గర్జించుచుఁ బెద్దధ్వనిని బుట్టించెను. ఆసమయమున వాలి యంతఃపురస్త్రీలతో విహరించుచుండెను. అట్టివాఁడాశబ్దమునువిని స్త్రీలతోఁగలిసి, పురద్వారమును ప్రవేశించెను. సమస్తవన్యమృగనాయకుఁడైన వాలి యాదుందుభినిజూచి, మితముగను హితముగను నిట్లనెను. “ఓరీ! పురద్వారముం జేరి యోదులకింతగా భీభత్సము గావించుచున్నావు? నీప్రాణములపై నాశయున్నచో, నిట నుండి వేగముగాఁబోఁగిపొమ్ము!” అనెను. అంతనాఁతఁడు గ్రుడ్లెఱ్ఱఁజేసి, కోపముతో నిట్లువలికెను. “ఓరీ! ఆడువారి వద్ద నీబీరములుగట్టిపెట్టి, నాతోయుద్ధముచేసి, నీపరాక్రమమును జూపించుము. కాదందువా? నీపీరాత్రియంతయును,

నీయంతఃపురస్త్రీలతో భోగములనన్నిఁటి ననుభవించి, తెల్లవారగనే యుద్ధమునకురమ్ము! అంతవరకును, బ్రశాంతముగా నిచ్చటను వేచియుందును. మఱియు, నీబంధుమిత్రులకు జెప్పవలసినవన్నియును జెప్పి, యీయవలసినవన్నియు నిచ్చి, యందఱను సంతోషఁబెట్టిరమ్ము! వెండియు, నీకిష్కింధా రాజ్యమున నీకిష్టుఁడైనవానిని నిలిపి, స్త్రీలతో స్వేచ్ఛగాఁ గ్రీడించిరమ్ము. నీకోరికలనన్నిఁటిని దీర్చికొన్నతరువాతనే నీమదము నడచివైచెదను. మఱియువినుము!

శ్లో॥ యోహిమత్తం ప్రమత్తంవా, సుప్తంవా రహితంభృశమ్।
హన్యాత్సభ్రూణహా, లోకే, త్వద్విధం మద
మోహితమ్ ॥

స. 11, శ్లో॥ 36.

తా॥ ఓవాలీ! మద్యపానముచే కైపెక్కినవానింగాని, యేమరుపాటుగా నున్నవానినిగాని, నీవంటిస్త్రీలోలత్వముతోఁ గామపరవశుఁడైనవానినిగాని, నిరాయుధునిగాని, యెవఁడుసంహరించునో, అట్టివానికిభ్రూణహత్యా (కడుపులో నున్నపిండరూపశిశువును జంపుట) మహాపాతకము గలుగును. కావుననే నీకిట్లుచెప్పితిని.

వీరుఁడైనవాఁడు యుద్ధమునగొన్ని సామాన్యధర్మములను బాటించుట పౌరుషవంతునిధర్మము.

ఆదుందుభిమాటలువిన్న వాలి ధీరోదాత్తుఁడై, నిబ్బరముగానిలిచి, తారమొదలైన, తనభార్యలందఱిను నంతఃపురంబునకుఁ బంపివైచెను. అప్పుడావాలి వికారముగా నవ్వుచు దుందుభినిజూచి యిట్లనియెను. ఓరీ! నీకు యుద్ధభీతిలేనిచో, నేనుమత్తుఁడనని తలఁచవలదు. ఈమదమే నేను జేయఁబోవు యుద్ధమున నీప్రాణములఁదీయు వీరబాణమని యెఱుంగుము. అట్లుపలికినవాలి తనతండ్రియిచ్చిన బంగారు మాలను మెడలోధరించి, మహాక్రోధముతో యుద్ధమునకు వెడలెను. అంతనామహిషుని (దున్నపోతుయొక్క) కొమ్ములంబట్టి గిఱగిఱంద్రిప్పిత్రిప్పి వానినినేలంబడవైచి కొట్టెను. ఆదెబ్బతో వాఁడు నవరంధ్రములనుండియును రక్తమాంసములనుగ్రక్కియు మఱలలేచి, వాలిపైఁదలపడెను. ఆవిధముగా నాదుందుభికిని వాలికిని ద్వంద్వయుద్ధము జరిగినది. అప్పుడువాలి, పెద్దపెద్దరాళ్ళతోడను, చెట్లతోడను, పిడికిలిపోట్లతోడను మోకాటిదెబ్బలతోడను, దుందుభిని గొట్టుచు ఘోరయుద్ధముగావించెను. చాలసేపువారావిధముగాఁ బోరాడిరి. తుదకు దుందుభియొక్క బలముక్షీణించి, వాఁడునిలిచిపోయెను. అట్టివాని నమాంతముగాఁ బైకెత్తి నేలంగొట్టెను. ఆదెబ్బతో దుందుభి పెద్దగానరచుచుఁ జనిపోయెను. అట్టివానికళేబరమును బట్టికొని, యోజనదూరమునఁ బడునట్లు వాలివిసరి పాఱవైచెను. ఆసమయమున

దుందుభినోటినుండి స్రవించిన రక్తబిందువు లీఋశ్యమూక పర్వతముపై దపము చేసికొనుచున్న మతంగమహర్షి యొక్క యాశ్రమమునఁ బడినవి. వానినిజూచి, యామహర్షి "ఈపని నెవ్వఁడాచరించెనా!" యని యోచించెను. "అనాలోచితముగా నాయాశ్రమమునను, నాపైనను నీరక్తబిందువులు పడుటకుఁ గారణభూతుఁడైన యామూర్ఖుఁడైనవాలియేయని తనదివ్యదృష్టితోఁజూచి, గ్రహించి, యిట్లనియెను. "ఆదుర్మార్గుఁడైనవాలి, యీపర్వతవనప్రాంతములందడుగిడినచో, వెంటనేమరణించునుగాక!" అనిశపించెను. ఓ శ్రీరామచంద్రా! వింటివిగదా! అదిగో! ఆనాటినుండియు, నీపర్వతమున కామడదూరమునఁ నెక్కడ నడుగు నెట్టినను వాలి చచ్చుటతప్పదు. మఱియు నామతంగముని, "వాలికిసంబంధించిన మంత్రిసేనానాయకాది పరివారమెవ్వరైన నిందుఁబ్రవేశించినచో, వారిచావుగూడఁదప్పదు." అని శపించెను. ఇంకను, నావాలిగాని వాలికిసంబంధించిన వారుగాని, దూరమునుండియైన నీయరణ్యమునఁగల పుష్పఫలవృక్షాదులలో నేయొక్కదానికిని భంగము దలపోయరాదని శాసించెను. కావున వాలి యీప్రాంతములను గన్నెత్తి చూచుటకైన భయపడిపోవును.

ఓయీ! మిత్రమా! రామచంద్రా! ఆకారణముచే నేనిచ్చట నిశ్చింతగా సంచరించుచున్నాను. చూచితివా! ఆదుందుభియొక్కకళేబరమిదియేసుమా! పర్వతశిఖరమువలె

యున్న దీనినిజూడుము. మఱియు నటుచూడుము ! వ్రేలాడుచున్న పెద్దపెద్ద కొమ్మలుగల సాలవృక్షము లేడున్నవి. ఆవాలి యానా డీవృక్షములలో నొకదానినివంచి, వేరొక దానితోఁ బెనవేసికొనునట్లు విలాసగాఁ గావించెడివాఁడు. రామచంద్రా! ఇంతకు నావాలియొక్క పరాక్రమమును నీకుఁ దెలియఁజేయవలెనని, యింతవట్టు వచించితిని. అంతటిపరాక్రమశాలిని నీవెట్లువధించఁగలవో ? అనిసుగ్రీవుఁ డన్న మాటలనువిని లక్ష్మణుఁడు చిఱునవ్వునవ్వుచు నిట్లనుచున్నాఁడు. సుగ్రీవా ! నీకునమ్మకముగలుగటకై, మాయన్న నేమిచేయుమందువు? అనఁగా సుగ్రీవుఁడనుచున్నాఁడు. లక్ష్మణా ! ఈసాలవృక్షములలో నొకదానిని నీయన్న బాణముతోఁగొట్టఁగా నాబాణముదానినిబడఁగొట్టి దూసికొనిపోవలెను. మఱియు నీదుందుభియొక్క మృతకళేబరము నొక్కబాణముతోఁ బైకెత్తి యెనిమిదియామడల దూరమునఁ బడునట్లువిసరవలెను. అట్లైనచో, శ్రీరాముఁడు వాలిని జంపఁగలఁడని, ధైర్యముతో నుందును. అని చెప్పెను.

## సుగ్రీవునకు శ్రీరాముఁడు - తనశక్తిని జూపుట

సుగ్రీవునిమాటలకుఁ గనువెఱ్ఱఁబడఁగాఁ జూచుచున్న రామునిజూచి, సుగ్రీవుఁడిట్లు వినయముతో ననుచున్నాఁడు. రామచంద్రా ! వాలి మహాశూరుఁడు. ఎందఱో మహా

పేరులను వధించినదిట్టి. ఎన్నఁడును బరాజయ మెఱుఁగని వాఁడు. వీఁడు దేవతలకుఁగూడ సాధ్యముగాని పను లెన్నియో నెరవేర్చినవాఁడు. నేనెంతయు నాలోచించియే, వానికిభయ పడి, యీ ఋశ్యమూకముం జేరికొంటిని. నాయందు గాఢానురాగముగల యీహనుమదాదులతో, నిచ్చటఁ గూడ దిగులువడుచునే దిఱుగుచున్నాను. భక్తవత్సలా! శ్లాఘనీయమైన గుణగణవరిష్ఠా! శ్రీరామచంద్రా! ఇంతటి మహాభయముతో హిమవంతుని నాశ్రయించినట్లు నిన్నా శ్రయించితిని. ఇంతకును దుష్టుఁడైన నాయన్న యొక్క బలము నాకుఁ దెలియును. కాని నీబలమునుఁగూర్చిన వివరము నాకుఁ దెలియక పోవుటచే నిట్లు పలికితిఁ. అంతియేగాని, నీకు భయముగలిగించవలెననిగాని యనుమానముగాని నాకు లేదు. సుమా!'' అనెను. సర్వలోక రక్షకుఁడైన శ్రీరాముఁ డామాటలువిని శాంతించి, చిఱునగవునవ్వుచు, నిట్లనియెను. సుగ్రీవా! నీకునమ్మకము గలుగుటకై యేకార్యమునైనఁ బూర్తిఁగావించఁగలను. అనిపలుకుచునే యెదురుగానున్న దుందుభియొక్క కళేబరమును దనకాలిబొట్టనవ్రేలితోఁ బైకెత్తి, పదియామడలదూరమునఁ బడునట్లువిసరెను. అది చూచి, సుగ్రీవుఁడు రామునితో నిట్లనియెను. రామా! ఆనాఁడీకళేబరము రక్తమాంసములతో నిండి భారమై యుండగా, నట్టిదానిని వాలి విసిరివైచినాఁడు. ఇప్పుడది యెండిపోయి తేలికపడినది. మఱియు వాలియానాఁడు వీనితో

యుద్ధము చేసి యలసియున్న సమయమున వింతేదూరము దీనిని విసరఁగలిగినాఁడు. నీవుసావకాశముతో నుత్సాహము గలిగి విసిరితివి. కావున మీయిరువురిబలములలో హెచ్చుతగ్గులను నిర్ణయించలేకున్నాను. ఇంకనిప్పు డీసాలవృక్షములేడింటిలో నేయొక్కదానిపైనైనను, నీబాణమును బ్రయోగించుము. రామచంద్రా! నన్ను మన్నించుము. తేజోవంతులయందు సూర్యుఁడును, మహాపర్వతములందు హిమవంతుఁడును, జంతుసముదాయమున సింహము నెట్లుగా శ్రేష్ఠములై కొనియాడఁబడుచుండునో, యట్లే మానవలోకమునకెల్ల రక్షకుఁడవును శ్రేష్ఠుఁడవు నన్న విశ్వాసము నాకుఁగలదు. అనిసుగ్రీవుఁడు శ్రీరామునితోఁ బలికెను. ఆవెంటనే శ్రీరాముఁడు తనపాదముపైనధనుస్సునెక్కువెట్టి, దానికిబలిష్ఠమైన బాణముందొడిగి సాలవృక్షముల నుద్దేశించి, గురిపెట్టివిడిచెను. ఆబాణమొక్కటియేగదా, ఒకదానితరువాత నొకటిగా నా కే మాఁడు సప్తతాలములనుభేదించి యావెనుక భూమిని బ్రద్దలుగావించెను. అట్లుభూమినిగూడ బ్రద్దలుగావించి యాబాణమతివేగముగావచ్చి, శ్రీరాముని యమ్ములపొదిలోఁ బ్రవేశించెను. అదిచూచిన సుగ్రీవుఁ డాశ్చర్యపరవశుఁడయ్యెను. వెంటనేసుగ్రీవుఁడు శ్రీరామునకుఁ బాదాభివందనమాచరించి, మెడలోనియాభరణములు వ్రేలాడుచుండఁగా, వంగినమస్కరించి, దోసిలియొగ్గి నిలిచినవాఁడై యిట్లనెను.

శ్రీరామా! నీశక్తిసామర్థ్యములను గండ్లారఁజూచితిని. అవి యమోఘములు. ఇతరులకెవ్వరికి నసాధ్యములు. ధర్మాత్మా! నీవుసర్వలోకశరణ్యుఁడవు. పురుషోత్తముఁడవు. విశేషించి నాకుసర్వవిధములను దిక్కైనవాఁడవు. ఓ శ్రీరామచంద్రా! దేవేంద్రుని ముందుంచికొని, సమస్తదేవతాగణములును నీపై దండెత్తివచ్చినను, వారినవలీలఁగా, సంహరించఁగలవు. ఇందుసందేహములేదు. రామా! ఒక్కబాణముతో నేడుసాలవృక్షములను, బర్వతమును భూమిని బ్రద్దలుచేసిన, నీయెదుట యుద్ధములో నిలువఁగలవాఁ డెవ్వఁడుండును? ఇంద్రవరుణ సమానుఁడవైన నిన్నుమిత్రునిగాఁ బొందఁగలుగుట నాపూర్వజన్మ సుకృత విశేషము. ఇంక, నాదుఃఖము పోయినది. పరమానందభరితుఁనైతిని. ఓరామా! ఇంకనాలస్యముచేయక నాప్రాణశత్రునై, నాకు నన్నయన్న మిషతో నున్నవాలిని, సంహరించుము. నీకిదే నానమస్కారము.

## మొదటిసారి - వాలి సుగ్రీవుల యుద్ధము

శ్రీరాముఁడు లక్ష్మణసహితుఁడై, సుగ్రీవునిజూచి, యిట్లనెను. ఓయీ! సుగ్రీవా! మనమిప్పుడే వాలిపైయుద్ధమునకుఁ బోవుదము. నీవుముందుగాఁబోయి, వాలినియుద్ధమునకు రమ్మనిగర్జించుము అనెను. అంతనాసుగ్రీవుఁడు తనసహచరులతోడను, రామలక్ష్మణులతోడను, ద్వరగాఁబోయి

కిష్కింధాపుర బహిర్ద్వారమున దట్టమైన చెట్లతో నిండిన ప్రదేశమున నిలిచెను. అటనుండి సుగ్రీవుఁడు వాలినియుద్ధమునకు నాహ్వానించుచు భూమ్యాకాశములు దద్దరిల్లునట్లుగా నరచెను మహాబలశాలియైన వాలియాగర్జనము సుగ్రీవునిదిగా నెఱింగి, సూర్యుఁడస్తమయపర్వతమునకుం బోవునట్లు వేగముగా మార్గమును వెడలి, సుగ్రీవుఁడున్న స్థానమునకుఁ జేరికొనియెను. అప్పుడా వాలిసుగ్రీవులకు నాకాశముపై బుధునకును నంగారకునకును జరిగినట్లుగా ఘోరయుద్ధము జరిగెను. వారుభయులును, నరచేతులతోడను, మోకాళ్ళతోడను బిడికిళ్ళతోడను పిడుగులవంటి ధ్వనులుగలుగునట్లుగాఁ గొట్టికొనుచుండిరి. వజ్రాయుధములవంటి గోళ్ళతో శరీరములను జీల్చివేయుచుండిరి. ఆసమయమునఁ జెట్ల మాటున శ్రీరాముఁడుండియు, నశ్వినీదేవతలవలె నావాలి సుగ్రీవు లాకారవికారచేష్టలలో నేమాత్రమును భేదములేకయుండుటచే నందు వాలియెవఁడో, సుగ్రీవుఁడెవ్వఁడో పోల్చికొనలేకయుండెను. కావుననే శత్రుసంహారకమైన బాణమును శ్రీరాముఁడు విడువలేకపోయెను.

ఇంతలో సుగ్రీవుఁడు వాలికినోడిపోయి శ్రీరాముఁడున్న స్థలమునకుఁ జేరికొనియెను. రక్తసిక్తమైన శరీరముతో వెనుదిరిగిపోవుచున్న సుగ్రీవుని, వాలి వెంటఁదరుముటకు మతంగమహామునియొక్క శాపమడ్డమైనది. అప్పుడా సుగ్రీవుఁడు శ్రీరామునిజూచి, సిగ్గుతోఁ దలదించికొని యిట్లను

చున్నాఁడు. రామా! వాలితో యుద్ధము చేయుమని నన్ను బంపి నీవేమి చేసితివి! నా శత్రువుచే నాకుఁ జావుదెబ్బలను, గొట్టించితివి. నీవు ముందుగనే నేను వాలిని జంపలేన'ని చెప్పినచో, నేను యుద్ధమునకుఁ బోయియుండువాఁడనే గాదుగదా! యనుచుండఁగా నామాటలు విని, దీనదయాళుఁడైన శ్రీరాముఁడిట్లనెను. ఓయీ! ప్రియమిత్రమా! నాపైని గోపించకుము. నామాట వినుము! మీ సోదరులిరువురును నొడ్డుపొడవులు నలంకారములు, నడకలు మొదలగునవన్నియు నొకే ముద్రగా నుండి వెలువడిన రెండు రూపములుగాఁ గానఁబడుటచే, నందు వాలియెవఁడో, సుగ్రీవుఁడెవఁడో, తెలిసికొనలేకపోయితిని. అట్లెఱుంగక బాణమును విడిచినచో నది నిన్నే చంపవచ్చును. అప్పుడు నాకు మిత్రద్రోహము, ప్రతిజ్ఞాభంగము నను మహాపాతకములు గలుగును. అంతియే గాక, నేను మూర్ఖుఁడననియుఁ, జంచలస్వభావుఁడననియు, నపకీర్తి యీలోకమున్నంతకాలమును నిలిచిపోవును, నాతమ్ముఁడును, నేనును, సీతయును, నీపైనాధారపడి, నిన్ను శరణువేఁడుకొంటిమి. అట్టియెడ నిన్నే చంపినచో, నాగతియేమిగావలయును? కావున నో సుగ్రీవా! ఈమారు మఱల వాలిని యుద్ధమునకుఁ బిలువుము. నిన్ను నేను గుర్తుపట్టుటకు వీలుగా నవకాశమును గలిగించుము. నా బాణము తిరుగులేనిది. వాలిని దప్పక సంహరించఁగలను. అని సుగ్రీవునకు ధైర్యము చెప్పి శ్రీరాముఁడు లక్ష్మణునిబిలిచి, యిట్లనియెను.

తమ్ముఁడా ! నీవు గజపుష్పములచు మాలఁగాఁ జేసి, సుగ్రీవుని మెడలో వైచుము. అనియాజ్ఞాపించెను. వెంటనే లక్ష్మణస్వామి గజపుష్పమాలను సుగ్రీవుని కంఠమున నలంకరించెను. దానితో సుగ్రీవుఁడును, నక్షత్రగ్రహములమధ్యఁ బ్రకాశించు సూర్యునివలెఁ బ్రకాశించెను. అట్లుప్రకాశించుచున్న సుగ్రీవుఁడు, శ్రీరామాదులంగూడి మఱలఁ గిష్కింధా బహిర్ద్వారమునకుఁబోయెను.

## సప్తజన వనము.

శ్రీరామలక్ష్మణసుగ్రీవాదులు మఱలఁ గిష్కింధకుఁ బ్రయాణమైరి. రాముఁడు ఆసమయమునఁ బొడవైన విల్లును సూర్యకిరణతేజోవంతములైన బాణములనుబట్టికొని సుగ్రీవునివెంట వెడలుచుండెను. త్రోవలోఁ బ్రకృతిరమణీయములైన పూలచెట్లను, వివిధపక్షిజాతులను దటాకములను జూచుచు వెళ్ళుచుండిరి. మఱియు నాత్రోవలో వృక్షములతో నలుముకొనియున్న వనమును జూచి, శ్రీరాముఁడు సుగ్రీవునితో నిట్లనుచున్నాఁడు. మిత్రమా ! సుగ్రీవా ! ఈ యడవినిఁజుట్టుకొని, చివరిభాగములందు నరటిచెట్లున్నవి. నీటితోనిండిన నల్లనిపెద్దపెద్ద మేఘములవలె, నీయడవి చెట్లన్నియును గనబడుచున్నవి. ఈవనవిశేషమును దెలిసికొనఁగోరుచున్నాను. ఆమాటలనువిన్న సుగ్రీవుఁడు రామ

చంద్రా ! ఇదియొక గొప్పయాశ్రమస్థలము. ఈయాశ్రమముం బ్రవేశించిన యెంతటివానికైనను సుఖశాంతులనొసంగును. ఈవిశాలవనమున, మధ్యమధ్య నుద్యానవనములును, మధురఫలపుష్పభరితములైన వృక్షములు నమృతముంబోలు నీరుగల కొలనులును గలవు. ఈయాశ్రమమున 'సప్తజను' లను పేరుతో నేడుగురుమునీంద్రులు దలక్రిందులుగా నీళ్ళలో మునిగి, మహాతపము నాచరించిరి. వారొకప్పు డేడురోజులు వాయువు నాహారముగఁగైకొని మహాతపస్సునుజేసి, శరీరములతో స్వర్గమునుబొందిరి అట్టిమహర్షుల యాశ్రమస్థానమిది. ఇది దేవేంద్రాదులకుఁగూడఁ బ్రవేశింపరానిదై యుండెడిది. ఈయాశ్రమమున మనుష్యులేగాక మృగములుగాని, పక్షులుగాని, ప్రవేశించవు. ఒకప్పుఁ డెవఁడైనఁ బ్రవేశించెనా ? వాఁడందుండి బయటకురాఁడు. రామా ! ఈవనమున నేటికిని నప్సరసలు నాట్యమాడుచుండఁగా, వారియాభరణధ్వనులు, వినవచ్చుచుండును. అంతియేగాదు. ఇందెల్లవేళలను, గీతవాయిద్యధ్వనులు స్పష్టముగా వినఁబడుచుండును. ఏమూలనుండియైనను దివ్యపరిమళముల గుమగుములు వెదజల్లుచుండును. మఱియు నిందునిత్యమును త్రేతాగ్నులు ప్రజ్వరిల్లుచుండును. అటుచూడుము ! ఇందులకు నిదర్శనముగాఁ బావురాలరంగులోఁ జెట్లచివరభాగ మెఱ్ఱగాఁ గనఁబడుచున్నది. ఓరామా ! లక్ష్మణా ! మీరీవనము నుద్దేశించి, యటుదిఱిఁగి, సప్తజనమహర్షులకును, నమస్కరించుఁడు.

ధర్మస్వరూపుఁడవైన శ్రీరామభద్రా! ఆత్మతత్త్వవేత్తలగు నామహర్షులకు భక్తిపూర్వకముగా నమస్కరించినచో, శారీరకములైన వ్యాధులు మొదలగుబాధ లేవియును గలుగవు. అనిసుగ్రీవుఁడు తొందరగా నడచుచునే, శ్రీరామున కాయాశ్రమ చరిత్రను జెప్పెను. అంతయునువిన్న శ్రీరామలక్ష్మణులు సప్తజనవనమున కెదురుగాఁదిఱిగి, యామహర్షులనుద్దేశించి, నమస్కారములఁగావించిరి. తరువాత నందఱును బరమోత్సాహముతోఁ గిష్కింధాపురద్వారదేశమును జేరికొనిరి.

## సుగ్రీవుఁడు - వాలిని - రెండవమారు యుద్ధమునకు బిలుచుట

శ్రీరాముఁడు లావిధముగాఁబోయి, యొకచోఁ జెట్లమాటున, నాయుధపాణులై నిలిచిరి. సుగ్రీవుఁ డక్కడనుండి యొకవిశాలప్రదేశంబునకువెళ్ళి, నాలుగుదిక్కులనుజూచి, భూమ్యాకాశములు దద్దరిల్లునట్లు గర్జించుచు, వాలిని యుద్ధమున కాహ్వానించెను. మఱియు శ్రీరామునివైపుచూచి, మిత్రమా! వాలియున్న కిష్కింధాపురమిదియే. ఇంక వాలి యుద్ధమునకు రాఁగలఁడు. వానినిజంపి, నీప్రతిజ్ఞను, నెరవేర్చికొను సమయమాసన్నమైనది. ఇదిగో! ఈగజపుష్పమాలికను సీతమ్మఁడు, నీయాజ్ఞానుసారముగా, నామెడలో వైచినాఁడు. ఈగుర్తును బాగుగాఁజూడుము! అనఁగావిని, శ్రీరా

ముఁడు, సుగ్రీవా! నీకంఠమునం దీమాలికయుండుటచే నక్షత్రములతోఁ జుట్టువారుకొనియున్న చంద్రునివలెఁ బ్రకాశించుచున్నావు. నీభయమునంతను, నొకేబాణముతో వాలిని సంహరించి, పటాపంచలుగావించుదును. మిత్రమా! నీయన్నవాలి నా బాణపుదెబ్బతో నేలంబడి, ధూళితో గిలగిలఁగొట్టుకొనుచుండఁగా, నీవిప్పుడేచూడఁగలవు. ఆవాలి నాకంటఁబడినదేతడవుగా, నా బాణమునకుగురియై, పడిపోవుట జూచి, యప్పుడు నన్ను నీవునమ్ముదువు. ఏడుమద్దిచెట్ల నొకే బాణముతోఁ బడఁగొట్టుటను నీవు ప్రత్యక్షముగాఁ జూచితివి గదా! ఇంకను నీకనుమానమేల! ఓయీ! నేనింతవరకును, నెంతటికష్టసమయములందును బొంకియెుఱుఁగను. ముఖ్యముగా నాధర్మనిష్ఠకు లోపమురాకుండ, దానినిగాపాడికొనుటకై, యసత్యమును మనస్సుననైన స్మరించను. భూమిపై వానలుగురిపించి, దేవేంద్రుఁడు పంటలనుబండించునట్లు నాప్రతిజ్ఞను సఫలముగావించి, వాలిని వధించెదను. కావున నో సుగ్రీవా! ఆ కాంచనమాలధరుఁడగు వాలి నీవద్దకు వచ్చునట్లుగా నాహ్వానించుము. జయశీలియు యుద్ధప్రియుఁడును నగు వాలి తప్పక నీ కంఠధ్వనిని విని నీవద్దకు రాఁగలడు. శూరుఁడైనవాఁడు శత్రుతిరస్కారమును సహించఁడు. అందును విశేషించి శత్రువు దుర్బలుఁడై యుండఁగా స్త్రీల సన్నిధిని వెనుకంజవేయువాఁడేయుండఁడు. అని శ్రీరాముఁడు సుగ్రీవునకు ధైర్యము చెప్పిపంపెను. అంత

సుగ్రీవుఁడా రామవాక్యములను గౌరవించి నిర్భయముగా గర్జించుచుఁ దనయన్న వాలిని యుద్ధమున కాహ్వానించెను. ఆ ధ్వనికి గోవులును లేళ్ళును భయపడిపోవుచు నటునిటు పరువులుదీసినవి. ఆకాశమునుండి క్షీణించిన పుణ్యముగల గ్రహములవలె, నక్షత్రములు చలించి, నేలఁబడినవి. కాల మేఘములన్నియు నొక్కచోఁజేరి గర్జించఁగా భయంకరముగా వినిపించినట్లు సూర్యపుత్త్రుఁడైన సుగ్రీవగర్జన సర్వభూతములను గడగడలాలించెను. ఈవిధముగా నాతఁడు వ్వాలిని యుద్ధమున కాహ్వానించెను.

## తార వాలికిఁ జెప్పిన హితవచనములు

ఆసమయమున నంతఃపురస్త్రీలతో విహరించుచున్న వాలి సుగ్రీవగర్జనలనువినియెను. అప్పుడాతని కోపముకట్టలు త్రెంచికొని విజృంభించినది. ఆతఁడంతవరకును గలిగియున్న మత్తును విడిచెను. కోపముతో శరీరమంతయును నెఱ్ఱఁబడగా సంధ్యాసమయమువలె నాతఁడగుపించెను. పెద్దపెద్దకోరలతోడను, గండలుదరిగిన శరీరముతోడను, గోపమనెడితామరచెఱువులో వాలియనెడి యేనుగు ప్రవేశించినట్లుగాఁదోచెను. అట్టివాలి సుగ్రీవగర్జనలనువిని, పాదములతో నేలనుధట్టించుచు, యుద్ధమునకు బయలుదేరెను. అట్టివాలినిజూచి, యాతనిబట్టపురాణియైన తార యెదురుగావచ్చి, కౌఁగిలించికొని, తొట్రుపాటుతో భయపడుచున్నదై యాతనిహిత

మునుగోరి యిట్లనుచున్నది. మహాపరాక్రమశాలివైన యోనాథా! నదీప్రవాహమువలెఁ బొంగిపొరలివచ్చుచున్న నీకోపమును రాత్రిధరించినపూలమాల, నుదయమే తీసిపార వైచినట్లుగా విడువుము. ఈసుగ్రీవునితో యుద్ధమే చేయవలె నందువా? అట్లయినయీరాత్రిగడపి, తెల్లవారఁగనే యుద్ధము చేయుము. వీరత్వమున నీవు నీశత్రువునకుఁ దక్కువవాఁడవు గాదుగదా? కావున నిప్పుడే యుద్ధమునకుఁ బోవలసినపని యేమి? నీవిప్పు డనాలోచితముగా, హఠాత్తుగా యుద్ధము నకుఁ బోవుట నాకుసమ్మతముగాదు. అందులకుందగిన కారణ మునుజెప్పెదను. శాంతచిత్తములో వినుము! ఇంతకు బూర్వమే యాతఁడునీతో యుద్ధముచేసి, చావుదెబ్బలుతిని పారిపోయినాఁడు. అట్టివాడింతలోనే మఱల నిన్నుయుద్ధము నకుఁ బిలుచుచున్నాఁడు. ఇందులో నేదోయొక రహస్య ముండియుండవలెనని నామనస్సు శంకించుచున్నది. మఱియు నాసుగ్రీవుని గర్జనావిశేషములంబట్టి చూడఁగా నాతనిబలం బును, నాటోపంబును, బ్రయత్నంబును, భయంకరములుగా నున్నవి. ఇంతకును, బలమైనకారణమేదో యుండవలెను. తనవెనుక బలిష్ఠమైన సహాయసంపత్తిలేకుండగా, సుగ్రీవుఁ డింతటిధైర్యస్థైర్యములను బ్రదర్శించలేఁడు. సుగ్రీవుఁడు సహజముగనే మంచినేర్పరి. బుద్ధిమంతుఁడు. తానుబాగుగాఁ బరీక్షించి, నీకంటెనెక్కువబలమైనవాని నెవనినో, వెంటఁ బెట్టికొనివచ్చి యుండును. కావున సుగ్రీవుని నాతనికిసహాయ

కారియైనవానిని నూఱుఁ జంపఁగలనని ధైర్యపడరాదు. నేనిం తకుఁబూర్వమే యంగదునివలన విన్నవిషయమును జెప్పెద నాలింపుము! మనయంగదకుమారుఁడు వనవిహారార్థమై వెళ్ళఁగా, నచటనాతనికి, మనచారులు చెప్పినవిషయమును నాతోఁ జెప్పఁగా వింటిని. ఏమనఁగా? అయోధ్యాధిపతియైన దశరథమహారాజకుమారులును, మహాబలపరాక్రమవంతులని ప్రసిద్ధిఁగన్నవారును, నగు శ్రీరామలక్ష్మణులు సుగ్రీవునితో, నగ్నిసాక్షిగా మైత్రిఁగావించిరట. సీతమ్మనకు సహాయపడఁగావచ్చిన, యారాకుమారులు, విరాధుని, ఖరదూషణాది జనస్థానరాక్షసబృందమును, గబంధుని నవలీలగా సంహరించినారట.

శ్రీరాముఁడు యుద్ధవిశారదుఁడు. ఎదురులేక ప్రజ్వలించు ప్రళయాగ్నివంటి పరాక్రమమును జూపించుననియు వింటిని. పక్షులకు వృక్షములాశ్రయమిచ్చి రక్షించునట్లు తననుశరణునొందినవారి నన్నివిధములుగను రక్షించువాఁడు. ముఖ్యముగా, నార్తులైనవారి మనస్తాపమును బోగొట్టువాఁడనియు వింటిని. శ్రీరాముఁడు సర్వసద్గుణసంపన్నుఁడు సుమా! ఆరామునకు శాస్త్రజ్ఞానమును, లౌకికజ్ఞానమును గలవట. గైరికాది సర్వధాతువులకును హిమవంతుఁడాధారమైనట్లు, సర్వసద్గుణములకును శ్రీరాముఁడాధారుఁడై, ధర్మాచరణదీక్షతో నుండెనట అట్టివాఁడు తండ్రియొక్క యాజ్ఞానుసారముగా నడవులఁ బ్రవేశించినాఁడనివింటిని.

'ఇంతయంత'యని చెప్పఁదరముగాని బలముగలవాఁడట. అట్టి శ్రీరామునితో విరోధము నీకెంతమాత్రమును దగదు సుమా! ఓశూరాగ్రేసరా! నామాటనొకింతవినుము. నీయందు నేరమునారోపించి, నిన్నవమానించుటకు నేనిట్లు చెప్పుటలేదు. హితవాక్యమును వినుట శ్రేయస్కరమని భావించి, నామాటవినుము. నీవిప్పుడు వేగముగా సుగ్రీవునకు యౌవరాజ్యపట్టాభిషేకమును జేయుము. నీతమ్ముఁడిప్పుడు బలమును బుంజుకొనియున్నాఁడు. బలవద్విరోధము మంచిదికాదు. శ్రీరామునితో మైత్రిని జేసికొనుటయును, సుగ్రీవునియందు వైరమును విడుచుటయును ప్రస్తుతపరిస్థితిని బట్టి యీరెండే నీకుమంచివి. ఇంతకును సుగ్రీవుఁడు నీచేఁ బ్రేమింపఁదగిన తమ్ముఁడేగదా? ఆతఁడెచ్చటనెట్లున్న నేమి? అంతియేగాదు. సుగ్రీవునకు సాటియైన బంధువీలోకమున నెందునునీకులభించఁడు. కావున నాతనిని నీసాటివానినిగాఁ బ్రేమించి, తీసికొనిరమ్ము. ఇంక నాసుగ్రీవుఁడును నీపైవైర భావమునువిడిచి, భక్తిభావముతో మెలఁగుఁగాక! విశాలమై సుందరమైన కంఠముగల యాతఁడు నీకత్యంత సన్నిహిత బంధువుసుమా! ఇంతకంటెవేరుగా నాలోచించుట నీకు క్షేమముగాదు. నాయందు నిజమైనప్రేమతో నాకోరికను దీర్పఁగలవాఁడవైనచో, నేనుజెప్పినట్లుచేయుము. నాహిత వాక్కులనునమ్ముము. ఆవిధముగాఁబ్రవర్తించుము. ఇట్లు నీవుకోరకున్నను నీహితమును జెప్పిననన్ను క్షమించుము.

దేవేంద్రునివంటి, తేజోబలంబులు గలిగిన శ్రీరామునితో వైరమునువిడువుము. అనియీవిధముగాఁ దారచెప్పినమాట లన్నియును, వాలికినంగీకార యోగ్యములుగాఁ దోఁచలేదు. లోకములోఁ గాలముసమీపించినవానికి హితవాక్యములు చెవికెక్కకపోవుట సహజమేగదా !

## తారచెప్పిన హితవు నందలి ధర్మ సూక్ష్మము

ఈపైనఁజెప్పిన తారావచనములనుబట్టి, బలవద్విరోధము రాజనీతిగాదనియు, నెట్టిపరిస్థితియందును బంధువిరోధము ప్రాణహానికి దారితీయుననియుఁ గావునపైరెండును, ధర్మమెఱింగినవాఁడువిడిచిపెట్టవలయుననియుగ్రహింపవలెను. మఱియుఁ దనహితమునుగోరి యెవరేమిచెప్పినను వినుకొనుట ధర్మము.

## తారచెప్పిన హితమును గాదని వాలి యుద్ధమునకేగుట

తారచెప్పిన హితవాక్యములన్నియును విన్నవాలి, వానినెల్లఁద్రోసిపుచ్చి, చంద్రముఖియైన యాతారంజూచి, యిట్లనుచున్నాఁడు. ఓసీ! వెఱ్ఱిదానా ! నాతమ్ముఁడే నాకు శత్రువై, యిట్లుగర్జించుచుండగా, నేనెట్లుసహించఁగలను ?

శ్లో॥ అధర్షితానాం శూరాణాం, సమరే ష్వనివర్తినామ్. ।
ధర్షణామర్షణంభీరు, మరణా దతిరిచ్యతే. ॥

స. 16, శ్లో॥-3.

తా॥ ఓసి ! పిరికిదానా ! తారా ! ఎన్నడును నెవరి వలనను దిరస్కారమెఱుంగని యుద్ధశూరులగు మహాత్ముల నెవ్వ రెదిరించినను, సహించుటమంచిదిగాదుసుమా ! అంతకంటె మరణమే కీర్తినొసంగును.

మహావీరుఁడైనవాఁ డేకారణముననైనను, శత్రువునకు లొంగిపోవుట, మరణముకంటెను నధికమైనది. అట్టివాఁడేజీవచ్ఛవము.

ఓప్రియురాలా ! ఈహీనస్వరముగల సుగ్రీవుని గర్జనవింటివిగదా ! ఇంతవరకునెన్నఁడును నన్నెదిరించి, గర్జించలేదు. వీనియొక్క యాటోపమునుజూచి, యుద్ధమునకు వెనుదీయని నేనెట్లుసహించఁగలను ? ఇంక శ్రీరాముఁడందువా ! ఆతనిగూర్చి నీవేమియు ననుమానించఁబనిలేదు. ఆతఁడు ధర్మమూర్తి. పరులయొక్క మంచిచెడ్డల నెఱింగినవాఁడు. కావుననాపట్ల నిరపరాధినగు నన్నాతఁడేమియును జేయఁడు. ఓతారా ! నీవును దోఁటియాఁడువారితోఁగలిసి, వెనుకకుఁబొమ్ము ! నాయందున్న ప్రేమభావముతో నీమనస్సునువిప్పి మాటలాడితివి. నేనాసుగ్రీవునితోఁ బోరాడి, వానిగర్వమునడఁచివైచి, రాఁగలను. అంతమాత్రముతో

వానినివిడిచి వచ్చెదను. వానిని జంపను. నే నాతనిని బాగుఁగాఁగొట్టి ప్రాణావశిష్టునిజేసి, విడిచిరాఁగలను. దుర్మార్గుఁడైన యాసుగ్రీవుఁడు నాబలపరాక్రమముల కోర్వఁజాలఁడు. నీవింతవరకును నాయోగక్షేమములఁగూర్చి చెప్పిన మాటలకుఁ జాలసంతోషించితిని. ఇంకనీవు వెనుకకుఁబొమ్ము, యుద్ధమున నాతమ్ముని జంపనని, నాప్రాణములపై నొట్టు పెట్టుచున్నాను. వానినిదరిమివైచి, జయమునుబొంది త్వరలోనేరాగలను. అనఁగావిని తారయును వాలికిసమాధానము చెప్పక యవ్వాలిని కౌఁగిలించికొనియు, నమంగళమను శంకతోఁబైకిదెలియకుండ, లోలోనదుఃఖమును దిగమ్రింగికొనుచు, భర్తకుఁబ్రదక్షిణముగావించి, జయప్రదములైన పురాణోక్తశుభవాక్యములఁ బఠించుచుఁ దోటిస్త్రీలతోఁ బాటుగా నంతఃపురంబునకుఁ బోయినది.

## వాలిసుగ్రీవులయుద్ధము - శ్రీరాముఁడు వాలింజంపుట

అంతవరకును స్త్రీలముందుఁ దనకోపమునడఁచికొనియున్నవాలి, స్త్రీలందఱు నంతఃపురమును బ్రవేశించఁగనే, మహాక్రోధముతోఁ గాలసర్పమువలె బుసలుగొట్టుచు, నటనుండి సుగ్రీవుఁడరచినచోటికి వెడలెను. అచ్చటఁ దనశత్రువెచ్చటనున్నాఁడా? యని, నలుమూలలను గలయఁజూచెను.

అంతనాతఁడొకచోట, వస్త్రమును బిగించికట్టి, యటునిటు చలించుచుఁ బింగళవర్ణుఁడైన సుగ్రీవునిగనియెను. వాలియును మహాకోపముతో బట్టను నడుమునకుబిగించి, పిడికిళ్ళుగట్టిగా ముడిచి శత్రువుతోఁ బోరాటమునకుఁ బ్రారంభించెను. ఈవిధముగా నవ్వాలిసుగ్రీవులు యుద్ధోన్మాదులై, మహాబలపరాక్రమములంగలిగి, పోరుచుండిరి. ఇదిగో! ఈపిడికిలి పోటుతో నీప్రాణములుసరి. పైకెగిరిపోవును. కాచికొనుము!' అనివాలియనుచుండఁగా, సుగ్రీవుఁడును నట్లేయనుచుఁ దన పిడికిలిపోట్లతో యుద్ధముచేయుచుండెను. అట్లువారియుద్ధము జరుగుచుండగా, నాశరీరములనుండి, వెలువడినరక్తము నేలపై, మడుగుగానేర్పడినది. సుగ్రీవుఁడాసమయమున నొకానొక పెద్దమద్దిచెట్టును బెరికితెచ్చి వజ్రాయుధముచే నింద్రుఁడుపర్వతమును గొట్టినట్లు వాలినిగొట్టెను. ఆదెబ్బతోవాలి, సముద్రమునందలి భారమైనయోడవలె, నటునిటుచలించిపోయెను. మహాభయంకరాకారులైన వారిరువురును నాకాశమున కెగిరి పోరుచుండఁగా సూర్యచంద్రుల పోరాటమువలెఁ దోఁచినది. ఈవిధముగా నాసోదరు లొకరియాయువుపట్ల నొకరుగుర్తించుచుఁ బొడిచికొనుచు, భయంకరముగాఁ బోరాడిరి. క్రమముగా వాలియొక్క విజృంభణ మధికమయ్యెను. సుగ్రీవుఁడు మందగించెను. అయినను సుగ్రీవుఁడు ధైర్యమునువిడువక, కొండశిఖరములతోడను, చెట్లతోడను వాలినిగొట్టుచుఁ బోరాడు

చునేయుండెను. ఆసమయమున సుగ్రీవుఁడలసి మాటిమాటికి నాగియాగి, యటునిటుచూచుచు మందగించినపరాక్రముఁడై యున్నటను శ్రీరాముఁడు గుర్తించెను. అంతసుగ్రీవుని దీనత్వమునుజూచి, వాలిని వధింపఁగల బాణమును బైకిఁదీసి, ధనువునెక్కునెట్టి. దానికా, కాలసర్పసమానమైన బాణమునుదొడిగెను. ఆసమయమున శ్రీరాముని ధనువుయొక్క నారినుండి వెడలిన ధ్వనికి, భయపడి సర్వభూతములును నలుదిక్కులకును బారిపోయినవి. అప్పుడు శ్రీరాముఁడు బాణమును విడువగనే, వజ్రాయుధమునంటి యాబాణ మొక్క మెఱపుమెఱసి పిడుగువలె, నావాలియొక్క గుండెలను దాగెను. ఆదెబ్బతో మహాబలశాలియు గర్వసంరంభము గలవాఁడును నగువాలి, పర్వతశిఖరమువలె నేలంబడి పోయెను. శ్రీరాముఁడు ప్రళయకాలరుద్రునివలె శక్తి కొలఁదినేసిన బాణమగుటచేఁ దిరుగులేనిదై వాలింబడఁ గొట్టినది. ఆవాలి రక్తసిక్తమైన శరీరముగలవాఁడై, తెలివిఁ దప్పి పడియుండఁగాఁ జక్కగాఁబుష్పించిన, యెఱ్ఱని యశోక వృక్షము, పెనుగాలికి నేలంబడినట్లాసమయమున వాలి కనఁబడెను.

## శ్రీరాముని - వాలి - యధిక్షేపించుట

శ్రీరామునిబాణముచే నేలంగూడినవాలి, కాంతి హీనమై నేలఁబడిపోయిన యింద్రధ్వజమువలె నుండెను.

వాలిలేనిభూమి చంద్రుఁడులేని యాకాశమువలె, వెలవెల, బోయినది. ఇంతకునాతనికి నింద్రదత్తమైన కాంచనమాల మెడలోనుండుటచేత నాతఁడు తనశోభలను విడనాడలేదుఁ అట్లేప్రాణములును నిలిచియున్నవి. ఆతనితేజస్సునంతను, నాకాంచనమాలయేధరించి, యాతనినట్లు ప్రాణములతో నిలిపినది. అట్టిమాలయు, నాతనిశరీరమును, శ్రీరాముఁ డేసిన బాణముచు నోకేస్థలమున మూఁడును మూఁడువిధము లైన తేజస్సులతోఁ ప్రకాశించుచున్నవి. రామబాణ మెవ నినిదాకినను వానికిఁ బునరావృత్తిరహితమైన (జన్మలేని) మోక్షమును బ్రసాదించును. విశేషించి, శ్రీరామునిచే స్వయముగావిడువఁబడినదాటచే సంశయములేని మోక్షము లభించును. జ్వాలలుగలిగిన యగ్నివలెనున్నవాఁడై, 'ఆహా! శ్రీరాముఁ డెంతచక్కఁగా బాణమునుబ్రయోగించినాఁడు!" అని మెచ్చికొనుచున్నవాఁడై, మహావీరుఁడగు రామునిజూడఁ గోరి, పుణ్యాంతమున నేలకుందిగిపడిన యయాతివలెనున్న యావాలి, ప్రళయకాలరుద్రునిచే నేలనుబడఁగొట్టఁబడిన సూర్యునివలెఁ బ్రకాశించుచున్నవాఁడై, మహావీరలక్షణ ములుగల శరీరావయవములు గలవాఁడై, కపిల వర్ణముగల కన్నులు గలిగి, బంగారు మాలికతోఁ బ్రకాశించుచున్న యవ్వాలింజూచి, శ్రీరాముఁడు లక్ష్మణు

నితో నాతనినిసమీపించెను. వాలియును దమ్మునితోనున్న రామునిజూచి, తనకుధర్మమనితోచిన మాటలనిట్లనియెను.

శ్రీరామచంద్రా! నీవురాజకుమారుఁడవు. సద్గుణ సంపదయందుఁ బ్రసిద్ధినందినవాఁడవు. సర్వశాస్త్రపరిజ్ఞానము గలిగి, ధర్మాచరణమున హద్దుమీరనివాఁడవు. సద్వంశమునఁ బుట్టినవాఁడవు. మహాబలపరాక్రమములు గలవాఁడవు. గొప్ప తేజోవంతుఁడవు. అన్నిఁటినిమించి, యనేకధర్మ వ్రతముల నాచరించితివి. అట్టినీవు, నేనింకొకనితో యుద్ధము చేయుచుండఁగా నిట్లు బాణప్రయోగమును జేయుదువని నేనునమ్మలేదు. దీనివలన నీకేమిప్రయోజనమో? నాకర్థము గాలేదు. శ్రీరాముఁడు దయాదాక్షిణ్యములు గలవాఁడ నియుఁ బ్రజాహితమును గోరువాఁడనియు, స్వార్థములేక పెద్దల యాచారమును దెలిసి, ప్రవర్తించువాఁడనియుఁ జలిం చని వ్రతదీక్షలు గలవాఁడనియు, నిన్నుసమస్తజీవులు నీభూమియందుఁ గొనియాడుచుండుట వినియున్నాను.

శ్లో॥ దమశ్శమక్షమాధర్మో ధృతిస్సత్యం పరాక్రమః।
పార్థివానాం గుణారాజన్! దండశ్చా ప్యపరాధిషు॥
స. 17, శ్లో॥-17.

తా॥ ఉత్తమ క్షత్రియకులమునఁ బుట్టినవానికి, బాహ్యేంద్రియనిగ్రహమును, నంతరింద్రియనిగ్రహమును, నోర్మియును గలిగియుండవలెను. మఱియునోరామా! ధర్మా

చరణమును, ధైర్యసాహసములును, సత్యపరాక్రమములును, నపరాధులనుమాత్రమే దండించుటయును. (నిరపరాధులను దండించకపోవుటయును) నను సుగుణంబులనుగలిగి యుండవలెను. అట్టియీలక్షణము లన్నియునుగలిగి, రాజశ్రేష్ఠుఁడవనిలోకమునఁ గీర్తింపఁబడితివి.

శమదమాదిసుగుణసంపత్తితో ధర్మమును వీడని సుక్షత్రియుఁడే రాజ్యపాలనకుఁ దగినవాఁడు.

ఓ శ్రీరామచంద్రా! పైనఁజెప్పినట్లు సుక్షత్రియుఁడవై జన్మించితివి. అయినను క్రూరత్వమువహించి, పరులను మోసగించుటకై, సౌమ్యాకారముతో, సంచరించుచున్నావు. ఇదినీకుఁ దగినపనిగాదుసుమా! రామా! మేము ఫలమూలాదులే యాహారముగా, నడవులందిరుగు మృగములము. నీవుమానవుఁడవు. అంతియేగాక, మానవులను ధర్మమార్గమునఁ బాలించవలసిన రాజశ్రేష్ఠుఁడవు. లోకములో యుద్ధములకు, భూమి, బంగారము, వెండి, యనునవే కారణములు. అట్టియెడ మనయిద్దరిమధ్య నట్టివేవియునులేవు. నావనములు, నాఫలాదులు ననువానివలన నీకేమిలాభము? ఓయీ! రాఘవా! నయవినయములును, నిగ్రహానుగ్రహములును నేసమయములం దేవానిం బ్రయోగించవలయునో, తెలిసికొని ప్రవర్తించుట రాజధర్మము. అంతియేగాని యొకదానికొకటి జోడించి కలగాపులగముగాఁజేసి, ధర్మాచరణఁ

జేయుట ధర్మజ్ఞుల లక్షణముగాదు. ఇప్పుడునీవు కామ ప్రధానుఁడవై, క్రోధస్వభావముతో, మర్యాద నతిక్రమించితివి. మఱియు రాజధర్మము నొకచోఁజేయవలసిన, దింకొకచోఁ జేయుచుఁ దారుమారుగా ప్రవర్తించుచున్నవాఁడవై ధనువు నాధారముగాఁజేసికొని, దానితో నీయిచ్ఛవచ్చిన వారిని వివేకములేక వధించుచున్నావు. నీలో ధర్మాచరణ లేదు. అన్నివిధాలా, నీవింద్రియవశుఁడవై, నిగ్రహాశక్తిలేక, స్వేచ్ఛగాఁబ్రవర్తించుచున్నావు. నీకుయుక్తాయుక్తములు దెలియవు. ఓరామా ! నిరపరాధినైన నన్నుజంపి, యాతరువాతఁ బదిమందిలోను, ధర్మాత్ముఁడనని యెట్లుతలయెత్తికొని తిరుగఁగలవు ?

శ్లో॥ రాజహా బ్రహ్మహా గోఘ్న, శ్చోరః ప్రాణివధేరతః।
నాస్తికః పరివేత్తాచ, సర్వేనిరయగామినః॥

స. 17, శ్లో॥-34.

శ్లో॥ సూచకశ్చ కదర్యశ్చ, మిత్రఘ్నో గురుతల్పగః।
లోకం పాపాత్మనా మేతే, గచ్ఛన్తే నాత్రసంశయం॥

స. 17, శ్లో॥-35.

తా॥ ప్రభువు, బ్రాహ్మణుఁడు, గోవు ననువారిని జంపువాఁడును, దొంగతనముచేయువాఁడును, నమాయక ప్రాణులను జంపుటయం దాసక్తిగలవాఁడును వేదశాస్త్ర

ములఁ దిరస్కరించువాఁడును, (నాస్తికుఁడు) నన్నగారికంటె ముందుగాఁ బెండ్లాడినవాఁడును, చాడీలు చెప్పువాఁడు, లోభివాఁడును, నమ్మినమిత్రుని జంపువాఁడును, గురువు యొక్క భార్యతో రమించినవాఁడును, నగువారందఱును, మహాపాపులని చెప్పఁబడుదురు. వీరు నరకలోకమున కేపోవుదురు.

ఎంతటిధర్మమార్గ ప్రవర్తకుఁడైనను, మహాఘోర పాపములగువానిలో నేయొక్కటి చేసినను, సర్వము నశించి, నరకమునందుటతప్పదు.

విశేషము :- వాలిచెప్పినమాటలలో శ్రీరాముఁడు ప్రాణివధాసక్తుఁడను దోషమారోపించఁబడినది. ఇది సామాన్యుల, కధర్మమే. కాని దుష్టశిక్షణలలో నిమగ్నులైన ప్రభువులకు విశేషధర్మము. దోషముగాదు.

ఓరామా ! ఇంకనువినుము ! "నిన్నువేటాడవచ్చి చంపితి" నందువా ? నీవంటి ధార్మికప్రభువులు, కోతియొక్క చర్మమునుగాని, దానియెముకలనుగాని, మాంసమునుగాని, యెట్టిసమయములందు నుపయోగించరు. అయిదుగోళ్ళుగలిగిన యైదువిధములైన జంతువులే, (ఏదుబంది, యడవిపంది, యుడుము, కుందేలు, తాబేలు, అన్నవియైదును) బ్రహ్మక్షత్రియవైశ్యులకు భోజనార్హములు. తక్కినవానిలోఁ బంచనఖములైనవియు, దినుటకుఁదగినవి కావు. ఓయీ !

మహారాజకుమారా ! పండితులగువారు కోతిచర్మమునుగాని, యెముకలనుగాని ముట్టికొనరు. దానిమాంసము నసలేతినరు. అట్టినిరుపయోగజాతినైన నన్నునవ్యర్థముగా వేటాడిచంపుట యేటి ధర్మము ? నీకఠినహృదయమునకుఁ బాపచింతనగలుగ లేదా ? నారాణియైనతార సర్వజ్ఞురాలు. నాకుహితమేచెప్పినది. నేనజ్ఞానముచే నామె మాటలను లెక్కచేయక యీమృత్యువును దెచ్చికొంటిని. పతివ్రత దుర్మార్గుఁడైన భర్తచేఁ బలుకష్టము లనుభవించునట్లు, నీవంటియధర్మ ప్రభువుచేఁ బాలింపఁబడు ప్రజలెంతమాత్రమును సుఖించలేరు అనిపలుకుచు, వాలి, శ్రీరామునియందుగల ధర్మసూక్ష్మము నెఱుంగలేక మఱియునిట్లు నిందించుచున్నాఁడు.

ఓరామా ! నీవుచాటుమాటుల నితరులను వధించువాఁడవు. పరుల కపకారముచేయు స్వభావముగలవాఁడవు. నీచముగాఁ బ్రవర్తించితివి శాంతమును నటించు హృదయకాఠిన్యము గలవాఁడవు. మొత్తముమీద బాపపుఁ బనులనే చేయువాఁడవు ఇట్టినీవు ధర్మాత్ముఁడై మహాత్ముఁడైన దశరథమహారాజుయొక్క గర్భమున నెట్లుజన్మించితివి ? మదించిన యేనుఁగు మావటివానిశూలమునకును, భయపడక, విజృంభించి, కనఁబడినజీవులనెల్ల సంహారించునట్లు, నీవుధర్మమును మర్యాదను నతిక్రమించి, నీకండకావరముచే, వధించరాని, నన్నుజంపితివి. పెద్దలందఱు నసహ్యించికొనెడి, పాపము నాచరించితివి. ఇంక నీవాపెద్దలయెదుట నేమిసమాధానము

చెప్పఁగలవు? నీకేయపకారమును జేయని, నాయందుఁ జూపిన నీపరాక్రమము, నీకపకారము చేసిన రావణాదులయం దేలఁజూపించలేకపోయితివి? రాజకుమారా! నీవుపౌరుషముతో, నెదురెదురుగా నాతో యుద్ధముగావించినచో, నీపాటికి యమలోకమును జూచియుండెడివాఁడవుసుమా! మద్యపానముచే మైమరచి, నిద్రవోవువానిని సర్పముగాటేసినట్లు నన్ను జంపితివి. ముందుగా నీవు నన్నే యాశ్రయించినచో సీతను వెదకి తెలిసికొనుటయేగాక, యొక్కదినములో నామెను నీసన్నిధిని నిలిపెడివాఁడనుగదా! నీవు రావణుని సంహరించుటకేగదా! సుగ్రీవునాశ్రయించినది. పైగా నాసుగ్రీవునికొఱకై నన్ను జంపుటయు నందులకేగదా! ఆయాశ్రయము నాయందే నీవు చూపించిన, నీపాటికా రావణుని జుట్టుపట్టి యీడ్చికొనివచ్చి నీపాదములకడఁ బడవైచియుందునా? ఓవీరరాజవరేణ్యా! నీవాజ్ఞాపించినచోఁ బూర్వము మధుకైటభులచే, పాతాళంబున దాఁచఁబడిన శ్వేతాశ్వతరీ యను శ్రుతిని, హయగ్రీవుఁడు సాధించి తెచ్చినట్లుగా, నారావణుఁడు సీతనే పాతాళమున దాఁచియుంచినను నేనామెను దెచ్చి నీకొసంగెడివాఁడనేసుమా! నామరణానంతరము సుగ్రీవుని రాజుగాఁ జేయవలె ననుటయుక్తమే. కాని నేనొకనితో యుద్ధము చేయుసమయమునఁ జాటుగానుండి నన్ను వధించుట యేమిధర్మము? "జాతస్యహి ధ్రువో మృత్యుః" అన్నట్లు చావెవ్వనికైన, నెన్నఁటికైనఁ దప్పనిదే. కావునఁ

జావునకుం జింతించను. ఇంతకును నీవునన్నేధర్మము నను సరించి చంపితివో? చెప్పుము. అనియూవాలి మాటలుమాని, శ్రీరాముని సమాధానమునకై నిరీక్షించుచుండెను. శ్రీరామబాణము గుండెలలో దిగంబడి, యప్పటికే మరణ బాధనందుచు నోరుపొడార్చికొనిపోవుచున్నను, శ్రీరాముని దివ్యమంగళవిగ్రహమును దర్శించి, యానందించుచునే యాతండు మాటలను విరమించెను.

## శ్రీరాముని ధర్మనిరూపణము వాలియంగీకారము

అప్పటికే మరణబాధపడుచున్న వాలి తెలివిదప్పుచు, స్వల్పమైనబుద్ధితో పైవిధముగా శ్రీరాము నధిక్షేపించెను. ఒకవంకవినయము, వేఱొకవంక ధర్మార్థయుక్తము నగు, గోపముతోంగూడిన పరుషవాక్కులను బలుకంగావిని, శ్రీరాముండిట్లనుచున్నాండు.

ఓవాలీ! ధర్మార్థకామములను, లౌకికవిషయములను, సరిగాం దెలిసికొనక కేవలమజ్ఞానివై, సర్వజ్ఞుండనన్న యహం భావముతో, నన్నేలనిందించెదవు? ఓయీ! బుద్ధిసంపదంగల వాండా! నీబుద్ధినుపయోగించి, జ్ఞానసంపన్నులై ధర్మ సూక్ష్మములనెఱింగిన పెద్దలసన్నిధిని, ధర్మమును దెలిసికొనని వాండవై నచోనన్నిట్లు నిందంచవు. నీకోపమును విడువుము. సమస్తపర్వత మహావనోపవనములతోడను, నదులతోడను,

మనుష్యపశుపక్ష్యాది జీవరాశులతోడను, నిండిన యీభూమి యంతయు న్వికువంశీయుల దేసుమా ! అట్టిసర్వజీవులయెడ లను నిగ్రహానుగ్రహములుగలిగి మావంశీయులు పాలించు దురు. అట్టిభూమినంతను, సత్యప్రతిజ్ఞుడును, ధర్మార్థకామ ముల నెఱింగినవాఁడును, నిగ్రహానుగ్రహాసమర్థుఁడును, నగు భరతుఁడు నేఁడుపాలించుచున్నాఁడు. ఎవఁడునీతిని, శిక్షను, సత్యమును, శాస్త్రీయమైన పరాక్రమమును, సుస్థిర ముగాఁ గలిగియుండునో, వాఁడేభరతుఁడు. ఆభరతుఁడే నేఁడుపాలించుచున్నాఁడు. భరతుఁడు తనరాజధర్మమును విడువక చేసినయాజ్ఞను శిరసావహించి, నాతోఁబాటు సమస్తరాజశ్రేష్ఠులమును, ధర్మరక్షణకొఱకై, దీక్షవహించి తిమి. అంతటి ధర్మసంస్థాపన దీక్షగలిగిన భరతరాజ్యమున, ధర్మమునుదప్పి యెవఁడుప్రవర్తించఁగలఁడు ? అధర్మప్రవర్త కుఁడు తప్పకశిక్ష ననుభవించవలసినదే. అట్టిభరతాజ్ఞను బురస్కరించికొని మేముధర్మమును విడువక, దుర్మార్గులను శక్తివంచనలేకుండ శిక్షించుచున్నాము. నీవుధర్మవ్యతిరేక ములై, నిందితములైన, పనులెన్నిఁటినో, చేసినావు, రాజ మర్యాదనువిడిచి, తప్పుడుదారిని సంచరించితివి.

శ్లో॥ జ్యేష్ఠో భ్రాతా పితాచైవ, యశ్చవిద్యాం ప్రయచ్ఛతి ।
త్రయస్తే పితరో జ్ఞేయా, ధర్మేపథిహి వర్తినః ॥

స. 18, శ్లో॥ 13

తా॥ ఓవాలీ! పెద్దన్నయును, విద్యలు నేర్పినగురువును, గడుపునఁగన్నతండ్రియును, ధార్మికులైనవారికి సమాన గౌరవనీయులు. వారుముగ్వురును దండ్రులేయగుదురు.

తండ్రియాజ్ఞను శిరసావహించుట సర్వమానవులకును ముఖ్యధర్మము.

శ్లో॥ యవీయా నాత్మనః పుత్రః, శిష్యశ్చాపి గుణోదితః ।
పుత్రవ త్తే త్రయశ్చిన్త్యా, ధర్మశ్చే దత్ర కారణమ్ ॥
స. 18, శ్లో॥-14.

తా॥ ధర్మమునను సరించువారికిఁ దనకడుపునఁబుట్టిన కొడుకును, దమ్ముఁడును, సుగుణాత్ముఁడైన శిష్యుఁడును నను నీముగ్వురును బుత్త్రులగుదురు.

'పుత్' అను నరకమునుండి తరింపఁజేయుటకుఁ గుమారునితోఁబాటు తమ్ముఁడును, శిష్యుఁడుగూడనర్హులే. యనిధర్మము చెప్పుచున్నది.

శ్లో॥ సూక్ష్మః పరమదుర్జ్ఞేయః సతాంధర్మః ప్లవంగమ ।
హృదిస్థ స్సర్వభూతానా మాత్మా వేద శుభాశుభమ్ ॥
స. 18, శ్లో॥-15

తా॥ ఓయీ! వానరరాజా! ధర్మసూక్ష్మము సత్పురుషులకుఁగూడఁ దెలియరాకయుండును. ఇంకనీవంటి కోతికి నెట్లు తెలియును? సర్వుల హృదయము లందునుండి

సర్వాంతర్యామియైన పరమాత్మ కుమాత్రమే యయ్యది. తెలియును.

ధర్మమేనునది, సామాన్యము విశేషము నని రెండు విధములు. అందు మొదటిదానిని సత్పురుషులందఱు నెఱుంగుదురు. రెండవదియైనధర్మసూక్ష్మము, నాత్మజ్ఞానియై, బ్రహ్మవేత్తయైన వాఁడే తెలిసికొనఁగలఁడని, యెఱింగి, యట్టి దానిని విమర్శించరాదు. (ఇచ్చట రాముఁడు తనదివ్యత్వ మును వ్యంగ్యముగా చెప్పెను.)

ఓవాలీ ! నీవుచపలుఁడవు. పుట్టుగ్రుడ్డివాఁడు వేరొక పుట్టుగ్రుడ్డివానితో నుపాయమాలోచించినట్లు, నీవంటిస్థిర బుద్ధిలేని వానరులతో నెంత గానాలోచించినను ధర్మము నేమిసాధించఁగలవు? పుత్త్రులవిషయములో నింకను జెప్పెదను వినుము ! నీవుకోపముతో నన్ను నిందించుట యెంతమాత్ర మును మంచిదిగాదు. నిన్ను జంపుటకుఁగల కారణమును వినుము. నీవు మొదటినుండియును ధర్మము నతిక్రమించు చుంటివి. నీకుఁ బుత్త్రసమానుఁడైన తమ్మునిభార్య నపహ రించి, యామెతో రమించుచుంటివి. ఇట్టిఘోరపాపమే నీవధకుముఖ్యకారణము. నీకుఁగోడలువంటి తమ్మునిభార్య యందు కాముకుఁడవై రమించితివి. అట్టిపాపమునకు మరణ శిక్షయే ధర్మసమ్మతమైనది. శాస్త్రవిరుద్ధముగను, లోకా చారవిరుద్ధముగను, బ్రవర్తించువానికి శిక్షతప్పదు. సుక్షత్రి యుఁడనైననేను, నీపాపముం దెలిసియు నెట్లూరకుండఁగలను?

సమర్థుఁడైనరాజు శిక్షించకపోవుటయు, దోషమే. నీవంటి కాముకునకు నందును దోఁబుట్టువు, లేక కూతురువంటి తమ్ముని భార్యతో రమించువానికి మరణశిక్షయే శాస్త్రమున విధించఁబడినది. భరతుఁడు ధర్మపరిపాలకుఁడు. మేమాతని యాజ్ఞానువర్తులము. నీవంటిపాపాత్ములను జూచుచు నెట్లూరకుందుము? మహారాజదండనకంటె నధికుఁడు. "నావిష్ణుః పృథివీపతిః" అన్నన్యాయమును వినిందువుగదా? ధర్మమెఱింగిన భరతుఁడు ధర్మమునకుఁ దనరాజ్యమున భ్రష్టత్వము గలుగకుండఁ గనిపెట్టికొనియుండును. శాస్త్రవిహితధర్మమును విడిచి యెవనియిష్టమువచ్చినట్లు వాఁడుప్రవర్తించుటకు భరతుఁడు సహించఁడు. సరిగదా, నిర్దాక్షిణ్యముగా శిక్షించును. మేమాభరతుని యాదేశానుసారముగాఁ జేయవలసినవారము. కావున నశాస్త్రీయముగాఁ బ్రవర్తించు దుర్మార్గులను వధించుటయే మాపని.

శ్లో॥ సుగ్రీవేణచ మేసఖ్యం, లక్ష్మణేనయథా తథా।
దారరాజ్యనిమిత్తంచ, నిశ్శ్రేయసి రతస్సమే॥
స. 18, శ్లో॥-26.

తా॥ లక్ష్మణునితోఁగల సంబంధమెట్టిదో నాకుమిత్రత్వముచే సుగ్రీవునితో నట్టిసంబంధ మేర్పడినది. (సుగ్రీవుఁడు నాకుసోదరునివంటివాఁడు.) అంతటి సఖ్యమెంతమాత్రమును విడువరానిది. ఆతనితో నాకుఁగలసఖ్యము భార్యకొఱకును

రాజ్యముకొఱకు నుద్దేశించఁబడినది. అట్టినాసోదరునిభార్య నపహరించిన నీవుసర్వథా వధ్యుఁడ వేయగుచున్నావు. సుగ్రీవుఁడు నాక్షేమమునకై ప్రాణములనైనను లెక్కచేయఁడు.

అధర్మముగాఁ బ్రవర్తించినవానిని శిక్షించుటయు, నగ్నిసాక్షిగా మైత్రినిగావించికొనినప్పటి ప్రతిజ్ఞను బాలించుటయు క్షత్రియధర్మము.

ఓయీ ! వాలీ ! సుగ్రీవునితో మైత్రినిజేయుసందర్భమున వాలివైననిన్ను సంహరించెదనని ప్రతిజ్ఞ చేసితిని. దానిని నెరవేర్చికొంటిని. నావంటివాఁడు ప్రతిజ్ఞనుజేసి, దానికివ్యతిరేకముగాఁ బ్రవర్తించఁడు. కావున నేనుజెప్పిన లౌకిక శాస్త్రీయకారణములను నీలో నీవు విమర్శించికొన్నచో నన్నునిందించవు. నిన్నుసంహరించుట సర్వథా ధర్మయుక్తమే యని తెలిసికొనుము.

శ్లో॥ వయస్యస్యాపి కర్తవ్యం, ధర్మమేవానుపశ్యతః ।
శక్యంత్వయాపి తత్కార్యం, ధర్మమేవానుపశ్యతా ॥
స. 18, శ్లో॥-30.

తా॥ ధర్మాసక్తిగలమిత్రుఁడుగూడఁ దనమిత్రుఁడిటువంటి పాపకార్యమునుజేసినచోఁ దప్పకవానిని శిక్షించవలెను. నీవీవిషయము నాలోచించినచో, నీకుఁజేసినశిక్షవలన నీకుఁదగినప్రాయశ్చిత్తము గలిగినదని తెలిసికొనుము. కావున నిందులకు విచారించకుము.

తాను జేసినపాపమున కిచ్చటనే శిక్షననుభవించినచో నది, యంతలోనే నశించును. లేనిచో మరుజన్మల కది కొండంతగాఁ బెరిగి, యనుభవించుటగష్టమే యగునని యెఱింగి, శిక్షకు విచారము మానుటయే ధర్మము.

శ్లో॥ శ్రూయతే మనునా గీతౌ, శ్లోకౌ చారిత్రవత్సలౌ ।
గృహీతౌ ధర్మకుశలై, స్తత్తథాచరితం హరే! ॥
స. 18 శ్లో॥-31

తా॥ ఓ వానరాధిపతీ! వినుము! పూర్వము మనువు, సదాచారములను జక్కగా బోధించునట్టి రెండు శ్లోకములను జెప్పెను. ధర్మశాస్త్రవేత్తలైన వారందఱు, నా రెండు శ్లోకములను గ్రహించి, యాచరించుచుందురు. నేనుగూడ నా మార్గమునే యనుసరించితిని.

తనబుద్ధి కధర్మముగాఁదోచినను, లోకక్షేమమును గోరి తమదివ్యదృష్టితోఁ త్రికాలజ్ఞులైన మునులుచెప్పిన శాస్త్రము ననుసరించుటయే ధర్మము.

శ్లో॥ రాజభి ర్ధృతదండాస్తు, కృత్వాపాపాని మానవాః ।
నిర్మలా స్స్వర్గమాయాన్తి, సన్తస్సుకృతినో యథా ॥
స. 18, శ్లో॥-32.

తా॥ దొంగతనము మొదలైన పాపములకుఁ దగినట్లుగా, రాజుశిక్షించినను, విడిచిపెట్టినను, నా పాపములు

తొలఁగిపోవుచున్నవి. పాపమునకుఁదగిన శిక్షవిధించనిచో, నాపాపమురాజునకే సంక్రమించును. కావున నేరస్థుఁడు రాజదండనచే పాపవిముక్తుఁడై, యుత్తమలోకముల నందుచున్నాఁడు.

నేరస్థునకుఁ దగినశిక్షను విధించి, యాతనిపాపఫలము ననుభవింపఁజేయుట రాజధర్మము.

ఓవాలీ ! నీవలెనే మహాపాపములనుజేసిన బోయవానికి, ధార్మికుఁడైనమాంధాత తగినశిక్షవిధించి, వానినిబాపవిముక్తుని గావించెను. ఓయీ ! మావంశీయుఁడైన యొక్కమాంధాతయేగాదు. అతనికిఁబూర్వీకులును దరువాతివారును నగు రాజులందఱును బ్రజలుచేయుచున్న పాపములనెఱింగి, వారినిశిక్షించి, ప్రాయశ్చిత్తమొనరించుట మూలముగా, బవిత్రులఁగావించిరి. ఇదిమావంశీయుల కాదినుండియును వచ్చుచున్న యాచారముకావున నోవనచరరాజా ! నీవుపరితపించకుము. ధర్మానుసారముగా నిన్నుజంపుటయైనది. మేము వేదశాస్త్రముల నతిక్రమించువారముగాము. మాయిష్టానిష్టము లిట్టిచోట్లపసికిరావు. ఓయీ ! నీవుమానవుఁడవు కాకపోయినను, మానవధర్మములైన సంధ్యావందనాది, కర్మల నాచరించుచున్నావు. కావుననీవును మానవధర్మసూక్ష్మముల నెఱిగి ప్రవర్తించవలెను. ఇఁకనీవానరత్వమునే పురస్కరించి, చెప్పెదనాలకించుము. నామాటయుక్తియుక్తమైనచో నంగీకరించి తరించుము. నీవునన్ను "జెట్టుచాటుననుండి వధించి

తివి" యని యన్నంతమాత్రమున నీపైనాకుఁ గోపతాప ములు లేవు. మానవులు వేటాడునప్పుడు దాగియుండిగాని, యెదురుగానుండిగాని, వలలు పాశములు మొదలగువాని నుపయోగించిగాని, జంతువులను వధించుటయుఁ బట్టికొనుట యును జేయుచుందురు. కేవలమాంసముకొఱకేకా కున్నను, వేటాడువా, రాయాజంతువులు పారిపోవుచున్నను, నిలిచి యున్నను నేమరుపాటుగానున్నను, వానినివధించుట యాచా రము. కావున నిన్ను జెట్టుచాటుననుండి చంపుటలో దోషము లేదు.

"ఆచారః ప్రథమో ధర్మః" అను సూక్తిచే నేనాదినుండియును వచ్చుచున్న యాచారమును బాటించితిని. పరమధార్మికులగు రాజర్షులుగూడఁ దినరానివానినిగాని, తినవలసినవానినిగాని జంతువులను జంపుదురు. ఆవిధముగా నీవునాచేఁజంపఁబడితివి ఎదురుగా యుద్ధముచేయకున్నను, నీవుశాఖామృగమవగుటచే, నిన్నుజంపుటలో దోషములేదు.

శ్లో॥ దుర్లభస్యచ ధర్మస్య, జీవితస్య శుభస్యచ, ।
రాజానో, వానరశ్రేష్ఠ ! ప్రదాతారో నసంశయః ॥

శ్లో॥ తాన్నహింస్యా, న్నచాక్రోశే న్నాక్షిపే న్నాప్రియంవ దేత్ ।
దేవామానుషరూపేణ, చరంత్యేతే మహీతలే ॥

స. 18, శ్లో॥-40, 43.

తా॥ ఓయీ ! వానరోత్తమా ! వాలీ ! (ఇచ్చటవాలి శిక్షననుభవించుటచేఁ బాపరహితుఁడైనాఁడు. కావుననే యాతనిని రాముఁడువానరోత్తమా ! యని సంబోధించుట) దుర్లభమైన ధర్మమును దానిననుసరించిన జీవితమును, బ్రజలకుఁగలుగఁజేసి, రాజులు పాలించుచుందురు. అట్టి రాజులు మానవరూపములోనున్న దేవతలుగా భావించుము. కావున నట్టిరాజులను దూషించుటయు హింసించుటయు, నాక్షేపించుటయును బనికిరావు.

"నావిష్ణుఃపృథివీపతిః" అనుసూక్తిని దెలిసికొని, ప్రభువేదిచేసినను దనమేలునకే యనిభావించుటధర్మము. ప్రజాశ్రేయస్సును దృష్టియందుంచికొని పాలించుటప్రభుధర్మము.

శ్లో॥ ఆర్యేణ మమమాంధాత్రా వ్యసనంఘోర మీప్సితమ్ ।
శ్రమేణన కృతేపాపే, యథాపాపం కృతంత్వయా ॥
స. 18, శ్లో॥-34.

శ్లో॥ అన్యైరపకృతంపాపం ప్రమత్తై ర్వసుధాధిపైః ।
ప్రాయశ్చిత్తంచ కుర్వన్తి, తేనతచ్ఛామ్య తేరజః ॥
స. 18, శ్లో॥-35.

తా॥ ఓవాలీ ! పూర్వము మావంశీయుఁడైన మాంధాతప్రజలఁబాలించుచు, నీవలెనే మహాపాపమొనర్చిన యొకానొక బోయవానిని జంపినాఁడు. ఆనాఁడు బోయ

వాఁడను, నేఁడునీవునేగాక, యిట్టిపాపాత్ములెందఱో రాజ దండనకుగురియైరి. కావున నట్టివారందఱును బాపవిముక్తులైరి. ఇదియనాదినుండియు జరుగుచున్నయాచారము సుమా !

నేరమునకుఁ దగినశిక్షను విధించుట రాజధర్మము. రాజదండన ననుభవించినవానికి యమదండన యుండదని శాస్త్రము.

## వాలి పశ్చాత్తాపముతో - శ్రీరాముని - ప్రార్థించుట

వెండియు శ్రీరాముఁ డిట్లనుచున్నాఁడు. ఓవాలీ ! నీవుధర్మసూక్ష్మము నేమాత్రము నెఱుంగక సర్వధర్మమర్మములను నెఱింగినవానివలెఁ గ్రోధోద్రేకముతో నన్నునిందించుచున్నావు. తాతలనాఁటినుండియు ననుసరించఁబడుచున్న ధర్మము నించుకైననుదప్పక యాచరించుచున్న నన్నునూరక నిందించుట నీకుఁదగదు. అనఁగావిని, వాలి చేతులుజోడించి, నమస్కరించుచు శ్రీరామచంద్రునితో నిట్లనుచున్నాఁడు. పురుషోత్తముఁడవైన యోరాఘవేంద్రా ! ఇప్పుడు నీవు చెప్పినదియుఁ జేసినదియు నంతయును ధర్మసమ్మతమే. ఏమాత్రము ననుమానములేదు. నీవు సర్వజ్ఞుఁడవు. నేను జంచలస్వభావుఁడనైన యధమాధముఁడను. నేనుగోతిని. నిన్నుగాదని యేమిచెప్పఁగలను ? నేనింతమందజ్ఞానమున

నిన్ను దూషించితిని. నన్ను క్షమించుము! నీవు సర్వము నెఱిం గిన మహాత్ముఁడవు. ప్రజాక్షేమమునందే బుద్ధిని నిలిపి ప్రవర్తించువాఁడవు. శ్రీరామచంద్రా! ఏ పాపమున కెంతవరకు శిక్షవిధించవలయునో హెచ్చుతగ్గులుగాకుండఁ జేయుపండితుఁడవు. సర్వజ్ఞమూర్తీ! నేను పాపాచరణుఁడను. అట్టినేను నిన్ను క్షమాభిక్షను వేడుకొనుచున్నాను. మహాత్మా! "నిన్ను నేనుక్షమించితిని" అని యొక్కమాట వలుకుము. నాచావునుగూర్చిగాని, తారాదిబంధుమిత్రవర్గమునుగూర్చి గాని నాకువిచారము లేదు. అయినను బంగారుభుజకీర్తులను ధరించి, సుగుణోత్తముఁడై చూడముచ్చటగానుండు, నంగదునివిషయమును దలఁచికొన్నచో నాకుదుఃఖము రాకతప్పుట లేదు. వాఁడుపుట్టినది మొదలు నేనెంతో గారాబముగాఁ బెంచి, పెద్దవానిని జేసితిని. అతఁడొక్కనిమిషమైన నన్ను విడిచియుండలేఁడు. అట్టివాఁడు నామరణముచేఁ గన్నీళ్ళుఁ గార్చుచు నీళ్ళింకిపోయిన చెఱువువలెఁ గృశించిపోవును. కావుననోరామా! నాయంగదుని నీవే కాపాడవలయును. సుగ్రీవాంగదులను సమానమైన వాత్సల్యముతోఁ గాపాడుము. నీవు సీతమ్మనైన భరతలక్ష్మణశత్రుఘ్నుల నెట్లు ప్రేమించుదువో, యట్లే సుగ్రీవాంగదులనుగూడఁ బ్రేమించుము.

ఓమానవనాథా! రామా! నేనుసుగ్రీవున కపకారము చేసి, యాతనికి విరోధినైతిని. కావున నాభార్యనన్ననుసరించు

టచే, నామెయును సుగ్రీవునకు శత్రువేకాఁగలదు. కావున నాతఁడు తారసేవిధమునను నవమానించకుండఁ గట్టడి చేయును. ఆమె యేపాపము నెఱుంగనిది. ఓ రామప్రభూ! నీయనుగ్రహమునకుఁ బాత్రుఁడై నీమనస్సును గ్రహించి, నీకనుకూలముగాఁ బ్రవర్తించు మహాభాగ్యము సుగ్రీవునకు లభింపఁజేసితివి. అంత్యమున నాతఁడు మోక్షమునందఁ గలఁడు. రామా! నిన్ను దర్శించుచు నీచేతిలో మరణించ వలయునన్న కోరికతోఁడనే, యాతార నన్నెంతఁగా నివారించి నను, నేనామెనుగాదని సుగ్రీవునితో యుద్ధమునకు వచ్చితిని సుమా! అనివాలి తనకుఁగల శ్రీరామభక్తిభావమును వెల్లడి చేసి యూరకుండెను.

## శ్రీరాముఁడు - వాలి - ననుగ్రహించుట

ఆతరువాత శ్రీరాముఁడు ధర్మనిష్ఠను, నాశ్రితవత్స లత్వమును, వెల్లడియగునట్లుగా నిట్లనియెను. ఈయంగదకుమా రుని రక్షణవిషయమై నీవెంతమాత్రమును విచారించకుము. సుగ్రీవభార్యాపహరణాది పాపములకుఁగాని నన్ను దూషించుటనుగాని, నీవు విచారించకుము. అందులకుఁ దగిన శిక్ష ననుభవించుటచే నిప్పుడు నీవు నిర్మలుఁడవైతివి. పాపము చేసినవానికిఁ దగినదండన విధించుటచే, నారాజుగూడఁ గృతార్థుఁడగును. (తననేరము నంగీకరించనివాఁడును

నేరమునకుఁ దగినశిక్షను విధించనివాఁడును నధోలోకము లకుఁబోయి నరకబాధల ననుభవింతురని శాస్త్రప్రమాణము.) ఓవాలీ! ధర్మయుక్తమైన శిక్ష ననుభవించుటవలన, నీపాపము లన్నియునుబోయి ధర్మిష్ఠుఁడవైనావు. ఓయీ! వానరోత్తమా! నామాటలనువినుము. నీవు శోకమోహము లను విడువుము. ఇఁకనీవు విచారించఁబనిలేదు. ప్రారబ్ధ కర్మము నెంతటివారును దప్పించికొనఁజాలరు. అట్టియెడ నీవేపాటివాఁడవు? మహాత్ములైనవారు ప్రాబ్ధకర్మ నానంద ముగా ననుభవింతురు. నీకుమారుఁడంగదుఁడు నీయందెట్టి భక్తిప్రపత్తులతోనుండెడివాఁడో, యిటుపైని సుగ్రీవుని యందును నాయందును నంతటి భక్తిప్రపత్తులనే చూపఁ గలఁడు. అతనియందు మాకును నంతటి ప్రేమ వాత్సల్యము లుండఁగలవు. సందేహములేదు. అనఁగావిని, ధర్మస్వరూపుఁడైన శ్రీరామవాక్యములందు విశ్వాసముంచి, వాలియిట్లనుచున్నాఁడు. ఓ శ్రీరామచంద్రప్రభూ! నీవు ధర్మమూర్తివి. నిగ్రహానుగ్రహసమర్థుఁడవు. మహాపరాక్రమ శాలివి. నేను మరణబాధలో నేమేమో నిన్ను దుర్భాషలాడి తిని. అట్టినన్ను క్షమించి, యుద్ధరించఁగలవని ప్రార్థించు చున్నాను. నన్ననుగ్రహించుము. నేనుబుణ్యలోకములకుఁ బోవునట్లుచేసి, రక్షించుము. అనివాలి పశ్చాత్తాపముతో శ్రీరాముని శరణువేడికొనియెను.

## వాలియుక్షీణన్న వార్తందెలిసి - తార యంగదునితో వచ్చుట

వాలి శ్రీరామునితో క్షమించి - నాకుశరణమునిమ్మ"ని ప్రార్థించి యూరకుండెను. అప్పటికే, సుగ్రీవుని వృక్షశిలా ఘాతములతోడను, శ్రీరాముని బాణపాతముతోడను భరించరాని శరీరబాధతోఁ గన్నుమూసి శరీరస్పృహఁ దప్పియుండెను. ఆసమయమున నంతఃపురస్త్రీలతో నుండిన తార, శ్రీరామబాణముచేఁ గొట్టఁబడి, తనభర్త నేలంగూలి నట్లు విన్నది. అంతఁ బుత్రసహితముగా నాకొండగుహనుండి వాలివద్దకు, గోలుగోలున నేడ్చుచు వచ్చినది. అంగదునిఁజుట్టు వారుకొని వచ్చుచున్న వానరులందఱును బోడవైన ధను స్సునుబట్టియున్న శ్రీరామునిఁజూచి, నలుదిక్కులకును బరువెత్తిరి. నాయకుఁడు చనిపోవుటచే నాజంతువులన్నియును బారిపోవుచుండఁగా వారినందఱను నివారించి, తారయిట్లను చున్నది. ఓవానరవీరులారా! రాజ్యకాంక్షచే, సుగ్రీవుఁడు శ్రీరాము నాశ్రయించి వాలినిమాత్రము జపించినాఁడు. మీకీభయమేల? మీరుపరువులెత్తనేల? నిర్భయముగా నాతోరండు!" అనగా నావానరులుతారతో నిట్లనిరి. అమ్మా! నీవుపుత్త్రవతివి. యముఁడే రామరూపమునవచ్చి, వాలినంతవానిని సంహరించినాఁడు. నీవుమాత్ర మచటకుఁ బోవకుము. నీపుత్త్రుని దూరముగాఁగొనిపోయి, రక్షించి కొనుము. దేవేంద్రసమానుఁడగు వాలి చనిపోవుటచే నింతకు

బూర్వము వాలికిభయపడి, చెల్లాచెదరైపోయిన వానర సైన్యమంతయును, మరలఁ గిష్కింధకు వచ్చుచున్నది. పురద్వారములను బంధించి, యంగదు నాలోపల భద్రముగా నుంచి, తగినబలము నాతనికంగరక్షణకై నియమించి, నీవే కుమారునిరక్షించికొనవలెను. ఆవాలికుమారుఁడగు నంగదునకుఁ బట్టాభిషేకముచేయుము. వానరులందఱును నీకుమారుని సేవింపఁగలరు.

ఓసుందరాంగివైన తారాదేవీ! అట్లునీవుచేయనిచో నీకిష్కింధలోనే నీవునిలువలేవుసుమా! అదియెట్లందువా! శత్రుకూటములోని వానరులందఱును, మనకోటలోని రహస్యస్థానముల నన్నిఁటి నాక్రమించికొందురు. అదియెట్లనఁగా! వినుము! పూర్వము వాలిచే నీపట్టణ వాసులందఱును వారివారిభార్యలనుదప్ప మిగిలినపురుషులను దరిమివేసిరి. వారిలో బ్రహ్మచారులునుగలరు. కావున వారందఱును నేఁడుసుగ్రీవుని బురస్కరించికొని కోటలో స్వేచ్ఛగాఁ బ్రవేశించి, మనలను దరిమివేయుదురు. కావున నీవటకుఁ బోవలదు." అనివానరులందఱును బలికిరి. అల్పబుద్ధులగు నావానరులమాటలకు నవ్వుకొని, తారయిట్లనెను. ఓవానరులారా! నాపుత్త్రుఁడు రాజ్యము మొనలగువానితో నాకేమి పని. అంతటిమహాశక్తిసంపన్నుఁడైన నాభర్తయే చనిపోఁగా నేమియున్న నాకేమిప్రయోజనము? ఆరామబాణముతోఁ జనిపోయిన నాభర్తపాదాలసన్నిధికే పోవుదును. అనిచెప్పి

నెత్తియు, నోరును, గుండెలను బాదుకొనును, గట్టిగా నేడ్చుచు నాతార వాలికడకే పోయినది. అట్లుపోయి నేలం బడియున్న తనభర్తనుజూచెను. మఱియు నాప్రక్కనేయున్న వాఁడును, యుద్ధములందు వెనుదీయక రాక్షససంహారమును జేయువాఁడును, వజ్రాయుధమునుధరించిన దేవేంద్రునివలెఁ బర్వతంబులఁగూడ నెగురఁగొట్టగలవాఁడును, నగు శ్రీరాముని జూచెను.

ఆతఁడుమహామేఘమువలె గంభీరముగా మాట్లాడు వాఁడు. మహావర్షముగురిసి, వెలిసినట్లు ప్రశాంతముగా నున్నాఁడు. ఎంతటిశూరులనైన దనపరాక్రమముచేఁ జంపఁ గలవాఁడు. మాంసమునుగోరుసింహము, వేరొక సింహమును బడఁగొట్టినట్లు భయంకరముగా నున్నాఁడు. బలశౌర్య కీర్తులనుగలవాఁడయి తమ్మునిభార్యను జెఱఁబట్టినవాఁడై యాదోషము కారణముగా శ్రీరామునిచేఁ జంపబడియున్న వాలిని తారదర్శించెను. చైత్యమహావృక్షముపై నాగుబాము దాఁగియుండుటచే, నాకారణముగా గరుత్మంతునిచే నాచైత్యవృక్షమే విరిచివేయఁబడినట్లుగా నావాలి నేలంబడి యుండెను. అట్టితనభర్తయైన వాలిని తారచూచినది. ఆప్రక్కనేపాడవైనధనుస్సులధరించి రామలక్ష్మణులు నిలిచి యుండిరి. అప్పుడుతార మొదలైనయంతఃపురస్త్రీలు రామ లక్ష్మణులను దాటి పడియున్నవాలిదగ్గరకుఁబోయిరి. వాలిం జూచిన తారాదులు తొట్రుపాటుతో మూర్ఛిల్లిరి. కొంత

నేపటికి తార తెలివిఁదెచ్చికొని, 'ఆర్యపుత్త్రా!' యని పెద్దగాబలికి యేడువ నారంభించినది అంతసుగ్రీవుఁడు గోరువంకపక్షివలె నరచుచు నేడ్చుచున్న, తారనుజూచి, యామె ప్రక్కనే నిశ్చేష్టుఁడై పడియున్న యంగదునిజూచి, మిక్కిలిగా నేమియు ననలేకలోలోనఁ దానును దుఃఖించుచుండెను.

## తారావిలాపము

శ్రీరామునిచే విడువఁబడిన బాణముతోఁ గూడ నేలంబడియున్న వాలినిజూచి, దగ్గరగావచ్చిన తార, యాతనిని గౌఁగిలించికొనెను. మొదలునరుకఁగాఁ బడియున్న మహావృక్షమువలె నేలకొరిగిన వాలినిజూచి, తారయీవిధముగా విలపించినది. యుద్ధములం దారితేరినవాఁడవై, విజయపరంపరల నందిన యోవీరాగ్రేసరా! ఏయపరాధమును నెఱుంగక దీనురాలనైయున్న నాతోమాటలాడవా? ఓవానరపుంగవా! లెమ్ము! నీవంటి మహావీరనాయకు లీవిధముగా నేలపైఁబరుండుట ధర్మముగాదు. ఓవానరరాజా! సర్వావయవములును భూమినిదాకునట్లు పడియుంటివేల? దీనింబట్టిచూడఁగా, నత్యంతప్రియురాలనగు, నాకంటెను నీభూమియే ప్రియాతిప్రియమైనదిగాఁ దోఁచుచున్నది. ఓవీరాగ్రేసరా! నీవుమరణించియు, నీకిష్కింధాపురంబుకంటెరమణీయమైన పురము, నాస్వర్గమును ముందుగనే నిర్మించికొనియుందువు. అట్లుగానిచో నీకిష్కింధనేలవిడచె

దవు! నీవాయాఋతువులకుఁదగిన, రమణీయవనంబులందు నీభార్యలమైన మాతోఁ గలిసి, మహదానందముగా విహరించెడివాఁడవు. అట్టివానిని నేటితోఁ బరిసమాప్తిఁ గావించితివా యేమి? గొప్పగొప్ప వానరయూథముల కెల్ల నాయకుఁడవైన నీమరణముతో, నింక నాభోగము లన్నియును, నశించుటతో దుఃఖసముద్రమున మునిఁగితిని. ప్రాణప్రియుఁడవైన నీమరణమును వినియుఁ జూచియు దుఃఖముచే నాహృదయము వేయిముక్కలుగా బ్రద్దలు గాక నిలిచి, దృఢముగానుండుటచేత, నది యెంత కఠిన మైనదో తెలియుచున్నది. ఓవానరరాజా! నీతమ్ముని భార్య నపహరించి, యాతని దరిమివేసితివి. దానిదుష్ఫలితమే నీవీ నాఁడనుభవించితివి. ఓయీ! నీహితమునుగోరి నేను జెప్పినమాటలను బెడఁజెవిని బెట్టితివి. భార్యలమానములను గాపాడువాఁడా! ఇంకనీవు స్వర్గమునకుఁబోయి, యచ్చట మన్మథవికారములందు నేర్పరులగు నప్సరసలను, వశపరచు కొనఁగలవు. నిన్ను నీనెఱుంగనట్లు బలాత్కారముగాఁ గొని పోయిన దామృత్యుదేవత. లేనిచో నాహితవాక్యముల ననుస రించు వాఁడవేగదా! ఓనాథా! ఇంతవరకును దుఃఖము నెఱుంగనిదాననై యుంటిని ఇటుపైని నీవు లేకపోవుటచే, వైధవ్యమునంది, దుఃఖమును దారిద్ర్యము ననుభవించవల సినదాన నగుచున్నాను. చూడుము! ఈయంగదుఁడు మనలచే, నిత్యము నల్లారుముద్దుగా లాలించఁబడుచు, మహా

వీరుఁడై, దుఃఖశోకముల నెఱుంగక యుండెడివాఁడు. ఇంక నీపై నీతఁడు కోపిష్ఠుడైన సుగ్రీవునిచే, నెంతఁగా బీడింపఁ బడునో? గ్రహించితివా? ఆకుమారునితో నీతండ్రిని జూచి తివిగదా! ఈతని నిదర్శించుట కిదియే కడసారిసుమా! అనెను. ఓప్రాణనాథా! నీవు గతించుచున్నావు. ఈవచ్చిన కుమారుని జూచి దగ్గరకుఁదీసికొని శిరంబు మూర్కొనుము. మఱియు వీనిహితమును గోరి యేమైన నుపదేశించి వెళ్ళిపొమ్ము! నీవు మఱలరావుగదా!

శ్రీరాముఁడు నిన్ను వధించి ఘనకార్యమును జేయుటయేగాక, సుగ్రీవునకొనర్చిన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనినాఁడు. ఓసుగ్రీవా! నీకు బద్ధశత్రువైన నీయన్న చనిపోయెను. ఇంక నీవు నీభార్యను గిష్కింధారాజ్యమును సునాయాసముగా దీసికొని, పట్టాభిషిక్తుఁడవై సుఖించుము. ఓవానరరాజా! వాలీ! ఇంతఁగా విలపించుచున్న నన్నుగాని మిగిలిన భార్యలనుగాని, నీప్రియతముఁడైన కుమారునిగాని కన్నెత్తిచూడనైన మానితివేల? అని యీవిధముగాఁ దార పరిపరివిధముల నేడ్చుచుండఁగా, వాలియొక్క భార్యలందఱు నొకచోటఁ జేరి, యంగదుని బట్టికొని యేడువ నారంభించిరి. ఓమహాబాహూ! నాథా! మాతాపితృభక్తుఁడును సద్గుణగణగరిష్ఠుఁడు నగు నీపుత్త్రుడై మహావీరుఁడైన యంగదుని విడిచి, నేవెందుఁ బోయెదవు! ఓప్రాణప్రియా! మేమేమి తప్పుచేసితిమి? మమ్ములనందఱను విడిచి వెళ్ళుటకు నీ వేల సందేహించవు!

ఓనాథా! ఇదే నీపాదములకుఁ గడసారినమస్కారములు. మమ్ములనుక్షమించుము. అనియీవిధముగా వారందఱును తారనుముందుంచికొని గోలుగోలునఏడ్చిరి. వారుచివరకా వాలియొక్కప్రక్కనే పండుకొని, యామరణనిరశన దీక్షకుఁబూనికొనిరి.

## హనుమంతుఁడు తార నోదార్చుట
## తారసమాధానము

ఆంజనేయుఁ డాకాశమునుండి నేలకుఁబడిపోయిన తారవలెఁ బడియున్న తారనుజూచి, యామెనోదార్చుచు నిట్లనుచున్నాఁడు. అమ్మా! తారాదేవి! నీవుప్రాజ్ఞతఁ గలదానవు. ఇట్లేలవిలపించెదవు? ఎవరు చేసికొన్నకర్మను వారుపరలోకమునందైన, ననుభవించకతప్పదు. ఒకరికర్మ యింకొకరికెన్నఁడును సంక్రమించదు. అట్టియెడ మనమెవరినిగూర్చియును విచారించ నవసరములేదు. అట్లేనీవొనర్చిన శుభాశుభకర్మఫలములను నీవేయనుభవించుచున్నప్పు డింకొకఁడు విచారించనేల? నీవు దీనురాలవై కరుణింపఁదగిన దానవు. అందువలన వేరొకనినిగూర్చి నీవుదుఃఖింపఁదగదు. తాము సంపన్నులయి, శోకములేనివారుగా నున్నప్పుడే గదా, యితరులఁగూర్చి దుఃఖించి, కరుణజూపుట. మఱియు వినుము! ఈశరీరము బుద్బుదప్రాయము. తద్దేహముస్థిర

మన్న భావనతో నితరులశరీరము నశించినంతనే దుఃఖించుట వెఱ్ఱితనము. ఈదుఃఖించువారి శరీరములును క్షణభంగురములేగదా !

శ్లో॥ అంగదస్తు,కుమారోఽయం. ద్రష్టవ్యో జీవపుత్రయా।
ఆయత్యాంచ విధేయాని, సమర్థా న్యస్యచింతయ ! ॥
స. 21, శ్లో॥4.

తా॥ అమ్మా ! తారాదేవీ ! నీపుత్త్రుం డంగదకుమారుఁ నీవు డుండఁగా. సహగమనమొనర్చుట మహాదోషముసుమా ! కావున నీకుమారుని యోగక్షేమములను జూచికొనుచు, నాతనికి హితమును బోధించుచు, జీవించుము.

సంతానవతియైనస్త్రీ, అందును బుత్రవతియైనది సహగమనమును మానుటయేధర్మము.

ఓతారా! పంచభూతములకే స్థిరత్వములేదు. అట్టియెడ నీపంచభూతాత్మకమైన శరీరమునకు స్థిరత్వమెక్కడిది? కావునఁ జనిపోయిన వారినిగూర్చి యేడువక యాతనికుత్తమగతులను గలిగించు యథావిధి ప్రేతకర్మల నాచరించుట మంచిది. వాలి కోటానకోట్ల వానరులకధిపతియై, వారినందఱ నెక్కడికక్కడ విభజించి, సుఖజీవన మిచ్చిన పుణ్యాత్ముఁడు. అట్టి పుణ్యమును బరలోకమున ననుభవించుటకై పోవుచున్న నీభర్తనుగూర్చి విచారించకుము. ఉత్తమగుణగణములుగల

యోతారా! ఈ సమస్తవానర భల్లూక సముదాయమున కును, నింకనీవేదిక్కైనదానవు. మఱియు వాలిని జంపిన యీరామలక్ష్మణులను నీకుమారుఁ డంగదుఁడు తగినట్లుగా సేవించునట్లుచేయుము. దుఃఖమును విడువుము. నీసహాయ సంపత్తులతో నంగదుఁడు రాజ్యమేలఁగలఁడు. పుత్రవతివైనం దుల కాపుత్రునిచే నీభర్త, కగ్నిసంస్కారాది ప్రేతక్రియ లను గావింపఁజేసి, యాతని కుత్తమగతులు గలిగింపఁ జేయుము. ఇప్పుడిఁకఁజేయవలసిన దింతకంటె వేరొకటిలేదు. అనంతరమంగదునకుఁ బట్టాభిషేకము గావించవలెను. ఆతఁడు రాజ్యసింహాసనమునందుండి, భోగముల ననుభవించు చుండఁగా జూచి నీవు యానందించుము. అని యీ విధ ముగా నోదార్చుచున్న హనుమంతుఁ డాతారయేమని సమాధానము చెప్పునా? యని యూరకుండెను.

తరువాత నాతార హనుమంతుని మాటలనువిని, యిట్లనుచున్నది. ఓహనుమా? అంగదునివంటి సుగుణాత్ములు నూరుగురుపుత్రులున్నను, నీవాలికిసాటిరారు. ఈతనిని కౌఁగిలించికొనిన యానంద మెందును లేదు. ఈవాలికిఁ బ్రేత సంస్కారములుగాని, యంగదునకుఁ బట్టాభిషేకముగాని, జరిపించుటకు నే నసమర్థురాలను. వాలితరువాత యంతటి సుగ్రీవుఁడే యెల్లకార్యములను నిర్వహించుటకుఁ దగిన వాఁడు. ఓవాయుపుత్రా! అంగదునకు హితమగునట్లు నన్ను జేయుమంటివి. అదిసరిగాదు. కుమారుని హితముగోరి

యేమి చేయవలెనన్నను, దండ్రికేదగును. తల్లికిఁదగదు. అట్టి యీతనితండ్రి గతించఁగాఁ దండ్రియంతటివాఁడు పిన తండ్రియేగాని నేనుగానుసుమా! వానర రాజగు వాలినాశ్ర యించుటకంటె, నిహపరలోకములలో నాకు వేరొకసంతోష కరమైనదిలేదు. కావున నీవాలికిఁ బ్రక్కభాగమునాశ్రయించి సహగమనముచేయుదును. ఆగతియే నాకును శ్రేయస్కర మైనది.

## వాలి తెలివొంది చెప్పిన మాటలు

అంతవరకును బాణములతోఁ గన్నుమూసికొని మరణబాధ నందుచున్న వాలి, కుమారుడైన యంగదునొక్క మారు కన్నెత్తిచూచి, వెంటనే సుగ్రీవునిగూడఁజూచి, యిట్లనుచున్నాఁడు. మఱియు సహజమైనప్రేమతో సుస్పష్ట ముగాఁ దమ్మునిం బిలిచెను. నాయనా! నిన్నురాజ్యమునుండి దరిమివేసితినన్న పాపకార్యమును మరువుము! నాకిట్టిదురవస్థ ప్రాప్తించుటకే, నాకట్టిదుర్బుద్ధి గలిగినది. అప్పటి నా మోహగుణమే నన్నుబలాత్కరించి, యిట్టిపాపపుఁబనిని జేయించినది. ఓయీ! సుగ్రీవా! మనసోదరభావమువలన, గలుగుసౌఖ్య మొకేకాలమున ననుభవించరానిది, విధినిర్ణ యము. కావుననే యట్లుప్రవర్తింపఁజేసినది. దానికినీవుగాని నేనుగాని కర్తలముగాము. నేనిప్పుడే యమలోకమునకుఁ బోవుచున్నాను. నీవువెంటనే యీసమస్తవానర భల్లూక

రాజ్యమునకు బట్టాభిషిక్తుఁడవగుము. నాజీవితంబునేగాక ప్రభుత్వంబును, నాకున్నయాయనంతసంపద నంతను, నెంతటి వానికైన, నజేయుఁడన్నకీర్తిని, నీకప్పగించి, యీశ్రీరామ పాదారవిందముల దర్శించుచు నేనుబోవుచున్నాను. (సర్వ ధర్మాన్‌ పరిత్యజ్య మామేకంశరం వ్రజ!" యన్నగీతాచార్యుని వాక్కులకు నీవాలిమాటలు చక్కనియుదాహరణలు.) మహా వీరుఁడవైన సుగ్రీవా! నాయంత్యకాలమునఁ జెప్పిన యీ మాటలను దప్పక యనుసరించుము. ఈయంగదుఁడు మిక్కిలి సుకుమారుఁడు. కష్టములను సహించలేనివాఁడు. సుగుణరాశి. అట్టివానిని పుత్త్రనిర్విశేషునిగాఁ జూచుచుఁ గాపాడుము. నావలెనే నీవును నంగదుని కోరికలను దీర్చుచుండుము. మున్ముందు రాక్షససంహార కార్యక్రమములలో నీతఁడు నీకుఁగుడిభుజమై, నీకుముందుగా నడువఁగలఁడు. మఱియు మహాపరాక్రమమును జూపఁగలఁడు. ఈయువకుఁడైన యంగ దుఁడు యుద్ధవిశారదుఁడై, బలపరాక్రమములుగలిగి, నీకు గొప్పగా సాయపడఁగలఁడు. సుషేణుని కుమార్తెయైన యీతార, యెంతటిక్లిష్టసమస్యలనైన సూక్ష్మబుద్ధితోఁ బరిష్కరించఁగలదు.

మఱియు రాఁబోవువిపత్తులను ముందేగ్రహించి, తగినయుపాయములను జెప్పఁగలదు. తమ్ముఁడా! తార యొక్క యాలోచనాసరళి తిరుగులేనిదిసుమా! కావున నామెచెప్పినచొప్పున నడచుకొనుము. నీవుశ్రీరామకార్య

మును గడుంగడు శ్రద్ధాభక్తులతో నెరవేర్చుము. అట్లు గానిచో నీరాముఁడు నిన్నుఁగూడఁ గడతేర్పఁగలఁడు. సుగ్రీవా! ఈనామెడలోని కాంచనమాలను దీసికొని, నీవు ధరించుము. ఇదిగో! నేనుజీవించియుండఁగనే దీనినిగైకొని ధరించుము. నామరణానంతరము దీనిశక్తినశించి, కాంతిహీన మగును. సుగ్రీవుఁ డామాటలనువిని, శత్రుసంహారకమైనదని సంతోషించుటకు బదులుగా, దుఃఖసముద్రమున మునిగి రాహువుచేమింగఁబడిన చంద్రునివలెఁ గాంతిహీనుఁ డయ్యెను. అంత నావాలియొక్క యనుమతిని, సుగ్రీవుఁడు దేవేంద్రునిచే నొసంగఁబడిన యాబంగారుమాలను, బైకిదీసి తనమెడలోధరించెను. వాలియావిధముగా బంగారుమాలను సుగ్రీవునకిచ్చి తానుమరణమునందుచు నిట్లనుచున్నాఁడు.

శ్లో॥ దేశకాలౌ భజస్వాద్య క్షమమాణః ప్రియాప్రియే।
సుఖదుఃఖసమః కాలే,సుగ్రీవ వశగోభవ!॥

స. 22, శ్లో॥-20.

తా॥ ఓయీ! అంగదా! నీవుసుగ్రీవున కధీనుఁడవై దేశకాలముల నెఱింగి, ప్రవర్తించుము. సుఖదుఃఖములు సంభవించినప్పు డోర్మితోఁబ్రవర్తించుము. (శ్రీరామునిచే నాతండ్రినిజంపించినాఁ డన్న ద్వేషభావమును విడిచి, యాసుగ్రీవునే తండ్రిగా భావించుము.) అనివాలి తన కుమారునకు హితముపదేశించెను. మఱియునోకుమారా!

నేను నిన్నెల్లప్పుడు నెట్లులాలించి ప్రేమించెడివాడనో సుగ్రీవుఁడుగూడ నిన్నట్లే ప్రేమించఁగలఁడు. అనిచెప్పెను.

తండ్రితరువాతఁ బినతండ్రినే యెట్టిసమయమందును దండ్రిగాభావించి, భక్తినిజూపుటధర్మము.

శత్రుసంహారకుఁడవైన యోకుమారా! ఈసుగ్రీవుని శత్రువులతోఁగాని, యాశత్రువులకు మిత్రులైనవారితోఁ గాని, స్నేహముచేయకుము. సదాసుగ్రీవాజ్ఞలను మీరక, జాగరూకతతో వర్తించుము. నీవు జితేంద్రియుఁడవై యుండుము. తప్పుడుత్రోవలం బోవకుము!

శ్లో॥ నచాతిప్రణయః కార్యః, నకర్తవ్యోఽప్రణయశ్చ తే।
ఉభయంహి మహాన్ దోషః, తస్మాదంతరదృగ్భవ! ॥
స. 22, శ్లో॥-23.

తా॥ కుమారా! ఎవరితోడను మితిమీరిస్నేహము. చేయరాదు. అట్లని యెవరితోడను విరోధించుటయును బనికిరాదు. కానఁబై రెండింటికిని మధ్యస్థుఁడవై, యాత్మశుద్ధిఁగలిగి వర్తించుము.

"అతిసర్వత్రవర్జయేత్" అన్నసూక్తిని బాటించుట ధర్మముఁ (ఏవిషయమునందునుమితిమీరి ప్రవర్తించరాదు.)

పైవిధముగా నంగదునకుపదేశించినవాఁడై, వాలిరామ బాణముయొక్క బాధనుభరించలేక, కన్నులుపైకెఁదేల

వేయుచుఁ బడ్డుపైకిఁగనఁబడఁగాఁ, బ్రాణములనువిడిచెను. ఆసమయమం దటనున్న వానరయూథపతులు మొదలగు వారందఱును బెద్దగానేడ్చిరి. వాలియొక్క మరణముతోఁ గిష్కింధాపురమేగాక, యాప్రాంతారణ్యములును గొండలును గళాహీనములయినవి. అట్లేవానరులందఱును దేజో విహీనులైరి. ఆవాలి వేగముగాఁ బోవుచుండఁగా, నాతని దొడలనుండి వెలువడిన గాలికి నాయాప్రాలచెట్లన్నియు న బెకలించఁబడి, యెగిరివచ్చెడివి. వాలిమహాబాహుఁడును మహాబలపరాక్రముఁడును నగు, గోలభుండను గంధర్వునితోఁ బదునైదు సంవత్సరము లేకధాటిగాఁబోరి చివరకాతనిని, సంహరించినాఁడు. అట్లుఁగోలభునిజంపి మాకెల్లరకు నెల్ల వేళల నభయమునొసఁగిన యీవాలి నేఁడొక్కరామబాణముచేఁ జనిపోవుటయాశ్చర్యముగానున్నది. అని యీవానరులందఱును రామునిజూచి, భయభ్రాంతులగుచున్నారు. లతలచే నిండినమహావృక్షము పడిపోగా నాలతలన్నియును వాడి నేలఁబడినట్లు తారమొదలైన వాలిభార్యలందరును నేలం బొరలిపొరలి యేడ్చిరి.

## తారావిలాపము

తార తనభర్తయైనవాలిని గాఁగిలించికొని యాతని ముఖమును బదేంబదేచూచుచు ముద్దువెట్టుచు, స్వర్గమునకుఁ బోయినయాతనినిజూచి యిట్లనుచున్నది. ఓవీరాగ్రేసరా!

నామాటవినక యీకటికనేలపై, రాళ్ళలోఁబడియున్నావు. నీవునాతోఁబలుకక భూమినిగౌఁగిలించికొని యున్నావు. నాకంటె నీభూమియందే మిక్కిలిప్రేమయని తెలియుచున్నది. సాహసప్రియా! ఈసుగ్రీవుఁడెన్నోమారులు నీచేఁజావుదెబ్బలుతీని, పారిపోయినాఁడు. అట్టివాఁడు తానే యుద్ధమునకుఁబిలిచి, రామునిచేఁ జంపించినాడు. ఇదియాశ్చర్యమే. నీవుమహాబలశాలివి. వానరవీరసంఘంబులును మహావీరభల్లూకసముదాయమును నిన్నెదిరించలేక నీసేవచేయుచున్నది. ఇంతవరకును నిన్నాశ్రయించికొన్న వారందఱకు నిక గతియేమున్నది? మేమందఱమును నింతబిగ్గరగా విలపించుచున్నను, మాటలాడవేల! నీవింతకుఁ బూర్వమే యీభూమిపై శత్రువులను, వధించి యెట్లుగావాఁనీభూమిపైఁబరుండఁజేసితివో, నేఁడు నీవును నాభూమిపైనేపరుండి వీరస్వర్గమునందినావు. నిర్మలమై, పరాక్రమశాలియైన వంశమునజన్మించి, యుద్ధప్రియుఁడవైన యోనాథా! నన్ను ననాథనుజేసి, నీవెందుఁబోయినావు?

శ్లో॥ శూరాయ నప్రదాతవ్యా కన్యాఖలు విపశ్చితా ।
శూరభార్యాం హతాంపశ్య సద్యోమాంవిధవాం కృతాం ॥

స. 23, శ్లో॥-8.

తా॥ శూరుఁడై యుద్ధప్రియుఁడైనవానికిఁ దెలివైన యేతండ్రియును గన్యనొసంగరాదు. కావుననే వీరపత్ని నని పించికొన్న నాకీవైధవ్యదురవస్థ ప్రాప్తించినది.

యుక్తాయుక్త వివేకహీనుఁడై, శూరుఁడైన వానికిఁ దెలివైనవాఁ డెవ్వఁడును గన్యనీయరాదు.

ఓవీరశిఖామణీ! నేఁడు నాగర్వము నశించినది. నాకుత్తమలోకహేతువైన పతిశుశ్రూష మూలఁబడినది. మఱియు నగాధమైన దుఃఖసాగరమున మునిఁగి, తేలలేకుంటిని. ప్రియుఁడవైన నీవుచనిపోవుటచే, నాహృదయము వేయి ముక్కలు గావలసియున్నది. కాని యట్లుగాకపోవుటచే, నిది రాళ్ళయందలి సారభూతమైనదానితోఁ దయారై యుండ వలయును. పెనిమిటిలేని దానికెంతటి సంపదలున్నను బుత్త్రులున్నను 'విధవ' యనియే యందురుగదా! నీవీరక్తపుమడుగులోఁ బడియుండుటచే యెఱ్ఱనైన దుప్పటినిపఱిచిన పరుపుపైఁ బరుండినట్లున్నది. ఈనెత్తురుపై ధూళిపడి క్రిమిసంకులమైన నీశరీరమును నేనెట్లుకౌఁగిలించికొనఁగలను? భయంకరమైన విరోధముతోసీతమ్ముఁడు నేఁటికిఁ గృతకృత్యుఁడైనాఁడు. ఒకేబాణముతో నిన్ను శ్రీరాముఁడు సంహరించినాఁడు. నీగుండెలలో గాఢముగాదిగఁబడిన రామబాణ మడ్డగించఁగా, నిన్ను గౌఁగిలించికొనలేకున్నాను. అనియింకను దారవిలపించుచుండఁగా, నీలుఁడు, మహాపర్వతమునందుఁ బుట్టలోనున్నసర్పమును బైకినూడఁదీసినట్లు, వాలిపైనున్న

రామబాణమును బెకలించివైచెను. ఆబాణము సూర్యుఁడస్తమించుచుండఁగా, నాపర్వతముపైఁ బ్రకాశించు, కిరణములవలెఁ దేజోవంతమై కన్పట్టినది. ఎఱ్ఱనిగైరికాదిధాతువులుగల పర్వమునుండి, యెఱ్ఱనినీరు ప్రవహించినట్లు నీలుఁడు పెరికినబాణమువలన, నాగాయమునుండి యెఱ్ఱనిరక్తము ప్రవహించినది. మఱియు వాలిశరీరమునందలి ధూళిని, తారతనకన్నీఁటిచేఁగడగివైచినది. ఆసమయమున నంగదునిబిలిచి, తారయిట్లనుచున్నది. కుమారా! నీతండ్రియొక్క దురవస్థను జూడుము. ఆతనిపాపకర్మఫలముగా బుట్టినవైర మింతటితో శాంతించినది. నాయనా! యమలోకమునకుఁ బోవుచుఁ బడియున్ననీతండ్రియొక్క పాదములకు నమస్కరించుము.

శ్లో॥ ఏవముక్త స్సముత్థాయ, జగ్రాహ చరణౌపితుః।
భుజాభ్యాం పీనవృత్తాభ్యా, మఙ్గదోఽహ మితిబ్రువన్॥
స. 23, శ్లో॥-24.

తా॥ అంగదుఁడు తల్లిమాటననుసరించి, పైకిలేచివచ్చి, బలిష్ఠమై కండలుదిరిగినబాహువులను జూచి, అంగదుఁడనైన నేను నమస్కరించుచున్నాను” అనిచెప్పుచు, వాలిపాదములకు నమస్కరించెను.

మాతాపితరులు మొదలైనపెద్దలకు నమస్కరించునప్పుడు, చేతులురెండును జోడించి, తననామధేయమును జెప్పుచుఁబాదములఁదాకుట ధర్మము. ఇదియేనిజమైనభక్తి

పూర్వకనమస్కారము. (నిలువుగానిలిచి రెండు చేతులతోఁ గాని, యొకేచేతితోఁ గాని నమస్కరించుట ధర్మముగాదు.)

వెండియును దారయిట్లనుచున్నది. నాథా! నీకు నమస్కరించుచున్న కుమారుని "దీర్ఘాయుష్మాన్ భవ!" అని దీవించవేల? సింహముచేఁ జంపఁబడిన యీ బోతును గోవులువిడువలేక సేవించినట్లు నేనును నీకుమారుఁడును నిన్ను విడువలేకున్నాము. నీవుయుద్ధమనెడి మహాయజ్ఞమును జేసి, రామబాణమను నదీజలంబులలో, నవబృధస్నానమాచరించితివిగదా! అట్టికార్యమునునన్నువీడి, యెట్లుగావించితివి? ఆనాఁడు దేవేంద్రునిచే నీయఁబడిన, నీకంఠమునఁ బ్రకాశించు బంగారుమాల నింకఁజూడలేనుగదా! మేరుపర్వతముచుట్టు నావరించికొని, సూర్యకాంతి విడువనట్లు, రాజ్యలక్ష్మిశోభ నిన్నిప్పటికిని విడువలేదు. ఓనాథా! నామాటవినక యుద్ధమునకేగి, నీవుచనిపోవుటచే, నామాంగళ్యశోభ నన్నువిడిచి వెళ్ళిపోయినదిసుమా! అని తార పరిపరి విధములుగా విలపించినది.

## సుగ్రీవునిసంతాపము

తారవిలపించుటయట్లుండగా, సుగ్రీవుఁడు కంటికిని మంటికి నేకధారగా నేడ్చుచు, దుఃఖసముద్రమునమునిఁగిన వాఁడై. తానే తనయన్నను జంపించినందులకు మిక్కిలిపరి

తపించెను. అట్టి యాసహృదయుఁడైన సుగ్రీవుఁడు కన్నీఁటితో నిండినవాఁడై, మెల్లగాఁ దనసహచరులతోఁగలిసి, శ్రీరామ సన్నిధి కేగి, దివ్యమంగళవిగ్రహుఁడైన రామునిజూచి, యిట్లనియెను. శ్రీరామచంద్రా! నీప్రతిజ్ఞను సంపూర్ణముగా నెరవేర్చితివి. నాకుమాత్రము భోగములందే గాక తుదకుఁ బ్రాణములయందును విరక్తి గలుగుచున్నది. ఈతారయును బురప్రజలును, వాలిమరణమునకు మహద్దుఃఖ మనుభవించు చుండఁగా, నీయంగదుఁడు ప్రాణసంకటమునఁబడియుండఁగా, నోరామచంద్రా! ఈరాజ్యము నాకేమాత్రమును సంతోషమునిచ్చుటలేదు. ఇంతకును, బలము, క్రోధము, పట్టుదల మొదలైనవానిచే వాలివధనుగోరితిని. కాని యీబంధుమిత్ర పరివారాదుల దుఃఖమునుజూడఁగా నాసోదరుని మరణమునకు నాకత్యంతవిషాదమే కలుగుచున్నది. ఓరాఘువా! వాలినిజంపించి, తీవ్రమైన విషాదముతోఁ దపించిపోవుచున్నాను. ఇంక నేనీఋశ్యమూకపర్వతముననే పూర్వము వలెనుండుటయే మేలుగాఁదోఁచుచున్నది. మహాపరాక్రమ సంపన్నుఁడైన నాయన్ననుజంపించి, స్వర్గసౌఖ్యము లభించినను నాకు శాంతిలేదు. ఓరామా! మహానుభావుఁడై, బుద్ధిమంతుఁడైనవాలి "నిన్ను నేనుజంపనురా! పొమ్ము" అని మొదటిసారి నన్ను విడిచినాఁడు. అంతటిమాట మహాత్ముఁడైనవాలికే దగినది. అట్టిసద్భావుని జంపించుటచే నాదుర్మార్గమునకుఁ దగియున్నది. సుగుణాత్ముఁడైన

యన్ననుజంపించుట కెంతటిక్రూరుఁడైన యోచించునా? ఇఁక నావంటి క్రూరుఁడెందైననుండునా? శ్రీరామచంద్రా! సుగుణాత్ములైన కుమారులను గనవచ్చును. కానియంగదుని వంటివానిని గనుట దుర్లభము. అట్టికుమారునకై, తార జీవించియున్నది. అతఁడే లేనిచోఁ బరమదుఃఖముతో నామె దీనురాలై యీపాటికి వాలితోఁగలిసి పోయెడిదని నానమ్మకము. శాశ్వతనిందాకరమైన పాపమును జేసి, పెనుండిక్రిందఁ బడు నదీప్రవాహమువలె, విరామములేని దుఃఖములపాలై యుంటిని. అనిసుగ్రీవుఁడు తనయన్నయైన వాలియొక్క మరణమునకు మిక్కిలిదుఃఖించెను.

మఱియు మదించినయేనుఁగు నదియొక్కయొడ్డును బొడిచినట్లుగా నన్నగారినివధించుట యనుపాపము నన్ను బ్రతిక్షణమును వేధించుచున్నది. ఓపురుషోత్తమా! బంగారము నగ్నియందుఁబడవేయఁగా, నగ్నిదానినిదహించలేక యాబంగారమునంటియున్న కల్మషమును దహించవేయును. అట్లేనాధర్మగుణమునుగూడ, నాక్రూరమనస్సునాశ్రయించుటచే, నీదుఃఖాగ్నిలో మొత్తముగా, దహించిపోవుచున్నది. మించినదాని కిప్పుడేమిచేయుదును? ఓరఘువంశోద్భవా! ఈయంగదుఁడు తండ్రిమరణమునకుఁ బరితప్తుఁడగుటకు నేనే గదా కారణము అనితెలిసి, మహావీరులగు నీవానరసమూహములు భీతభీతచిత్తులై, జీవచ్ఛవంబులవలె నున్నట్లుగన్పడుచున్నది. రామచంద్రా! ఇట్టిసద్గుణగరిష్ఠుఁడైన కుమారుని

గాని, యంతటి మహాపరాక్రమశాలియైన యన్ననుగాని, యేదేశమేగినను బొందలేనుగదా? వీరాగ్రేసరా! దాశరథీ! ఈయంగదుఁడు దుఃఖమునడఁచికొని, జీవించియున్నచో సీతనిసంరక్షణార్థమై తారయును జీవించియుండఁగలదు. ఓరామచంద్రా! నేనుజేసిన పాపమునకుఁ జనిపోయిన యీ వాలితోడను, నాతనిమూలముగాఁ జనిపోయిన యంగద తారలతోడను, నేనుగూడ నగ్నిప్రవేశమొనరించి, నాకుఁ గలిగిన యప్రతిష్ఠను బాపుకొందును. ఇఁకనీవానరవీరులందఱును, నీయాజ్ఞానువర్తులై, నీభార్యయైన సీతనువెదకి, తెలిసికొనివచ్చి, నీకార్యమునునెరవేర్పఁగలరు. ఓరామా! వంశనాశకుఁడన్న మహాపాపమునకుఁ బ్రాయశ్చిత్తముగా నేనగ్నిప్రవేశమొనరించి, మరణించుటయేయుత్తమము.

## శ్రీరామసన్నిధిని - తారావిలాపము

శ్రీరాముఁడు సుగ్రీవునిదుఃఖమును గ్రహించి, యేమిచెప్పుటకును, నోరాడక యట్లేనిలిచిపోయెను. కొంతసేపటికి నిగ్రహశక్తిగల భూదేవివలెనున్నతార రోదించుచుండుటనుగాంచెను. ఆసమయమున శ్రీరాముఁడు తారవద్దకువచ్చుటనుజూచి, బుద్ధిమంతులైన వానరవీరులు, వాలిని కౌఁగిలించికొనియున్న తారను బలాత్కారముగా, బయటకులేవదీసిరి. ఆమెయును ఎదురుగానున్న సూర్యతేజస్కుఁడై ధనుర్బాణములనుధరించిన నాతనిని శ్రీరాముఁడే

యనిగ్రహించినది. లేడికన్నులవంటి కన్నులుగల, యాతారా దేవి, సర్వరాజలక్షణలక్షితుండును, విశాలములై, యంద మైనకన్నులుగలవాఁడు నగు శ్రీరామునింతకుఁ బూర్వము చూడకపోయిన, నితఁడే రాముఁడైయుండునని, గ్రహించి నది. ఇంద్రసమానుఁడైన రామునిసముఖమునఁ దారమిక్కి లిగానేడ్చినది. మఱియు నామె మితిమీరిన దుఃఖముచే, నాశ్రీరామునితో నిట్లనుచున్నది. ఓశ్రీరామచంద్రా! నీవప్రమేయుండవు. నీసన్నిధి లభించటము యెవరికిని శక్యముగాదు. నీవుజితేంద్రియుఁడవైన ధర్మస్వరూపుఁడవు. నీవుసర్వసమర్థుఁడవని యంతులేనివిఖ్యాతిని గన్నవాఁడవు. ఎఱ్ఱనికనుగొలకులుగలిగి, భూదేవివంటియోర్మిగలవాఁడవు. నీవుధనుర్బాణములధరించి యజేయుఁడవైన మహావీరుఁడవు. దృఢమైనయవయవ సౌష్టవము గలవాఁడవు, యథార్థముగా నీకుజననమరణములు లేవు. నీవేపరమాత్మవు. అయినను ధర్మ సంస్థాపనార్థమై యిట్టిప్రాకృతశరీరధారివై యుంటివి. శ్రీరామచంద్రా! నీవేబాణముతో వాలికిమోక్షమునిచ్చి తివో, యాబాణమునేనాపైఁగూడఁ బ్రయోగించి, నన్ను దరింపఁజేయుము. అట్లైన నావాలితోఁగలిసి యుందును. రామా! నీవుమహాయోగులహృదయములనే రమింపఁజేయు వాఁడవై, సార్థకనాముఁడ వగుచున్నావు. నేనులేనిచోఁ బర లోకమునఁగూడ నావాలియానందించఁడు. కావున నీవునన్ను నాతనికడకంపి, యాతనిహృదయమును రమింపఁజేయుము,

ఒకవేళ వాలిస్వర్గమునకేవెళ్ళినచో, నచట సర్వాభరణ
భూషితలగు నప్సరసలుసమీపించినను, వారినిజూడక, నాకొ
ఱకే యెదురుచూచుచుండును. ఓమహాపరాక్రమశాలీ! నీవీ
ఋశ్యమూకమునఁగల రమణీయసరోవరాదులను జూచు
చున్నను, సీతాదేవిసన్నిధిని లేకపోవుటచే, నెట్లుపరితపిం
తువో యట్లేవాలియును, నేనుదగ్గరలేకపోవుటచే స్వర్గమున
నెన్నియున్నను బరితాపమునే పొందుచుండును. యువకుఁ
డైనవానికి భార్యావిరహ మెంతటిదుఃఖకరమైనదియో, నీకు
బాగుగాఁ దెలిసినదేగదా! కావున నన్ను వేగముగావధించి,
యీవాలియున్నచోటికిఁ బంపుము. ఓరాజకుమారా!
స్త్రీహత్య మహాపాతకమని తలఁచెదవేమో, యీతార
వాలియొక్కయాత్మయేసుమా! అట్టియెడ స్త్రీస్వరూప
ముతో నున్న పురుషుని సంహరించినట్లేయగును. మఱియు
నొకయార్తురాలికోరిక ననుసరించుటచే దానివలనఁగలుగు
మహాపాతకము నిన్నేమాత్రమునంటదు. లోకమున భార్యా
భర్తలను గలుపుటకంటెఁ బుణ్యమింకొకటిలేదని పెద్దలుచెప్పు
దురు. కావున నన్నునాభర్తతోఁగలిపి, పుణ్యముగట్టు
కొనుము. ఆవిధముగా మాదంపతుల కానందమును గలిగిం
చుము. నన్నునాభర్తతోఁ గలుపుటవలన, నిప్పుడు నీకుఁ
గలిగిన వీరహత్యాదోషముగూడ నశించును. ఇంతకంటె
నీదోషమునకుఁ బ్రాయశ్చిత్తమింకొకటిలేదు. ఓశ్రీరామ

భద్రా! ఈదీనురాలి మొరనాలకించి, వెంటనేజంపుము. ఓమానవనాథా! వాలియందలి విరహముచే నేనుగొంత కాలమేబ్రతికి చనిపోవుదును. ఈచావుతప్పదు. అట్టియెడ నాకోరికను మన్నించి, నన్నిప్పుడేచంపి యాపుణ్యముం గట్టుకొనుము. అనియీవిధముగాఁ బరిపరివిధముల విలపించుచున్న తారనుజూచి, శ్రీరాముఁడామె నోదార్చుచు నిట్లనియెను.

## శ్రీరాముఁడు - తార - నోదార్చుట

ఓతారా! నీవింతవరకును వీరపత్నివని పేరునొందితివి. ఇప్పుడంతులకు విరుద్ధముగాపిరికివారలు పలికెడిమాటలు చెప్పుటసరిగాదు. బ్రహ్మదేవునిసృష్టిలోఁ బుట్టినప్రతిజీవికిని, సుఖదుఃఖముల ననుభవించవలసిన కాలములునిర్ణయించఁబడుటయు నట్లేజరుగుచుండుటయును, బండితులేగాక పామరులును నంగీకరించుదురు. బ్రహ్మయొక్కవ్రాతను ముల్లోకముల వారు, ననుభవించవలసినదే. అదియెవరికిని దాటశక్యముగానిది. కావున నీవిప్పటిదుఃఖమునువిడిచి, యెప్పటివలెనే సంతోషముతోనుండుము. నీకుమారుఁ డీయంగదుఁడు యువరాజుకాఁగలఁడు. ఆవాలియీవిధముగా నీభుడియలలో మరణించవలెనని బ్రహ్మవ్రాసినాఁడు. నీవంటివీరపత్నులు, వీరమరణము నందినభర్తనుగూర్చి, విచారించరుసుమా! అని శ్రీరాముఁడనఁగావిని, సర్వాభరణభూషితయై సౌన్దర్యవతియైన యాతార, యంతవరకును గాఢముగావిలపించుచున్న

డైనను, మహానుభావుఁడును, శత్రుసంహారకుండును నగు శ్రీరామునిచే నోదార్చఁబడినదై తనకుమారునకు యావ రాజ్యమునొసంగి, యింకనుగలశత్రువులను సంహరించఁ గలఁడని శాంతించెను.

## శ్రీరాముఁడు - వాలికి - నుత్తరక్రియలకై ప్రోత్సహించుట

లక్ష్మణునితోఁగూడిన శ్రీరాముఁడు తారాసుగ్రీవాంగదులతో సమానమైన విచారముగలవాఁడైనను దాని నడఁచికొని, మఱల నిట్లనుచున్నాఁడు. ఓతారా! మీరందఱు నెంతగానేడ్చినను వాలికి నాత్మశాంతిగలుగదు. కావున నాతనికిఁ బరలోకసుఖంబులు గలుగవలెనన్న శ్రాద్ధకర్మల నాచరించవలెను. లోకసామాన్యముగా మీరందఱు నింత వరకును గన్నీళ్ళనువిడిచిరి. విధివిలాసము నతిక్రమింప నెంతటివానికైనను శక్తియుండునా?

శ్లో॥ నియతిః కారణంలోకే నియతిః కర్మసాధనం ।
నియతి స్సర్వభూతానాం నియోగేష్విహ కారణం ॥
స. 25, శ్లో॥-4.

తా॥ సమస్తలోకములును నిలుచుటకుఁ గాలమే కారణము. సర్వకార్యములను సాధించునది కాలమే. సమస్త జీవులలో నెవఁడేకార్యము నెట్లుజరిపించవలెనో, కాలమే

నియమించును. అట్టికాలము నతిక్రమించఁగలశక్తి లోకమం దెవ్వనికిని లేదు.

కాలవశమునఁగలిగిన సుఖములకు నుప్పొంగుటయు, దుఃఖమునకుఁ గ్రుంగిపోవుటయునుమాని, యొకేవిధముగా నుండుట బుద్ధిమంతుల ధర్మము.

శ్లో॥ నకర్తా కస్యచి త్కశ్చిన్ని యోగే చాపి నేశ్వరః ।
స్వభావే వర్తతేలోకః, తస్యకాలః పరాయణమ్ ॥
స. 25. శ్లో॥5.

తా॥ చేయునదియును జేయించునదియును గాలమే యగుచున్నది. జీవుఁడజ్ఞానముచే, నేనుజేయుచున్నాననియు, నెదుటివాఁడెవఁడో చేయించుచున్నాఁడనియు భావించును. లోకమంతయును గాలానుసారముగాఁ బ్రవర్తించుచున్నది. కావునఁగాలమే సర్వము నగుచున్నదని గ్రహించవలెను.

లోకసహజమైన కాలమే యన్నిఁటికిని గారణమని జ్ఞానియైనవాఁడు భావించుటధర్మము.

శ్లో॥ నకాలః కాలమత్యేతి, నకాలఃపరిహీయతే ।
స్వభావంచ సమాసాద్య, నకశ్చిదనువర్తతే ॥
స. 25, శ్లో॥6.

తా॥ కాలము దేనికినిలోఁబడక, స్వతంత్రమై యుండును. కాలమే పుట్టుటమొదలు గిట్టుటవరకునుగల యారువిధములైన వికారములకును గారణము. కాలమునకు

మాత్రమట్టివికారములులేవు, కావున సర్వమును గాలాధీన మగును.

కాలమేభగవంతునిగాభావించి, దానినెప్పటికప్పుడు సద్వినియోగముగావించికొనుట సత్పురుషులకుధర్మము.

శ్లో॥ నకాలస్యాస్తిబంధుత్వం నహేతు ర్నపరాక్రమః।
నమిత్రజ్ఞాతిసంబంధః కారణం నాత్మనోవశః॥
స. 25, శ్లో॥-7.

తా॥ కాలమున (పరమాత్మ) కెవ్వరితోడను బంధుత్వమిత్రత్వములులేవు. ఉపకారాదులచే, దయాదాక్షిణ్యములునులేవు. పరాక్రమవంతుఁడన్న గౌరవ మసలే లేదు. కాలమెవ్వరికిని నధీనమైయుండదు. ఈసమస్తమునకును నదియేకారణమైయున్నది. కాని తనకుఁగారణమేదియును లేదు. ఆయాజీవుల కర్మలననుసరించి, నిష్పక్షపాతముగా, న్యాయాఫలములనిచ్చుచుండును.

మనముచేసికొన్న కర్మానుసారముగా, నాపరమాత్మ (కాలము) సుఖదుఃఖాదుల నొసంగుచుండును. కావున మానవుఁడు సత్కర్మలనే యాచరించుచు, నేమాత్రము కష్టముగలిగినను ఒకదుష్కర్మనశించినదిగదా! యని భావించుట ధర్మము.

శ్లో॥ కింతుకాలపరీణామో, ద్రష్టవ్య స్సాధుపశ్యతా।
ధర్మశ్చార్థశ్చ కామశ్చ, కాలక్రమ సమాహితాః॥
స. 25, శ్లో॥-8.

తా॥ ఓతారా! ఇంతకు నేమనియందువా! జ్ఞానియైన వాఁడు తనకేమిగలిగినను, దాను జేసికొనిన కర్మానుసారముగా భగవంతుఁడొసంగిన (కాలమొసఁగిన) ఫలమని తెలిసి, నిశ్చింతఁగా నుండును. అట్లే ధర్మార్థకామములైన పురుషార్థత్రయమును గర్మానుసారముగా, నాయాకాలములలో సమకూరుచుండుట సహజము.

సర్వమును దెలిసినపండితుఁడైనను, ధర్మము నాచరించలేఁడు. అట్లే కోటీశ్వరుఁడైనను, సత్కర్మలను జేయలేఁడు. తా ననుభవించను లేఁడు. పూర్వజన్మకర్మ సంస్కారానురూపముగాఁ బండితుఁడుగాకపోయినను, ధనములేకపోయినను, బురుషార్థత్రయమును దైవనిర్ణయానుసారముగా సాధించఁగలఁడు. కావున నీజన్మలో సత్కర్మల నాచరించుచు, దుష్కర్మల జోలికిఁబోక తెలివిగలిగి ప్రవర్తించుటధర్మము.

ఓతారాదేవీ! ఇంకనువినుము! ఈవాలితాను జేసిన దుష్కర్మలకుఫలముగా నాచేవధింపఁబడినాఁడు. కావున నతనిపాపములు దొలఁగిపోయినవి. అతనికి స్వర్గమేలభించినది. ఇంక నాతఁ డచ్చటసుఖములనే యనుభవించును. మహాత్ముఁడగువాలి తన విహితధర్మానుష్ఠానమువలన, బాణంబులకు లక్ష్యముచేయక, యుద్ధముచేయుటవలన బూర్వము తానుజేసిన సుకృతఫలమైన స్వర్గమును బొందినాఁడు. వానరరాజైన వాలి కిప్పుడుగలిగినగతి సర్వోత్తమమైనది. కావున నాతనివిషయమై విచారించఁబనిలేదు. మీారలందఱు

నవ్వాలిశరీరమునకుఁ జేయఁదగిన యగ్నిసంస్కారాది శ్రాద్ధకర్మలనన్నిఁటిని బూర్తిఁగావింపుఁడు. అని శ్రీరాముఁడు తారనోదార్చఁగా, లక్ష్మణుఁడుసుగ్రీవునిజూచి, యీవిధముగా నోదార్చుచున్నాఁడు.

ఓయీ ! సుగ్రీవా ! దుఃఖమునువిడువుము! నీయన్నకు యథావిధిగాఁ ప్రేతకార్యములఁగావించుము. దహనక్రియకుఁ గావలసిన యెండుకట్టెలు మొదలగువానిని సిద్ధముచేయించుము. తారయు నంగదుఁడును వెంటఁరాగాఁ ప్రేతకర్మను బూఁర్తిగావించుము. సుగ్రీవా ! ముందుగా నంగదుని నీవోదార్చుము. ఈపైనిజరిపించవలసిన కార్యముల నన్నిఁటిని నీవేజరిపించుము. ఈక్షణమునుండియు నిదియంతయును నీయధీనముసుమా ! మూర్ఖునివలె నదేపనిగాఁజింతించకుము. వివిధములైన వస్త్రమాల్యాదులను నేయి, మంచిగంధపుఁగట్టెలు మొదలైనవాని, నిప్పుడేరప్పించుము. బలిష్ఠుఁడైన యీవాలికిందగిన స్వర్గవాహనమును సిద్ధముచేయించి, దానిని మోయుటకుందగిన బలశాలురను నియమించుము. అని సుగ్రీవునకుంజెప్పి, లక్ష్మణుఁడు శ్రీరామసన్నిధిని నిలిచెను.

## వాలికి నగ్నిసంస్కారము గావించుట

లక్ష్మణుని మాటలను దారుఁడనువాఁడువిని, యావెంటనేవెళ్ళి స్వర్గవాహనమును దీసికొనివచ్చెను. అయ్యది రక్తచందనముతోడను బూలమాలలతోడను, ననేక

సుగంధద్రవ్యములతోడను, సుందరమై సువాసనలుగలదిగాఁ దయారు చేయఁబడినది. అద్దానినివిశ్వకర్మ తనశిల్పనైపుణ్యముతో రకరకాలపక్షులను, గిటికీలను సమర్చితయారు చేసెను. ఆసమయమున నాశిబికనుజూచుచు, శ్రీరాముఁడు లక్ష్మణునితో నింకఁ బ్రేతకర్మ త్వరగాజరిపించఁబడుఁగాక! యనెను. అంతసుగ్రీవుఁ డంగదునితోఁగూడి, వాలిశరీరమును బైకినెత్తి, యాశిబికపైనుంచెను. తరువాత నూతన వస్త్రమాల్యాదులచే వాలియొక్క కళేబరము నలంకరించెను. ఆసమయమున సుగ్రీవుఁడిట్లనియెను. "ఓవానరులారా! మాయన్న శిబికపోవుచుండఁగా, నానావిధములైనమణులను వెదజల్లుచు, మీరుముందు నడువవలెను. ఆవీరుని యుత్తరక్రియలన్నియును నతిఘనముగా జరుగవలెను. ఇదినాయాజ్ఞ" అనఁగా, నావానరులందఱుంగలిసి మహారాజవైభవోపేతముగా, సదాచారసంపత్తితో నవ్వాలికి నగ్నిసంస్కారమును గావించిరి. ఆసమయమున ముఖ్యబంధువులందఱు నంగదుని జుట్టువారుకొని యుండిరి. "ఓవీరాగ్రేసరా! వాలీ! మమ్ము విడిచిపోవుచుంటివా!" యనితారమొదలగువారు బిగ్గరగా నేడ్చిరి. ఆతనికి నొకపర్వతమునుండి ప్రవహించునదియొక్క యిసుకతిన్నెపై నగ్నిసంస్కారముగావించిరి. "అయ్యో! సర్వవానరాధినాథా! నాయందత్యంతప్రేమాదరములుగలవాఁడా! సర్వులచేఁగొనియాడఁబడునట్టి మహావీరాగ్రేసరా! నన్నుగన్నెత్తిచూడకుఁడఁ బోవుచుంటివా! ఈయేడ్చుచున్న నీవారినందఱను జూడకుండనెందుఁబోతివి? ఆయమ్ముఁడే

శ్రీరామరూపమున నొక్క బాణముతో నిన్ను జంపివేయఁగా నీభార్యలందఱును విధవలై యేడ్చుచున్నారుసుమా! నీభార్యలలో నొక్కతెయును నెట్టిసమయములందును బయటకురానివారైనను నిప్పుడునీతో నీశ్మశానమునకు నడిచివచ్చి యేడ్చుచుండఁగా నొక్కమారువీరినోదార్చవా? ఇప్పుడు రాజైన నీతమ్ముఁడును, మంత్రులు మొదలైన ముఖ్యపరివారమును గోలుగోలున నేడ్చుచుండఁగా, వారినోదార్చవేల? ఇప్పుడిచ్చటిపరివారమునందఱను బొమ్మని యాజ్ఞాపించుము! తరువాత నీవనమునన్ప్రియురాండ్రతో స్వేచ్ఛగావిహరించవచ్చును." అనియీవిధముగా నేడ్చుచున్న తార మొదలైన స్త్రీలనందఱను బలాత్కారముగా, వారివారిస్థానములకుఁ గొనిపోయిరి. అంగదుఁడు సుగ్రీవునితోఁగూడి వాలికిచేయవలసిన యుత్తరక్రియల నన్నింటినిబూర్తిచేసెను. తరువాత సమస్తవానరులును జనిపోయినవాలికి జలతర్పణములఁ గావించుటకై, నిర్మలమైననీరుగల నదీతీర్థమునకేగిరి. దుఃఖితుఁడైన యంగదునిబట్టికొని సుగ్రీవాదులునదిలో స్నానములుచేసిరి.

శ్రీరాముఁడును నాసమయమున సుగ్రీవునితో సమానమైన దుఃఖముగలవాఁడై, (సుఖదుఃఖములనుసమానముగాఁబంచికొనుటయే యుత్తమమిత్ర లక్షణముగదా! సుగ్రీవాంగదులచే వాలికిశ్రాద్ధకార్యమును జేయించెను.

(ఇచ్చట శ్రాద్ధకర్మకు కుమారుఁడే యర్హుడు. అయినను దుఃఖాతిశయముచే నంగదుఁడు సరిగాఁ జేయలేకపోవుటగాని, చనిపోవుటగాని జరుగనచ్చు నన్న యనుమానముతో సుగ్రీవునిచేఁగూడఁ వాలికి నుత్తరక్రియలఁగావింపఁజేసెనని మన మూహించవచ్చును. లేదా, యంగదునకు భార్యలున్నట్లు చెప్పలేదు. భార్యారహితుఁడైన కుమారుఁడు శ్రాద్ధకర్మఁ జేయుట శ్రేష్ఠముగాదని యైననుసుగ్రీవుని చేఁగూడ శ్రాద్ధకర్మఁగావింపఁజేసెనని చెప్పవచ్చును.) ఆవిధముగా శ్రీరామాజ్ఞనుబాటించి, సుగ్రీవుఁ డన్నగారికి నుత్తర క్రియల నెరవేర్చి, మఱల శ్రీరామసన్నిధికిఁ జేరికొనెను,

## సుగ్రీవ - పట్టాభిషేకము

వాలికిఁజేయవలసిన యుత్తరక్రియలనుబూర్తిఁగావించి కొని శ్రీరామసన్నిధిని దుఃఖసముద్రమున మునిగియున్న సుగ్రీవునివద్దకుఁ గిష్కింధారాజ్యమంత్రులందఱునువచ్చిరి. అందఱును శ్రీరామసన్నిధిని జేతులుజోడించి వినయముతో నిలిచిరి. ఆసమయమున మేరుపర్వతముపై లేతసూర్యునివలెఁ బ్రకాశించుముఖముగల హనుమంతుఁ డిట్లనుచున్నాఁడు. ఓ శ్రీరామప్రభూ! నీయొక్క పరిపూర్ణానుగ్రహముచే, నీసుగ్రీవుఁడు తనతాతలనాటి కిష్కింధారాజ్యమును బొందఁ గలిగెను. ఇంకనీతఁడు నీయనుజ్ఞయైనచోఁ బురమును బ్రవేశించి, మంత్రులతోఁగూడి చేయవలసినకార్యక్రమములనెల్ల

నెరవేర్చఁగలఁడు. మఱియు వివిధసురభిళద్రవ్యములతోడను, నానావిధజలంబులతోడను, బట్టాభిషిక్తుఁడై, దివ్యవస్త్రాభరణాదులచే నలంకరింపఁబడి, నీదర్శనమునకురాఁగలఁడు. వివిధ పుష్పమాలికలను రత్నములను దెచ్చి, నీకుసమర్పించికొనఁగలఁడు.

రామచంద్రా ! నీవీరమణీయ కిష్కింధాపురమును బ్రవేశించి, సుగ్రీవపట్టాభిషేకమును జేయించి, యీసర్వ వానరులకు నానందమునుగలిగించుము, అనఁగా శ్రీరాముఁడు బుద్ధిమంతుఁడును వాగ్మాధుర్యముచే నెంతటివారినైన నలరించువాఁడు, నగుహనుమంతుని మాటలను విని యిట్లనియెను. ఓయీ ! హనుమంతా ! నేనుదండ్రియొక్కయాజ్ఞానుసారముగాఁ బదునాలుగుసంవత్సరములును బల్లెకుఁగాని పట్టణమునకుఁగాని వచ్చుటకిష్టపడను. ఈసుగ్రీవుఁడు సర్వసమృద్ధిఁగల కిష్కింధాపురమును బ్రవేశించి వైభవోపేతముగాఁ బట్టాభిక్తుఁడుగావలెనని మావాంఛ. అనిహనుమంతునకు సమాధానముచెప్పి సుగ్రీవునిజూచి, శ్రీరాముఁడిట్లనుచున్నాఁడు. మిత్రమా ! సుగ్రీవా! నీవుపట్టాభిక్తుఁడవై, యీయంగదకుమారుని యౌవరాజ్యమునఁ బట్టాభిషిక్తునిగావించుము. ఇతఁడు నీయన్నకుఁ బెద్దకుమారుఁడు బుద్ధివిశేషమునందును బరాక్రమమునందును, నీకుసమానుఁడు. కావునయువరాజుగా నుండనర్హుఁడు. ఇప్పుడు వర్షకాలమారంభమైనది. ఈనాలుగుమాసములును యుద్ధయాత్ర

లకుఁ దగినకాలముగాదు. నీవు కిష్కింధకుంబోయి సుఖించుము. నేనునులక్ష్మణునితో ఋశ్యశృంగపర్వతమున, విశాలమై, రమణీయమైన గుహాయందుఁ గాలమును గడుపఁగలము. సౌమ్యస్వభావముగల సుగ్రీవా! వినుము! కార్తీకమాసమారంభముకాఁగానే యుద్ధయాత్రాప్రయత్నములను గావించుము. ఇదిమనమునిర్ణయించికొనిన ప్రతిజ్ఞ. ఇంక నీవుపోయి, నీమిత్రులనానందింపఁజేయుము. అని శ్రీరాముఁడాజ్ఞాపించఁగావిని, యాతనికినమస్కరించి, సుగ్రీవుఁడు కిష్కింధలోఁ బ్రవేశించెను. అట్లువచ్చిన సుగ్రీవునిజూచి, లెక్కవెట్టశక్యముగాని వానరులంఱును, దమయానందమును వెల్లడిచేయుచు, మహారాజునకు నమస్కారములఁగావించుచు సేవించిరి. ఒకవంక వాలియొక్కమరణమునకు విచారించుచున్నను. సుగ్రీవునకు సాష్టాంగనమస్కారములఁ గావించిరి. వారివారి హృదయములనెఱింగినసుగ్రీవుఁ డందఱను శాంతివచనములతో లేవఁదీసి, యనంతరము తారనోదార్చుటకై, యంతఃపురమును బ్రవేశించెను. అచ్చటనుండి బయటకు రాఁగానే మంత్రులు మొదలగు పరివారమందఱును, సమస్తసామగ్రిని సిద్ధపరచి, స్వర్గమున దేవతలు దేవేంద్రునకువలెఁ గిష్కింధకు సుగ్రీవుని బట్టాభిషిక్తునొనర్చిరి.

అందు బంగారుపిడిగల వింజామరలును, బంగారమునందుమణులుపొదగఁబడిన కామగల తెల్లనిగొడుగును, ననేకవిధములైన చిగుళ్ళతోఁగూడిన పుష్పగుచ్ఛములును,

అదేవిధముగాఁ బూలమాలలును, దెచ్చి, సుగ్రీవునకలం రించిసేవించిరి. అనేకములైన నదులనుండియు సముద్రముల నుండియును బంగారుకలశములతోఁ దీసికొనిరాఁబడిన, మంత్రపూతములైన జలంబులతో హనుమంతుఁడును, జాంబవంతుఁడును, సుషేణుఁడును, గజగవాక్షగవయులును, శరభగంధమాదనులును, మైన్దద్వివిదులును, నలుఁడును, నీలుఁడును మొదలగువానరముఖ్యులు పట్టాభిషేకమంత్రములను బఠించుచు, రుమాదేవితోఁగూడిన సుగ్రీవుని, సింహాసనముపైఁగూర్చొనఁజేసి, యభిషేకముగావించిరి. అనంతరమాసుగ్రీవుఁడు సమస్తాభరణములను దెల్లనిపట్టువస్త్రములనుధరించి, సింహాసనముపైనుండఁగా, బంగారుకిరీటమునాతనిశిరస్సుపైనుంచి, రాజ్యాధికారపదవిని సుస్థిరముగావించిరి. అనంతరమాసుగ్రీవుఁడంగదునిబిలిచి, యాతనికియౌవరాజ్యపట్టాభిషేకము విధివిధానముగా నెరవేర్పఁజేసెను. అది చూచిన సర్వవానరులును సుగ్రీవు నభినందించిరి. మఱియు శ్రీరామ లక్ష్మణులనుగూర్చి జయజయధ్వానములతోఁ గీర్తించిరి. ఆసమయమునఁ గిష్కింధాపురమంతయును మహాకోలాహలముతో నానందసాగరమునమునిఁగి తేలినది. ఆతరువాత రుమాసమేతుఁడైన సుగ్రీవుఁడు శ్రీరామసన్నిధికిఁబోయి తనకృతజ్ఞతాపూర్వక మహదానందమును విన్నవించికొనెను.

## ప్రస్రవణపర్వత గుహా - వైభవమ్ములు

శ్రీరాముఁడు సుగ్రీవునిపట్టాభిషేక వార్తవిని, యాతనినికిష్కింధాపురమునకుఁ బంపివైచెను. తరువాత లక్ష్మణ సహితుఁడై శ్రీరాముఁడు ప్రస్రవణపర్వతమందలి గుహాలోఁ బ్రవేశించెను. ఆపర్వతమంతయును శార్దూలాదిక్రూరమృగములతోడను వివిధములైన పుష్పలతలల్లుకొనియున్న పొదలతోడను, మహావృక్షరాజములతోడను నాకాశమునుండిదిగివచ్చిన మేఘములతోడను, నిత్యనిర్మలములైన జలాశయములతోడను, విరాజిల్లుచున్నది. అట్టిపర్వతశిఖరమునందు, విశాలమై, యందమై సర్వసౌఖ్యములనుగలిగించెడి గుహయందు రామలక్ష్మణులు ప్రవేశించిరి. వినయవిధేయతలుగల, లక్ష్మణునితో శ్రీరాముఁ డాసమయమునకుఁ దగినరీతిగా నిట్లనెను. తమ్ముఁడా! ఈగుహనుజూచితివా! ఇదివిశాలమై రమణీయముగానున్నది. కావున నిందుమనము వర్షకాలమంతయును సుఖముగాఁ గడుపవచ్చును. ఇందుగాలియు, వెలుతురునుగలిగియున్నవి. ఈశిఖరము నానావిధ పరిమళపుష్పములుగలిగి, రకరకముల పక్షులయొక్క మధురధ్వనులునుగలిగి, నెమిళ్ళ కేకలతో నీవృక్షములన్నియును బ్రతిధ్వనించుచున్నవై యుండగానిది యానందకరమైయున్నది. ఇదిగో! ఇటుచూడుము! ఈగుహకుసమీపముననే యీశాన్యమునదిగుట కనుకూలమైన రేవుగలిగి, నైరుతిద్వారముతో నిర్మలోదకముగల యొకచెఱువున్నది. దీనికిఁ

పశ్చిమదిశ నెత్తైనశిఖరముండుటచే, మనకుఁజలిగాలిసోకదు. మఱియు నీగుహాప్రాంగణమున విశాలమై, నునుపైన నల్లని శిలాఫలక మొకటియున్నది. అటుచూడుము! ఈగుహకు నుత్తరభాగమున, విస్తరించినకాటుకవలె నల్లనై యాకాశమునఁ దేలియాడు మేఘముగలదు. మఱియు దక్షిణాకైలాసమునుండి యుత్తరముగా లేచినమేఘమువలెను, విరాజిల్లుచున్నది గైరికాదిధాతువులచే వెలిగిపోవు నీపర్వతశిఖరముం జూడుము! రెండవకైలాసమే యనఁదగి, యీపర్వత మెంతఁగా శోభిల్లుచున్నదోకదా! తమ్ముడా! త్రికూటపర్వతమున జాహ్నవివలె, నిచట నీగుహకుదగ్గరగా, నిర్మలమైన నది యొకటి ప్రవహించుచున్నది. ఈనదీతీరమునఁ బుష్పఫల వృక్షములెన్నియో దట్టముగానున్నవి. ఇందునుత్తమజాతి పక్షులు శ్రావ్యముగాఁ గూయుచున్నవి. పరస్పరానురాగముచే విడివడని చక్రవాకపక్షుల జంటలున్నవి. మఱియు నిందుఁ దెల్లనిమృదువైన యిసుకతిన్నెలుగలవు. ఈదృశ్యమునుజూడ నీనదీయువతి హాయిగానవ్వుచున్నదేమో? యన్నట్లున్నదిగదా! మఱియు మృదువైన వస్త్రభూషణాలంకృతమై బిగువై, యొండొంటితో రాపాడుచున్న స్తనములు గలదై, యెత్తైనపిరుదులుగల యువతివలె నీనదియలరారుచున్నదిసుమా!

లక్ష్మణా! ఇంతటిప్రకృతిరామణీయకమైన యీప్రదేశమున, మనము హాయిగాఁ గాలముగడపవచ్చును. సుగ్రీవ

వాసమైన కిష్కింధగూడ నిక్కడకుదగ్గరగనే యుండుట విశేషము. ఆసుగ్రీవసభావేదికలపై, ధ్వనించు గీతవాద్యలలితధ్వనులుగూడ మనకువినవచ్చుచుండును. తమ్ముఁడా! తనభార్యను, రాజ్యమును బొందిన సుగ్రీవుఁడిప్పుడు మంత్రి పరివారాదులతో మహదానంద మనుభవించుచుండును. అనియీవిధముగా శ్రీరాముఁడు లక్ష్మణునితోఁ జెప్పుచుఁ బ్రస్రవణపర్వతగుహయందుఁ గాలముంగడపుచుండెను.

## శ్రీరాముని విరహవేదన - లక్ష్మణుని ఓదార్పు

శ్రీరాముఁ డామహావైభవోపేతమైన గుహయందుండియును, భార్యావిరహవేదనఁ గలవాఁడగుటచే నేమాత్రమును సుఖము ననుభవించలేదు. పగలువిరహోద్దీపకములైన వస్తుసముదాయమును జూచియు, రాత్రులుచంద్రోదయమగుచుండుటచే, నావెన్నెలయొక్క చల్లదనము ననుభవించుచు, భార్యాస్మరణతో తెల్లవార్లును నిద్రలేక బాధపడుచునేయుండెను. అట్లువిరామములేకుండ రాత్రింబవళ్ళు దుఃఖించుచున్న తనయన్నతో సమానదుఃఖము ననుభవించుచున్న లక్ష్మణుఁడు శ్రీరామునితో నీవిధముగా శాంతివచనములఁబలికి యోదార్చెను.

అన్నా! రామచంద్రా! నీవువీరాగ్రేసరుఁడవు. ఇంక నీదుఃఖమును విడువుము! దుఃఖించువాని కేకార్యమును సిద్ధించదు. కావున ధీరుఁడవగుము. రామా! ఈలోకములో

శ్రీరామరూపమున నొక్కబాణముతో నిన్నుజంపివేయఁగా నీభార్యలందఱును విధవలై యేడ్చుచున్నారుసుమా! నీభార్యలలో నొక్కతెయును నెట్టిసమయములందును బయటకురానివారైనను నిప్పుడునీతో నీశ్మశానమునకు నడిచివచ్చి యేడ్చుచుండఁగా నొక్కమారువీరినోదార్చవా? ఇప్పుడు రాజైన నీతమ్ముఁడును, మంత్రులు మొదలైన ముఖ్యపరివారమును గోలుగోలున నేడ్చుచుండఁగా, వారినోదార్చవేల? ఇప్పుడిచ్చటిపరివారమునందఱను బొమ్మని యాజ్ఞాపించుము! తరువాత నీవనమునస్ప్రియురాండ్రతో స్వేచ్ఛగావిహరించవచ్చును." అనియీవిధముగా నేడ్చుచున్నతార మొదలైన స్త్రీలనందఱను బలాత్కారముగా, వారివారిస్థానములకుఁ గొనిపోయిరి. అంగదుఁడు సుగ్రీవునితోఁగూడి వాలికిచేయవలసిన యుత్తరక్రియల నన్నింటినిబూర్తిచేసెను. తరువాత సమస్తవానరులును జనిపోయినవాలికి జలతర్పణములఁ గావించుటకై, నిర్మలమైననీరుగల నదీతీర్థమునకేగిరి. దుఃఖితుఁడైన యంగదునిబట్టికొని సుగ్రీవాదులునదిలో స్నానములుచేసిరి.

శ్రీరాముఁడును నాసమయమున సుగ్రీవునితో సమానమైన దుఃఖముగలవాఁడై, (సుఖదుఃఖములనుసమానముగాఁబంచికొనుటయే యుత్తమమిత్ర లక్షణముగదా! సుగ్రీవాంగదులచే వాలికిశ్రాద్ధకార్యమును జేయించెను.

(ఇచ్చట శ్రాద్ధకర్మకు కుమారుఁడేయర్హుఁడు. అయినను దుఃఖాతిశయముచే నంగదుఁడు సరిగాఁ జేయలేకపోవుటగాని, చనిపోవుటగాని జరుగవచ్చు నన్న యనుమానముతో సుగ్రీవుని చేఁగూడఁ వాలికి నుత్తరక్రియలఁగావింపఁజేసెనని మన మూహించవచ్చును. లేదా, యంగదునకు భార్యలున్నట్లు చెప్పలేదు. భార్యారహితుఁడైన కుమారుఁడు శ్రాద్ధకర్మఁ జేయుట శ్రేష్ఠముగాదని యైనను సుగ్రీవుని చేఁగూడ శ్రాద్ధకర్మఁగావింపఁజేసెనని చెప్పవచ్చును.) ఆవిధముగా శ్రీరామాజ్ఞను బాటించి, సుగ్రీవుఁ డన్నగారికి నుత్తరక్రియల నెరవేర్చి, మఱల శ్రీరామసన్నిధికిఁ జేరికొనెను,

## సుగ్రీవ - పట్టాభిషేకము

వాలికిఁ జేయవలసిన యుత్తరక్రియలనుబూర్తిఁగావించికొని శ్రీరామసన్నిధిని దుఃఖసముద్రమున మునిగియున్న సుగ్రీవునివద్దకుఁ గిష్కింధారాజ్యమంత్రులందఱునువచ్చిరి. అందఱును శ్రీరామసన్నిధిని జేతులుజోడించి వినయముతో నిలిచిరి. ఆసమయమున మేరుపర్వతముపై లేతసూర్యునివలెఁ బ్రకాశించుముఖముగల హనుమంతుఁ డిట్లనుచున్నాఁడు. ఓ శ్రీరామప్రభూ ! నీయొక్క పరిపూర్ణానుగ్రహముచే, నీసుగ్రీవుఁడు తనతాతలనాటి కిష్కింధారాజ్యమును బొందఁ గలిగెను. ఇంకనీతఁడు నీయనుజ్ఞయైనచోఁ బురమును బ్రవేశించి, మంత్రులతోఁగూడి చేయవలసినకార్యక్రమములనెల్ల

నెరవేర్చఁగలఁడు. మఱియు వివిధసురభిళద్రవ్యములతోడను, నానావిధజలంబులతోడను, బట్టాభిషిక్తుఁడై, దివ్యవస్త్రాభరణాదులచే నలంకరింపఁబడి, నీదర్శనమునకురాఁగలఁడు. వివిధపుష్పమాలికలను రత్నములను దెచ్చి, నీకుసమర్పించికొనఁగలఁడు.

రామచంద్రా! నీవీరమణీయ కిష్కింధాపురమును బ్రవేశించి, సుగ్రీవపట్టాభిషేకమును జేయించి, యీసర్వవానరులకు నానందమునుగలిగించుము, అనఁగా శ్రీరాముఁడు బుద్ధిమంతుఁడును వాఙ్మాధుర్యముచే నెంతటివారినైన నలరించువాఁడు, నగుహనుమంతుని మాటలను విని యిట్లనియెను. ఓయీ! హనుమంతా! నేనుదండ్రియొక్కయాజ్ఞానుసారముగాఁ బదునాలుగుసంవత్సరములును బల్లెకుఁగాని పట్టణమునకుఁగాని వచ్చుటకిష్టపడను. ఈసుగ్రీవుఁడు సర్వసమృద్ధిఁగల కిష్కింధాపురమును బ్రవేశించి వైభవోపేతముగాఁ బట్టాభిక్తుఁడుగావలెనని మావాంఛ. అనిహనుమంతునకు సమాధానముచెప్పి సుగ్రీవునిజూచి, శ్రీరాముఁడిట్లనుచున్నాఁడు. మిత్రమా! సుగ్రీవా! నీవుపట్టాభిక్తుఁడవై, యీయంగదకుమారుని యౌవరాజ్యమునఁ బట్టాభిషిక్తునిగావించుము. ఇతఁడు నీయన్నకుఁ బెద్దకుమారుఁడు బుద్ధివిశేషమునందును బరాక్రమమునందును, నీకుసమానుఁడు. కావునయువరాజుగా నుండనర్హుఁడు. ఇప్పుడు వర్షకాలమారంభమైనది. ఈనాలుగుమాసములును యుద్ధయాత్ర

లకుఁ దగినకాలముగాదు. నీవు కిష్కింధకుంబోయి సుఖించుము. నేనులక్ష్మణునితో ఋశ్యశృంగపర్వతమున, విశాలమై, రమణీయమైన గుహాయందుఁ గాలమును గడుపఁగలము. సౌమ్యస్వభావముగల సుగ్రీవా! వినుము! కార్తీకమాసమారంభముకాఁగానే యుద్ధయాత్రాప్రయత్నములను గావించుము. ఇదిమనమునిర్ణయించికొనిన ప్రతిజ్ఞ. ఇంక నీవుపోయి, నీమిత్రులనానందింపఁజేయుము. అని శ్రీరాముఁ డాజ్ఞాపించఁగావిని, యాతనికినమస్కరించి, సుగ్రీవుఁడు కిష్కింధలోఁ బ్రవేశించెను. అట్లువచ్చిన సుగ్రీవునిజూచి, లెక్కవెట్టశక్యముగాని వానరులంఱును, దమయానందమును వెల్లడిచేయుచు, మహారాజునకు నమస్కారములఁగావించుచు సేవించిరి. ఒకవంక వాలియొక్కమరణమునకు విచారించుచున్నను. సుగ్రీవునకు సాష్టాంగనమస్కారములఁ గావించిరి. వారివారి హృదయములనెఱింగినసుగ్రీవుఁ డందఱను శాంతి వచనములతో లేవఁదీసి, యనంతరము తారనోదార్చుటకై, యంతఃపురమును బ్రవేశించెను. అచ్చటనుండి బయటకు రాఁగానే మంత్రులు మొదలగు పరివారమందఱును, సమస్త సామగ్రిని సిద్ధపరచి, స్వర్గమున దేవతలుదేవేంద్రునకువలెఁ గిష్కింధకు సుగ్రీవుని బట్టాభిషిక్తునొనర్చిరి.

అందు బంగారుపిడిగల వింజామరలును, బంగారము నందుమణులుపొదగఁబడిన కామగల తెల్లనిగొడుగును, ననేకవిధములైన చిగుళ్ళతోఁగూడిన పుష్పగుచ్ఛములును,

అదేవిధముగాఁ బూలమాలలును, దెచ్చి, సుగ్రీవునకలం రించిసేవించిరి. అనేకములైన నదులనుండియు సముద్రముల నుండియును బంగారుకలశములతోఁ దీసికొనిరాఁబడిన, మంత్రపూతములైన జలంబులతో హనుమంతుఁడును, జాంబవంతుఁడును, సుషేణుఁడును, గజగవాక్షగవయులును, శరభగంధమాదనులును, మైన్దద్వివిదులును, నలుఁడును, నీలుఁడును మొదలగువానరముఖ్యులు పట్టాభిషేకమంత్రము లను బఠించుచు, రుమాదేవితోఁగూడిన సుగ్రీవుని, సింహా సనముపైఁగూర్చోనఁజేసి, యభిషేకముగావించిరి. అనంతర మాసుగ్రీవుఁడు సమస్తాభరణములను దెల్లనిపట్టువస్త్రము లనుధరించి, సింహాసనముపైనుండఁగా, బంగారుకిరీటము నాతనిశిరస్సుపైనుంచి, రాజ్యాధికారపదవిని సుస్థిరముగావిం చిరి. అనంతర మాసుగ్రీవుఁడంగదునిబిలిచి, యాతనికియావ ద్రాజ్యపట్టాభిషేకము విధివిధానముగా నెరవేర్పఁజేసెను. అది చూచిన సర్వవానరులును సుగ్రీవు నభినందించిరి. మఱియు శ్రీరామ లక్ష్మణులనుగూర్చి జయజయధ్వానములతోఁ గీర్తించిరి. ఆసమయమునఁ గిష్కింధాపురమంతయును మహాకోలాహలముతో నానందసాగరమునమునిఁగి తేలినది. ఆతరువాత రుమాసమేతుఁడైన సుగ్రీవుఁడు శ్రీరామసన్ని ధికిఁబోయి తనకృతజ్ఞతాపూర్వక మహదానందమును విన్న వించికొనెను.

## ప్రస్రవణపర్వత గుహా - వైభవము

శ్రీరాముఁడుసుగ్రీవునిపట్టాభిషేకవార్తవిని, యాతనినికిష్కింధాపురమునకుఁ బంపివైచెను. తరువాత లక్ష్మణసహితుఁడై శ్రీరాముఁడు ప్రస్రవణపర్వతమందలి గుహలోఁ బ్రవేశించెను. ఆపర్వతమంతయును శార్దూలాదిక్రూరమృగములతోడను వివిధములైన పుష్పలతలల్లుకొనియున్న పొదలతోడను, మహావృక్షరాజములతోడను నాకాశమునుండిదిగివచ్చిన మేఘములతోడను, నిత్యనిర్మలములైన జలాశయములతోడను, విరాజిల్లుచున్నది. అట్టిపర్వతశిఖరమునందు, విశాలమై, యందమై సర్వసౌఖ్యములనుగలిగించెడి గుహయందారామలక్ష్మణులు ప్రవేశించిరి. వినయవిధేయతలుగల, లక్ష్మణునితో శ్రీరాముఁడాసమయమునకుఁ దగినరీతిగానిట్లనెను. తమ్ముఁడా! ఈగుహనుజూచితివా! ఇదివిశాలమై రమణీయముగానున్నది. కావున నిందుమనము వర్షకాలమంతయును సుఖముగాఁ గడుపవచ్చును. ఇందుగాలియు, వెలుతురునుగలిగియున్నవి. ఈశిఖరము నానావిధ పరిమళపుష్పములుగలిగి, రకరకముల పక్షులయొక్క మధురధ్వానులునుగలిగి, నెమిళ్ళకేకలతో నీవృక్షములన్నియును బ్రతిధ్వనించుచున్నవై యుండగానిది యానందకరమైయున్నది. ఇదిగో! ఇటుచూడుము! ఈగుహకుసమీపముననే యీశాన్యమునదిగుట కనుకూలమైనరేవుగలిగి, నైరుతిద్వారముతో నిర్మలోదకముగల యొకచెఱువున్నది. దీనికిఁ

బశ్చిమదిశ నెత్తైనశిఖరముండుటచే, మనకుఁజలిగాలిసోకదు. మఱియు నీగుహాప్రాంగణమున విశాలమై, నునుపైన నల్లని శిలాఫలకమొకటియున్నది. అటుచూడుము! ఈగుహాకు నుత్తరభాగమున, విస్తరించినకాటుకవలె నల్లనైయాకాశమునఁ దేలియాడు మేఘముగలదు. మఱియు దక్షిణకైలాసమునుండి యుత్తరముగాలేచినమేఘమువలెను, విరాజిల్లుచున్నది గైరికాదిధాతువులచే వెలిగిపోవు నీపర్వతశిఖరముం జూడుము! రెండవకైలాసమేయనఁదగి, యీపర్వతమెంతఁగా శోభిల్లుచున్నదోగదా! తమ్ముడా! త్రికూటపర్వతమున జాహ్నవివలె, నిచట నీగుహకుదగ్గరగా, నిర్మలమైన నదియొకటి ప్రవహించుచున్నది. ఈనదీతీరమునఁ బుష్పఫల వృక్షములెన్నియో దట్టముగానున్నవి. ఇందునుత్తమజాతి పక్షులు శ్రావ్యముగాఁ గూయుచున్నవి. పరస్పరానురాగముచే విడివడని చక్రవాకపక్షుల జంటలున్నవి. మఱియు నిందుఁ దెల్లనిమృదువైన యిసుకతిన్నెలుగలవు. ఈదృశ్యమునుజూడ నీనదీయువతి హాయిగానవ్వుచున్నదేమో? యన్నట్లున్నదిగదా! మఱియు మృదువైన వస్త్రభూషణాలంకృతయై బిగువై, యొండొంటితోఁ రాపాడుచున్న స్తనములు గలదై, యెత్తైనపిరుదులుగల యువతివలె నీనదియలరారుచున్నదిసుమా!

లక్ష్మణా! ఇంతటిప్రకృతిరామణీయకమైన యీప్రదేశమున, మనము హాయిగాఁ గాలముగడపవచ్చును. సుగ్రీవ

వాసమైన కిష్కింధగూడ నిక్కడకుదగ్గరగనే యుండుట విశేషము. ఆసుగ్రీవసభావేదికలపై, ధ్వనించు గీతవాదిత్ర లలితధ్వనులుగూడ మనకువినవచ్చుచుండును. తమ్ముఁడా! తనభార్యను, రాజ్యమును బొందిన సుగ్రీవుఁడిప్పుడు మంత్రి పరివారాదులతో మహదానంద మనుభవించుచుండును. అనియీావిధముగా శ్రీరాముఁడు లక్ష్మణునితోఁ జెప్పుచుఁ బ్రస్రవణపర్వతగుహాయందుఁ గాలముంగడపుచుండెను.

## శ్రీరాముని విరహవేదన - లక్ష్మణుని ఓదార్పు

శ్రీరాముఁ డామహావైభవోపేతమైన గుహాయందుండి యును, భార్యావిరహవేదనఁ గలవాఁడగుటచే నేమాత్ర మును సుఖము ననుభవించలేదు. పగలువిరహోద్దీపకము లైన వస్తుసముదాయమును జూచియు, రాత్రులుచంద్రోదయ మగుచుండుటచే, నావెన్నెలయొక్క చల్లదనము ననుభవిం చుచు, భార్యాస్మరణతో తెల్లవార్లును నిద్రలేక భాధపడు చునేయుండెను. అట్లువిరామములేకుండ రాత్రింబవళ్ళు దుఃఖించుచున్న తనయన్నతో సమానదుఃఖము ననుభ వించుచున్న లక్ష్మణుఁడు శ్రీరామునితో నీవిధముగా శాంతివచనములఁబలికి యోదార్చెను.

అన్నా! రామచంద్రా! నీవువీరాగ్రేసరుఁడవు. ఇంక నీదుఃఖమును విడువుము! దుఃఖించువాని కేకార్యమును సిద్ధించదు. కావున ధీరుఁడవగుము. రామా! ఈలోకములో

నందఁజిక్కించెను బురుషకారమును నిర్విఘ్నముగా జరిపింపఁ
గల శూరుఁడవు. అట్లని దైవమునందు భారమును విడువని
వాఁడవు. వేదమునునమ్మిన ధార్మికుఁడవు. పట్టువీడని
సత్ప్రయత్నముగలవాఁడవు. అట్టినీవింతఁగా శోకించుట
తగదుసుమా! ఇట్లేయున్నచో శత్రువులనుజయించలేవు.
మనముఖ్యశత్రువైన రావణుఁడు సామాన్యుఁడుగాఁడు.
బహుమాయావి. అట్టివానిని వధించవలెనన్నచో నీవిట్లు
నిరుత్సాహివై యుండుటతగదు. ఈసమస్త నదీనదసముద్ర
పర్వతమహారణ్యములతో నిండినభూమినైనను దలక్రిందు
లుగాఁ జేయఁగల పరాక్రమశాలివినీవు. కావున దుఃఖమును
విడిచి, యుత్సాహముగలిగి. యారావణుని సమూలముగా
సంహరించుము. ఇదిగో! ఇప్పుడువర్షకాల మారంభమైనది.
ఇదిగడచినంతనే శరత్కాలమురాగలదు. అంతవరకును
ధైర్యము నవలంబించి యుండుము. ఇంకస్వల్పకాలములోనే
రావణుని బంధుమిత్రపరివారముగా సమూలనాశము
గావించఁగలవు. నీవంటి మహాపరాక్రమశాలికి రావణవధ
యేపాటిది? అన్నా! నీకుఁదెలియనిదేమున్నది? నీఱుగప్పిన
నిప్పునురగుల్కొలిపి, జ్వాలామాలలను రెచ్చఁగొట్టుటకే,
నేనిప్పుడీవిధముగా బ్రోత్సహించుటసుమా! అంతియేగాని,
నేనునీకుఁబ్రోత్సాహ మిచ్చుటకెంతటివాఁడను? అనఁగా విని
శ్రీరాముఁడు తమ్ముని ప్రోత్సాహకరవాక్యములకు,

సంతోషించుచు, నాసమయానుకూలమైన మాటల నిట్లని యెను. తమ్ముఁడా! నిజమైనహితుఁడును, మిత్రుఁడును వీరుఁడును, నైనవాఁడు చెప్పఁదగిన మాటలనే చెప్పితివి. తమ్ముఁడా! నేనింక శోకమునువిడిచితిని. నీమాటల ననుసరించి, శరత్కాలమువచ్చువరకును నిరీక్షించుదును. ఆపైని సుగ్రీవసహాయముతోఁ గార్యసిద్ధికి ప్రయత్నించఁగలను.

శ్లో॥ ఉపకారేణ వీరస్తు, ప్రతీకారేణ యుజ్యతే।
అకృతజ్ఞోఽప్రతికృతో, హన్తి సత్వవతాంమనః॥
స. 27, 28 శ్లో॥-45, 64,

తా॥ వీరుఁడగువాఁడు తనకుపకారమొనర్చినవానికిఁ బ్రత్యుపకారము తప్పక చేయఁగలఁడు. అట్లుగాక కృతఘ్నుఁడైనచో, సాత్వికులగు సత్పురుషులు మానసికముగా బాధపడుదురు. కావున నట్టిభయమువలననైన సుగ్రీవుఁడు తప్పక మనకు సాయపడఁగలఁడు.

ఎంతటిమహావీరుఁడైనను గృతజ్ఞతఁగలిగి, మిత్రునకుఁ బ్రత్యుపకారముచేసి తీరవలయును. కానిచో సత్పురుషుల యాత్మ క్షోభించును. తనశరీరబుద్ధిబలములకంటెను సత్పురుషులయాత్మబలమధికమై, యెంతటివానినైనను నశింపఁజేయును. కావున కృతజ్ఞతయనునది సహజముగా నందఱకు నుండఁదగినధర్మము.

శ్రీరామునిమాటలువిన్న లక్ష్మణుఁడు చేతులు జోడించి నమస్కరించుచు నిట్లనుచున్నాఁడు. అన్నా! నీవన్నట్లే శరత్కాలమునకై నిరీక్షించుదము. ఈలోగా వర్షకాలప్రభావము యుద్ధయాత్ర కనుకూలముగాదుగదా! అంతవరకును నీవిరహవేదన నెట్లోసహించుము. రామా! నీవుకోపతాపముల నడఁచికొని, నాతోఁగూడ, నెట్లోయీ నాలుగుమాసములు నోర్మిఁగలిగి యుండుము.

## వర్షకాల వైభవము

శ్రీరాముఁడు లక్ష్మణసహితుఁడైయుండఁగా వర్షకాల మారంభమైనది. ఆకాశమంతయును మేఘము లలుము కొని, బోరున వానలుగురియుచున్నవి. అదిచూచి శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనుచున్నాఁడు. తమ్ముఁడా! లక్ష్మణా! సుగ్రీవునకును మనకునుజరిగిన ప్రతిజ్ఞలను నెర వేర్చుట కాటంకముగా నీవర్షకాలమారంభమైనది. చూడుము! ఆకాశమంతటను గొండలుతిరుగుచున్నట్లుగా నల్లనిపెద్దపెద్దమేఘములు తిరుగుచున్నవి. మఱియు నీయాకాశము సూర్యకిరణములద్వారా నీటిక్రావి, ఆషాఢము మొదలుకొని కార్తీక మాసమువరకును నాలుగుమాసము లాజలంబులను ప్రసవించఁగలవు. ఈమేఘము లీకొండకొన నుండి సూర్యపర్వతమువరకును వ్యాపించియున్నవి. నాయనా! అటుబాగుగాఁజూడుము! ఈయాకాశమునుండి

మేఘములు వర్షమునుగురిసి, వెళ్ళిపోగా, నవిస్వల్పజలములు గల మేఘములగుటచే, వెలవెలఁబోవుచున్నవి. అట్టివాని మధ్య సూర్యునిసంధ్యారాగము పడుటచే నవి యెఱ్ఱనిపై యాకాశము గాయపడఁగాఁ దెల్లనిగుడ్డను దానిపైఁగట్టినట్లు కనఁబడుటలేదా? మఱియు నీయాకాశము వాయువులనెడి నిట్టూర్పులుగలిగి, సంధ్యారాగమనెడి యెఱ్ఱనిమైపూతతో నీరులేని తెల్లని మేఘములతో నుండుటవలన, నిదియును ప్రియావిరహితునింబోలెఁ గానవచ్చుచున్నది. సుమిత్రా నందవర్ధనా! ఇంకనువినుము! ఎండలకు మిక్కిలిగావేడెక్కిన భూమి, వర్షముపడుటచే నేనుసీతావిరహతాపముతో వేడెక్కి, కంటనీరుఁగార్చునట్లుగా నావిరిగ్రక్కుచున్నది. ఈమేఘ మధ్యనుండి చల్లనిగాలులువచ్చి, మందముగా వీచుచు, నెఱ్ఱకలువలమీదుగాఁ బ్రసరించుటచే, సువాసనఁగలిగి, వికసించిన మొగలిపూలసువాసనను గలిసి, యుండుటచే, దోసిళ్ళతోఁబట్టి త్రాగుటకువీలుగా నీజలంబులున్నవి. లక్ష్మణా! మొత్తముపై నీపర్వతమంతయును, నానాజాతిపుష్పములతో నిండి, జలాశయములయొడ్డనున్న మొగలిపూవులసువాసనల తోడను ధారాపాతముగాఁబడు వర్షముతోడను, బట్టాభిషిక్తుఁడైన సుగ్రీవునివలెఁ గన్పట్టుచున్నది. ఈవాయువు లాయా గుహలలోఁ బ్రవేశించి, ప్రతిధ్వనించుటచే, మహర్షుల వేదఘోషవలె వినఁబడుచున్నది. గ్రహించితివా? లక్ష్మణా! అటుచూడుము?

ఈచరియలయందున్న గైరికాదిధాతువులు బాష్పము లతోనిండి, వర్షర్తువురాకచే వికసించినవై, ప్రియునితో సమాగమముగలుగుటచే నానందబాష్పములుగలిగి, చిఱునవ్వులను వెదజల్లుముఖములుగల కామినులవలెఁ గన్పట్టుచున్నవిసుమా! ఈదృశ్యముచే నాకుసీతావిరహవేదన మధికమగుచున్నది. ఇప్పుడుభూమి చల్లఁబడినది. వాయువులు చల్లఁగావీచుచున్నవి.రాజుల దండయాత్రల సందడిగానరాదు. దూరదేశములకువెళ్ళినవారు స్వగృహములకుఁ జేరికొందురు. హంసలు మానససరోవరమునకుఁ బోయినవి. చక్రవాకంబులు జంటలువీడక దిరుగుచున్నవి. ఈవానలకు మార్గములు బురదలతోనుండుటచే నెక్కడివాహనము లక్కడ నేనిలిచి పోవును. నెమిళ్ళు కేకలువెట్టుచు నుత్సాహముతో నుండఁగాఁ గొండపైనుండి వర్షపునీరు వేగముగాఁ బ్రవహించుచున్నది. నేరేడుచెట్లనుండి నల్లనిపండ్లు నేలపైబోగులుగాఁ బడియున్నవి. ఆకాశమునమేఘము లొకదానితోనొకటి రాపిడిచే, మదించినయేనుఁగులు పోరాడునప్పటి ఘీంకారములవలె నురుముల ధ్వనులు వినవచ్చుచున్నవి. తమ్ముఁడా! ఈవంకఁజూడుము! వానచేఁ బెరిగినపచ్చికబయళ్ళయందు, వానవెలియఁగనే, నెమిళ్ళు పురులువిప్పికొని నాట్యములాడుచున్నవి. చూడుము! బెగ్గురుపక్షులు గర్భధారణకై, మేఘమునాశ్రయించి, పక్తులుదీర్చి, నిలిచినవై, తెల్లనిపూలమాలలతో నామేఘమునకు స్వాగతమువలుకుచున్నట్లున్నవి. (బెగ్గురుపక్షులలో

మగపక్షులుండవనియు, నాషాఢమాసమున మేఘములనుండి వచ్చిన చినుకులనుద్రావి, యవి గర్భమును ధరించుననియు నొకప్రసిద్ధి) భూమిపైఁ బచ్చనిపచ్చికపెరిగియుండఁగా, దానిపైనుండు నారుద్రపురుగు లెఱ్ఱనిచుక్కలుకాఁగా, నీభూమియెఱ్ఱనిచుక్కలుగల పచ్చనిపట్టుపుట్టమును ధరించి నదా? యన్నట్లున్నది. ఈవర్ష కాలమున యోగనిద్రామహామాయ, మహావిష్ణువు నావరించినది. నదులన్నియును త్వరత్వరగాఁ దమప్రియుఁడైన సముద్రుని జేరఁబోవుచున్నవి. యువతులు కామవాంఛతోఁ దమప్రియులను జేరుచుందురు. ఆబోతు లాలమందలయెడఁ గామాతురములై తిరుగు చుండును. భూమియంతయును సశ్యశ్యామలమగును. సుగ్రీవపట్టాభిషేకమునకు, నానందపరవశులైన వానరులందఱకును గడుపునిండ నాహారముదొరకుటచేఁ బ్రశాంతులై యున్నారు. తుమ్మెదలధ్వనియే తంత్రీస్వనముగాఁ గప్పల బెకబెకలే తాళధ్వనులుగా మేఘగర్జనలే మృదంగనాదములుగా, నీవనమునం దీవర్షకాలమున సంగీతసభ ఘనముగా జరిగినట్లున్నది. ఈవర్ష కాలమున పద్మములయందలి కింజల్కములు ముడిచికొనిపోయి చుట్టునున్న రేకులు పట్టుదప్పియుండుటచేఁ దుమ్మెద లట్టిపద్మములనువిడిచి, నవనవోన్మేషములై ప్రకాశించు కదంబపుష్పగుచ్ఛముల నాశ్రయించుచున్నవి. ఈవర్ష కాలమున నాబోతులును నేనుఁగులును మదించి తిరుగాడుచున్నవి. సింహములు గుహలనువిడిచి రాలేకపోవు

చున్నవి. దేవేంద్రుఁడు మేఘముల వెంటఁ దిరుగుచు, వాని నాజ్ఞాపించుచున్నాఁడు. వర్ష ధారలచేఁ బరిశుభ్రముగాఁ గడిగి వేయఁబడి, నిర్మలములైన పర్వతశిఖరములనుండి, సెలయేళ్ళు గలగలమని ప్రవహించుచుండఁగా, నెత్తైన స్తనములు గల స్త్రీలు మెడలో వ్రేలాడ వేసికొనిన ముత్యపుదండలవలెఁ బ్రకాశించుచున్నవి. లక్ష్మణా! చూచితివా! మేఘావృతమైన యాకాశమున, సూర్యుఁడు కానరాకపోయినను, బక్షులు తమతమగూళ్ళకుఁ జేరికొనుటయుఁ బద్మములు ముడిచికొనుటయు, మాలతీపుష్పములు వికసించుటయు, ననెడిగుర్తులచే సూర్యుఁడస్తమించెనని తెలియుచున్నది.

శ్లో॥ మాసిప్రోష్ఠపదే బ్రహ్మ, బ్రాహ్మణానాం విచక్షణమ్।
అయ మధ్యాయసమయ, స్సామగానా ముపస్థితః॥
స. 28, శ్లో॥-54.

తా॥ భాద్రపదమాసము సామశాఖీయులగు బ్రాహ్మణులకు వేదాధ్యయనము చేయదగినది. హస్తానక్షత్ర రూపము ప్రాప్తించినది. తమ్ముఁడా! ఉదాత్తములైన దీర్ఘాక్షరములు గల సామవేదమంత్రములను స్వరయుక్తముగాఁ గంఠమాధుర్యముతో నభ్యసించుటకు భాద్రపదమాసమన్నివిధములుగ ననుకూలమైనది. (సంగీతపాఠకులుగూడ నీకాలముననే తెల్లవారుజామున నభ్యాసముచేయుచుండుట నేటికిని మనము చూచుచునే యుందుము.)

ఉపనయనమైన ప్రతిబ్రాహ్మణుఁడును శ్రావణభాద్రపదమాసములలో వేదాధ్యయనముచేయుట ముఖ్యధర్మము. అందును సామశాఖీయులు సామవేదమును భాద్రపదమాసమున నధ్యయనముచేయుటధర్మము. (భాద్రపదమున హస్తానక్షత్రయుక్తమైనదిగా సామవేదోపాకర్మను బంచాంగములలో వ్రాయఁబడును.)

లక్ష్మణా! అయోధ్యారాజ్యమున భరతుఁ డీనాలుగుమాసములు నేపనిఁ జేయుటకును వలనుగాకుండునని గృహోపకరణముల నన్నిఁటిని, నాషాఢపూర్ణిమకుముందుగానే, సిద్ధముచేసికొని యుండునుసుమా! నేనెక్కడికైనను వెడలివచ్చుచున్నప్పు డయోధ్యావాసులెదురేగునప్పటి కోలాహలమువలె, నీఋతువున సరయూనదియొడ్డనొరసికొని గొప్పకోలాహలముతోఁ బ్రవహించు నని యూహించెదను. ఈసుగ్రీవుఁడు శత్రుహంతయై, రాజ్యమునుబొంది, యీ ఋతువున సమస్తభోగముల, ననుభవించుచున్నాఁడు. తమ్ముఁడా! లక్ష్మణా నేనింకను, శత్రునాశమును జేయక, భార్యనురాజ్యమును, గోల్పోయి, నీటిచేనానిపోయిన యేటిగట్టువలెఁ గ్రుంగిపోవుచున్నాను. చూచితివా! ఈవర్షర్తువు నాకుదుఃఖమునే గలిగించుచున్నది. శత్రువైనరావణుఁడు సామాన్యుఁడుగాఁడు. ఈనాశోకమునకు నంతముగనుపించుట లేదు. ఈవర్షకాలమున సుగ్రీవునిమనమేమికోరినను నాతనికసాధ్యమేయగును. అంతియేగాక, సుగ్రీవుఁడు చాలాకాలము

కష్టముల ననుభవించి యిప్పుడు గదా సుఖపడుచున్నాఁడు. అట్టివాని నా సుఖంబులను విడిచి యుద్ధయాత్రకుఁ బ్రయత్నించు మని యెటు కోరఁగలను? అతఁడెంతటి మహాభోగముల ననుభవించుచున్నను దగిన సమయమురాగానే మన కుపకారము చేయుటకుఁ దప్పక యత్నించును. అతఁడు మనము కోరకుండఁగనే కృతజ్ఞుఁడై, మనకుపకారము చేయఁగలఁడు. కావున నోలక్ష్మణా! కాలమునకై నిరీక్షించుదము. అప్పటికి వానలు తగ్గి నదీప్రవాహములు మందగించును. సుగ్రీవునకును మనపైననుగ్రహము గలుగఁగలదు. బుద్ధిమంతుఁడైన ధీరుఁడు తనకుపకారము చేసిన వానికిఁ బ్రత్యుపకారము తప్పక చేయును. అట్లు గానిచో సత్పురుషు లసహ్యించికొందురు. కావున సత్పురుషులకు భయపడియైన మనకుపకారము చేయును. అనగా విని లక్ష్మణుఁడు శుభకరమైన తన భావమును వెల్లడి చేయుచు నిట్లనుచున్నాఁడు. శ్రీరామ ప్రభూ! సుగ్రీవుఁడు తన ప్రతిజ్ఞను సకాలములోఁదప్పక నెరవేర్పఁగలఁడు. నీవు మాత్రము దుఃఖమును విడిచి, ధీరుఁడవై, శరత్కాలము వచ్చువరకును నిరీక్షించుము అని శ్రీరామునకు ధైర్యము చెప్పెను.

## శరత్కాలము రాగానే - హనుమంతుఁడు - సుగ్రీవుని - ప్రోత్సహించుట

గగనతలమంతయును మేఘములు లేక మెరపులు లేక స్వచ్ఛమై, శరత్కాల ప్రవేశమును సూచినవి. సారసపక్షులు

మనోహరముగా ధ్వనించుచున్నవి. రాత్రులు వెన్నెలతో నభిరామమై యుండెను. అంతయు గమనించిన వాయుపుత్త్రుఁడు హనుమంతుఁడు, సుగ్రీవుని భోగలాలసత్వమును జూచి యాతనిని మధురమైన మాటలతో శాంతింపఁజేసి తన మాటలయందు విశ్వాసము గలుగునట్లు చేసికొని హితములును, సత్యములును, నీతి యుక్తములు నగు మాటల నీ విధముగాఁ జెప్పనారంభించెను, ఓ సుగ్రీవ మహారాజా! శత్రువును జయించి నిష్కంటకమైన రాజ్యమును సంపాదించితివి. చాలఁదృప్తిగా భోగములననుభవించితివి. ఇఁక నత్యంత ప్రాణ సమానమై, విఖ్యాతికి మూలమైన మిత్ర కార్యమును నెరవేర్చవలసియున్నది సుమా! సకాలములో మిత్రుని విషయమై యెవఁడు నిర్లక్ష్యము చేయునో, వాని రాజ్యమును గీర్తి ప్రతిష్ఠలును నశ్శింపోవును. ఎవఁడట్లుగాక మిత్రుని యాగ్రహమునకుఁ బాలుగాక చక్కఁగాఁ బ్రవర్తించునో యట్టివానికి జగద్విఖ్యాతియు రాజ్యాభివృద్ధియును గలుగును, ధనాగారము, సైన్యము, మిత్రసంపద యనునవి యెవనిని విడువకనుండునో, యాతని రాజ్యమును సుస్థిరమై, సర్వభోగముల ననుభవింపఁజేయును. మహారాజా! నీవు సదాచార సంపన్నుఁడవు. సన్మార్గ ప్రవర్తన గలవాఁడవు. నీవు నీ మిత్రునకుఁ జేసిన ప్రతిజ్ఞను జక్కఁగా నెరవేర్పఁ బ్రయత్నించుము. స్వకార్యముల నెల్లను విడిచి మిత్ర కార్యమును నెరవేర్పఁబూనినచో, నేయ నర్హమును గల్గను. మిత్ర కార్య

ములనే కాలమున నెట్లు గావింపవలెనో యెఱుగక కాలాతి క్రమణ మొనర్చి, తరువాత నాయా కార్యములను నెరవేర్చినను జేయనివాఁడుగనే పరిగణింపఁబడును. కావున సకాలములో మిత్రకార్యమును నెరవేర్చవలెను. అట్లు గానిచో సత్పురుషులు మెచ్చరు.

రాజా ! ఇంతకును నేను జెప్పఁబోవునదేమనఁగా నీ మిత్రుఁడైన శ్రీరాముని భార్య, సీతను వెదకించుటలో నశ్రద్ధ చేయక సకాలములోఁ గార్యక్రమమును జేపట్టుము. ఓ వీరాగ్రేసరా ! మిత్రకార్యమైన సీతాన్వేషణకు నిప్పుడు కాలము సమీపించినది. సీతా వియోగ బాధచే ద్వరపడు చున్నవాఁడైనను గాల మతిక్రమించినను, నీ యందలి విశ్వాసముచే శ్రీరాముఁడు తానై నిన్ను బ్రార్థించఁడు. రాముఁడు సుక్షత్రియ సంభూతుఁడు. మనకెల్ల విధముల నాప్తుఁడు. మహాపరాక్రమశాలి. నీవును నాతనికి సరియైన సుగుణ సంపత్తిఁగల మిత్రుడవు. ఓ వానరాధిపా ! నిప్పుడు తప్పక యాతని కార్యమును నెరవేర్చవలసియున్నది. ఆతఁడు ముందుగనే, నీ కార్యమును నెరవేర్చి నిన్నానందింపఁజేసిన వాఁడు. కావున నిప్పుడే, మన వానర వీరులను రప్పించి, నలు దెసలకును బంపించి సీతాదేవిని వెదకించుము. శ్రీరాముఁడు కోరకముందే మన మీ ప్రయత్నమును గావింపఁ జేసినచో గాలాతిక్రమణ దోషముండదు.

శ్లో॥ అకర్తురపి కార్యస్య భవాన్కర్తా హరీశ్వర ।
కింపునః ప్రతికర్తుస్తే, రాజ్యేనచ భయేనచ ॥

స. 29, శ్లో॥31

తా॥ ఓ సుగ్రీవప్రభూ ! నీకుపకారము చేయని వాని కైన నుపకారము చేయు స్వభావము గలవాఁడవు అట్టి యెడల నీకు శాశ్వత మహోపకారము నొనర్చిన శ్రీరాము నకుఁ బ్రత్యుపకారము నీవు చేయవలెనని వేరుఁగా జెప్ప నేల !

కొండత యుపకారమునైన మరువఁదగును. కాని గోరంత యుపకారమును మరువక ప్రత్యుపకార మొనర్చుట బుద్ధిమంతుని ధర్మము.

వానరరాజా ! నీవు సర్వశక్తిమంతుఁడవు. పరాక్రమ శాలివి, కావున శ్రీరాముని కానందమును గలిగించుటకై నీ ప్రతిజ్ఞను నెరవేర్చికొనుము. అతనికి నీవు సీతాదేవి యొక్క యునికిని దెలిపినఁజాలును. ఆతఁడు దేవ దానవ గంధర్వాదు లేకమై వచ్చినను, దన బాణములతో వారి నెల్లరను సర్వ నాశ మొనరించుటలోఁ దన శక్తిని జూపఁగల వీరుఁడు. రాజ వరేణ్యా ! శ్రీరాముఁడు గొప్ప సాహసముతో వాలిని సంహరించి నీకు మహోపకారము గావించినాఁడు. అట్టివాని నానందింపఁజేయుటకై, భూమ్యాకాశములను గాలించి యైనను సీతాన్వేషణ కార్యమును నీవు నెరవేర్చుట ధర్మము. శ్రీరామునకు రావణాదు లెవ్వరును లెక్కలోనివారుగారు సుమా ! ఓ వానర మహారాజా ! మహాపరాక్రమశాలియైన శ్రీరామునకు నీవు ప్రత్యుపకారమును జేయుట ధర్మము. నీ యాజ్ఞయైనచో మాలో నే యొక్కఁడైనను భూమ్యా

కాశములను గావించి సీత యొక్క జాడను దెలిసికొని రాఁగఁలడు. ఎంతటివారికి నెదిరింప సాధ్యముగాని, వానర శ్రేష్ఠులు నీ సన్నిధిని గోట్ల కొలఁదిగానున్నారు. కావున నెవని కేపని నాజ్ఞాపించవలయునో యెఱింగి యట్లుచేయుము. అని హనుమంతుఁడు సుగ్రీవునకు హితము నుపదేశించెను

## సుగ్రీవాజ్ఞ

సుగ్రీవుఁడును హనుమంతుని మాటలకు సంతోషించి శ్రీరామ కార్యమును నెరవేర్ప నిశ్చయించికొనెను. ఆ వెంటనే తన సేనా నాయకుఁడయిన నీలుని బిలిచి "ఓయీ! నీవుపోయి సమస్త దిక్కులందునుగల వానరులనందఱను నాలస్యము గాకుండగా నిచ్చటకు రప్పించుము! నీలా! అచ్చటచ్చటనున్న వేగవంతులైన వానర వీరులనెల్ల, వారి వారి సేనా సమేతముగాఁ ద్వరగా రమ్మని నాయాజ్ఞగాఁ బిలిపించుము! మూఁడు రోజులలో నేఁజెప్పిన వానర వీరు లందఱు నిచ్చటకు రావలెను. గడువు దాటినచో వారికి మరణదండన మేయని తెలియఁజేయుము. ఓయీ! ఈ నా తిరుగులేని యాజ్ఞను బురస్కరించికొని యంగద జాంబవంతాదులకుం జెప్పి కార్య నిమగ్నుఁడవగుము!" అని నీలునకుఁ జెప్పి యా సుగ్రీవుఁ డంతఃపురముం బ్రవేశించెను.

## శరదృతువున - శ్రీరాముని - పరితాపము

ఇక్కడ సుగ్రీవుఁ డంతఃపురముం జేరెరు. అక్కడ

శ్రీరాముడుఁ వర్షకాలమంతయు నెట్లో యతి కష్టముగా గడిపినవాఁడై శరదృతువు ప్రవేశించుటను గమనించెను, వర్షకాలము పోగానే యాకాశమున మేఘములు తెల్లఁబడినవి. చంద్రబింబము సుస్పష్టముగా ప్రకాశించినది. రాత్రివేళ వెన్నెల యాహ్లాదకరమైనది. సుగ్రీవుఁడు కాముకుఁడై భోగించుచుండుటయును దాను సీతా విరహవేదనఁ గలిగి యుండుటయును, నప్పటికే కాల మతిక్రమించుటయును శ్రీరామునకు బాధాకరములైనవి. దానితో శ్రీరాముఁడు మూర్ఛిల్లి కొంతసేపటికిఁ దెలివిఁ దెచ్చికొని, తన మనస్సున సీతాదేవినే స్మరించుచు నుండెను. ఆ శరదృతువున బంగారము, గైరికాది ధాతువులు మొదలగు వానితోఁ ప్రకాశించు నాప్రస్రవణ పర్వత శోభలఁ జూచుచున్న కొలఁదియు శ్రీరామునికి సీతాపరితాప మధికమైనది. ఇంతకుఁబూర్వమీ ఋతువున సీతాదేవి నాతో నాశ్రమ మందుండి సారస పక్షుల ధ్వనివంటి మధుర ధ్వనితో నన్ను బలుకరించెడిది. ఇప్పుడామె యెందున్నదో ? ఎంతగా విలపించుచున్నదో ? బాగుగా వికసించిన వేగిస పూవులను జూచి వాని బంగారు రంగున కెంతో మురిసిపోయెడిది. ఇప్పుడు వానిని జూచి నేను దగ్గర లేకపోవుటచే నెంతగా విలపించుచున్నదో ? అప్పుడు కలహంసల ధ్వనికి మేల్కాంచు నా సుందరాంగి యిప్పుడెట్లు నిద్రమేల్కొనుచున్నదో ? ఆనాఁడు చక్రవాకంబుల మనోహర ధ్వనిని వినుచుండెడిది. లేడి కన్నుల వంటి కన్నులు గల

నా సీత నా సన్నిధి నిప్పుడు లేకుండుటచే నేనీ సుందర వనంబులు మొదలగు వానిని జూచుచున్నను మనస్సు వికలమై యానందించ లేకున్నాము. కామోద్దీపకమైన యీ శరదృతువునందు మన్మథుడు నాసీతా విరహవేదనకు జాలిదలంచి బాధించకుండునుగాక ! చాతకపక్షి జలంబులకై దేవేంద్రుని గూర్చి విలపించినట్లు పురుషోత్తముడై శ్రీరాముడు సీతా నిమిత్తమై విలపించెను. ఆ సమయమున ఫలమూలాదులకై, కొండచరియలకుం బోయి తిరిగి తిరిగి లక్ష్మణస్వామి మరల శ్రీరామ సన్నిధికిం జేరకొనెను. అప్పుడు శ్రీరాముం డేకాకియై, భార్యా విరహదుఃఖముతోం దెలివిందప్పియుండు టను జూచి, యాలక్ష్మణుండు మిక్కిలి విచారములో మునిగి యిట్లనుచున్నాడు.

## శ్రీ రామునకు లక్ష్మణుడు - ధైర్యము చెప్పుట

పూజ్యపాదుండవైన యోరామచంద్రా ! ఇప్పుడీ విధముగాం గామ దుఃఖపరవశుండవై యుండుట వలన నున్న ధైర్యము చెడిపోవునేగాని, మనస్సునకు శాన్తి లభించునా ? మహాధైర్య సంపన్నుండవైన యోరామా ! ఇది మన కార్యసాధనకు యత్నించవలసిన సమయము. అందులకు ముఖ్యమైనది మనోధైర్యము. మఱియుందగిన యుపాయాలోచనము. దేశకాలానుకూల్యమైన సుగ్రీవాది సహకారుల సామర్థ్యమును భగవదనుగ్రహము నందుటకై చేయవలసిన

కర్మంబులు నిష్ఫలము ముఖ్యమైనవి. అంతియేగాని యిట్లు విల పించుట వలనఁ బ్రయోజనమేమి ? నీ వుత్తమ పరాక్రమ శాలివి. మానవనాథుఁడవు. రామభద్రా ! నీవు సజీవుడవై యుండఁగా, సీతను దక్కించుకొనుట యెవ్వనికి నలవిగాదు సుమా ! అగ్ని జ్వాల నొడిలోఁగట్టికొన్నవాఁ డెవఁడైన దహింపఁబడకుండునా ? అని యీ విధముగా లక్ష్మణస్వామి శ్రీరామునకు ధైర్యము చెప్పి కార్యోన్ముఖుని గావించెను.

## శరదృతు వర్ణనము

ధైర్యమును వహించిన శ్రీరాముఁడిట్లను చున్నాడు. తమ్ముడా ! లక్ష్మణా ! నీవు చెప్పిన దంతయును సత్యమే. కార్యదీక్ష గలవారికి ధైర్యోత్సాహములు ముఖ్య కారణ ములే యగుచున్నవి. ముందుగా సీతాన్వేషణకు నాలోచించ వలసిన యవసరమెంతైనఁ గలదు అని పలుకుచునే శ్రీరాముఁడు తామర రేకులవంటి నేత్రములతో విశాల సుందరముఖియైన సీతాదేవిని దలంచికొని, దుఃఖపరవశుఁడై లక్ష్మణుని జూచి మరల యిట్లనియెను. తమ్ముఁడా ! చూచితివా ! దేవేంద్రుఁడు సమృద్ధిగా వానలను గురిపించి, భూమియంతయును బంటలతో నిండునట్లు చేసి తన ధర్మ మును నెరవేర్చికొన్నాఁడు. మేఘములు పెద్ద పెద్ద గర్జన లతో వర్షించి, వర్షించి యలసినట్లు విరమించినవి. మఱియు నీరింకిపోయిన మేఘములు, మదముదీరిన యేనుఁగులవలె నడఁగియున్నవి. వర్షము వలనఁ జల్లనైయుండగాఁ గొండ

మల్లెల యొక్కయు నల్లని పుష్పముల యొక్కయు సువాసనలతోఁగూడిన వాయువు లింతవరకును చక్కగావీచి యాగిపోయినవి. లక్ష్మణా ! ఇప్పు డురుమును నెమిళ్ల కేకలు నేనుఁగుల ఘీంకారములును వినఁబడుటలేదు. ఈ శరత్కాలమున నదులు మెల్లనై నిర్మలములై ప్రవహించుచు, నిసుక తిప్పల నందుందుఁదేల్చుచున్నవి. ఈ దృశ్యము క్రొత్తగా భర్తతో సంగమించి, యలసిన, యువతుల యొక్క జఘనములవలెఁ దోచుచున్నవి గదా ! శరదృతు శోభయంతయు నేడాకుల యరటి చెట్ల యందును, నక్షత్రముల యందును, సూర్య చంద్రకాంతుల యందును,మదపుటేనుఁగులవిలాసలయందును వ్యాపించియున్నది సుమా ! ఆయా నదుల యందలి యిసుక తిన్నెలయందుఁ జక్రవాకంబులును, హంసలును జంటలు జంటలుగా నానందముతో విహరించుచున్నవి. దిక్కు లన్నియును, చీకట్లు లేక, పగలు సూర్యకాంతులతోడను రాత్రులందు జంద్రకాంతులతోడను బ్రకాశించుచున్నవి.

ఎండలు గాయుటచే, బురదలన్నియునుగట్టిపడి, దుమ్ము రేగు చున్నది. పరస్పర వైరభావము గల రాజులు, దండ యాత్రలు చేయుట కిది యుత్తమమైన కాలము. ఆలమందలలోఁగల యాబోతులు మదించినవై, యొకదానితో నొకటి డీకొనుటకుఁ గాలు దువ్వుచు, దుమ్మును బైకి విరఁ జిమ్ము చున్నవి. మదించిన యాఁడయేనుఁగుల గుంపులు మగ

యేనుఁగుల చుట్టును, జేరి తమ కామవాంఛను వెల్లడి చేయు చున్నవి. నెమిళ్లు వర్షకాలము పోగానే, తమ పురులను ముడిచికొని, యందములు దరిగిపోగా, సారసపక్షులు మొదలగు వానిని జూచి, సిగ్గుపడుచున్నవి. మదించిన యేనుఁగులు పద్మముల తోడను జలపక్షులతోడను నందములైన సరస్సులందు దిగి యడుగు నుండి పైకి నీటినంతను గలఁచివైచు చున్నవి. బురదలు లేక పద్మములతో నిండిన నదుల యందు నిర్మలోదకములలో హంసలు విహరించుచున్నవి. వర్షకాలమున వాని వాని బిలముల నిమిడియుండి శరత్కాలము రాగానే పాములన్నియును బయటకు, స్వేచ్ఛగా వచ్చి, తిరుగాడు చున్నవి, శరత్కాలచంద్రుని చల్లని కిరణము లనెడి చేతులచేఁ, బట్టుకొనఁబడిన, నక్షత్రములు (చంద్రుని భార్యలు) నిర్మలములై యానందముగాఁ బ్రకాశించుచున్నవి. లక్ష్మణా! చూచితివా? క్రమముగా నాకాశమున సంధ్యారాగము తగ్గుచున్నది. (ఇచ్చట వాల్మీకి శ్లోకమునఁగల కర, తారకా, అంబర, రాగ, శబ్దములకు రెండర్థములు చెప్పికొన్నచో లోకములో ననుకూలవతియైన యువతి, భర్త యొక్క కరస్పర్శచేఁ దనంతతానే వస్త్రమును దొలఁగించి సురతమునకు సిద్ధపడుచున్నదని కూడ చెప్పవచ్చును. ఇది శ్లేషాలంకారము) తేట నీరు గలిగి యిసుక తిన్నెలు గలదియై, యొడ్ల యందు నాలమందలు గలిగి, మధురముగా ధ్వనించు సారపక్షులచే నందములఁజిందించు నదుల యందు రాజహంసలు చేరి

యూఁగులాడుచున్నవి. నక్షత్రమందలి యురుములు మొదలైన ధ్వనులడఁగిపోయినవి. బెగ్గురు పక్షులు పండిన వరిగింజలను దిని, యానందముగా, వరుసలు దీర్చి యాకాశమున నెగురుచుండఁగాఁ దెల్లని పూలమాల యొకటి యాకాశమున నెగురుచున్నట్లుగా నున్నది. నదీ తీరములయందుఁ దెల్లనైన రెల్లుపూవులు వికసించి యుండఁగా నా నదులు దెల్లని పట్టు పుట్టములను ధరించినట్లున్నవి.

ఇప్పుడు మన్మథుడు చక్కని పూలతోడను దుమ్మెదలతోడను, రమణీయములైన వనములందుఁ జేరి, ధనుర్బాణములను ధరించి, విరహిణీ విరహులను మరింతగా బాధించుచు విహరించుచున్నాఁడు ఓ లక్ష్మణా! బద్ధవైరులగు రాజులు యుద్ధ ప్రయత్నములు చేయుచు, చైత్రయాత్రకు వెడలుచున్న యీ కాలమున నింతవరకును సుగ్రీవుఁడు మనలకుఁ గనఁబడనే లేదు సరిగదా! మన కొఱకై యెట్టి ప్రయత్నము జేయుచున్నట్లైన మనకుఁ దెలియరాలేదు. సీతా విరహవేదనతో నున్న నాకీ వర్షకాలము నాలుగు మాసములును నూరేండ్లుగాఁ గడచినది. ఆడచక్రవాకము మగ చక్రవాకము ననుసరించినట్లు సీత నన్ను వెంబడించి యుద్యానవన విహారనకు బయలుదేరు దానివలె నీ ఘోరదండ కారణ్యములకు నాతో నానందముగా వచ్చినది. నాయనా! వినుము! రాజ్యభ్రష్టుఁడనై, ప్రియురాలి నెడఁబాసి, దుఃఖించుచున్న నా యందు సుగ్రీవునకుఁగూడ దయరాకున్నది. శత్రుహంతకుఁడ

వైన యో లక్ష్మణా ! సమయము వచ్చినప్పుడు సౌమ్యుఁడవై కార్యమును సాధించఁగలవు. ఆ సుగ్రీవుఁడును "ఈ రాముఁడు రాజ్యభ్రష్టుఁడై, భార్యను బోఁగొట్టుకొని దీనుఁడై చాల దూరము నుండి వచ్చి, నన్ను శరణుఁ జొచ్చి నాఁడు" అని దుర్భావనముతో నా వలన మహోపకారమును ముందుగా నందియును నన్ను నిర్లక్ష్యము చేసి, యవమానించుచున్నట్లున్నది సుమా ! ఆతఁడు "శరత్కాలము ప్రవేశించఁగనే సీతాన్వేషణ ప్రయత్నమును గావించెద"నని ప్రతిజ్ఞఁజేసియును, నేమియును సంబంధము లేనట్లూరుకొని నాఁడు. కావున నోతమ్ముఁడా ! పరమమూర్ఖుఁడై స్త్రీ లోలత్వముతో, భోగలాలసుఁడై మైమరచియున్న యాతని కడ కేగి నా మాటల నీ విధముగాఁ జెప్పుము.

శ్లో॥ అర్థినా ముపపన్నానాం పూర్వంచా ప్యుపకారిణామ్ ।
ఆశాం సంస్కృత్య యోహన్తి, సలోకే పురుషాధమః ॥
స. 30 శ్లో॥ 71

తా॥ అర్థియై వచ్చిన వానికి, నందును ముందుగా నుపకారము చేసినవానికి, నీ కార్యమును దప్పక నెరవేర్చెద" నని ప్రతిజ్ఞఁ జేసి మిత్రునకుఁ గొండంత నాశను గలిగించి యా వెనుక తన మాట నెవఁడు తప్పుచున్నాఁడో వాఁడే పురుషాధముఁడు,

ఏ సంబంధమును లేనివానికైనను మాటయిచ్చి తప్పకుండుట ధర్మము. అందులో ముందుగా నుపకారమును

బొంది 'ప్రత్యుపకారము చేయుదు'నని యగ్ని సాక్షిగాఁ బ్రతిజ్ఞఁ జేసియుండు, మాటఁదప్పుట కంటె యధర్మమింకొంటి లేదు.

శ్లో॥ శుభంవా, యదివాపాపం, యోహివాక్య ముదీరితమ్ ।
సత్యేన ప్రతిగృహ్ణాతి, సవీరః పురుషోత్తమః ॥
స. 30, శ్లో-72

తా॥ తాను జేసిన ప్రతిజ్ఞను మంచిచెడ్డల నాలోచించక మాట దప్పక యెవఁడు నెరవేర్చునో వాఁడే పురుష శ్రేష్ఠుఁడనిపించికొనును.

ముందుగాఁ జేసిన ప్రతిజ్ఞను, దరువాత మంచిచెడ్డల నాలోచించక నెరవేర్చినవాఁడే వీరుఁడు. పురుషశ్రేష్ఠుఁడు నగుచున్నాఁడు.

శ్లో॥ కృతార్థా హ్యకృతార్థానాం, మిత్రాణాంచ భవన్తియే ।
తాన్మృతానపి క్రవ్యాదాః కృతఘ్నాన్నోపభుఞ్జతే ॥
స. 30. శ్లో॥ 73

తా॥ తన స్నేహితుని వలన నుపకారమును బొందియు, నామిత్రుని గష్టకాలమున నాతనికిఁ బ్రత్యుపకారము నెవఁడు చేయఁడో వానిని శత్రుఘ్నుఁడని లోకులు నిందింతురు. మఱియు, నట్టివాఁడు చనిపోయినను మాంసాహారులై, జ్ఞానములేని నక్కలు మొదలైన జంతువులు గూడ వాని శరీరమును ముక్కుతో వాసననైనఁ జూడవు.

కృతఘ్నత్వమనునది, యిహమందు నిందలపాలుచేసి, పరమందు రౌరవాది నరకములందు బడవేయును. కావున నెల్లవారును గృతజ్ఞులై యుండుట ధర్మము.

తమ్ముఁడా! బంగారపు జివరి భాగములుగల నా యొక్క మహాధనుస్సు నెక్కు-వెట్టగా, మెఱుపులవలెఁ బ్రకాశించు బాణముల నా సుగ్రీవుఁడు చూడఁదలఁచి నాఁడేమో? అసలు నా ధనుస్సు యొక్క గుణటంకారము వజ్రాయుధ ధ్వనివలె మ్రోగఁగా వినఁదలఁచినాఁడేమో? సాల వృక్ష భేదనము, వాలి వధ, మహాపరాక్రమశాలివైన నీ తోడ్పాటును, గలిగియున్నానని తెలిసియు, నా సుగ్రీవుఁడు కాలాతిక్రమణ మొనరించి మిన్నకున్నాఁడు. నేను సుగ్రీవుని సఖ్య మొనర్చి, యెందుకొఱకు నా ప్రతిజ్ఞను నెరవేర్చితినో, యద్దానినే యాతఁడు నిర్లక్ష్యము చేసినట్లున్నది, మంత్రులు మొదలగు వారితో మద్యమును ద్రావుచు, మైమరచి, వర్షకాలము గతించినట్లుగాని, శరత్కాల మారంభమైనట్లుగాని, తన ప్రతిజ్ఞా సమయ మతిక్రమించినట్లుగాని, తెలిసికొనలేకున్నాఁడు సుమా! పైగా దుఃఖితుఁడనైన నా విషయమే స్మరించినట్లు లేదు. తమ్ముఁడా! నీ విప్పుడే కిష్కింధకు వెళ్లి, నా యొక్క కోప మేమి చేయునో సుగ్రీవునకుఁ దెలియఁ జేయుము. మఱియు వాలికిఁ బట్టిన గతిని బొందకుండుమని నా మాటలుగాఁ జెప్పుము. ఆ వాలి నొక్క బాణముతోడనే సంహరించితిని. నీవు సత్యము నతిక్రమించిన వాఁడ

వచుటచే బంధుమిత్ర పరివారముగా హతుఁడవు కాఁగల వని యును జెప్పుము. బుద్ధిమంతుఁడవైన యో తమ్ముఁడా ! మన పరిస్థితి యిట్లున్నది. కావున నీవు త్వరగా వెళ్లి, నేను జెప్పి నట్లేగాక సమయానుకూలముగాఁ గార్యసాధనకు నేయే మాటల నెట్లు చెప్పవలెనో యట్లే మాట్లాడుము. ముఖ్య ముగా "సుగ్రీవా ! నీవు నాతోఁ బ్రతిజ్ఞ చేసిన కార్యమును నెరవేర్చి, శాశ్వత కీర్తి నందుము ! అట్లుగానిచో, నా కోప మునకు గురియైన వాఁడవై యమలోకమున వాలిని గలియఁ గలవు" అని చెప్పుము. ఇట్లు శ్రీరాముఁడు లక్ష్మణునకుఁ జెప్పఁగా లక్ష్మణుఁ డన్న యొక్క దుఃఖమును గోపమును గ్రహించి భయంకర పరాక్రముఁడై సుగ్రీవునిపైఁ దానును గ్రోధమును వహించెను.

## శ్రీరాముఁడు - లక్ష్మణుని కోపమును - శాంతింపఁ జేసి - కిష్కింధ కంపుట

శ్రీరామునితో లక్ష్మణుఁడిట్లను చున్నాఁడు. అన్నా! శ్రీ రామచంద్రా ! ఆ సుగ్రీవుఁడు తనకుఁ జేసిన యుప కారమును మరచి ప్రత్యుపకారము చేసెదనన్న, ప్రతిజ్ఞను గూడ నిలుపుకొనలేక పోయినాఁడు. శ్రీరాముని మూలము ననేగదా భార్యా సంగమప్రాప్తియేగాక, వానర రాజ్య మంతయును లభించిన దన్న గుర్తు గూడ నతని కున్నట్లు తోఁచదు. కావున మన కార్యమున కాతఁడను కూలించఁడు.

ఇంక వాలి కీ వానర రాజ్యము గూడ దక్కదు. శ్రీరామ చంద్రా ! గ్రామ్య సుఖములను మరిగి దుర్బుద్ధియై యున్నాఁడు. కావున నిప్పుడే నా చేతిలో వాఁడు చచ్చి, తన యన్న వాలిని జేరుఁగాక ! ఇంతటి కృతఘ్నునకు రాజ్యము నొసంగరాదు. అన్నా ! ఈ కోపము నిముడ్చు కొనలేను. అసత్యవాదియైన సుగ్రీవుని వధించెదను. అంగదుని ద్వారా సీతాన్వేషణ కార్యమును జరిపించి సఫలత నొందవచ్చును అని కోప మాపుకొనలేక పలుకుచున్న లక్ష్మణుని శాంతింపఁ జేయుచు శ్రీరాముఁ డిట్లనుచున్నాఁడు.

శ్లో॥ నహి వై త్వద్విధో లోకే పాపమేవం సమాచరేత్ ।
పాప మార్యేణ యో హన్తి సవీరః పురుషోత్తమః ॥

స. 31, శ్లో-6

తా॥ నాయనా ! తమ్ముఁడా ! నీవంటి ధార్మికుఁడు మిత్రుని జంపి పాపమును జేయఁడు సుమా ! తనకుఁ గలిగిన క్రోధము నాపుకొని యెవఁడు పాపమును జేయఁడో, యట్టి ధీరుఁడే పురుషోత్తముఁడనఁబడును.

ఏ పాపమున కైనను గోపమే మూల కారణము. ఉపయోగించరాని స్థలమునఁ గోపమును ప్రయోగించుట ధర్మము గాదు, అస్థానకోపకారణమున్నను దానిని నిగ్రహించి కొన్న వాఁడే పురుషోత్తముఁడు. తనకుగాని, ధర్మమునకుఁగాని, హాని కలుగకుండువరకును శాంతము వహించుటయే యహింస. ఇదియే పరమధర్మము.

లక్ష్మణా ! నీవు సదాచార సంపన్నుఁడవు. కావున నిట్టి పాప కార్యమును జేయరాదు. ఇంతకుఁ బూర్వము మనము సుగ్రీవునితోఁ జేసికొన్న మైత్రిని బురస్కరించికొని, యెప్పటి గౌరవాదరములనే గలిగియుండుట మన ధర్మము. సుగ్రీవుఁడు సకాలములో రాకపోవుటయన్నది ఘోరమైన మరణశిక్షకుఁ దగిన దోషము గాదు. కావున నీవతని వద్ద కేగి, కఠినముగ మాటలాడక, మంచిగనే ప్రసంగించుము అని శ్రీరాముఁడు తమ్ముని శాంతింపఁజేసిపంపెను. మహావీరుఁడైన లక్ష్మణుఁడు నన్నయొక్క మాటలను శ్రద్ధగావిని ధనుర్బాణముల ధరించి కిష్కింధకు వెళ్లెను.

## భయంకరాకారుఁడై లక్ష్మణుఁడు కిష్కింధ కేగుట

శ్రీరాముని ధర్మవచనములను విన్న లక్ష్మణుఁడు, కిష్కింధకు బయలుదేరి మంగళకరమైన బుద్ధితో మిత్ర హితమును గోరినవాఁడగుచు సుగ్రీవుని భవనమునకుఁబోయెను. రామాజ్ఞనతిక్రమించక, బుద్ధియందు బృహస్పతియైన లక్ష్మణుఁడు ముందుగాఁ ద్రోవలో సుగ్రీవునితో నెట్లు మాట్లాడవలెనో, యాతని కెట్లు సమాధానము చెప్పవలెనో యాలోచించుచుఁ బోయెను. అన్నగారి భార్యావియోగ దుఃఖము నుండి పుట్టిన క్రోధాగ్నిని గ్రక్కుచున్నవాఁడై, యతివేగముగా క్షణకాలములో నచటికిఁ జేరికొనెను. మఱియునతఁడు తన త్రోవ

కడ్డములైన, మద్ది మొదలగు మహావృక్షములను బడఁ గొట్టుచుఁ బెద్ద పెద్ద బండరాళ్లను గూడ పిండిగాఁజేయుచు నడిచి వెళ్లెను. ఇక్ష్వాకువంశోత్తముఁడైన లక్ష్మణుఁడు వానర సైన్యముచే రక్షింపఁబడుచున్న కిష్కింధాపురమును జూచెను. ఆ వానరులను గోపముతోఁ బెదవులదరు చుండఁగాఁ జూచెను. ఆ వానరులును బర్వతంబుల మధ్య నుండి వేగముగా వచ్చుచున్న లక్ష్మణుని జూచి, శత్రు వెవ్వఁడో వచ్చుచున్నాఁడని తలఁచి యుద్ధసన్నద్ధులై, మహా వృక్షములను బర్వతములను ధరించి నిలిచిరి. అట్టివారిని జూచి రెట్టించిన కోపముతో, లక్ష్మణస్వామి గనుపించెను. ఆతని వేగమును గోపమును ధనుర్బాణములను జూచిన యా వాన రులు నలుమూలలకును బరువు లెత్తిరి. కొందఱు మహాకోప ముతో లక్ష్మణుఁడు వచ్చుచున్న వార్తను సుగ్రీవున కందిం చిరి. సుగ్రీవుడు మద్యపాన మదోన్మత్తుఁడై యంతఃపుర స్త్రీలతో విహరించుచున్న సుగ్రీవున కావార్త చెవికెక్క లేదు. కాని తెలివైన మంత్రులు మహాకాయులైన వానరు లను బిలిచి, లక్ష్మణుని జూచివచ్చి. యథార్థమును జెప్పుఁడని పంపిరి. ఆ లక్ష్మణుఁడు గూడ మహాకోపముతో నెంతటి వారికిని ప్రవేశింపనలవిగాని కిష్కింధా పురమును బ్రవే శించెను. మంత్రులు పంపఁగావచ్చిన వానర వీరు లాలక్ష్మ ణుని జూచిరి. లక్ష్మణుఁడును దనయన్న శ్రీరాముని భార్యా విరహ దుఃఖమును దలఁచి, మహాక్రోధముతో, సుగ్రీవ భవన సింహ ద్వారమున నిలిచెను.

అతఁడు వేడి నిట్టూర్పులను నిగుడించుచు, నెఱ్ఱని కన్నులు గలిగి పొగలతోఁ గూడిన యగ్ని హోత్రమువలెఁ గనుపించెను. లక్ష్మణుని బాణములే నాలుకలుగను, శిరస్సే పడగగను, నతని తేజస్సే విషముగను నయి, యైదుతలలుగల మహా సర్పమువలె భయంకరుఁడయ్యెను. అట్టి లక్ష్మణుని జూచిన యంగదుఁ డాదిశేషుని జూచిన వానివలె గడగడ వడంకెను అతఁడట్టి యంగదునితోఁ, సుగ్రీవునకుఁ జెప్పవలసిన మాటల నీ విధముగాఁ బలికెను. "ఓయీ ! అంగద కుమారా ! సుగ్రీవునకు నారాకను గూర్చి తెలియఁజేయుము. శత్రు సంహారకుఁడైన శ్రీరాముని దుఃఖ భారమును వహించిన, లక్ష్మణుఁడు నిన్ను జూడ వచ్చినాఁ"డని చెప్పుము. ఆ మాటలను విన్న యంగదుఁడు దుఃఖితుడై, సుగ్రీవ సన్నిధికిఁబోయి "మహారాజా ! ఇదే లక్ష్మణుఁడు నీ దర్శనార్థమై వచ్చియున్నాఁడు" అని చెప్పి దుఃఖ భారముతో సుగ్రీవ పాదములకు నమస్కరించెను. మఱియు నచ్చటనేయున్న తన తల్లి తారకును రుమా దేవికిని పాదాభివందనములు చేసెను. తరువాత నతఁడు లక్ష్మణుఁడు చెప్పి పంపిన మాటలనుగూడ నాసుగ్రీవునితోఁ జెప్పెను. అప్పటికిని మన్మథ క్రీడాశక్తి మత్తును నా సుగ్రీవుని విడువలేదు. క్రోధోద్రిక్తుడైన లక్ష్మణుని శాంతింపఁ జేయుటకై యచ్చటనున్న వానరులు కిలకిలా రావములఁ గావించిరి. ఆ ధ్వనికి సుగ్రీవుఁడెఱ్ఱని కన్నులతోఁ, దారుమారుగానున్న మెడలోని పూలమాలలతోఁ గన్నులు

దెరచి తెలివి నొందెను. అంతలో నంతఃపుర ప్రవేశమునకు నర్హులైన, ప్లక్షుఁడు, ప్రభావుఁడు ననుమంత్రు లంగ దునితోఁ గలిసి సుగ్రీవ సన్నిధిని బ్రవేశించిరి. ధర్మార్థముల విషయమై చర్చించుటకు లక్ష్మణుఁడు వచ్చి, సింహ ద్వార మున నిలిచియున్నాఁడని యాతనితో విన్నవించిరి.

ఆ సమయమున స్వర్గమున నింద్రునివలె సింహాసన మునఁ బ్రకాశించు నా సుగ్రీవుని వారు శాంతివచనముల చేఁ బ్రసాదుని గావించికొని, సమీపమునఁ గూర్చొని యిట్లనిరి. "మహారాజా ! వినుము ! అన్నమాటను దప్పనివారును, సమస్త భూమిని బరిపాలించుటకుఁ దగినవారును, నీతో మైత్రిని గావించి, నీకు రాజ్యము నిచ్చిన వారును నగు, రామలక్ష్మణులు గలరు గదా ! వారిలో నొకఁడైన లక్ష్మ ణుఁడు ధనుర్బాణములను ధరించి మన సింహద్వారమున నిలిచినాఁడు. అతనిని జూచి, మన వానరులందఱును భయ ముతో గొప్పగా ధ్వనులఁ గావించుచున్నారు. ఆ లక్ష్మ ణుఁడు తనయన్నగారి మాటలను వినిపించుటకై, యిటకు వచ్చియున్నాఁడు. ప్రభూ ! తారాపుత్త్రుఁడైన యంగదుని గూడ నీ వద్దకుఁ బంపియున్నాఁడు. అతఁడు మహా క్రోధ ముతో నెఱ్ఱబడిన గ్రుడ్లతో, వానరుల నందఱను దన నేత్ర ముల తోడనే ద్రాగివేయునేమో ? యన్నట్లుండి, మన సింహద్వారమున నిలిచియున్నాఁడు. మహారాజా ! నీవు బంధుమిత్ర పరివారముగా వెళ్లి, యాతని పాదములకు నమ స్కరించి, శాంతింపఁజేయుము. ధర్మాత్ముఁడగు శ్రీరాముఁడు

నీ క్షేమని యాజ్ఞాపించెనో, తెలిసికొని, వానిని నెరవేర్చి నీ మర్యాదను గాపాడుకొనుము" అని యామంత్రు లిరువురును సవినయముగా విన్నవించిరి.

## హనుమంతుని - హితవచనములు

సుగ్రీవుఁడంగదుని వలనను మంత్రుల వలనను లక్ష్మణుఁడు క్రోధముతో వచ్చియుండుటను దెలిసికొని, యొక్కమారుగా భయభ్రాంతుఁడై, సింహాసనము నుండి, దిగిపోయెను, అంత దూరాలోచనాపరుఁడైన సుగ్రీవుఁడు లక్ష్మణుని రాక నెఱింగి బుద్ధిమంతులను విశ్వాసపాత్రులునైన మంత్రులను బిలిచి యిట్లనియెను. నేనెక్కడను నెవరితోడను దప్పుగా మాటలాడలేదు గదా ! ఏ తప్పుపనియును జేయలేదు గదా ? అయినను లక్ష్మణస్వామి కింత కోపము గలుగుటకుఁ దగిన కారణము దెలియకున్నది. ఎల్లవేళలను నాలోపములను గనిపెట్టుటకుఁ బొంచియుండు నా శత్రువు లాతనికి లేనిపోని మాటలను జెప్పియుందురు మంత్రులారా! ఇప్పుడు మీ మీ బుద్ధులతో నాలోచించి యేమి జరిగియుండునో, తెలిసికొని చెప్పుడు ! తొందరపాటు పనికిరాదు. ఈ రాముఁడన్నను లక్ష్మణుఁడన్నను, నాకెంత మాత్రమును భయము లేదు. అయిన నగ్నిసాక్షిగా మైత్రిఁగావించికొనిన మిత్రుఁడకారణముగాఁ గోపించుటఁబట్టి నాకుఁ దొట్రుపాటు గలుగుచున్నది. మిత్రుని సంపాదించుట మిక్కిలి సులభమే. ఆ పైని మైత్రిని నిలుపుకొనుటలోనే కష్టమంతయు నున్నది. స్వామా

ముగా మనస్సు చంచలమైన దగుట వలన నేమాత్రము వైషమ్యము గలిగినను మైత్రి చెడిపోవును.

శ్లో॥ సర్వథా సుకరంమిత్రం దుష్కరం పరిపాలనమ్ ।
అనిత్యత్వాచ్చ చిత్తానాం ప్రీతిరల్పేఽపి భిద్యతే ॥
స. 32, శ్లో-7

తా॥ సర్వ సద్గుణ సంపన్నుఁడైన, మిత్రుని సంపాదించికొనియు, నాతనితోఁ మైత్రిని జివరివరకును నిలిపికొనుట చాల కష్టమైనపని. మనస్సు నిలుకడలేని దగుటచే, నేమాత్ర మనుమానము గలిగినను, విడిచిపోవును. (మైత్రికి భంగము గలిగించును.)

దేనినైనను విడువవచ్చును గాని సద్గుణ సంపత్తి గలిగిన వానితోఁ గలిగినమైత్రిని విడుచుట ధర్మముగాదు. దానికి భంగము రానీయకుండ నిగ్రహము గలిగియుండుట ముఖ్య ధర్మము.

మంత్రులారా ! శ్రీరాముఁడు నాకుఁజేసిన మహోపకారమునకు సమానమైన ప్రత్యుపకారము చేయుట సాధ్యముగానిపని. ఆకారణముగా, నేను భయపడుచున్నాను అని సుగ్రీవుఁడు మంత్రులతోఁ బలికెను. అంత నామంత్రుల మధ్య నున్న హనుమంతుఁడు లేచి, యిట్లనియెను. మహారాజా ! నీవంటి బుద్ధిమంతుఁడు, ముందుగా నుపకారము చేసిన మిత్రుని విషయమై, కృతజ్ఞతతోఁ బ్రత్యుపకారము చేయవలెనన్నది మరువకుండుట యాశ్చర్యముగాదు.

ఆ శ్రీరాముఁడు నీ యానందమునుగోరి, యింద్ర పరాక్రముఁడైన వాలి నొక్క బాణముతోఁ జంపినాఁడు. అట్టి శ్రీరాముఁడు నీపైఁ బ్రణయకోపముతో నీ వద్దకు లక్ష్మణుని బంపియుండును. ఇది నిశ్చయము. కాలము యొక్క విలువ నెఱిఁగిన వారిలో నీ వుత్తముఁడవు. అట్టి నీవీ గ్రామ్య సుంఖబులకు లోఁబడి, మైమరచి కాలము నతిక్రమించితివి. ఇప్పుడు వర్ష ర్తువు పోయినది. శరదృతువు వచ్చినది. కావున నిది యుద్ధ యాత్ర కనుకూలమైన కాలము. అయినను నీవా ప్రయత్నమును మాని ప్రమత్తుండవై యుండుట చే శ్రీరాముఁడు లక్ష్మణుని బంపియుండును. భార్యా విరహముచే బాధపడుచు నీకింతకుఁబూర్వమే యుపకార మొనర్చిన యా శ్రీరాముఁడు కాలాతిక్రమణకుఁ గోపించి, లక్ష్మణుని బంపుటలో ననౌచిత్యమేమున్నది ? ఆతని కోపమును నీవు సహించి తెలివిగాఁ బ్రవర్తించుట మంచిది. మిత్రకార్యమును సకాలములో నెరవేర్పఁ బ్రయత్నించక పోవుటచే దోషము మనదే యగును. కావున నీవు లక్ష్మణునకు క్షమాపణఁ జెప్పి, యాతని నిప్పట్టున శాంతింపఁజేయుటయే ప్రథమ కర్తవ్యము.

ప్రభువు కోరినప్పుడాతని క్షేమమును గోరు మంత్రులు హితమునే చెప్పవలెను. కావున నీ హితమును గోరి యిప్పుడీ యుపాయమును జెప్పితిని. శ్రీరాముఁడు కోపించినచో దేవాసుర గంధర్వ సహితముగా విశ్వమునంతను దనకు స్వాధీనము గావించికొనఁగలఁడు. అది నీకుఁ దెలియనిది కాదు. మహా

పరాక్రమశాలి మిత్రుఁడై కోపమును జెందినప్పు డాతనిని ప్రసన్నుని గావించికొనుట ధర్మము. అందును ముందుగా నుపకార మొనర్చిన వానికిఁ గోపము గలిగించుట నీతిగాదు. కావున మహారాజా! ఇప్పుడు నీ భార్యా పుత్త్రి బంధు పరివారాదులతో, లక్ష్మణుని క్షమాభిక్ష వేడికొని, శాంతింపఁజేసి నీ ప్రతిజ్ఞా పాలనకుఁ బూనికొనుము. ఈ సమయమున నింతకంటె వేరొక యుపాయము నాకుఁదోఁచలేదు. నీవు భర్తకు వశమైన భార్యవలె లక్ష్మణుని ప్రసన్నుని గావించికొనుము. ఓ వానరరాజా! ఆ శ్రీరామలక్ష్మణుల యాజ్ఞల నతిక్రమించుట యెంత మాత్రమును మంచిదిగాదు. మన స్సునఁగూడ నట్లూహింపరాదు. దేవేంద్ర సమానులగు రామలక్ష్మణుల శస్త్రాస్త్రబలములేగాక దేహబలంబులుగూడ నీకుఁ దెలిసినవే. (దుందుభికాయము నెగురఁజిమ్మినప్పుడు రాముని శరీరబలమును సప్త తాళముల నొకే బాణముతోఁ బడఁగొట్టినప్పుడు రాముని శస్త్ర బలమును నీకుఁ దెలిసినదే యని భావము) అని సుగ్రీవునకు నాంజనేయుఁడు నిర్మొగమాటముగా హితమును జెప్పెను.

## కిష్కింధాపుర వైభవము-సుగ్రీవుఁడు భయకంపితుఁడగుట

శ్రీరామాజ్ఞానుసారముగా వచ్చిన లక్ష్మణుని జూచి యా కిష్కింధాపురమునఁ గావలియున్న మహాబలవంతులై యేనుగుల వంటి వానర వీరులందఱును భయపడి యాతని

దగ్గరకైనఁ జేరలేకపోయిరి. వారు దూరమునుండియే చేతులు జోడించికొని నిలిచిరి. అచ్చట లక్ష్మణుఁడు మహా కోప ఘూర్ణిత నేత్రుఁడై, వేడి నిట్టూర్పులను నిగుడించుచు, ధనుర్ధారియైయున్నవానిం జూచి, ద్వార పాలకులై మహాబలులైన వానరులు గూడ దూరముగాఁ దప్పుకొనిరి. గుహా రూపకమైన యాపురమంతయును రత్నమయమై, పుష్పించిన వృక్షములును బొదలునుగల యుద్యానవనములు గలదై ప్రకాశించుటను లక్ష్మణుఁడు చూచెను. పెద్ద పెద్ద మేడలు గల భవనములును ఫల పుష్పభరిత వృక్షములును, నాతనికిఁ గనుపించినవి. అందలి వానరులందఱును, దేవతలకును గంధర్వులకును జన్మించి కామరూపులై యుండిరి. దివ్యమాలికా తోరణముల తోడను మంచి గంధపు సువాసనలతోడను, మద్య పదార్థములు తేనెలు మొదలగు వానితోడను, నిండిన గృహములు గలిగి, విశాలములైన రాజమార్గములు గలిగి, యాకిష్కింధాపురము ప్రకాశించుచుండగా లక్ష్మణుఁడద్దానిని జూచెను. మఱియు నంగద, ద్వివిద, మైన్ద, గవయ, గవాక్ష, గజ, శరభ. విద్యున్మాలి, సంపాతి, సూర్యాక్ష, హనుమంత, వీరబాహు, సుబాహు, నళ, కుముద, సుషేణ, తార, జాంబవంత, దధివక్త్ర. నీల, సుపాటల, సునేత్రాది వానర శ్రేష్ఠుల గృహముల నన్నిఁటిని, మహాశోభాయమానమైనవిగా లక్ష్మణుఁడు చూచెను. వారి వారి భవనము

లన్నియును బూలమాలాలంకృతములై ధనధాన్య సమృద్ధములై యుత్తమజాతి స్త్రీలతో విరాజిల్లు చున్నవి.

మఱియు వెల్లసి ప్రాకారము గలిగి, యెంతటివారికిని ప్రవేశింప శక్యముగానిదై, దేవేంద్ర భవనమువలె రమణీయమైన సుగ్రీవుని రాజభవనమునుగూడ లక్ష్మణుఁడు చూచెను. అచ్చట నున్న ప్రతి సేవకుఁడును, దివ్యమాల్య వస్త్రాభరణాదుల నలకరించికొని నిత్యతృప్తుఁడై యుండెను. వెఁడియు నంతఃపుర స్త్రీలు తాము యందెలును మొలనూలు చిఱుగంటలును జప్పుడు చేయుచుండఁగా సర్వాభరణ భూషితలై యుండిరి. అట్టి వారిని జూచి లక్ష్మణస్వామి సిగ్గుపడెను. (ఇచ్చట లక్ష్మణస్వామియొక్క పరస్త్రీ వైముఖ్యము ద్యోతకమగును.) అట్టివారిని జూచి వారి యాభరణ ధ్వనులను వినుచున్న లక్ష్మనకుఁ గోప మధికమైనది. (సుగ్రీవుని భోగలాలసత్వమునకుఁ గుపితుఁడయ్యెను.) అంత నాతఁడు ధనువునెక్కువెట్టి గుణష్టంకారము గావించెను. శ్రీరామునకు సుగ్రీవునందుఁగల కోపమును సూచించుచు లక్ష్మణుఁడు సత్పురుష లక్షణమును దెలియ జేయుచు, స్త్రీలు గనఁబడుచున్న స్థలమునకు దూరముగాఁ జాలున నిలువఁబడెను. ఆ సమయమున లక్ష్మణుని ధనుస్సునుండి పుట్టిన గుణష్టంకారమును విన్న సుగ్రీవుఁడు సమున్నతాసనమున నుండియును భయముతోఁ జలించిపోయెను. మఱియు నింతకు ముందు నంగదుఁడు చెప్పినట్లే. లక్ష్మణుని కోపమును దెలిసికొనెను. అంతియేగాక సుగ్రీవునకు భయమువలన నోరెండిపోయినది.

## తార-లక్ష్మణుని-శాంతింపఁజేయుట

సుగ్రీవుఁ డట్లో కొంతసేపటికి తేరుకొని తన యంతః పుర స్త్రీలలో నున్న తారాదేవిని బిలిచి తనకుఁ బ్రియంబును హితంబును గలుగునట్లుగా నామెతో నిట్లనెను. సుందరముగా గను బొమ్మలను ద్రిప్పుచునెట్టి వారినైన నాకర్షింపఁ గల యో తారా ! లక్ష్మణుఁడు స్వభావముగా సౌమ్యుఁడే. అట్టి వాఁడింతటి భయంకరాకారుఁడై యిచ్చటకు రాఁ గారణ మడిగి యాతనికి నీవాక్చాతుర్యముచే దృప్తిఁ గలిగించి, శాంతింపఁజేయుము. నేనేమైనను రామలక్ష్మణుల కప్రియము గలిగించితి నేమో? తెలిసికొని తగిన రీతిగా విషయముం జూపి మాటలాడుము, మహాత్ములు స్త్రీలయెడ గోపమును జూపరు. కావున నిన్ను జూడఁగనే లక్ష్మణుఁడు తన కోపమును విడిచి మాటలాడును. నీవు వెళ్లుము ! ఆతనిని శాంతింపఁజేసి నీవు రాగానే నేనాతనిని సందర్శించుదును. అనఁగా విని తార మద్యపానమత్తయై తూలి పోవుచు బంగారు మొలనూలు మొదలగు నాభరణ ధారిణియై వయ్యారముగా నడచుచుం దిన్నగా లక్ష్మణస్వామి సన్నిధికి వెడలినది.

ఆ విధముగా మద్యపాన వివశయయి సంభోగ చిహ్నములతో వచ్చిన తారను జూచిన లక్ష్మణుఁ డామె శృంగార చిహ్నములం దెంత మాత్రమును దృష్టినిడక యుదాసీనుఁడై, స్త్రీ సన్నిధి యగుటచేఁ గోపమును నిగ్రహించికొని శిరస్సును వంచి నిలువఁబడెను. తారయును లక్ష్మణుని వైఖరిని గమ

నించి, స్వాగత మధుర వాక్కులతో, నధికమైన యర్థములు గలుగునట్లుగా నిట్లనెను. ఓ దశరథ మహారాజకుమారా! నీకు మా స్వాగతము! ఇప్పుడింతలో నీకు గోపకారణమేమి గలిగినది? నీమాపకుఁ దిరుగు లేదుగదా! అడవిలో నెండి పోయిన వృక్షములఁ గాల్చుచున్న దావాగ్ని చెంత కెవఁడు పోఁగలడు? అనగా నా నిష్కపటంబులై, సాంత్వన పూర్వకములై స్నేహయుక్తంబులైన, తార మాటలను విని, లక్ష్మణుఁడిట్లనియెను. భర్తృ హితమును గోరుతారా! ఈ సుగ్రీవుఁడు రాత్రింబవళ్లు కామపరవశుఁడై, ధర్మార్థములను మరచి నాఁడు. నీకీ విషయము తెలియదా? మఱియు రాజ కార్యములను జూడక, దుఃఖభాగులమైన మమ్ముఁదలఁపక భార్యలను గూడి, సత్యపానమత్తుఁడై యున్నాఁడు. ఆతఁడు రావణునిపై యుద్ధ సన్నాహములఁ గావించుటకు, వర్ష కాల మగుటచే నాలుగు మాసములు గడువును గోరి యిప్పుడా గడువు నతిక్రమించి మదమత్తుఁడై, స్త్రీలోలుఁడై యున్నాఁడు. ధర్మార్థములఁ గోరువాఁ డెవ్వఁడు, నీ విధముగాఁ బ్రవర్తించఁడు. పానము వలన ధర్మార్థములు నశించును. ఉపకారికిఁ బ్రత్యుపకారము చేయనిచో ధర్మలోపమును ఆ కారణముగా సద్గుణవంతుఁడైన మిత్రుని బోఁగొట్టుకొనుటచే నర్థలోపమే గాక, కామముగూడ లోపించి నశించఁగలఁడు. సత్య ధర్మములందు సుస్థిరుఁడైన మిత్రుని ధర్మార్థకామములకు మూలాధారునిగాఁ దలఁచవలెను, అట్టి మిత్రుని సుగ్రీవుఁ డీనాఁడు విడనాడుకొనుచున్నాఁడు. కావుననే సుగ్రీవున కర్థ

కామములు నశించును. దానితో ధర్మము పూర్తిగా నశించును.

శ్లో॥ తదేవం ప్రస్తుతేకార్యే కార్య మస్మాభి రుత్తరమ్ ।
యత్కార్యం కార్యతత్త్వజ్ఞే, తదు పాహర్తు మర్హసి ॥
స. 33, శ్లో-48

తా॥ కార్య స్వరూపమును తెలిసిన యో తారా! సుగ్రీవుఁడిప్పుడు, ధర్మార్థ కామములను జెడఁగొట్టికొని, యుపకారికిఁ బ్రత్యుపకారమును జేయక మిత్రులమైన మమ్ము నుపేక్షించినచో నాపై నాతని విషయమై, మేమేమి చేయ వలయునో నీవే వచించుము.

మద్యపానము స్త్రీలోలత్వము ననునవి మానవుని కృతఘ్నునిగాఁ జేసి ధర్మార్థకామములను నశింపఁజేయును. కావున మద్యపాన స్త్రీలోలత్వములను విడిచి ప్రవర్తించుట ధర్మము.

లక్ష్మణుని మాటలను విన్న తార లక్ష్మణుఁడు కోపముతో వచ్చిన ప్రయోజనమును గ్రహించినది. తరువాత యథార్థము నిట్లని చెప్పఁ దొడఁగెను. లక్ష్మణవీరా! కామవశుఁడైన సుగ్రీవునిపైఁ గోపించకుము. అతఁడు మీకు మిత్రుఁడై యున్నాఁడు. మీ కార్య సాధనలో నీతఁడత్యంతాసక్తుడైయున్నాఁడని నమ్ముము. అయినను గామపరవశత్వముతో నించుక యేమరపాటు గలిగి యున్నచో,

మీవంటి ధర్మాత్ములు సహించుటయు క్తమైనది ఓ శ్రీరామా నుజా ! ఇంత కోపమేల ? ధర్మ పరాక్రమాది గుణాధికులు మీ సోదరులు. సుగ్రీవుఁ డల్పబలుఁడు. మహావీరు లల్పుల యెడఁ గోపించుట తగునా ? సుగ్రీవునకుఁ బ్రాణమిత్రుఁ డైన శ్రీరాముని కోపకారణము సీతాన్వేషణ ప్రయత్న ములో జాప్యము చేయుటయే యని యెఱుంగుదును. శ్రీరాముఁ డితనికిఁ జేసిన మహోపకారమునుగూడ నెఱుంగుదును. ఇప్పు డాతఁడేమి చేయవలెనో గూడ బాగుగా నెఱుంగుదును. లక్ష్మణా ! నీవు మన్మథుని జయించిన మహాపురుషుఁడవు. మన్మథశక్తిని సహించుట సామాన్యుల కలవిగాదని నాకు బాగుగాఁ దెలియును. ఈ సుగ్రీవుఁడు మన్మథవశుఁడై యున్నాఁడో ? యది గూడ నాకుఁ దెలిసినదే. నీ కోపమును జూడఁగా మన్మథ వ్యాపారమున నీకంతఁగా ననుభవము లేనట్లున్నది. మన్మథాధీనుఁడైనవాఁడు దేశకాల ధర్మార్థంబుల గ్రహించలేఁడన్న విషయ పరిజ్ఞానమున్నచో సుగ్రీవునింతగాఁ గోపించవు. లక్ష్మణా ! నా సమీపమందున్న నీ తోఁబుట్టువు వంటి మిత్రుడైన సుగ్రీవుని గోపించక క్షమించ గలందులకు వేడికొనుచున్నాను. కేవల ధర్మపరులై, సర్వ సంగపరిత్యాగులై తపోనిష్ఠా గరిష్ఠులైన మహర్షులుగూడ, మన్మథునకు లొంగిపోవుచుండుట మనము వినుచున్నాము గదా ! సహజముగనే చపలుఁడైన యీ సుగ్రీవుని విషయమై వేరుగాఁ జెప్పనేల ? అని తార యా లక్ష్మణుని జాలవరకును

శాంతింపఁజేసి మఱల భావయుక్తములును, భర్తృహితంబులు నగు మాటల నీ విధముగాఁ జెప్ప నారంభించెను.

## తార చెప్పిన-మాటలు

ఓ లక్ష్మణా! మిక్కిలి కామపరవశుఁడై యున్నను సుగ్రీవుఁడు తన కర్తవ్యమును మరచిపోలేదు. మీ కార్యసాధనకై, చాలకాలము క్రిందటనే, వానర వీరుల నాజ్ఞాపించినాఁడు. మహావీరులును గామరూపులును నగు వానరులు కోట్ల కొలఁదిగా, నానావన ప్రాంతములనుండియుఁ గిష్కింధకు వచ్చుచుండుట నీవు చూచి యేయుందువు.

శ్లో॥ తదాగచ్ఛ మహాబాహో చారిత్రం రక్షితుం త్వయా ।
అచ్ఛలా మిత్రభావేన సతాం దారావలోకనమ్ ॥
స. 33, శ్లో-60

తా॥ మహావీరా! లక్ష్మణా! నీవు లోనికి రమ్ము! ఇంతవరకును నీ శీలము ననుసరించి యంతఃపుర స్త్రీలున్నచోటికి వెళ్లఁగూడదని, దూరముననుంటివి. అట్లు సదాచారమును బాటించితివి. ఎవరైనను దమ మిత్రులగు వారి భార్యలను జూచుటలో దోషములేదు.

భగవత్కార్యమునం దేకాగ్రతఁ గలవాఁడై ధార్మికుఁ డేస్థలమున నెట్టి మనో వికార హేతువైన దానిని జూచినను నంతయును భగవత్స్వరూపముగనే భావించుట విచిత్రమైన ధర్మము.

అంత ! లక్ష్మణుఁడు తార మాటల ననుసరించి, రామ కార్యదీక్షా తత్పరుఁడగుటచే తారతో నా సుగ్రీవుని యంతఃపురంబునకుఁ బోయెను. అతఁడచ్చట చూడఁగా సుగ్రీవుఁడు సర్వ విధ వస్త్రాభరణాదులతో నలంకృతుఁడై దేవేంద్రుని సింహాసనమువంటి సింహాసనముపై రాణియైన రుమనుగౌఁగిలించికొని యెఱ్ఱని విశాల నేత్రములతో లక్ష్మణస్వామిని సందర్శించెను.

## లక్ష్మణ-సుగ్రీవ-సమాగమము

అడ్డులేని పరాక్రమముగల యా వచ్చిన లక్ష్మణుని జూచి యాతని కోపమును గ్రహించి భయకంపితుఁడై సుగ్రీవుఁడు సింహాసనమునుండి యొక్క మారుగా క్రిందికి దిగి పోయి యెదురుగా నింద్ర ధ్వజమువలె నిలచెను. ఆకాశమునఁ జంద్రోదయము కాఁగానే నక్షత్రములన్నియు నా చంద్రుని బరివేష్టించినట్లు రుమ మొదలైన సుగ్రీవ భార్యలందఱు నాతని జుట్టును జేరి నిలిచిరి. మద్యపానము చేతను స్త్రీలతో భోగించుట చేతను నెఱ్ఱఁబడిన కన్నులు గల యాసుగ్రీవుఁడు దోసిలి నొగ్గి, లక్ష్మణస్వామి సన్నిధి కేగి నిలిచెను. ఆ స్త్రీ సమూహముతో వచ్చిన సుగ్రీవునిజూచి, లక్ష్మణుఁడు క్రోధావేశముతో నిట్లనియెను. ఓయీ ! సుగ్రీవా ! బల పరాక్రమ సంపన్నుఁడును, సద్వంశ సంజాతుఁడును, నార్తత్రాణ పరాయణుఁడును, జితేంద్రియుఁడును, కృతజ్ఞుఁడును. సత్యసంధుఁడు

నగువాఁడెవఁడైనను లోకులచేఁ బొగడఁబడును. అట్లుగాక యసత్యవాదియై కృతఘ్నుఁడైనరాజు కంటె మహాపాపాత్ముఁడింకొకఁడు లేడు. అధర్మపరుఁడై, యొక గుఱ్ఱము లేక యొక గోవు ననువాని విషయమై యసత్యమాడినచో నా గుఱ్ఱములను గోవులను నూరేసి చొప్పున వధించిన పాపమునేగాక, పురుషుల విషయమై యసత్యమాడినచో, నాత్మహత్య మఱియు బంధు హత్యా దోషములను బొంది రౌరవాదినరకములను జేరఁగలఁడు. అట్టి యెడ మహాత్ముఁడై పురుషోత్తముఁడైన శ్రీరాముని విషయములోన సత్యమాడినచో, వాని పాపమునకు మేరయే లేదు సుమా ! మిత్రమా ! ముందుగా నుపకారము నందితివి. ప్రత్యుపకారము గావించెదనని ప్రతిజ్ఞ పలికితివి. తరువాతఁ గృతఘ్నుఁడవై యిట్లుంటివి. ఇట్టి నిన్ను సంహరించుటలో దోషము లేదు. ఓ వానరా ! పూర్వము సర్వలోక నమస్కృతుఁడైన బ్రహ్మదేవుఁడు వచించిన మాట వినుము.

శ్లో॥ బ్రహ్మఘ్నేచ సురాపేచ చోరే భగ్నవ్రతే తథా ।
నిష్కృతి ర్విహితాసద్భిః, కృతఘ్నే నాస్తి నిష్కృతిః॥
స. 34, శ్లో-12

తా॥ బ్రాహ్మణుని జంపుట, కల్లు ద్రావుట, దొంగతనము చేయుట, దేవతావ్రతమును భంగముచేయుట ఇంకను గురు భార్యాపహరణము మొదలగు మహాపాతకములకుఁ

ప్రాయశ్చిత్తములు గలవు. కాని కృతఘ్నతాదోషమున కెందును నేవిధమైన ప్రాయశ్చిత్తమును లేదు.

కృతఘ్నత్వమునకు మించిన పాపము లేదు. (కొండంత యపకారమునైనను మరువవచ్చునుగాని, గోరంత యుపకారమును మరచుట ధర్మముగాదు.)

ఓ సుగ్రీవా ! శ్రీరామునిచే నుపకారమును బొంది ప్రత్యుపకారము గావించెదనని ప్రతిజ్ఞఁజేసియును గాలాతిక్రమణము గావించుచున్నావు. కావున నీవు దుష్టుఁడవేగాక, కృతఘ్నుఁడవై యసత్యవాదివయితివి. ఓ[illegible]ా ! నీవు సత్యమును నిలిపికొని కృతజ్ఞుఁడవుగావలెనన్నచో శ్రీరాముని యెదుట చేసిన ప్రతిజ్ఞానుసారముగా సీతాన్వేషణ కార్యమును నెరవేర్చవలెను గదా ! నీవు నీ కార్యసాధనకై, సత్యవంతుని వలె నటించి కప్పలను మ్రింగుటకై, తాను గప్పవలె నరచెడు సర్పమువలె నభినయించితివి. ఇప్పుడు గ్రామ్య సుఖములం దేలియాడుచుఁ బ్రతిజ్ఞను మరచితివి. నీవు మాయగాడవని శ్రీరామునకుఁ దెలియదు. మహాత్ముఁడును గరుణా సముద్రుఁడును నగు శ్రీరాముఁడు నీవు దురాత్ముఁడవని యెఱుంగక నీకు రాజ్య మప్పగించినాఁడు. ఎంతటి కార్యమునైనను సునాయాసముగా నెరవేర్చగల రాముఁడు చేసిన మేలునే మరచితివన్నచో, నింక నీవు చేయలేని యకార్యమే ముండును ? ఇప్పుడే నా తీవ్రబాణములు నిన్ను వాలి పాలికిఁ బంపఁగలవు. సుగ్రీవా ! దుష్టుఁడైన వాలి యేదారిని బోయి

నాఁడో యేదారి యింకను మూయఁబడలేదు. కావున నీ ప్రతిజ్ఞను నెరవేర్చుము. శ్రీరాముని బాణవేగమును శక్తిని నీవు పూర్తిగా గ్రహించినట్లు లేదు. కావుననే నిర్భయముగా నింతవరకును భోగపరాయణుఁడవై యుండిపోతివి.

## లక్ష్మణునకు-తార చెప్పిన-సమాధానము

లక్ష్మణుఁడు తీవ్ర పదజాలముతో మాటలాడుట విని, చంద్రముఖియైన తార యిట్లు సమాధానము చెప్పుచున్నది. సుమిత్రా నందవర్ధనా ! నీవింత దురుసుగా మాటలాడఁదగినంతటి నేరము సుగ్రీవుఁడు చేయలేదు సుమా ! అందును బ్రియ మిత్రుని విషయమై నీ వింత కఠినముగా మాటలాడఁదగదు. మహావీరశిఖామణీ ! ఈ ప్రాణ మిత్రుఁడైన సుగ్రీవుఁడు, నీవన్నట్లుగాఁ గృతఘ్నుఁడును, వంచకుఁడును, క్రూరుఁడును, నసత్యవాదియును గాదు సుమా ! కుటిలత్వ మీతని స్వభావముననేలేదు. ఈవీరుడైన సుగ్రీవుఁ డన్నతో జరిపిన యుద్ధమున శ్రీరాముఁడొనర్చిన మహోపకారము నేమాత్రమును మరువలేదు. లక్ష్మణా ! యథార్థమును వినుము ! శ్రీరాముని యనుగ్రహము వలననే యీతఁడు శాశ్వతయశస్సును వానరమహారాజ్యమును రుమతోఁబాటు నన్నును బొందఁ గలిగినాఁడు. ఈతడు చాలకాలము గొండలపై రాళ్లు రప్పల మధ్యఁ బరుండియుఁ గాయకసురులు తినియుఁ జాలకష్టములు పడినవాఁడు. కావున నీతఁడిన్నాళ్లకు

భోగలాలసుఁడై పూర్వము విశ్వామిత్రుఁడు మేనకం దగిలికొని కాలమును మఱచినట్లుగా, నీతఁడు శరదృతువు వచ్చిన సంగతినే మఱచెను. మఱియు విశ్వామిత్రునంతటివాఁడే ఘృతాచినిదగులుకొని పది సంవత్సరములు రాత్రింబగళ్లు విహరించి కాలమును మఱచి ప్రవర్తించినాఁడన్నచోఁ బ్రాకృతుఁడైన సుగ్రీవుని మాటఁ జెప్పనేల ? దేహధర్మము ననుసరించి భోగముల ననుభవించుచుఁ బ్రాప్తకాలమును దెలియక తృప్తిఁజెందని యీ సుగ్రీవుని నీవు క్షమించవలెనేగాని పరుష వాక్కులతో భయపెట్టుట దగదు. నీవు దృఢమై నిశ్చయమైన సుగ్రీవుని యభిప్రాయము దెలియక, ప్రాకృతునివలెఁ గోపింపఁదగదు. లక్ష్మణా ! నీవంటి సత్పురుషులు విమర్శించక తొందరపడి యే పనియును జేయఁబూనరు. అందులో ముఖ్యముగాఁ గోపతాపముల నందరు.

ధర్మాత్మా ! నిన్ను క్షమాభిక్ష వేడుకొనుచున్నాను. శాంతించుము. సుగ్రీవుఁడు యుద్ధమున రావణ సంహారము గావించి, సీతాదేవిని శ్రీరామునకు సమర్పించఁగలఁడు. లంక యనఁగా సామాన్యమైన దనుకొందువేమో ? అందుఁ గోట్ల కొలఁదిగా రాక్షసవీరులు రావణుని సేవించుచుందురు. వారు కామరూపులు. అట్టి రాక్షసులను సంహారించకుండగా, రావణుని సంహరించుట దుర్లభము సుమా ! ఓ లక్ష్మణా ! వినుము ! సీతాపహరణఁ గావించ్చిన రావణుని సంహరించుటకు సుగ్రీవునివంటి శక్తిసామర్థ్యములుగలవాని సహాయము

లేకుండఁగా నెవనికిని సాధ్యముగాదు. కావున సుగ్రీవుఁడు తగిన సహాయము గావించఁగలఁడు. నాయనా! లక్ష్మణా! నాకారావణశక్తి సామర్థ్యము లన్నియు నొకప్పుడు వాలి చెప్పఁగా వింటిని. అంతియేగాని, నాకుఁ బ్రత్యక్షముగాఁ దెలియదు. మీకు సహాయకారులుగా నుండుటకై, యాయా స్థలములందుఁగల వానర వీరులనందఱను దీసికొని రమ్మని, సుగ్రీవుఁడింతకుఁ బూర్వమే యాజ్ఞాపించినాఁడు. మహాబల పరాక్రమవంతులైన, యావానరయోధులరాకకై, నిరీక్షించు చున్నాఁడు. భూమిపై నెక్కడెక్కడనున్న వానర వీరులును నిక్కడకు మూఁడు రోజులలో రావలెననియు, నాపై నాలస్యము చేసినవారికి. మరణదండన తప్పదనియు నాజ్ఞాపించి యున్నాఁడు. ఇట్టి సుగ్రీవాజ్ఞను బురస్కరించికొని, మహా వీరులైన వానరులందఱును వారివారి సైన్యములతో నేఁడే రావలసియున్నది. శత్రు హంతకుఁడవైన యో సౌమిత్రీ! మహాతేజోవంతులైన కోట్లకొలఁది వానరుల ననేక వేల కోట్ల భల్లూకములను మఱియుఁ కోట్ల కొలఁదిగానున్న గోలాంగూలములను నిచ్చటకు సుగ్రీవుడు రప్పించఁగా, వారందఱును మిమ్ము సేవించఁగలరు. కోపము మాని, ప్రసన్నుఁడవగుము. నాయనా! ఈ సుగ్రీవుని భార్యలను జూడుము. వాలి వధ వలనఁ గలిగిన భయము వీరి నందఱిను బీడింపఁగా నేఁడును నష్టేయేమి జరుగునో యని సందేహించుచుఁ గోపముతో నెఱ్ఱనైన నీ కన్నులను దర్శించుచుఁ

గలవరపాటుతోఁ నున్నారు. కావున నీవు కోపముడిగి శాంతి వహించుము అని తారాదేవి లక్ష్మణునితోఁ బలికి యాతనిని శాంతింపఁజేసినది.

## లక్ష్మణుని సుగ్రీవుఁడు-క్షమాపణ-వేడుట

లక్ష్మణస్వామి తార చెప్పిన ధర్మయుక్తములై, వినయముతోఁ గూడిన మాటలను విని కోపమును వీడి ప్రశాంతి నందెను. అంత సుగ్రీవుఁడు మలిన వస్త్రమును విడిచినట్లు, తన భయమును విడిచి లక్ష్మణుని భక్తి వినయములతో సమీపించెను. మఱియుఁ దన మెడలోని పూలమాలలను త్రెంచివైచి, మత్తును విడచి, నిర్మల మనస్కుఁడై యుండెను. అట్టి సుగ్రీవుఁడు లక్ష్మణుని సంతోషింపఁ జేయుచు నీ విధముగాఁ బ్రసింగించుట కారంభించెను.

లక్ష్మణా ! ఈనాఁడు నాకుఁగలిగిన భోగ భాగ్యములు గాని, శాశ్వతమైన యీ వానర రాజ్యాధిపత్యముగాని శ్రీరాముని పరిపూర్ణానుగ్రహముననే లభించినవి. లేనిచో నేనేమైపోయి యుండెడివాఁడనో ? శత్రు హంతకుఁడవైన లక్ష్మణా ! వినుము ! అమ్మహా పురుషుఁడు శ్రీరాముఁడు చేసిన మహోపకారమునకుఁ దగిన ప్రత్యుపకారము నెవఁడు చేయఁగలఁడు ? నేను సహాయపడుదుననుట నిమిత్తమాత్రమే గాని, నిజమునకు శ్రీరాముఁడే తన పరాక్రమముచే రావణ సంహారము గావించి సీతను గైకొనఁగలఁడు. మహాసాల వృక్ష

ములనేడింటి నొక్క బాణముతోఁ బడఁగొట్టఁగా నా బాణమాపర్వతమును భూమిని గూడ భేదించి తిరిగి వచ్చి, యాతని యమ్ముల పొదిలోఁ బ్రవేశించుటను గండ్లారఁ జూచితిని గదా. ఆతఁడు ధనువు నెక్కుపెట్టి యొక్క మారు గుణష్టంకారమును జేసినఁ జాలును. ఆ శబ్దమునకే పర్వతములతోఁ గూడిన భూమి కంపించుచున్నచో నట్టి మహావీరునకు నేను జేయు సహాయమేపాటిది ? రావణ సంహారార్థమై శ్రీరాముఁడు ముందు నడువఁగా నాతని వెంట నడువవలసిన వాఁడనేగాని, సహాయము చేయుటకు నేనెంతవాఁడను ? ఇంతకును నేను మీ సేవకుఁడను. రామునితోఁగల యతి పరిచయముచే నన్నాతఁడను గ్రహించునేగాని, నిగ్రహింపఁడను విశ్వాసము నాకుఁగలదు. ఆ కారణముగాఁ గొంత కాలాతిక్రమణఁ జేసిన మాట వాస్తవమే. లోకములో శ్రీరాముఁడు దప్ప మఱి యెవ్వఁడు నేమాత్రమైనను దప్పు చేయనివాఁడుండఁడు. కావున వానరుఁడనైన యీ నా తప్పును క్షమించుము అని సుగ్రీవుడు లక్ష్మణుని వేడుకొనెను.

## లక్ష్మణుని-శాంతివచనములు

సుగ్రీవుని వినయ విధేయతలతోఁగూడిన మాటలను విన్న లక్ష్మణుఁడు సంతోషముతో నిట్లనియెను. ఓ వానర రాజా ! సుగ్రీవా ! నీవు ప్రభుప్రుఁడవై విశేషించి శ్రీరాముని పట్ల వినయ సంపన్నుఁడవై యుండుటచే నాతఁడిప్పు డన్ని విధముల చేతను సనాథుఁడైనాఁడు. సుగ్రీవా ! మంచి ప్రభా

వము గలవాఁడ వగుటచేతను శౌచము చేతను సర్వవిధము లను నీవే వానర రాజ్యాధిపత్యమునకుఁ దగియున్నావు. ఓయీ ! మిత్రమా ! నీవు సహాయుఁడవై యుండఁగా, శ్రీరాముఁడు శత్రు సంహార మొనర్చుటలో సందేహము లేదు.నీ మాటలు ధార్మికములును, కృతజ్ఞతా పూర్వకములు నగుట వలన యుద్ధమునందు వెనుకంజ వేయని వానికిఁ దగి నట్లుగా నున్నది. వానరోత్తమా ! మాయన్న శ్రీరాముఁ డును నీవును దప్ప నిగ్రహానుగ్రహ సమర్థులై యుండియును, దమ దోషములఁ గప్పిపుచ్చక. బాహాటముగా నంగీకరించు వారెవరున్నారు ? మఱియు నీవు బలపరాక్రమములందు శ్రీరామునకు సరియైన వీరుఁడవు. ఇంతకాలమునకు నిన్ను మాకు సహాయునిగా, నా దేవత లొసంగిరి. నీతో సఖ్యము నంది, నీ సహాయమును బొందుటకు శ్రీరాముఁడే తగినవాఁడు. ఇంక నీవు చేయవలసిన దేమున్నను నా వెంట వేగముగా వచ్చి భార్యా పరితాపము నొందుచున్న మాయన్న శ్రీరామునోదార్చుము. ఆతని పరితాపమును జూచి సహించ లేక నిన్ను బరుషమైన మాటలతో బాధ పెట్టితిని. వానిని మరచి నన్ను క్షమించుము అని లక్ష్మణుఁడు సుగ్రీవుని భయమును బోగొట్టి సంతోషింపఁజేసెను.

## సుగ్రీవాజ్ఞ

లక్ష్మణుని మాటలు విని సుగ్రీవుఁడు తన ప్రక్కనే యున్న హనుమంతుని జూచి యిట్లనియెను. వాయుపుత్రా !

నీవు త్వరగాఁబోయి హిమాలయ, వింధ్య, మేరు మహా పర్వతాదులందును సముద్రతీరము లందును, మహా వన భూముల యందును నింకను నెక్కడెక్కడ నీ భూమిపై వానర వీర సమూహములు గలవో తెలిసికొని వారి వారి నందఱను సామదాన భేద దండోపాయముల నుపయోగించి, యిచ్చట కతి త్వరగా వచ్చునట్లు చేయుము.. ఆ వచ్చిన వారలందఱకును దగిన, స్థలముల నేర్పాటు గావింపుము. ఇంతకుఁ బూర్వమే మనవేగులవాడ్రను బంపితిని. అప్పటికిని వాతాలస్యము చేసినచో నీవు వారికిఁ దగినట్లు చెప్పి వెంటనే వచ్చునట్లు చేయుము. అందఱును బది దినములలో నిచ్చటకు రావలయును. ఇది నా యాజ్ఞ. నన్నతిక్రమించిన వారికి మరణమే గతి. ఈ కిష్కింధావాసులైన వారందఱును గోట్లకొలఁదిగా నున్నారు. వారందరును నాలుగు దిక్కులకును బోయి యెక్కడెక్కడ నున్న వానరులకును నా యాజ్ఞను చాటించి, తీసికొని వచ్చునట్లు చేయుము. మహాకాయులై, వీరాధివీరు లనిపించికొన్న వారందఱును నా యీ ఆజ్ఞను పాటించుదురుగాక ! మన సేవకు లాయాదగ్గర త్రోవలను వేగముగాఁబోయి యందఱకును నా యాజ్ఞను దెలియఁజేయుదురుగాక ! అనగాఁ వినిన హనుమంతుఁడు సుగ్రీవాజ్ఞను సారముగాఁ బోయి యన్ని దిక్కులకును దగిన వానర వీరులను బంపెను. ఆ వెళ్లిన వారందఱును నాయా స్థలములకుఁ

బోయి కొన్ని క్షణాలలో రామ కార్యార్థమై యెల్ల వానరు లను దీసికొని వచ్చిరి. యముని యాజ్ఞతో సమానమైన సుగ్రీవాజ్ఞకు భయపడి, యెల్లవారు నెట్లున్న వారట్లే ప్రయాణమై వచ్చిరి. అందు ముప్పది కోట్ల మంది శ్రీరాముఁడున్న పర్వతమున నిలిచిరి. వారిలో నెఱ్ఱని బంగారు రంగుఁగలవారు పదికోట్లు. అస్తమయ పర్వతమునుండి వచ్చినవారు పది కోట్ల మందియు గలరు. కైలాసమునుండి సింహాపు మెడపైనుండు జూలువంటి తెల్లని రంగు గలవారు వెయ్యి కోట్ల మంది వచ్చిరి. హిమవంతమున ఫలమూలములతో జీవించువారు వేయి కోట్ల మంది వచ్చి యున్నారు. అట్లే వింధ్య పర్వతము నుండి యంగారక వర్ణము గలవారు వేలకొలఁది కోట్ల మంది వచ్చిరి. మఱియుఁ బాల సముద్రము తమాలవనము మొదలగు ప్రదేశములనుండి కొబ్బరికాయ లాహారముగాఁ గలవారు లెక్కలేనంత మంది వచ్చిరి.

వనములును గుహలును నదీ తీరములును మొదలగు స్థలములనుండి కోటానకోట్లు వానరులు వచ్చిరి. మొదట నీలునిచే బంపఁబడిన వానరులు. హిమాలయమున నొకా నొక మహావృక్షము నాశ్రయించిరి. ఆ వృక్షము క్రిందనే పూర్వ మొకప్పుడు 'సర్వదేవతా తృప్తికై పరమేశ్వరుని గూర్చి మహర్షు లొక మహాయజ్ఞమును జేసిరి. ఆ యజ్ఞ సమయమున హోమము చేయఁబడిన ద్రవ్యము కొంత భూమిపైఁబడియుండఁగా, నందుండి జనించిన వృక్షములనుండి

పండిన తియ్యని పండ్లను, దుంపలను జూచి యా వానరు లానందముగా భుజించిరి. అట్టివారికి నాకలి దప్పులుండవు. పైగా నిత్య సంతృప్తులై యుందురు. ఆ వానరు లాపదార్థములను దాము దిన్నంతటిని, మోయఁగలిగినంతగా మఱి కొన్ని యోషధులను గూడి సంగ్రహించుకొని తెచ్చిరి. అచ్చట నున్న సుగంధ పుష్పములను సుగ్రీవునకుఁ గానుకగా నిచ్చుటకై తీసికొని వచ్చిరి. ఆ విధముగా నాయాస్థలములందుఁగల వానరనాయకులందఱును దమతమ వానర సమూహములను వెంటఁబెట్టికొని యతి త్వరగా సుగ్రీవ సన్నిధికి వచ్చి చేరికొనిరి. వారావిధముగా వచ్చుటయేగాక, యాయా ప్రదేశములందు లభించు మధురాతి మధురములైన ఫలములను, దుంపలను, సువాసనలు గల పుష్పములను నోషధులను సుగ్రీవ మహారాజునకుఁ గానుకలుగాఁ దెచ్చి యిచ్చిరి. అట్టి వారి నందఱను జూచి సుగ్రీవుఁడు పరమానంద భరితుఁ డయ్యెను.

## సుగ్రీవుఁడు-శ్రీరాముని-సందర్శించుట

సుగ్రీవుఁడు వారువారు తెచ్చిన కానుకలను సంతోషముగా గ్రహించి తాను దూతలుగాఁబంపిన వానరులను సగౌరవముగాఁ బంపించెను. ఆ వచ్చిన వానర సైన్యములను జూచి తాను గృతార్థుఁడైనట్లును శ్రీరాముని కార్యము నెరవేరినట్లును భావించెను. లక్ష్మణుఁడది యంతయును జూచుచు

వినుచుఁ బరమానందభరితుఁడై "సుగ్రీవా ! నీ కిష్టమైనచో శ్రీరాముని సందర్శించుటకు నావెంట రమ్ము !" అని పలికెను. ఆ మాటలకు సుగ్రీవుఁడు సంతోషముతో నిట్లనియెను. ఓయీ ! లక్ష్మణా ! నీ యాజ్ఞానుసారముగనే తప్పక రాఁగలను. అంత సుగ్రీవుఁడు తార మొదలైన యంతఃపుర స్త్రీలను లోనికిఁ బొమ్మని కొందఱు సేవకులం బిలిచి నేను ప్రయాణము చేయు దివ్యమైన సవారీని మోసికొని రండు ! అని యాజ్ఞాపించెను. వారా వెంటనే బంగారు పల్లకీని కొని వచ్చిరి. అంత సుగ్రీవుఁడు లక్ష్మణుని బిలిచి. "నీవు ముందుగా నీ సవారీపై నెక్కి కూర్చొను"మని కోరెను. లక్ష్మణుఁ డట్లే చేయఁగా నా తరువాత సుగ్రీవుఁ డెక్కి లక్ష్మణుని చెంతనే కూర్చొనియెను. ఆ సర్వాలంకార శోభితమైన సవారీని మోయుటకు వానరులు సిద్ధపడిరి. ఒక వానరుఁడు గొడుగును బట్టుకొనెను. మఱి యిద్దరు వానరు లిరువంకలను నిలిచి తెల్లని వింజామరలను వీచుచుండిరి. ఇంకను గొందఱు శంఖములను భేరీలను బెద్దగా ధ్వనింపఁ జేసిరి. మఱికొందఱు వారి వారి యాయుధములను ధరించి, వెనుక ముందు భాగములను, ప్రక్క భాగములను నిలిచి నడువసాగిరి. అట్లు లక్ష్మణ సుగ్రీవులు మహారాజలాంఛనములతోఁ బల్లకిపైన వెడలి, శ్రీరాముఁడున్న ప్రదేశమునకు బయలుదేరిరి. దివ్యతేజోవిరాజమానుఁడగు శ్రీరాముఁడు నివసించుటచేఁ బవిత్ర క్షేత్రముగానైన, యాప్రస్రవణ పర్వ

తమును జేరఁగనే, తాము గూర్చున్న సవారీనాపి లక్ష్మణ సుగ్రీవు లందుండిదిగి, కాలినడకనే శ్రీరామ సన్నిధికిఁ జేరిరి. అక్కడ శ్రీరాముని జూడఁగనే సుగ్రీవుఁడు సాష్టాంగ నమస్కారమును జేసి చేతులు జోడించి నిలిచెను. అట్లే సుగ్రీవుని వెంట వచ్చిన పరివారమందఱును శ్రీరామునకు సాష్టాంగ నమస్కారములు చేసి, నిలిచియుండిరి. అట్లు దోసిలు లొగ్గి చేతులు పైకెత్తి నిలిచిన వానరులందఱును పద్మముల మొగ్గరతోఁ గూడిన గొప్ప తటాకమువలెఁ గనఁబడిరి. అది యంతయును జూచిన శ్రీరాముఁడు పరమానంద భరితుఁడయ్యెను. తరువాత శ్రీరాముఁడు లేచివచ్చి, సుగ్రీవుని గాఢముగాఁ గాఁగిలించికొనియెను. అనంతర మాసుగ్రీవుని దనచెంతఁ గూర్చుండఁజేసి యిట్లను చున్నాఁడు. మిత్రమా ! ధర్మార్థ కామముల నేకాలమున నెట్లుపయోగించి కొనవలెనో, తెలిసిన రాజు, నిజముగా రాజశబ్దమును సార్థకము చేసికొన్న వాఁడగుచున్నాఁడు సుమా !

శ్లో॥ హిత్వాధర్మం తథార్థంచ కామంయస్తు నిషేవతే ।
సవృక్షాగ్రే యథాసుప్తః పతితః ప్రతిబుధ్యతే ॥
స. 38, శ్లో-21

తా॥ సుగ్రీవా ! ధర్మార్థములను లెక్క చేయక కేవలము కామవశుఁడైన రాజు చెట్టు చివర కొమ్మలపై (లేత చిగుళ్లతో మెత్తగానుండునవి) నిద్రించి స్వల్పకాలములోనే క్రిందఁబడినవాఁడై తెలివి దెచ్చికొన్నట్లగును.

ధర్మార్థములకు భంగము గలుగునట్లుగాఁ గామము ననుభవించుట వినాశ హేతువు. బుద్ధిమంతుఁడు ధర్మార్థములను విడువకుండ కామము ననుభవించుట యుత్తమ ధర్మము.

శ్లో॥ అమిత్రాణాం వధేయుక్తో మిత్రాణాం సంగ్రహేరతః ।
త్రివర్గ ఫలభోక్తాతు రాజాధర్మేణ యుజ్యతే ॥
స. 38, శ్లో-22

తా॥ రాజైనవాఁడు శత్రువులను జంపుచు మిత్రులను సంపాదించికొనుచు ధర్మార్థ కామముల నాయా కాలములలోఁ బోషించుచున్నచో నట్టివాఁడే యుత్తముఁడైన రాజుఁగా గీర్తినందును.

శత్రువులను సంహరించి మిత్రులను సమకూర్చుకొనుచు ధర్మమునకును ధనమునకును లోపము రానీయకుండ కామముల ననుభవించుట యుత్తమ రాజధర్మము.

మిత్రవరేణ్యా ! సుగ్రీవా ! శత్రు సంహార మొనర్చుటకుఁదగిన కాలమిదియే సుమా ! కావున నీ మంత్రులతో బాగుగా నాలోచించుము. అనఁగా విని సుగ్రీవుఁ డిట్లనుచున్నాఁడు. శ్రీరామచంద్రా ! నాయన్నయైన వాలి మూలముగా నష్టపోయిన యైశ్వర్యమును, గీర్తిని శాశ్వతమైన వానర రాజ్యమును మీ సోదరుల యనుగ్రహముచే మరలఁ జాల కాలమునకుఁ బొందఁ గలిగితిని. చేసిన మేలునకు శక్తి

నంతయు నుపయోగించి కృతజ్ఞతఁ జూపించనివాఁ డధమాధ ముఁడు. శత్రు సంహర్తవైన యోధామా ! ఈ వచ్చిన వానర వీరులు కోట్ల కొలఁదియున్నారు. వీరిలో వేల సంఖ్యలోఁగల మహావీరులు, కామరూపులు. ఈ సమస్త భూమియందును గల ప్రదేశములనెల్ల బాగుగా నెఱింగిన వారు. అట్టివారు మహావేగముతో తిఱిగి తిఱిగి సీతను వెదకి రాఁగలరు. వీరందఱును దేవతల వలనను గంధర్వుల వలనను జన్మించినవారై, కామరూపులై, సంచరించగలరు. అట్టి వారందఱును దమతమ సైన్యములతో వచ్చి, నీ యాజ్ఞకు నిరీక్షించుచున్నారు. వీరిలో నొక్కొక్కఁడు కోట్ల కొలఁది సైన్యముతోవచ్చియున్నాఁడు. మహారాజా! రామచంద్రా ! మేరు మందర పర్వములవంటివారును, వింధ్య మేరు పర్వత నివాసులునునగు వానరులు నీ సేవార్థమై సిద్ధముగానున్నారు. ఇంతయేల నారావణుని బంధుమిత్ర పరివారముగా సంహా రముచేసి, సీతాదేవిని క్షేమముగా సమర్పింపగలరు. అనఁగా విని శ్రీరాముఁడు తన కార్యార్థమై సుగ్రీవుఁడు చూపించిన భక్తి విశ్వాసములకు మిక్కిలి యానందించి యధికమైన దేహ కాంతియును దుష్టియును బుష్టియును గలవాఁడై వికసించిన నల్లకలువల సమూహమువంటి శరీరకాంతితో దేదీప్య మానముగాఁ బ్రకాశించెను.

# సుగ్రీవుఁడు-శ్రీరామునకు-సమస్త వానర వీరులను-సమర్పించుట

శ్రీరామ సన్నిధిని సుగ్రీవుఁడు వినయముతోఁ జేతులు జోడించి నిలిచి, 'రామచంద్రా ! నీవు శత్రువుల జయించఁ గలవు" అని పలుకగా, శ్రీరాముఁడు పరమానందముతో సుగ్రీవుని గౌఁగిలించికొని యిట్లను చున్నాఁడు. మిత్ర రత్నమా ! ఇంద్రుఁడు సమృద్ధిగా వర్షములను గురిపించినను, సూర్యుఁడు తన దివ్యకాంతిచే లోకములను వెలిగింపఁజేయు చున్ననునవి వారి సహజ గుణములగుటచే నాశ్చర్యము లేదు. అట్లే చంద్రుఁడు తన చల్లని కాంతిచే సర్వజీవుల కానంద మును గలిగించుటయును, నీవంటి కృతజ్ఞుఁడైన యుత్తమ మిత్రుఁడు ప్రత్యుపకారముఁ జేయుటయును సహజగుణమునే గాని, యందు వింత యేమియును లేదని నాకుఁ దెలియును. మిత్రమా ! నీవు నాకుఁ బరిపూర్ణ సహాయ మొనర్చుచు, నాయండ నుండుటచే నెంతటి శత్రువునైనను యుద్ధములో సునాయాసముగా గెలువఁగలను. ఆ యధమ రాక్షసుఁడైన రావణుఁడు నన్ను మోసగించి యింద్ర భార్య శచీదేవి నపహరించినట్లుగా, సీత నపహరించి, నన్ను గష్టముల పాలు చేసినాఁడు. అనుహ్లాదుఁడనువాఁడు పూర్వము శచీదేవి నపహరించఁగా సమ్మతించిన శచీదేవి తండ్రియైన పులోముని దేవేంద్రుఁడు సంహరించెను. అట్లే నాఁవాఁడియైన బాణము లతో రావణుని సంహరించఁగలను అని పలికెను. ఆ సమయ మున సూర్యకాంతియొక్క వేడికి భూమియంతయును జడును

లేక యెండి పోయినది ఆకారణముగాఁ బెద్దగా ధూళి పైకెగయుటయును రాముఁడు చూచెను. మఱియు భూమి చలించినది. ఈ యుపద్రవమునకుఁ గారణమరయఁగాఁ గోట్ల కొలఁదిగా వానరవీరు లీ భూమి నంతనుగప్పి, చరించుచుండుటయే యని శ్రీరాముఁడు గ్రహించెను. తరువాత నటుచూడఁగా నేనుఁగులవంటి శరీరములుగల వానర ముఖ్యులు లెక్కలేనంతమంది, వచ్చి రామ కార్యార్థమై యీ భూమిని గప్పి సంచరించుటను గమనించెను. వారందఱు ననేక వనములు, కొండలు, సముద్ర ప్రాంతములు మొదలైన ప్రదేశముల నుండి వచ్చిరి. వారిలోఁ గొందరు లేత సూర్యకాంతివంటి వర్ణము గలిగియుండిరి. గొందఱు తెల్లని వర్ణమును నింకను మిగిలినవారు నానావిధ వర్ణములను గలిగియున్నారు. శతవలి యను వానర నాయకుఁడు పదివేల కోట్ల మంది వానరులలో వచ్చి నిలిచెను. అట్లే తార యొక్క తండ్రియును, రుమయొక్క తండ్రియును, బదేసి వేల కోట్ల వానరులతో వచ్చిరి. హనుమంతుని తండ్రి కేసరి సూర్యతేజో విరాజమానులైన లెక్కలేనంతమంది, వానరులతో వచ్చెను. గవాక్షుఁడు వేయి కోట్ల గోలాంగూలము లనెడు వానరులతో సుగ్రీవుని దర్శించెను.

ధూమ్రుఁడను భల్లూక రాజు మహావేగము, బలమును గల వేలకొలఁది కోట్ల సంఖ్య గల భల్లూకములతో శ్రీరామ

సన్నిధికి వచ్చెను. పనసుఁడు, నీలుఁడు, గవయుఁడు, గంధమాదనుఁడు, దధిముఖుఁడు, మైందద్వివిదు లనెడి యశ్వినీదేవతా పుత్రులును, గజుఁడును, భల్లూక రాజైన జాంబవంతుఁడును, రుమణ్వంతుఁడును దండ్రితో సమాన పరాక్రముఁడైన యంగదుఁడు, నింద్రజానుఁడును, శంభుఁడును, దుర్ముఖుఁడు, నలుఁడును, శరభుఁడును, కుముదుఁడును, వహ్నియు, రంహుఁడు నీ మొదలైన వానర భల్లూక నాయకులందఱును వారి వారి సేనలతో నెగురుచు గంతులు వేయుచు, గర్జించుచు సుగ్రీవు వద్దకు వచ్చి సూర్యుని గ్రహ నక్షత్రముల లావరించికొని యున్నట్లుగా నిలిచిరి. అందఱును ముందున్న వారు సుగ్రీవునికిఁ దమ రాకను తెలియఁజేసిరి. వెనుకనున్న వారు గూడ పైపైకి నెగురుచుఁ దమరాకను దెలియఁజేసిరి. ఆ వెంటనే సుగ్రీవుఁడు శ్రీరామచంద్రుని జూచి, "రామా! ఈ వానర బలమంతయును నీకు సమర్పించుచున్నాను. వీరందఱును నీ యాజ్ఞను జవదాటరు" అని పలికెను. మఱియు వానర నాయకులం జూచి "మీరు మీ మీ సేనా సమూహములతో, నా యీ పర్వతములు, వనములు, నదులు నను స్థలంబుల నివసింపఁజేయుఁడు. రామాజ్ఞానుసారముగా మీ సేనా పరివారములతో, నా మా కార్యములను జేయవచ్చును" అని యానతిచ్చెను.

## సీతాన్వేషణకై -సుగ్రీవుఁడు వానరుల-నాయాదిశలకుఁ బంపుట

సుగ్రీవుఁడీ విధముగా సమృద్ధియైన సాధన సంపత్తి గలవాఁడై, శ్రీరాముని జూచి. "రామచంద్రా ! నా రాజ్యమునఁ గల వానర వీరులందఱును నాయా ప్రదేశములనుండి వచ్చినారు. వీరిలో నే యొక్కఁడును రాక్షస వీరులకుఁ దీసిపోనివాఁడే. వీరి కే కార్యము నాదేశించినను నది యెంతటి మహాత్కార్యమైనను సునాయాసముగా నెరవేర్పఁ గలరు. వీరు భూమియందును నీటియందును నాకాశమునందును స్వేచ్ఛగా సంచరించఁగల శక్తి గలవారు. రామా ! వీరందఱును నీ యాజ్ఞ నే మాత్రమును జవదాటరు. హృదయపూర్వకముగా స్వామి కార్యమును, స్వామి హితమునే గోరి, విఖ్యాతి నందిన పరాక్రమవంతులై నెరవేర్చ గలవారు. వీరిప్పటినుండియును నీకుఁ గింకరులై సేవించఁగలరు. కావున వీరి ద్వారా నేమి చేయించఁ దలఁచితివో ! యాజ్ఞాపించుము. నీ కార్యము నాకుఁ దెలియును. అయినను నీ ముఖము నుండియే విని, యావిధముగా జరిపించుటకుఁ గోరుచున్నాను. ఆ మాటలను విన్న శ్రీరాముఁడు సుగ్రీవుని గాఢముగాఁ గౌఁగిలించికొని యిట్లనియెను. సుగ్రీవా ! ముఖ్యముగా, నా జానకి జీవించియున్నదా ? లేదా ? యను విషయము తెలిసికొనవలయును. జీవించియున్నచో, రావణుఁ డామె నెచ్చట దాచినదియును దెలిసికొనవలెను. ఆపైని మన ముభయులము నప్పటి కేమి చేయవలయునో యాలోచించికొందము.

ఓ వానర రాజా ! ఈ కార్యమున నేనుగాని, లక్ష్మణుఁడు గాని, నిన్నాజ్ఞాపించువారముగాము. నియామకుఁడవును, గార్యసాధకుఁడవును, నీవేయై యున్నావు కావున సర్వము నెఱింగిన నీవే, యీ వానరుల నాజ్ఞాపించుము. నీకుఁ దెలియని దేమున్నది ? సుగ్రీవా ! నీవు కేవలము నాకు హితుఁడవేగాక లక్ష్మణునితోఁ సమానుఁడవైన సోదరుఁడవగుదువు. నాయందు వినయ విధేయతలుగల పండితుఁడవు. మహావీరుఁడవు, దేశకాల విశేషముల నెఱింగిన ప్రాజ్ఞుఁడవు. విశేషించి యర్థశాస్త్రము నెఱింగిన కార్యసాధకుఁడవు. అనఁగా విని సుగ్రీవుఁడానందించి, మహాకాయుఁడైన వినతుండను వానిం బిలిచి యిట్లనియెను. ఓయీ ! నీకున్న సైన్యములోఁ గలిసి సరయూ, గంగా మొదలైన నదులను, బర్వతములను మహావనములను వెదకుచుఁ దూర్పుదిశగా బోయి, సీతాదేవి యెచ్చట నున్నదియు రావణుఁ డెక్కడ నున్నదియును దెలిసికొనిరావలెను. కొండశిఖరములను, వనములనుగంగ, కౌశికాకి మొదలైన నదులను, వెదకుము.

తూర్పు దిక్కునఁ గల శైలభూమిని, బ్రహ్మమాలను, విదేహ దేశములను, బ్రహ్మమాలను, మాళవ కాశీ కోసల మగధ పుండ్ర వంగ దేశములను, నాయా రాజభవనములను, వెండి గనులు గల భూములను వెదుకవలెను. దశరథుని కోడలును, శ్రీరాముని భార్యయునగు సీతాదేవిని వెదకి వెదకి, యామె యోగక్షేమములను దెలిసికొని రావలెను. మఱియు

వినుము ! సముద్ర మధ్యఁ గల పట్టణములలో బలిష్ఠులైన చెవులులేని వారు కొందఱును, పెద్ద పెద్ద చెవులు గలవారు కొందఱును నొకే కాలిపై వేగముగాఁ బోవఁగలవారు కొందఱును గలిగియుందురు. ఇంకను బంగారు వెంట్రుకలు గలిగి బంగారు శరీరములు గలవారు నచ్చటచ్చట నుందురు. వెండియు నాయా నీళ్లు గల ప్రదేశము లందును, భూమి పైభాగములందును చేపల నాహారముగాఁ గొనుచు, సగము పులుల శరీరమును సగము మానవ దేహములును, గల వారుందురు. వారి వారి నివాసములందుఁగూడ సీతాదేవిని వెదుకవలెను. మీలో వేగవంతులై యెగిరి వెళ్లుచు నాయా గిరి శిఖరములందు రత్నరాశులను, బంగారమును సమృద్ధిగాఁ గలిగి యేడు రాజ్యములతో నొప్పు యవద్వీపమునందును, వెదుకవలెను. అది దాటి శిశిర పర్వతమునకుఁబోయి యాకాశమునంటు, నాయాశిఖరములందును, దేవ దానవ సేవితము లైన ప్రదేశములందును సీతాదేవిని వెదుకవలెను. ఆయా ద్వీపములందును, దుర్గమ ప్రదేశములందు నే మాత్రము నాద మరపులేకుండ నీ వారందఱను గూడి సీతాదేవిని వెదకి తెలిసికొనిరావలెను. ఓయీ ! వినతుఁడా ! ఇంకను శ్రద్ధగా వినుము !

తూర్పున లవణ సముద్రమును దాటి, యావలి యొడ్డునఁగల శోణ నదిని నందలి యా యా దేవ భూములను వెదకుము. ఆపైని ప్లక్ష ద్వీపము గలదు. అందు సుందరమైన

యుద్యానవనములు గలవు. పెక్కు నదులు గలవు. అందందు వెదకి సీతను, రావణుని దెలిసికొనిరావలెను. అపై నిక్షు సముద్రము నందలి ద్వీపములను మీరు చూడఁగలరు. అందున్న రాక్షసులు బ్రహ్మ వర ప్రభావముచే జీవరాశుల నీడలను బట్టి దగ్గరకు లాగికొని చంపి తినివేయుచుందురు. ఆపైని యెఱ్ఱని జలముగల శోణ సముద్రమును జూడఁగలరు. అందే గరుత్మంతుని భవనము గలదు. అయ్యది విశ్వకర్మచే రత్నాలతో నిర్మించఁబడినది. ఆ సముద్రమున శాల్మలీ ద్వీపము నందలి పర్వతములందు మందేహులను మహాకాయులైన రాక్షసులును గలరు. ఆ మందేహులు ప్రతి దినమును బ్రాహ్మణులు చేయు గాయత్రీ మంత్ర జపముచేఁ గొట్టఁబడి సముద్రమునఁ బడుచుందురు. మఱియు సూర్య కిరణములను ద్రావి మఱలఁ బర్వత శిఖరములఁ చేరికొనుచుందురు. ఆ తరువాత నింకను బోగా, నేతి సముద్రమును బెరుగు సముద్రమును కుశ క్రౌంచ ద్వీపములును గనుపించును. అట్టివానిని జూచి కొనుచు నాపైని తెల్లని పాల సముద్రమును జేరి, యామధ్యఁ తెల్లని శ్వేత వృషభమను పర్వతమును జూడఁ గలరు. అందలి వనములును, నదులును, తెల్లని రంగు గలిగి యుండును. ఆ కొండపై, సుదర్శనమను కొలను గలదు. అచ్చటకు, దేవ, గంధర్వ, యక్ష, చారణ, కిన్నరా, ప్సరోగణములు విహారార్థమై వచ్చుచుందురు. ఆ తరువాత సర్వ భూత భయంకరమైన జల సముద్రము గలదు. అందే బడ

బాగ్ని, యను మహా తేజస్సు లోపల నణఁగి యున్నది. అయ్యది మహా ప్రళయకాలమున, నా సముద్ర జలము నంతను మరిగింపఁజేసి, దానిని మహావేగమున భూమిపైఁ బారునట్లు చేయును. అప్పుడు జీవరాశు లాబడబాగ్నికి నోర్వలేక బిగ్గరగా నరచుచుఁ జచ్చుచుండును. ఆ సముద్ర మునకు నుత్తరముగా, బంగారుకొండ గలదు. అచ్చట మహా విష్ణువునకు శయ్యగానయి, భూమిని మోయుచున్న యాది శేషువు గనఁబడును త్రిమూర్తులును, దాల ధ్వజమును దూర్పునకు సరిహద్దుగా, నియమించిరి.

ఆ తరువాత బంగారుకాంతులు గల యుదయ పర్వత మున్నది. దాని శిఖర విస్తీర్ణము నూరు యోజనములు. మిక్కిలి యెత్తైన స్వర్గమును గాపాడుచుండును. అందెన్నియో మహావృక్షములు గలవు. వానియందు యోజన దూరము విస్తరించి పది యోజనములు పొడవు గల సౌమనస మనెడి బంగారముతో నిండిన కొండ శిఖరము గలదు. మహావిష్ణువు త్రివిక్రమావతారమున (వామనావతారమున) తన మొదటి పాదమును భూమిపైనుంచి రెండవ పాదమును మేరు పర్వత శిఖరమందుంచెను. నిత్యమును సూర్యుఁడస్తమించి జంబూ ద్వీపమున కుత్తరముగా ప్రదక్షిణ మార్గమున వచ్చి యీ 'సౌమనస' పర్వతమును జేరి తరువాత మేరువునకు దక్షిణ ముగానున్న జీవరాశులకుఁ దన కాంతిని ప్రసరింపఁ జేయు

చుండును. ఆ సౌమనస శిఖరమున వైఖానసవాలఖిల్యాది మహర్షులు దేదీప్యమానులై వెలుగుచుందురు. ఆయుదయ పర్వత సమీపమునఁగల 'సుదర్శన' మనెడి ద్వీపము సార్థక నామము గలదై యుండును. ఓ వానరులారా! నేనిప్పుడు మీకుఁ జెప్పిన ప్రదేశముల నన్నిఁటిని, శ్రద్ధగా సీతాదేవి కొఱకై వెదకుఁడు. అక్కడ నా సూర్యోదయ కాలము నందలి యెఱ్ఱని వర్ణము నుదయ పర్వతమునందలి బంగారు వర్ణమును గలిగి యుదయ సంధ్య ప్రకాశించు చుండును. ఈ దిక్కునే భూమికిని, మిగిలిన లోకములకును, మొదటి సింహద్వారమును బ్రహ్మదేవుఁడు నియమించెను. మీ రందఱు నంతవరకును బోయి సీతను వెదుకవలెను. ఆపైని సూర్య చంద్రుల ప్రకాశము లేని కారణముగాఁ జిట్ట చీకటి యలుముకొని యుండును. మీరు నేను జెప్పినట్లుగా నాయా ప్రదేశములను వెదకి సరిగా నొక మాసము లోపలఁ దిరిగి రావలయును. నేనిచ్చిన యీ గడువును దాటి వచ్చిన వారికి మరణ దండన విధించఁబడును. సీతాదేవి యొక్క జాడ, మీకుఁ దెలిసినను, దెలియక పోయినను మీరు నెల రోజుల లోపలనే నాకుఁ జెప్పవలెను. కావున వేగముగాఁబోయి రండు! అని సుగ్రీవుఁడు, వినతుఁడు మొదలైన వానరులను బంపెను.

## దక్షిణ దిక్కునకు-అంగద-
## హనుమ దాదులను-బంపుట

సుగ్రీవుడు తూర్పు దిశగా వెళ్లవలసిన వారిని బంపి తరువాత దక్షిణ దిశగాఁ బంపవలసిన సమర్థులగు, నంగ దాదులను బిలిచి, యిట్లు నిరెను. ఓయీ ! మీరందఱును మహా వీరాధివీరులు. మీరు దక్షిణ దిశగాఁబోయి సీతా దేవిని వెదకి యామె క్షేమమును దెలిసికొని, యాశుభవార్తను శ్రీరామునకుఁ జెప్పవలెను. మఱియు నా దిక్కునఁగల ప్రదేశములను గూర్చి చెప్పెదను. శ్రద్ధగా విని వెదకిరండు! దక్షిణ దిక్కున వేయి శిఖరాల వింధ్య పర్వతము గలదు. మఱియు నర్మద, గోదావరి మొదలైన మహానదులును గలవు. మేఖల, యుత్కళ, దశార్ణ, యశ్వవన్తి, యవన్తి మొదలైన మహానగరములును గలవు. మీరు పోయి యా యా ప్రదేశ ముల నన్నిఁటిని శ్రద్ధగా, సీతాదేవిని గూర్చి వెదుకవలెను. ఇంకను వినుఁడు ! విదర్భము, ఋషీకము, మాహిషకము-వంగము, కళింగము, కాశి యను పేర్లు గల రాజ్యముల నెల్ల నెదుకవలెను. పర్వత నదీ గుహాలతో నిండిన దండ కారణ్య ములను. నందలి యాంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య, కేరళాది దేశముల నెల్లఁ దిరిగి తిరిగి సీతను దెలిసికొనుటకు దీవ్ర ముగాఁ బ్రయత్నించవలెను. ఆ తరువాత సహ్య పర్వతము నకుఁ బొండు ! అది నానావిధ చందనాది వృక్షములు గలిగి పూలతో నిండిన చెట్లను గలిగియుండును. అట్టి యాకొండను

బూర్తిగా, వెదకుండు. ఆ పైని గావేరీ నదికి వెళ్లుఁడు. అది చాల పవిత్రమైనది. దర్శన, స్నాన పానాదులచే సర్వ జీవులను దరింపఁజేయును. అనంతరము మలయగిరికి వెడలుఁడు! అచ్చట రెండవసూర్యునివలె ప్రకాశించు నగస్త్య మహర్షిని జూడఁగలరు. మీరాతని యనుగ్రహమును బొంది, తామ్రపర్ణి నదిని జూడుఁడు. ఓ వానరులారా! మీరంతవరకును సీతకై బాగుగా వెదకి, యాపైని బాండ్య దేశ ప్రధాన ద్వారమును జూడఁగలరు. అక్కడ నుండి సముద్ర తీరమునకుఁ బోయి దానిని దాటి వెళ్లుట కుపాయము నాలోచించవలెను. ముందుగా నగస్త్యునిచే స్థాపించఁబడిన సర్వ వృక్షములును గైరికాదిధాతువులును గల మహేంద్ర పర్వతమునఁ బ్రవేశించుఁడు. ఆ కొండపైకిఁ దరచుగా దేవేంద్రుఁడు వచ్చి విహరించుచుండును. ఆ కొండపై నుండి నూరు యోజనముల దూరము గల సముద్రమును దాటగా నొక మహా ద్వీపము గలదు.

శ్రీరామునకు బద్ధశత్రువై సంహరింపఁదగిన రావణాసురుఁ డాద్వీపమును బరిపాలించుచున్నాఁడు. ఆ త్రోవలో సముద్ర మధ్యమున నంగారకమను ఛాయాగ్రాహిణియైన రాక్షసి యున్నది. మహాపరాక్రమశాలురగు వానర వీరులారా! మీ రా ద్వీపమునంతయు నే మాత్రమును విడువక సంశయమున్న ప్రతి యంగుళమును వెదకి సీతాదేవిని, రావణుఁ డెక్కడనుంచి నదియుఁ దెలిసికొని రండు. ఆ ద్వీప

మును దాటినచోఁ బుష్పితకమను పర్వతముండును. అది సముద్ర జలంబులచే నావరించి కొనఁబడి యాకాశమునంటు ననేక శిఖరములతో విరాజిల్లుచుండును. ఆ కొండ యొక్క బంగారు శిఖరమును సూర్యుఁడు సేవించగా, నందలి వెండి గల శిఖరమును ఇంద్రుఁడు సేవించుచుండును. కృతఘ్నులును, నీచులును నా పర్వతమును జూడలేరు. పుణ్యాత్ములైన మీరా పర్వతమును దర్శించి, నమస్కరించి యందు బాగుగా వెదకుఁడు. ఆపైని సూర్యవంతమను కొండగలదు. దుర్గమ మార్గమున నాలుగు యోజనముల దూరము వెళ్లగా నది గనుపించును. అందున్న మధురములైన దుంపలను, ఫలములను, తేనెలను తృప్తిగా నారగించి సీతాన్వేషణము గావించుఁడు. అట్లు వెళ్లగా వెళ్లగా నగస్త్య భవనముగల కుంజర పర్వతము గలదు. ఆ భవనమును విశ్వకర్మ నిర్మించెను. ఆ పర్వతము యోజన దూరము విస్తరించి, పది యోజనముల యెత్తు గలిగి యుండును. అక్కడ భోగవతి యను సర్పములు నివసించు పురము గలదు. దానికిఁ జుట్టును మహాబలులైన సర్పములు విషములు గ్రక్కుచుఁ గాపాడుచుండును. ఆ పుర మధ్యయందు సర్ప రాజైన వాసుకి నివసించి యుండును. అంతవరకును గూడ మీరు వెళ్లి సీతను వెదుకవలెను.

ఆ తరువాత వెళ్లగా ఋషభమను పర్వతము గలదు. అందు గోరోచనము, కమలము, హారితము, శ్యామలము,

వనమును మఱియుఁ బెక్కు పట్టణంబులును గలవు. మీరు వానినన్నిఁటిని శ్రద్ధగా వెదకవలెను. సింధు నద సంగమ స్థలమున హిమగిరియగు పెద్ద కొండ గలదు. అదియు నూరు శిఖరములతోడను, బెద్ద పెద్ద చెట్లతోడను, గుహలతోడను, విరాజిల్లుచుండును. ఆ గుహల యందు బెక్కులు గల సింహములు గలవు. అవి యెగిరి వెళ్లి సముద్రమున గల పెద్ద పెద్ద చేపలను నీటియేనుఁగులను బట్టికొని తెచ్చి గుహలలోఁ బెట్టికొని తినుచుండును. ఆ కొండ యందు సింహగర్జనలును, నేనుఁగుల ఘీంకారములును, సముద్ర హోరును మించి వినఁబడు చుండును. అందొక శిఖర మాకాశమునంటి, బంగారమయమై, చిత్రవిచిత్రములైన చెట్లు గలిగియుండును. మీరు పోయి నేను జెప్పిన యాయా స్థలముల నన్నిఁటిని సీతకొఱకు వెదకవలెను. మఱియు వినుఁడు ! ఆ సముద్ర మధ్యమున నూరు యోజనముల విస్తీర్ణము గలిగి పాలియాత్రమను పేరు గల పర్వతమును జూడఁగలరు. అందిర్వది నాలుగు శిఖరములు గలవు. వానియం దగ్నిజ్వాలలతో సమానముగా బ్రకాశించుచుఁ గామరూపులైన గంధర్వులు నివసించి యుందురు. మీరెంతటి వారైనను వారి సమీపమునకుఁ బోరాదు. అంతియేగాక యచ్చటి వృక్షములందు వ్రేలాడు ఫల పుష్పాదులను మీరు తాకరాదు. అచ్చట మహాబలవంతులైన యిరువది నాలుగు కోట్ల మంది వానిని రక్షించుచుందురు. అచ్చట మీరు మీకుఁ దగినట్లుగా సంచరించుచు

సీతాదేవిని వెదుకవలెను. అట్లైన మీకా గంధర్వుల వలన భయము గలుగదు, అటనుండి యా సముద్రమునఁ బోఁగాఁ బోఁగా వజ్ర వైడూర్యములవంటి కాంతిగల వజ్రగిరి గలదు. అందనేకవిధములైన వృక్ష లతాగుల్మములు నిండియుండును. దాని యెత్తు నూరు యోజనాలు. అందలి గుహాల నన్నింటిని మీరు బాగుగాఁ బరిశీలించవలెను. అప్పటికి సముద్రమున మూఁడు వంతులు గడచును. ఆ పిమ్మట చక్ర దంతమను పర్వతము గలదు. విశ్వకర్మ యీ పర్వతమునందే వేయి యంచులు గల చక్రాయుధమును నిర్మించెను, విష్ణుమూర్తి యందున్న పంచజనుని సంహరించి వాని గర్భమునందలి సుదర్శన చక్రమును బాంచజన్య మనెడి శంఖమును దీసికొని యెను. మీరా కొండయందుఁ గల ప్రదేశములనెల్ల వెదుక వలెను. తరువాత నక్కడ కరువది యోజనముల దూరమున బంగారు శిఖరముగల వరాహ పర్వతము గలదు. ఆ యగాధ మైన సముద్రమునఁ బ్రాగ్జ్యోతిషమను పురంబు గలదు.

అచ్చట నరకుఁడను రాక్షసుఁడు నివసించి యుండును. ఆ తరువాత నంతయును గాంచనమయమై సెలయేళ్లతోడను బెద్ద పెద్ద గుహాలతోడను నొక పర్వతమున్నది. అక్కడనే దేవేంద్రునకు సర్వ దేవతలును స్వర్గ రాజ్య పట్టాభి షేక మును గావించిరి. దానిని మేఘవంత మందురు. ఆ పర్వత మును దాటి వెళ్లినచో నరువది వేల శిఖరములు గలిగి, బంగారు పూవులును బండ్లును గల చెట్లతో నొప్పు మహా

పర్వతమును జేరఁగలరు. దాని శిఖరముల మధ్య నొక బంగారు శిఖరము గలదు. ఆ శిఖరమునకు సూర్యుడు, "ఓ శిఖరమా ! నీవు రాత్రింబగళ్లు బంగారు కాంతులతోఁ బ్రకాశించఁగలవు. నీ యందు విహరించు దేవ గంధర్వాదు లెవరైనను బంగారుకాంతులతో వెలుగొందుచుందురు" అనియెను. ఇందే విశ్వేదేవతలు వాయువులు, అష్ట వసువులును, సమస్త దేవతలును సాయంకాల సంధ్య యందు, సూర్యోపస్థానము గావించఁగా (సూర్యుని కెదురుగా దిరిగి వేద మంత్రములతో నమస్కారములు చేయుట.) నాతఁ డస్తమించుచుండును. అట్టి యీ పర్వతమునకును, నస్తగిరికిని బదివేల యోజనముల దూరమున్నది. సూర్యుఁడాదూరము నర్ధనిమేష మాత్రమున నతిక్రమించక యస్తమించును. ఆ యస్తమయ పర్వత శిఖరమున మయునిచే నిర్మింపఁబడి సర్వలోక భాగ్యములకు నాలవాలమైన మహా భవనమున్నది. అందు వరుణదేవుఁడు నివసించు చుండును. నావర్ణ శిఖరికి నస్తమయ శిఖరికిని మధ్యలోఁ బదిశిఖరములును జిత్ర విచిత్రములైన వేదికలును గలిగి కాంచనమయమై, మిక్కిలి యెత్తైన తాటిచెట్టు గలదు. అందు బ్రహ్మ సమానుడైన మేరు సావర్ణి గల పర్వతముండును. అందలి యడవులను, గుహలను వెదుకవలెను. మీరా మేరు సావర్ణి మహర్షికిఁ దలలు నేలను దాకు నట్లుగా నమస్కరించుఁడు. ఆపైని సీతా వృత్తాంతము నాతని నడుగుఁడు. సూర్యుడు దయపర్వతము నుండి యస్తమయ

పర్వతమువరకును గల ప్రదేశంబుల నెల్లఁ బ్రకాశింపఁజేయు చుండును. ఆ పైని సూర్య చంద్రుల ప్రకాశము లేకపోవు టచేఁ జిమ్మ చీకట్లు గ్రమ్మియుండును. కావున మీరు వెళ్లు టకు సాధ్యముగాదు. ఇంతవరకును నేను జెప్పిన ప్రదేశము లన్నింటిని వెదకి వెదకి సీతయొక్కయు రావణునియొక్కయు జాడఁ దెలిసికొని మాసములోగా తిరిగి రండు! మాసము కాలము దాటించి వచ్చినచో మీకు మరణ శిక్షయే విధించఁ బడును. మీ కందఱకును మహావీరుఁడైన నా మామ, సుషేణుఁడు నాయకత్వమును వహించగలఁడు. మీ రీతిని యాజ్ఞానుసారులై ప్రవర్తించుఁడు. ఈతఁడు కార్యసాధనలో మంచి బుద్ధియును, శూరత్వమును గలవాఁడు. మీరును మహావీరులే. కావున సీతనితోఁబోయి కార్యసిద్ధిని బొంది రాగలరు. మీరు సీతాదేవిని జూచి వచ్చినచో శ్రీరాముఁడు చేసిన మహోపకారమునకు నొకింత ప్రత్యుపకారము చేసిన వారమగుదుము. నేను జెప్పినట్లు చేయుచు సమయాను కూల ముగా నీతరోపాయములను గూడ నవలంబించి, యనేక స్థల ములను వెదకిరండు! అనఁగా విని సుషేణాది వానర వీరులు సుగ్రీవాజ్ఞను బురస్కరించికొని మహోత్సాహముతోఁ బడ మర దిక్కుగాఁ బ్రయాణమై వెళ్లిరి.

## సుగ్రీవుఁడు త్తర దిశగా-శతవలి-మొదలైన వారిని-బంపుట

అనంతరము సుగ్రీవుఁడు శతవలిని బిలిచి తనకును శ్రీరామునకును హితకరమైనట్లుగా నిట్లు పలికెను. ఓయీ! శతవలీ! నీకుఁ గోటిమంది సైన్యమును, మంత్రులును గలరు. వారి నందఱను దీసుకొని కుబేర పాలితమైన హిమాలయ పర్వతశ్రేణి గల యుత్తర దిక్కునకుఁబోయి నేను జెప్పిన చోప్పున సీతాదేవి యున్న చోటును దెలిసికొని రావలయును. కార్యసాధనా నైపుణ్యము గల యో వానరులారా! ఈ శతవలిని ముందుంచికొనిపోయి, సీతాదేవి యొక్క క్షేమవార్తను దెలిసికొని రావలయును. అప్లైన శ్రీరామునకు మేము ఋణమును దీర్చికొన్నవారమగుదుము. ముందుగా వచ్చి, కోరిన కార్యము నెరవేర్చినచో జన్మము సార్థకమగును. అట్టియెడ తానేముందుగా నుపకారము చేసినవానికి ప్రత్యుపకారము చేయుటలో వేరుగాఁ జెప్పనేల? శత్రు సంహారకుఁడును, శరణాగత రక్షకుఁడునునైన, శ్రీరాముఁడు సర్వభూత పూజనీయుఁడు. పైగా మనయం దధిక ప్రేమాదర భావములు గలవాఁడు. కావున మీరీ కార్యమును సాధించి యాతని పరిపూర్ణకటాక్షమునకుఁ బాత్రులై, నన్ను ధన్యుని జేయుఁడు.

ఓ వానరులారా! వినుఁడు! మీరందఱును మీ మీ బుద్ధి బలంబుల నుపయోగించి, నేను జెప్ప బోవు ప్రదేశ

ముల నెల్ల సీతాదేవి కొఱకై వెదుకవలెను. మ్లేచ్ఛ పుళింద, శూరసేన, భరత, కురుమద్రక, కాంభోజ,యవన, శకారట్టక, బాహ్లీక, ఋషీక. టాకణ, పౌర, చీన పరమచీన, నీహార, వరద దేశములందు గల యా యా పట్టణంబులను, బల్లెలను, వనములను, నదులను, బర్వతంబులను, సీతాదేవికై శ్రద్ధగా వెదకి కనుగొనుఁడు. ఆపైన హిమాలయమును జేరి వెదకుఁడు. లొద్దుగ చెట్లు గల వనములను, బద్మవనములను, దేవదారు వనములను బాగుగా వెదకి సీతను గనుగొనుఁడు. ఆపైని దేవ గంధర్వాదులచే సేవింపఁబడు సోమాశ్రమమునకు వెడలి, కాళ మను పేరు గల పెద్ద చరియ గల పర్వతమునకుఁ బొండు! ఆ మహా పర్వతమున గల సెలయేళ్లుఁ గుహాలు మొదలగు స్థలములను దిరిగి సీతను వెదకుఁడు. దానిందాటిన హేమ గర్భమను పర్వతమును, సుదర్శనమను కొండను, దరువాతఁ బక్షి సంఘ సేవితమైన దేవ సఖమను పర్వతమును జేరి యా యా స్థలముల నన్నిఁటిని దిరిగి వెదకుఁడు. ఆ పర్వతములనుదాటి యాకాశమున నూరు యోజనముల దూరము విస్తరించియున్న యొకానొక పర్వతమును నందలి గుహాదులను వెదకి వేగముగా తెల్లనైన కైలాస పర్వతమును జేరి కొనుఁడు. అక్కడ విశ్వకర్మచే నిర్మించఁబడి సర్వసంపత్సమృద్ధమైన కుబేర భవనము గలదు. అది మిక్కిలి విశాలమై యుద్యానవనాదులతో నెల్లవేళలను శోభిల్లుచుండును. అందు యక్షరాజైన కుబేరుఁడు సర్వభోగ భాగ్యముల నను

భవించుచు, నెల్లరచే నమస్కరించఁబడు చుండును. ఆ కైలాసమున గల ప్రదేశముల నన్నిఁటిని బాగుగా వెదకుఁడు. ఆపైని క్రౌంచ పర్వతము గలదు. దానిని గుమారస్వాదు బాణముతోఁ గొట్టగా నా చివరినుండి యీ చివరకుఁ బెద్ద బిల మేర్పడినది. ఆబిలమునంతను శ్రద్ధగా సీతకై వెదకుఁడు. ఆపైని మానస పర్వతము గలదు. అది దేవదానవ గంధర్వాదుల కెవ్వరికిని సాధ్యముగానిది. ఇంక సామాన్యుల మాట చెప్పనేల ? ఇప్పుడు నేను జెప్పిన ప్రదేశములన్నియును వెదకి సీతాదేవి క్షేమమును దెలిసికొని నేనుంచిన నెల గడువులో తిరిగి రండు. అట్లు మానస పర్వతమును దాటి పోయినచో మైనాక పర్వతము గలదు. అందు మయుఁడను వాఁడు భవనమును నిర్మించికొని నివసించియుండును. అందు పుఱ్ఱపు ముఖములు గల స్త్రీలుందురు. మీరాయా స్థలములన్నిటిని వెదకుఁడు. ఆ తరువాత సిద్ధాశ్రమము గలదు. అందు వాలఖిల్య వైఖానసాది సిద్ధులుందురు. నిష్కల్మషులై సర్వ సిద్ధులును గల మహర్షులను జేరికొని నమస్కరించి సీతా వృత్తాంతమును వినయముతో నడిగి తెలిసికొనుఁడు. అచ్చటనే వైఖానస సరస్సు గలదు. అందు హంసలు స్వేచ్ఛగా విహరించుచుండును. మఱియు నచ్చటనే కుబేరుని బట్టపు టేనుఁగు గలదు. అది యీ వనమున నాఁడయేనుగుల గుంపులతో విహరించుచుండును. దాని పేరు సార్వభౌమము. ఆ పైని వెలుతురు లేక చిట్ట చీకటిగా

నుండును. అందు నివసించు మహర్షుల దేహకాంతులే యా ప్రాంతములకు వెలుగుల నిచ్చుచుండును. దానిని దాటఁగనే 'శైలోద'మను నది యున్నది. ఆ నదికి రెండొడ్ల యందును గల వెదురు పొదలు గాలికిఁ గొట్టుకొనుచు ధ్వనించు చుండును. ఆవలి యొడ్డు నుండియు నీవలి యొడ్డు నుండియును వెదుళ్లు పొడవుగా వంగి వ్రేలాడుచుండఁగా వాని నాధారముగాఁ జేసికొని మహర్షులానదిని దాటివెళ్లి వచ్చుచుందురు. ఆ తరువాత నుత్తర కురు దేశము లున్నవి.

మహా పుణ్యాత్ములు తమ పుణ్య ఫలముగా నా దేశమున జన్మించు చుందురు. అచ్చట బంగారు పద్మములు వైడూర్య నాళంబులతో ననేక సరస్సుల యందు ప్రకాశించు చుండును. అట్లే యింద్ర నీలములవంటి రేకులును, బంగారు కేసరములును గల నల్లకలువలతో నిండిన సరస్సులును వేనకువేలుగాఁ గలవు ఆ దేశపు నదులలో ముత్యములును, రత్నములును, బంగారపు రజమును గుప్పలు తిప్పలుగాఁ బడియుండును. ఆ నదుల మధ్యలో నక్కడక్కడ బంగారుకొండలును వెలుగుచుండును. అక్కడఁ గల వృక్షములన్నియు నన్ని ఋతువులందును బుష్పించుచు, ఫలములతో నిండియుండును. అందలి కొన్ని వృక్షములు కోరినంతనే స్త్రీ పురుషుల కెవరికైనను నవవస్త్రాభరణాదుల నొసంగు చుండును. మఱికొన్ని నవయౌవనులైన సుందరాంగులకుఁ గోరిన పానీయముల నొసంగు చుండును. ఆయా వనములందు

దేవ, గంధర్వ, యక్ష, కిన్నరాదులు తమ తమ ప్రియురాండ్రతో వచ్చి విహరించుచుందురు. ఆ దేశమునందున్న వారందఱును యౌవనవంతులై వారి వారి యిష్ట భోగముల ననుభవించు చుందురు. ఎక్కడఁ జూచినను సంగీత వాయిద్య విశేషములు వినవచ్చుచుండును. ఇంతయేల ? ఆ దేశమున నెక్కడనైన నెవ్వఁడును బాధలకు గురియైన వాఁడే కానరాఁడు, అట్టి యుత్తర కురు దేశములను వెదకి యాపైని సముద్ర తీరమును జేరుఁడు. ఆ సముద్ర మధ్యమున హేమగిరి గలదు. అది యంతయును బంగారమే. ఇంద్ర లోకంబునకును బ్రహ్మ లోకంబునకును బోవువారిని మీరా గిరియందుఁ జూడఁగలరు. అచ్చట సూర్య గమనము లేకున్నను నా గిరి యొక్క కాంతుల ప్రభావముచే దివ్యకాంతులు ప్రకాశించుచునే యుండును. విశ్వ వ్యాపకుఁడై, యేకాదశాత్మకుఁడైన రుద్రుఁడును బ్రహ్మర్షుల మధ్య వెలుంగు బ్రహ్మదేవుఁడును హేమగిరి యందు తరచు నివసించు చుందురు. పుణ్యాత్ములందఱు నా కొండపైఁ దమ తమ భార్యలతోఁగూడి యిష్ట భోగము లనుభవించుచు నిత్యానందులై యుందురు. అందు గీత వాయిద్యాది ధ్వనులతోఁ బాటు వారి వారి నవ్వులును వినఁబడు చుండును. అచ్చట దరిద్రుఁడుగాని, రోగిగాని, భోగములు లేనివాఁడుగాని యెవ్వఁడును గానరాఁడు. ఆ హేమగిరిని దాటగనే సోమ పర్వతమున్నది. బ్రహ్మ లోకమువారును నింద్రలోకమువారు

నా పర్వతమును జూచుచుందురు. భగవంతుఁడైన బ్రహ్మ గూడ నచ్చటకుఁ దరచుగా వచ్చి పోవుచుండును. అట్టి చోటికి సామాన్యుల కెవ్వరికిని బోవసలవిగాదు. అది దాటిన చో సర్వమును శూన్యమై యుండును. కావున మీరంత వరకే వెళ్లి నేను జెప్పిన ప్రదేశముల నన్నిఁటిని వెదకి, సీతా దేవి క్షేమమును దెలిసికొని మాసములోగా తిరిగి రావల యును. సందర్భానుసారముగా మీకుఁ గనుపించిన యితర స్థలములను గూడ వెదకుఁడు! అట్లు పోయి భక్తి శ్రద్ధలతో సీతను వెదకి యామె యొక్క క్షేమవార్తను జెప్పి శ్రీరామ చంద్రునకును నాకును బరమానందమును గలిగించుఁడు! మీరట్లు మాకు శుభవార్తను దెలిపి మీ మీ భార్యా పుత్రులతో శత్రు సంహారకులై స్వేచ్ఛగా విహరించుఁడు, అని సుగ్రీవుఁడు శతవలి నాయకత్వమునఁ గల సర్వ వానరు లకును హెచ్చరిక నొసంగుచుఁ బంపెను.

## హనుమంతుని విశ్వసించి సుగ్రీవుఁడు-చెప్పగా-రాముఁడతని కుంగర మిచ్చుట

సుగ్రీవుఁ డన్ని దిక్కులకును వానరులను బంపుచు హనుమంతుని యందు గాఢ విశ్వాసము గలవాఁడై యిట్లని యెను. ఓ హనుమంతా! భూమ్యాకాశములందుగాని, జలంబుల యందుఁగాని, నిరాఘాటముగాఁ బ్రయాణము యుచే శక్తి నీకుఁ గలదు. మహావేగము గలవాఁడవు. బుద్ధి

మంతులలో శ్రేష్ఠుఁడవు. దేశ కాలాను సారముగాఁ బ్రవర్తించఁ గలవాఁడు. దేవ గంధర్వ దైత్య రాక్షసుల నివాసములను, సర్వ పర్వతములను బాగుగా నెఱింగిన వాఁడవు. పైగా నీ తండ్రి వాయుదేవుని బలమును, వేగమును గలవాఁడవు. సాటిలేని తేజో విశేషము గలవాఁడవు కావున నీవు సీతాదేవి యొక్క యోగ క్షేమాదుల నన్నిఁటిని తెలిసికొని రాగలవు. అనగా నా మాటలను వినుచున్న శ్రీరాముఁడీ విధముగా నాలోచించెను. ఈ హనుమంతుఁడే కార్యమును సాధించికొనిరాఁగలడు. కావుననే సర్వము నెఱింగిన సుగ్రీవుఁడితనిని బ్రత్యేకించి గౌరవించుచున్నాఁడు అని నిశ్చయించి మహావీరుఁడైన శ్రీరాముఁడు రాజము ద్రాంకితమై ప్రకాశించుచున్న తన వ్రేలి యుంగరమును దీసి, హనుమంతున కిచ్చుచు " ఓ హనుమంతా ! ఈ యుంగరమును జూడఁగనే నావద్దనుండివచ్చిన దూతఁగా సీతాదేవి నిన్ను నమ్మఁగలదు. నీ యొక్క కార్యదీక్షాది గుణ గణంబుల నెల్ల నీ సుగ్రీవుని ద్వారా నేను గ్రహించితిని. కావున నీ వలన నా కార్య సిద్ధి యగునని పరిపూర్ణ విశ్వాసముతో నీ యుంగరమును నీ కిచ్చుచున్నాను" అని పలికెను. ఆ హనుమంతుఁడును వినయ విధేయతలతో నా యంగుళీయకమును శిరసావహించి దోసిలి యొగ్గి శ్రీరామునకు శిరసా పాదాభివందనము గావించి దక్షిణ దిశఁగాఁ గోటి వానరులతో బయులు దేరెను. తనను జట్టువారుకొని వానరు లందఱును వచ్చుచుండగా హనుమంతుఁ డాకాశముపై, నక్షత్రముల మధ్యనున్న చంద్రుని

వలెఁ బ్రకాశించెను. ఓయీ! మహాబలవంతుఁడవైన వాయుపుత్రా! నేను నీ బలపరాక్రమములందును, బుద్ధి విశేషమునందును నాశలుంచి పంపుచున్నాను. తప్పక సీతాదేవి నాకు లభించునట్లు గావించుము" అని ప్రయాణమై వెళ్లుచున్న హనుమంతునితో శ్రీరాముఁడు పలికెను.

## వానరుల ప్రయాణము-వీరఘోష

ఆ విధముగా సుగ్రీవుని మహోగ్ర శాసనమును విన్న వానరులందఱును, భయభక్తులతో నాకాశము నావరించి యన్ని దిక్కులకును మిడుతల పండువలె బయలుదేరి వెళ్లిరి. లక్ష్మణునితోఁ గూడిన శ్రీరాముఁడును నా ప్రస్రవణ పర్వతముపై గల రోజులు నెప్పుడు పూర్తియగునా? యని నిరీక్షించుచుండెను. అన్ని దిశలకును దాను బంపిన వానరులందఱును వెళ్లఁగా సుగ్రీవుఁడు కార్య సిద్ధికై నిరీక్షించుచుండెను. ఆ విధముగా వెళ్లిన వానరులందఱును మహోత్సాహులై రావణుని సంహరింతుము. సునాయాసముగా సీతాదేవిని శ్రీరామునకు సమర్పించఁగలము" అని పెద్దగా నరచుచు బోయిరి. వారిలోఁ బ్రతియొక్కఁడును నేనే రావణ సంహారము గావించి సీతను దొడ్కొని రాఁగలను. మీరందఱు నిక్కడనే యుండుఁడు అని పెద్దగా ఘోషించుచుఁబోయిరి. మఱియు నా రావణుఁడు వనంబులలోఁ గాని

కొండ గుహలలోఁగాని తుదకుఁ బాతాళమునఁగాని సీతను దాచియుంచినను వెదకి వెదకి యా రావణుని వధించి, సీతను దీసికొని రాగలనని యెవనికివాఁడే పెద్దగా ఘోషించిరి. ఆ మాటలన్నియును వినుచున్న సుగ్రీవ శ్రీరామ లక్ష్మణు లానందించిరి.

## సుగ్రీవుఁడు-శ్రీరామునితో-తన భూసంచార కారణమును తెలుపుట

తరువాత శ్రీరాముఁడు సుగ్రీవునితో నిట్లనియెను. ఓయీ మిత్రమా ! సుగ్రీవా ! ఈ సమస్త భువనమును గూర్చియు నీ వింత విపులముగా నెట్లు చెప్పఁగలిగితివి ? అనఁగా సుగ్రీవుఁడు వినయముతో నిట్లు చెప్పదొడఁగెను. శ్రీరామచంద్రా ! సర్వమును జెప్పెదను వినుము ! పూర్వ మొకప్పుడు దుందుభి యను రాక్షసుఁడు దున్నపోతు రూప ముతో వచ్చి వారితో యుద్ధము చేసి, చావునకు భయపడిన వాఁడై పరుగెత్తి మలయ పర్వత గుహలోఁ బ్రవేశించెను. వానిని వెంటఁదరుముచు వాలియు నేనును బోయితిమి. వాలి యా గుహలోఁ బ్రవేశించుచు నన్నా గుహా ద్వారమున నిలువుమని యాజ్ఞాపించెను. అట్లుండఁగా సంవత్సర కాలము గతించినది. తరువాత నా గుహ నుండి రక్తమాంసములు ప్రవహించినవి. ఆ దృశ్యముఁ జూచి నేనాశ్చర్య భయము లతో, నా యన్న చనిపోయినట్లుగా భావించి, గొప్పగా

దుఃఖించితిని. మఱల నా రాక్షసుఁడు బయటకు రాకుండఁగా నందే నశించుఁగాక యని యా గుహా ద్వారమున నొక పర్వతమువంటి పెద్ద రాతిబండ నడ్డముగాఁ బడవైచి తిరిగి వచ్చితిని. నేను గిష్కింధకు రాఁగానే మంత్రులు నన్ను రాజుగాఁ జేసిరి. నేనును నా భార్య రుమ, తార మొదలగు వారితో సుఖించుచు రాజ్యపాలనఁ గావించుచుంటిని, అంతఁ గొన్నాళ్లకు వాలి యాదుందుభిని సంహరించివచ్చెను. వెంటనే గౌరవ పూర్వకముగా సింహాసనంబును దిగి నమస్కరించి నా యన్నకు రాజ్య మప్పగించితిని. అతఁడు మాత్రము నన్ను సంహరించుటకు సిద్ధపడఁగా నేను బరువెత్తితిని. నాతోఁ గూడ నా మంత్రులును బరుగెత్తిరి. ఆ వాలి మా వెంటఁ బడి తరుమఁ జొచ్చెను. అప్పుడు మేము నానావిధ నదులను, బర్వతములను, వనములను, సముద్రములను జూచుచుఁ బర్వెత్తితిమి. నేనప్పు డీ భూమినంతను గోవు యొక్క పాదము వంటిదిగా భావించుచు, నద్దమునందుఁ జూచికొన్న ముఖ మునువలె, నాయా ప్రాంతములందలి సర్వ విశేష విషయము లను జూడఁ గలిగితిని.

ఓ శ్రీ రామచంద్ర ప్రభూ ! ఆ విధముగా నేను నాలుగు దిక్కులను గలవానిని జూచితిని వాలి నన్ను సమీపించఁగా దిక్కులను మార్చుచుఁ బోగాపోగా బుద్ధి మంతుఁడగు హనుమంతుఁడు నన్ను జూచి యిట్లనియెను. ఓ రాజా ! పూర్వ మీ ఋశ్య శృంగ పర్వతమునఁ దపస్సు చేసికొనుచున్న మతంగ మహర్షి వాలిని శపించెను. ఇప్పుడు

నా కది జ్ఞాపకమునకు వచ్చినది. కావున మన మామతం గాశ్రమమునకుఁ బోయినచో, నిర్భయులమై, సుఖముగా నుండవచ్చును. అచ్చటికి వాలి యడుగు నెట్టగనే వాని తల వేయి ముక్కలు కాఁగలదు. ఆ మాటలను విని, నామంత్రు లతో నీ ఋశ్యమూకమును జేరికొంటిని. రామభద్రా ! వింటివి గదా ! ఆనాఁ డావిధముగా భూమినంతయును దిరుగు నప్పుడు, సర్వమును జూడఁగలిగితిని అని సుగ్రీవుఁడు శ్రీరాముని ప్రశ్నకు సమాధానముగా సత్యమైన విషయము నంతయును వివరించి చెప్పెను.

## హనుమదాదులు దప్ప-వానరులు తిరిగి వచ్చుట

సుగ్రీవాజ్ఞాను సారముగా వానరులా యాతావు లన్నిఁటిని తిరిగి సీతాదేవిని గూర్చి వెదకిరి. పగలంతయు నాకాశ మార్గమునఁ దిరిగి రాత్రి కాఁగానే యొకచోట విశ్రాంతి గొనుచుండిరి. మఱియు నాయా ఋతువులందు ఫలించు చెట్ల నాశ్రయించి యాకలి దీర్చికొను చుండిరి. మఱలఁ దెల్లవారఁగనే లేచి సాయంకాలమువరకు నాయా ప్రదేశములందు సీతను వెదకుచుండిరి. ఈ విధముగాఁ దిరిగి తిరిగి సుగ్రీవాజ్ఞ ననుసరించి మాసము రోజులు కాగానే నిరాశతోఁ బ్రస్రవణ పర్వతమును జేరికొనిరి. తూర్పునకు వినతాదులును ,బశ్చిమమునకు సుషేణాదులు, నుత్తర దిశకు శతవలి మొదలైనవారును మాసము దినములును దిరిగి దిరిగి

వచ్చిరి. ఆ వచ్చిన వారందఱును శ్రీరాముని సన్నిధిని గూర్చొని యున్నను సుగ్రీవుని జూచి యిట్లనిరి. మహారాజా! నీవు చెప్పినట్లు మహాగహన ప్రదేశముల నెల్ల విడువక యెన్నో కష్టముల నోర్చి వెదకితిమి. కాని సీతాదేవి దర్శన భాగ్యము నందలేక పోయితిమి. వాయు కుమారుఁడైన హనుమంతుఁడు బలమును బుద్ధి విశేషమును గలవాఁడు. అట్టి వాఁడు రావణుఁడు సీతను గొనిపోయిన దిక్కునకే వెళ్లినాఁడు. అతఁడు తప్పక సీతను గనుగొని మీకు శుభవార్తను వినిపించఁగల సమర్థుఁడు అని సవినయముగా నా వానరులందఱును బలికిరి.

## హనుమదాదులు-సీతను వెదకుట

హనుమంతుఁడు, నంగదుఁడు, తారుఁడు మొదలగువారు సుగ్రీవాజ్ఞాను సారముగా దక్షిణ దిక్కునకుఁబోయి. సీతను వెదుక నారంభించిరి. వారు వింధ్యాద్రికిం బోయి, యందలి గుహాలను మహా వనములను పెద్ద పెద్ద చెట్ల సముదాయములను దిరిగి వెదుక నారంభించిరి. అట్లెంతగా, గష్టించి వెదకినను సీతాదేవిని జూడలేక పోయిరి. ఎంతటి బలశాలురకును నెదిరింప శక్యముగాని, యా వానరులు, వింధ్య పర్వతమునంతను వెదకిరి. అక్కడక్కడ లభ్యమైన ఫలములను, దుంపలను దినుచు విరామము లేక సంచరించిరి. ఆ వింధ్య పర్వతమందొకచోట జలము లేదు. వేరొక చోట శూన్య ప్రదేశమై యున్నది. ఇంకను నొకచోట మితిమీరిన

జల ప్రవాహము లున్నవి. అందలి శిఖరములకును గుహలకును లెక్కయే లేదు. అట్టి దాని యందు సామాన్యులు సంచరించగలవి గాదు. అంతటి దుర్గమ ప్రదేశముల నెల్ల వెదకి వెదకి యొక మహావనమునఁ బ్రవేశించిరి. అచ్చట కండు మహర్షి తన పదునారేండ్ల వయస్సు గల కుమారుఁడు చనిపోవుటచే, మహోద్రేకముతోఁ దపస్సు చేయుచుండెను. ఆ వనమున ఫల, మూల, జలాదు లేవియును లేకుండెను. మఱియు నే విధమైన జంతు జాలమును లేకుండెను. అట్టి ప్రదేశమున తను హనుమదాది వానరులు వెదకిరి. ఆ కండు మహర్షి తన కుమారుఁడు చనిపోవుటచే నా వనమందే జీవులు నివసించుటకును బనికిరానిదిగా శపించెను. అట్టి మరు భూమి నంతను వానరులు అతి కష్టముతోఁ దిరిగి సీతను వెదకిరి. కాని సీతనుగాని, రావణునిగాని చూడలేకపోయిరి. పట్టు విడువక వారొకచోట లతాగుల్మములతో నావరించిన ప్రదేశమును జూడఁగా నచ్చట నొక భయంకరాకారుఁడైన రాక్షసుఁడు గనఁబడెను. వానిని జూడఁగనే మహాబలవంతులైన వానరులు వానిం జుట్టుముట్టిరి. ఆ రాక్షసుఁ డా వానరులను జూచి "ఇదిగో ! మీరందఱును జచ్చి పోయెదరు" అని పలి వాఁడు పిడికిలి బిగించి యా వానరుల మీఁద కురికెను. వానిం జూచిన వానరులు వీఁడే రావణుఁడై యుండవచ్చునని తల పోసిరి. అప్పుడంగదుఁడు లేచి తన యరచేతితో గట్టిగా నొక్క చరపు చరిచెను. ఆ దెబ్బతో వాఁడొక పర్వత శిఖ

రము నేలఁ గూలినట్లుగా పడిపోయెను. అంత నా వానరు లాతఁడే రావణుఁడై యుండుననియు, సీత నా సమీప గుహ యందుంచి యుండవచ్చుననియు నూహించిరి. అట్లు దలఁచి యా గుహానంతను వెదకిరి. అంతటితోఁ బోక యా సమీప మందున్న వేరొక గుహను గూడ బాగుగా వెదకిరి. ఆ విధ ముగా నచ్చటి గుహలను, వనములను వెదకి వెదకి, తుదకు నిరాశాపరులై యందఱు నొక చెట్టు నీడకుఁజేరి కూర్చుండి యాలోచింపఁ దొడఁగిరి.

## హనుమదాదులు-మఱల మఱల-దక్షిణమున-వింధ్యగిరిని వెదకుట

అంత నంగదుఁడు బాగుగా నలసియున్న వానర వీరు లను జూచి యిట్లనియెను. ఓ వానరులారా ! మన మింత వరకును దక్షిణమునఁ గల కొండలను, గుహలను, మహా వన ములను, నదులను, నవియివి యననేల ? సర్వ ప్రదేశములను గష్టించి వెదకితిమి. కాని సీతాదేవిగాని యామె నపహరించిన రావణుఁడుగాని మనకుఁ గాన రాలేదు. కాలము గతించి పోవుచున్నది. సుగ్రీవాజ్ఞను బట్టి, కాలాతి క్రమణము గావించిన మన కందఱకును మరణ దండన తప్పదు. అతని యాజ్ఞకుఁ దనవాఁడనిగాని పైవాఁడనిగాని భేదము లేదు. కావున గడువు లోపల మీరందఱు నింతకంటె నధికముగా శ్రద్ధ వహించి, వెదక వలసియున్నది. విచారముగాని

తొందరపాటుగాని లేకుండగా మంచి యుత్సాహముతో మన మందఱము సీతను వెదుకవలసి యున్నది.

శ్లో॥ అనిర్వేదంచ, దాక్ష్యంచ, మనసశ్చాపరాజయః।
కార్య సిద్ధికరా ణ్యాహుః, తస్మాదేత ద్బ్రవీమ్యహమ్॥
స. 47, శ్లో-6

తా॥ విసుగు లేకుండఁగా ధైర్యోత్సాహములతోఁ బనిజేసినచో నెంతటి కార్యమైనను సిద్ధించునని యనుభవము గల పెద్ద లందురు.

ధైర్యమును బట్టు దలయును విడువకుండుట వీర ధర్మము.

కావున నో వానరులారా! మనమిప్పుడు తిరిగిన ప్రదేశములనే మఱలఁ దిరిగి సీతను వెదకుదము. కర్మఫలము వ్యర్థముగాదు. తప్పక సిద్ధించును. నిస్పృహతో నిట్లు కాలమును వ్యర్థము చేయరాదు. ఇఁక లెండు! సుగ్రీవుఁడు తీవ్రమైన కోపము గలవాఁడు. శ్రీరాముఁడును మహా ప్రభావము గలవాఁడు. కావున వారి యెడల భయ భక్తులఁ జూపించవలెను. ఓ వానరులారా! వింటిరి గదా! ఇంత కంటెను మంచి యుపాయము మీలో నెవరికిఁ దోఁచినను జెప్పుడు! అనఁగా వినుచున్న వారిలో గంధమాదనుఁడు మిక్కిలి దప్పిక తోడను, నాయాసముతోడను, బాధపడుచు మెల్లమెల్లఁగా నిట్లనెను. అంగదా! నీవు చెప్పినదే హిత

మైనది. కావున నట్లే చేయుదము అనఁగా వానరు లందఱు నొక్కమాఱుగా లేచి, మఱల నా వింధ్య పర్వతమునఁగల గుహాదుల నెల్ల వెదుక నారంభించిరి. అట్లు వెదకుచు, శరత్కాల మేఘమువలెనున్న వెండికొండ నాశ్రయించిరి. అందుఁగల యేడాకుల యరఁటి తోఁటలు మొదలైన వాని నెల్ల బాగుగా వెదకిరి. అట్లుగా నాకొండ చివరి వరకును వెదకుచుం బోయి, యెంతకును సీతాదేవిని జూడలేక, విచారముతో నుండి యందలి గుహలన్నిఁటిని వెదకి, చివరకుఁ గ్రిందికి దిగి యొక మహా వృక్షము క్రింద నందఱును గుమిగూడి కూర్చొనిరి. అచ్చట నొక్క ముహూర్త కాలము విశ్రమించి, మఱల దక్షిణ దిక్కుగాఁ బోయి వెదుక నారంభించిరి. ఆ విధముగా నా వింధ్య పర్వతము నామూల నుండి యీ మూల వరకును గొంచెమైన విడువక యెల్ల ప్రదేశములను శ్రద్ధగా వెఁకిరి.

## హనుమదాదులు-ఋక్షబిలమును-ప్రవేశించుట

అంగదుఁడు, తారుఁడు మొదలైన వానరులతోఁ గూడి హనుమంతుఁడు వింధ్య పర్వతము నంతయును గాలించి వైచెను. మఱియుఁ జట్టు చివర కావింధ్య పర్వతమునకు, నిరృతి దిక్కుగా వెళ్లిరి. వారా దిక్కునఁ దిరుగుచుండఁగనే సుగ్రీవుఁడు విధించిన నెల రోజులును గడచి పోయినవి. ఆ దిక్కున నధికమైన గుహలును, వనములును నిండియున్నవి.

అట్టివాని నతి కష్టముతో వెదకుటలో రోజులు గతించి పోయి నవి. అట్లు వారు పట్టు విడువక దిరుగుచుండఁగా నొకానొక గంభీరమైన బిలము గనుపించినది. అచ్చట హనుమంతుఁడు వానరుల నందఱను జూచి యిట్లనియెను. మిత్రులారా! మన మిప్పుడు బాగుగా నలసి పోయితిమి. ఈ బిలమునుండి హంస, సారస, చక్రవాకాది పక్షులు తడిసిన ఱెక్కలు గలవై వచ్చుచున్నవి. ఇందలి చెట్లును జక్కఁగా నీరు గలది వలెఁ గన్పట్టుచున్నవి. కావున నీ బిలమున జల సమృద్ధి గల నుయ్యిగాని, చెఱువుగాని యుండవచ్చును. అనఁగా విని వానరులందఱును ఋక్ష బిలమునఁ బ్రవేశించిరి. అందు వెళ్ళఁగా వెళ్ళఁగా జిమ్మ చీకట్లలముకొని, దట్టమైన పొద లతో నిండినవై కనుపించినది. అందు నవ్వానరుల తేజస్సు గాని, పరాక్రమముగాని, తుదకు కంటిచూపుగాని పసికి రాలేదు. సింహవ్యాఘ్రాది మృగంబులును, పక్షులును మాత్రమందుండి బయటకు వచ్చుచున్నట్లు వారు తెలిసికొ నిరి. వారలా ప్రదేశ మంతయును వెదకిరి. అట్లు కొంత దూరము పోఁగాఁబోఁగా వారికి వెలుతురు గనఁబడినది. ఆ వెలుగులో మిక్కిలి యందమైన ప్రదేశములఁ గనుగొనిరి. అంతవరకును వారందఱు నొకరిచేయినొకరు పట్టుకొని కటిక చీకటిలో యోజన దూరము నడిచిరి. వారంతవరకును జలం బులు గానక దప్పిగొని సొమ్మసిల్లిపోవుచున్నను నెట్లో కొ కిఁ దెచ్చుకొని మెక్కడను నాగకపయనించిరి. అంతనా వెలుతురు

గల ప్రదేశమునఁ గొంత దూరముపోగా నొకచోట నత్యంత మనోహరమును, ప్రకాశమానమునైన బంగారు వృక్షములును, మద్ది తాటిఁ సురపొన్న మొదలగు చెట్లును పుష్పించిన కొండగోఁగు మొదలైనవియును గనిపించినవి. మఱియు వజ్రవైడూర్యాది మణులతో నిర్మించఁబడిన యరుగులును, బంగారు కింజల్కములు(పూవుమధ్యనుండుపొడవైన రేకులు) గల పుష్పములును. నట్లే బంగారు ఫలములును జెట్లనుండి వ్రేలాడుచున్నవి. మఱియు వారామధ్యలో బంగారుమయమైన పద్మములును, జేపలును, దాబేళ్ళను గలిగిన యొక సరస్సును వారుచూచిరి.

ఇంకను నా ప్రదేశమున వెండి, బంగారముల గృహములను ముత్యాలకోవలు వేలాడఁగా వజ్రవైడూర్యాదులతో నిండిన యందమైన ప్రదేశములను జూచిరి. ఆ గృహ ప్రాంగణమున బంగారు ఫల వృక్షములుగల వృక్షములను, రత్నఖచితమైన బంగారు, శయనాసనంబులను జూచిరి. వెండియుఁ బూదేసయలతోడను బరిమళించు మద్యములతోడను, మృష్టాన్నోపేతములైన యాహార పదార్థములను నచట వారందఱును జూచిరి. అందున్న పాత్రలన్నియును బంగారు, వెండివియే. అచట దివ్యాభరణ వస్త్రమాల్యాదులను, దివ్యమైన యగరు ధూపవాసనలును గలవు. ఆ వానరు లాబిలంబునఁగల చిత్రవిచిత్ర వస్తు సముదాయములతోఁగూడిన యాభవనములనెల్ల సీతకొఱకై వెదకిరి. అట్లు వెదకుచుఁ జివరకొక వనితనచటఁ

గాంచిరి. ఆమె నారబట్టలఁగట్టి కృష్ణాజినముపైఁ గూర్చొని యాహారముమాని, తపస్సు గావించుచున్నది. వారలామహా తేజోవిరాజమానయై యున్న యామెనుజూచి భయాశ్చర్యములనందిరి. హనుమంతుడప్పుడామెను సమీపించి వినయ విధేయతలతో "అమ్మా! నీ వెవ్వరిదానవు? ఈ బిలంబెవ్వరిది?" యని ప్రశ్నించెను.

## స్వయం ప్రభతో-హనుమంతుని ప్రసంగము

హనుమంతుఁ డాతాపసిని జూచి మరల నిట్లనియెను. అమ్మా! మేమాకలిదప్పికలతో మహాకష్టముల కోర్చి యీ బిలమును ప్రవేశించితిమి. ఇచ్చటి మహావైభవోపేతమైన సుందరభవనాదులను జూచి యాశ్చర్య పడుచున్నాము. వెండియు నియ్యదియంతయు నేరాక్షసమాయయో? మేమే మగుదుమో?యని దిగులుపడితిమి. ఇచ్చట నీ బంగారుమయము రత్నమయమునైన కట్టడములు మొదలైన వెవరివై యుండునో? ఇవియన్నియు నెవరి తపోబలముచే నిర్మించఁబడినవో? ఏమియుం దెలియక నయోమయస్థితిలో నిశ్చేష్టులమై యున్న మాకుఁ దెలియఁజేయఁ బ్రార్థించు చున్నాము. అనఁగా నాతాపసి హనుమదాదులనుజూచి యీ విధముగాఁ జెప్పుట కారంభించినది.

## ఋక్షబిల వృత్తాంతము-స్వయంప్రభ వానరుల కిచ్చిన యాతిథ్యము

ఓయీ వానరోత్తమా! మాయావియై దానవశ్రేష్ఠుండైన మయుఁడనువాఁడు గలఁడు. ఆతఁడు తన మాయా ప్రభావముచే నీ బంగారము, రత్నములు మొదలైనవానితో గూడిన వనమును, సరస్సులను మఱియు నీ భవనములను నిర్మించెను. ఆతఁడు దానవులకెల్లరకును విశ్వకర్మ (శిల్పి) ఆతఁడొకప్పుడు బ్రహ్మదేవునిగూర్చి వేయి సంవత్సరములు తపస్సుచేసెను. ఆ బ్రహ్మ వలన శుక్రాచార్య రచితమైన సమస్త శిల్పకళా శాస్త్రమును వరముగా సంపాదించెను. తరువాత వాఁడు తన మాయా బలముతో సమస్త కామోపభోగముల ననుభవింపఁగల యైశ్వర్యమున కధిపతియై యీ కాంచనోద్యానవనంబును నిర్మించి యిందుఁ గొంతకాలము హాయిగా సుఖించుచుండెను. అంతట నాతఁడు 'హేమ'యను నప్సరసను గొనివచ్చి యామెతో భోగలాలసుఁడై యుండఁ జొచ్చెను. అది చూచిన దేవేంద్రుఁ డాతనిపై వజ్రాయుధమును బ్రయోగించెను. అంతట మయుఁ డీ స్థలమును విడిచి పోగా బ్రహ్మదేవుఁ డీ బిలమునంతను హేమకిచ్చివైచెను. ఓ వానరవర్యా! నేను మేరుసావర్ణియొక్క కుమార్తెను. ఆ హేమకు స్నేహితురాలనగుటచే నీ బిలంబున గల భవనాదులను రక్షించుచు నుంటిని. నా స్నేహితురాలు నృత్త గీతములం దారితేరినది. ఆమె నన్నెవరును దిరస్కరింపరాని విధముగా వర మొసంగుటచే నేనొంటరిగా నిచ్చట నివసింపఁ

గలుగుచుంటిని. ఓయీ! ఇంతకును మీరందఱు నెవరికిం జెందినవారు? ఈ దుర్గమారణ్యముల కేలవచ్చిరి. ఈ బిలము నెట్లు ప్రవేశించఁగలిగిరి? నాకుఁ జెప్ప గోరెదను. మీరు చాల నలసియున్నారు. ముందుగా నేనిచ్చుం ఫలాదులను, పానీయములను నాతిథ్యముగాఁ దీసికొనుఁడు. మీరు స్వస్థచిత్తులై, మీ విషయము సర్వమును జెప్పుఁడు. అనియామె వానరుల కందఱకును దృప్తిగా నాతిథ్యమిచ్చెను.

## హనుమంతుఁడు-స్వయంప్రభకుఁ-దమను గూర్చి చెప్పుట

ఆ స్వయంప్రభ వానరుల కాతిథ్యమిచ్చి, యిట్లనుచున్నది. ఓ వానరులారా! నే నడిగిన దానికిఁ జెప్పదగిన విషయమైననే చెప్పుఁడు. మీ కనుకూలమై, నేను వినుటకుఁ దగియున్ననే, చెప్పుఁడు! ముందుగాఁ గొంతవడి సేదఁదీర్చికొనుఁడు! అనఁగా నా వానరులందఱు నామెయిచ్చిన యాతిథ్యమును సంతృప్తిగా స్వీకరించిరి. తదుపరి హనుమంతుఁడామెతో వినయపూర్వకముగా నిట్లు పలికెను. అమ్మా! ఇందు రహస్య మేమియును లేదు. వినుము! అయోధ్యాధిపతియైన శ్రీరామచంద్రుఁడు తండ్రిగారి యాజ్ఞ ననుసరించి తమ్ముఁడైన లక్ష్మణునితోడను, భార్య సీతాదేవితోడను, దండకారణ్యములం బ్రవేశించియుండెను. జనస్థానమునందున్న యా శ్రీరాముని భార్యను మోసగించి రావణుఁడు బలా

త్కారముగా నపహరించికొని పోయెను. ఆ శ్రీరాముఁడు మహావీరుఁడైన సుగ్రీవునితో సఖ్యము చేయఁగా, నా సుగ్రీవుని యాజ్ఞచే సీతాదేవిని వెదకుటకు బయలుదేరి వింధ్య పర్వతమును జేరుకొంటిమి. అన్ని దిక్కులకు నందఱు వానరులను బంపుచు మమ్ముల నీ దక్షిణ దిక్కుగాఁ బంపి, సీతను దెలిసికొనిరండని యాజ్ఞాపించెను. మేమీ దక్షిణ దిశనంతను వెదకి వెదకి వేసారి యాకలి దప్పికలతో నాయాసపడుచు నొక చెట్టు క్రిందకుఁ జేరికొంటిమి. అచ్చట మేము విచార గ్రస్తులమై యటునిటు చూచుచుండఁగా నెదుర వృక్షలతా గుల్మములతో నిండి చీకట్లతో నలుముకొనిన బిలము గానవచ్చినది. అందుండి హంసాది జలపక్షులు తడిసిన ఱెక్కలతో బయటకు వచ్చుచుండుట గమనించితిమి. మన మీ బిలమును బ్రవేశించి, దాహమును దీర్చికొందమని నేను వీరందఱికిని జెప్పఁగా, వీరు నాతో నిందుఁ బ్రవేశించిరి. ప్రభు కార్య పరాయణులమైన మేమీ బిలంబునఁ జాల దూరము ప్రయాణము చేసితిమి. ఈ చీకట్లతో నిండిన బిలమున నొకరి చేయి నొకరు పట్టికొని మెల్లగా రాఁగలిగితిమి. అమ్మా! ఇదియే మేమిచ్చటకు వచ్చుటకుఁ గారణము. ఆకలి దప్పికలతోఁ జావు బ్రతుకుల మధ్యఁ గొట్టుమిట్టాడు మా కందఱకు నాతిథ్య మిచ్చి బ్రతికించితివి. మాకుఁ బ్రాణదాతవైన నీకుఁ బ్రత్యుపకారముగా నేమి చేయఁ గోరెదవో సెలవిమ్ము? అని హనుమంతుఁడు స్వయంప్రభను గోరెను.

అంత నామె ధర్మ సూక్ష్మ మెఱింగినదై యిట్లనియెను. బలవంతులును ప్రభు భక్తి పరాయణులు నగు మీరందఱును నేనొసంగిన యీ మంత్రపు టాతిథ్యముతోఁ దృప్తిపడినందు లకు నే నపరిమితానందము నందుచున్నాను. నా ధర్మమును నేను నెరవేర్చికొనుటలో గొప్పఁదన మేమియును లేదు. అంత మాత్రమునకు నేను ప్రత్యుపకారమును గోరను. ఇంతకును నాకే కోరికయును లేదు.

## అంగదుఁడు తన వానరులతోఁ నాబుభుక్షబిలముననే యుండఁగోరుట

స్వయంప్రభ యొక్క నిష్కామ్య ధర్మమునకు హను మంతుఁ డానందించి యిట్లనియెను. ఓ ధార్మికురాలా! మేమందఱము నిప్పుడు నిన్ను శరణు వేడికొనుచున్నాము. ఏమనఁగా మేమీ బిలప్రవేశము చేయునప్పటికే సుగ్రీవుఁడు మా కిచ్చిన గడువు పూర్తియైనది. కావున నాతని మరణ దండన యనుదానికి భయపడుచున్న మమ్మందఱను నీవు రక్షించవలెను. (నీ తపశ్శక్తిచే మా కాలమును వెనుకకు మఱలించుమని భావము) మఱియును మేము సీతాన్వేషణ తత్పరులమై కార్యమును సాధించ లేకపోవుటయే గాక యిక్కడ నుండి బయటఁబడలేక చిక్కువడి యుంటిమి. అనఁగా విని యా తాపసి యిట్లనియెను. ఓ వానరులారా! ఈ బిలమును ప్రవేశించినవాఁడు జీవితముండఁగా బయటకుఁ బోలేఁడు. నా యొక్క తపశ్శక్తిచే మిమ్ములనందఱను బయ

టకుఁ బంపఁగలను. మీరందఱును గన్నులను జేతులతో మూసికొనుఁడు. మీరు బయటకుఁ బోఁగలరు. ఏ యొక్కఁడైన గనులం దెరచినచో వాఁడిచ్చటనే యుండిపోవును. అనఁగా విని వానరులందఱు నెట్లైన బయటపడవలె ననెడి కుతూహలముతో తమ వ్రేళ్లను ముడిచి చేతులతో గట్టిగాఁ గన్నులు మూసికొనిరి. అంత వారందఱు నొక్క నిమిషము లోనే యా బిలమునుండి బయటఁబడిరి. అట్టి వానరులను జూచిన స్వయంప్రభ వారి నోదార్చి మీరిటుచూడుఁడు ! ఇదే వింధ్య పర్వతము. అదిగో ప్రస్రవణగిరి. అల్లదే మహా సముద్రము. మీ కందఱకును శుభము గలుగుఁగాక ! ఇఁక నేను బోవుచున్నాను అని చెప్పి యామె తన యథా స్థలమునకుఁ బోయెను. తరువాత నా వానరులు గంభీరముగా ధ్వని జేయుచున్న మహా సముద్రమును జూచిరి. అప్పటికి సుగ్రీవుఁడొసంగిన గడువు దాటినది. ఇఁక నాతని యాజ్ఞానుసారముగా సీతను దెలిసికొన లేకపోవుటయే గాక, గడువు గూడ మించినందులకు విచారించుచు, నేలఁబడియుండిరి. ఆ సమయమున సమస్త వానర వీర సింహములను జూచి యంగదుఁడిట్లనియెను.

ఓ వానర వీరులారా ! మనము సుగ్రీవాజ్ఞను బురస్కరించికొని యీ దక్షిణ దిక్కుగాఁ బయనించి సీతాదేవిని గష్టముల నోర్చి వెదకితిమి. కార్యమును సాధించ లేకపోవు

టయేగాక యాతఁడిచ్చినన నెల రోజుల గడువును దాటించి వైచితిమి. మన మాశ్వయుజ మాసమున బయలుదేరితిమి. అది గడచినట్లుగా నీ ప్రకృతిలోఁగల మార్పు వలనఁ దెలియుచున్నది. (ఆశ్వయుజ కార్తీకములు గడచినను మార్గశిరమున నైన సీతను వెదుక వలెననియుఁ బుష్య మాసమునఁ దన యొద్దకు రావలెననియు నియమించి పంపుటచే, మొదటి రెండు మాసములు నతిక్రమించినవి.) ఇంక మనము చేయవలసిన దేమి గలదు ? ఆలోచించుఁడు !

మీరు సర్వకార్య నిర్వహణ సమర్థులు. సుగ్రీవుని హితమునే గోరుచు నాతనికి విశ్వాసపాత్రులైనవారు. నీతి శాస్త్రము నెఱింగిన బుద్ధిమంతులు. కావున మీరే యాలోచించుఁడు! సుగ్రీవాజ్ఞచే నా నాయకత్వమున నాతో వచ్చి యున్నారు. ఇప్పుడు సీతను జూడ లేకపోవుటయే గాక గడువుగూడ దాటించితిమి. ఇంక సుగ్రీవాజ్ఞకుఁ దిరుగు లేదు. మనకందఱకును సంఘ మరణము తప్పదు. కావున మనమిచ్చటనే ప్రాయోపవేశముచేసి చావునకు సిద్ధమై, పరుండి యుండుటయే కర్తవ్యము.

సుగ్రీవుఁడు స్వభావసిద్ధమైన క్రూరత్వము గలవాఁడు. అందును నేడు రాజుగా నాజ్ఞాపించినాఁడు. కావున మనలోనే యొక్కని యందును గనికరములేక శిక్షించకమానఁడు, మనకు మరణము తప్పదు. అచట మన బంధువు లందఱి ముందును క్రూరముగా వధింపఁబడుటకంటె నిచ్చటనే

ప్రాయోపవేశముచేసి మరణించుట మంచిది. యౌవ రాజ్యమున నన్ను సుగ్రీవుఁడు పట్టాభిషేకము చేయలేదు. ధర్మాత్ముఁడైన రాముఁడే గావింపఁజేసినాఁడు. సుగ్రీవుఁ డాదినుండియును నాయందు శత్రుత్వముగల వాఁడగుట నీ సమయమున నన్నుగూడఁ గరుణించఁడు. కావునఁ గిష్కింధలో బంధుమిత్రుల నందఱ నేడ్పించుచుఁ గ్రూరముగాఁ జనిపోవుటకంటె నీ పుణ్యభూమియైన సముద్ర తీరమున నెవరికిని దెలియకుండగా మరణించుట శ్రేష్ఠము. అనఁగా విన్న వానరులందఱును “అంగదా! నీవు చెప్పినదే బాగున్నది. సుగ్రీవుఁడు మనలను జంపుట తథ్యము. రాజాజ్ఞ నుల్లంఘించిన వాఁడు మఱల రాజ సమీపమునకుఁ బోరాదు. కావున సీతా వృత్తాంతమును దెలిసికొనియే యాతనివద్దకుం బోవుట మంచిది” అనిరి. అంతలోఁ దారుఁడు లేచి మీరు దుఃఖించకుఁడు మనము మఱల నీ ఋక్ష బిలమును బ్రవేశించుదము. అందు మనకుఁ గావలసిన సర్వభక్ష్యములును, భోగ్యవస్తువులును గలవు. అందు సుఖముగా నుండి పోవుదము. అక్కడకు సుగ్రీవుఁడుగాని, శ్రీరాముఁడుగాని ప్రవేశింపఁజాలరు. తుదకు దేవేంద్రుఁడైనను రాలేఁడు అని యంగదున కనుకూలముగాఁ జెప్పగనే తారునిమాటల కందఱును సంతసించిరి. మనమందఱము నెట్లు సుఖముగా జీవించెదమో యట్లే చేయుదమనిరి.

## తారుని మాటలను విన్న-యంగదునకు-
## హనుమంతుఁడు - నీతిని జెప్పి భీతిని గలిగించుట

తారుని మాటలను వినిన హనుమంతుఁ డింగిత జ్ఞానము (చెప్పకపోయినను ఎదుటివారి మనస్సులోగల భావము నెఱుంగగల బుద్ధిశక్తి) గలవాఁడగుటచేఁ దారుఁడు చెప్పినట్లు చేసినచో నింక సుగ్రీవుని రాజ్యము, నంగదుఁ డప హరించినట్లే యగునని, నిశ్చయించెను. వాలి పుత్త్రుఁడైన యంగదుఁడు గ్రహణధారణాద్యష్టాంగములు గలవాఁడనియు బాహు బలముతోఁబాటు మనోబలమును సానుబలమును గలవాఁడనియు, బంధుబలముగూడఁ దగినంతగా నున్నవాఁడ నియు, దేశకాలముల నెఱింగి వర్తించు వాఁడనియు, హనుమం తుఁడు తెలిసికొనియెను. శుక్లపక్ష చంద్రునివలెఁ గ్రమాభి వృద్ధిఁ గలిగి, బుద్ధికి బృహస్పతియైన తారుఁడు తనకుపదే శించుఁవాడు కాఁగా సమస్త శాస్త్ర పండితుఁడైన యంగ దుఁడు సుగ్రీవునకు విధేయుఁడై యుండుట మంచిదనియుఁ దలఁచెను. ఇట్లా లోచించిన హనుమంతుఁ డవ్వానరులతో నీ విధముగాఁ బలికెను. అతడప్పుడు చతుర్విధోపాయము లలో భేదోపాయము నుపయోగించి, యావానరులను ఋక్ష బిలమును బ్రవేశించకుండఁ జేసెను. అనఁగా వారికి భయము గలిగించి తారాంగదుల ననుసరించకుండఁ జేసెను.

హనుమంతుఁడు వాలి పుత్త్రి నుద్దేశించి యట్లనెను. అంగదా! నీవు యుద్ధ నైపుణ్యాదులందు నీ తండ్రికంటెను గొప్పవాఁడవా? విరోధులు లేనప్పుడు, చక్కఁగా రాజ్యభార

మును వహించఁ గలవాఁడవే కావచ్చును. కాని విరోధుల ముందు నీ తండ్రివలెనే నీవును జనిపోవలసిన వాఁడవేసుమా! ఈ వానరు లందఱును జంచలచిత్తులు. వీరు తమ యాలు బిడ్డలను విడిచి, నీతో నెంత కాల ముండఁగలరు? నీ యెదుటనే చెప్పుదును. ఏమందువా? ఈ జాంబవంతుఁడును నీలుఁడును, సుహోత్రుడు మొదలగువారును నిన్ననుసరించి యుండరు. వీరందఱును సామదానాద్యుపాయములకు లోఁబడరు. చివరకు దండోపాయమునఁగూడ వీరిని సుగ్రీవునితో వేరుచేయ లేవు.

శ్లో॥ విగృహ్యాసన మప్యాహు ర్దుర్బ లేన బలీయసమ్।
ఆత్మరక్షాకర స్తస్మా న్నవిగృహ్ణీత దుర్బలః॥

స. 54, శ్లో-12

తా॥ ఓయంగదా! వినుము! బలవంతుఁడు దుర్బలునితో విరోధించి యుండవలెనని నీతి శాస్త్రజ్ఞులు చెప్పుదురు కాని దుర్బలుఁడు ప్రజలతో విరోధించి యుండఁగలఁడను మాట యెంతమాత్రమును నీతిగాదు. బలహీనుఁడెప్పుడు నాత్మరక్షణ చేసికొను చుండవలెను. మొత్తముపై బలవద్విరోధము శ్రేయస్సుగాదు సుమా!

బలహీనుఁడు తనను దాను గాపాడుకొనుచు బలవంతునితో సఖ్యముగా నుండుట ధర్మము. బలవద్విరోధ మాత్మవినాశ హేతువు.

హనుమంతుని యుక్తియుక్తమైన మాటలను వినుచున్న వానరులందఱు నాతనితో నేకీభవించిరి. మఱియు హనుమంతుఁడు దండోపాయము నుపయోగించి యిట్లని యెను. ఓయి! అంగదా! నీవు నీ తండ్రికంటె నెక్కువవాఁడవా? తారుఁడు నీకుఁ జెప్పినట్లు స్వబలము లేకపోయినను ఋక్షబిలము నిన్ను రక్షించునని తలఁచెదవేమో? అదియును లక్ష్మణుని బాణములకుఁ జాల తేలికైన విషయము. పూర్వము దేవేంద్రుఁ డీ బిలముపై తన వజ్రాయుధమును బ్రయోగించి, స్వల్పమైన కీడునే గలిగించినాఁడు. లక్ష్మణ బాణములు మాత్ర మీ బిలమునంతను నాకులను, దొప్పలను జీల్చినట్లుగా ముక్కలు ముక్కలుగాఁ జేయఁగలఁడు. ఇంతయేల? మహాపర్వతములనే చీల్చివేయఁగల బాణ పరంపరలు లక్ష్మణుని యొద్దఁ గలవు. అట్టివానికీ బిలమొక లెక్కలోనిది గాదు. శత్రు సంహారకుడవైన యోయంగదా! నీవు సుగ్రీవుని లక్ష్యపెట్టక యీ బిలమును బ్రవేశించిన తోడనే నీతో వచ్చిన వానరు లందఱును నిన్ను విడిచి పోగలరు. వీరా బిలంబునఁ దగిన యాహార పానీయములు లేక, నేలపైఁ బరుండ లేక భార్యా పుత్త్రాది బంధు వర్గమును స్మరించికొనుచు నీతో నుండుట కిష్టపడరు సుమా! అందఱును విడిచిపోయిన పిదప నీ హితమును గోరెడు వాఁడొక్కఁడును లేకపోవుటచే నీవు తృణప్రాయుఁడవగుదువు. సీతాన్వేషణను మానుటయేగాక సుగ్రీవాజ్ఞను దిరస్కరించిన

నిన్ను లక్ష్మణ బాణములు వధించఁగలవు సుమా! నీవు మాతోఁగూడి వినయ సంపన్నుఁడవై వచ్చినచో నా సుగ్రీవుడే నీకుఁ గిష్కింధారాజ్య పట్టాభిషేకము గావించఁగలఁడు. నాయనా! అంగదా! సుగ్రీవుఁ డంతటి మూర్ఖుఁడుగాఁడు, ధార్మికుఁడు. నీ తల్లికిఁ బ్రియమైనవాఁడు. కావున నాతఁడామె యొక్క ప్రియమునే గోరుచుండును. ఆతని ప్రాణములును నీ తల్లికి వశమై యున్నవి. నీ వాతనికిఁ గుమారుఁడ వగుదువు. (సుగ్రీవునకు బుత్త్రులు లేరు) కావున బాగుగా నాలోచించికొనుము. అని హనుమంతుఁ డంగదునకు నీతిని బోధించెను.

## అంగదుఁడు - సర్వ వానరులతోడను - ప్రాయోపవేశము చేయుట

హనుమంతుని మాటలను విన్న యంగదుఁడిట్లనెను. ఆంజనేయా! సుగ్రీవుని యందు ధైర్య స్థైర్య మనశ్శౌచాది సుగుణములున్న అన్నగారి భార్య మాతృదేవి వంటిదిగదా! అట్టి నా తల్లితోఁ గ్రీడించుచున్నాడు. ఇంతకంటెను జుగుప్సాకరమైనపని యేమున్నది ? మహాత్ముఁడైన తనయన్న యుద్ధమునకుఁ బోయియుండఁగా యాగుహాకడ్డముగా బండరాతిని బడవైచి వచ్చినాఁడుగదా? అట్టివానికి ధర్మము యొక్క

డిది? సత్య వాక్పరిపాలకుఁడై, యగ్నిసాక్షిగా మిత్రత్వము నెఱపి ముందుగా నా తండ్రిని జంపి, తనకు రాజ్యము నప్పగించిన శ్రీరాముని నాతని మహోపకారమును మరచిన యాతఁడెంత కృతజ్ఞుఁడో నీకుఁ దెలియదా? లక్ష్మణునకును ధర్మమునకును భయపడి సీతాన్వేషణార్థమై వానరులఁబంపి నాఁడేగాని, నిజమైన భక్తితోఁగాని కృతజ్ఞతతోఁగాని పంప లేదుగదా! ఆ సంగతి నీకుఁ దెలియదా? అంతటిపాపి కృతఘ్నుఁడు చంచలబుద్ధి, వివేకహీనుఁడు నగు సుగ్రీవుని యింటఁ బుట్టిన వానికి బ్రతుకుపైనాశగాని, యితరులకు విశ్వాసముండుటగాని వినాశహేతువే యగుచున్నది. ఆలోచించినచోఁ గుమారుఁడు యోగ్యుడైనను, నయోగ్యుఁడే యైనను, వానికే పట్టాభిషేకము గావించును, అట్లు చేయలేదు. కావున శత్రుపుత్త్రుఁడనైన నన్ను మాత్రము బ్రతుకనిచ్చునా? నేను ముందే యపరాధ మొనర్చితిని. ఏ మందువా? ప్రభుమంత్రోత్సాహ శక్తులులేని యనాథునివలె నేను ఋక్ష బిలమును ప్రవేశింప నుద్యుక్తుఁడనైతిని. ఆ సంగతి వెల్లడిగాఁగా నేను కిష్కింధకుఁబోయి యెట్లు జీవించగలను? నిర్దయగల సుగ్రీవుఁడు తన రాజ్యమున కంటకము గావింప నన్నరిఁదీసి, చంపివేయును. అంతకంటె నేనిచ్చటనే ప్రాయోపవేశముచేసి మరణించుటయే మేలుగదా? మీరందఱును మీమీ యిష్టాసారముగా నన్ను విడిచి పొండు! నేను మాత్రము కిష్కింధకు రాజాలను, ఇదియే నా నిశ్చయము. మీరు కిష్కింధకుఁ

బోయినప్పుడు శ్రీరామ లక్ష్మణులకును, నా తల్లి తారాదేవికిని, రుమాదేవికిని, సుగ్రీవునకును నా నమస్కారములను దెలియఁజేయుఁడు! వారందఱి యోగ క్షేమములను గోరుచున్నట్లు గూడఁజెప్పుఁడు! సహజముగనే పుత్త్రవాత్సల్యముగల నా తల్లి నా మరణవార్తను విన్నంతనే తన జీవితమును గూడఁ జాలించును. అని యింతవరకును మాటలాడిన యంగదుఁడు దుఃఖించుచు దర్భలు పరచుకొని వానిపైఁ బరుండెను.

అట్లున్న యంగదుని జూచి వానరు లందఱును గంటనీరు నింపుచు నేడ్చిరి. మఱియు నందఱును సుగ్రీవుని నిందించిరి. వాలిని బొగడిరి. అంతంబోక వానరు లందఱు నంగదునితోఁబాటు తామును ప్రాయోపవేశమునకు సిద్ధపడిరి. అందఱును స్నానములుచేసి, దక్షిణాగ్రములు దర్భలు పరచుకొని యా యంగదుని జుట్టును దూర్పు ముఖముగాఁ గూర్చొనిరి. వెండియు నావానరులు, శ్రీరాముఁడు వనవాసమున నుండఁగా దశరథుఁడు చనిపోవుటయు, శ్రీరాముఁడు జనస్థానమునఁ బదునాల్గు వేలమంది రాక్షసుల నసహాయశూరుఁడై వధించుటయు, రావణుఁడు సీత నపహరించగా నడ్డుకొన్న జటాయువు మరణించుటయు మొదలైన శ్రీరామచరిత్రఁ జెప్పికొనుచుండిరి. శ్రీరాముని కోపమును వీరత్వమును స్మరించఁగనే యందఱును భయకంపితులైరి. ఆ విధ

ముగాఁ బర్వత శిఖరములవంటి శరీరములతో నావానరులు గోలుగోలున నేడ్చుచు దర్భలపైఁ బరుండిరి. అంత మేఘ గర్జనలంబోలె నా మహాపర్వత గుహాల నుండి యా ధ్వని ప్రతిధ్వనించినది.

## అంగదాదుల ప్రాయోపవేశము - సంపాతి.వారిని సమీపించుట

అంగదుఁడు మొదలగు వా రందఱు నొకచోట దర్భలపైఁ గూర్చొని యుండఁగా నచ్చటకు సమీపముననేయున్న సంపాతి చూచెను. ఆతఁడు జటాయునకు నన్నగారు. చావు లేనివాఁడు. అట్టివాఁ డచ్చటకు వచ్చి ప్రాయోపవేశులై యున్న వానరులను జూచి సంతోషముతో నిట్లనియెను. ఆ దైవము లోకమునఁ గల జీవులకు వారివారి కర్మానుసారముగా నాహారాదుల నొసంగు చుండును. అట్లే నాకు నిప్పుడు చిరకాలము దినఁదగిన యాహారము నా దైవము సమకూర్చినాఁడు. ఈ వానరులలో నొక్కొక్కనినే పట్టి వధించి, కొంతకాలము దినఁగలను. ఒకరు తరువాత నొకనిని బట్టి తీసికొనిపోయి, చంపి తినవచ్చును. అని యనుకొను చుండఁగా, నంగదుఁడు హనుమంతుని బిలిచి ఆంజనేయా! అటుచూడుము ? సీతాదేవి నిమిత్తముకాఁగా యముఁడీ

గ్రద్దలరాజు రూపములో మన కడకు వచ్చినాఁడు. మనము రామ కార్యమును జేయలేకపోయితిమి. సుగ్రీవాజ్ఞాను సారముగా నెలరోజులలో తిరిగి పోఁజాలమైతిమి. ఇప్పుడు మన వానరుల కందఱకును సహించరాని వినాశము సంభవించుటకు సిద్ధముగా నున్నది. ఇటువంటి గ్రద్దయే సీతారక్షణార్థమై, రావణునితోఁ బోరాడి మరణించిన వృత్తాంతము మీ కందఱకును దెలిసినదేగదా! ఆ విధముగా సర్వభూతములును శ్రీరాముని కొఱకై తమ ప్రాణములనైన నర్పించుచున్నవి. సమస్త ప్రాణులును తమతమ భక్తి ప్రపత్తుల ననుసరించి రాముని సేవించుచున్నవి. అందులకు నిదర్శన మా జటాయువే సుమా! అతఁడు శ్రీరామున కుపకార మొనర్పఁబూని తన శరీరమును విడిచి యుత్తమ లోకములకుఁ బోఁగలిగినాఁడు. ఈనాఁడు మనమును రామ కార్యమైన సీతను వెదకుటకు వచ్చి, సీతను గనలేక ప్రాణములను విడుచుచున్నాము. జటాయువు మాత్రము మనవలె, సుగ్రీవునకు భయపడి ప్రాణములను విడువలేదు. రావణునితో యుద్ధము చేసి, రామానుగ్రహమునే కోరినదియై శరీరమును విడిచి ముక్తి నందినది. అతఁడే ధన్యజీవి అని యీ విధముగా నొకడాని వెంటనొకటిగా సంబంధమును గల్పించికొని, కైకవరములను గోరుటయు, శ్రీరాముఁడు దండకారణ్య వాసము చేయుటయు జనస్థానమునఁ బదునాలుగు వేలమంది రాక్షసులను శ్రీరాముఁడొక్కఁడే సంహరించుటయుఁ దరువాత

నాతఁడు సుగ్రీవునితో సఖ్య మొనరించుటయు, వాలిని జంపుటయు మొదలు గాఁగల శ్రీరామచరిత్ర నొకరికొకరు చెప్పికొను చుండిరి. మహాధీరుఁడైన యాసంపాతి యంగదుని మాటలనుబట్టి తన తమ్ముఁడు మరణించి దుఃఖవార్తను విని వానరులందఱును దర్భలపైఁ బడియుండుటను జూచి యావానరుల సన్నిధికింబోయి యిట్లనుచున్నాఁడు.

## సంపాతి - జటాయువు యొక్క - మరణమునకు - దుఃఖించుట

ఓ వానరులారా! నా ప్రాణానికిఁ బ్రాణమై, యత్యంత ప్రేమపాత్రుఁడైన నా తమ్ముని మరణవార్త విన్నంతనే నేను జీవచ్ఛవమైతిని. ఈ చెప్పిన యీతఁడెవరు? మీరందఱు నెవరు? జన స్థానమున రావణునితో జటాయువునకు యుద్ధమేల కలిగినది? చాల కాలమునకు నా తమ్ముని పేరు వింటిని. కావున లేవలేనిస్థితిలో నున్న నన్ను మీ మధ్యకుఁ దీసికొనిపోయి, నా తమ్మునిగూర్చి విపులముగాఁ జెప్పుఁడు. సుగుణాత్ముఁడును మహాపరాక్రమశాలియునైన నా తమ్ముని పేరు చాల కాలము గతించిపోగా, యీ నాటికి మీ వలన వినఁగలిగితిని. కావున వానరోత్తములారా! నా తమ్ముని మరణమునకుఁ దగిన కారణమును జెప్పఁగోరుచున్నాను.

శ్రీరాముని తండ్రియైన దశరథ మహారాజునకు నా తమ్ముఁడు మిత్రుఁడెట్లయ్యెను ? ఓ వానరులారా! సూర్యకిరణముల వేడికి నా రెక్కలు గాలిపోయినవి. నేను మీ మధ్యకు రాలేను. నా రాకకు మీరు సహాయపడుఁడు అని సంపాతి వేడికొనెను. కాని యాతని నా వానరులంత తేలికగా విశ్వసించ లేకపోయిరి. వీఁడెవఁడో మనలను దిని వేయుటకే మాయమాటలాడుచున్నాఁడని భావించిరి. అందులోఁ గొందఱు మాత్ర మిట్లనిరి. మన మందఱమును చావునకు సిద్ధపడిన వారమేగదా! నిజముగా వాఁడు మనలను జంపితిన్నచో వేగముగనే మన కోరిక నెరవేరును అని పలికిరి. ఆ సమయమున నంగదుఁడు తానున్న చోటి నుండి సంపాతివద్దకు వెళ్లి యాతనితో నిట్లనెను.

## అంగదుఁడు - సంపాతికిఁ దననుగూర్చి - చెప్పుట

ఓ గృధ్ర రాజమా! వినుము! ఋక్షరజుఁడను వానర రాజుండెడివాఁడు. అతని కమోఘ బలవీర్య సంపన్నులైన వాలి సుగ్రీవు లనెడి యిద్దరు కుమారులు. వారిలోఁ బెద్దవాఁడైనవాలి యీ లోకములోఁ దిరుగులేని పరాక్రమము గల వానిగాఁ బేరొందెను. అతఁడే నా తండ్రి. పెండియు వినుము! ఈ సమస్త భూమిని బరిపాలించు మహారాజవర్యుఁ డిక్ష్వాకుఁడు. ఆతని వంశీయుఁడును మహారథుఁడును నగు శ్రీ

రాముఁడు దండకారణ్యములకుఁదండ్రియైన దశరథ మహారాజు నాజ్ఞచేఁ దమ్ముఁడైన లక్ష్మణుని దోడను, భార్య సీతాదేవి తోడను వచ్చెను. ధర్మప్రవర్తకుఁడైన శ్రీరాముఁడు వనములం బ్రవేశించవలసి వచ్చెను. ఆ సమయమున శ్రీరామ లక్ష్మణులను మోసగించి రావణాసురుఁడు సీతాదేవి నపహరించెను. అట్లు సీతను బలాత్కారముగాఁ గొనిపోవుచున్న రావణుని జూచి దశరథ మిత్రుఁడైన నీ తమ్ముఁడు జటాయువు వాని నడ్డగించి, వాని రథంబును, ధనుస్సును ముక్కలుగాఁ జేసెను. మఱియు వాని శరీర మంతయును గాయపరిచి వృద్ధుఁడగుటచే నలసియుండఁగా నా రాక్షసు, డాతని ఱెక్కలను దన ఖడ్గముతో నరికివైచి నేలంబడఁగొట్టెను. తరువాత నా రావణుఁడు నిరాటంకముగా సీతను గొనిపోయెను. మఱి కొంత సేపటికి శ్రీరామలక్ష్మణులు సీతను వెదకుచు వచ్చి జటాయువును జూచి యాతని సాహసమునకాశ్చర్యపడిరి. అంత వరకును బ్రాణములతోనున్న జటాయువు జరిగిన సంగతిని జెప్పి చనిపోయెను. అంత శ్రీరాముఁ డాతనికి యథావిధిగా నన్ని సంస్కారాదులఁ గావించి జలతర్పణములను విడిచి యుత్తమ లోకములకుఁ బంపెను. అటనుండి వచ్చుచు నా రామలక్ష్మణులు కబంధుని మాటనుబట్టి సుగ్రీవునితో స్నేహము గావించిరి. నా తండ్రికి బద్ధ విరోధియైన సుగ్రీవుని క్షేమముగోరి, శ్రీరాముఁడు నా తండ్రియైన వాలి నొకే బాణముతో సంహరించి, సుగ్రీవునకుఁ గిష్కింధా రాజ్యము

నకుఁ బట్టాభిషిక్తుని గావించెను. అట్టి సుగ్రీవాజ్ఞచే సీతాదేవిని వెదకుటకీ దిశగా మేము వచ్చితిమి. రాత్రియందు సూర్యకాంతిని గనలేని విధముగా మేము సీతాదేవి నెంతగా వెదకినను, జూడలేకపోయితిమి. మేము దండకారణ్యము నంతను వెదకి ఋక్ష బిలమును ప్రవేశించితిమి. మేమక్కడ నుండఁగనే సుగ్రీవుఁ డిచ్చిన గడువు మాసము రోజులును గడచిపోయినవి. ఇంక వ్యర్థ ప్రయత్నముతో నారామలక్ష్మణులను జూడలేక సుగ్రీవాజ్ఞయైన మరణశిక్ష నక్కడనందలేక యీ పవిత్ర క్షేత్రమునఁ ప్రాయోపదేశమును జేయుటకు నిశ్చయించి యిట్లుంటిమి. అని యంగదుఁడు పలికెను.

## సంపాతి-తన వంశమును జెప్పి-సీత-లంకలో నున్నట్లు వివరించుట

అంగదుఁడు పై విధముగాఁ దన వృత్తాంతమును జటాయువు మరణమునకుఁ దగిన కారణమును జెప్పుచు శ్రీరామ చరిత్రను సంగ్రహించి చెప్పఁగా సంపాతి తన తమ్ముని మరణవార్తకు దుఃఖించినవాఁడై యిట్లనుచున్నాడు. ఓ వానరోత్తములారా! నా తమ్ముఁడు రావణునిచేఁ జంపఁబడినట్లుగా మీ వలన నిప్పుడు వింటిని. కాని ఱెక్కలు లేనివాఁడ నగుటచే నేను నా తమ్మునకుఁ బ్రతిక్రియఁగా రావణుని జంపలేని స్థితిలో నుంటిని.

పూర్వ మొకప్పుడు మా సోదరులము పరస్పర వేగ విశేషమునకు బరీక్షించి కొనుటకై యాకాశమున కెగసి, సూర్యమండలమునకు నెదురుగాఁ బోవుచుంటిమి. అప్పటికి సూర్యుఁ డాకాశ మధ్యయం దుండుటచే నా తమ్ముఁ డావేడికిఁ దట్టుకొనిఁజాలక వివశుఁడై సొమ్మసిల్లెను. నేనప్పుడు చేయునదిలేక, ప్రేమతో నాతనికి నా ఱెక్కలను గప్పి రక్షించితిని. ఆ తరుణమున సూర్యకాంతికి నా ఱెక్కలు గాలిపోయినవి. అంతటి యెత్తు నుండి నేనీ వింధ్య పర్వతమునఁ బడితిని. నా తమ్ముఁ డెక్కడ వడియెనో? యేమయ్యెనో? నేటి వరకును నాకుఁ దెలియలేదు. అనఁగా వినిన యంగదుఁ డిట్లనెను. ఓ సంపాతీ! నీవు దీర్ఘదర్శివి. ఆ రావణుఁ డెక్కడ నున్నాఁడో? సీతాదేవి నెక్కడ నుంచినాఁడో? నీకుఁ దెలిసినచోఁ జెప్పుము. అనఁగా నా సంపాతి యిట్లనెను.

ఓయీ వానరోత్తమా! నేను ఱెక్కలు లేనివాఁడ నగుటచే మాటలతో శ్రీరామ సేవచేసికొందును. వినుము! నేనొకప్పుడు వరుణ లోకములైన యతలవితలాది లోకములను త్రివిక్రమావతారమున మహావిష్ణువు పాదముంచిన యూర్ధ్వ లోకములను దిరిగినవాఁడను. అమృత మథనమును దేవాసుర యుద్ధమును జూచినవాఁడను, అట్టి నేను శ్రీరామ కార్యమును మీరడుగకుండఁగనే ముందుగాఁ జేయవలసినది. కాని యిప్పుడు ఱెక్కలు లేని వృద్ధుఁడను, ఎట్లో ప్రాణములతో జీవించి యుంటిని. యౌవనవతియు, సౌందర్యవతియు

నగు కాంతను రావణుఁడు గొనిపోవుచుండఁగాఁ జూడఁగలిగితిని. ఆమె "ఓ రామా! లక్ష్మణా!"యని బిగ్గరగా నేడ్చుచు వస్త్ర భూషణాదులు గదలిపోవుచుండఁగా నామె యాత్మనితోఁ బెనగులాడు చుండుటను గూడఁ జూచితిని. నల్లని పర్వత శిఖరముపైఁ దోచు సూర్యకాంతవలె నామె పచ్చని పట్టువస్త్రము రావణుని సన్నిధిని ప్రకాశించినది. ఆమె "రామా! యనుటచే నామెయే సీతయని ఇప్పుడు భావించుచున్నాను. ఆ రాక్షసుఁ డున్నచోటును జెప్పెదవినుఁడు! విశ్రవసు కుమారుఁడును, కుబేరుని తమ్ముఁడునైన యారావణుఁడు సర్వాంగసుందరముగా విశ్వకర్మచే నిర్మించఁబడిన లంకాపురమున నున్నాడు. ఆ లంకాపుర మిచ్చటకు నూరు యోజనముల దూరము నందున్నది. దానిని జుట్టుకొని సముద్ర మున్నది. అంతయును బంగారము, రత్నములు ననువానితో నిర్మాణమైన యా పురము నందు, రాక్షస స్త్రీలచే రక్షింపఁబడు చున్నదై, సీతాదేవి యున్నది. జనక కుమార్తెయైన యా శ్రీరామ భార్యను, మీరచ్చటకుఁ బోయి చూడఁగలరు. ఈ సముద్రము నూరు యోజనముల దూరమును దాటివెళ్లి వేగముగా సీతాదేవిని జూచిరండు! నా యొక్క దివ్యమైన జ్ఞానదృష్టితోఁ జూచి చెప్పుచున్నాను. మీరు సీతను జూచి క్షేమముగా మఱలి రాగలరు. ధాన్యజీవులైన పిచ్చుకలు మొదలైన పక్షులు, భూమికి దగ్గరగా

మొదటి మెట్టులో నాకాశముపైఁ దిరుగును. కాకులు మొదలైనవి కొన్ని రెండవ మెట్టునఁ దిరుగును. నీటి కాకులును క్రౌంచ పక్షులును మొదలైనవి. మూఁడవ మెట్టుపైఁ దిరుగఁ గలవు. డేగ లాపైని నాల్గవ కక్ష్యలో నెగురఁగలవు. గ్రద్దలు వీని నన్నిఁటిని మించి యైదవ మార్గమున నాకాశముపై నెగురఁగలవు. రూప సంపదఁ గలిగి, బలముగల హంసలారవ మార్గమున విహరించఁ గలవు. వినతా పుత్త్రిలగు నరుణుని యొక్కయు, గరుడుని యొక్కయు వంశీయు లేడవమార్గమున స్వేచ్ఛగాఁ దిరుగాడుదురు. వానరులారా! మే మరుణ వంశమునఁ బుట్టిన వారము. కావున మాకు నేడవ మార్గము దాటి యాపైని దిరుగుశక్తి గలవారము. నేనిచ్చట నుండియే నూరు యోజనముల దూరమున నున్న రావణుని సీతను జూడఁ గలిగితిని. కారణ మేమనఁగా ? గరుత్మంతునివంటి దృష్టియు మహాబలంబును నాకుఁ గలవు. ఇంతకును మాయాహార విహార నియమముల వలనను, బల సంపద వలనను నాకు నూరు యోజనముల వరకును జూడఁగల శక్తి గలదు. కోళ్లకుఁ బాదముల ముందున్న దానినే యాహారముగా గ్రహించుటయును మాకు బహుదూరము నందున్న యాహారమును గ్రహించుటయును భగవంతునిచే విధింపఁబడినది. మీరు లంకకు వెళ్ళి వచ్చి, శ్రీరామునకు సీతా వృత్తాంతమును దెలియఁజేయుఁడు. శ్రీరామునిచే రావణుని వధింపఁ జేసినచో, నా తమ్ముని జంపినందులకు నేను బ్రతిక్రియఁ

జేసినవాఁడ నగుదును. నా తమ్మునకు స్వర్గమునం దాత్మ శాంతియును లలుగును. కావున మీరు నేను జెప్పినట్లు సముద్రమును దాటి లంకకుంబోవుట కుపాయ మాలోచించుఁడు! ఓ వానరులారా! నన్నిప్పుడు సముద్ర తీరముకుఁ గొని పొండు! నా ప్రియ సోదరుఁడైన జటాయువునకు జల తర్పణములఁ గావించి కొందును. అని వేడుకొనఁగా విని, బలాఢ్యులైన వానరులు సంపాతిని సముద్ర తీరమునకుఁ గొనిపోయిరి. అతఁడక్కడ తమ్మునకుఁ దర్పణములు విడువఁగనే మఱల నాతనిని వారు యథాస్థానమునఁ జేర్చిరి.

## సంపాతి యొక్క - కుమారుఁడు సుపార్శ్వుఁడు చెప్పిన - సీతా వృత్తాంతము

సంపాతి చెప్పిన మాటలకు వానరు లాశ్చర్య చకితులైరి. అప్పుడు జాంబవంతుఁడు లేచి సంపాతితో నిట్లనెను. ఓ గృధ్ర రాజమా! సీత యెక్కడ నున్నది? రావణుఁడు సీత నపహరించుట నెవఁడైనఁ జూచెనా? ఇంతకు నాయపహరించిన వాఁడు రావణుఁడేనా ? నీకుఁ దెలిసినంత వరకును నా సందేహములను దీర్పఁగోరెదను. ఈ విపత్సమయమున మాకు నీవే గతివై యున్నావు. అనఁగా విని సంపాతి యా వానరులతో నిట్లనియెను. ఓ వానరులారా! సీతాపహారణకు

సంబంధించిన విషయమును నేను విన్నది విస్పష్టముగాఁ జెప్పెద నాలకింపుఁడు.

నేనీ పర్వత దుర్గమారణ్యమునఁబడి చాలకాలము పరాక్రమహీనుఁడనై యెట్లో జీవితమును గడుపు చుంటిని. అట్టి నాకు నా కుమారుఁడుఁ సుపార్శ్వుఁడను వాఁడు ప్రతి రోజు నాహారమును దెచ్చి యిచ్చుచుఁ బోషించు చుండును. గంధర్వులకుఁ గామముఁబాములకుఁ గోపంబును మాకు నా కలియును జాలతీక్ష్ణములై యుండును. ఒకనాఁడు పుత్రుఁడు సూర్యాస్తమయమైన తరువాత, నాకాహారమును దేకుండఁగనే రిక్తహస్తాలతో నా వద్దకు వచ్చినాఁడు. అప్పుడు నేను వార్ధక్య ముచేత నాకలిని భరింపలేకను, వానిని గద్దించితిని. అప్పుడా తఁడు నా బాధను దెలిసికొని, యదార్థము చెప్పనారంభించెను.

తండ్రీ! నేనాహారార్థమై, యీ మహేంద్రగిరి ద్వారము నాశ్రయించితిని. తరువాత సముద్రము నందుండు జంతుజాలమును బట్టుటకై తలవంచి యా జంతువులు సంచరించు మార్గమున కడ్డముగా నుంటిని. ఆ తరువాతఁ గొంత సేపటికి లేత సూర్యునికాంతితోఁ ప్రకాశించుచున్న యొక కాంతను గైకొని నల్లని కొండవంటివాఁ డొకఁడు గొనిపోవు చుండెను. నేనా దృశ్యమును జూచి యాహారార్థమై యచ్చట నున్నవాఁడ నగుటచే నవ్వారినే యాహారముగాఁ గొనపోవ

నిశ్చయించితిని. అంత వాఁడు వినయముతో మంచి మాటలు పలుకుచుఁ ద్రోవనిమ్మని యాచించెను. వినయముతోఁ బ్రార్థించిన వానిని జంపుట కెవఁడు సిద్ధపడును? అందును నీ కుమారుఁడను. అట్టి నావంటి వాఁడసలే క్రూరత్వమును వహించలేఁడు. నేనాతనిని విడువఁగనే వేగముగాఁ బోయినాఁడు. ఆకాశమున దిరుగు జీవులన్నియును నన్నభినందించినవి. మహర్షులు నన్ను జూచి, "నాయనా! బ్రతికిపోయితివి. వాఁడు స్త్రీనపహరించు తొందరలోఁ బోయినాఁడు" అని పలికిరి. మఱియు సిద్ధులిట్లనిరి. "ఓయీ! ఆ పోయినవాఁడు రావణుఁడు. ఆమె సీత. బలాత్కారముగా నాభరణములను, వస్త్రమును సర్దుకొనుచు ఓ రామా! ఓ లక్ష్మణా! యని ఘోషించుచున్నది. నీవు వినలేదా? ఆమెయే శ్రీరాముని భార్య." అని వారు చెప్పఁగా వింటిని. ఆ రావణుని మూలముగా నింత ప్రొద్దుపోయినది. అని కాలజ్ఞుఁడైన నా కుమారుఁడు చెప్పఁగా వింటిని. అప్పటి నుండియును ఱెక్కలులేని దుర్బలుఁడ నగుటచేఁ గదా రామున కేమాత్రమును సాయపడలేక పోయితినని చింతించితిని. ఏమైనను నాకు వాక్కును, బుద్ధియును జెడిపోలేదు. కావున వానితోడనే రామకార్యమునకు సహాయపడఁ గలను. ఇఁక మీరు మీమీ పరాక్రమ వేగముల నుపయోగించి కార్యమును సాధించుఁడు! రామకార్యమును, నా కార్యమును వేరుగాదు. ఒక్కటే. ఆ సుగ్రీవుఁడు గొప్ప బుద్ధి బల

తేజోవంతులగు మిమ్మీ దిశఁగా బంపినాఁడు. అతఁడును సామాన్యుఁడుగాఁడు. రామలక్ష్మణ బాణములు గూడ ముల్లోకములు నొక్కమారెత్తి వచ్చినను నిగ్రహింప శక్తి గలవి. ఆ రావణుఁడును దేజోబల సమన్వితుఁడే. అయినను సర్వ సమర్థులైన మీకొక లెక్కలోనివాఁడుగాఁడు. మీరింకఁగాలవిలంబన మానుఁడు. బుద్ధిమంతులగు మీవంటివారు కార్యసాధనలో నాలస్యము చూపరు. అని సంపాతి తనకుఁ దెలిసినదంతయును జెప్పి సీతాన్వేషణకై వానరులను బ్రోత్సహించెను.

## సంపాతి-జటాయువునకు-దర్పణము లిచ్చుట

అనంతరము సముద్రపు టొడ్డునకుఁ గొనిపోఁబడిన సంపాతి తమ్మునకుఁ దర్పణములను విడిచి కూర్చుండ నాతనిని వానరు లందఱును జేరి కూర్చొని యుండిరి. వారి మధ్య నున్న యంగదుని జూచి సంపాతి మఱల నిట్లనియెను. ఓయీ! ఈ వానరు లందఱితోడను నిశ్శబ్దముగా నా శక్తి సామర్థ్యములను గూర్చి చెప్పెదను వినుము!

## సంపాతి యొక్క-వృత్తాంతము

ఓయీ! అంగదా! పూర్వము నా ఱెక్కలు గాలిపోయిన విషయమంతయును జెప్పఁగా వింటివి గదా! తరు

షాత వృత్తాంతమును వినుము. నే నా విధముగా ఱెక్కలు గాలిపోయి యీ వింధ్య పర్వతమునఁబడి సొమ్మసిల్లి యుంటిని. అట్లుగా నారు దినము లుండి, యనంతరము తెలివిఁ దెచ్చుకొని, దప్పికతోఁ బరవశుఁడనై యన్ని దిక్కులను జూచితిని. ఆ ప్రదేశ మేదియో? నా కిప్పటికిని గుర్తు లేదు. కాని సముద్రతీరమును, నందలి వన ప్రదేశములను జూడఁ గలిగితిని. అప్పుడిది సముద్ర తీరమని గ్రహించితిని. ఆ పర్వతము నందలి మృగముల యొక్కయు, బక్షుల యొక్కయు జాడలంబట్టి. యిది దక్షిణ దిశ యనియు వింధ్య పర్వత మనియు గ్రహించితిని. మఱియు నడవులతోడను గుహలతోడను నా పర్వతము నిండి యున్నది. ఆ ప్రదేశ మునఁ బవిత్రమై దేవపూజనీయమైన యొక యాశ్రమమును జూచితిని. అందు మహా తపస్సంపన్నుఁడైన 'నిశాకర' మహర్షి యుండెను. ఆ మహర్షి సిద్ధిని బొంది, నేటి కెనిమిది వేల సంవత్సరములైనది. అప్పటి నుండియు నే నీ యాశ్రమ మును విడువక నివసించు చుంటిని. మొదట ఱెక్కలులేని నేను బహుకష్టముతో మిట్టపల్లము లందు దొరలివడుచు రాయిరప్పల తాకిడి కోర్చుకొనుచు, వింధ్య శిఖరము నుండి మెల్లగాదిగి, ఋషులు కోసివేయఁగా మఱలఁ జిగిర్చిన దర్భ మొక్కలుగల యీ యాశ్రమమున కెట్లో చేరఁగలిగితిని. అందున్న నిశాకర మహర్షి నింతకుఁబూర్వము నా తమ్ముఁడును, నేనును దరచుగా వచ్చి సేవించెడివారము. అందుచే

నా మహర్షి యందు చనవు గలిగి, దర్శింపఁగోరితిని. అయ్యాశ్రమ వృక్షము లన్నియును నిత్య పుష్పఫల భరితములై యుండును. కావున దూరము నుండియే వాని పరిమళము లతోఁ గూడిన చల్లని గాలి వీచినది. నేనా యాశ్రమ సమీపమునఁగల యొక్క చెట్టు నీడను గూర్చొని యా మహర్షి యొక్క దర్శన భాగ్యమునకై వేచియుంటిని. అంతఁ గొంత సేపటికిఁ దన తేజస్సుచే నలు దిక్కులను బ్రకాశింపఁ జేయుచు, స్నానాదులు గావించికొని యుత్తర దిశగా వచ్చుచున్న యా నిశాకర మహర్షి నన్ను సమీపించెను. ఆ మహర్షిని సింహ వ్యాఘ్రాది మృగంబులును, బక్షులును మహా నాగులు మొదలగు జీవరాశులు చుట్టువారు కొని యుండుటను గమనించితిని. ఆతఁడాశ్రమంబునఁ బ్రవేశించఁగనే జీవరాశులు తమతమ నెలవులకుం బోయినవి. కొంతసేపటి కాతఁ డాశ్రమము నుండి బయటకువచ్చి, నన్నుజూచి యిట్లు ప్రశ్నించెను. "నాయనా! నీ ఱెక్కలు కాలిపోయి, శరీర మంతయును గాయములతో నిండినది. నీ మొదటి రూపమే మారిపోయినది. మీ యన్నదమ్ము లిద్దరు గదా? మీరు గృధ్ర రాజులు. కామరూపులు గదా! నేఁడు నీ వొక్కడివే యిట్టి దురవస్థంబడి వచ్చితివేల? ఓ సంపాతీ! మానుష రూపముతో నాకుఁ బాదాభివందనమును జేయుము. ఇట్టి నీ దురవస్థకుఁ గారణమును జెప్పుము"! అని పలుకగా, నా మాటలను విని, యాతని పాదములకు నమస్కరించి సూర్యకిరణ

ములచే నా ఱెక్కలు కాలిపోవుట మొదలు గాఁగల జరిగిన విషయము నంతను జెప్పితని.

## నిశాకర మహర్షి - సంపాతి ననుగ్రహించుట

ఓ భగవాన్! మహర్షీ! నేనిప్పు డీ శరీరముపై నున్న గాయములతో నాయాసపడు చుంటిని. కావున విస్తరించి మాటాడలేను. నా తమ్ముఁడు జటాయువును, నేనును నాకాశముపై మహోన్నత దూరమునకుఁ బోయి క్రిందికిఁజూడఁగా భూమిపైనున్న మహా పర్వతములును నదులును మిక్కిలి సూక్ష్మములై కనుపించినవి. అంత దూరమున నుండుటచే మాకు భయమును, దుఃఖమును గలిగి యొడలు చెమటలు గ్రమ్మినవి. ఆ సమయమున మూర్ఛావస్థలో నుంటిమి. మాకు దిక్కులేవియును దెలియ లేదు. ప్రళయ కాలమున సర్వము నొకే రీతిగా నున్నట్లు తోఁచినది. ఆ సమయమున నేత్రముల దృష్టిగూడఁ దప్పినది. అప్పటికిని మనస్సు నెట్లో నిగ్రహించికొని సూర్యుని జూడఁ గలిగితిమి. ఆ సూర్య బింబము భూమికంటెఁ బెద్దదిగాఁ జూపట్టినది. ముందుగా జటాయువు భూమిపైఁ బడిపోయెను. తరువాత నేనును భూమిపైఁ బడితిని. నా ఱెక్కల చాటున నుండుటచే జటాయువు సురక్షితుఁడయ్యెను. నా ఱెక్కలు కాలిపోవుటచే

గాలిని మాత్రము మాధారముగాఁ జేసికొని యది యెటు వీచిన నటేపోయి యీ వింధ్య పర్వతముపైఁ బడితిని. జటాయువు దండకారణ్యములలోఁ బడి యుండ వచ్చునని యూహించితిని. నేను నా రాజ్యమును, రెక్కలను, సోదరుని బోఁగొట్టుకొన్నవాఁడనై యింక నా బ్రతుకేల? అని బాధ పడితిని. ఓ వానరులారా! పై విధముగా నిశాకర మహర్షికి నా వృత్తాంతమును జెప్పి, యేడువ నారంభించితిని అంత నా భగవంతుఁడైన మహర్షి నన్నోదార్చి, తన దివ్యదృష్టిచే నంతయును నెఱింగి నాతో నిట్లనియెను.

నాయనా! సంపాతీ! శ్రద్ధగా వినుము! ఇక్ష్వాకు వంశమున దశరథుఁడను మహారాజుండును. అతని పుత్త్రుండే శ్రీరాముడు. అతఁడు తమ్ముఁడైన లక్ష్మణునితోడను, భార్యయైన సీతాదేవి తోడను, తండ్రియొక్క ఆజ్ఞానుసారముగా నడవులకు రాఁగలఁడు. అప్పుడు రావణుఁడు శ్రీరామ లక్ష్మణులను మోసముచేసి, యొంటరిగానున్న సీత నపహరించును. ఆ సీత కనేక విధములైన యాభరణాదులను భక్ష్య భోజ్యాదులను నొసంగి, ప్రలోభ పెట్టుటకుఁ బ్రయత్నించును. సీతాదేవి వాని నన్నిఁటిని దృణప్రాయముగాఁ జూచి శ్రీరామునే కాంక్షించి ధ్యానించు చుండును. దుఃఖ సముద్రమున మునిఁగిన యా సాధ్వీ మతల్లికిఁ బంచభక్ష్య పరమాన్నముల నొసంగినను వానిని జేత ముట్టదు. సరిగదా కన్నెత్తి చూడనైనఁ జూడదు. శ్రీరామ లక్ష్మణు లొకవేళ

స్వర్గస్థులైనచో "వారికీ యన్నమే యాహారమగుఁగాక!" యని నేలంబొర వైచును. ఓ సంపాతీ! సీతను వెదకుటకై శ్రీరాముని చేఁ బంపఁబడిన వానరు లీ ప్రాంతమునకు రాఁగలరు. నీ వవ్వారికి సీతా వృత్తాంతమును జెప్పఁగలవు. ఏదో యొక విధముగా జీవించుచు నీవిచ్చటనే యుండుట మంచిది. ఇంతకును ఱెక్కలులేని నీ వెక్కడకుఁ బోఁగలవు? దేశ కాలంబుల గమనించుచు నీ విక్కడనే యున్న యెడల శ్రీరామానుగ్రహముచే నీకు ఱెక్కలు గూడ రాఁగలవు. నేను నీకిప్పుడే ఱెక్కలు గలుగునట్లు చేయఁగలను. కాని యీ విషయమున నా మన ముత్సాహము చూపుటలేదు. ఏలనన? నీవిక్కడే పడియున్నచో సర్వ లోకోపకారమును జేయఁగలవు. కావున నీ యాశ్రమమును విడిచి, యెచ్చటకును వెళ్ళవలదు. ఆ రామ కార్యము నీకేగాక దేవర్షి బ్రాహ్మణాదులకును, దేవేంద్రునకును ముఖ్య కర్తవ్యమై యున్నది సుమా! ఆ శ్రీరామ లక్ష్మణులను దర్శించవలెనని నాకు గాఢమైన వాంఛగలదు, కాని యీ శరీర మంతవరకును నిలువదు, అని యీ నిశాకర మహర్షి రాఁబోవు సంగతుల నన్నింటిని నెఱింగినవాఁడై యనుగ్రహముతో నాకుం జెప్పెను.

## సంపాతికి - ఱెక్కలు - గలుగుట

ఓ వానరులారా! సత్యసంధుఁడై వాక్శుద్ధి గలిగిన యీ నిశాకర మహర్షి యిట్టి విషయముల నెన్నింటినో

జరుఁగబోవు వానిని జెప్పి, తన యాశ్రమము నందుఁ బ్రవేశించెను. నేనును మెలమెల్లగాఁ బ్రాకి యీ కొండ చివరకుఁ జేరి మీ రాకకు నెదురు సూచుచుంటిని. బ్రహ్మర్షి యొక్క వాక్యము లందలి విశ్వాసముతో దేశకాలములకై నిరీక్షించుచు నీ నాటికి మిమ్ములను గనఁ గలిగితిని. ఆ నిశాకర మహర్షియు నూరు సంవత్సరములు జీవించి మహాప్రస్థానమున కేగెను. (సిద్ధి పొందెను) తరువాత నేనాతనినే స్మరించి కొనుచు బహువిధముల దుఃఖించితిని. ఆతనితో మరణించఁ దలఁచితినే గాని యాతని వాక్యములఁ దలఁచి యిట్లు బ్రతికి యుంటిని. ఆనాఁడాఁతడు చెప్పిన మాటలు యథార్థములగుటచే నగ్నిజ్వాల చీకట్లను బోఁగొట్టినట్లు నా దుఃఖమును బోఁగొట్టినది. నేను నా కుమారునితో "రావణు నెదిరించక పిరికివాఁడవై యేలవచ్చితి"వని గద్దించితిని. (అనఁగా, రామకార్యార్థమై, రావణునిచేఁ జంపఁబడినను నేను సంతోషించువాఁడనే యని భావము.) ఆ సీతా విలాపము నాలించి రాముని భార్యఁగా నెఱింగి దశరథునకుఁ బ్రియంబు గలుగునట్లు ఆమెను విడిపించలేక పోయితివేల!" యనియు నా కుమారుని గసరితిని. అని యీ విధముగాఁ దన వృత్తాంతమంతయును నంగదాది వానరులతోఁ జెప్పెను. అట్లు చెప్పుచుండఁగనే సంపాతికి ఱెక్కలు మొలచి పైకెగిరినది. వానరులందఱు నాశ్చర్యముతోఁ జూచుచుండఁగనే యెఱ్ఱని ఱెక్కలు పైకి లేచినవి. అప్పుడు సంపాతి యిట్లనయెను. ఓ వానరు

లారా! నిశాకర మహర్షి యొక్క యుచితమైన ప్రభావము వలనను శ్రీ రామానుగ్రహము వలను, సూర్య తేజస్సునం గాలిపోయిన ఱెక్కలు మఱల నాకు సంప్రాప్తమైనవి. అంతియేగాక నా వార్ధక్యముపోయి, యౌవన కాలము నాంటి శక్తి లభించినది. మీరు సముద్రమును దాటి లంకకు వెళ్లుటకుం బ్రయత్నించుండు. తప్పక మీ కార్యము సిద్ధించును. ముందుగా, నా ఱెక్కలు నాకు లభించుట యున్నదే శుభసూచన. అని చెప్పి, సంపాతి తన ఱెక్కల శక్తిని బరీక్షించికొనుటకై కొండ శిఖరము నుండి క్రిందికి దిగెను. అప్పుడా వానరులు సంపాతి వాక్యములను విని పరాక్రమవంతులై, పరమానంద భరితులైరి. మఱియు మహా వేగవంతులైన యా వానరు లందఱును సీతాదేవిని సందర్శించినట్లే భావించుచు నా ప్రయత్నమునకు సుముఖులై యొక చోంట గూడి యుండిరి.

## అంగదుండు - వానరులకు - ధైర్యము - చెప్పుట

సంపాతి మాటలను విన్న వానర వీరులందఱు నంగదునితోం గూడి మహానందభరితులై రావణ సంహారము జరిగి తీరునని భావించుచు సముద్రతీరమున నొకచోట సమావేశమైరి. అచ్చట మహా భయంకరమును, గంభీరము నైన

సముద్రమును జూచిరి. సమస్త జల జంతువుల తోడను, నెత్తుగా నెగిరిపడుచున్న కెరటముల తోడను నిండిన దానిం జూచి వానరులందఱును దిగులుపాటు గలవారైరి. అట్టి వానరులు "ఇఁక మనమేమి చేయఁదగు"నని యాలోచన లోఁబడిరి. అట్టి వానరుల కంగదుఁడు ధైర్యమును జెప్పి సమయోచితముగా నిట్లనెను.

శ్లో॥ నవిషాదే మనః కార్యం విషాదో దోషవత్తమః।
విషాదో హన్తిపురుషం బాలం క్రుద్ధ ఇవోరగః॥

64 స, 11

తా॥ ఎట్టి కష్టకాలము నందైనను దుఃఖించరాదు. దుఃఖము కంటె మహాదోష మింకొకటిలేదు. ఏడ్చుచున్న బాలుని గోపముతో నున్న సర్పము గాటువేసి చంపునట్లు విషాదమనునది యెంతవానినైనను జంపివేయును.

కార్యసిద్ధి కెంతటి కష్ట సమయము నందును దుఃఖము నందక ధైర్యోత్సాహముల నవలంబించుట యుత్తమ వీర ధర్మము.

పరాక్రమమును జూపించ వలసినప్పుడు, విషాదము నందినచో నెంతటి స్వల్పకార్యమైనను సిద్ధించదు. కావున మీరందఱును ముందుగా ధైర్యము నవలంబించి యుండుఁడు. ఆ మాటలను విన్న వానరు లందఱును, నిశ్శబ్దముగా నుండిరి. అదిచూచి యంగదుఁడు మఱల నిట్లను చున్నాఁడు. ఓయీ!

మీరందఱును మహా బలాఢ్యులు. ఉత్తమ వంశ సంజా తులు. కార్యసాధన యందు మంచి పేరు ప్రతిష్ఠలను బొందిన బుద్ధిమంతులు. మీలో ప్రతి యొక్కఁడు నడ్డు లేని వేగము గలవాడే. మీలో నెవ్వరెవ్వ రెంతెంతదూర మూ సముద్రమును లంఘించఁగలరో వివరింపుఁ డవియెను.

## వానరులు - వారివారి - శక్తిని - వివరించుట

అంగదుని మాటలను విన్న వానరు లందఱును దమ తమ యుత్సాహ శక్తులను, గమన వేగములను నీ విధముగాఁ జెప్పఁ దొడఁగిరి. అందు గజుఁడు పది యోజనములు దాటఁగలననియు, గవాక్షుఁ డిరువది యోజనముల మేరకు దాటి రాఁగలననియు, గవయుఁడు ముప్పది యోజనములని యును జెప్పిరి. మఱియు శరభుఁడు నలువది యోజనము లనియు, గంధమాదనుఁ డేబది యోజనము లనియు, మైందుఁ డరువది యోజనము లనియు, ద్వివిదుఁడు డెబ్బది యోజన ముల వరకును దాటి రాగలననియును జెప్పిరి. సుషేణుఁ డెనుబది యోజనము లనియు, జాంబవంతుఁడు తొంబది యోజనము లనియును వారివారి గమన వేగములను గూర్చి వివరించిరి, అందు జాంబవంతుఁ డిట్లనెను, "అంగద కుమారా! నేను బాల్యము వయసు నందున్నప్పుడు, బలి

చక్రవర్తి యొక్క యజ్ఞశాల యందుఁ ద్రివిక్రముఁడై, ముల్లోకములకును విస్తరించిన మహావిష్ణువునకు, ముమ్మారు ప్రదక్షిణము గావించిన వాఁడను. అప్పుడు నా గమన వేగమునకు బరిమితియే లేదు. ఇప్పుడు వయసు మీరుటచే నింత మాత్రమే చెప్పవలసి వచ్చినది. ఏమైనను సుగ్రీవాజ్ఞను బురస్కరించికొని, సముద్రమును దాటి, రామ కార్యమును నెరవేర్చవలెను. పూర్వము నా వేగమునుబట్టి చూచినచో నీ సముద్రము నూరు యోజనములును నాకొక లెక్కలోనివిగావు. అయినను వయస్సు మీరిన వాఁడనగుటచే నింత మాత్రమే చెప్పఁగలిగితిని, కాని మన కార్యసిద్ధికి జాలను. అనఁగా విని యంగదుఁడు జాంబవంతుని శక్తి సామర్థ్యముల కాశ్చర్యపడుచు నిట్లనెను. వానరులారా! నేను నూరు యోజనములను సముద్రము దాటి, లంకలోఁ ప్రవేశించఁ గలను. కాని మరల నన్ని యోజనములనుదాటి వెనుదిరిగి రాఁగలనా ? లేదా ! యన్న సంశయము మాత్రము గలుగుచున్నది. అనఁగా విని జాంబవంతుఁడు "నాయనా! అంగదా! నీ శక్తి నాకుఁ దెలియును. నూరు యోజనము లననేల ? వేయి యోజనముల దూరమైన నేకధాటిని వెళ్ళి రాఁగలవు. సందేహము లేదు. ఓ యువరాజా! మా కెల్లరకును నీవు ప్రభుఁడవై యున్నావు. నీవు మమ్మెల్లర నాజ్ఞాపించవలసిన వాఁడవేగాని, యాజ్ఞాపించఁబడు వాఁడవుగావు. కావున శత్రు సంహారకుఁడవైన యో ప్రభూ!

మేమందఱమును నిన్ను రక్షించి కొనవలెను. వీర సైనికుఁడు తన భార్యానువలె స్వామిని సర్వదా రక్షించికొనుట మా ధర్మము. మఱియు నిప్పట్టున నీవు, మాకందరకును వృక్షము నకుఁ దల్లి వేఱువంటి వాఁడవు. వేఱు బలముగా నున్నచో వృక్షము ఫలించినట్లు నీవు నిలిచినచో సర్వ కార్యములును సిద్ధించుట కవకాశ మున్నది. ఇప్పుడు మాకు మహారాజవై నను, రాజపుత్త్రుఁడవైనను నీవే. నిన్నాశ్రయించినచో సర్వ కార్యములును సిద్ధించును. అట్లుగాక నిన్ను విడిచిపెట్టుకొని మే మేమి చేయఁగలము ? అనఁగావిని యంగదుఁ డిట్లనెను. నేను లంకకుఁ బోకయుండినచో నీ వానరు లెవ్వరు నచటకుఁ బోవ నశక్తులని తేలినదిగదా! నేను బోవకుండినచో నెప్పటి యట్లే మనమందఱమును ప్రాయోపవేశ మొనర్చి, యిచ్చ టనే మరణించుట శ్రేయస్కరమని నాకుఁ దోఁచుచున్నది. మనము వ్యర్థులమై సుగ్రీవ సన్నిధికిఁబోయి ప్రాణములతో నుండఁ జాలము. నాకుం దోఁచినది చెప్పితిని. ఇంకఁ గార్యము సానుకూలపడి, మన ప్రాణములు నిలుచు నుపా యము మీలో నెవరైన యాలోచించి చెప్పుఁడు. అని పలి కెను. నావుఁడు జాంబవంతుఁ డిట్లనయెను. అంగదా! నీవు భయపడకుము. ఇదిగో! ఇప్పుడే శ్రీరామ కార్యమును సాధించి రాఁగల వీరుని జెప్పుచున్నాను. వినుము! అని పలికి

రొక్కమూల నేమియుం దెలియని వానివలె సుఖోపవిష్టుఁడైన వాయుపుత్త్రి నాంజనేయుని బిలిచి యిట్లు ప్రేరేపించెను.

## జాంబవంతుఁడు - హనుమంతుని శక్తింజెప్పి - ప్రోత్సహించుట

వేలును, లక్షలునుగల వానర సమూహము నందుఁ జివరి భాగమునఁ గూర్చున్న హనుమంతుని, జాంబవంతుఁడు పిలిచి, దగ్గరఁగాఁ గూర్చుండఁజేసి యిట్లనియెను. ఓ మహావీరా! హనుమంతా! నీవు సర్వజ్ఞుఁడవు. సర్వశక్తులును గలవాఁడవు. ఇచ్చట నీ వానరులందఱు నింతగా గందరగోళము పడుచుండ నేమియును బట్టించికొనక యీ మారుమూలఁ గూర్చుంటివేల ? ఓయీ! నీవు బలము నందును తేజస్సు నందును, సుగ్రీవునకేగాక, శ్రీరామ లక్ష్మణులకును సమానుఁడన వచ్చును. కశ్యప ప్రజాపతికి వినత యందు గరుత్మంతుఁడు పుట్టెను. అతఁడు పక్షు లన్నిఁటి యందు నుత్తముఁడు. ఆ మహాబలుఁడు సముద్రము నందున్న సర్పములను బట్టికొనెడివాఁడు. అతఁడు మహా వేగవంతుఁడని ఖ్యాతిఁ గాంచినవాఁడు. అట్టివాని ఱెక్కల బలమంతయును నీ బాహువులకుఁ గలదు. అతని పరాక్రమమునకును, వేగమునకును నీవే మాత్రముం దీసిపోవు. శరీరబలమును

దానికి మించిన బుద్ధిబలమును, తేజస్సును, సర్వ జీవుల కంటెను నీకధికముగాఁ గలవు. నిన్ను నీవేలఁ దెలిసికొనలేకున్నావో నాకర్థమగుటలేదు. అప్సరస లందఱి యందును శ్రేష్ఠురాలు పుంజికస్థలు ఆమె "అంజన" యను పేరుతోఁ "కేసరి"కి భార్యయైనది. ఆమె కుంజరుడను వాని కుమార్తె సర్వాంగసుందరి. ఒకానొకప్పుడు శాపవశాత్తుగా వానరియైనది. వానరుఁడైన కుంజరునకు వానర స్త్రీయై జన్మించి 'యంజన' యను పేరుగలదై, కామరూపిణి యగుటచే నొకానొక సమయమున మానవస్త్రీయై, సర్వాభరణములను, బట్టు చీరను ధరించి పెద్దమేఘము వలె నున్న పర్వత శిఖరమున విహరించు చుండెను. అట్లుండ నామె యెఱ్ఱని యంచులు గల పట్టుబట్ట వాయువేగమునకుఁ గొంచెముగాఁ దొలఁగినది. అప్పుడు గుండ్రనై యొకదానితో నొకటి రాపాడు తొడలను, బలిసి యొకదానితో నొకటి పెనవేసికొని యున్న యా స్తనములను, సుందర ముఖారవిందమును జూచిన వాయుదేవుఁడు మన్మథ పరవశుఁడై యామెను దన సుదీర్ఘ బాహువులతోఁ గౌఁగిలించి కొనెను. అప్పుడామె "నా పాతివ్రత్యముం జెరుపవచ్చిన, నీవెవఁడ"వని యడిగినది. అది విని మారుతిఁ డిట్లనెను. "ఓ సుందరాంగీ! నీ సర్వాంగ సౌందర్య విలాసలకు మోహితుఁడనై, నిన్ను గౌఁగిలించి నీలోఁ బ్రవేశించితిని. కావున నీ పాతివ్రత్యమునకు భంగము

లేదు. (పర పురుష వ్యామోహముతో రమించిననే పాతి వ్రత్య భంగ మగును. తనకుం దెలియని యవస్థలో పర పురుష స్పర్శ గలిగినను, పాతివ్రత్యము చెడదు.) కావున నీవు భయపడకుము. మహాపరాక్రమశాలియు, బుద్ధిమంతు లలో వరిష్ఠుండు నగు గొప్ప కుమారుండు నీకుఁ గలుగును. అంతియేగాక యాతండు బలపరాక్రమ వేగములలో నాతో సమానుఁడు కాఁగలఁడు. అని వాయుదేవుఁడు పలికి వెడలిన కొన్నాళ్ళకు నీ తల్లి యంజనాదేవి యా కొండ గుహలో నిన్ను గన్నది. ఓ హనుమంతా! నీవు బాలుఁడవై తూర్పున సూర్యుఁ డుదయించుటను జూచి యా యెఱ్ఱని బింబ మొకా నొక మహాఫలమని యెంచి, యా బింబముం దినుటకై పైకె గిరితివి. అట్లు మూఁడువందల యోజనముల దూరము వెళ్లి యును. సూర్యుని వేడికి నీవు బాధపడలేదు. అట్లింకను పైకె గిరిపోయి సూర్యుని బట్టుకొనఁబోగా దేవేంద్రుఁడు తన వజ్రాయుధమును నీపైఁ బ్రయోగించెను. ఆ దెబ్బకు నీవు పర్వతశిఖరముపైఁ బడి మూర్ఛపోయితివి. అప్పుడు నీ యెడమ దవుడ మాత్రము పగిలినది. కావుననే నిన్ను హను మంతుఁ డన్నారు. అది చూచిన వాయుదేవుఁడు నిన్నొక గుహలో నుంచి కోపముతో ముల్లోకము లందును సంచార మును మానివేసెను. అంత మూఁడు లోకములును ద్రొట్రు పాటు వడుచుండఁగా బ్రహ్మతో దిక్పాలకాది సమస్త దేవత

లును వచ్చి నీ తండ్రి వాయువును శాంతింపఁ జేసికొనిరి. వాయుదేవుఁడు ప్రసన్నుఁడు కాఁగానే, బ్రహ్మదేవుఁడు నీకు సర్వాయుధంబుల చేతను బాధగాని, చావుగాని లేకుండునట్లు వర మొసంగెను. అట్లే దేవేంద్రుఁడు దన వజ్రాయుధముచేఁ గూడ బాధింపఁ బడవని వరమిచ్చెను. అట్లు సమస్త దేవతలును నీకు స్వేచ్ఛా మరణము ననుగ్రహించిరి. అంతటి శక్తి సామర్థ్యములు గల నీవు కేసరిక్షేత్రమున వాయుదేవునకు జన్మించిన పుత్త్రుండవు. పరాక్రమమును వాయుదేవ సమానుఁడవు. బలము నందేగాక యాకాశ గమన వేగమునందును నాతనికి సముఁడవే. రెండవ గరుత్మంతుఁడేమో యన్న భ్రాంతిని గలిగించు వాఁడవు.

నాయనా! హనుమంతా! ఇంతకును నిప్పుడు మాకుఁ బ్రాణ సంకట మేర్పడినది. ఇప్పుడు మమ్ము రక్షింప సమర్థుఁడవు. ఆనాఁడు నేను వయస్సు నందుండఁగా త్రివిక్రమునకు నిరువది యొక్క మారు ప్రదక్షిణాలు గావించితిని. అట్లే పూర్వ మమృతమునకై సముద్ర మథన సమయమున ననేక విధములైన మూలికలు బయటఁబడఁగా వాని నన్నిఁటిని వేరువేరుగాఁ బ్రోగులు వెట్టితిని. మఱియు నా యోషధులను బాల సముద్రమునఁ బడవైచితిని. ఆ విధముగా

వానితోఁ గలిపి చిలుకుటచేతనే యమృతము పుట్టినది. ఆంజనేయా! ఆనాఁడు నా కంతటి శక్తి సామర్థ్యము లుండెడివి. ఇప్పుడు వార్ధక్యముచే నా బలమంతయును దగ్గిపోయినది. ఇప్పుడు మాకందఱకును ప్రాణములు నిలువవలెనన్న సర్వగుణ సంపన్నుఁడవైన నీవే మాకు గతివై యున్నావు. ఆకాశమార్గమున సముద్రమును దాటి, లంకలో ప్రవేశించి సీతాదేవీ వృత్తాంతమును దెలిసికొనివచ్చి మమ్మందఱను గాపాడుము. నిన్ను మించిన బలవేగములు గలవాఁ డీమూఁడు లోకము లందును లేఁడు. ఇంక జాగు చేయకుము. మహావిష్ణువు త్రివిక్రముఁడైనట్లు నీవును విజృంభించి సముద్రమును లంఘించుము. అని జాంబవంతుఁడు హనుమంతుని చరిత్రను జెప్పి యతని శక్తి సామర్థ్యములను గూర్చి వివరించి ప్రోత్సహించఁగా నప్పుడాతఁడు సర్వ వానర శ్రేష్ఠులును నాశ్చర్యపడునట్లు తన శరీరమును బెంచి కార్యసాధనకు సిద్ధపడెను.

## హనుమంతుని - మహోత్సాహ - ప్రదర్శనము

జాంబవంతుని ప్రోత్సాహముతో సముద్రమును దాటుట కుద్యమించిన హనుమంతుని యాకారమును జూచి, యంతవరకును విచారగ్రస్తులై యున్న వానరులందఱు నొక్క-

మ్రాఁడిగా మహోత్సాహమును ప్రదర్శించి, పెద్దగా గోల పెట్టిరి. అనాఁడు త్రివిక్రముఁడై యున్న సాక్షాన్నారాయణుని గాఁదలఁచి కన్నుల పండువుగాఁ జూడనారంభించిరి. వానరులచేఁ బొగడఁబడుచున్న హనుమంతుఁడు మహా బలవంతుఁడై శరీరము నంతకంతకుఁ బెంచివేయు చుండెను. ఆనందముతోఁ దనతోఁక నాకాశమున నల్లల నాడించఁ దొడఁగెను. అట్టి బుద్ధిమంతుఁడైన హనుమంతుని ముఖము పొగలేని యగ్నివలెఁ బ్రకాశించెను. అతఁడా వానరుల మధ్య చెంగున నెగిరి శరీరమంతయును గగుర్పాటు చెందఁగా వృద్ధులైన వానరుల కందఱకును నమస్కరించి యిట్లనియెను. అగ్నిదేవునకు మిత్రుఁడై బల వేగములతో నాకాశమునఁ బయనించువాఁడై, కొండలనైన విరుఁగ జేయఁగల వాయు దేవుని యనుఁగు పుత్త్రుఁడను అతనికి సాటియైన బల వేగములు గలవాఁడను, సముద్ర లంఘనమున నాకు సాటి యెవ్వఁడును లేఁడు. నేను మధ్యలో విశ్రాంతి లేకుండఁగా నాకాశమును దాఁకుచున్న మేరు పర్వతమునకు వేయి మారులైనఁ బ్రదక్షిణలు చేసి రాఁగలను. నేను నా బాహు బలంబుచే నదుల తోడను, బర్వతముల తోడను, బట్టణముల తోడను నిండిన యీ భూమి నంతను సముద్రమున దోసి వేయఁగలను. నేనెగిరి వెళ్లుచుండఁగా, నా తొడల వేగము నుండి పుట్టిన గాలికి సముద్ర కెరటములతోఁ బాటు పెద్ద పెద్ద

మొసళ్ళు మొదలైన జంతువు లాకాశమునఁ గనఁబడును. సముద్రము నందలి నాగులను బట్టుటకై యాకాశమున గరుత్మంతుఁ డెంత వేగమునఁ దిరుగాడునో యంతకు వేయిరెట్లు వేగముతో నాకాశమునఁ బయనించఁ గలను. సూర్యునితో సమానముగా బయలుదేరి యాతఁ డాకాశ మధ్యస్థుఁడై నప్పటికే నేనస్తగిరిఁ జేరి మఱలి రాఁగలను. అట్లు వచ్చి యొకింత భూమిని విశ్రమించకయే యుదయ పర్వతము నుండి, యస్తగిరి కేగి రాఁగలను. అంతియేగాక యాకాశమునఁ దిరుగు భూతములనెల్ల నతిక్రమించ గలను. ఓ వానరులారా! ఇంకను వినుఁడు! నేనాకాశముపై నెగురు చున్నప్పుడు సముద్రమును శుష్కింపఁ జేయుదును. పర్వతంబులను బిండి పిండిగాఁ జేయుదును. నా తొడల వేగమున కా సముద్రమంతయును నా వెంట రాఁగలదు. నేలపై నున్న వృక్షములు పూవుల తోడను, జిగుళ్ళ దోడను నన్నను సరించఁగలవు. నా చుట్టును రాలిన పుష్పము లన్నియును దిరుగు చుండుటచే నాకాశమున స్వాతీ నక్షత్రమువలెఁ బ్రకాశించఁ గలను. నే నాకాశమున నెగిరి పోవుచుండఁగా నిప్పుడు నేను జెప్పిన దంతయును యథార్థమని కండ్లారచూచి గ్రహించ గలరు. పెద్ద మేఘమువలె నాకాశమును మ్రింగివేయునట్లుగా నే నెగురుచుండుటను మీరు చూడఁగలరు. ఈ సముద్ర లంఘనమున వాయుదేవుఁడును, గరుత్మంతుఁడును, నేనును

మాత్రమే సమర్థులము. ఆకాశమున నన్ను వెంబడించ వలె నన్న వాయువు. లేక గరుత్మంతుఁడునను వారికే శక్తి గలదు. ఆకాశమున నేను బోవుచుండఁగాఁ బూర్వము త్రివిక్రముఁడైన మహావిష్ణువు స్మరణకు రాఁగలఁడు. ఓ వానరులారా! నా బుద్ధియు, నంతరాత్మయును దప్పక సీతాదేవిని దర్శించి రాఁగలవని చెప్పుచున్నది. పైగా నా కుడి బుజ మదరుచున్నది. కావున మీరందఱు నుత్సాహవంతులై యిచ్చటనే వేచియుండుడు. ఈ యుత్సాహముతోఁ బదివేల యోజనములనైనను సునాయాసముగా దాటి రాఁగలను. నేను వజ్రధారియైన యింద్రుడైనను, స్వయంభువుఁడైన బ్రహ్మనైనను నా చేతులతో వారించి, యమృతమునైనఁ దేగలను. అవసరమైనచో నా లంకాపురము నంతయు నూడఁబెరికి తీసికొని రాఁగలను. ఈ విధముగా మహా ధైర్యోత్సాహములతోఁ బలుకుచున్న హనుమంతుని జూచి వానరులందఱు నపరిమితానందము నందిరి. ఇట్లందఱకు నానందమును గలిగించుచున్న హనుమంతుని జూచి జాంబవంతు డిట్లనెను. ఓ మహావీరా! కేసరిపుత్రా! నాయనా! హనుమంత! నీ వలన నీజ్ఞాతులైన వీరందఱకును శోకము నశించినది. ఈ వానర వీరులందఱును నీకు శుభ పరంపరలు గలిగి, సీతా దర్శన భాగ్యము సిద్ధించుటకై నీవు వచ్చువరకును భగవద్ధ్యాన తత్పరులై యిచ్చటనే యుందురు. మహర్షులు కపివృద్ధులు,

గురుపాదులు సనువారి యొక్క శుభాశీర్వాదములచే నీవీ మహా సముద్రమును లంఘించి కార్యసిద్ధిని బడసి క్షేమముగా రాఁగలవు. ఈ వానరుల ప్రాణము లన్నియును నీ యధీనములై యున్నవి. కావున నీవు వచ్చువరకును వీరందఱు నొంటికే పాదముపై నిలిచి, భగవంతుని ధ్యానించుచుందురు. అనఁగా విని యా హనుమంతుఁ డిట్లనుచున్నాఁడు.

నేను సముద్రమును దాటుట కుద్యమించు నప్పు డీ భూమి నా యొత్తిడికి సహించలేదు. ఈ కన్పడు మహేంద్ర పర్వతము బలిష్ఠములైన శిలలుగల శిఖరములతో నొప్పు చున్నది. కావున దీని చివరకుఁబోయి యందుండి సముద్రమును లంఘించుదును. నేను నూరు యోజనములు నేకధాటిగా దాటెడి ప్రయత్నమునకు నీ పర్వత శిఖరములు సహించఁ గలవు. అని చెప్పుచు హనుమంతుఁడు వేగముగా మహేంద్ర పర్వత శిఖరమునకుఁ బయనించెను. అందు నానా విధ వృక్షములును, వేళ్లును బచ్చికబయళ్లును, బుష్పించిన లతలును, నిత్యమును ఫలించు వృక్షములును, సింహశార్దూల మాతంగాది మృగములును, పైనుండి క్రిందికి జాలువారు చున్న సెలయేళ్లును, గైరికాది ధాతువులును, ప్రకాశించుచున్నవి. అట్టి పర్వతమును హనుమంతుఁ డతివేగముగా నధిరోహించెను, అతఁడా పర్వతము నెక్కుచుండఁగా సింహముచే మర్దించఁ బడుచున్న యేనుఁగువలె నా పర్వతము నలిగిపోయినది. జల ప్రవాహములు మెండయ్యెను. మఱియుఁ

క్రూరమృగము లన్నియు నటునిటు భయముతోఁ బరువెత్తినవి. మహా వృక్షములు చలించినవి. నాగ గంధర్వాది మిథునములు భయ కంపితములైనవి. పక్షులును, విద్యాధరులును బైకెగసిరి సర్పములు తమ పుట్టల నుండి పైకి వచ్చినవి. కొండచరియ లందలి మహాశిలలు జలజల రాలి పడినవి. అందున్న మహర్షులు గూడ భయముతోఁ దొట్రుపాటు పడిరి. ఆ విధముగా హనుమంతుఁడు మహేంద్ర పర్వత శిఖరము నెక్కి తన మనస్సు చేతనే లంకాపుర మాకర్షణముననే ప్రవేశించినట్లు భావించెను.

ఇది కిష్కింధాకాండము - సంపూర్ణము.

ఆ రామ ద్రావిడ వంశోద్భవ సామశాఖీయ వేదులోప
నామక వెంకటశాస్త్రి పౌత్ర పార్వతీశ్వర పుత్ర నిత్య
శ్రీ సీతారామాంజనేయ పాదచింతనా రతుండును,
బుధ జన విధేయుండును, కవిహంస ఇత్యాది
బిరుదాంకితుండును నైన వేంకటశాస్త్రిచే
శ్రీ మద్వాల్మీకి రామాయణ కాండ
సప్తకమునకు తెలుగు వచనముగ
ననువదింపబడిన గ్రంథ మందలి
అరణ్య కిష్కింధ కాండల
ద్వితీయ భాగము
సంపూర్ణము.
సమస్త సన్మంగళా నిభవన్తు.

శ్రీరామ శ్శరణం మమ

# ఈ గ్రంథకర్త రచనలు

1. రాఘవేశ్వర శతకము
2. శ్రీహరలీల
3. రాజ సందర్శనము (విజయ నగరాస్థానమున శ్రీ తిరుపతి వేంకట కవుల కవితా ప్రతిభను గూర్చిన నాటిక)
4. ఆదిత్య హృదయము
5. రేబాల కోదండరామ సుప్రభాతము
6. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము (పద్యానువాదము)
7. జానకీత్రిశతి
8. అద్భుత రామాయణము
9. బాలరాముడు
10. శ్రీ వేంకటేశ్వర తారావళీత్రయి

పై గ్రంథములన్నియు అయిపోయినవి.

వదాన్యులు పునర్ముద్రణ గావించుటకు సహకరించి ఇహ-పరముల శాశ్వత కీర్తిని పొందగలందులకు కోరుచున్నాను.

—గ్రంథకర్త

---

ప్రతులకు :

వేదుల వేంకటశాస్త్రి

టెలిఫోను ఎక్స్చేంజి ఆఫీసు వీధి

అనకాపల్లి - 531 001

విశాఖజిల్లా.

...NTRAL LIBRARY...
53352

# శ్రీమద్వేంకటేశ్వర రామాయణము

బాల-అయోధ్య కాండలు : ప్రథమ భాగం

కృతికర్త : భాషాప్రవీణ - **వేదుల వేంకటశాస్త్రి**

ప్రకాశకులు: ప్రతులకు : సాధన గ్రంథ మండలి - తెనాలి.

పుటలు : 716 వెల : రు. **100/-**

'సత్కార్మల నాచరించేటప్పుడు సహనం శాంతం కల్గి ఉండటం ధర్మం.'

'కొండంత అపకారమైన మరువవచ్చుగానీ గోరంతటి ఉపకారాన్నైనా మరవకుండటం ధర్మం. ఆరంభించిన కార్యాలకు అడ్డంకులు ఎదురైనా అధైర్యపడక కోపతాపాలకు తావీయకుండటం ధర్మం' అంటూ ఆదినుంచీ అడుగడుగునా అనేక ధర్మసూత్రాల్ని చెబుతూ ప్రజలకు జీవితపు విలువల్ని చాటిచెబుతూ, పుణ్యం పురుషార్థాల్ని అందించే రామాయణం ఒక కల్పవృక్షం. 'రామ'నామాన్ని మించిన మహామంత్రం లేదు. శివుని మించిన తత్త్వోపదేష్టలూ లేరు. అనుక్షణం అట్టి రామకథామృతం జనజీవన పరిధిలో ఆగని స్రవంతియై ప్రవహిస్తూనే ఉంది.

సామాన్య పాఠకులు సైతం రామతత్త్వంలోని ఆంతర్యాన్ని, పరమార్థాన్ని, ధర్మసూత్రాల్ని అవగాహన చేసుకుందుకు అనువుగా శ్రీ వేదులవారు వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా తెలుగు వచనానువాదం చేసి ఆంధ్ర పాఠకలోకానికి చదువుకునే సదవకాశం కల్గించారు.

— శ్రీ రామకృష్ణ ప్రభ.

షరా : ముందుగా రు. 80/-లు పంపిన, రిజిష్టరు పోస్టులో పంపబడును.